మూలఘటిక కేతన

# విజ్ఞానేశ్వరము

(తెలుగులో తొలి ధర్మశాస్త్ర గ్రంథం)

&

అప్పనమంత్రి

# చారుచర్య

**(Health and Hygiene)**

వ్యాఖ్యాత

డా. అద్దంకి శ్రీనివాస్

మూలఘటిక కేతన

# విజ్ఞానేశ్వరము

(తెలుగులో తొలి ధర్మశాస్త్ర గ్రంథం)

&

అప్పనమంత్రి

# చారుచర్య

(Health and Hygiene)

'పాఠక మిత్ర' వ్యాఖ్య


వ్యాఖ్యాత

డా. అద్దంకి శ్రీనివాస్



ప్రచురణ

శ్రీ పావని సేవాసమితి

హైదరాబాదు

2018

**మూలఘటిక కేతన**

mūlaghatika kētana

**విజ్ఞానేశ్వరము**

vijñānēśvaramu

&

**అప్పనమంత్రి**

appanamantri

**చారుచర్య**

cārucarya


వ్యాఖ్యాత / Commentator

© **డా. అద్దంకి శ్రీనివాస్**

Dr. Addanki Srinivas

# 104, Balaji Vihar, Maruthi Hills
Ameenpur, Medak District-502032.
9848881838, draddanki@gmail.com



ముద్రణ: జనవరి, 2018
ISBN 978-93-5291-674-0
వెల : 300/-
ప్రింటర్స్ : **సంహిత గ్రాఫిక్స్** (040-23751620)

ప్రచురణ

**శ్రీ పావని సేవాసమితి** / Sri Pavani Seva Samiti
3-6-499A, Road No. 7,
Himayat Nagar, Hyderabad -500029
Ph : 9908616366

డిస్ట్రిబ్యూటర్స్

**అమరావతి పబ్లికేషన్స్**

సాయిబాబా నగర్, గుంటూరు.

మూలఘటిక కేతన

# విజ్ఞానేశ్వరము

(తెలుగులో తొలి ధర్మశాస్త్ర గ్రంథం)

వ్యాఖ్యాత

**డా. అద్దంకి శ్రీనివాస్**

# అంకితం



ఆధ్యాత్మికశాస్త్రవేత్త **శ్రీమాన్ వి. యస్. ఆర్. మూర్తి**గారికి

అరయ మూర్తిగారె గురుదేవు డైనచో
అతని వత్సలతకు అంజలింతు
అరయ మూర్తిగారె అద్వైత అయినచో
అతని భక్తిపరత నభినుతింతు

ఆత్మీయంగా ...

**అద్దంకి శ్రీనివాస్**

# విషయసూచిక

(i) స్వాగతం

(ii) పీఠిక

| | | పద్య సంఖ్య | పుట |
|---|---|---|---|
| 1. | ఆచారకాండము | 1–142 | 1–75 |
| 2. | ప్రాయశ్చిత్తకాండము | 1–140 | 76–142 |
| 3. | వ్యవహారకాండము | 1–152 | 143–214 |
| | పద్య గద్యానుక్రమణిక | | 215–221 |

# స్వాగతం

పదకొండు – పన్నెండు శతాబ్దాల కాలంలో మన తెలుగునాట అమలులో ఉన్న ధర్మశాస్త్రాలను అవలోడనం చేసి, కొన్ని శ్లోకాలకు యథాతథానువాదాలు గానూ, కొన్నింటికి పరిష్కరణాత్మకానువాదాలుగానూ, మూలఘుటిక కేతన– పద్యాలు రచించి సమకూర్చిన ధర్మశాస్త్రగ్రంథం ఈ విజ్ఞానేశ్వరీయం. విజ్ఞానేశ్వరము అనికూడా దీనికి పేరు.

7000 కు పైచిలుకు పద్యాలు కల వర్ణనరత్నాకరము అనే సంకలన గ్రంథానికి వ్యాఖ్యను సంతరించడంలో క్రియాశీలకంగా కృషిచేశారు అద్దంకి శ్రీనివాస్ గారు. ఈ బృహత్ సంకలన గ్రంథం పాఠకమిత్రవ్యాఖ్యద్వారా జనసామాన్యానికి చేరువయ్యింది. ఈ వ్యాఖ్య సాహితీప్రియులకు సుబోధకంగానూ, సాహితీ పరిశోధకులకు ఉపయుక్తంగానూ ఉండడంవల్ల ఆ పద్ధతిలోనే ఈ విజ్ఞానేశ్వరము అనే గ్రంథానికి కూడా వ్యాఖ్యను సంతరించారు శ్రీనివాస్‌గారు. వీరికి మనసారా నా అభినందనలు. అప్పనమంత్రి చారుచర్యకూ వీరు ఇదే పని చేశారు. అందుకూ ధన్యవాదాలు. సహృదయులు ఆహ్వానింతురు గాక!

ఆస్తి తగాదాలూ పంపకాలూ వగైరాలు ఏనాడైనా జటిలవిషయాలే. దానికి తోడు కేతనగారి భాష – తిక్క భాష, తిక్కన భాష. ఆచ్చిక బహుళం. సాంకేతిక పదాలకు అచ్చ తెనుగులు. విశిష్ట వాక్యవిన్యాసం. భావమే జటిలమనుకుంటే భాషావిన్యాసాలు కూడా జటిలమే. దీనికి తోడు ముద్రా రాక్షసాలు. ప్రామాణికంగా మేలిప్రతులు తయారుచేసుకునే సదాచారం మనకు చాలా తక్కువ. ఏదో దొరికింది, ఏదో ముద్రించాం అన్న ధోరణి ఎక్కువ. అప్పటికి ఉన్న సాంకేతిక సౌకర్యాలూ అంతంత మాత్రమేననుకోండి!

అవరోధాలను వీటిని యథాశక్తిగా అతిగమిస్తూ పద్యానికి ఉద్దిష్టభావం పట్టుకోవడంలో శ్రీనివాస్ గారు చాలా శ్రమ పడ్డారు. అవసరమైనచోట

మూలాలనుకూడా అందించారు. వీరి కృషి అభినంద్యం. అద్దంకివారిని మరోమారు మనసారా అభినందిస్తూ సహృదయులకు స్వాగతం పలుకుతున్నాను.

దీన్ని ఇంత అందంగా ముద్రించినందుకు శ్రీ పావని సేవాసమితివారికీ ముఖ్యంగా సమితి అధ్యక్షులు శ్రీ చల్లా సాంబిరెడ్డిగారికీ తరతరాలకు సరిపడా ధన్యవాదాలు.

**హైదరాబాదు** **బేతవోలు రామబ్రహ్మం**

**11-11-2017**

★★★

# పీఠిక

**మూలఘటిక కేతన రచించిన ఈ విజ్ఞానేశ్వరము – విజ్ఞానేశ్వరుడి మితాక్షర వ్యాఖ్యకు తెలుగు అనువాదం.**

**యాజ్ఞవల్క్యుడు:**

వ్యాసుడు విష్ణ్వంశసంభూతుడు. అటువంటి వ్యాసుడు ప్రతిద్వాపరంలోనూ అవతరిస్తాడట. ముప్పెమూడో ద్వాపరంలో వ్యాసుడు మహాతేజస్వి అయిన యాజ్ఞవల్క్యుడిగా అవతరించాడంటోంది వైఖానసం.

పురాణాలలో ఇతిహాసాలలో ఎందరో యాజ్ఞవల్క్యులు కనిపిస్తారు. వారిలో వేదద్రష్ట, శుక్ల యజుర్వేద ప్రవర్తకుడు అయిన యాజ్ఞవల్క్యుడు ఒకడు. ఈయన ఆదిత్యుణ్ణి ఆరాధించి శుక్ల యజుర్వేదాన్ని (క్రీ. పూ. 9వ శతాబ్దం) దర్శించాడంటోంది శతపథ బ్రాహ్మణం (క్రీ. పూ. 8వ శతాబ్దం).

వైశంపాయనుడి శిష్యుడైన యాజ్ఞవల్క్యుడు గురువుతో విభేదించి సూర్యారాధన ద్వారా శుక్లయజుర్వేదాన్నీ, శతపథ బ్రాహ్మణాన్నీ దర్శించాడని మహాభారతం శాంతిపర్వం చెబుతోంది.

ఇంకా విష్ణుపురాణం, భాగవతం, మరికొన్ని పురాణాలలో యాజ్ఞవల్క్యుడి ప్రస్తావన కనిపిస్తోంది.

క్రీ.పూ.7వ శతాబ్దానికి చెందిన శుక్లయజుర్వేదంలోని బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు మహావేదాంతిగా దర్శనమిస్తాడు. గార్గి, మైత్రేయి ఇతని భార్యలు. యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బ్రహ్మతత్త్వాన్ని గురించీ అమృత తత్త్వాన్ని గురించీ బోధించినట్లూ, జనక మహారాజు ఇతడికి సహస్రగోవులను దానం చేసినట్లూ తెలుస్తోంది.

పాణిని అష్టాధ్యాయికి కాత్యాయనుడు (క్రీ. పూ. 3వ శతాబ్దం) వార్తికాలు రచించాడు. ఆ వార్తికాలలో 'యాజ్ఞవల్క్య బ్రాహ్మణా'ల ప్రసక్తి వుంది. వీటి కర్త మరో యాజ్ఞవల్క్యుడై ఉండవచ్చునని విమర్శకుల భావన.

స్మృతికారుడైన మరో యాజ్ఞవల్క్యుడు చరిత్రపుటల్లో దర్శనమిస్తున్నాడు. అతడి పేరుమీదే యాజ్ఞవల్క్య స్మృతి అనే గ్రంథం ఒకటి ప్రచారంలో ఉంది. దీని కాలం విషయంలో పాశ్చాత్య చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది క్రీ. శ. ఒకటో శతాబ్ది నాటిదని జయస్వాల్, క్రీ. శ. 1–3 శతాబ్దుల మధ్యకాలం నాటిదని పి.వి. కాణే, క్రీ. శ. 4 వ శతాబ్ది నాటిదని జాలి (Jolly) అంటున్నారు.

యాజ్ఞవల్క్యుడు ఒక స్మృతి గ్రంథకర్తగానే కాక తాను ఒక యోగశాస్త్రానికీ అలాగే ఆదిత్యప్రసాదితమైన ఒక ఆరణ్యకానికీ కర్తననీ, మిథిలలోని ఋషులు కోరికపై తానీ స్మృతి గ్రంథాన్ని చెప్తున్నాననీ గ్రంథాదిలో చెప్పుకొన్నాడు.

**విజ్ఞానేశ్వరుడు:**

యాజ్ఞవల్క్య స్మృతికి ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. వీటిలో క్రీ.శ. 8 వ శతాబ్ది కాలానికి చెందిన విశ్వరూపుడి 'బాలక్రీడ', క్రీ.శ. 10 వ శతాబ్ది కాలానికి చెందిన విజ్ఞానేశ్వరుడి 'మితాక్షర', క్రీ.శ. 11వ శతాబ్ది కాలానికి చెందిన అపరార్కుడి 'నిబంధ' మనే పేరుగల 'యాజ్ఞవల్క్య సూత్రానుబంధం', ఇంకా శూలపాణి సంతరించిన 'దీపకళిక' వ్యాఖ్య, అలాగే మితమిశ్రుడి మరో వ్యాఖ్య ప్రసిద్ధమైనవి.

వీటిలో విజ్ఞానేశ్వరుడి 'మితాక్షర' వ్యాఖ్య చాలా ప్రసిద్ధమైనది. వంగదేశంలో జీమూతవాహనుడి 'దాయభాగం', మహారాష్ట్రంలో నీలకంఠభట్టు 'మయూఖం' ప్రచారంలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాలలో తప్ప తక్కిన భారతదేశం అంతటా నిన్న మొన్నటి దాకా అంటే బ్రిటిష్ పరిపాలనాంతం వరకూ న్యాయస్థానాలలో 'హిందూ లా' కు సంబంధించిన అనేక విషయాల పరిష్కారాలలో ప్రామాణిక గ్రంథం 'మితాక్షర వ్యాఖ్యే'. 'మితాక్షర' వ్యాఖ్యకు 'ఋజుమితాక్షర', 'ప్రమితాక్షర' అనేవి నామాంతరాలు.

వ్యాకరణంలో పతంజలి మహాభాష్యానికి, అలంకారశాస్త్రంలో మమ్మటుని కావ్యప్రకాశానికి ఉన్న గౌరవమే ధర్మశాస్త్రంలో విజ్ఞానేశ్వరుడి 'మితాక్షర'కు ఉంది. ప్రాచీన ధర్మశాస్త్రగ్రంథాల సారభూతమై, విరుద్ధభావాలకు సమన్వయాత్మకమై ఆధునిక ధర్మశాస్త్రగ్రంథాలకు కరదీపిక అయినది ఈ వ్యాఖ్య.

విజ్ఞానేశ్వరుడు, భారద్వాజ గోత్రుడు. పద్మనాభ భట్టోపాధ్యాయుడి పుత్రుడు. ఉత్తముడి శిష్యుడు. పరమహంస పరివ్రాజకుడు. యోగి. కళ్యాణిచాళుక్య సార్వభౌము డయిన ఆరవ విక్రమాదిత్యుని (1076–1126) ఆశ్రితుడు.

**తెలుగులో ధర్మశాస్త్ర, నీతిశాస్త్ర గ్రంథాలు:**

'విజ్ఞానేశ్వరము' (మితాక్షర) క్రీ.శ. 1080 – 1100 ప్రాంతానికి చెందినది. మూలవ్యాఖ్య పుట్టిన నూటపాతికేండ్ల నాటికే కేతన దీనిని తెనుగు కావించాడు. కేతన గ్రంథాన్ని మొదటగా కూచిమంచి తిమ్మకవి (18వ శతాబ్ది) తన 'సర్వలక్షణ సారసంగ్రహంలో' ఉదాహరించాడు.

సామాన్యులకు అందుబాటులో లేని సంస్కృత శాస్త్ర గ్రంథాలను తెలుగు పద్య స్వతంత్రకావ్యాలుగా అనువదించటం మధ్యయుగాలలో ప్రారంభమయ్యింది. దీనికి ఆద్యుడు కేతన.

సమకాలీన సమాజంలో పెచ్చుమీరుతున్న అవైదికభావప్రభావంనుంచీ, అప్పుడప్పుడే దక్షిణాపథంలో వ్యాప్తిచెందుతున్న 'ఇస్లాం' ప్రభావం నుంచీ వైదిక ధర్మాన్ని పరిరక్షించడమే ధార్మిక గ్రంథాల తెలుగు సేతకు ప్రేరణ.

మడికి సింగన (15వ శ.), తన నాటికి లభ్యమయిన తెలుగు ధర్మ, నీతిశాస్త్ర గ్రంథాలనుంచి పద్యాలను సేకరించి 'సకలనీతి సమ్మతము' అనే పేరుతో సంకలనం చేశాడు.

"నారదవసిష్ఠపరాశరబాదరాయణభృగ్వంగిరసగురుశుక్రమతానుసారంబై దేవమానవ రాక్షసంబులైన సాత్త్విక రాజస తామస ప్రకారంబులగు నయశాస్త్రంబులు పరీక్షించి, యాంధ్రభాషాకోవిదులగు సుకవీంద్ర రచితంబైన ముద్రామాత్య పంచతంత్రీ – బద్దెభూపాల – చాణక్య – ధౌమ్య – విదుర – ధృతరాష్ట్ర – బలభద్ర – కామందక – గజాంకుశ – నీతిసార – నీతిభూషణ – క్షేమేంద్ర – భోజరాజవిభూషణ – పురుషార్థసార – భారత – రామాయణాది మహాకావ్యంబులు, పురాణేతి హాసంబులు, కందనామాత్యు నీతితారావళి, లోకోక్తి, చాటు ప్రబంధములయందుగల నీతివిశేషంబు లూహించి, తత్తత్సారాంశంబులయ్యే విధంబుల వర్గసంగతంబుగా సకలనీతి సమ్మతం బనుపేర నొక్క ప్రబంధంబు రచియింపుదు...." అని పేర్కొన్నాడు. వీటిలో కొన్ని లభిస్తున్నాయి. కొన్ని అలభ్యాలు.

**విజ్ఞానేశ్వరము**:

మూలఘటిక కేతన మితాక్షరవ్యాఖ్య ఆధారంగా "**తెనుగున జెప్పెద సమస్త దేశీయులకున్**" అని తాను విజ్ఞానేశ్వరాన్ని తెలుగులో రచిస్తున్నట్లు చెప్పాడు.

అయితే మడికి సింగన 'సకలనీతి సమ్మతము' లో కేతన 'విజ్ఞానేశ్వరము' లేదు. కేతన పదమూడో శతాబ్ది వాడు. 14, 15వ శతాబ్దులలో ఉన్న సింగన తిక్కన పౌత్రుడైన కొమ్మనకు దౌహిత్రుని కుమారుడు. సింగన పూర్వులలో ఒక్కడైన

తిక్కనకు కావ్య మంకితమిచ్చి, కావ్యకర్తృత్వం చేత 'అభినవదండి' బిరుదు పొందిన కేతనను, సింగన ఎందుకు విస్మరించాడో తెలియదు. సింగన కాలంనాటికి కేతన 'విజ్ఞానేశ్వరము', అంతగా ప్రచారంలో లేదా? లేక సంస్కృత 'విజ్ఞానేశ్వరీయమే' (మితాక్షర) ఆంధ్రదేశంలో ప్రచారంలో లేదా?

కేతన ఇంటిపేరు 'మూలఘటిక'. కేతనకు ముందు చాలాకాలం నుంచి మూలఘటికవారు రాజోద్యోగులు.

అర్వాచీన తూర్పు గంగ చక్రవర్తి అనంతవర్మ చోడగంగదేవుడి (క్రీ. శ. 1137) కాలం నాటి ఒక ముఖలింగ శాసనంలో మూలఘటికాన్వయుడు, కౌండిన్య సగోత్రుడు అయిన కామదేవప్రెగ్గడను 'పురవరి'గా పేర్కొన్నారు. పురవరి అంటే పన్నులు వసూలుచేసే రెవిన్యూ అధికారి.

అలాగే నాదెండ్ల మూలస్థానేశ్వర దేవాలయ ముఖమండపంలోని ఒక శాసనం (క్రీ.శ. 1156) మూలఘటికాన్వయ వేమనాయకుడు దండనాయకుడని చెప్తుంది. కామదేవ ప్రెగ్గడ, వేమనాయకుడు, కేతన పూర్వికులలోనివారై ఉండవచ్చు. కామదేవ ప్రెగ్గడ లోని 'ప్రెగ్గడ' పదాన్ని బట్టి కేతన నియోగి బ్రాహ్మణుడై ఉండవచ్చునని చాగంటి శేషయ్యగారి అభిప్రాయం.

విజ్ఞానేశ్వరము (వీరేశలింగం 1895 చింతామణి పత్రికలో ప్రచురించిన ముద్రిత ప్రతి) లో కేతన తండ్రి మ్రానయ, తల్లి గంగమాంబ అని ఉంది. మద్రాసు ఓరియంటల్ మ్యానుస్క్రిప్ట్ లైబ్రరీలోని తాళపత్ర ప్రతి (R.No. 948) కేతనను తండ్రిపేరున "మ్రానయకేతన" అని పేర్కొంది.

కానీ దశకుమారచరిత్ర (వావిళ్ళ ముద్రిత ప్రతి, 1925) లో తండ్రి పేరు మారయ, తల్లి పేరు సంకమాంబ అని ఉంది. ఆంధ్రభాషాభూషణము (దేవినేని సూరయ్య గారి వివరణతో కూడిన ముద్రిత ప్రతి, 1953) లో ఈ పేర్లు 'మ్రానయ' 'అంకమ' అని ఉన్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్న విజ్ఞానేశ్వర తాళపత్రప్రతిలో కేతన తల్లి పేరు 'సంకమ' అని ఉంది. ఆంధ్ర భాషాభూషణము 4, 189, 193 పద్యాలలో, విజ్ఞానేశ్వరము ఆచారకాండం 3, వ్యవహారకాండం 152 పద్యాలలో, కేతన, 'మ్రానయకేతా' అని సంబోధన ఉంది.

కేతన అన్న ప్రోలయ. వెలనాటి చోడరాజుల దండాధీశుడు. ముప్పై ఇద్దరు మంత్రుల సీసమాలికలో '**ఆత్మీయ తాపముచే నర్థివాలుక మడ్డుకేడించె బండారు కేతమంత్రి**' అని ప్రశంసగాంచిన బండారు కేతనను తన బావమరిదిగా మూలఘటిక కేతన పేర్కొన్నాడు.

వెంటిరాల (వెర్రిలాల) అగ్రహారానికి తాను పెద్దనని ('అగ్రణి') కేతన చెప్పుకొన్నాడు. ఇప్పుడీ వెంటిరాల ప్రభుత్వంవారి గ్రామ పట్టికలలో లేదు. వెంటిరాల అగ్రహారం వెలనాటి రాజుల ఏలుబడిలో ఉండేది.

కేతన ఏ పదవినీ చేపట్టినట్లుగానీ, నాటి రాజకీయాల్లో పాల్గొన్నట్లు కానీ లేదు. కానీ అతడి బావమరిది బండారు కేతన వెలనాటి రాజుల దండాధీశుడు. ఎందుకో కేతన వెంటిరాలను వదిలి, వెలనాటి చోడుల శత్రువులైన తెలుగు చోడుల రాజధాని నెల్లూరు వచ్చాడు. అక్కడ తెలుగు చోడుల మంత్రి, దండాధీశుడు అయిన కొట్టరువు తిక్కనామాత్యుడి ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు.

కేతన నెల్లూరు చేరి తిక్కన ఆశ్రయం పొందేటప్పటికే "**సంస్కృతాది భాషల గావ్య కర్తృత్వమున నుతి**" గని "**అభినవదండి**" నా పొలుపు మీరాడు. దీనిని బట్టి కేతనకు "అభినవదండి" బిరుదు దశకుమారచరిత్ర పద్యకావ్యంగా రాయడం వల్లనే రాలేదు అనుకోవాలి. బహుశా అతనికీ బిరుదు అంతకు ముందే "**సంస్కృతాదిభాషల గావ్యకర్తృత్వం**" వల్ల వచ్చి ఉండవచ్చు.

"**నీవు సంస్కృతాద్యనేక భాషా కావ్యరచనా విశారదుండవగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్ను గృతిపతిం జేయవలయునని**" తిక్కన అతన్ని సగౌరవంగా ప్రార్థించాడు. కేతనకు "అభినవదండి" బిరుదు తెచ్చిపెట్టిన సంస్కృత కావ్యాలేవో మనకు తెలియదు. ఈ బిరుదు ఇతర గ్రంథాల్లోనూ కనిపిస్తుంది.

కేతన మొదటి తెలుగు కావ్యం దశకుమారచరిత్ర తిక్కనకు అంకితం.

**"కవితఁజెప్పి యుభయకవిమిత్రు మెప్పింప**
**నరిది బ్రహ్మకైన నతడు మెచ్చఁ**
**బరగ దశకుమార చరితంబు చెప్పిన**
**ప్రోడ నన్ను వేఱె పొగడనేల?"**

అని తన "**ఆంధ్ర భాషాభూషణం**" లో కేతన చెప్పుకొన్నాడు.

"**మున్ను తెనుఁగునకు లక్షణ మెన్నఁడు నెవ్వరును**" చెప్పకపోవడంతో తాను చెప్తున్నానని ఆంధ్రభాషాభూషణంలో చెప్పాడు. ఈ వ్యాకరణాన్ని రచించిన కేతన తెలుగులో తొలి వ్యాకర్త అయ్యాడు.

కేతన మూడోకృతి విజ్ఞానేశ్వరము. ఇది యథాతథానువాదం కాదు. 'మితాక్షర' (విజ్ఞానేశ్వరీయం) వ్యాఖ్యలోని ప్రధానాంశాలను మాత్రమే కేతన

తెనుగు చేశాడు. ప్రధానంగా మితాక్షరనే అనుసరించినప్పటికీ కొన్నిసార్లు నేరుగా యాజ్ఞవల్క్య స్మృతినీ స్వీకరించాడు. మరికొన్నిసార్లు మితాక్షరనూ కొన్నిచోట్ల యాజ్ఞవల్క్య స్మృతినీ సమన్వయపరచి అనువదించాడు. ఇంకా మరికొన్నిచోట్ల మితాక్షరలో ఉద్ధరించిన వసిష్ఠ, నారద, కాత్యాయన, వ్యాస, మను స్మృతులలోని భాగాలనూ గ్రహించి అనువదించాడు. కొన్ని సందర్భాలలో మితాక్షరలో లేని ఇతర స్మృతులనీ ఆలంబనగా గ్రహించాడు.

కేతన విజ్ఞానేశ్వరం సమకాలీన ప్రాంతీయ సాంఘిక మతసంప్రదాయాలకు ప్రతిబింబం.

నిత్యవ్యవహారంలో ఉన్న తెనుగు పదాలను పారిభాషికపదాలుగా వాడడం కేతన ప్రత్యేకత.

మూలంలో వాక్పారుష్య ప్రకరణంలో ఒక అంశం ఉంది. 'గౌడ', 'వైశ్వామిత్ర' అంటూ జాతి పేరుతో గానీ, కులం పేరుతో గానీ తిడితే అలా తిట్టినవారికి శిక్షలేమిటో చెప్పారు ఈ ప్రకరణంలో. ఈ సందర్భాన్ని అనువదించడంలో కేతన ముఱికినాటివారు, మొఱకులు, పెనపరులు, అరవవారు (ప్రా. కాం. 56) అని తన కాలం నాటి పేర్లను తీసుకున్నాడు.

ఏ సాక్ష్యాధారాలు లేనప్పుడు నిర్దోషిత్వాన్ని రుజువుచేసుకోవటానికి ఆ రోజుల్లో 'మడ్డుపట్టడం' అమలులో ఉండేది. మడ్డు అంటే యాభై పలాల బరువు, ఎనిమిదివేళ్ల నిడివి కల, ఎర్రగా కాల్చిన ఇనుపగుండు. మూలంలో "తప్తాయః పిండం" అన్నారు. దీనిని అగ్నిదివ్యంలో ఉపయోగిస్తారు. ఈ మడ్డుపట్టడాన్ని కేతన రెండు పద్యాల్లో (వ్య. కాం. 118, 119) వివరించాడు.

మూలంలో ఈ మడ్డు "సమం అస్రరహితం" గా ఉండాలంటే, తెలుగులో "గుండై నునుపై యుండఁగజేసిన" అని చక్కని తెలుగు పదాల్లో దాని ప్రమాణాన్ని వివరించాడు (వ్య. కాం. 118). నాటి ధర్మాసనాల్లో అమలులో ఉన్న ఈ 'మడ్డుపెట్టుట' ను కవులు తమ కావ్యాల్లో వాడారు.

**అచ్చతెనుగు పారిభాషికపదకల్పనలు**:

"**నుదుటఁ గుక్కచ్చిడి సర్వస్వ హరణంబు చేసి పోనడువ వలయును**" (ప్రా. కాం. 92). 'కుక్కచ్చు'నే వ్యవహారకాండ పద్యం 42లో 'కుక్కడుగు' అన్నాడు. '**లలాటే అంకయిత్వా స్వదేశాన్నిర్వాసయే దంకనంచ శ్వపదాకారం కార్యం**' అన్నదానికి కేతన కల్పించిన పదం కుక్కచ్చు, కుక్కడుగు.

"పాతివ్రత్యం" అనే పదానికి కేతన ఉపయోగించిన పదం "ఈలువు".

మచ్చుకు కొన్ని చూపించాను. ఇంకా చాలానే ఉన్నాయి ఈ గ్రంథంలో. ఒక్కమాటలో చెప్పాలంటే సంస్కృత ధర్మశాస్త్రంలోని సాంకేతిక పదాలకు, తెలుగులో పారిభాషిక పదకోశంగా విజ్ఞానేశ్వరాన్ని చెప్పుకోవచ్చు. తేట తెనుగుమాటలు వాడడంలో కేతనకు కేతనే సాటి. ఈ విషయంలో అతను తిక్కనకు అసలైన శిష్యుడు.

**సింహభాగం కందాలకే**:

తిక్కననుండి కందపద్యాలపై మక్కువ, తెలుగు పదాల పోహళింపు కేతన పుణికి పుచ్చుకున్నాడు. తిక్కన తన గ్రంథాల్లో రాసిన మొత్తం పద్యాల్లో మూడోవంతు పద్యాలు కందాలే. అలాగే కేతన కూడా విజ్ఞానేశ్వరంలో మొత్తం 443 పద్యాలలో 324 పద్యాలు కందాలే. ఆంధ్రభాషాభూషణంలోనూ అంతే. 193 పద్యాలలో 115 పద్యాలు కందాలే.

విజ్ఞానేశ్వరుడు తన 'మితాక్షర' వ్యాఖ్య గురించి '**ప్రమితాక్షరాపి విపులార్థవతీ పరిషించతి శ్రవణయోరమృతమ్**' అని చెప్పుకున్న మాటలకు కేతన 'విజ్ఞానేశ్వరం' లక్ష్యం.

**విజ్ఞానేశ్వర ప్రతులు – పూర్వముద్రణలు**:

కేతన 'విజ్ఞానేశ్వరాన్ని' కందుకూరి వీరేశలింగంపంతులు 1895 'చింతామణి' పత్రికలో 22వ గ్రంథంగా ముద్రించి, ప్రకటించారు. మూలంలోని కాండల క్రమాన్ని మార్చి ప్రకటించారు.

సంస్కృత మూలంలోని వరుస ఆచార, వ్యవహార, ప్రాయశ్చిత్తకాండలు. పంతులుగారు ప్రకటించిన 'విజ్ఞానేశ్వరం'లో వరుస ఆచార, ప్రాయశ్చిత్త, వ్యవహారకాండలు. మద్రాసు ఓరియంటల్ మ్యానుస్క్రిప్ట్ లైబ్రరీలో ప్రాయశ్చిత్తకాండకు మాత్రమే ఉన్న తాళపత్రప్రతి, ఆ లైబ్రరీ, A Triennial Catalogue of the Telugu Manuscripts, Vol. iv. లో R.No. 948 గా నమోదు చేయబడింది.

విజ్ఞానేశ్వర తాళపత్ర మాతృకలు రెంటిని డా. హరిశివకుమార్ గారు తమ ముద్రిత సిద్ధాంత గ్రంథం 'కేతన' (1973)లో పేర్కొన్నారు. వీటిలో ఒకటి (తాళపత్ర ప్రతి–13) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ (నేటి తెలుగు విశ్వవిద్యాలయం)లోనూ, మరొకటి (తాళపత్ర ప్రతి – 322) ఒస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత అకాడమీలోనూ ఉన్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞానేశ్వరానికి వావిళ్ళవారి ముద్రిత ప్రతి ఒకటి ఉంది. డాక్టర్ సి.వి. రామచంద్రరావు ప్రస్తావన, లఘుటీకలతో అందించగా వీరేశలింగంగారి ప్రతి ననుసరించే ఇది 1977లో ముద్రింపబడింది.

కేతనమీద డాక్టర్ హరిశివకుమార్ గారి సమగ్రసిద్ధాంత గ్రంథం 'కేతన' (1973), రామచంద్రరావు, కేతన విజ్ఞానేశ్వరానికి సమకూర్చిన లఘుటీక చాలా పరిమితంగా ఉందనీ జిజ్ఞాసువులైన పాఠకుల సౌలభ్యంకోసం, మరలా నిఘంటువులను చూడనవసరంలేని విధంగా, ఈ గ్రంథం చివర ఇచ్చిన లఘుటీకను సమగ్రంగా రూపొందించటానికి, నేను ప్రయత్నించాననీ కావుటూరి వసుంధర గారు విజ్ఞానేశ్వరాన్ని ప్రమితాక్షర పేరుతో ఆముఖాన్ని సంతరించి కొన్ని పదాలకు అర్థాలతో కొన్ని పద్యాలకు మూలాన్ని చూపుతూ వివరణలు రాశారు.

ఈ గ్రంథం న్యాయశాస్త్రానికి సంబంధించినది కావడం, సామాజిక వ్యవహారాలను చెప్పడం వల్ల 12వ శతాబ్దినాటి న్యాయ, సామాజిక వ్యవస్థలను తెలుసుకోవడానికీ అధ్యయనం చేయడానికీ ఎంతగానో ఉపకరిస్తుంది.

7000కు పైచిలుకు పద్యాలు కల వర్ణనరత్నాకరము అనే సంకలనగ్రంథానికి వ్యాఖ్యను సంతరించి సాహితీలోకానికి అందించిన పాఠకమిత్రవ్యాఖ్య జనసామాన్యానికి సుబోధకంగానూ, సాహితీపరిశోధకులకు ఉపయుక్తంగానూ ఉండడంవల్ల ఆ పద్ధతిలోనే ఈ గ్రంథానికీ వ్యాఖ్యను సంతరించాను.

ఈ గ్రంథాన్ని సాహితీలోకానికి అందిస్తున్న మాన్యమహోదయులు, రామకార్యధురంధరులు, శ్రీపావని సేవాసమితి అధ్యక్షులు – శ్రీమాన్ చల్లా సాంబిరెడ్డి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ పద్యాలకు వ్యాఖ్యను సంతరించడంలోనూ కవిహృదయాన్ని పట్టుకోవడంలోనూ వలసిన తావుల్లో చేయూతనిచ్చినవారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సాదరంగా పాఠక మహాశయులను ఆహ్వానిస్తూ

మీ

హైదరాబాదు **అద్దంకి శ్రీనివాస్**

01.01.2018 చరవాణి: 9848881838

email: draddanki@gmail.com

# ఆచారకాండము

**1. శా. శ్రీవాణీ గిరిజేశ దంతిముఖ రాజీవాక్షులం గొల్చి వా**
**గ్దేవిం జిత్తములోన నిల్పుకొని శక్తిన్ భక్తిఁ గీర్తించి నా**
**నావిద్వత్ప్రభులం దలంచి పటునూత్న ప్రౌఢకావ్య క్రియా**
**ప్రావీణ్యంబున నుల్లసిల్లు కవులం బ్రార్థించి ధన్యుండనై**

**అన్వయం:** శ్రీ + ఈశ – వాణీ + ఈశ – గిరిజా + ఈశ – దంతిముఖ – రాజీవాక్షులన్ – కొల్చి, వాగ్దేవిన్ – చిత్తములోనన్ – నిల్పుకొని, శక్తిన్ – భక్తిన్ – కీర్తించి, నానా – విద్వత్ – ప్రభులన్ – తలంచి, పటు – నూత్న – ప్రౌఢ – కావ్య – క్రియా – ప్రావీణ్యంబునన్ – ఉల్లసిల్లు – కవులన్ – ప్రార్థించి – ధన్యుండను + ఐ.

**వ్యాఖ్య:** ఇది కావ్యాదిని చేసే ఇష్టదేవతాస్తుతి. బ్రహ్మ (శ్రీవాణీశ), శివుడు (గిరిజేశ), వినాయకుడు (దంతిముఖ), విష్ణుమూర్తులను (రాజీవాక్షులన్) కొల్చి, వాగ్దేవిని అంటే సరస్వతీదేవిని చిత్తంలో నిల్పుకొని, పార్వతిని (శక్తిన్) భక్తితో కీర్తించి, వివిధరకాలైన శాస్త్రాలలో పాండిత్యం గడించిన పండిత మహారాజులను (నానా విద్వత్ ప్రభులన్) తలచి, పటుతరమైనదీ కొత్తదీ (నూత్న) ప్రౌఢమైనదీ అయిన కావ్య రచన అనే పనిలో (క్రియా) ప్రావీణ్యం కలిగి, ఆ ప్రావీణ్యంతో ఉల్లసిల్లే కవుల్ని ప్రార్థించి, ధన్యుణ్ణై (మీది పద్యంలోనికి అన్వయం)

**2. కం. వివిధకళా నిపుణుఁడ నభి**
**నవదండి యనంగ బుధజనంబులచేతన్**
**భువిఁ బేరుగొన్నవాఁడను**
**గవిజనమిత్రుండ మూలఘటి కాన్వయుఁడన్**

**అన్వయం:** వివిధ – కళా – నిపుణుఁడన్ – భువిన్ – బుధజనంబులచేతన్ – అభినవదండి – అనంగన్ – పేరు – కొన్నవాఁడను – కవిజనమిత్రుండన్ – మూలఘటిక – అన్వయుఁడన్.

**వ్యాఖ్య:** వివిధకళలలో నిపుణుణ్ణీ, భువిలో పండితులచేత (బుధజనంబులచేతన్) అభినవదండిగా పేరుగాంచినవాణ్ణీ, కవిజనమిత్రుణ్ణీ మూలఘటిక వంశానికి (అన్వయుఁడన్) చెందినవాణ్ణి (మీది పద్యంలోనికి అన్వయం).

**3. కం. ప్రూనయకును గంగమకును**
**సూనుఁడ మిత సత్యహితవచోనిపుణుఁడ వి**
**జ్ఞానానూన మనస్కుఁడ**
**నానాశాస్త్రజ్ఞుఁడను వినయ భూషణుఁడన్**

**అన్వయం:** ప్రూనయకును – గంగమకును – సూనుఁడన్ – మిత – సత్య – హిత – వచోనిపుణుఁడన్ – విజ్ఞాన – అనూన – మనస్కుఁడన్ – నానా – శాస్త్రజ్ఞుఁడను – వినయ భూషణుఁడన్.

**వ్యాఖ్య:** ప్రూనయకూ గంగమకూ పుత్రుడనూ (సూనుఁడన్), మితమైనవీ సత్యపూర్ణమైనవీ హితకరమైనవీ అయిన మాటలు ఆడడంలో నైపుణ్యం కలవాడినీ (వచోనిపుణుఁడన్),

విజ్ఞానంతో కూడిన (సాటిలేని) అనూన = పెద్ద మనస్సు కలవాడినీ, నానా శాస్త్రపరిజ్ఞానం కలవాడినీ, వినయమే ఆభరణంగా కలవాడినీ (మీది పద్యంలోనికి అన్వయం).

**4. కం. ఖ్యాత శుభచరితుఁడను వృష**
**కేతన పాదద్వయీనికేతనుఁడ నొగిం**
**గేతన యన సత్కవి యన**
**భూతలమున నతిశయంబుఁ బొందినవాఁడఁన్**

**అన్వయం:** ఖ్యాత – శుభచరితుఁడను, వృషకేతన – పాద – ద్వయీ – నికేతనుఁడను, ఒగిన్ – కేతన – అనన్ – సత్కవి – అనన్ – భూతలమునన్ – అతిశయంబున్ – పొందినవాఁడఁన్.

**వ్యాఖ్య:** ప్రసిద్ధిపొందిన మంచి చరిత్ర కలవాణ్ణీ (ఖ్యాత శుభచరితుఁడను), శివుడి (వృషకేతనుడు = శివుడు) పాద ద్వయమే గృహమైనవాణ్ణీ (నికేతనము = గృహము), ఒప్పెసలారే రీతిలో (ఒగిన్) కేతన అనీ సత్కవి అనీ ఈ భూతలంపై అతిశయాన్ని – గొప్పదనాన్ని పొందినవాణ్ణీ.

**5. కం. ముని సకలశాస్త్రధర్మము**
**విని విజ్ఞానేశ్వరుండు వివిధ ప్రౌఢిన్**
**జనులకుఁ దెలిపినదానిం**
**దెనుఁగునఁ జెప్పెద సమస్త దేశీయులకున్**

**అన్వయం:** ముని – విజ్ఞానేశ్వరుండు – సకల – శాస్త్ర – ధర్మము – విని, వివిధ – ప్రౌఢిన్ –జనులకున్ – తెలిపిన – దానిన్ – సమస్త – దేశీయులకున్ – తెనుఁగునన్ – చెప్పెదన్.

**వ్యాఖ్య:** పూర్వం విజ్ఞానేశ్వరుండు సకల శాస్త్ర ధర్మాలనూ విని, వివిధమైన ప్రౌఢితో జనులకు తెలిపిన దానిని సమస్త దేశీయులకూ అర్థమయ్యేలా తెలుగులో చెప్తాను.

**6. కం. మునివరుఁడు యాజ్ఞవల్క్యుఁడు**
**మును లడిగిన నఖిలధర్మములు చెప్పు నెడన్**
**మును విప్రుల యాచారము**
**లనువుగ నేర్పఱిచి చెప్పె నది యె ట్లనినన్**

**అన్వయం:** మునివరుఁడు – యాజ్ఞవల్క్యుఁడు – అఖిల – ధర్మములు – చెప్పు – ఎడన్ – మునులు –అడిగినన్, మును – విప్రుల – ఆచారములు – అనువుగన్ – ఏర్పఱిచి – చెప్పెన్. అది – ఎట్లు – అనినన్.

**వ్యాఖ్య:** మునివరుఁడు యాజ్ఞవల్క్యుడు అన్ని ధర్మాలనూ (అఖిల ధర్మములు) చెప్పే సందర్భంలో మునులు అడగ్గా ముందుగా విప్రుల ఆచారాలు వీలుగా(అనువుగన్) ఏర్పరిచి చెప్పాడు. అది ఎలా అంటే...

**7. కం. శాఖ దిగవిడిచి తాఁ బర**
**శాఖన్వర్తించెనేని సద్ద్విజుఁడైనన్**
**శాఖారణ్యుఁడు వాఁడే**
**శాఖను బాహ్యుఁడని యంద్రు సన్మునులెల్లన్**

**అన్వయం:** శాఖన్ – దిగవిడిచి, తాన్ – పరశాఖన్ – వర్తించెనేనిన్ – సత్ – ద్విజుఁడైనన్ –శాఖారణ్యుఁడు – వాఁడు – ఏ శాఖనున్ – శాఖను – బాహ్యుఁడు – అని – సత్ – మునులు – ఎల్లన్ – అంద్రు.

**వ్యాఖ్య:** స్వీయ శాఖను విడిచిపెట్టి (దిగవిడిచి), తాను పరశాఖను అనుసరించినట్లయితే (వర్తించెనేనిన్) అలా చేసినవాడు ఎంతటి ఉత్తమ బ్రాహ్మణుడైనా సరే (సత్ ద్విజుఁడైనన్) వాడు ఏ శాఖకైనా బాహ్యుడే. సర్వ

శాఖాబాహ్యుఁడు అని ఉత్తములైన మునులంతా (సత్ మునులు ఎల్లన్) అంటారట.

**విశేషాలు**: శాఖారణ్యుడు, శాఖాదండుడు, శాఖాబాహ్యుడు సమానార్థకాలు. సూ.ని. లోనూ శ.ర. లోనూ ఈ పదం లేదు. సూ.ని.లో శాఖాదండుడు స్వశాఖాద్రోహి, వంశపరంపరాగతమైన తన వేదశాఖను విడిచి ఇతర శాఖయందు చెప్పబడిన కర్మముల నాచరించు వాడు అని ఉంది (సూ.ని.). శాఖాదండుడు అన్య శాఖాపాఠకుడు (శ.ర.).

**8. కం. ఆచారపరుఁడె యుత్తముఁ**
**డాచారము లేనివాఁడె యధముం డని పూ**
**ర్వాచార్యు లానతిచ్చి కు**
**లాచార క్రమముఁ దెలిపి రది యెట్లన్నన్.**

**అన్వయం:** ఆచారపరుఁడె – ఉత్తముఁడు. ఆచారము – లేనివాఁడె – అధముండు. అని – పూర్వ – ఆచార్యులు – ఆనతి – ఇచ్చి, కుల – ఆచార – క్రమమున్ – తెలిపిరి. అది – ఎట్లు – అన్నన్.

**వ్యాఖ్య:** ఆచారపరుడే ఉత్తముడు. ఆచారము లేనివాడే అధముడు అని పూర్వాచార్యులు ఆనతి ఇచ్చి, కుల ఆచార పద్ధతి (క్రమమున్) తెలిపారు. అది ఎలా అంటే..

**9. కం. కులదేశాచారంబులు**
**తలకొని చేయంగవలయుఁ దమ కులదేశం**
**బులనెందుఁ జెల్లు గావున**
**నలయక యది విహితధర్మ మని రాచార్యుల్**

**అన్వయం:** కుల – దేశ – ఆచారంబులు – తలకొని – చేయంగవలయున్. తమ – కుల – దేశంబులన్ – ఎందున్ – చెల్లున్. కావునన్ – అలయక – అది – విహిత – ధర్మము (అని) – ఆచార్యుల్ – అనిరి.

**వ్యాఖ్య:** స్వీయ కుల దేశ ఆచారాలను పూనికతో (తలకొని) చేయాలి. తమ కుల దేశాలలో ఎక్కడైనా అవి కష్టంలేకుండా అనాయాసంగా (అలయక) చెల్లుతాయి కాబట్టి, అది అంటే స్వీయ కుల దేశ ఆచారానుసరణ అనేది వేదం ఆదేశించిన ధర్మం (విహితధర్మము) అని ఆచార్యులు అన్నారు.

**10. కం. తత విజ్ఞానేశమతము**
**చతురంబుగఁ జెప్పుచోఁ బ్రసంగమువరుసన్**

**గతములు చెప్పితినేనిన్**
**స్మృతికర్తల చొప్పుఁ జెప్పితిననరే**

**అన్వయం:** తత – విజ్ఞానేశ – మతము – చతురంబుగన్ – చెప్పుచోన్ – ప్రసంగము – వరుసన్ – గతములు – చెప్పితినేనిన్, స్మృతికర్తల – చొప్పున్ – చెప్పితిన్ – అనరే.

**వ్యాఖ్య:** విపులమైన (తత) విజ్ఞానేశుడి మతాన్ని చతురంగా చెప్పే సందర్భంలో ప్రసంగవశాత్తూ అంతకుముందే తెలిసి ఉన్న విషయాలను (గతములు) ఒకవేళ నేను చెప్పినట్లయితే అలా చెప్పడం పూర్వస్మృతికర్తలు చెప్పిన మార్గాన్ని (చొప్పున్) చెప్పాను అని భావించుకోండి.

**11.** వ. **గర్భాధానంబాదిగాఁ బదాఱుకర్మంబులు బ్రహ్మక్షత్రియవైశ్యజాతులకుఁ గ్రమంబునఁజేయవలయుఁగావునఁబ్రథమంబునగర్భాధానంబుచెప్పెద.**

**అన్వయం**: గర్భాధానంబు – ఆదిగాన్ – పదాఱు – కర్మంబులు – బ్రహ్మ – క్షత్రియ – వైశ్య – జాతులకున్ – క్రమంబునన్ – చేయవలయున్ – కావునన్ – ప్రథమంబున – గర్భాధానంబు – చెప్పెదన్.

**వ్యాఖ్య:** గర్భాధానం మొదలైన పదహారు కర్మలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యజాతులు క్రమంగా ఆచరించాలి. కాబట్టి ముందు గర్భాధానం గురించి చెప్తాను.

**12.** కం. **ఆదట గర్భాధానం**
**బాదిగ సంస్కారములు పదాఱును వరుసన్**
**భూదేవవంశజులు స**
**మ్మోదముతో మంత్రపూతముగఁ జేయఁదగున్**

**అన్వయం:** ఆదటన్ – గర్భాధానంబు – ఆదిగన్ – సంస్కారములు – పదాఱును – వరుసన్ – భూదేవ వంశజులు – సత్ – మోదముతోన్ – మంత్రపూతముగన్ – చేయన్ – తగున్.

**వ్యాఖ్య:** ప్రీతిపూర్వకంగా (ఆదటన్) గర్భాధానం మొదలైన పదహారు సంస్కారాలు వరుసగా బ్రాహ్మణ వంశంలో పుట్టిన వాళ్ళు (భూదేవ వంశజులు) గొప్ప ఆనందంతో (సమ్మోదముతోన్) మంత్రాలతో పవిత్రమయ్యే రీతిలో (మంత్రపూతముగన్) చేయాలి.

**13.** తే.గీ. **చారుతరలీలమై ఋతుస్నాతయైన**
**పొలఁతి నెంతయు వేడుకఁ బురుషుఁ డొంద**

**నందు సమతిథి నుదయించు నందనుండు**
**విషమ దివసంబునందును వెలదిఁ పుట్టు**

**అన్వయం:** చారుతర – లీలమైన్ – ఎంతయున్ – వేడుకన్ – ఋతుస్నాత – ఐన – పొలఁతిన్ –పురుషుఁడు – ఒందన్, అందున్ – సమతిథిన్ – నందనుండు – ఉదయించున్. విషమ – దివసంబునందును – వెలఁది – పుట్టున్.

**వ్యాఖ్య:** ఒప్పారే రీతిలో (చారుతరలీలమైన్) ఎంతో వేడుకతో ఋతుస్నాత ఐన స్త్రీని (పొలఁతిన్) పురుషుఁడు పొందినట్లయితే (ఒందన్) – కలిసినట్లయితే వాటిల్లో సమతిథుల్లో కలిస్తే పుత్రుడు (1.నందనుండు) పుడతాడు (ఉదయించున్). విషమతిథుల్లో కలిస్తే ఆడపిల్ల (వెలఁది) పుడుతుంది.

**14. తే.గీ. పొలఁతికిని గర్భ మేర్పడఁ బుంసవనము**
**మానుగా నాఱు నెలల సీమంతవిధియుఁ**
**జేయఁదగుఁ దప్పెనేనిఁ దచ్ఛిశువు తల్లి**
**యేనిఁ జేయంగవలయు విహితఫణితిని**

**అన్వయం**: పొలఁతికిని – గర్భము – ఏర్పడన్ – పుంసవనము – మానుగాన్ – ఆఱు నెలల – సీమంత విధియున్ – చేయన్ – తగున్ – తప్పెనేనిన్ – తత్ – శిశువు – తల్లియేనిన్ – విహితపణితిని – చేయంగన్ – వలయన్.

**వ్యాఖ్య:** ఇల్లాలు గర్భవతి కాగానే (గర్భమేర్పడన్) మొదటి నెలలోనే పెనిమిటి ఆమెకు – అంటే గర్భస్థశిశువుకు పుంసవన సంస్కారం సమంత్రకంగా జరిపించాలి. ఆరవ నెల గడిచి ఏడవ నెల నడుస్తుండగా అదే విధంగా విధిగా సీమంతం జరిపించాలి. మిగతా తంతు అంతా అలా ఉండగా పెనిమిటి ఆ ఇల్లాలి పాపిటిలో (సీమంతం = పాపిడి) కుంకుమ దిద్దాలి. ఏ కారణంగానైనా పుట్టింటివారికీ అత్తింటివారికీ వీలుపడక; మొదటి నెలలోనూ ఏడవ నెలలోనూ మగడు విదేశాలలో ఉండిపోవడంలాంటి కారణాలవల్లనూ; ఇవి జరగకపోతే (తప్పెనేనిన్), గర్భిణిగా ఉండి పుట్టబోయే శిశువుకు తల్లికాబోతున్న ఆ ఇల్లాలైనా (తత్ – శిశువు తల్లియేనిన్) ఆగమవిహిత పద్ధతిలో (ఫణితిన్) పుంసవన సీమంతాలు జరుపుకోవాలి, జరిపించుకోవాలి. మానడానికి వీలు లేదని.

## విశేషాలు

**పుంసవనం:**

1. నెలతప్పినట్లు తెలిసిన తరువాత పుట్టబోయే శిశువు మగ కావాలని చేసే ఒక క్రతువు. పుంసవనం చేయకూడని కొన్ని సందర్భాలు ఉన్నాయి. మూడవ నెలలో చేయకూడదు. అలాగే విదియ, తదియ, పంచమి, సప్తమి, అష్టమి, దశమి, త్రయోదశి తిథులలోనూ, శుభవారాలలోనూ; అశ్విని రోహిణి, మృగశిర, పునర్వసు, పుష్యమి, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, మూల, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, ఉత్తరాభాద్ర, రేవతి నక్షత్రాల లోనూ; వృశ్చిక, సింహ లగ్నాలలోనూ తప్ప మిగతా లగ్నాలలో పుంసవనం చేయవచ్చు. కుండలిలో లగ్నానికి అష్టమ స్థానంలో ఏ గ్రహమైనా ఉంటే కూడా నిషిద్ధమే.
2. గర్భవతులకు రెండవ నెలలోగానీ, మూడవ నెలలో గానీ చేసే ఒక శుభకార్యం / సంస్కారం. చంద్రుడు పురుష నక్షత్రంతో కూడి ఉన్న శుభ దినాన ఈ కార్యక్రమం చేయడం మంచిదని పరాశర స్మృతి – పారమార్థిక పదకోశం, 2010.
3. గర్భచిహ్నము తెలిసినతోడనే పురుషప్రజగా పుట్టవలెనని చేసెడి యొకానొక శుభకర్మము; (చూ. కర్మము.) – శ.ర.

**15. చం. సుతుఁ డుదయించు నప్డు పరిశుద్ధ సమంచిత శీతలోదక**
**ప్లుతసకలాంగుఁడై శిశువు బొడ్డటు కోయకమున్ను భక్తితోఁ**
**బితరుల కామవస్తువులు ప్రీతిగ దానము చేసి శ్రాద్ధముల్**
**వితతముగాఁగఁ జేయఁదగు వేడుక నన్నము దక్క నన్నియున్**

**అన్వయం:** సుతుఁడు + ఉదయించునప్డు; శిశువు – బొడ్డు + అటు – కోయక – మున్ను, పరిశుద్ధ – సమంచిత – శీతల + ఉదక – ప్లుత – సకలాంగుఁడై, భక్తితోన్, పితరులకున్ – ఆమవస్తువులు – ప్రీతిగన్ – దానముచేసి; వితతముగాఁగన్ – వేడుకన్ – అన్నము – తక్కన్ – శ్రాద్ధముల్ – అన్నియున్ – చేయన్ – తగున్.

**వ్యాఖ్య:** శ్రోత్రియుడికి కుమారుడు పుట్టినపుడు ఆ శిశువు బొడ్డు కోయక ముందే ఆ శ్రోత్రియుడు చెయ్యవలసిన విధులు ఇవి.

స్వచ్ఛమైనవీ అంచితమైనవీ అయిన చన్నీళ్లు (శీతలోదక) తీసుకొని శిరస్సు మొదలుకొని పాదాలవరకూ సకలాంగాల మీదా పుష్కలంగా జల్లుకోవాలి (ప్లుత

– సకలాంగుడై). వెంటనే భక్తితో పితృదేవతలను ఉద్దేశించి వారికి ప్రీతిపాత్రంగా సద్బ్రాహ్మణులకు ఆమవస్తువులు – అంటే – ఉడికించని వస్తువులు – బియ్యం, పప్పులూ ఉప్పులూ పచ్చి కూరలూ వగైరాలు భోజన ప్రత్యామ్నాయంగా దానం చెయ్యాలి. స్వయంపాకమనీ, పొత్తర అనీ, ఉభయం అనీ – చాలా పేర్లు ఉన్నాయి దీనికి. జాతాశౌచం వచ్చింది కనుక భోజనాదికం ఉండదు. అందుకని అన్నం మినహాగా (తక్కన్) తర్పణాదికమైన మిగతా శ్రాద్ధక్రియలు అన్నీ సమృద్ధిగా (వితతముగాఁగన్) చెయ్యాలి. చాలా వేడుకగా చెయ్యాలి. సుతోదయమనేది పితృదేవతల కరుణ. కాబట్టి వెంటనే వారికి ఇలా ప్రీతి కలిగించాలని.

**16 కం. సూతకము బొడ్డు గోయఁగ**
**నాతతముగఁ బొందుఁగాని యంతకుమును సం**
**జాతుఁడగు సుతునికతమున**
**సూతకమును లేదు ద్రవ్య శుద్ధియుఁ గల్గున్.**

**అన్వయం:** సూతకము – బొడ్డు – కోయఁగన్ – ఆతతముగన్ – పొందున్. కాని – అంతకుమును – సంజాతుఁడు – అగు సుతునికతమునన్ – సూతకమును – లేదు – ద్రవ్య – శుద్ధియున్ – కల్గున్.

**వ్యాఖ్య:** జాతాశౌచమనీ, మృతాశౌచమనీ రెండు విధాలైన అశుచినే సూతకం అంటారు. ఈ సూతకం – బొడ్డు కోయగానే కలుగుతుంది. అంతేకానీ అంతకుముందు పుట్టిన (సంజాతుఁడు) కొడుకువల్ల (సుతునికతమునన్) సూతకం లేదు. రాదు. ద్రవ్య శుద్ధీ కలుగుతుంది.

**17 తే. గీ. నెలలు నాలుగింట నిష్క్రమణము చేసి**
**యాఱునెలల చన్న నన్నరసము**
**ముట్టునట్లుచేసి మూడవయేఁటఁ జౌ**
**లమ్ము సేయవలయు నెమ్మితోడ**

**అన్వయం:** నెమ్మితోడన్ – నెలలు – నాలుగింటన్ – నిష్క్రమణము – చేసి – ఆఱునెలల – చన్నన్ – అన్నరసము – ముట్టునట్లు – చేసి, మూడవ ఏఁటన్ – చౌలమ్మున్ – చేయవలయున్ .

**వ్యాఖ్య:** (శిశువుకు) ప్రియమారగా (నెమ్మితోడన్) నెలలు నాలుగింటన్ – నాలుగో నెలలో నిష్క్రమణకర్మ చేసి, ఆఱునెలలు వెళ్ళగానే (చన్నన్) అన్నరసం ముట్టించి, అన్నప్రాశనం చేసి, మూడో ఏట చౌలకర్మ చేయాలి.

**విశేషాలు:** నిష్క్రమణము అంటే వెలుపలికి వెళ్ళడం అని సామాన్యార్థం. శిశువుకు నాలుగవ నెల వచ్చినప్పుడు వెలుపలకు తీసుకొని వచ్చి సూర్యచంద్రులను చూపించే ఒక సంస్కారమని విశేషార్థం. ఇది షోడశ సంస్కారాలలో ఒకటి.

**చౌలకర్మ:** "The ceremony of tonsure, shaving off the hair of a child, three years old, with the exception of one lock, left on the crown of the head (బ్రౌణ్యం), జుట్టుపెట్టి తలవెంద్రుకలుతీయుట (శబ్దరత్నాకరము). దీనికే చూడాకర్మ అని పేరు.

**18. సీ.** **గర్భాష్టమాదిగాఁగను షోడశాబ్దాంత**
**ముపనయనము బ్రాహ్మణోత్తములకుఁ**
**బదునొకండాది యిర్వదిరెండు తుదగాఁగ**
**నుపనయనము క్షత్రియులకు నెల్లఁ**
**బంద్రెండు మొదలు నిర్వదినాల్గు తుదగాఁగ**
**వడుగు చేయఁగఁ దగు వైశ్యులకును**
**నంతలో వడుగు చేయక తక్కిరేనియుఁ**
**బతితుఁడౌ నట మీఁద బ్రాహ్మణుండు**

**గీ.** **అష్టమైకాదశ ద్వాదశాబ్దములకు**
**నుపనయనములు చేయుట యుత్తమంబు**
**చేయఁ జొప్పడ కుండెనే నెప్పినేండ్ల**
**మానుగాఁ జేయుటది కొంత మధ్యమంబు**

**అన్వయం:** బ్రాహ్మణోత్తములకున్ – గర్భాష్టమ – ఆదిగాఁగన్ – షోడశ – అబ్ది – అంతము – ఉపనయనము – చేయగన్ – తగున్. ఎల్లన్ – క్షత్రియులకున్ – పదునొకండు – ఆది – ఇర్వది రెండు – తుదగాఁగన్ – ఉపనయనము – చేయగన్ – తగున్. వైశ్యులకును – పంద్రెండు – మొదలు – ఇర్వదినాల్గు – తుదగాఁగన్ – వడుగు – చేయన్ – తగున్. అంతలోన్ – వడుగు – చేయక – తక్కరి – ఏనియున్, బ్రాహ్మణుండు – అటమీఁదన్ – పతితుఁడు – ఔన్. అష్టమ – ఏకాదశ – ద్వాదశ – అబ్దములకున్ – ఉపనయనములు – చేయుట – ఉత్తమంబు. చేయన్ – చొప్పడకుండెనేన్ – చెప్పిన – ఏండ్ల – మానుగాన్ – చేయుట – అది కొంత – మధ్యమంబు.

**వ్యాఖ్య:** బ్రాహ్మణోత్తముడికి ఎనిమిదినుంచి (గర్భాష్టమ+ఆదిగాన్) పదహారు

సంవత్సరాల వయస్సులోపల, క్షత్రియుడికి పదకొండు నుంచి ఇరవైరెండు ఏళ్లలోపల, వైశ్యుడికి పన్నెండునుంచి ఇరవైనాల్గు సంవత్సరాల వయస్సులోపలా ఉపనయనం జరపాలి.

ఈ వయస్సులోపల వడుగు చెయ్యకపోతే బ్రాహ్మణుడు ధర్మభ్రష్టుడు (పతితుఁడు) అవుతాడు. నిజానికి బ్రాహ్మణుడికి ఎనిమిదవ ఏట, క్షత్రియుడికి పదకొండవయేట, వైశ్యుడికి పన్నెండవయేట వడుగు చెయ్యడం ఉత్తమం. ఒకవేళ అలా ఆ నిర్దిష్ట సంవత్సరాలలో చెయ్యలేకపోతే (చేయన్ చొప్పడకుండెనేన్) ఒక్కొక్కరికీ చెప్పిన తుదిగడువులలోపలనైనా చెయ్యాలి. అంటే బ్రాహ్మణుడికి పదహారేళ్ళలోపల, క్షత్రియుడికి ఇరవైరెండేళ్ళ లోపల, వైశ్యుడికి ఇరవైనాలుగేళ్ళలోపల – జరిపి తీరాలి. ఇది కొంతలో కొంత మధ్యమం. ఈ తుది గడువులు దాటిపోయాక చెయ్యడం అధమం. అసలే మానెయ్యడం అధమాధమం – అని.

**19. సీ.** **ద్విజులు భిక్షాచర్య నిజముగాఁ జేయుచో**
**భవతి భిక్షాందేహి బ్రాహ్మణునకు**
**భిక్షాం భవతిదేహి నా క్షత్రియునకు భి**
**క్షాందేహి భవతి వైశ్యజనునకును**
**నిత్తెఱంగున భిక్ష యుత్తమద్విజుల మం**
**దిరముల భిక్షించి తెచ్చి యొప్ప**
**గురుసమ్మతంబునఁ బరఁగ నాపోశన**
**పూర్వకంబు నన్నమునకు మ్రొక్కి**

**ఆ.వె.** **యెట్టి యన్నమైన నిదినాకుఁ జవిగల్గ**
**దనక ప్రీతిఁ గుడిచి యనుదినంబు**
**బ్రహ్మచారి గురుల పాల వసించి వే**
**దమ్ము చదువవలయు ధర్మనియతి**

**అన్వయం:** ద్విజులు – భిక్షాచర్య – నిజముగాన్ – చేయుచోన్ – భవతి భిక్షాందేహి – బ్రాహ్మణునకున్, భిక్షాం భవతి దేహి – నాన్ – క్షత్రియునకున్, భిక్షాందేహి భవతి – వైశ్య జనునకును, ఈ – తెఱంగునన్ – భిక్ష – ఉత్తమ ద్విజుల – మందిరముల – భిక్షించి – తెచ్చి – ఒప్పన్ – గురు సమ్మతంబునన్ – పరఁగన్ – ఆపోశన – పూర్వకంబునన్ – అన్నమునకున్ – మ్రొక్తి – ఎట్టి – అన్నమైనన్ – ఇది – నాకున్ – చవి – కల్గదు – అనక – ప్రీతిన్ – కుడిచి – అనుదినంబు – బ్రహ్మచారి – గురుల – పాల – వసించి – ధర్మనియతిన్ – వేదమ్ము – చదువవలయున్.

**వ్యాఖ్య:** ద్విజులు భిక్ష తీసుకొనే కార్యక్రమాన్ని (భిక్షాచర్య) స్వయంగా తమకు తాముగా (నిజముగాన్) చేస్తుంటే.. అలాంటప్పుడు ఎవరి దగ్గర ఎలా అడిగి భిక్ష స్వీకరించాలో చెప్తున్నాడు.

**భవతి భిక్షాందేహి** అని బ్రాహ్మణుడు అడగాలిట.

**భిక్షాం భవతి దేహి** అని క్షత్రియుడు అడగాలిట.

**భిక్షాం దేహి భవతి** అని వైశ్యజనుడు అడగాలిట.

ఈ పద్ధతిలో (ఇత్తెఱంగునన్) భిక్షను ఉత్తమ ద్విజుల (ద్విజుడు – బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు) మందిరాలనుండి అంటే వారి వారి కులోత్తముల గృహాల నుండి భిక్షించి తెచ్చి, మంచి గురువుగారి అంగీకారంతో (సమ్మతంబునన్) వర్తిల్లుతూ ఆపోశనం పట్టి, అలా ఆపోశన పూర్వకంగా అన్నానికి నమస్కరించి, అది ఎటువంటి అన్నమైనా సరే ఇది నాకు రుచించదు (చవి కల్గదు) అనకుండా ఇష్టంగా తిని (ప్రీతిన్ కుడిచి), ధర్మనియతితో నిత్యమూ గురుల వద్దనే (పాలన్) బ్రహ్మచారి నివసించి వేదం చదువుకోవాలి.

**20.** క. **దండాజిన కౌపీన క**
**మండలు యజ్ఞోపవీత మౌంజీపరిధా**
**నుండై వేదముచదువుచు**
**నుండుట సద్బ్రహ్మచారి కుచితంబెందున్**

**అన్వయం:** ఎందున్ – దండ – అజిన – కౌపీన – కమండలు – యజ్ఞోపవీత – మౌంజీ – పరిధానుండు + ఐ – వేదము – చదువుచున్ – ఉండుట – సద్బ్రహ్మచారికిన్ – ఉచితంబు.

**వ్యాఖ్య:** ఎక్కడైనా సరే దండం, జింకచర్మం (అజిన), గోచీ (కౌపీన), కమండలువు, జంధ్యం (యజ్ఞోపవీత), ముంజదర్భ మొలత్రాడు (మౌంజీ), దోవతి (పరిధానుండై) వీటిని ధరించి వేదం చదువుకోవడమే సద్బ్రహ్మచారికి తగినది (ఉచితంబు).

**21.** కం. **మూరెడు మోదుగ విప్రుఁడు**
**భూరమణుఁడు వటము ఖదిరమును వైశ్యుఁడు పెం**
**పారఁగ రావియు మేడియు**
**గౌరవమున దండములుగఁ గైకొనవలయున్**

**అన్వయం:** విప్రుడు – మారెడు – మోదుగ, భూరమణుఁడు – వటము – ఖదిరమును, వైశ్యుడు – పెంపు – ఆరఁగన్ – రావియు – మేడియు – గౌరవమునన్ – దండములుగన్ – కైకొనవలయున్.

**వ్యాఖ్య:** వటువు ధరించే దండం (కర్ర) విషయంలోనూ వర్ణాలవారీగా నియమాలు ఉన్నాయి. ఏ ఏ వర్ణాల వాళ్ళు ఏ ఏ వృక్షాలకు సంబంధించిన కర్రలతో చేసిన దండాలను వాడాలో చెబుతున్నాడు.

విప్రవటువు – మారేడు దండం గానీ, మోదుగు దండం గానీ ధరించాలి. క్షత్రియ కుమారుడు (భూరమణుఁడు) మఱ్ఱి దండం గానీ, చంద్రకర్ర గానీ (ఖదిరము) ధరించాలి. వైశ్య బ్రహ్మచారి (వర్ణి) పెంపుగా రావి కర్రను గానీ, మేడి కర్రను గానీ వహించాలి. ఇదీ పద్ధతి, ఇదీ గౌరవం.

**22. కం. చిక్కని చక్కని నున్నని**
**స్రుక్కని తోలూడ్వఁబడని ఘుల్లి సెగలచే**
**నొక్కఁబడని దండంబులు**
**దక్కక యుపనయనవేళఁ దాల్పఁగవలయున్**

**అన్వయం:** చిక్కని – చక్కని – నున్నని – స్రుక్కని – తోలు – ఊడ్వఁబడని – ఘుల్లి – సెగలచే – నొక్కఁబడని – దండంబులు – తక్కక – ఉపనయనవేళన్ – తాల్పఁగన్ – వలయున్.

**వ్యాఖ్య:** ఉపనయన సమయంలో ఎటువంటి దండాలను వటువులు తప్పనిసరిగా (తక్కక) ధరించాలో చెప్తున్నాడు.

ఆ దండం చక్కగా, చిక్కగా (తగుపాటి లావు), నున్నగా ఉండాలి. పుచ్చూ చచ్చులతో కూడి వంకరటింకరగా ఉండకూడదు. వంకరలు తిరిగింది కాకూడదు (స్రుక్కని). కర్రకున్న బెరడు (తోలు) చెక్కుచెదరకూడదు. తోలు ఒలిచెయ్యకూడదు. పొయ్యిలో నిప్పు సెగలు (ఘుల్లి = పొయ్యి) తాకి నొక్కులు పడిన దండం కాకూడదు. ఇలాంటి దండాలనే వటువులు ధరించాలి.

**23. కం. తల నుదురు ముక్కు తుదయగు**
**కొలఁదిం గాళ్లకును నిల్పి కొల్చిన దండం**
**బులు విప్ర–రాజ–వైశ్యులు**
**తలకొని వర్ణాశ్రమమున ధరియింపఁ దగున్**

**అన్వయం:** విప్రులు – తల, రాజులు – నుదురు, వైశ్యులు – ముక్కు – తుద –

అగు — కొలఁదిన్ — కాళ్ళకును — నిల్పి — కొల్చిన — దండంబులు — తలకొని — వర్ణి — ఆశ్రమమున్న — ధరియింపన్ — తగున్.

**వ్యాఖ్య:** ఆ దండం ఎంత పొడుగు ఉండాలో కూడా చెప్తున్నాడు.

వర్ణి అంటే బ్రహ్మచారి. బ్రహ్మచర్యాశ్రమంలో విప్రవటువు ధరించవలసిన దండం పొడుగు — అతడి తలనుంచి పాదాలదాకా ఉండాలి.

రాజకుమారుడు ధరించవలసిన దండం నుదురునుంచి కాళ్ళదాకా ఉండాలి.

వైశ్య వర్ణి ధరించే దండం ముక్కు నుంచి కాళ్లదాకా ఉండాలి.

ఇలా కొల్చి మరీ సిద్ధం చేసిన దండాలను వీరు ధరించాలి.

**విశేషాలు:** దీనికి మూలం:

**కేశాంతికో బ్రాహ్మణస్య దండః కార్యప్రమాణతః**
**లలాట సమ్మితో రాజ్ఞః స్యాత్తను శాంతికోవిశః** (గోభిలస్మృతి 123)

**24. కం. జన్నిదము శిఖయు వెలిగా**
**నెన్ని సుకర్మములు చేసెనేనియు విప్రుం**
**డున్నతి కెక్కఁడు గావున**
**జన్నిదముల తెఱఁగు వినుఁడు సవిశేషముగన్**

**అన్వయం**: జన్నిదము — శిఖయున్ — వెలిగాన్ — విప్రుండు — ఎన్ని — సుకర్మములు — చేసెన్ — ఏనియున్ — ఉన్నతికిన్ — ఎక్కఁడు. కావునన్ — జన్నిదముల — తెఱఁగున్ — సవిశేషముగన్ — వినుఁడు.

**వ్యాఖ్య:** యజ్ఞోపవీతమూ (జన్నిదము) శిఖ — ఇవి లేకుండా (వెలిగాన్) విప్రుడు ఎన్నెన్ని అనుష్ఠానాలూ సత్కర్మలూ చేసినా సద్గతిని (ఉన్నతికిన్) పొందదు. పొందలేడు. కాబట్టి ఆర్యులారా! జన్నిదాల విధి విధానాలు (తెఱఁగు) సవిశేషంగా తెలియజేస్తాను. వినండి (వినుఁడు).

**25. సీ. గోష్ఠంబు నదియును గుడియును నాదిగా**
**శుచియైన దేశంబుఁ జూచి యచట**
**వలచేత వరుసతోఁ బదియాఱు మాఱులు**
**చుట్టిన సూత్రంబు సొబగుతోడ**
**గాయత్రిఁ జదువుచుఁ గడఁగి మున్నూలొడ్డి**

**వలచేయి యెక్కంగ వలనుదాల్చి**
**ముమ్మడుం గెగఁదాల్చి క్రమ్మఱ దిగఁదాల్చి**
**స్రుక్కులు వుచ్చి ముచ్చుట్లు చుట్టి**

**ఆ.వె. ముడిచి మంత్రపూర్వముగ వడుగొకటి స**
**న్న్యాసి యొకటి మఱి గృహస్థు రెండుఁ**
**దాల్పవలయు జన్నిదంబులు ప్రీతితో**
**నెన్ని దాల్చిరేని నెగ్గు గాదు**

**అన్వయం**: గోష్ఠంబు – నదియును – గుడియునున్ – ఆదిగాన్ – శుచి – ఐన – దేశంబున్ – చూచి – అచట – వలచేత – వరుసతోన్ – పదియాఱు – మాఱులు – చుట్టిన – సూత్రంబు – సొబగుతోడన్ – గాయత్రి – చదువుచున్ – కడఁగి – మున్నూలు – ఒడ్డి – వలచేయి – ఎక్కంగన్ – వలను – దాల్చి – మూడు – మడుంగు – ఎగఁదాల్చి – క్రమ్మఱన్ – దిగఁదాల్చి – స్రుక్కులు – పుచ్చి – మూడు – చుట్లు – చుట్టి – ముడిచి – మంత్రపూర్వముగన్ – జన్నిదంబులు – వడుగు – ఒకటి, సన్న్యాసి – ఒకటి, మఱి – గృహస్థు – రెండున్ – తాల్ప – వలయున్ – ప్రీతితోన్ – ఎన్ని – తాల్చిరి – ఏనిన్ – ఎగ్గు – కాదు.

**వ్యాఖ్య:** జన్నిదాలు వడికేందుకు పవిత్ర స్థలం ఎంచుకోవాలి. గోవుల పాకలోనో (గోష్ఠంబు) నదీ తీరంలోనో గుడిలోనో శుచిగా కూర్చోవాలి. గాయత్రీ మహామంత్రాన్ని జపిస్తూనే ఉండాలి. పత్తినీ విభూతినీ కదిరినీ దగ్గర పెట్టుకోవాలి. విభూతి జల్లుతూ దారం తియ్యాలి. దాన్ని కుడిమోచేతికి పదహారు సార్లు (పదియారు చుట్లు) చుట్టాలి. గాయత్రి చదువుతూనే ఉండాలి. దాన్ని ముప్పేటలుగా పురి ఎక్కించి అయిదునుంచి ఆరు మూరలు చేసి కదిరికి తగిలించి పురి పెట్టాలి. మూడు సార్లు (ముమ్మడుంగు) పైకీ మూడుసార్లు కిందికీ కదిరిని గిర్రున తిప్పుతూ బాగా పురెక్కించాలి. చిక్కులూ ముడులూ ముడతలూ (స్రుక్కులు) పత్తిగింజల అవశేషాలూ లేకుండా శుభ్రంచేసి మూడు మూరల పొడుగుకి సరిజేసుకోవాలి. అలా ముడిచి దాన్ని చూపుడువేలంతకు మడవాలి. ఈ జన్నిదాన్ని మంత్రపూర్వకంగా ధరించాలి. బ్రహ్మచారికీ సన్యాసికీ ఒంటిపోగు జన్నిదాలే. వివాహితుడికి (భార్యతోకలిపి) రెండు పోగులు. అవసరార్థులకివ్వడంకోసం మరో పోగు. ఇది కనిష్ఠ సంఖ్య. ఎన్ని పోగులు దాల్చినా వివాహితులకు తప్పులేదు (ఎగ్గుగాదు).

**26. కం. చివికిన యజినము దండముఁ**
**జివికిన జన్నిదముఁ దీసి శీఘ్రమ క్రొత్తల్**

**సవరించి పెట్టుకొని యా**
**చివికిన యవి జలముపాలు చేయఁగవలయున్**

**అన్వయం**: చివికిన – అజినము – దండము – చివికిన – జన్నిదము – తీసి – శీఘ్రమ – క్రొత్తల్ – సవరించి – పెట్టుకొని – ఆ – చివికిన – అవి – జలముపాలు – చేయఁగన్ – వలయున్.

**వ్యాఖ్య:** కృష్ణాజినం (జింకతోలు), దండం, జన్నిదం – చివికిపోతే వాటిని వెంటనే మార్చుకోవాలి. శీఘ్రంగా కొత్తవి సిద్ధంచేసి (సవరించి) ధరించాలి. చివికిపోయిన పాత వాటిని, నుయ్యిలోనో – చెరువులోనో – నదిలోనో – ఇలా ఏదో ఒక జలాశయంలోకి (జలము పాలు చేయఁగవలయున్) విసిరివెయ్యాలి.

జన్నిదాలనైతే ఇంటి కప్పులమీదనో చెట్ల కొమ్మలమీదనో వేస్తారు. ఇదొక ప్రాంతీయాచారం.

**27. కం. వడుగునకు శ్రాద్ధ భోజన**
**మొడఁ బడఁదగు నడిగికొనిన నొడఁబడెనేనిన్**
**గుడుచునెడ మధువు మాంసం**
**బుడిగి కుడువవలయు నందు రుత్తము లెల్లన్**

**అన్వయం:** అడిగికొనినన్ – వడుగునకున్ – శ్రాద్ధభోజనము – ఒడఁబడన్ – తగున్. ఒడఁబడెనేనిన్ – కుడుచునెడన్ – మధువున్ – మాంసంబున్ – ఉడిగి – కుడువవలయున్ – అందురు + ఉత్తములు + ఎల్లన్.

**వ్యాఖ్య:** పితృకర్మ చేసేవాడే స్వయంగా కోరితే (అడిగికొనినన్) బ్రహ్మచారి శ్రాద్ధభోక్తగా ఉండవచ్చు (ఒడబడన్ + తగున్) అలా ఒక వటువు (వడుగు) శ్రాద్ధభోజనానికి ఒప్పుకుంటే (ఒడబడెనేనిన్) భుజించేటప్పుడు మాత్రం మధువునూ మాంసాన్నీ (ఇవీ వడ్డించే అలనాటి మాట) విడిచిపెట్టేసి తక్కినవి తినాలి.

**యద్భ్రోచతే తత్తద్భోక్తవ్యమ్** అనే వెసులుబాటు ఎలాగూ ఉంది కనుక – మిగతా పదార్థాలే భుజించాలి. ఇది స్మార్తవిద్యల్ని సంపూర్ణంగా ఎరిగిన ఉత్తములు చెప్పిన మాట.

**28. కం. వడుగున నుద్వాహక్రియ**
**నొడయందును సోమయాజియుం బలుమాఱున్**
**గుడిచినఁ జను నొక్కఁడుగాఁ**
**గుడిచినఁ దగు దీన నెగ్గుగొన రెవ్వారున్**

**అన్వయం, వ్యాఖ్య:** ఉపనయనంలో వడక పెళ్ళికొడుకు (ఒడయండును), పెళ్ళిప్రక్రియలో (ఉద్వాహక్రియన్) కన్యాదాత (సోమయాజియున్), పలుమార్లు భుజించినా పర్వాలేదు (చనున్). ఒక్కడే కూర్చుని భుజించినా (కుడిచినన్) చెల్లుతుంది(తగున్). దీన్ని ఎవ్వరూ తప్పు పట్టరు (ఎగ్గు గొనరు).

**విశేషాలు:** వడక పెళ్ళి కొడుక్కి ముహూర్తానికి ముందు హడావిడిగా రెండు ముద్దలు కతకనిచ్చి అరకొర ఆకలితోఉండగానే అతడిని లేవదీసి ఉపనయనం తంతు నడిపిస్తారు పురోహితులవారు. ఆ ఉపనయనం పూర్తి అయ్యాక అతడు మళ్ళీ సుష్టుగా భోజనం చెయ్యవచ్చు. చెయ్యాలి. కాబట్టి ఒకే పూట రెండు పర్యాయాలు (పలుమార్లు) భుజించడాన్ని ఎవ్వరూ తప్పు పట్టరు అన్నాడు.

అలాగే కన్యాదాతకు (సోమయాజి) కన్యాదానం అయ్యాకనే అతడు భుజించాలి. అప్పటిదాకా ఉపవాసమే. అది అయ్యేసరికి అందరి భోజనాలూ అయిపోవచ్చు. సహ పంక్తికి అవకాశమే లేకపోనూ వచ్చు. అటువంటప్పుడు (సద్బ్రాహ్మణుడు (సోమయాజి)సహపంక్తిని లేకుండా ఒంటరిగా భుజించకూడదని సాధారణ నియమం) ఒక్కడే తిన్నా ఎవరూ ఎగ్గుకింద భావించరు.

**29. కం. ఓంకారమగ్ని శశి పితృ**
**పంకజభవ వాయు పద్మబాంధవ దివిజుల్**
**సంకలనమెసఁగు నుపవీ**
**తాంకముననె సూత్రమునకు నధిదైవంబుల్**

**అన్వయం:** సూత్రమునకున్ – అధిదైవంబుల్ – ఓంకారము – అగ్ని – శశి – పితృ – పంకజభవ– – వాయు – పద్మబాంధవ – దివిజుల్ – ఉపవీతా – అంకముననె – సంకలనము – ఎసఁగున్

**వ్యాఖ్య:** సూత్రానికి అధిదైవాలైన ఓంకారం, అగ్ని, చంద్రుడు (శశి), పితృదేవతలు, బ్రహ్మ (పంకజభవ), వాయుదేవుడు, సూర్యుడు (పద్మబాంధవ), దేవతలు (దివిజుల్) ఉపవీతుడి దగ్గరే (ఉపవీతా అంకముననె) కూడి ఉంటారు (సంకలనము ఎసఁగున్).

**30. కం. నెఱిగల విప్రుండయినను**
**గుఱుకొని యజ్ఞోపవీత గురుదేవతఁ దా**
**నెఱిఁగి ధరియించు టుచితం**
**బెఱఁగక ధరియించెనేని నిలఁదగదెందున్**

**అన్వయం:** నెఱి – కల – విప్రుండు – అయినను – గుఱుకొని – యజ్ఞోపవీత – గురుదేవతన్ – తాను – ఎఱ(గి – ధరియించుట – ఉచితంబు. ఎఱ(గక – ధరియించెనేనిన్ – ఇలన్ – ఎందున్ – తగదు.

**వ్యాఖ్య:** ఎంత ఆచారవంతుడైన (నెఱి – ఆచారం) బ్రాహ్మణుడైనా పూనికతో (గుఱుకొని) యజ్ఞోపవీత గురుదేవతకు నమస్కరించి (ఎఱగి) ధరియించడం ఉచితం. అలా నమస్కరించుకుండా (ఎఱగక) ధరిస్తే అలా ధరించడం ఇలలో ఎక్కడా మంచిది కాదు (తగదు).

**31. ఆ.వె. అనుపనీతుతోడ నాలితోఁ బొత్తునఁ**
**గుడువఁ జెల్లుఁ బ్రాచిఁ గుడువఁ జెల్లు**
**మేనమామ కూఁతు మేనత్తకూఁతు ను**
**ద్వాహమగుట చెల్లు దక్షిణమున**

**అన్వయం, వ్యాఖ్య:** ఉపనయనం కానివాడితో (అనుపనీతుతోడన్), భార్యతో (ఆలితోన్) కలిసి పంక్తిలో (పొత్తునన్) కూర్చొని భోజనం చెయ్యవచ్చు (కుడువన్ చెల్లున్). ఇది తూర్పు దేశాచారం. మేనమామ కూతుర్ని గానీ మేనత్త కూతుర్ని గానీ వివాహం చేసుకోవడం (ఉద్వాహమగుట) దక్షిణదేశంలో చెల్లుతుంది.

**32. తే.గీ. అశ్వముల గోర్పడంబుల నమ్ముకొనుట**
**యోడఁ దానెక్కి బేహార మాడుకొనుట**
**యొనర మధుమాంససేవయు నుత్తరమున**
**నెందుఁ బెక్కండ్రు చేయుట నెగ్గులేదు**

**అన్వయం:** అశ్వములన్ – గోర్పడంబులన్ – అమ్ముకొనుట, ఓడన్ – తాను – ఎక్కి – బేహారము – ఆడుకొనుట, ఒనరన్ – మధుమాంస – సేవయున్ – ఉత్తరమునన్ – ఎందున్ – పెక్కండ్రు –చేయుటన్ – ఎగ్గులేదు.

**వ్యాఖ్య:** అశ్వాలనూ కంబళ్ళనూ (గోర్పడంబులన్) అమ్ముకోవడం, తాను ఓడ నెక్కి వ్యాపారం చేయడమూ (బేహారము ఆడుకొనుట), ఇంపుగా (ఒనరన్) మధుమాంసాలను సేవించడమూ ఉత్తరదిక్కున ఎక్కడచూసినా అనేకులు (పెక్కండ్రు) చేస్తున్నారు కాబట్టి అలా చేయడం అపరాధం ఏమీ కాదు (ఎగ్గులేదు).

**విశేషాలు :** గోరుపడముయొక్క రూపాంతరము.

సీ. కోరంగిచెడి కొండ గోఁగుఁబువ్వుల చాయదీవన్నె గోర్పడంబెట్లు గలిగె. జై. 3, ఆ.

**33. క. దేశాంతర మరిగియు నిజ**
**దేశాచారంబె కాని ధృతిహీనుండై**
**దేశాంతర వర్తనమున**
**కాశపడం జనదు నింద్యుఁ డగు నట్లైనన్.**

**అన్వయం:** దేశ + అంతరము – అరిగియున్ – నిజ – దేశ + ఆచారంబె – కాని – ధృతి –హీనుండై – దేశ + అంతర – వర్తనమునకున్ – ఆశపడన్ – చనదు. అట్లు + ఐనన్, నింద్యుఁడు – అగున్.

**వ్యాఖ్య:** దేశాంతరం వెళ్ళినా తన దేశాచారమే పాటించాలిగానీ పిరికివాడిలాగా భయపడి (ధృతి హీనుండై) వేరే దేశంలో జీవించడానికి (వర్తనమునకున్) ఆశపడడం తగదు. అలా ఐతే అతడు నిందింపదగినవాడు అవుతాడు.

**34. కం. వల చెవి జన్నిద మిడి దివ**
**ముల సంధ్యల నుత్తరాభిముఖుఁడై తా రా**
**త్రుల దక్షిణాభిముఖుఁడై**
**మలమూత్రోత్సర్జనంబు మఱి చేయఁదగున్**

**అన్వయం**: వలచెవిన్ – జన్నిదము – ఇడి – దినములన్ – సంధ్యలన్ – ఉత్తరాభిముఖుఁడు + ఐ – రాత్రులన్ – దక్షిణాభిముఖుఁడు + ఐ – తాన్ – మఱి – మలమూత్ర – ఉత్సర్జనంబు – చేయన్ – తగున్.

**వ్యాఖ్య:** మలమూత్ర విసర్జన చేసేటప్పుడు నైష్ఠికుడైన బ్రాహ్మణుడు విధిగా తన యజ్ఞోపవీతాన్ని (జన్నిదము) కుడి చెవికి చుట్టుకోవాలి, తగిలించుకోవాలి (కుడి చెవిలో గంగ ఉంటుందట). పగటిపూటా సందెవేళా ఉత్తరంవైపు, రాత్రివేళల్లో దక్షిణాభిముఖంగా కూర్చుని విసర్జన చెయ్యాలి. తూర్పు పడమరలవైపు తిరిగిగానీ, నిలబడిగానీ నిషిద్ధం.

**35. సీ. పండిన చేనిలోపల దాని చేరువ**
**రాజమార్గంబుల రచ్చలందుఁ**
**బుట్టలో వేదిపై బొక్కలో బూదిపై**
**మసనంబులో నాలమందలోన**
**జీవరాశులమీఁద దేవాలయము పొంతఁ**
**జౌట బాటల తరుచ్ఛాయలందు**
**నడుచుచు నిలుచుండి నరు లేఁగు తెరువున**
**మలము నీక్షించుచుఁ బలికి పలికి**

గీ. **యాగశాలను గట్టినయట్టి యెడల**
**ననలవిప్రానిలంబుల కభిముఖముగ**
**ముసుఁగు వెట్టక చేముక్కు మూసికొనక**
**మలము విడుచుట శిష్టధర్మంబు గాదు**

**అన్వయం:** పండిన – చేనిలోపలన్, దాని – చేరువన్, రాజమార్గంబులన్, రచ్చలందున్, పుట్టలోన్, వేదిపైన్, బొక్కలోన్, బూదిపైన్, మసనంబులోన్, ఆలమందలోనన్, జీవరాశులమీఁదన్, దేవ + ఆలయము – పొంతన్, చౌట – బాటలన్, తరు + ఛాయలందున్, నడుచున్ – నిలుచుండి, నరులు + ఏఁగు – తెరువునన్, మలమున్ – ఈక్షించుచున్, పలికి – పలికి, యాగశాలను – కట్టిన + అట్టి – ఎడలన్, అనల – విప్ర – అనిలంబులకున్ – అభిముఖముగన్, ముసుగు + పెట్టక, చేన్ – ముక్కు – మూసికొనక, మలము – విడుచుట – శిష్టధర్మంబు – కాదు.

**వ్యాఖ్య:** మల, మూత్రవిసర్జన ఎక్కడెక్కడ చేయకూడదో ఎలా చెయ్యకూడదో చెప్తున్నాడు. పండిన చేలలో వాటి చేరువలో, రాజమార్గాలలో, నలుగురూ కూడే రచ్చబండల సమీపంలో మల, మూత్రవిసర్జన చేయకూడదు.

పాముల పుట్టలో, వేదికలమీద అంటే ఎత్తుగా ఉండే గట్లూ వగైరాల మీదా, ఎలుకల కన్నాలలో, బూడిదమీదా, శ్మశానంలోనూ (మసనంబు), ఆవుల గుంపులు (ఆలమంద) గోరాడేచోటా మల, మూత్రవిసర్జన చేయకూడదు.

చీమలూ మొదలైన జీవ రాశులమీదా, దేవాలయాల చేరువలో, ఇసుక (చౌట?) దారుల్లో, చెట్ల నీడలలో (తరుచ్ఛాయలు) మల, మూత్రవిసర్జన చేయకూడదు.

నడుస్తూ, నిలబడి చేయకూడదు. నలుగురూ నడిచే దారిలో చేయకూడదు. మలాన్ని చూస్తూ (ఈక్షించుచున్), ఎవరితోనో మాట్లాడుతూ (పలికి పలికి) చేయకూడదు. యాగశాలలు నిర్మించిన ప్రదేశాల్లో, అగ్నికీ విప్రుడికీ వాయువుకీ (అనల–విప్ర–అనిలంబులకున్) అభిముఖంగా చేయకూడదు. ముసుగు వేసుకోకుండా, ముక్కూ చెవీ మూసుకోకుండా చేయకూడదు. చేస్తే అది శిష్టాచారం కాదు (శిష్టధర్మంబు గాదు).

**36.** సీ. **గనులలోపలఁ దటాకములలో గట్టుపైఁ**
**గోట కెలంకులఁ గొలిమి గూఁటఁ**
**బరిఘలలోపలఁ జలి పందిళ్లలోపలఁ**

**బాఁతఱిలో గాది పట్టునందు**
**సత్తరువుల లోనఁ జాకిరేవుల సరో**
**వరసమీపంబుల వాపి తటులఁ**
**గూపంబు దటిఁ దోఁటలోపలఁ దోఁపుల**
**మఠముల పొంత గోమయము నొద్దఁ**

**ఆ.వె. బలు దెలుఁగుల జనులు పను లాచరించుచోఁ**
**గరితురంగ వితతిఁ గరము వేడ్క**
**యెసఁగ భూతలేశు లెక్కి వినోదించు**
**నచట మలము విడుచు టనుచితంబు**

**అన్వయం:** గనులలోపలన్, తటాకములలోన్, గట్టుపైన్, కోట – కెలంకులన్ – కొలిమి – గూఁటన్, పరిఘలలోపలన్, చలిపందిళ్ళలోపలన్, పాఁతఱిలోన్, గాదిపట్టునందున్, సత్తరువులలోనన్, చాకిరేవులన్, సరోవర – సమీపంబులన్, వాపి – తటులన్, కూపంబు – తటిన్, తోఁటలోపలన్, తోఁపులన్, మఠముల పొంతన్, గోమయమునొద్దన్, పలు – తెలుంగుల – జనులు – పనులు + ఆచరించుచోన్, కరి – తురంగ – వితతిన్, కరము – వేడ్కన్ – ఎసఁగన్ – భూతల + ఈశులు – ఎక్కి – వినోదించు – అచటన్, మలము – విడుచుట – అనుచితంబు.

**వ్యాఖ్య:** గనులలోపల, చెరువుల్లోనూ (తటాకములు), చెరువు గట్లమీద, కోటకు చుట్టుపక్కలా (కెలంకులన్), చల్లారిన కొలిమి గూట్లోనూ (గూడు–గూటన్) మల, మూత్ర విసర్జన చెయ్యకూడదు. అది చాలా అనుచితం.

అలాగే అగడ్తలలో (పరిఘ – పరిఖ), చలివేంద్రాల్లో (చలి పందిళ్లు), ధాన్యాదులు నిల్వ చేసే పాతర్లలోనూ, గాదెల చేరువల్లోనూ చేయకూడదు.

సత్రాల్లో (సత్తరువులు), చాకిరేవుల్లో, సరోవరసమీపాన, దిగుడు బావుల (వాపి) తటాల్లోనూ, నూతుల దగ్గరా (కూపంబు), పూల, పండ్లతోటల్లో, మామిడి–తాడి లాంటి చెట్ల తోపుల్లో, మఠాల చెంత, ఆవుపేడ (గోమయము) కుప్పల దగ్గరా, రకరకాల పనులు చేస్తూ జనసంచారం మసిలే ప్రదేశాలలోనూ, ఏనుగులు – గుర్రాల గుంపులు ఎక్కి ఎంతో వేడుకగా రాకుమారులు (భూతలేశులు) వినోదవిహారాలు జరిపే ప్రాంగణాలలోనూ – మలమూత్ర విసర్జన చెయ్యడం అనుచితం.

**37. కం. డాచే లింగము గైకొని**
**లేచి మృదంబువుల గంధలేపములఁ దగన్**

**శౌచము చేసి పిదపఁ దన**
**యాచారము లెల్ల నియతుఁడై చేయఁదగున్**

**అన్వయం:** డా – చేన్ – లింగము – కైకొని – లేచి – మృత్ + అంబువులన్, గంధ – లేపములన్ – తగన్, శౌచము – చేసి – పిదపన్ – తన – ఎల్లన్ – ఆచారములు – నియతుఁడు + ఐ, చేయన్ – తగున్.

**వ్యాఖ్య**: మల విసర్జన అయ్యాక, ఎడమ చేతితో మర్మాంగం (లింగము) పట్టుకొని పైకి లేవాలి. మట్టితో (మృత్) నీటితో (అంబువులన్) గంధలేపనాలతో – కడుక్కొని శుభ్రం చేసుకోవాలి. అలా శౌచం చేసుకున్న తరవాత ఇక తక్కిన స్నానసంధ్యాదులైన ఆచారాలను అన్నింటినీ నియమానుసారం (నియతుఁడై) నిర్వహించాలి.

**38.** **ఆ.వె.** **చౌటనేల మన్ను శౌచశేషపు మన్నుఁ**
**బుట్ట మన్ను నెలుక బొక్క మన్నుఁ**
**దక్క నొండుచోటఁ దా మన్నుఁ గొని శౌచ**
**మాచరింపవలయు నండ్రు బుధులు**

**అన్వయం:** చౌట – నేల – మన్ను, శౌచ – శేషము + మన్నున్, పుట్టమన్నున్, ఎలుక – బొక్క – మన్నున్ – తక్కన్ – ఒండుచోటన్ – తాన్ – మన్నున్ – కొని – శౌచము – ఆచరింపవలయున్ – (అని) – బుధులు – అండ్రు.

**వ్యాఖ్య:** శౌచానికి పనికిరాని మన్నులు. చౌడుపడ్డ నేలలోని మట్టి, ఎవడో వాడేసి పడవేసిన (శౌచశేషము) మిగిల్చిన మట్టి; పాముల పుట్టమీద మట్టి, ఎలుకల కన్నాల చెంతనుండే మట్టి – ఇవి శౌచానికి వాడకూడదు. ఇవి తప్ప (తక్కన్) మరొకచోటునుంచి మన్ను తీసుకుని శౌచక్రియ నిర్వహించుకోవాలని పండితులు చెబుతున్నారు (అండ్రు).

**39.** **తే.గీ.** **గుదమునం దేను మాఱులుఁ గోల నొక్క**
**మాఱు దాపలిచేఁ బదిమార్లు రెండు**
**చేతులను నేడు మాఱులుఁ బ్రీతి మన్ను**
**చమరి శౌచంబు సేయుట చదురుఁదనము**

**అన్వయం:** గుదమునందున్ – ఏనుమాఱులున్, కోలన్ – ఒక్కమాఱు, దాపలిచేన్ – పదిమార్లు, రెండు – చేతులనున్ – ఏడుమాఱులున్ – ప్రీతిన్ – మన్ను – చమరి – శౌచంబు – చేయుట – చదురుఁదనము.

**వ్యాఖ్య:** శౌచక్రియలో భాగంగా మట్టిని ఏయే అంగానికి ఎన్నెన్ని సార్లు

పులుముకోవాలో చెబుతున్నాడు. గుద స్థానానికి అయిదుమార్లు (ఏను–మాఱులు), లింగానికి (కోలన్) ఒక్కసారి, ఎడమచేతికి (దాపలిచేన్) పదిసార్లు, రెండు చేతులకూ కలిపి ఏడు సార్లు – మట్టి పులుముకోవడం, కడుక్కోవడం చెయ్యాలి. ప్రీతితో చెయ్యాలట. ఇలా మట్టి పులుముకుంటూ (చమరి) శౌచం చేసుకోవడమనేది నేర్పరితనం – విజ్ఞత (చదురుఁదనము).

**40. కం. తన మనములోన నెంతట**
**ననుమానము దీఱ శుద్ధియగు నందాఁకన్**
**మను శౌచము సేయుట తగు**
**నెనికయుఁ గొలఁదియును వెదక రెన్నఁడుఁ బెద్దల్**

**అన్వయం:** తన – మనములోనన్ – అనుమానము – తీఱన్ – శుద్ధి – ఎంతటన్ – అగున్ – అందాఁకన్ – మను – శౌచము – చేయుట – తగున్. పెద్దల్ – ఎనికయున్ – కొలఁదియును – ఎన్నఁడున్ – వెదకరు.

**వ్యాఖ్య**: ఇంత పరిమాణంలో ఇన్నిసార్లుగా మట్టి పులుముకోవాలనే నియమం ఏమీ లేదు. ఏదో మాట వరసకు చెప్పినదే. తన మనస్సులో అనుమానం తీరిపోయేలా (తీఱన్) ఎన్ని సార్లు మట్టి రుద్దుకుంటే, కడుక్కుంటే శుద్ధి అవుతుందో, అన్నిసార్లూ అంత మట్టిముద్దలతో కడుక్కోవల్సిందే. అంతే గానీ – ఈ మట్టితో (మన్ను – మను) చేసుకునే శౌచంపట్ల పర్యాయాల ఎన్నిక (ఎనికయున్) పరిమాణాల ఎన్నిక (కొలదియును) పెద్దలు ఏనాడూ అన్వేషించరు, పట్టించుకోరు. శుద్ధి అయ్యిందా లేదా అన్నదే ప్రధానం. అదీ మనస్సుకు నమ్మకం కలగడం ప్రధానం. అందాకా – ఎన్ని సార్లయినా ఎంతెంతగానైనా శౌచం చేసుకోవచ్చు!!

**41. కం. కాలములు మూఁడుఁదప్పక**
**పోలఁగ సత్కర్మవిధులు భూసురు లెపుడుం**
**జాలి చనఁ దీర్పవలయును**
**జాలక దిగవిడిచెనేని సద్ద్విజుఁ డగునే?**

**అన్వయం:** కాలములు – మూఁడున్ – తప్పక – పోలఁగన్ – భూసురులు – ఎపుడున్ – సత్కర్మ – విధులు – చాలి – చనన్ – తీర్పవలయును. చాలక – దిగవిడిచెనేనిన్ – సత్ + ద్విజుఁడు + అగునే?

**వ్యాఖ్య:** బ్రాహ్మణులు (భూసురులు) సత్కర్మవిధుల్ని నిత్యం ఆచరించాలి. మూడుకాలాలలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం (కాలములు మూఁడున్) సకాలంలో అందంగా (పోలగన్) ఆచరించాలి. సమర్థతతో (చాలి) వీటిని

ముగియజెయ్యాలి (చనఁ దీర్పవలయును), నిర్వహించాలి. అశక్తుడో అసమర్థుడో కావడంవల్ల (చాలక) సత్కర్మవిధుల్ని పూర్తిగా విడిచిపెట్టకూడదు. హడావిడిగా ముగించనూ కూడదు. అలా సమర్థించుకోలేక మొక్కుబడిగా అయ్యిందనిపించిన వాడు ఉత్తమ ద్విజుడు కాలేడు (అగునే?).

**విశేషాలు**: సత్కర్మవిధులు సంధ్యావందనం మొదలైనవి.

**42. ఆ.వె. నెనడు మెదడు మలము నెత్తురు శుక్లంబు**
**మూత్ర మనెడు నివియు మొదలుగాఁగ**
**గుబిలి చెమట పుసులు గోరు శ్లేష్మం బశ్రు**
**జలము లివి శరీరమలము లయ్యె**

**అన్వయం:** నెనడు, మెదడు, మలము, నెత్తురు, శుక్లంబు, మూత్రము + అనెడు – ఇవియున్ – మొదలు – కాఁగన్, గుబిలి, చెమట, పులుసు, గోరు, శ్లేష్మంబు – అశ్రుజలములు – ఇవి – శరీర – మలములు + అయ్యెన్.

**వ్యాఖ్య:** 1) ఎముక లోపల ఉండే మూలుగు (నెనడు = మజ్జ), 2) మెదడు, 3) మలం, 4) నెత్తురు, 5) వీర్యం (శుక్లంబు), 6) మూత్రం, 7) చెవి గులుగు (గుబిలి), 8) చెమట, 9) కంటి పుసులు, 10) కత్తిరించిన గోళ్లు, 11) కఫం (శ్లేష్మంబు), 12) కన్నీరు (అశ్రు జలము) – ఇవి మొత్తం (12) శరీర మలములు. అంటే శారీరక మలినాలు.

**43. కం. మొదలిటి ఆఱును సోఁకిన**
**మృదుదకములఁ గడుగ శుద్ధి మీఁదటి యాఱుం**
**గదిసిన నీరునఁ గడిగిన**
**విదితంబుగ శుద్ధి యండ్రు విద్వజ్జనముల్**

**అన్వయం:** మొదలిటి – ఆఱును – సోఁకినన్ – మృత్ + ఉదకములన్ – కడుగన్ – శుద్ధి. మీఁదట – ఆఱున్ – కదిసినన్ – నీరునన్ – కడిగినన్ – విదితంబుగన్ – శుద్ధి (అని) – విద్వత్ + జనముల్ – అండ్రు.

**వ్యాఖ్య:** పైన చెప్పిన మొత్తం 12 శారీరక మలినాలలో మొదటి ఆరింటిలో (మూలుగు వగైరాలు) ఏది సోకినా తాకినా వెంటనే మట్టి రుద్దుకుని నీటితో కడుక్కోవాలి. అది శుద్ధి. తక్కిన ఆరింటిలో (గులుగు వగైరాలు) ఏది స్పృశించినా (కదిసినన్) కేవలం నీళ్లతో కడుక్కొంటే చాలు, శుద్ధి అని పండితజనులు (విద్వత్ + జనముల్) చాలా స్పష్టంగా అందరికీ తెలిసేట్టుగానే (విదితంబుగన్) చెప్పారు (అండ్రు).

**44. కం. పాలొండె ముండు లొండెన్**
**జాలఁ గలిగి తోలుగలుగు సరసపుఁ బుడకన్**
**శీలోత్కృష్టుఁడు ప్రాతః**
**కాలమునన్ వలయు దంతకాష్ఠము చేయన్**

**అన్వయం:** పాలు + ఒండెన్, ముండులు – ఒండెన్, చాలన్ – కలిగి, తోలు – కలుగు – సరసము + పుడకన్ – శీల + ఉత్కృష్టుఁడు – ప్రాతః – కాలమునన్ – దంతకాష్ఠము – చేయన్ – వలయున్.

**వ్యాఖ్య:** దంతధావనం చేయడానికి ఉపయోగించే పుల్ల (కాష్ఠము) పళ్ళుతోమే పుల్ల (పందుంపుల్ల – కళింగాంధ్ర మాండలికంలో) ఎలా ఉండాలో చెప్తున్న పద్యమిది. ఆ పుల్ల నుంచి (పుడక) కొంచెంగా పాలు ఓడుతూ ఉండాలి. అంటే పాలుకారే చెట్టుకు సంబంధించినదై ఉండాలి. మధ్యలో అక్కడక్కడా ముళ్ళు లేదా కణుపుల్లాంటివి చాలా అవసరం. పైన తొక్క – తోలు కలిగిన రసయుక్తమైన (సరసము) పుల్లను తీసుకొని – గొప్పశీలం కల (శీలోత్కృష్టుఁడు) ఆచారవంతుడు ప్రాతఃకాలంలో దంతకాష్ఠం చేసుకోవాలి – దంతధావనం చెయ్యాలి.

**విశేషాలు:** ఈ పద్యానికి మూలం యాజ్ఞవల్క్యస్మృతిలో లేదు. మితాక్షర వ్యాఖ్యలో ఇలా ఉంది. పన్నెండంగుళాల పొడవుండాలనీ చిటికెనవేలంత లావుండాలనీ దాని అగ్రభాగాన్ని నమిలి కుంచెలాగా చేసుకోవాలనీ సూచించింది.

**కంటకం క్షీరవృక్షోత్థం ద్వాదశాంగుళ సమ్మితం**
**కనిష్ఠి కాగ్రవత్ స్థూలం పర్వార్థకృతకూర్చకమ్** **(1-98)**

**45. తే.గీ. పంచపర్వంబులందును బాద్యములను**
**జన్మదినముల వ్యతిపాత షష్ఠి నవమి**
**శ్రాద్ధకాలంబులను వ్రతచర్యలందు**
**దంతకాష్ఠంబు కొఱుకుట తగవుగాదు**

**అన్వయం:** పంచ – పర్వంబులందును, పాద్యములను, జన్మదినములన్, వ్యతిపాత – షష్ఠి – నవమి – శ్రాద్ధ – కాలంబులను – వ్రతచర్యలందున్, దంతకాష్ఠంబు – కొఱుకుట – తగవు కాదు.

**వ్యాఖ్య:** ఏ ఏ రోజులలో దంతకాష్ఠం కొరకకూడదో చెప్తున్నాడు. ఐదు పర్వదినాలలోనూ, పాద్యమి తిథులలోనూ, జన్మదినాలలోనూ, ఉపద్రవంకానీ – గ్రహయోగం కానీ – ఉల్కాపాతం కానీ జరిగినపుడు (వ్యతిపాతం), షష్ఠి – నవమి

తిథులు వచ్చిన రోజులలోనూ, శ్రాద్ధం పెట్టే రోజునా, అలాగే విశేష వ్రతాలను ఆచరించే సందర్భాలలోనూ నిషిద్ధం (అన్యపద్ధతుల ద్వారా దంతధావనం చేయవచ్చు).

**విశేషాలు**:పంచపర్వాలు:అష్టమి,చతుర్దశి,పౌర్ణమి,అమావాస్య,సూర్యసంక్రాంతి.

**46. కం. తా సోమరియై సంధ్యో**
**పాసన జప హోమ వహ్ని పరిచర్యాదుల్**
**భూసురుఁడు దర్భ వెలిగాఁ**
**జేసిన ఫల మల్పమైన సిద్ధింప దిలన్**

**అన్వయం:** ఇలన్ – భూసురుఁడు – తాన్ – సోమరియై, సంధ్యా + ఉపాసన – జప – హోమ – వహ్నిపరిచర్యా + ఆదుల్, దర్భ – వెలిగాన్ – చేసినన్; ఫలము + అల్పమైనన్ – సిద్ధింపదు.

**వ్యాఖ్య:** దర్భలనే పవిత్రాలు అంటారు. శుభానికైనా అశుభానికైనా ఇవి లేకపోతే పనిజరగదు.

ఈ భూలోకంలో బ్రాహ్మణుడు ఎంత గొప్పవాడైనా, దర్భలు కోసి తెచ్చుకోవడానికి బద్దకించి సోమరియై దర్భలు లేకుండా (వెలిగాన్) సంధ్యాదేవిని ఉపాసించినా, జపాలు, హోమాలు, అగ్ని కార్యాలూ (వహ్నిపరిచర్యా) మొదలైనవి ఎన్ని ఎంతగా చేసినా – అవన్నీ నిష్ఫలాలే. కాసింతైనా పుణ్య ఫలం (అల్పమైనన్ – ఫలము) ఆతడికి సిద్ధించదు.

(దర్భలు దొరకని పరిస్థితులలో ప్రత్యామ్నాయంగా వాడేందుకు నైష్ఠికులు బంగారంతో చేసిన దర్భముడి ఉంగరాన్ని సదా అనామికకు అనపాయిగా ధరిస్తారు. దానిని వియోగిస్తారు).

**47. తే.గీ. వజ్ర చక్రత్రిశూలముల్ వాసవాచ్యు**
**తేశ్వరులకెట్టు లట్ల మహీసురులకు**
**దర్భ సర్వార్థసిద్ధిప్రదంబు గాన**
**బ్రాహ్మణుఁడు దర్భ విడుచుట పాడిగాదు**

**అన్వయం:** వజ్ర – చక్ర – త్రిశూలముల్, వాసవ + అచ్యుత + ఈశ్వరులకున్ – ఎట్టులు – అట్ల, మహీసురులకున్ – దర్భ – సర్వ + అర్థ – సిద్ధిప్రదంబు; కానన్ – బ్రాహ్మణుఁడు – దర్భ – విడుచుట – పాడి – కాదు.

**వ్యాఖ్య:** దేవేంద్రుడికి (వాసవ) వజ్రాయుధం, శ్రీమన్నారాయణుడికి (అచ్యుత) సుదర్శనచక్రం, పరమేశ్వరుడికి (ఈశ్వరులకున్) త్రిశూలంలాగే బ్రాహ్మణులకు (మహీసురులకున్) దర్భ. అదే వారికి సకల పుణ్యాలనూ పుణ్యకార్యాలనూ ప్రయోజనాలనూ (సర్వార్థ) సిద్ధింపజేసే ఏకైక సాధనం. కాబట్టి దర్భను విడిచిపెట్టడం, అది లేకుండా అనుష్ఠానాలు చెయ్యడం బ్రాహ్మణుడన్నవాడికి భావ్యం కాదు, ధర్మం కాదు (పాడి – కాదు). యథా సంఖ్యాలంకారం.

**48. కం. దర్భ యవశ్యము వలయును**
**దర్భ చతుర్గణము భూతి తా నది వలయున్**
**దర్భయు భూతియు వెలిగా**
**నిర్భాగ్యుఁడు చేయు నియతి నిష్ఫల మెందున్**

**అన్వయం:** దర్భ – అవశ్యమున్ – వలయును. దర్భ – చతుర్గణము. తాన్ – అది – భూతి – వలయున్. దర్భయున్ – భూతియున్ – వెలిగాన్ – నిర్భాగ్యుఁడు – చేయు + నియతి – ఎందున్ – నిష్ఫలము.

**వ్యాఖ్య:** బ్రాహ్మణుడికి దర్భ తప్పకుండా కావాలి (అవశ్యమున్ – వలయును). విప్రుడికి ధర్మార్థకామమోక్షాలు అనే పురుషార్థ చతుష్టయం (చతుర్ + గణము) కేవలం దర్భయే. దీనితో పాటు అత్యంతావశ్యకం తాను మరొకటి ఉంది. అది – విభూతి. ఆ దర్భనూ ఈ విభూతినీ ధరించకుండా విడిచిపెట్టేసి (వెలిగాన్) ఆ నిర్భాగ్యుడు (ప్రాస కోసం!) ఎంత నిష్ఠ, ఎంత నియతి పాటించినా అదిఎందుకూ పనికి రాదు. అన్నివేళలా అన్ని చోటులా కొరగానిదే (ఎందున్ – నిష్ఫలము).

**49. కం. తొమ్మిదిచిల్లుల బొందిన్**
**గ్రమ్మెడు మలములును గీడుకంపులుఁ జెడుఁ బు**
**ణ్యమ్ము గలుగుఁ బ్రాతఃస్నా**
**నమ్మెప్పుడుఁ జేయు బుధజనంబులకెల్లన్**

**అన్వయం:** ప్రాతఃస్నానమ్ము – ఎప్పుడున్ – చేయు + బుధజనంబులకెల్లన్ – తొమ్మిది – చిల్లుల – బొందిన్ – క్రమ్మెడు – మలములును, కీడు – కంపులున్ – చెడున్, పుణ్యమ్ము – కలుగున్.

**వ్యాఖ్య:** శరీరంలో నవరంధ్రాలుంటాయంటారు. దానినే తొమ్మిది చిల్లుల బొంది అన్నాడు కేతన. ఇటువంటి ఈ శరీరంలో వైసర్జనిక పదార్థాలయిన మలస్వేదాదులూ, వాటివల్ల పుట్టే దుర్వాసనలూ ఇవన్నీ ఉదయాన్నే చేసే స్నానం

వల్ల (ప్రాతఃస్నానము) తొలగిపోతాయి (చెడున్). శరీరం శుభ్రపడుతుంది. తద్వారా పుణ్యం కలుగుతుంది. కాబట్టి ప్రాతఃస్నానం చేసే బుధ జనులందరికీ ఈ రెండు లాభాలూ ఎల్లప్పుడూ కలుగుతాయి.

**విశేషాలు**: ఈ పద్యమూ అమూలకమే. అయితే మనుస్మృతిలో దీనికి దగ్గరగా ఒక శ్లోకం ఉంది.

**అత్యంత మలినఃకాయో నవచ్ఛిద్ర సమన్వితః**
**స్రవత్యేవ దివారాత్రం ప్రాతః స్నానేన శుద్ధ్యతి** (**శ్లో. 214**)

**50.** సీ. **పోఁతనీళులకంటె భూమిస్థములు మేలు**
**వానికంటెను గూపవారి మేలు**
**కొలనిజలంబు తజ్జలమునకంటె మే**
**లేటి నీళులు వానికన్న మేలు**
**పుణ్యతీర్థోదకంబులు వానికిని మేలు**
**గంగాజలము లధికముగ మేలు**
**తొలివానఁ గల్గిన జలముల నదులలో**
**ముట్టునీళుల యట్లు ముట్టఁ జనదు**

ఆ.వె. **గంగనీ రదెంత కలఁకను బడసినఁ**
**బ్రాఁచిపడిన కడఁవఁ బట్టియున్న**
**స్నానయోగ్య మన్యనదుల జలంబుల**
**కంటె నంద్రు ధర్మకర్మవిదులు**

**అన్వయం:** ధర్మకర్మవిదులు, పోఁతనీళులకంటెన్ – భూమిస్థములు – మేలు, వానికంటెను – కూపవారి – మేలు. తత్ + జలమునకంటెన్ – కొలనిజలంబు – మేలు. వానికన్నన్ – ఏటినీళులు – మేలు, వానికిని – పుణ్యతీర్థ + ఉదకంబులు – మేలు. గంగాజలములు – అధికముగన్ – మేలు. నదులలోన్ – తొలివానన్ – కల్గిన – జలములన్ – ముట్టు నీళుల + అట్లు – ముట్టన్ – చనదు. ఎంత – కలఁకను – బడసినన్, ప్రాఁచిపడిన – కడఁవన్ – పట్టి – ఉన్నన్ – అది – గంగనీరు – అన్య – నదుల జలంబుల కంటెన్ – స్నానయోగ్యము – అంద్రు.

**వ్యాఖ్య:** స్నానం చేయడానికి ఏ నీళ్ళు తగినవో చెప్తున్నాడు కేతన. ఎత్తరి ప్రదేశాలలో తొట్టెలుకట్టి నీరు నిల్వచేసి గొట్టాలతో స్నానాల గదిలోకి ఒంపే పోతనీరుకంటే నేలమీద బానల్లో పట్టి ఉంచిన (భూమిస్థములు) నీళ్లు స్నానానికి మంచివి.

దీనికంటే బావినీరు, కొలనునీరు, ఏటినీరు, పుణ్యతీర్థాలలో ఉండే జలమూ, గంగాజలం వరుసగా ఒకదానికంటే మరొకటి శ్రేష్ఠమైనవి. వీటన్నింటిలో గంగాజలం ఇంకా (అధికముగన్) శ్రేష్ఠం. నదులలో ప్రవహించే తొలివాననీళ్ళు ఎర్రగా బురదవారి ఉంటాయి కనుక అవి ముట్టునీళ్ళతో సమానం. వాటిని ముట్టజనదు. తాకకూడదు. ఎంతగా కలకబారినప్పటికీ (కలఁకను బడసినన్) ప్రాచి పట్టినకుండలో పట్టుకొని ఉంచినప్పటికీ ఇతర నదీజలాలకంటే కూడా గంగాజలం శ్రేష్ఠమైనదనీ స్నానయోగ్యమైనదనీ ధర్మకార్యాలు తెలిసిన పెద్దలు (ధర్మకర్మవిదులు) చెప్తుంటారు.

**51. సీ. తెలియఁ బ్రజాపతితీర్థంబు చిటికెన**
**వ్రేలిమొదలు జుట్టువ్రేలిమొదలు**
**పితృతీర్థమనఁ జెల్లుఁ బెను వ్రేలిమొదలి తీ**
**ర్థంబు నా బ్రహ్మతీర్థమనఁ బరగు**
**నన్ని వ్రేళులకును నగ్రంబు దేవతా**
**తీర్థం బనంగ వర్తిలుచునుండు**
**నయ్యయివారల కయ్యాయితీర్థంబు**
**లందించు జలముల యందుఁ దృప్తి**

**గీ. బ్రహ్మతీర్థజలంబులు బ్రాహ్మణుండు**
**వెలయ ముచ్చోటు చఱచుట విహితవృత్తి**
**తొడలు చేతులు మోకాళ్ల నడుమనుండ**
**నొనరఁ గూర్చుండి వార్చుట యుత్తమంబు**

**అన్వయం:** తెలియన్ – చిటికెన వ్రేలి మొదలు – ప్రజాపతితీర్థంబు, చుట్టువ్రేలి మొదలు – పితృతీర్థము – అనన్ – చెల్లున్, పెను – వ్రేలి – మొదలి – తీర్థంబున్ – ఆ – బ్రహ్మతీర్థము – అనన్ – పరగున్, అన్ని వ్రేళులకునున్ – అగ్రంబు – దేవతా తీర్థంబు – అనంగన్ – వర్తిలుచునుండున్. అయ్యయివారలకున్ – అయ్యాయి – తీర్థంబులు – అందించు – జలముల యందున్ – తృప్తి. బ్రహ్మతీర్థజలంబులు – బ్రాహ్మణుండు – వెలయన్ – ముచ్చోటు – చఱచుట – విహితవృత్తి. తొడలు – చేతులు – మోకాళ్ళ – నడుమనుండన్ – ఒనరన్ – కూర్చుండి – వార్చుట ఉత్తమంబు.

**వ్యాఖ్య:** వేలికొనలలోనూ మొదళ్ళలోనూ పుణ్యతీర్థాలుంటాయంటోంది శాస్త్రం. చిటికెన వ్రేలి మొదట ప్రజాపతితీర్థం, ఉంగరపువేలు పాదు (చుట్టువ్రేలి మొదలు)

పితృతీర్థం, నడిమివ్రేలు (పెనువ్రేలు) మొదట బ్రహ్మతీర్థం ఉంటాయని ప్రతీతి. ఇక అన్ని వేళ్ళకూ చివరిభాగం (అగ్రంబు) దేవతాతీర్థమని వర్తిల్లుతుంటుంది. ఆయా దేవతలకు ఆయా తీర్థాలు అందించే జలాలలోనే తృప్తి కలుగుతుంది. బ్రాహ్మణుడు బ్రహ్మతీర్థజలాలను సమంత్రకంగా ఉజ్జ్వలంగా (వెలయన్) తన శరీరాన మూడుచోట్ల (శిరస్సు, ఉరస్సు, కుక్షి) చల్లుకోవడం విధివిధానం (విహితవృత్తి). పద్మాసనంలో కూర్చొని – తొడలూ చేతులూ మోకాళ్ళ మధ్యలో ఉండే విధంగా చక్కగా కూర్చొని సంధ్యవార్చడం ఉత్తమం. కొందరు – మోకాళ్ళమీద కూర్చుని సంధ్యోపాసనలో భాగంగా అర్ఘ్యాలివ్వాలన్నారు.

**52.** సీ. **పూర్వాభిముఖమొండెఁ బోల నుత్తరమొండె**
**నొనరఁ గూర్చుండి శుద్ధోదకముల**
**వరుస బ్రహ్మక్షత్ర వైశ్యులు హృత్కంఠ**
**తాలుదేశంబుల నోలి నిలిపి**
**ముమ్మాఱు ప్రాశించి మూతి యడ్డము నిడ్డు**
**నొకమాటు ముమ్మాటు నొనరఁ దుడిచి**
**నాసికాపుటములు నయనముల్ శ్రోత్రముల్**
**బొడ్డును వక్షంబు భుజములందు**

ఆ.వె. **వలప లాదిగాఁగ జలములఁ దడియఁగ**
**ముట్టి వార్వ వలయు ముదముతోడ**
**నివ్విధమున వార్చి యెల్లకృత్యములును**
**మఱి యొనర్చు టుచిత మార్గ మండ్రు**

**అన్వయం**: పూర్వ + అభిముఖము – ఒండెన్, పోలన్ – ఉత్తరము – ఒండెన్ – ఒనరన్ – కూర్చుండి – శుద్ధ + ఉదకములన్ – వరుసన్ – బ్రహ్మ – క్షత్ర – వైశ్యులు – హృత్ – కంఠ – తాలుదేశంబులన్ – ఓలి – నిలిపి, ముమ్మాఱు ప్రాశించి, మూతిన్ – అడ్డము – ఒకమాటు, నిడ్డు – ముమ్మాటున్ – ఒనరన్ – తుడిచి, నాసికాపుటములు, నయనముల్, శ్రోత్రముల్, బొడ్డును, వక్షంబు, భుజములందు, వలపలాదిగాఁగన్ – జలములన్ – తడియఁగన్ – ముట్టి – వార్వ వలయున్. ముదముతోడన్ – ఈ – విధమునన్ – వార్చి – మఱి – ఎల్ల – కృత్యములును – ఒనర్చుట – ఉచితమార్గము – అండ్రు.

**వ్యాఖ్య:** సంధ్యావందన విధానం తెలిపే పద్యమిది. తూర్పునకుగానీ, ఉత్తరానికి గానీ అభిముఖంగా కూర్చోవాలి. పవిత్రజలాలను (శుద్ధోదకములన్) కుడిచేతి పుడిసిలిలో

పోసుకొని వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు – హృదయం, కంఠం, తాలు – స్థానాలలో అదేక్రమంలో (ఓలిన్) ఒక్కక్షణం నిలిపి ఆ తరువాత వాటిని మూడుసార్లు కేశవాయ స్వాహా, నారాయణాయ స్వాహా, మాధవాయ స్వాహా అంటూ నోటిలోనికి పుచ్చుకోవాలి (ప్రాశించి). అటుపైని మూతిని అడ్డంగా ఒకసారి నిలువుగా మూడుసార్లు తుడుచుకోవాలి. ముక్కురంధ్రాలు (నాసికాపుటములు), కళ్ళు (నయనముల్), చెవులు (శ్రోత్రముల్), బొడ్డు, వక్షస్థలం, భుజాలను తడుపుకోవాలి. అది కూడా ముందు కుడివైపు – దక్షిణభాగం, ఆ తర్వాత వామభాగం – ఎడమవైపు (వలపల = కుడి. వలపల – ఆదికాఁగన్). అలా పవిత్రజలాలు ఆయా శరీరభాగాలను తాకేలా తడి చేతితో స్పృశించుకొని ముదముతో సంధ్యవార్చాలి. ఆ తరువాతనే లౌకికకార్యాలన్నీ చేయటం తగిన పద్ధతి అని పెద్దలంటారు.

**53. తే.గీ. ప్రీతి మంచముపైనుండి పీఁటనుండి**
**చెప్పుపావలు దొడి తల చీరచుట్టి**
**నవ్వుచును మాటలాడుచు నడిచినడిచి**
**వంగి శయనించి నిలుచుండి వార్వఁ జనదు**

**అన్వయం**: ప్రీతిన్, మంచముపైనుండి – పీఁటనుండి, చెప్పుపావలు – తొడి, తలచీర – చుట్టి, నవ్వుచును, మాటలాడుచున్, నడిచి, నడిచి, వంగి, శయనించి, నిలుచుండి – వార్వఁజనదు.

**వ్యాఖ్య**: ముందు పద్యంలో సంధ్య ఎలా వార్చాలో చెప్పాడు. ఈ పద్యంలో ఎలా వార్చకూడదో చెప్తున్నాడు.

మంచంమీద, పీటమీద కూర్చొనిగానీ, కాళ్ళకు చెప్పులు వేసుకొని గానీ (తొడి – క్త్వార్థం. తొడు – క్రియ. ధరించు, పెట్టుకొను), తలపాగా ధరించిగానీ, నవ్వుతూ, మాట్లాడుతూ, నడుస్తూ, వంగొని, పడుకొని, నిలబడి సంధ్యవార్చకూడదు.

**54. తే.గీ. అనుపనీత ద్విజుండును నాఁడదియును**
**శూద్రుఁడును నీళులొకమాటు సోఁకఁ బెదవి**
**యంటునప్పుడె శుద్ధాత్ములగుట నిక్క**
**మనిరి ధర్మజ్ఞులైన మహాత్ము లెల్ల**

**అన్వయం**: ధర్మజ్ఞులు + ఐన, మహాత్ములు + ఎల్లన్, అనుపనీత – ద్విజుండును, ఆఁడదియును, శూద్రుఁడును – ఒకమాటు – నీళులు – పెదవి – సోఁకన్ – అంటునప్పుడె – శుద్ధ + ఆత్ములు – అగుట – నిక్కము – అనిరి.

**వ్యాఖ్య:** ఉపనయనం కాని (అనుపనీత) బ్రాహ్మణుడూ, స్త్రీ, అలాగే శూద్రుడూ ఎలా పవిత్రులౌతారో చెప్తున్నాడు. పవిత్రజలాలను తీసుకొని ఒకసారి పెదవులకు సోకేలాగా రాసుకొంటే చాలు. అవి అలా తాకినంతనే (అంటునప్పుడె) ఏ కల్మషమూ లేని విశుద్ధమైన వాళ్ళుగా (శుద్ధాత్ములు) అయిపోతారు. ఇది నిజం. అని చెప్తున్నారు ధర్మజ్ఞులైన మహాత్ములు (ధర్మజ్ఞమహాత్ములు).

**55. ఆ.వె. శ్రాద్ధయాగగ్రహణసంక్రాంతి మృతజాత**
**సూతకముల నంత్యజాతి ముట్టి**
**నపుడు పుణ్యనదులయందును దక్కఁగా**
**స్నాన ముష్ణవారిఁ జన దొనర్ప**

**అన్వయం**: శ్రాద్ధ – యాగ – గ్రహణ – సంక్రాంతి – మృత – జాత – సూతకములన్, అంత్యజాతిన్ – ముట్టినపుడు, పుణ్య – నదులయందును తక్కఁగాన్ – ఉష్ణవారిన్ – స్నానము – ఒనర్పన్ – చనదు.

**వ్యాఖ్య:** శ్రాద్ధం పెట్టేటప్పుడు, యాగాలు చేసేటప్పుడు, గ్రహణ సమయంలోను, సూర్యుడు మేషాది రాశులలోనికి ప్రవేశించే పుణ్యకాలమైన సంక్రాంతులలోనూ, సగోత్రికులు మరణించినపుడుగానీ – పుట్టినపుడు గానీ వచ్చే సూతకకాలంలోనూ, అంత్యజాతివారిని తాకినప్పుడు, స్నానం –పుణ్యనదులలోనే తప్ప (తక్కగాన్) వేడినీళ్ళస్నానం (ఉష్ణవారిన్) చేయటం తగదు. పుణ్యనదీజలాల చన్నీటిస్నానమే చేయాలి.

**56. ఆ.వె. అంటరానివారి నంటిరేనియును నే**
**కాసనమున నునికి యట్ల యపుడ**
**స్నానమాచరింప సంశుద్ధి యగుఁ గాన**
**ముట్టననుచు నునికి మూర్ఖతనము**

**అన్వయం:** అంటరానివారిన్ – అంటిరేనియునున్, ఏక + ఆసనమునన్ – ఉనికి – అట్ల, అపుడ – స్నానము – ఆచరింపన్ – సంశుద్ధి – అగున్. కాన – ముట్టను – అనుచున్ – ఉనికి – మూర్ఖతనము.

**వ్యాఖ్య:** మన ధర్మశాస్త్రంలో ప్రతి క్రియకీ ప్రతిక్రియ, ప్రాయశ్చిత్తం, విరుగుడు, సవరణ ఇత్యాదులు దేశకాల పరిస్థితులను అనుసరించి ఉన్నాయి. తాకరాని వారిని తాకామే అనుకోండి. అదేవిధంగా (అట్ల) ఒకే ఆసనంపై కూర్చోవలసి వచ్చిందే అనుకోండి. దానికి పెద్దగా బెంబేలెత్తవలసిన అవసరం లేదు. వెంటనే (అపుడ)

ఒక్క స్నానం చేస్తే చాలు. శుద్ధి కలుగుతుంది. దోషం పోతుంది. అంతేకానీ 'నేను దేనినీ ఎవరినీ తాకను' అంటూ బిగుసుక్కూర్చోవటం మూర్ఖత్వమే.

**57. ఆ.వె. కుక్క నక్కఁ బందిఁగోడి గాడిదె వాయ**
**సంబు నంటెనేని శౌచమునకు**
**జలములేనియెడల మలమూత్రములుసేయు**
**నేని ద్విజుఁడు వలయు నీట మునుఁగ**

**అన్వయం:** కుక్కన్ – నక్కన్ – పందిన్ – కోడిన్ – గాడిదెన్ – వాయసంబున్ – అంటెనేనిన్, శౌచమునకున్ – జలములేని యెడలన్ – మలమూత్రములు – చేయునేనిన్ – ద్విజుఁడు – నీటన్ – మునుఁగన్ – వలయున్.

**వ్యాఖ్య:** కుక్క, నక్క, పంది, కోడి, గాడిదె, కాకి (వాయసంబు) వీటిని తాకితే అశౌచదోషం అంటుకుంటుంది. అలాగే శౌచానికి నీరులేనిచోట్ల మలమూత్ర విసర్జన చేసినా అశౌచమే. ఈ సందర్భాలలో శౌచం కోసం బ్రాహ్మణుడు నీటిలో మునగవలసినదే. అంటే ఇంటికి వచ్చి నిండా స్నానం చెయ్యాల్సిందేనని.

**58. తే.గీ. చాకి బోయవాఁడు జలగరి గౌడగరి**
**కుక్క సూనగాఁడు కోడి పంది**
**బొడ్డుక్రింది యంగములు విప్రు సోఁకిన**
**నచటుఁ గడుగవలయు నంద్రు బుధులు**

**అన్వయం**: చాకి – బోయవాఁడు – జలగరి – గౌడగరి – కుక్క, సూనగాఁడు – కోడి – పంది – బొడ్డు – క్రింది – అంగములు – విప్రున్ – సోఁకినన్, బుధులు – అచటున్ – కడుగవలయున్ – అంద్రు.

**వ్యాఖ్య:** చాకలి, బోయ, జలగరి (బంగారం పనిచేసిన తర్వాత అక్కడ పడిన బంగారు రేణువులు మొదలైన వాటిని నీళ్ళతో కడిగి శోధించేవాడు), గౌడగరి (చర్మకారుడు), కుక్క, కటికవాడు (సూనగాఁడు), కోడి, పంది – అలాగే వీటితో పాటు బొడ్డు కింది అవయవాలైన కాళ్ళూ, పాదాలూ మొదలైనవీ గనక బ్రాహ్మణుడికి తగిలితే – ఆ బ్రాహ్మణుడు అవి తగిలిన తన శరీరభాగాన్ని (అచటున్) నీటితో కడిగితే దోషం పోతుందని బుధులు సెలవిస్తున్నారు.

**59. కం. పీనుఁగు మాలని సూతకి**
**సూనరి బ్రహ్మాంతకారి సోఁక సచేల**
**స్నానము నగ్నిస్పర్శయు**
**మౌనమునను జేసి ఘృతము మఱి నాకఁ దగున్**

**అన్వయం:** పీనుఁగున్, మాలనిన్, సూతకిన్, సూనరిన్, బ్రహ్మాంతకారిన్ – సోఁకన్, స – చేల – స్నానమున్, అగ్ని స్పర్శయున్, మౌనముునను – చేసి – మఱి – ఘృతము – నాకన్ – తగున్.

**వ్యాఖ్య:** శవాన్నీ దళితుణ్ణీ సూతకంలో ఉన్న వాడినీ (సూతకి) కటికవాడినీ (సూనరి) బ్రహ్మాహత్యాపాతకం చేసినవాడినీ (బ్రహ్మాహంతకారి) తాకినట్లయితే బ్రాహ్మణుడు వెంటనే కట్టుబట్టలతోనే స్నానం (సచేలస్నానము) చెయ్యాలి. పిదప అగ్ని కార్యం – హోమం మౌనంగా చేసి, నెయ్యిని (ఘృతము) నాలుకకు తగిలించుకొని దోషం పోగొట్టుకొవాలి. ఇదీ దీనికి ప్రాయశ్చిత్త విధి అంటోంది అలనాటి ఈ ధర్మశాస్త్రం.

**60. కం. సూతకిఁ బీనుఁగు మాలను**
**నాతతముగ నంటునతని నంటునతఁడు సు**
**స్నాతుఁ డగునేని శుద్ధుం**
**డాతని నంటుటయు శుద్ధి యగు ముచ్చుట్లన్**

**అన్వయం**: సూతకిన్ – పీనుఁగున్ – మాలనున్ – ఆతతముగన్ – అంటునతనిన్ – అంటు + అతఁడు – సు – స్నాతుఁడు + అగునేనిన్ – శుద్ధుండు. ఆతనిన్ – మూడు + చుట్లన్ – అంటుటయున్ – శుద్ధి – అగున్.

**వ్యాఖ్య**: సూతకంలో ఉన్న వాడిని గానీ, శవాన్ని గానీ, మాలను గానీ విరివిగా (ఆతతముగన్) తాకినవాణ్ని తాకినవాడు (అంటునతనిన్ అంటునతడు) కేవలం స్నానం చేస్తే చాలు (సుస్నాతుఁ డగునేనిన్) పవిత్రుడు (శుద్ధుండు) ఔతాడు. అందువల్ల ఇటువంటి దోషాలు పోవాలంటే అటువంటి సుస్నాతుణ్ణి మూడుసార్లు (ముచ్చుట్లన్) స్పృశించినా చాలు – శుద్ధి అవుతుంది.

**61. కం. స్నానమున భోజనంబున**
**దానముల బ్రతిగ్రహమున దైవత పితృపూ**
**జానియమంబులయందును**
**దా నినుమడి వార్వవలయుఁ దగ విప్రుఁ డెటన్**

**అన్వయం:** స్నానమునన్, భోజనంబునన్, దానముల – ప్రతిగ్రహమునన్, దైవత – పితృ – పూజా నియమంబుల + అందును – ఎటన్ – విప్రుఁడు – తగన్ – తాన్ – ఇనుమడి – వార్వవలయున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణుడు (విప్రుఁడు) రెట్టింపు గాయత్రి జపించాల్సిన సందర్భాలూ

రెండుసార్లు (ఇనుమడి) సంధ్యవార్చవలసిన సందర్భాలూ చెబుతున్నాడు. శౌచస్నాన శ్రాద్ధ భోజన సమయాలలోనూ, దానాలు పుచ్చుకొనేటప్పుడూ, దేవపూజా – పితృపూజాకార్యక్రమాది నియమాలలోనూ తప్పనిసరిగా ఇనుమడి సంధ్యవార్చాలి.

**62. సీ. భూమ్యాది సత్యాంతముగ వ్యాహృతులతోడ**
**సావిత్రి ముమ్మాటు చదువుటయును**
**నదియ ప్రాణాయామ మధ్యాత్మలకునెల్ల**
**నోంకార మాదియై యుండవలయు**
**నిట్టు ప్రాణాయామమెల్ల కృత్యములకు**
**మొదలఁ గావించుట ముఖ్యమగుట**
**ముచ్చోట్లు చఱిచి తా ముక్కువ్రేళ్ళనుబట్టి**
**యర్థిఁ బ్రాణాయామ మలవరించి**

**గీ. వర నదీతటాకల చేరువను వసింప**
**సంభవించినచో శుచిస్నానవిధులు**
**సలిపి యచ్చట మంత్రమార్జనముచేసి**
**సూర్యునకు మ్రొక్కి విప్రుఁడు శుద్ధిఁబొందు**

**అన్వయం:** భూమి + ఆది – సత్య + అంతముగన్ – వ్యాహృతులతోడన్ – సావిత్రి – ముమ్మాటు – చదువుటయునున్, అధ్యాత్మలకున్ + ఎల్లన్ – అది + అ – ప్రాణాయామము. ఓంకారము + ఆది + ఐ – ఉండవలయున్. ఇట్టు – ప్రాణాయామము – ఎల్లన్ – కృత్యములకున్ – మొదలన్ – కావించుట – ముఖ్యము + అగుటన్ – ముచ్చోట్లు – చఱిచి – తాన్ – ముక్కు – వ్రేళ్ళనుబట్టి – అర్థిన్ – ప్రాణాయామము – అలవరించి, వర – నదీ – తటాకల – చేరువను – వసింపన్ – సంభవించినచోన్ – శుచి – స్నానవిధులు – అచ్చట – సలిపి, మంత్రము + ఆర్జనము – చేసి – సూర్యునకున్ – మ్రొక్కి – విప్రుఁడు – శుద్ధిన్ – పొందున్.

**వ్యాఖ్య**: సంధ్యావందనంలో సప్తవ్యాహృతులను పలకాలి. అవి: భూః, భువః, స్వః/సువః, మహః, జనః, తపః, సత్యం. భూమితో మొదలయ్యే ఈ వ్యాహృతులలో సత్యలోకం చివరిది. సత్యాంతంగా సావిత్రీ మంత్రాన్ని ముమ్మార్లు చదవాలి. అధ్యాత్మవేత్తలకు (అధ్యాత్మలకున్) అదే ప్రాణాయామం. అది ఓంకారం ఆదిగా ఉండాలి. ఇలా ప్రాణాయామం అన్ని పనులకూ (కృత్యములకున్) మొదట

చేయడం ముఖ్యం. కాబట్టి మూడుసార్లు ఓం కేశవాయ స్వాహ, ఓం నారాయణాయ స్వాహ, ఓం మాధవాయ స్వాహ (వైష్ణవు లైతే – ఓం అచ్యుతాయ స్వాహ, ఓం అనంతాయ స్వాహ, ఓం గోవిందాయ స్వాహ) అనీ మూడుసార్లు ఆచమనం చేసి ముమ్మార్లు నీళ్లు శిరస్సున జల్లుకోవాలి (ముచ్చోట్లు చటిచి), తాను ముక్కును వేళ్ళతో పట్టుకొని అర్థితో ప్రాణాయామం ఆచరించాలి. అలా ఆచరించి, శ్రేష్ఠమయిన (వర) నదులచెంతగానీ, తటాకాలకు చేరువలో నివసించడం సంభవించినట్లయితే శుచిస్నానాదివిధులను అక్కడే పూర్తిచేసుకొని, అక్కడ మంత్ర మార్జనం చేసి, సూర్యుడికి మ్రొక్కి విప్రుఁడు శుద్ధిపొందుతాడు.

**విశేషాలు**: **వ్యాహృతులు/వ్యాహృతి త్రయం**

1. భూః, భువః, స్వః అనే మూడు శబ్దాలు వ్యాహృతి త్రయం. హోమాదులలో పూర్ణాహుతికి ముందు ఈ మూడు శబ్దాలతో హవిస్సులను వ్రేల్చడం విధాయకం. భూర్భువస్సువర్లోక పాలకులు అగ్ని, వాయు, సూర్యులు. ఈ ముగ్గురే వసు, రుద్ర, ఆదిత్య రూపులు. శ్రాద్ధకర్మలలో ఈ ముగ్గురు పితరులని శాస్త్రం. వ్యాహృతి అంటే సామాన్యార్థం ఉచ్చారణం.
2. సప్త–వ్యాహృతులు: 1) భూః, 2) భువః, 3) సువః, 4) మహః, 5) జనః, 6) తపః, 7) సత్యమ్ [ఈ యేడును బ్రాహ్మణులు ప్రాణాయామంతో పఠించదగినవి].

**63.** **సీ.** **అరుణోదయమున శౌచాదులన్నియుఁ దీర్చి**
**వరుస రేపటి సంధ్య వార్వ వలయు**
**నాదిత్యుఁడర గ్రుంకు నప్పుడు మాపటి**
**సంధ్యావిధానంబు సలుపవలయు**
**రేపు సూర్యుందును మాపు చుక్కలుఁ దోచు**
**నంత దాఁకను జపమాచరించి**
**యటుమీఁద నాత్మ గృహ్యానురూపంబుగా**
**విధివంతముగ నగ్ని వేల్వవలయు**

**గీ.** **వేల్చి గురులకు మ్రొక్కి తావేద మర్థిఁ**
**జదివి వినయంబుతోఁ బరిచర్యఁ జేసి**
**విప్రగృహముల భిక్షంబు వేడ్కఁ దెచ్చి**
**వడుగు గురు ననుమతమునఁ గుడువలయు**

**అన్వయం:** అరుణ + ఉదయమునన్ – శౌచ + ఆదులు + అన్నియున్ – తీర్చి, వరుసన్ – రేపటి – సంధ్యవార్వవలయున్. ఆదిత్యుఁడు – అరగ్రుంకు + అప్పుడు – మాపటి – సంధ్యావిధానంబు – సలుపవలయున్. రేపు – సూర్యుండును – మాపు – చుక్కలున్ – తోచునంతదాఁకన్ – జపము + ఆచరించి, అటుమీఁదన్ – ఆత్మ – గృహ్య + అనురూపంబుగాన్ – విధివంతముగన్ – అగ్ని – వేల్వవలయున్. వేల్చి – గురులకున్ – మ్రొక్కి – తాన్ – వేదము – అర్థిన్ – చదివి, వినయంబుతోన్ – పరిచర్యన్ – చేసి, విప్ర – గృహములన్ – భిక్షంబు – వేడ్కన్ – తెచ్చి, వడుగు – గురు + అనుమతంబునన్ – కుడువవలయున్.

**వ్యాఖ్య:** తూర్పున అరుణకాంతి ఉన్న సమయంలోనే (అరుణోదయమునన్) శౌచాది విధులన్నింటినీ తీర్చుకొని, చక్కగా (వరుసన్) ప్రాతఃకాల సంధ్యావందన విధిని నిర్వర్తించి సంధ్యవార్చాలి (రేపటి సంధ్య వార్వ వలయున్).

సూర్యుడు సగం అస్తమించే సమయంలో (అర గ్రుంకు నప్పుడు) సాయం సంధ్యావందనం చేయాలి (మాపటి సంధ్యావిధానంబు సలుపవలయున్). ఉదయంపూట (రేపు) సూర్యుడూ రాత్రిపూట సందెవేళ (మాపు) చుక్కలూ తోచేంత వరకూ జపం ఆచరించాలి. ఆపైన గృహస్థు (గృహి) ధర్మానికి తగినవిధంగా (ఆత్మ గృహ్యానురూపంబుగాన్) (విధివంతముగాన్) అగ్నికార్యం –హోమం చెయ్యాలి (వ్రేల్వవలయున్). వ్రేల్చి గురులకు మ్రొక్కి వేదం చెప్పించుకొని వేదంలో చెప్పినట్లు చదివి (అర్థిన్) వినయంగా సేవచేసి (బరిచర్యఁ జేసి) విప్రగృహాలనుంచి భిక్ష వేడ్కతో తెచ్చి బ్రహ్మచారి (వడుగు) గురువుగారి అనుమతితో స్వీకరించాలి.

**64. కం. పెక్కిండ్ల భిక్షఁ గుడుచుట**
**చక్కని ధర్మంబు బ్రహ్మచారికి నది దా**
**నొక్కింటి యన్నమైనను**
**నక్కఱ పడి కుడువఁ జెల్లదని రాచార్యుల్**

**అన్వయం**: పెక్కు – ఇండ్లన్ – భిక్షన్ – కుడుచుట – అది – బ్రహ్మచారికిన్ – చక్కని – ధర్మంబు, తాన్ – అక్కఱపడి, ఒక్కింటి – అన్నమైనను – కుడువన్ – చెల్లదు – అని – ఆచార్యుల్ – అనిరి.

**వ్యాఖ్య:** భిక్షాటన చేస్తూ పెక్కిళ్ళకు వెళ్ళి భిక్షను స్వీకరించి దానిని తినడమే బ్రహ్మచారులకు తగిన ధర్మం. ఆ రోజుకి ఎంత ప్రాప్తమో అంతే. అలాకాక ఎంత అవసరం వచ్చినా సరే (అక్కఱపడి) ఒకే ఇంటి అన్నాన్ని స్వీకరించకూడదు అని చెప్తున్నారు ఆచార్యులు.

**65. కం. అంగన సంగతి గురువుల**
**యెంగిలి మధుమాంస సేవ యేరిఁ బలుకులన్**
**భంగము పఱుచుట తములము**
**శృంగారము వడువునకు నిషిద్ధములు మహిన్**

**అన్వయం:** మహిన్ – అంగన – సంగతి, గురువుల – ఎంగిలి, మధు మాంససేవ, ఏరిన్ – పలుకులన్ – భంగము పఱుచుట, తములము, శృంగారము – వడువునకున్ – నిషిద్ధములు.

**వ్యాఖ్య:** స్త్రీ సాంగత్యం (అంగన సంగతి), గురువుల ఎంగిలి, మధుమాంసాలను సేవించడం – అంటే మద్యం తాగడం, మాంసం తినడం, మాటలతో (పలుకులన్) ఇతరుల్ని ఎవరినైనాసరే (ఏరిన్) అవమానించటం (భంగముపఱుచుట), తమలపాకులు – తాంబూలం వేసుకోవడం, అలంకరణ – సింగారించుకోవటం బ్రహ్మచారికి (వడువు > వడుగు) ఈ భూమిపై చేయకూడనివి (నిషిద్ధములు).

**66. కం. నలుమూలయు ముమ్మూలయు**
**వలయముఁ బ్రోక్షణము చేసి వర్ణులయిన యా**
**నలువురకుఁ గుడుపుచోట్లం**
**జెలువొందగ మున్నె శుద్ధి చేయఁగవలయున్**

**అన్వయం**: నలుమూలయున్ – ముమ్మూలయున్ – వలయమున్ – ప్రోక్షణము – చేసి – వర్ణులయిన – ఆ – నలువురకున్ – కుడుపు చోట్లన్ – చెలువొందగన్ – మున్నె – శుద్ధి చేయఁగవలయున్.

**వ్యాఖ్య:** దేవపితృకార్యాలలో నలుగురు సవర్ణులకు ప్రాంత – వంశాచారాదుల ప్రకారం భోజనం ఏర్పాటుచేసే ప్రదేశాలను (కుడుపుచోట్లన్) ఎలా తీర్చాలో శుద్ధిచేయాలో చెప్తున్నాడు కేతన. వారు భోజనానికి కూర్చునే ప్రదేశాలను నిర్ధారించి చెలువొందేటట్లుగా ముందుగానే ఆయా ప్రదేశాలలో పసుపుతోనో గోమయంతోనో చతురస్రాకారం (నలుమూల) త్రికోణాకృతి (ముమ్మూల) వృత్తాకారంలో (వలయము) కేవల సంప్రోక్షితం (నీటిని చల్లడం) చేసి – శుద్ధిచేయాలి. ఈ విధి భోజనం పెట్టడానికి ముందే చెయ్యాలి.

**67. తే.గీ. చరణములు కేలు గడిగి ముచ్చట్లు చఱచి**
**పీఠముననుండి కాళ్లుదాఁ బృథివి మోపి**
**యర్థి నాపోశనమును బ్రాణాహుతులును**
**గొని గృహస్థుండు మౌనియై కుడువ వలయు**

**అన్వయం:** చరణములు – కేలు – కడిగి, ముచ్చట్లు – చటిచి, పీఠముననుండి – కాళ్ళు – తాన్ – పృథివిన్ – మోపి, అర్థిన్ – ఆపః + అశనమును – ప్రాణాహుతులును – కొని – మౌనియై – గృహస్థుండు – కుడువవలయున్.

**వ్యాఖ్య:** గృహస్థుడనేవాడు ఎలా భుజించాలో చెప్తోందీ పద్యం. కాళ్లూ (చరణములు) చేతులూ (కేలు) కడుక్కొని ముమ్మారు (ముచ్చట్లు) శిరస్సున నీళ్లు చల్లుకోవాలి (చఱచి). పీటపై కూర్చోవాలి. ఆ పీటపైనుండి (పీఠముననుండి) కాళ్ళు నేలపై (పృథివి) ఉండేలా మోపి మరీ కూర్చోవాలి. శ్రద్ధతో (అర్థిన్) ఆపోశనం పట్టాలి. ప్రాణాహుతులు చేయాలి. ఇవన్నీ చేసి మౌనంగా ఆహారాన్ని స్వీకరించాలి.

**విశేషాలు**:

**ఆపోశనం:** భోజనం చేసేటప్పుడు పుడిసిట పట్టుకొని జలాన్ని మంత్రపూర్వకంగా పుచ్చుకోవడం – పరిషేచించడం.

**ప్రాణాహుతులు:** భోజనం ప్రారంభించేటప్పుడు పరిషేచించిన అన్నం మెతుకుల్ని 'ప్రాణాయ స్వాహా' మొదలైన మంత్రాలతో పంచప్రాణాలకూ – అంటే, శరీరంలోని అయిదు వాయువులకూ (ప్రాణ – అపాన – వ్యాన – ఉదాన – సమాన) ఆహుతులుగా పుచ్చుకోవడం.

**68. తే.గీ. మీఁదియన్నంబులోఁ గొన్ని మెతుకు లెత్తి**
**ధర్మ రాజాయ చిత్రగుప్తాయ యనుచు**
**భూమి పైనిల్పి పిదప నాపోశనంబు**
**గొనుట ధర్మంబు విప్రుండు గుడుచునపుడు**

**అన్వయం**: విప్రుండు – కుడుచునపుడు, మీఁది – అన్నంబులోన్ – కొన్ని – మెతుకులు – ఎత్తి – ధర్మరాజాయ – చిత్రగుప్తాయ – అనుచున్ – భూమిపై నిల్పి – పిదపన్ – ఆపోశనంబు – కొనుట – ధర్మంబు.

**వ్యాఖ్య**: భోజనానికి కూర్చున్నప్పుడు కంచంలోనో ఆకులోనో వడ్డించిన అన్నంలో పై భాగాన ఉన్న కొంత అన్నాన్ని – కొన్ని మెతుకుల్ని చేతుల్లోనికి తీసుకొని 'ధర్మరాజాయ, చిత్రగుప్తాయ' అంటూ తీసి పక్కనే నేలపై పెట్టాలి. అలా భూమిపై నిల్పి ఆ తర్వాత ఆపోశనం పట్టాలి. నీటినే అశనంగా – ఆహారంగా స్వీకరించటం ఆపోశనం. భోజనం చేసేటప్పుడు (కుడుచునపుడు) బ్రాహ్మణుడు (విప్రుండు) ఈ విధంగా చేయటం ధర్మం.

**69. కం. ప్రాణాహుతులు గొనిన త్రుటి**
**మౌనముఁ దాల్పంగ వలయు మానిన హుంకా**
**రాన నయినఁ జెడుఁ గావున**
**మౌనవ్రతము నడఁ దగదు మతిమంతులకున్**

**అన్వయం**: ప్రాణాహుతులు – కొనిన – త్రుటిన్ – మౌనమున్ – తాల్పంగవలయున్, మానినన్ – హుంకారాన నయినన్ – చెడున్ – కావునన్ – మౌనవ్రతమున్ – మతిమంతులకున్ – అడన్ – తగదు.

**వ్యాఖ్య**: భోజనానికి ముందు పంచప్రాణాల రూపంలో ఉన్న అగ్నికి చేసే ఆహుతిని ప్రాణాహుతి అంటారు. ఇలా ప్రాణాహుతులు చేసే సందర్భం నుంచీ – సమయం నుంచీ (త్రుటిన్) భోజనం పూర్తయ్యేదాకా మౌనంగా ఉండాలి. అలా చేయకపోయినా (మానినన్), మధ్యమధ్య హుంకారాదులైన సంజ్ఞాధ్వనులు చేసినా (హుంకారాననయినన్) మౌననియమం చెడిపోతుంది. అందువల్ల బుద్ధిమంతులైనవారు (మతిమంతులు) ఏ రకంగానూ మౌనవ్రతాన్ని విడిచిపెట్టనే కూడదు (అడదగదు).

**70. కం. అతిథుల కభ్యాగతులకుఁ**
**బితరులకును వేల్పులకును బెట్టిన శేషం**
**బతిశుద్ధ మట్టియన్నము**
**సతతముఁ గుడుచుట గృహస్థ సద్ధర్మ మిలన్**

**అన్వయం**: ఇలన్ – అతిథులకున్, అభి + ఆగతులకున్, పితరులకునున్, వేల్పులకునున్, పెట్టిన – శేషంబు – అతిశుద్ధము. అట్టి – అన్నము – సతతమున్ – కుడుచుట – గృహస్థ – సత్ + ధర్మము.

**వ్యాఖ్య**: అతిథులకూ, కోరి వచ్చినవారికీ (అభ్యాగతులకున్), పితృదేవతలకీ, ఇంద్రాదిదేవతలకూ పెట్టిన – నైవేద్యంగా సమర్పించిన దాంట్లో మిగిలినది (శేషంబు) చాలా చాలా శుద్ధమైనది తూర్పున అరుణకాంతి ఉన్న సమయంలోనే – పవిత్రమైనది. అటువంటి అన్నాన్ని నిత్యమూ (సతతమున్) తినడమే గృహస్థు పాటించవలసిన ఉత్తమోత్తమ ధర్మం.

**71. కం. ఇనుమును బొదిగిన పీఁటను**
**మును గాలినయట్టి పీఁట మోదుగు పీఁటన్**
**జెనఁటిగఁ బగిలిన పీఁటను**
**గొనకొని విప్రుండు గుడువఁ గూర్చుండఁ డిలన్**

**అన్వయం**: ఇలన్ – ఇనుమును – పొదిగిన – పీఁటను, మునుగాలిన + అట్టి పీఁటన్, మోదుగు పీఁటన్, చెనఁటిగన్ – పగిలిన – పీఁటను, కొనకొని – విప్రుండు – కుడువన్ – కూర్చుండఁడు.

**వ్యాఖ్య:** విప్రుడు భోజనం చేసే సందర్భంలో (కుడువన్) కూర్చొనేందుకు ఉపయోగించకూడని పీటలు. ఇనుముతో చేసినది పనికిరాదు. అలాగే ఇనుమును చుట్టుకమ్ములుగాగానీ తొడుగుగాగానీ అమర్చినదీ పనికిరాదు. ఆ కొసనో ఈ కొసనో మునుపెప్పుడో కాస్తమేర కాలిన పీటనూ (మునుగాలినయట్టి పీఁట), మోదుగుచెక్కతో చేసిన పీటనూ, పనికిమాలినట్టు (చెనటిగన్) పగిలిపోయిన – విరిగిన పీటనూ భోజనవేళ ఏరికోరి (కొనకొని) కూర్చోడానికి ఉపయోగించకూడదు. ఈ పీటలపై విప్రుడు భోజనానికి కూర్చోడు.

**72. కం. ఇనుప తెలె న్మంటితెలెన్**
**బెనుచేఁతల నాకు పెణకఁ బీఁట పయిన్ భో**
**జన మొనరించుట తగదని**
**ముని చెప్పిరి జనుల కాది మునివరు లెల్లన్**

**అన్వయం**: ముని – జనులకున్ – ఎల్లన్ – ఆదిమునివరులు – ఇనుపతెలెన్, మంటితెలెన్, ఆకు – పెణకన్ – పీఁటపయిన్ – పెనుచేఁతలన్ – భోజనము – ఒనరించుట – తగదు – అని – చెప్పిరి.

**వ్యాఖ్య**: అది మునీశ్వరులందరూ జనులకు – ఇనుప పాత్రలోనూ (తెలె) మట్టి పాత్రలోనూ ఆకు వెనుకభాగంలోనూ (ఆకు పెణకన్) పీటపైనా ఇలా రకరకాలుగా రకరకాల చేష్టలతో (పెనుచేఁతలన్) భోజనం చేయకూడదు అని ఆదిమునీశ్వరులు (మునివరులు + ఎల్లన్) జనులకు చెప్తున్నారు.

**73. కం. పెక్కండ్రు చూచుచుండఁగ**
**నొక్కఁడుఁ దాఁ గుడువఁగఁ జన దొకరుఁడు చూడన్**
**బెక్కండ్రు గుడువఁ జనదని**
**తక్కక చెప్పుదురు ధర్మ తత్త్వవిధిజ్ఞుల్**

**అన్వయం**: పెక్కండ్రు – చూచుచుండఁగన్ – ఒక్కఁడు – తాన్ – కుడువఁగన్ – చనదు. ఒకరుఁడు – చూడన్ – పెక్కండ్రు – కుడువన్ – చనదు – అని – ధర్మ – తత్త్వ – విధిజ్ఞుల్ –తక్కకన్ – చెప్పుదురు.

**వ్యాఖ్య**: ఆశగా అనేకులు (పెక్కండ్రు) చూస్తూ ఉండగా ఒక్కడే ఎవడికీ పెట్టకుండా

ఆబగా తినటం తగని పని. కుడువఁగన్ చనదు. అలాగే ఒకే ఒక్కడు చూస్తూ ఉంటే వాడికి పెట్టకుండా తక్కిన వారందరూ తినడమూ పద్ధతికాదు (కుడువన్ చనదు). అని ధర్మతత్త్వజ్ఞులైనవారు విడిచిపెట్టకుండా (తక్కకన్) చెప్తుంటారట.

**విశేషాలు**: దీనికి మూలం పరాశర స్మృతిలోని ఈ శ్లోకమేమో.

**నాదత్వా మిష్ట మశ్నీయా ద్బహూనాం చైవ పశ్యతామ్**
**అశ్నీయుర్బహవశ్చైవ తథానైకస్య పశ్యతః** (హ. **215**)

**74. కం. నెలనాళ్లు సునియతుండై**
**పలాశపత్రముల పులియఁ బాయక ద్విజుఁ డి**
**మ్ముల భోజనంబు చేసిన**
**ఫల మిలఁ జాంద్రాయణంబు ఫలముం గలుగున్**

**అన్వయం**: ద్విజుఁడు – సునియతుండై – పలాశపత్రముల – పులియన్ – పాయక – నెలనాళ్ళు – ఇమ్ములన్ – భోజనంబు – చేసిన ఫలము – ఇలన్ – చాంద్రాయణంబు – ఫలమున్ – కలుగున్.

**వ్యాఖ్య**: నెలరోజులపాటు మోదుగ ఆకుల విస్తట్లో (పలాశపత్రముల పులియన్) నిష్ఠగా (సునియతుండై) ప్రీతిపూర్వకంగా భోజనం చేసిన విప్రుడికి చాంద్రాయణవ్రతం చేసిన ఫలం దక్కుతుంది.

**విశేషాలు**: **చాంద్రాయణవ్రతం:** చంద్రుడి వృద్ధిక్షయాలను అనుసరించి – తాను తినే ఆహారపరిమితిని పెంచుతూ తగ్గిస్తూ చేసే వ్రతం.

**75. కం. ఒకఁ డుదకంబులు ద్రావఁగ**
**నొకరుని కంచంబులోని యుచ్ఛిష్టపుఁ జిం**
**దు కణం బొలికిన నా పా**
**త్రికయన్న మభోజ్య మండ్రు ద్విజవరు లెల్లన్**

**అన్వయం:** ఒకఁడు – ఉదకంబులు – త్రావఁగన్, ఒకరుని – కంచంబులోని – ఉచ్ఛిష్టము – చిందు – కణంబు – ఒలికినన్, ద్విజవరులు + ఎల్లన్ – ఆ – పాత్రిక – అన్నము – అభోజ్యము – అండ్రు.

**వ్యాఖ్య**: ఎవరైనా ఒకడు నీళ్ళు తాగుతున్నప్పుడు గానీ లేదా మరొకడు కంచంలో అన్నం తింటున్నప్పుడు గానీ వాళ్ళు తాగే తినే పాత్రలనుంచి ఎంగిలిని (ఉచ్ఛిష్టము) చిందించే ఒక్క నీటి బొట్టైనా ఒక్క అన్నం మెతుకైనా అక్కడే ఉన్న అన్నం పాత్రపై

చిందితే ఆ పాత్రలో (పాత్రిక) ఉన్న అన్నం ఇక ఎవరూ తినరానిదని (అభోజ్యము) బ్రాహ్మణోత్తములు – ద్విజవరులు చెప్తూ ఉంటారు.

**76. కం. పూని తన పాత్ర యన్నము**
**ప్రాణాహుతి గొనిన పిదపఁ బాత్రిక యుచ్చ**
**స్థానమున నునిచి కుడుచుట**
**తానుత్తమ సరణి యండ్రు ధర్మవిధిజ్ఞుల్**

**అన్వయం**: ప్రాణాహుతిన్ – కొనిన – పిదపన్ – పాత్రిక – ఉచ్చస్థానమునన్ – ఉనిచి, పూని – తన పాత్ర – అన్నము – తాన్ – కుడుచుట – ధర్మవిధిజ్ఞుల్ – ఉత్తమ – సరణి – అండ్రు.

**వ్యాఖ్య**: భోజనం చేసే సమయంలో చేయవలసిన ప్రాణాహుతి కార్యక్రమాలను పూర్తిచేసిన తర్వాత ఆచనమన పాత్రను (పాత్రిక) లేదా, అన్నం వండిన పాత్రను – ఎంగిలి చిందులు పడకుండా ఎత్తయిన ప్రదేశంలో (ఉచ్చస్థానమునన్) ఉంచి, తన పాత్రలోని అన్నాన్ని తాను తినడమే (కుడుచుట) అన్నింటికన్నా మేలైన పద్ధతిగా (ఉత్తమసరణి) ధర్మజ్ఞులు చెప్తుంటారు.

**77. కం. మెండియపు వ్రేల వెండియు**
**మెండీనికిఁ బొరుగువ్రేల మేలిమి పసిఁడిం**
**గొండొక వ్రేల జలంబును**
**నుండంగావలయు బ్రాహ్మణోత్తముచేతన్**

**అన్వయం:** మెండియము + వ్రేలన్ – వెండియున్, మెండీనికిన్ – పొరుగువ్రేలన్ – మేలిమి – పసిఁడిన్, కొండొక వ్రేలన్ – జలంబునున్ – బ్రాహ్మణ + ఉత్తముచేతన్ – ఉండంగావలయున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణోత్తముడు తన కుడిచేతి బొటనవేలు తప్ప మిగిలిన నాలుగువేళ్ళలోనూ కనీసం మూడింటికి ఉంగరాలు పెట్టుకోవాలి. చూపుడి వేలుకి (మెండియపు వ్రేలన్) వెండి ఉంగరం, దీనికి పొరుగున ఉండే నడిమి వేలుకి (మెండీనికిన్ పొరుగువ్రేలన్) మేలిమి పసిడి ఉంగరం, తక్కిన రెండు వేళ్లలోనూ ఏదో ఒకదానికి (కొండొక వ్రేలన్) జలపోత ఉంగరం – అంటే, రాగి ఉంగరానికి వెండిగానీ, బంగారంగానీ పూతవెట్టిన ఉంగరం ధరించాలి. సాధారణంగా ఇలాంటిదాన్ని చిటికెనవేలుకి ధరిస్తారు. కాబట్టి కొండికవ్రేలన్ = చిన్నవేలు అన్నది పాఠం కావచ్చు. మొత్తంమీద అతడి ఈ వేళ్లకు ఈ ఉంగరాలు ఉండాలి.

**విశేషాలు:** జలపోత = జలపోసనం = నీటిపూత. వీటిలోనూ జలకాలాడు అనే క్రియాపదంలోనూ జకారం దంత్యం. ఇవి అచ్చుతెనుగులు. జలపోత ఉంగరాన్ని జలము అని క్లుప్తీకరించాడు కేతన. కొన్ని చోట్ల ఇలా విశేషణాలు విశేష్యవాచకాలు కావడం కద్దు. నీటిరిక్క అనడానికి బదులు పూర్వాషాఢానక్షత్రాన్ని జలము అనడంకూడా ఇలాంటిదే.

**78. కం. వడ్డింపఁగ నెంగిలి దొడిఁ**
**బడ్డ వెసల వంటకంబు పాయ నిడఁదగున్**
**వడ్డించు నతని సోఁకిన**
**వడ్డింపక డించి వార్చి వడ్డింపఁ దగున్.**

**అన్వయం:** వడ్డింపఁగన్ – ఎంగిలి – తొడిఁబడ్డ – వెసలన్ – వంటకంబు – పాయన్ – ఇడఁదగున్, వడ్డించునతనిన్ – సోఁకినన్ – వడ్డింపక – డించి – వార్చి – వడ్డింపఁదగున్.

**వ్యాఖ్య:** వడ్డన సమయంలో పాటించవలసిన మడి నియమాలు. వడ్డన చేస్తున్నప్పుడు భోజనం చేస్తున్న వారిదెవరిదైనా ఎంగిలి తుళ్ళి (తొడిఁబడి) అన్నంకుండలోగానీ (వెసలన్) లేదా వడ్డించే ఆహారపదార్థాలున్న పాత్రలోగానీ పడితే ఆ ఎంగిలివంటపాత్రలోని వంటకాన్ని విడిచి పెట్టేయాలి (పాయనిడఁదగున్). దానిని మళ్ళీ ఇతరులకు వడ్డించకూడదు. ఇదొక నియమం. మరో నియమం ఏమిటంటే – ఒకవేళ తింటున్నవారి ఎంగిలి తుళ్ళిపడి వడ్డించేవారిని (వడ్డించునతనిన్) సోకితే వారు వడ్డన ఆపివేయాలి. చేతిలో ఉన్న పాత్రను కింద పెట్టెయ్యాలి. అలా వడ్డింపక – డించి, వెంటనే పెరటి బావిచెంతకు వెళ్ళి హస్తపాదాది ప్రక్షాళనం చేసుకుని, అపవిత్రః పవిత్రో వా – ఇత్యాది శ్లోకంతో ముమ్మరు శిరస్సున నీళ్ళు జల్లుకొని కేశవనామాలతో ఆచమించి (ఇదంతా కలిపి – వార్చుట. వార్చి) తిరిగివచ్చి వడ్డన కొనసాగించవచ్చు.

**79. కం. కూటిముడి మోచు నాతఁడు**
**పాటించక వేసె నేని ప్రస్థానం బా**
**కూటి ముడియు డించక ము**
**చ్చాటులు చఱవంగ వలయు సద్ధర్మగతిన్**

**అన్వయం:** కూటిముడి – మోచున్ – ఆతఁడు – ప్రస్థానంబు – వేసెనేని (చేసెనేని) పాటించక (?) ఆ – కూటిముడియున్ – డించక – మూడు + చాటులు – సత్ + ధర్మగతిన్ – చఱవంగవలయున్.

**వ్యాఖ్య:** ప్రయాణంలో ఉన్నప్పుడు వెంట తీసుకువెళ్ళే అన్నం మూటను కూటిముడి అంటారు. దానిని వెంట తీసుకువెళ్ళేవాడు నియమాలు పాటించకుండా ప్రయాణం చేస్తే ఆ కూటిముడిని కిందికి దించకుండా అతడిమీదా మూటమీదా ఉత్తమధర్మ పద్ధతిలో – అంటే, సమంత్రకంగా మూడుసార్లు (ముచ్చాటులు) శుద్ధోదకాలు చల్లాలి (చఱవంగవలయున్). ఏమైనా ఈ పద్యం దురవగాహంగానే ఉంది. యథామతి మీ ముందు ఉంచుతున్నాను. తజ్ఞులు సవరింతురుగాక!).

**80. కం. కుడిచిన తుది గొట్టము గొని**
**పుడిసెటిలో సగమునీళ్లు భూతలము పయిన్**
**విడిచినఁ బాతాలంబున**
**నొడఁగూడిన నారకులకు నుత్సవ మందున్**

**అన్వయం:** కుడిచిన – తుదిన్ – గొట్టమున్ – కొని – పుడిసెటిలోన్ – సగము – నీళ్లు – భూతలము – పయిన్ – విడిచినన్ – పాతాలంబునన్ – ఒడన్ – కూడిన – నారకులకున్ – ఉత్సవము – అందున్.

**వ్యాఖ్య:** భోజనం చేసిన తర్వాత చివరిలో (కుడిచినతుదిన్) నీళ్ళు తాగే పాత్ర (గొట్టము = క్రోవి, బుడ్డి, నీళ్ళు తాగే పాత్ర) తీసుకొని అందులోంచి పుడిసెట్లో సగం నీళ్ళు చేతిలోనికి తీసుకొని భూమిపై (భూతలంపై) విడిచిపెట్టాలి. భోజనానికి ముందూ, భోజనం ముగించగానే ఆపోశనం పట్టి పరిషేచనం చెయ్యడం అనే నియమం ఉంది. ఇది భోజనానంతర పరిషేచన ప్రక్రియ. ఇది చేసేటప్పుడు పుడిసెలి నిండా నీళ్ళు తీసుకొని సగం ఆపోశనం పట్టి మిగిలిన సగం విస్తరిచుట్టూ నేలపై విడిచిపెడతారు. అలా విడిచిపెట్టడం వల్ల అది పాతాళంలో ఉన్న (ఒడఁగూడిన) నరకలోకవాసులు (నారకులకున్) చేరుతుంది. అందుతుంది. దానివల్ల వారికి వేడుక (ఉత్సవం) కలుగుతుంది.

**81. కం. కుడిచిన నెంగిలి చేతను**
**దడయక గొట్టంబు గొనుట తగు నెంగిలి వోఁ**
**గడిగిన తుదిఁ గొనెనేనియుఁ**
**గడు నల్గు సమస్తదేవగణ పితృగణముల్**

**అన్వయం:** కుడిచినన్ – ఎంగిలిచేతనున్ – తడయక – గొట్టంబు కొనుట – తగున్, ఎంగిలిపోన్ – కడిగిన – తుదిన్ – కొనెనేనియున్ – సమస్త – దేవ – గణ – పితృగణముల్ – కడున్ – అల్గున్.

**వ్యాఖ్య:** భోజనం చేసిన తర్వాత (కుడిచినన్) – చేస్తున్నప్పుడు కూడా – ఎంగిలిచేత్తోనే అంటే, కుడిచేత్తోనే జాగుసెయ్యకుండా (తడయకన్) తీర్థపాత్ర (గొట్టము = గ్లాసు) తీసుకోవటం తగినది. ఎంగిలి పోయేలా చెయ్యి కడిగిన తర్వాత తీసుకుంటే సమస్తదేవతా బృందమూ (సమస్తదేవగణ) పితృదేవతలూ విపరీతంగా కోపగించుకుంటారు (కడునల్గున్) జాగ్రత్త!

ఇది ఇవ్వేళ విడ్డూరంగా కన్పిస్తుందిగానీ నిన్న మొన్నటివరకూ నైష్ఠికులు ఇలాగే మంచినీళ్లు పుచ్చుకునేవారు. ఎడమచేతితో పుచ్చుకునేవారుకాదు. గ్లాసును ఎడమ చేతితో పుచ్చుకున్నా, కుడిచేతి అరత్నిమీద (మణికట్టుకూ మోచేతికీ నడిమిభాగం = అరత్ని) ఆన్చి మంచినీళ్లు పుచ్చుకోవడమనే ఆచారం, అనంతరకాలంలో వచ్చిన మధ్యేమార్గం. ఇప్పుడైతే మనకు గ్లాసులుకూడా అవసరం లేదు – సీసాలే!!

**82. కం. బడబాగ్న్యనలాగస్త్యులు**
**కుడిచిన కుడు పఱుగఁ జేసి కుశల ప్రదుల**
**య్యెడు మాకు ననుచు వలచేఁ**
**గడుపు నిమిరి చదువగట్టి కండ్లుం గమరున్.**

**అన్వయం:** కుడిచిన – కుడుపు – బడబాగ్ని – అనల – అగస్త్యులు – అఱుగన్ – చేసి – మాకున్ – కుశలప్రదులు – అయ్యెడున్ – అనుచున్ – వలచేన్ – కడుపు – నిమిరి – చదువన్ – గట్టి – కండ్లున్ – కమరున్.

**వ్యాఖ్య:** చిన్నపిల్లలకు బొజ్జనిండా అన్నం తినిపించిన తరువాత, కన్నతల్లి తన కుడిచేతితో (వలచేన్) వారి బొజ్జ నిమరాలి. బడబాగ్ని – జఠరాగ్ని (అనల) – అగస్త్యులు – మా బిడ్డ తిన్న (కుడిచిన) ఆహారాన్ని (కుడుపు) జీర్ణమయ్యేట్టు చేసి (అఱుగజేసి) మాకూ మాపిల్లలకూ ఆరోగ్యప్రదులు అగుదురుగాక – అంటూ బొజ్జ నిమరాలి. జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం – అంటూ నేటికీ తల్లులు చదువుతారు, బొజ్జ నిమురుతారు. అలా నిమురుతూ (నిమిరి) అలా చదివినట్టయితే (చదువన్) పిల్లలు తిన్నగట్టిముద్దలుసైతం (కడి +అ =కడులు,కళ్లు,కండ్లు) హుతమైపోతాయి, అరిగిపోతాయి (కమరున్). గట్టి గట్టి ముక్కలూ (మాంసాహారులకు), మొక్కజొన్న వగైరా గట్టికండెలూ (కండి, కండె, కండ + లు) అరిగిపోతాయనీ. సులువుగా జీర్ణం కానివిసైతం జీర్ణమవుతాయనడం.

**విశేషాలు:** బడబాగ్ని సముద్రంలో ఉండే అగ్ని, గుర్రం ఆకారంలో దీని జ్వాలలు విస్తరిస్తూ ఉంటాయి కాబట్టి దీనికాపేరు వచ్చింది. వాతాపి అనే రాక్షసుణ్ణి అతడి

సోదరుడైనా ఇల్వలుడు వండి వడ్డించగా అగస్త్యుడు జీర్ణం చేసుకున్నాడని కథ. జీర్ణశక్తి ప్రదాతలుగా ముగ్గురినీ చెప్పడం అందుకే.

**83. కం. ప్రాణాపానవ్యానో**
**దానసమానములు తృప్తిఁ దలకొని మద్దే**
**హానందం బిడుఁ గాకని**
**జానుగఁ దన కడుపు నిమిరి చదువఁగ వలయున్**

**అన్వయం:** ప్రాణ + అపాన – వ్యాన – ఉదాన – సమానములు – తృప్తిన్ – తలకొని – మత్ + దేహ + ఆనందంబు – ఇడుఁగాక – అని – జానుగన్ – తన – కడుపు – నిమిరి – చదువఁగవలయున్.

**వ్యాఖ్య:** శరీరంలో పంచప్రాణాలు – పంచవాయువులు – ఉంటాయి. అవి ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం. భోజనం చేయటం ద్వారా ఈ అయిదూ తృప్తి చెంది (తృప్తిఁదలకొని) నాకు శారీరకానందాన్ని (దేహానందంబున్) ఒనగూర్చుగాక అని అర్థం వచ్చే మంత్రాలను – చెక్కపూటుగా తిన్న తరవాత – చక్కగా (జానుగన్) కడుపు నిమురుకొంటూ చదువుకోవాలి.

**84. సీ. గర్భాది సంస్కారకర్తయై యధ్యయ**
**నంబు చేయించిన నరుఁడు గురుఁడు**
**ఉపనీతుఁజేసి సాంగోపాంగవేదముల్**
**చదివించినాతఁ డాచార్యుఁ డయ్యె**
**అన్యుచే నుపనీతుఁడైన విద్యయుఁ గొంత**
**తగఁజెప్పి నతఁ డుపాధ్యాయుఁ డయ్యె**
**యాగక్రియకును దోడయి మంత్ర తంత్రము**
**లెలమిఁ జెప్పినవాఁడు ఋత్విజుండు**

**వీరుపూజ్యులు క్రమమున వీరికంటె**
**జనని పూజింపఁ దగినది జనుల కెల్ల**
**సర్వవంద్యుడు సన్యాసి జనని కెరఁగి**
**పూజ్యుఁడగుఁ దల్లిగుణములు పొగడనేల**

**అన్వయం:** గర్భ + ఆది – సంస్కార – కర్తయై – అధ్యయనంబున్ – చేయించిన – నరుఁడు – గురుడు, ఉపనీతున్ – చేసి – సాంగ + ఉప + అంగ – వేదముల్ – చదివించి నాతఁడు – ఆచార్యుఁడు – అయ్యెన్, అన్యుచేన్ – ఉపనీతుఁడు + ఐన –

విద్యయున్ – కొంత – తగన్ – చెప్పిన + అతఁడు – ఉపాధ్యాయుఁడు – అయ్యెన్, యాగక్రియకున్ – తోడు + అయి – మంత్ర – తంత్రములు – ఎలమిన్ – చెప్పినవాఁడు – ఋత్విజుండు. వీరు – క్రమమునన్ – పూజ్యులు. వీరికంటెన్ – ఎల్లన్ – జనులకున్ – జనని – పూజింపన్ – తగినది. సర్వవంద్యుఁడు – సన్యాసి జననికిన్ – ఎరఁగి – పూజ్యుఁడు – అగున్. తల్లి గుణములు – పొగడన్ – ఏల?

**వ్యాఖ్య:** గర్భాది సంస్కారాలకు కర్తయై అధ్యయనం చేయించిన వాడు (నరుఁడు) గురువు అవుతాడు. ఉపనయనం చేసి (ఉపనీతుఁజేసి) సాంగ ఉపాంగ వేదాలను చదివించిన వాడు ఆచార్యుడు. ఇతరులచేత ఉపవీతుడైన వాడికి అంటే తాను ఉపనయనం చేసిన గురువు కాకపోయినా అతడికి కొంత విద్య సముచితరీతిలో (తగన్) చెప్పిన వాడు ఉపాధ్యాయుడు. యాగక్రియలో తోడై మంత్ర తంత్రాలను ఇంపుగా (ఎలమిన్) చెప్పిన వాడు ఋత్విజుడు. వీరందరూ క్రమంగా పూజ్యులే. వీరికంటే తల్లి (జనని) జనులందరికీ పూజింప దగినది. కాబట్టి అందరిచేతా నమస్కారాలు అందుకొనే (సర్వవంద్యుడు) సన్యాసి కూడా తల్లికి నమస్కరించి (ఎరఁగి), పూజనీయుడు అవుతాడు. కాబట్టి తల్లిగుణాలను పొగడ వలసిన పనిలేదు.

**85. తే.గీ. వర్ణములు బ్రాహ్మణ క్షత్రవైశ్యశూద్రు**
**లిందు మొదలి ముష్వురు ద్విజులెట్టులనినఁ**
**దల్లివలన నాచార్యమతమ్ము వలన**
**జన్మములు రెండుగలిమి నిశ్చయముగాన**

**అన్వయం:** వర్ణములు – బ్రాహ్మణ – క్షత్ర – వైశ్య – శూద్రులు. ఇందున్ – మొదలి – ముష్వురు – ద్విజులు. ఎట్టులనిన్ – తల్లివలనన్ – ఆచార్యమతమ్మువలన్ – రెండు – జన్మములు – కలిమి – నిశ్చయము – కానన్.

**వ్యాఖ్య:** వర్ణాలు నాలుగు. అవి బ్రాహ్మణ, క్షత్ర, వైశ్య, శూద్ర అని. ఇందులో మొదటి ముగ్గురూ బ్రాహ్మణ, క్షత్ర, వైశ్యలు ద్విజులు. అంటే రెండు జన్మలు కలవారని. ఎలాగంటే తల్లి వల్ల ఒకసారి ఆచార్యుడిద్వారా అంటే ఆచార్యుడు ఉపనయన సంస్కారం చేయడం ద్వారా సంక్రమించే మతం వల్ల రెండవసారి. ఇలా రెండు జన్మలు కలిగి ఉండడం (కలిమి) నిశ్చయం కాబట్టి.

**86. కం. తన యాగమునకు శూద్రుని**
**ధన మడిగి యొనర్చెనేనిఁ దత్ఫల మా శూ**
**ద్రునిఁ జేరు నట్టి యాగము**
**చనఁ జేసినయతఁడు చచ్చి చండాలుఁ డగున్**

**అన్వయం:** తన – యాగమునకున్ – శూద్రుని – ధనము – అడిగి – ఒనర్చెనేనిన్ – తత్ + ఫలము – ఆ + శూద్రునిన్ – చేరున్ – అట్టి – యాగము – చనన్ – చేసిన + అతడు – చచ్చి – చండాలుఁడు – అగున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులలో ఎవరైనా ఒకరు ఒక యజ్ఞం తలపెట్టి, దాని వ్యయభారం మొయ్యలేక శూద్రజాతివారినుంచి ధనధాన్యాదులు అభ్యర్థించి తీసుకుని వాటిని వినియోగించి యజ్ఞం నిర్వహిస్తే, ఆ యజ్ఞ ఫలం (తత్ఫలము) యావత్తూ ఆ శూద్రుడికే దక్కుతుంది. కాగా అలా యజ్ఞం చేసినవాడు చచ్చి చండాలుడవుతాడు. అంటే – యజ్ఞం చేస్తే సొంత డబ్బుతో చెయ్యాలి. అంతగా అవసరమైతే కులంవారినుంచో కుటుంబ సభ్యులనుంచో సహాయం అందుకోవచ్చు. అంతేకానీ యజ్ఞం పేరుచెప్పి అందరినుంచీ, చందాలు దండుకో కూడదనడం సారాంశం. భయపెట్టడానికి అప్పటి కాలాన ఇదొక మార్గం!!

**87. కం. యాగార్థ మడిగి నర్థము**
**యాగమునకుఁ బెట్టవలయు నడియరియై తా**
**భోగార్థముగా దాఁచిన**
**యాగమబాహ్యుండు కాకియై జన్మించున్**

**అన్వయం:** యాగార్థము + అడిగిన + అర్థము – యాగమునకున్ – పెట్టన్ – వలయున్; అడియరియై – తాన్ – భోగార్థముగాన్ – దాఁచిన + ఆగమబాహ్యుండు – కాకియై – జన్మించున్.

**వ్యాఖ్య:** వస్తురూపంగా గానీ, ధనరూపంలోగానీ యాగంకోసమని (యాగార్థము) ఎవరినుంచైనా సొమ్మును యాచించి తీసుకున్నట్టయితే ఆ సొమ్మును (అడిగినర్థము) ఆ యాగంకోసమే వినియోగించెయ్యాలి, ఖర్చు పెట్టాలి (పెట్టవలయున్). అలా కాక పరమలుబ్ధుడై (అడియరియై) ఆ సొమ్మును తన భోగం కోసమని దాచిపెట్టుకున్నవాడు – ఆగమ బాహ్యుడు. స్మార్త ధర్మ శాస్త్రాలన్నీ అతణ్ని వెలివేస్తాయి. మరుజన్మలో అతడు కాకిగా పుడతాడు.

**88. కం. ధనముగలిగి యాగమునకు**
**మునుదొడఁగుట తనకుటుంబమునకుఁ ద్రివర్షా**
**శనమునకు మిగులఁ గల్గిన**
**ననుమానము లేకచేయునది సాంగముగన్**

అన్వయం: ధనము – కలిగి – యాగమునకున్ – మునుదొడఁగుట – తన –

కుటుంబమునకున్ – త్రివర్ష + అశనమునకున్ – మిగులన్ – కల్గినన్ – అనుమానము – లేక – స + అంగముగన్ – చేయునది.

**వ్యాఖ్య:** ధనం కలిగి యాగానికి ఉపక్రమించడం (మునుదొడఁగుట) ఎప్పుడు చేయాలంటే తన కుటుంబానికి మూడు సంవత్సరాల కాలం (త్రివర్ష అశనమునకున్) పోషణకు సరిపోయేలా (మిగులన్) ధనం ఉంటే ఏ అనుమానమూ లేకుండా సాంగంగా చేయాలి.

**89. కం. మానిత విద్యాతపములు లేని**
**జనులకిచ్చు ఫలములేదు ఘృతంబున్**
**దేనియయుఁ బచ్చికడవల**
**నేనాటం బోయు బుద్ధిహీనులుగలరే**

**అన్వయం:** మానిత – విద్య – తపములు – లేని – జనులకున్ – ఇచ్చు – ఫలములేదు. ఘృతంబున్ – తేనియమున్ – పచ్చికడవలన్ – ఏనాటన్ – పోయు – బుద్ధిహీనులు – కలరే!

**వ్యాఖ్య:** అందరిచేతా గౌరవింపదగిన (మానిత) విద్య గానీ తపస్సు గానీ లేని వారికి జనులకు ఇచ్చే దానం వల్ల ఫలం లేదు. నెయ్యినిగానీ (ఘృతంబున్) తేనెను కానీ పచ్చికడవలలో ఎవడైనా ఎన్నడైనా పోసే బుద్ధిహీనులు ఉంటారా?

**90. కం. గురుపూజచేసి వీడ్కొని**
**యరిగి సమావర్తనార్హుఁడై స్నానంబున్**
**బొరినొనరిచి వేల్చిన య**
**ప్పురుషుడు దాస్నాతకాఖ్య పూనిచరించున్**

**అన్వయం:** గురుపూజ – చేసి – వీడ్కొని – అరిగి – సమానర్తన + అర్హుఁడై – స్నానంబున్ – పొరిన్ – ఒనరిచి – వేల్చిన – ఆ + పురుషుఁడు – తా – స్నాతక + ఆఖ్యన్ – పూని – చరించున్.

**వ్యాఖ్య:** గురువుగారికి పూజచేసి ఆయననుంచి సెలవు తీసుకొని (వీడ్కొని) వచ్చి సమావర్తనానికి అర్హుఁడై క్రమంగా (పొరిన్) స్నానం చేసి సంధ్యవార్చి అగ్నిహోత్రం చేసినట్లయితే (వేల్చినన్) ఆ పురుషుడు తాను స్నాతకుడు అనే పేరుతో(ఆఖ్యన్) వ్యవహరింపబడతాడు.

**విశేషాలు: సమావర్తనం:** వేదాధ్యయనం ముగిసిన తరువాత, గృహస్థాశ్రమం స్వీకారం కోసం తిరిగి వెళ్లేటప్పుడు గురువు సమక్షంలో జరిపే వేడుక/ క్రతువు.

వేదపాఠం చెప్పిన తర్వాత ఆచార్యుడు శిష్యులను ఈ విధంగా ఆదేశిస్తాడు.

సత్యాన్నే పలుకు. ధర్మం ఆచరించు. నీ విద్యాభ్యాసం విషయంలో ఏమరుపాటు వహించకు. అంటే నిరంతరం చదువుతూ ఉండు అని. ఆచార్యుడు కోరిన ధనం ఇచ్చి, తరువాత వివాహవిధిని ఆచరించు. దానిని విచ్ఛిన్నం చేయకు. సత్యం విషయంలో ఏమరుపాటు వహించకు. ధర్మం విషయంలో ఏమరుపాటు వహించకు. నైపుణ్యాలను సాధించే విషయంలో ఏమరుపాటు వహించకు. సంపదనూ కీర్తినీ సంపాదించటంలో ఏమరుపాటు వహించకు. చదవడంలోనూ బోధించడంలోనూ ఏమరుపాటు వహించకు. దేవపితృకార్యాలలో ఏమరుపాటు వహించకు. తల్లి దేవతగా కలవాడివి కమ్ము. అంటే తల్లిని దేవతగా భావించు. తండ్రి దేవతగా కలవాడివి కమ్ము. అంటే తండ్రిని దేవతగా భావించు. ఆచార్యుడు దేవతగా కలవాడివి కమ్ము. అంటే ఆచార్యుడిని దేవతగా భావించు. అతిథి దేవతగా కలవాడివి కమ్ము. అంటే అతిథిని దేవతగా భావించు.

నిందింప తగని పనులనే చెయ్యి. ఇతరమైన పనులు చేయవద్దు. మాలో ఉన్న మంచి గుణాలనే స్వీకరించు. ఇతరమైనవి అంటే ఒకవేళ చెడ్డగుణాలేమైనా గురువులలో ఉంటే వాటిని స్వీకరించవద్దు. అని. దీని మంత్రం తైత్తరీయ సంహిత శిక్షావల్లి 11వ అనువాకంలో ఉంది.

**“వేద మనూచ్యాచార్యో ఽన్తేవాసిన మనుశాస్తి. సత్యం వద. ధర్మం చర. స్వాధ్యాయాన్మా ప్రమదః. ఆచార్యాయ ప్రియం ధన మాహృత్య, ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః. సత్యాన్న ప్రమదితవ్యం. ధర్మాన్న ప్రమదితవ్యం. కుశలాన్న ప్రమదితవ్యం. భూత్యై న ప్రమదితవ్యం. స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం. దేవపిత్రైకార్యాభ్యాం న ప్రమదితవ్యం. మాతృదేవో భవ. పితృదేవో భవ. ఆచార్యదేవో భవ. అతిథిదేవో భవ. యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని, నో ఇతరాణి. యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యాని, నో ఇతరాణి”**. ఇత్యాదిగాగల మంత్రాన్ని చదువుతారు.

**91.** కం. **కులమున నధికుం డొండెను**
**గులమున సరి పురుషుఁ డొండె గుణయుతలగు క**
**న్యలఁ బెండ్లియాడు టుచితము**
**కులహీనుఁడు కులజఁ జేసికొనఁ జనఁడెందున్**

**అన్వయం:** కులమునన్ – అధికుండు – ఒండెను, కులమునన్ – సరి – పురుషుఁడు – ఒండెన్, గుణయుతలు + అగు – కన్యలన్ – పెండ్లి + ఆడుట –

ఉచితము. ఎందున్ – కులహీనుఁడు – కులజన్ – చేసికొనన్ – చనఁడు.

**వ్యాఖ్య:** కేతన ఆచారఖండంలో వివాహరీతులను చెబుతున్నాడు. కులంచేత అధికుడు గానీ అలాగే కులంచేత సరిసమానుడుగానీ గుణవతులైన కన్యలను (గుణయుతలు) పెండ్లి ఆడటం తగిన పని. ఎందుకంటే కులహీనుడు కులవంతురాలిని పెండ్లి చేసుకోవడానికి ఎక్కడా సిద్ధపడడు కదా! (ఎందున్ – చేసికొనజనఁడు).

**92. కం. కుల మొక్కటియై గోత్రము**
**కలయక శుభలక్షణములు గలిగి ప్రియంబున్**
**గల కన్నియలను విప్రులు**
**వలయు సమంత్రకముగా వివాహం బాడన్**

**అన్వయం:** కులము – ఒక్కటియై – గోత్రము – కలయక – శుభలక్షణములు – కలిగి – ప్రియంబున్ – కల – కన్నియలను – విప్రులు – సమంత్రకముగాన్ – వివాహంబు – ఆడన్ – వలయున్.

**వ్యాఖ్య:** విప్రులు – ఎటువంటి కన్యలను వివాహమాడాలో చెప్తున్నాడు. కులం ఒక్కటే అయి ఉండాలట. గోత్రాలు మాత్రం కలవకూడదట. వీటితోపాటు మంచి లక్షణాలు కలిగి చూడగానే ఇష్టపడేలా – ప్రియంగా ఉండే కన్యలను మంత్రపూర్వకంగా పెళ్ళిచేసుకోవాలట.

**93. ఉ. శూద్రియ శూద్రభార్యయగు శూద్రియు వైశ్యయు వైశ్యభార్య లా**
**శూద్రియు వైశ్యయున్ నృపతిసూతియు రాజతనూజభార్య లా**
**శూద్రియు వైశ్యయున్ నృపతిసూతియు విశ్రుతవిప్రకన్యయుం**
**భద్రగుణప్రసిద్ధుఁ డగుబ్రాహ్మణభార్య లనుక్రమంబుగన్**

**అన్వయం:** అనుక్రమంబుగన్ – శూద్రియ – శూద్రభార్య – అగున్, శూద్రియున్ – వైశ్యయున్ – వైశ్యభార్యలు. ఆ శూద్రియున్ – వైశ్యయున్ – నృపతిసూతియున్ – రాజతనూజభార్యలు. ఆ శూద్రియు – వైశ్యయున్ – నృపతి సూతియున్ – విశ్రుత – విప్రకన్యయున్ – భద్రగుణ – ప్రసిద్ధుఁడు + అగు – బ్రాహ్మణభార్యలు.

**వ్యాఖ్య:** ప్రాచీనకాలంలో ఉన్న ఒక సంప్రదాయాన్ని కేతన ఇక్కడ చెప్తున్నాడు. దానిలో ఒక క్రమపద్ధతి ఉంది. ఇది బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ్య క్రమంలో కిందినుంచి పైకి (అనుక్రమంబుగన్) ఏర్పాటయిన ఒక ఆచారం. ముందుగా శూద్రజాతి. ఆ జాతిలో – శూద్రుడికి భార్య ఒక్క శూద్రి (శూద్రకులంలో

పుట్టిన స్త్రీ= శూద్రి) మాత్రమే. ఆ తరువాత వైశ్య జాతి. వైశ్యుడికి భార్యలుగా శూద్రి – వైశ్య (వైశ్యకులంలో పుట్టిన స్త్రీ = వైశ్య) చెల్లుతారు. ఆ పైన ఉన్నది క్షత్రియ జాతి. ఆ జాతిలో పుట్టినవాడికి (రాజతనూజ) భార్యలుగా శూద్రి, వైశ్య, రాజకుమార్తె (నృపతిసూతి) ఉండవచ్చు. శుభకరమైన గుణాలకు (భద్రగుణ) ప్రసిద్ధుడైన బ్రాహ్మణుడికి నలుగురు భార్యలుండవచ్చునట. వాళ్ళు శూద్రి, వైశ్య, రాజకుమార్తె, సుప్రసిద్ధమైన (విశ్రుత) బ్రాహ్మణ కన్య.

అనుక్రమంబుగన్ – అనే మాట ఈ భార్యల క్రమానికీ వర్తిస్తుంది. కాబట్టి వైశ్యుడి ఇల్లాండ్లలో వైశ్యాంగనకూ, క్షత్రియుడి పెళ్ళాలలో నృపసూతికీ, విప్రుడి భార్యలలో విప్రకన్యకూ మాత్రమే ధర్మపత్ని పరిగణన.

**94. కం. మేలగు విప్రుఁడు శూద్రిని**
**నాలింగాఁ జేసికొనుట యన్యాయ్యం బా**
**యాలి యుదరమున విప్రుఁడు**
**పోలంగాఁ దానె పుట్టి పుత్రుం డగుటన్**

**అన్వయం:** మేలగు – విప్రుఁడు – శూద్రిని – ఆలిన్ – కాన్ – చేసికొనుట – అన్యాయ్యంబు. ఆ –ఆలి – ఉదరమునన్ – విప్రుఁడు – పోలన్ – కాన్ – తానె పుట్టి – పుత్రుండు+అగుటన్.

**వ్యాఖ్య:** ఉత్తమ బ్రాహ్మణుడు (మేలగు విప్రుఁడు) శూద్ర స్త్రీని వివాహమాడి భార్యగా (ఆలిన్ కాన్) చేసుకోవడం న్యాయబద్ధంకాదు. ఎందుకంటే భార్య కడుపున భర్తయే కొడుకుగా పుడతాడు అంటారు. **ఆత్మా వై పుత్రనామాసి**. శూద్రి కడుపున (ఉదరమున) విప్రుడు పుట్టడం న్యాయ్యం కాదు కనుక విప్రశూద్రీవివాహం అన్యాయ్యం అంటున్నాడు (న్యాయాదనపేతమ్ = న్యాయ్యమే. ధర్మపథ్యర్ధన్యాయాదనపేతే).

**విశేషాలు:** దీనికి మూల శ్లోకం.

**యదుచ్యతే ద్విజాతీనాం శూద్రాద్దారోపసంగ్రహః**
**నైతన్మమ మతం యస్మాత్ తత్రాత్మా జాయతే స్వయమ్**

**95. కం. తగువరునిఁ బిలిచి కన్యకుఁ**
**దగిన యలంకార మిచ్చి ధారాపూర్వకం**
**బుగఁ బెండ్లి సేయుటయు నది**
**వగవక బ్రాహ్మ్యం బనెడి వివాహం బయ్యెన్**

**అన్వయం:** వగవక – తగు – వరునిన్ – పిలిచి, కన్యకున్, తగిన – అలంకారము – ఇచ్చి, ధారాపూర్వకంబుగన్ – పెండ్లి – చేయుటయున్ – అది – బ్రాహ్మ్యంబు – అనెడి – వివాహంబు – అయ్యెన్.

**వ్యాఖ్య:** మూలఘటిక కేతన అష్టవిధవివాహాలను వరుసగా పరిచయం చేస్తున్నాడు. వాటిలో మొదటిది బ్రాహ్మ్య వివాహం.

ఉత్తముడూ యోగ్యుడూ అయిన వరుణ్ణి (తగు - వరునిన్) వెదికి, దొరికినట్లయితే అతడిని ఆహ్వానించి, కన్యనూ కన్యతోపాటుగా తగిన అలంకారాలనూ – ఆభరణాలనూ – నగలూ నట్రా ఇచ్చి నీటిని విడిచిపెడుతూ – ధారాపూర్వకంగా కన్యాదానం చేసి సంతోషంగా (వగవక) పెండ్లి చేయడమేదైతే ఉందో అది బ్రాహ్మ్యం అనే పేరుగల వివాహం అవుతుంది.

**96.** కం. **క్రతువునకు ఋత్విజుండై**
**సతతంబును మంత్రవిధులు సల్పి నతనికిన్**
**సుతఁ బెండ్లిసేయుటయు నీ**
**క్షితి దైవవివాహ మనఁగఁ గీర్తిత మయ్యెన్**

**అన్వయం:** ఈ – క్షితిన్, క్రతువునకున్ – ఋత్విజుండై – సతతంబును – మంత్రవిధులు – సల్పిన అతనికిన్ – సుతన్ – పెండ్లి – చేయుటయున్ – దైవవివాహము – అనఁగన్ – కీర్తితము – అయ్యెన్.

**వ్యాఖ్య:** యజ్ఞంలో ఋత్విక్కుగా ఉంటూ అది ముగిసేదాకా (సతతంబును) ఎల్లప్పుడు హోమవిధికి సంబంధించిన మంత్రాలు పఠిస్తూ ఆయా విధులను నిర్వర్తించే వ్యక్తికి యజమానుడు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేయడాన్నే దైవవివాహం అంటారు. ఆ విధంగా లోకంలో దైవవివాహం ప్రసిద్ధి పొందింది (కీర్తితము + అయ్యెన్).

**97.** కం. **మొదవులు రెం డుంకువగా**
**ముద మాఱఁగ నిచ్చి గుణసముత్సుకుఁడై యిం**
**పొదవంగఁ బెండ్లి యాడిన**
**నది యార్ష మనెడు వివాహ మయ్యె ధరిత్రిన్**

**అన్వయం:** ధరిత్రిన్ – రెండు – మొదవులు – ఉంకువగాన్ – ముదమాఱఁగన్ – ఇచ్చి, గుణసముత్సుకుఁడై – ఇంపు – ఒదవంగన్ – పెండ్లి – ఆడినన్ – అది – ఆర్షము – అనెడు – వివాహము – అయ్యెన్.

**వ్యాఖ్య:** ఆర్షవివాహం అని దేన్నంటారో చెప్తున్నాడు కేతన. కన్యాశుల్కంగా – కట్నంగా (ఉంకువగాన్) ఆడపిల్లవాళ్ళకి రెండు ఆవుల్ని (మొదవులు) ఇష్టపూర్వకంగా – ముదమారగా ఇచ్చి సద్గుణాలతో కూడిన ఔత్సుక్యం కలవాడైన వరుడు చక్కగా (ఇంపు + ఒదవంగన్) అమ్మాయిని పెండ్లి చేసుకొన్నట్లయితే అది ఈ ధరిత్రిన్ ఆర్షము అనెడు వివాహము అయ్యెన్.

**98. కం. అర్థంబుఁ గొనక వరునకుఁ**
**ప్రార్థనతో నిచ్చుటయును ప్రాజాపత్యం**
**బర్థించిన వరునకు సుత**
**నర్థముఁ గొని యిచ్చుటయును నాసుర మయ్యెన్**

**అన్వయం:** అర్థంబున్ – కొనక – వరునకున్ – ప్రార్థనతోన్ – ఇచ్చుటయును – ప్రాజాపత్యంబు; అర్థించిన వరునకున్ – సుతన్ – అర్థమున్ – కొని – ఇచ్చుటయునున్ – ఆసురము – అయ్యెన్.

**వ్యాఖ్య:** ఈ కందంలో రెండు వివాహాలకు నిర్వచనాలున్నాయి. 1. ప్రాజాపత్యం 2. ఆసురం. వివాహానికి సంబంధించి కట్నంగానో మరో రూపంగానో ఏ రకమైన ధనమూ తీసుకోకుండా వరుడికి కన్యను (సుతను) ప్రార్థనాపూర్వకంగా ఇచ్చి పెండ్లి జరిపిస్తే అది ప్రాజాపత్యవివాహం. అలా కాక అర్థించిన వరుడి దగ్గరనుండి కన్యాశుల్కాన్నిస్వీకరించి అతడికి కుమార్తెనిచ్చి వివాహం చేస్తే అది ఆసురమయ్యెన్.

**99. కం. రమణియు రమణుఁడు నొడఁబడి**
**తమలోపలఁ గూడి తల్లిదండ్రులు వెలిగా**
**సమయముఁ గైకొనియున్నను**
**గ్రమమున నా పెండ్లి పేరు గాంధర్వ మగున్**

**అన్వయం:** తల్లిదండ్రులు – వెలిగాన్ – రమణియున్ – రమణుఁడున్ – తమలోపలన్ – కూడి – ఒడఁబడి – సమయమున్ – కైకొని – ఉన్నను – క్రమమునన్ – ఆ పెండ్లి – పేరు – గాంధర్వము – అగున్.

**వ్యాఖ్య:** ప్రేయసీప్రియులు (రమణియు – రమణుఁడున్) తమ తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు భిన్నంగా లేదా వారిని దూరం పెట్టి (వెలిగాన్) తమలో తామే పరస్పరం ఇష్టపడి భార్యాభర్తలమనుకొనే ఒప్పందాన్ని (సమయమున్) చేసుకొన్నట్లయితే ఆ పెండ్లి పేరే గాంధర్వ వివాహం.

**100. కం. నెయ్యమున నడిగిపుచ్చుట
యియ్యకొనక యర్థమీక యీర్ష్యాపరుఁడై
కయ్యమున గెలిచి కన్యకఁ
గ్రయ్యంబడి చేసికొనిన రాక్షస మయ్యెన్**

**అన్వయం:** నెయ్యమునన్ – అడిగిపుచ్చుట – ఇయ్యకొనక – అర్థము – ఈక – ఈర్ష్యాపరుఁడై – కయ్యమునన్ – గెలిచి – క్రయ్యంబడి – కన్యకన్ – చేసికొనినన్ – రాక్షసము – అయ్యెన్.

**వ్యాఖ్య:** ఇదీ రాక్షస వివాహ పద్ధతి. స్నేహపూర్వకంగా అడిగితీసుకోవడానికి అంగీకరించే సమస్యే ఉండదు (ఇయ్యకొనక). కన్య తరఫువారికి కన్యాశుల్కంగా ధనమివ్వడం అంటే అదీ లేదు (అర్థమీక). పైగా ఈర్ష్యతో కూడినవాడై (ఈర్ష్యాపరుఁడై) ఆడపిల్లవైపు వారిమీద కయ్యానికి కాలుదువ్వి, యుద్ధం చేసి వాళ్ళందరినీ గెలిచి కన్యను బలవంతంగా (క్రయ్యంబడి) పెండ్లి చేసుకొంటే అది రాక్షస వివాహం.

**101. కం. గురుజను లెఱుఁగకయుండను
వెరవిడియై మినుకుఁ గట్టి వెళ్ళి చనువునన్
వరియింపఁ దగిన పురుషుఁడు
పరిణయ మగునేని నదియ పైశాచ మగున్**

**అన్వయం:** గురుజనులు – ఎఱుఁగక – ఉండను – వెరవిడియై – వెళ్ళి – చనువునన్ – మినుకుఁగట్టి – వరియింపన్ – తగిన – పురుషుఁడు – పరిణయము – అగునేనిన్ – అదియ – పైశాచము – అగున్.

**వ్యాఖ్య:** వాడు వరింపదగిన పురుషుడే. కాకపోతే – పెద్దలకు (గురుజనులకున్) తెలియకుండా మూర్ఖంగా (వెరవిడియై) వెళ్ళి, చనువుతీసుకొని మరీ తాళిబొట్టు (మినుకు) కడతాడు. అలా పరిణయమైతే దానిని పైశాచ వివాహం అంటారు.

**102. కం. జనకుఁడు తాతయు భ్రాతయుఁ
దనకులజుఁడు తల్లియును యథా క్రమమున నీఁ
జనవరు లగుదురు కన్యకు
మనమున దోషంబు లేక మనువారైనన్**

**అన్వయం:** మనమునన్ – దోషంబు – లేక – మనువారు +ఐనన్ – కన్యకున్ – జనకుఁడు – తాతయున్ – భ్రాతయున్ – తన కులజుఁడు – తల్లియునున్ – యథాక్రమమునన్– ఈన్ – చనవరులు – అగుదురు.

**వ్యాఖ్య:** వివాహ సందర్భంలో కన్యాదానం చేసే అధికారమూ చనువూ ఎవరెవరికి ఉందో – కన్యను దానంగా ఇవ్వడానికి (ఈన్) చనపరులెవరో చెప్తున్నాడు కేతన. మొదటి అధికారి – తండ్రి (జనకుఁడు). తండ్రి లేని పక్షంలో తాత. అతడూ లేకపోతే సోదరుడు (భ్రాతయున్). వీళ్ళు ముగ్గురూ లేకపోతే – తనకులంలో పుట్టినవాడు. ఆ తర్వాత తల్లి. వీళ్ళు యథాక్రమంలో కన్యకు దగ్గరివాళ్ళు (చనవరులు) అవుతారు. ఎప్పుడు అంటే – జీవించి ఉండాలి (మనువారు), మనసులో ఏ కపటమూ లేనివాళ్ళై ఉండాలి. అందుకే వీరికే ఆ కన్యను యోగ్యుడైన వరుడికి దానం చేసే హక్కూ, అధికారమూ ఉన్నాయి.

**103. కం.** **కన్నియఁ దగు వరునకు నీ**
**కున్నను నది యెన్ని ముట్టు లొనరఁగ నగుఁ దా**
**నన్నింట భ్రూణహత్యలు**
**పన్నుగఁ బ్రాపించునంత పాపము వచ్చున్**

**అన్వయం:** కన్నియన్ – తగు – వరునకున్ – ఈక + ఉన్ననున్ – అది – ఎన్ని – ముట్టులు – ఒనరఁగన్ – అగున్ – తాన్ – అన్నింటన్ – భ్రూణహత్యలు – పన్నుగన్ – ప్రాపించునంత – పాపము – వచ్చున్.

**వ్యాఖ్య:** ఆడపిల్ల పుష్పవతి కాకముందే తగిన వరుణ్ణి చూసి పెళ్ళిచేయాలట. అలా చేయకపోతే – ఆ కన్య ఎన్ని సార్లు ఋతుస్నాత అవుతుందో (ముట్టులు – ఒనరఁగన్ – అగున్) అన్ని భ్రూణహత్యలు ప్రాప్తింపజేసే పాపం కన్నవారికి లభిస్తుంది.

**104. కం.** **జనకుఁడు మొదలుగ నేవురుఁ**
**దగు వరునకు నిచ్చువారు దగ లేకున్నం**
**దనకును దగియెడు వరునిం**
**దనయంతన చేసికొనుట తగుఁ గన్నియకున్**

**అన్వయం:** (కన్నియన్) – తగు – వరునకున్ – జనకుఁడు – మొదలుగన్ – ఏవురున్ – ఇచ్చువారు. తగన్ – లేకున్నన్ – తనకును – తగియెడు – వరునిన్ – తన + అంతన – చేసికొనుట – కన్నియకున్ – తగున్.

**వ్యాఖ్య:** తగిన వరుణ్ణి చూసి కన్యను ఇచ్చి పెళ్ళి జరిపించడానికి తండ్రి (జనకుఁడు) మొదలైన ఐదుగురూ (ఏవురున్ – జనకుఁడు, తాత, భ్రాత, స్వకులజుడు, తల్లి) తగినవారు. వీరిలో ఎవరూ లేకపోయినా, ఉన్నా పూనుకొని వివాహం

జరిపించకపోయినా (తగ లేకున్నన్) కన్య తనకు తానుగా తగిన వరుణ్ణి ఎంచుకొని పెళ్ళి చేసుకోవడం తగిన పని.

**105. కం. ఇచ్చిన కన్యక మగుడం**
**బుచ్చుకొనుట చాల తప్పు పురుషునకును దాఁ**
**బుచ్చుకొనునేని నాతఁడు**
**మ్రుచ్చుక్రియన్ దండ్యుఁ డంద్రు మునివరు లెల్లన్**

**అన్వయం:** ఇచ్చిన – కన్యకన్ – మగుడన్ – పుచ్చుకొనుట – పురుషునకునున్ – చాల తప్పు. తాన్ – పుచ్చుకొనునేనిన్ – మునివరులు + ఎల్లన్ – ఆతఁడు – మ్రుచ్చుక్రియన్ – దండ్యుఁడు – అంద్రు.

**వ్యాఖ్య:** ఒకసారి నిశ్చితార్థం జరిగిందంటే, తాంబూలాలు పుచ్చేసుకుంటే కన్యాదానం జరిగినట్టే. అలా కన్యకను ఇచ్చి తర్వాత తిరిగి (మగుడన్) ఆ కన్యను తీసుకోవటం (పుచ్చుకొనుట) పెద్ద దోషం. అలా చేసిన పురుషుడు దొంగ కిందే లెక్క. దొంగకు (మ్రుచ్చు) ఏ రకమైన శిక్షలను విధిస్తారో అవే శిక్షలు ఇతడికీ వెయ్యాలట. అటువంటివాడు అలా దండించదగినవాడు (దండ్యుఁడు) అవుతాడని మునిశ్రేష్ఠులు (మునివరులు) అంటుంటారట.

**106. చం. ఒకనికిఁ గూఁతు నిచ్చి తగ నుంకువ గైకొని పెండ్లిసేయ ను**
**త్సుకమతి నున్నచోట గుణశోభితుఁ డొక్కఁడు వచ్చెనేనియుం**
**బ్రకటితదోషముల్ మొదలి భర్తపయిం గలవేనిఁ దండ్రి క**
**న్యక గుణవంతుఁ డైనపతి కచ్చుగ నిచ్చుట ధర్మ మెమ్మయిన్**

**అన్వయం:** తగన్ – ఉంకువన్ – కైకొని – పెండ్లి – చేయన్ – ఒకనికిన్ – కూఁతున్ – ఇచ్చి – ఉత్సుకమతిన్ – ఉన్నచోటన్ – గుణశోభితుఁడు – ఒక్కఁడు – వచ్చెనేనియున్ – మొదలిభర్తపయిన్ – ప్రకటిత – దోషముల్ – కలవేనిన్ – తండ్రి – కన్యకన్ – గుణవంతుఁడైన – పతికిన్ – అచ్చుగన్ – ఇచ్చుట – ఎమ్మెయిన్ – ధర్మము.

**వ్యాఖ్య:** వివాహ సందర్భాలలో ఒప్పందాల కన్నా కన్యక జీవితం ముఖ్యం అని తెలియజేసే ధర్మమిది. ముందుగా ఒక వరుడికి కుమార్తెను నిశ్చయపరిచి (ఇచ్చి), అందుకు ప్రతిగా కన్యాశుల్కం (ఉంకువ) తీసుకొని, వాళ్ళిద్దరికీ పెండ్లిచేసే ఔత్సుక్యంతో ఉన్న సందర్భంలో – తీరా ఆ వరుడిలో (మొదలిభర్తపయిన్) స్పష్టమైన దోషాలు (ప్రకటిత దోషముల్) కన్పిస్తే – ఇంకెవరైనా గుణాలతో శోభిల్లే

వరుడు ఆ అమ్మాయిని చేసుకుంటానని ముందుకు వస్తే – కన్యకను ఈ గుణవంతుడికి ఇచ్చి చేయటమే ధర్మం. ఆ గుణవంతుడైన పతికే శాశ్వతంగా అచ్చంగా (అచ్చుగన్) ఇవ్వటం ధర్మమని చెప్తున్నాడు కేతన.

**107. సీ.** **ఒక్క కన్నియకును నుంకువెల్లను బెట్టి**
**వడి మూడుముళ్లును బడకమున్నె**
**యంతకాలయమున కరిగిన నాతని**
**తమ్ముని నక్కన్యఁ దగవుదోఁప**
**వరియింప నీఁదగు వానికిఁ బ్రాయంబు**
**చాలదేనియుఁ దగ నాలిఁగాఁగఁ**
**జెలియలి నీఁదగు జెలియలిఁ బెండ్లాడ**
**నతనికి నిచ్చలేదయ్యెనేని**

**ఆ.వె.** **పెద్ద లెఱిఁగి మున్నుపెట్టిన యుంకువ**
**యెనయఁ గ్రమ్మఱంగ నీఁగి పాడి**
**యంద్రు సన్మునీంద్రు లరయంగ నయ్యాజ్ఞ**
**వల్క్యయోగి యట్లె పలికియుంట**

**అన్వయం:** ఆ + యాజ్ఞవల్క్య – యోగి – అట్లు + ఎ – పలికి – ఉంటన్ – ఒక్క – కన్నియకునున్ – ఉంకువ + ఎల్లను – పెట్టి, వడిన్ – మూడుముళ్ళును పడకమున్నె – అంతక + ఆలయమునకున్ – అరిగినన్ – ఆతని – తమ్మునిన్ – తగవు – తోఁపన్ – ఆ – కన్య – వరియింపన్ – ఈన్ – తగున్. వానికిన్ – ప్రాయంబు – చాలదు + ఏనియున్ – తగన్ – చెలియలిన్ – ఆలిన్ – కాఁగన్ – ఈన్ – తగున్. చెలియలిన్ – పెండ్లాడన్ – అతనికిన్ – ఇచ్చ – లేదు + అయ్యెనేనిన్, పెద్దలు – ఎఱఁగి – మున్ను – పెట్టిన – ఉంకువన్ – ఎనయన్ – క్రమ్మఱంగన్ – ఈఁగి – అరయంగన్ – పాడి – (అని) సత్ + మునీంద్రులు అంద్రు.

**వ్యాఖ్య:** వివాహం చేసుకునే వరుడుగానీ వరుడు తరపువాళ్ళుగానీ – కన్యాదాతకు – పిల్ల తండ్రికి ఇచ్చే శుల్కం – కన్యాశుల్కం. దీనిని ఉంకువ అంటారు. ఒకసారి ఉంకువ పుచ్చుకొని వివాహం జరిపించలేని సందర్భం వస్తే తగువుల్లేకుండా చేసే సర్దుబాటు ఈ పద్యంలో ఉంది.

ఒకడు ఒక కన్యకోసం ఉంకువ సమర్పించాడు. తీరా అలా ఇచ్చాక ఆ

మూడు ముళ్ళు పడకముందే వీడు కాస్తా గుటుక్కుమన్నాడు. యమపురికి (అంతకాలయమునకున్) వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఉంకువ సొమ్ము పరిస్థితి ఏమిటి? అంటే అదే ఉంకువ మీద, అలా చనిపోయినవాడి తమ్ముడికైనా ఆ కన్యనిచ్చి పెండ్లి చేయవచ్చు (ఈఁదగున్). వాడికి తగిన వయసు లేకపోతే – అదే వరుడికి – అదే వధువు చెల్లెలు ఉంటే ఆమెనిచ్చి అదే ఉంకువకింద పెళ్ళి జరిపించవచ్చు. చనిపోయినవాడి తమ్ముడికి ఆ చెల్లెల్ని చేసుకోవడానికి ఇష్టం లేకపోతే – ఇక చేసేదేముంది? పెద్దల సమక్షంలో – అంతకు ముందు ఇచ్చిన ఉంకువ సొమ్మును యథావిధిగా తిరిగి ఇవ్వటం న్యాయం (క్రమ్మఱంగ నీఁగిపాడి). అని ఉత్తములైన మహర్షులు (సత్+మునీంద్రులు) అంటారు. అంతేకాదు పరిశీలిస్తే యాజ్ఞవల్క్య మహర్షి కూడా తన స్మృతిగ్రంథంలో చెప్పింది ఇదే.

**108. కం. చెప్పక చూపక కలిగిన**
**యొప్పని దోషములు కన్యయొడలఁ గలుగగాఁ**
**జెప్పక యిచ్చుట జనకుని**
**తప్పుత్తమసాహసంబు దండుగ దగులున్**

**అన్వయం:** కన్య – ఒడలన్ – చెప్పక – చూపక, కలిగిన – ఒప్పని దోషములు – కలుగగాన్ – చెప్పక – ఇచ్చుట – జనకుని – తప్పు. ఉత్తమసాహసంబు. దండుగ – తగులున్.

**వ్యాఖ్య:** కన్యకు ఏమైనా శారీరక లోపాలు ఉంటే అలాగే ఏవైనా తగని దోషాలు (ఒప్పనిదోషములు) ఉంటే వాటిని చెప్పకుండా చూపకుండా దాచిపుచ్చి కన్యనిచ్చి పెండ్లి చేయటం పిల్లతండ్రికి తగదు. అది దోషం. అంతే కాదు పెద్ద సాహసమే. దాని వల్ల ఎంతో అనర్థం కలుగుతుంది (దండుగ తగులున్). పెద్దమొత్తం దండుగుగా చెల్లించవలసి ఉంటుంది.

**109. కం. దోషరహితకన్యకపై**
**దోషంబులు గట్టి రిత్త దూషించిన యా**
**దూషకుని నూఱుమదుఁగులు**
**దోషానుగుణముగ భూపతులు గొనవలయున్**

**అన్వయం:** దోష – రహిత – కన్యకపైన్ – దోషంబులు – కట్టి – రిత్తన్ – దూషించిన – ఆ – దూషకుని – దోష + అనుగుణముగన్ – నూఱుమదుఁగులు – భూపతులు – కొనవలయున్.

**వ్యాఖ్య:** ఏ దోషమూ లేని (దోషరహిత) కన్యకపై ఆ దోషం ఈ దోషం అంటగట్టి ఉత్తినే వృధాగా (రిత్తన్) ఆమెను దూషిస్తే – అలా దూషించినవాడి (దూషకుని) దూషణ దోషానికి తగిన విధంగా రాజులు (భూపతులు) నూఱు రెట్లు (మడుగులు) సొమ్ము వాడినుంచి జరిమానాగా వసూలు చేయాలి.

**110. కం.** **పరపూర్వ లయిన కాంతల**
**వరియింపఁగఁ దగదు దానఁ బాపము దగులుం**
**బరపూర్వ రెండు దెఱఁగులఁ**
**జరియించుఁ బునర్భు వనఁగ స్వైరిణి యనఁగన్**

**అన్వయం:** పరపూర్వలు + అయిన – కాంతలన్ – వరియింపఁగన్ – తగదు. దానన్ – పాపము – తగులున్. పునర్భువు – అనఁగన్, స్వైరిణి – అనఁగన్ – రెండు – తెఱఁగులన్ – పరపూర్వ – చరియించున్.

**వ్యాఖ్య:** రెండో వివాహం చేసుకొన్న స్త్రీలను పరపూర్వలు అంటారు. వీరిని ఎట్టి పరిస్థితుల్లోనూ మరొకడు పెళ్ళి చేసుకోకూడదు. దానివల్ల పాపం చుట్టుకుంటుంది. ఈ పరపూర్వలు రెండు రకాలు – 1) పునర్భువు (మారుమనువు స్త్రీ, పునర్భువు, దిధుషువు) 2) స్వైరిణి – జారిణి.

**111. కం.** **మగఁ డీల్గఁ గన్య పెండిలి**
**యగునేనియు నది పునర్భువగు స్వైరిణినాఁ**
**దగు మగని విడిచి వేఱొక**
**మగనిఁ దగిలి లజ్జలేక మనియెడునేనిన్**

**అన్వయం:** మగఁడు – ఈల్గన్ –పెండిలి – అగునేనియున్ – కన్య – అది – పునర్భువు + అగున్. మగనిన్ – విడిచి – వేఱొక – మగనిన్ – తగిలి – లజ్జలేక – మనియెడునేనిన్ – స్వైరిణి – నాన్ – తగున్.

**వ్యాఖ్య:** భర్త మరణించగా (ఈల్గన్) మళ్ళీ పెళ్ళి చేసుకున్న స్త్రీ (కన్య) పునర్భువు. భర్త బతికి ఉండగానే విడిచిపెట్టి వేరొక మగవాణ్ణి తగులుకొని సిగ్గులేకుండా (లజ్జలేక) జీవించే స్త్రీ – స్వైరిణి.

**112. చం.** **వెడలఁగనీక గొంది నిడి వేయు విధంబుల భంగపెట్టుచున్**
**జడకలు గట్ట నిచ్చి నిజసంపదకుం జొరనీక నిచ్చలుం**
**గడియెఁడు కూడుపెట్టుచును గాసి యొనర్చుచు నేలతెంకిపై**
**నిడుగడ సేయఁగావలయు నీలువుమాలిన అంకుటాంగ్రకున్**

**అన్వయం:** ఈలువుమాలిన – అంకుటాండ్రకున్, వెడలఁగనీక – గొందిన్ – ఇడి, వేయు విధంబులన్ – భంగపెట్టుచున్, జడకలు – కట్టనిచ్చి, నిజసంపదకున్, చొరనీక, నిచ్చలున్ – కడియెఁడు – కూడు – పెట్టుచునున్ – గాసి – ఒనర్చుచున్ – నేలతెంకిపైన్ – ఇడుగడ – చేయఁగావలయున్.

**వ్యాఖ్య:** స్వైరిణి గురించి చెబుతున్నాడు. కులాచారాలను భ్రష్టుపట్టించి – శీలం విడిచిపెట్టి (ఈలువు మాలిన) చెడ్డనడవడికతో పాతివ్రత్యానికి భంగం కలిగించిన స్త్రీలకు (అంకుటాండ్రకున్) ఎటువంటి శిక్ష విధించాలో కొంచెం కఠినంగానే చెప్తున్నాడు కేతన (ఈలువుటాలు = పతివ్రత. ఈలువుమాలిన అంకుటాలు = కులట). వారిని వంటింటికే (గొంది) పరిమితం చేయ్యాలట లేదా ఒకమూల (గొంది) ఉంచాలట. బయటికి రానివ్వకూడదు (వెడలఁగనీక). రకరకాలుగా అవమానానికి గురిచెయ్యాలిట (భంగపెట్టుచున్). చిరిగిపోయిన వస్త్రాలనే (జడకలు) కట్టుకోడానికి ఇవ్వాలట. సొంత సొమ్ములను (నిజసంపదకున్) ధరించడం గానీ, అనుభవించటం కానీ చెయ్యనివ్వకూడదు. ఆమెదే అయినా ఆ సంపదలవైపూ సుఖాలవైపూ వెళ్ళనివ్వకూడదు (చొరనీకన్). ఇలా చేస్తూ నిత్యమూ (నిచ్చలున్) ఒక్కముద్ద మాత్రమే (కడియెడు) ఆహారం పెట్టి దుఃఖించేలా చేయాలి. నేలనే ఆమెకు శయనస్థానంగా (తెంకి > టెంకి) నియమించాలి. ఇదీ శిక్ష.

**113. కం. ఉత్తమసతి శూద్రులతోఁ**
**జిత్తజసుఖకేలి వాంఛఁ జేసినఁ బ్రాయ**
**శ్చిత్తమున శుద్ధిఁబొందును**
**గత్తరి పురుషునకుఁ బాయు గర్భంబైనన్**

**అన్వయం:** ఉత్తమసతి – శూద్రులతోన్ – చిత్తజసుఖకేళి – వాంఛన్ – చేసినన్ – ప్రాయశ్చిత్తమునన్ – శుద్ధిన్ – పొందును. గర్భంబు + ఐనన్ – గత్తరి – పురుషునకున్ – పాయున్.

**వ్యాఖ్య:** ఉత్తమురాలైన ఇల్లాలికి (ఉత్తమ సతి) శూద్రుల మీద – అంటే పరపురుషుల మీద మనసైతే, మన్మథ సుఖక్రీడ జరపాలి అనే కోరిక కలిగితే (వాంఛ చేసినన్) అది కేవలం కోరికగానే మానసిక దశలోనే ఆగిపోతే పశ్చాత్తాపంతో సరి. శారీరకం కూడా అయితే – కలయిక జరిగితే – ఋతుస్నానంతో శుద్ధి. అదే ప్రాయశ్చిత్తంగా ఆమె శుద్ధి పొందుతుంది. నెల తప్పి, శుద్ధి పొందే అవకాశమే లేక గర్భం ధరిస్తే (గర్భంబైనన్) ఆ దుష్టురాలు – ఆ గత్తరి ఇల్లాలు తన భర్తకు దూరం అవుతుంది (పురుషునకున్ పాయున్). అంటే మగడు ఆమెను విడిచిపెట్టవచ్చునని.

యాజ్ఞవల్క్య స్మృతిలో లేదుగానీ మితాక్షరవ్యాఖ్యలోని విజ్ఞానేశ్వరుడి వృత్తివాక్యాలే ఈ పద్యానికి మూలం. **వ్యభిరాత్తుపురుషాంతర పరిభోగ సంకల్పాద్యః పుణ్యాంతస్తస్య ఋతౌ రజోదర్శనాత్ శుద్ధిః. శూద్రకృతే తు గర్భో త్యాగః** (సంస్కృత విజ్ఞానేశ్వరీయము ఆ. 71).

**114. మ. సురసేవించిన వాతివాఁడియయినన్ సొమ్మెల్లఁ బోనాడినం**
**బురుష ద్వేషిణియైన గొడ్డయిన నెప్డుం గూఁతులం గన్న మైఁ**
**బరపౌ రోగము లున్న ధూర్తయయినన్ భార్యం బెడం బాసి య**
**ప్పురుషుం డొండొకపెండ్లియాడినను నొప్పుం దప్పు లేదేమియున్**

**అన్వయం:** సురసేవించినన్, వాతివాఁడియయినన్, సొమ్ము + ఎల్లన్ – పోనాడినన్, పురుషద్వేషిణి – ఐనన్, గొడ్డు + అయినన్, ఎప్డున్ – కూఁతులన్ – కన్నన్, మైన్ – పరపౌ – రోగములు – ఉన్నన్, ధూర్త – అయినన్, భార్యన్ – పెడన్ – పాసి – ఆ – పురుషుండు – ఒండు + ఒక – పెండ్లి – ఆడినను – ఒప్పున్ – తప్పు – లేదేమియున్.

**వ్యాఖ్య:** ఈ దుర్గుణాలు గల స్త్రీని విడిచిపెట్టి పురుషుడు వేరే పెళ్ళి చేసుకోవచ్చు.

మద్యపానం, వాక్పారుష్యం (వాయి = నోరు–వాతి–వాఁడి) – నోటి దురుసుదనంతో అప్రియోక్తులు పలకడం (అప్రియంవదా అని మూలం), సంపదనంతా దుబారాగా ఖర్చుపెట్టడం (సొమ్మెల్లన్ పోనాడు), పురుషద్వేషిణి – భర్తంటే పడకపోవడం, గొడ్రాలితనం – వంధ్యాత్వం, ఎప్పుడూ – ఎన్ని కాన్పులైనా ఆడపిల్లలనే ప్రసవించటం, దీర్ఘరోగాలు (పరపౌ రోగములు) కలిగి ఉండటం, దుర్మార్గురాలు కావటం (ధూర్త). ఇవీ అవలక్షణాలు. ఈ లక్షణాలు కనక భార్యలో ఉంటే ఆ భార్యను విడిచిపెట్టి (పెడన్ పాసి) పురుషుడు మళ్ళీ పెండ్లి చేసుకొన్నా ఒప్పేకానీ తప్పు ఎంతమాత్రం కాదు.

దీనికి మూలం యాజ్ఞవల్క్యస్మృతిలో ఇలా ఉంది.

**సురాపీ వ్యాధితా ధూర్తా వంధ్యార్థ ఘ్న్యప్రియంవదా**
**స్త్రీ ప్రసూశ్చాధివేత్తవ్యా పురుషద్వేషిణీ తథా (యా. ఆ. 3)**

**115. కం. పంచినపని వెరవునఁ గా**
**వించుట సత్పుత్త్రుఁ గనుట వినయముతో భా**
**షించుట గలిగిన సతి వ**
**ర్జించి పయిం బెండ్లి యాడఁ జెల్లదు పతికిన్**

**అన్వయం:** పంచిన – పని – వెరవునన్ – కావించుట, సత్ – పుత్త్రున్ – కనుట,

వినయముతోన్ – భాషించుట – కలిగిన – సతిన్ – వర్జించి – పయిన్ – పెండ్లి ఆడన్ – పతికిన్ – చెల్లదు.

**వ్యాఖ్య:** ఇంతకుముందు పద్యంలో దుర్గుణాలుగల భార్యను విడిచి పెట్టడం తప్పుకాదని చెప్పినట్లే ఇప్పుడు సద్గుణవతి అయిన భార్యను విడిచిపెట్టి మారుపెళ్ళి (పయింబెండ్లి) చేసుకోవడం తప్పనీ స్పష్టంగా చెప్తున్నాడు కేతన ఈ పద్యంలో. అయితే ఆ ఉత్తమసతికి ఉండవలసిన లక్షణాలివి. 1) చెప్పిన పనిని లేదా అప్పగించిన పనిని ఉపాయంతో (వెరవునన్) చక్కగా చేయడం –పూర్తిచేయటం 2) మంచి కుమారుడికి (సత్పుత్త్రున్) జన్మనివ్వటం 3) ఎప్పుడూ వినయ పూర్వకంగా ఒద్దికగా మాట్లాడటం. ఈ మూడూ కలిగిన సతిని విడిచిపెట్టి (వర్జించి) భర్త (పతి) తర్వాతి పెండ్లి (పయింబెండ్లి) చేసుకోవడం తగనిపని.

**116. కం. పతి యున్నను పతి చచ్చిన**
**నితరులఁ దాఁ బొందకున్న యీలువుటా లీ**
**క్షితిఁ గీర్తియుఁ బిమ్మటఁ బా**
**ర్వతితోడ సఖీత్వమును ధ్రువంబుగఁ బడయున్**

**అన్వయం:** పతి – ఉన్నను, పతి – చచ్చినన్ – ఇతరులన్ – తాన్ – పొందక + ఉన్న – ఈలువు + ఆలు, ఈ – క్షితిన్ – కీర్తియున్ – పిమ్మట – పార్వతితోడన్ – సఖీత్వమును – ధ్రువంబుగన్ – పడయున్.

**వ్యాఖ్య:** ఈలువు అంటే శీలం, కులాచారం, అభిమానం, గౌరవం ఇలా చాలా అర్థాలున్నాయి. వాటిని కాపాడుతూ పతియందే వ్రతం కలది పతివ్రత (ఈలువుటాలు). పతి – బతికి ఉన్నా, మరణించినా సరే ఇతరులతో సంగమించని (తాన్ – పొందకున్న) పతివ్రతాశిరోమణి ఈ భూమిపై (క్షితిన్) గొప్ప కీర్తిని పొందుతుంది. ఇది ఇహలోకలాభం అయితే – పరలోకంలో ఈమెకు మరో లాభం ఉంది. అదేమిటంటే సాక్షాత్తు పార్వతీదేవితో సఖీత్వం – నేస్తురాలు కావటం. ఈ భాగ్యమూ కచ్చితంగా (ధ్రువంబుగన్) కలుగుతుంది. దీనినే యాజ్ఞవల్క్య స్మృతి ఈ విధంగా చెప్పింది.

**మృతే జీవతి వా పత్యౌ యా నాన్య ముపగచ్ఛతి**
**సేహ కీర్తి మవాప్నోతి మోదతే చ మయా సహ** (యా. ఆ. **75**)

**117. కం. పతి పంచినంత సేయుట**
**పతి పతితుం డైనఁ బాసి ప్రాయశ్చిత్తం**

**బతఁ డొనరించినఁ గ్రమ్మఱఁ**
**బతిఁ గూడుట ధర్మమండ్రు పత్నుల కెల్లన్**

**అన్వయం:** పతి – పంచిన + అంత – చేయుట, పతి – పతితుండు + ఐనన్, పాసి, ప్రాయశ్చిత్తంబు – అతఁడు – ఒనరించినన్ – క్రమ్మఱన్ – పతిన్ – కూడుట – ఎల్లన్ – పత్నులకున్ – ధర్మము – అండ్రు.

**వ్యాఖ్య:** ఈ పద్యమూ భార్యాధర్మాలకు సంబంధించిందే. భర్త (పతి) చెప్పింది చేయటం. ఏదైనా ఒక పనిని చేయమని పురమాయిస్తే దానిని చెప్పినంతవరకే (పంచిన + అంత) చేయటం. సొంత పెత్తనాలు, చూసిరమ్మంటే కాల్చివచ్చేరకాలు చేయకూడదని. ఇది ఒక ధర్మం. ఇక రెండోది. భర్త పతితుడై – అన్యస్త్రీ సమాగమంవల్ల గానీ కులాచార భ్రష్టత్వంవల్ల గానీ చెడిపోయినప్పుడు భార్య అతడిని విడిచిపెడితే – అలా విడిచిపెట్టినప్పుడు ఆ భర్త ప్రాయశ్చిత్తం గనక చేసుకొంటే – మళ్ళీ అతగాడిని తిరిగి (క్రమ్మఱన్) భర్తగా అంగీకరించి, అతడితో కాపురం చేయటం (పతిన్ కూడుట) కూడా భార్యకు ధర్మమే.

**118. కం.** **చాలం బుత్త్రులు గల్గిన**
**యాలిపయిం బెండ్లియాడు నప్పుడు దాఁ బె**
**ద్దాలికిని ధనము మూఁడవ**
**పాలిచ్చుట ధర్మమండ్రు భర్తల కెల్లన్**

**అన్వయం:** ఎల్లన్ – భర్తలకున్ – ఆలిన్ – పయిన్ – పెండ్లియాడు + అప్పుడు – తాన్ – చాలన్ – పుత్త్రులు – కల్గిన – పెద్ద + ఆలికిని – మూఁడవపాలు – ధనము – ఇచ్చుట – ధర్మము + అండ్రు.

**వ్యాఖ్య:** ఇది ప్రాచీన భారతీయ న్యాయశాస్త్రం. వివాహ సందర్భాలలో నియమనిబంధనలు, అర్హతలు, హక్కులు, బాధ్యతలు, ప్రవర్తనా నియమావళి ఇవన్నీ వరుసగా చెప్పుకొస్తూ ఇప్పుడు ఒక భార్య ఉండగా మరో పెళ్ళి చేసుకొనే సందర్భంలో భర్త ధనాన్ని ఎలా పంచాలి అన్న విషయంలో పాటించవలసిన ధర్మాలను చెప్తున్నాడు కేతన ఈ పద్యంలో. ఈ నియమం భర్తలందరికీ (భర్తలకెల్లన్) వర్తిస్తుంది. అంటే అన్ని వర్ణాల వారికీనని.

చాలామంది కొడుకులు (పుత్త్రులు) కలిగిన భార్య (ఆలి) ఉండగానే భర్త మరో పెళ్ళి – మీది పెళ్ళి (పయింబెండ్లి) చేసుకొనేటప్పుడు ఆ భర్త – అంతకుముందు తనకు ఉన్న పెద్ద భార్యకు (పెద్దాలి) తన సొమ్ములో – ఆస్తిలో మూడోవంతు ఇవ్వడం ధర్మం అని పెద్దలు చెప్తున్నారు.

**119. కం. మున్ను వివాహము సేయని**
**కన్నియ యొరుఁ గలిసెనేని క్షతయగు మగపొం**
**దెన్నఁడులేక విధవయగు**
**కన్నియ యక్షతసమాఖ్య గలిగి చరించున్**

**అన్వయం:** మున్ను – వివాహము – చేయని – కన్నియ – ఒరున్ – కలిసెనేనిన్ – క్షత – అగున్, మగపొందు – ఎన్నఁడున్ – లేక – విధవ – అగు – కన్నియ – అక్షత – సమాఖ్య – కలిగి – చరించున్.

**వ్యాఖ్య:** ముందు (మున్ను) పెళ్ళిచేసుకోని కన్య - అవివాహిత - పురుషుడితో సమాగమిస్తే ఆ కన్యను క్షత అంటారు (క్షత – భ్రష్టురాలు, నాశనం చెందినది). అసలు జీవితంలో మగడి పొందుకు ఎంతమాత్రమూ నోచుకోకుండానే విధవరాలై పోయిన కన్య 'అక్షత'. ఇలా వీళ్ళిద్దరూ ఈ ఈ పేర్లతో (సమాఖ్యన్) వర్తిల్లుతూ ఉంటారు.

**120. ఉ. పుత్త్రులు లేరు నాకు నిది పుత్త్రిక దీని నలంకరించి నీ**
**క్షేత్రముగాఁగ నిచ్చెద నకిల్బిషమానస! నీకు దీనికిం**
**బుత్త్రుఁడు పుట్టఁగా నతఁడు పుత్త్రుఁడు నాకని పల్కి కొన్న యా**
**పుత్త్రుఁడు నౌరసుండు సరిపుత్రుల నెల్లను బెద్ద లిద్దఱున్**

**అన్వయం:** నాకున్ – పుత్రులు – లేరు. ఇది – పుత్త్రిక. దీనిన్ – అలంకరించి – నీ – క్షేత్రము – కాఁగన్ – ఇచ్చెదన్. అకిల్బిష మానస! దీనికిన్ – నీకున్ – పుత్త్రుఁడు – పుట్టఁగాన్ – అతఁడు – నాకున్ – పుత్త్రుఁడు – అని – పల్కి – కొన్నన్ – ఆ పుత్త్రుఁడును – ఔరసుండు – ఎల్లను – సరిపుత్రులన్ – ఇద్దఱున్ – పెద్దలు.

**వ్యాఖ్య:** పుత్రికాపుత్రుడు గురించి చెప్తున్నాడు కేతన ఈ పద్యంలో. నాకు కొడుకులు లేరు. ఉన్నది కూతురే. ఇదుగో ఆ కూతురిని చక్కగా అలంకరించి నీకు భార్యకాగా (క్షేత్రముకాఁగన్) ఇస్తాను. ఓ పుణ్యమనస్కుడా (అకిల్బిషమానస)! నా కూతురికీ నీకూ ఒక పుత్త్రుడు కలిగితే అతడే నాకు పుత్త్రుడు అని చెప్పిమరీ స్వీకరించిన పుత్త్రుణ్ణి పుత్రికాపుత్రుడు అంటారు. అన్నిరకాలైన పుత్రులలోనూ (సరిపుత్రులన్ – ఎల్లన్) ఔరసుడూ, ఈ పుత్రికాపుత్త్రుడు వీళ్ళిద్దరే అధికులు (పెద్దలు).

**121. కం. సారపు నిజవంశంబునఁ**
**జేరి వివాహంబు తనకుఁ జేసిన పతియం**
**దారఁగఁ బుట్టిన పుత్త్రుం**
**డౌరసుఁ డనఁ బరగు నాతఁ డధికుం డెందున్**

**అన్వయం:** సారము + నిజ – వంశంబుననన్ – చేరి – తనకున్ – వివాహంబు – చేసిన – పతి యందున్ – ఆరఁగన్ – పుట్టిన – పుత్త్రుండు – ఔరసుఁడు – అనన్ – పరగున్. ఆతఁడు – ఎందున్ – అధికుండు.

**వ్యాఖ్య:** మంచి ప్రసిద్ధి కలిగిన తన వంశంలో (సారపు - నిజవంశంబునన్) పుట్టినవాడికిచ్చి పెద్దలు కులగోత్రాది యోగ్యతలు వీక్షించి మరీ వివాహం చేస్తే ఆ సతికీ ఆ పతికీ ఇంపుగా పుట్టిన పుత్రుడిని ఔరసుడు అంటారు. ఇతడే అన్నింటా గొప్పవాడు (అధికుండు).

**122. కం.** **తన గోత్రము నతఁ డొండెను**
**దనవంశము నాతఁ డొండెఁ దగ నియతుండై**
**తన పత్నికిఁ బుట్టించిన**
**తనయుఁడు క్షేత్రజుఁ డనంగ ధరణిం బరగున్**

**అన్వయం:** ధరణిన్ – తన గోత్రము + అతఁడు – ఒండెను, తన – వంశము + ఆతఁడు – ఒండెన్ – తగన్ – నియతుండై – తన – పత్నికిన్ – పుట్టించిన – తనయుఁడు – క్షేత్రజుఁడు – అనంగన్ – పరగున్.

**వ్యాఖ్య:** తన గోత్రం వాడినో లేదా తన వంశం వాడినో ఒకడిని మగడే స్వయంగా నియోగించి – వాడితో తన ఇల్లాలు పుత్రుణ్ణి కనేలా చేస్తే – అలా పుట్టిన కుమారుడు (తనయుఁడు) క్షేత్రజుడు అని ఈ భూమిపై (ధరణిన్) వ్యవహరింపబడతాడు.

**123. కం.** **ధనము గలదు పుత్త్రులు లే**
**రని యాసం జూపి యొరుని యాత్మజుఁ దా నే**
**ర్పున వెడ్డు వెట్టి తగఁ జే**
**కొనెనేనియుఁ గృత్రిమంపుఁ గొడు కాతనికిన్**

**అన్వయం:** ధనము – కలదు. పుత్త్రులు – లేరు. అని – ఆసన్ – చూపి, ఒరుని – ఆత్మజున్ – తాన్ – నేర్పునన్ – వెడ్డు + పెట్టి – తగన్ – చేకొనెనేనియున్ – ఆతనికిన్ – కృత్రిమంపు – కొడుకు.

**వ్యాఖ్య:** కేతన కృత్రిముడు అనే పుత్రభేదాన్ని చెప్తున్నాడు. ధనవంతుడైన వ్యక్తి – నా దగ్గర చాలా ధనం ఉంది కానీ పుత్త్రులులేరు అని చెప్పి ధనాన్ని ఆశగా చూపి, ఇతరుడి (ఒరుని) కుమారుణ్ణి (ఆత్మజున్) తాను నేర్పుతో వంచించి (వెడ్డువెట్టి) స్వీకరిస్తే అలా స్వీకరింపబడిన పుత్త్రుడు స్వీకరించినవాడికి కృత్రిముడనే పేరుకల పుత్త్రుడౌతాడు.

**124. కం. కానీనుం డగుఁ గన్యా**
**సూనుఁడు మాతామహునకు సుతుఁ డండ్రతనిన్**
**వాని జనని యొరునకు నా**
**లైనను వాఁ డతని పుత్త్రుఁ డగు నిక్కముగన్**

**అన్వయం:** కన్యాసూనుఁడు – కానీనుండు + అగున్, మాతామహునకున్ – అతనిన్ – సుతుఁడు – అండ్రు. వాని – జనని – ఒరునకున్ – ఆలు + ఐనను – నిక్కముగన్ – వాఁడు – అతని – పుత్త్రుఁడు – అగున్.

**వ్యాఖ్య:** వివాహం కాని కన్యకు పుట్టిన పుత్త్రుణ్ణి కానీనుడు అని వ్యవహరిస్తారు. ఈ కానీనుడు ఆ కన్య తండ్రికి (మాతామహునకున్) సుతుడు ఔతాడని అంటారు. ఆ కానీనుడి తల్లి (జనని) తరవాతెప్పుడో వేరొకడిని పెళ్ళి చేసుకొని అతడికి ఇల్లాలై వెళ్ళిపోయినా – ఈ కానీనుడు నిక్కచ్చిగా (నిక్కముగన్) ఆ తాతగారి పుత్రుడే అవుతాడు. కానీనుడి ఆలనాపాలనా కన్యాజనకుడి బాధ్యత అని.

**125. కం. మగని దిగవిడిచి యొండెను**
**మగఁ డీల్గిన నొండె వేఱుమగనికి నాలై**
**తగఁగనిన సుతుఁడు రెండవ**
**మగనికిఁ బౌనర్భవాఖ్య మహిఁ బుత్త్రుఁ డగున్**

**అన్వయం:** మహిన్ – మగనిన్ – దిగవిడిచి – ఒండెన్, మగఁడు – ఈల్గినన్ – ఒండెను, వేఱుమగనికిన్ – ఆలై, తగన్ – కనిన – సుతుఁడు – రెండవ – మగనికిన్ – పౌనర్భవ + ఆఖ్యన్ – పుత్త్రుఁడు – అగున్.

**వ్యాఖ్య:** ఎవడు పౌనర్భవుడో చెబుతున్నాడు కేతన.

భర్తను తానే విడిచిపెట్టిన స్త్రీ గానీ, భర్త మరణించగా (ఈల్గినన్) విధవ అయిన ఒక స్త్రీ గానీ (ఒండెన్), వేరేవాడికి భార్యయై రెండో భర్తద్వారా ఒక కుమారుణ్ణి కంటే – ఆ సుతుడు రెండవ భర్తకు పౌనర్భవుడనే పేరుగల పుత్త్రుడుగా మహిలో చెల్లుబాటవుతాడు.

**126. కం. పుత్త్రార్థముగా నడిగినఁ**
**బుత్త్రులు గలయాతఁడాత్మ పుత్త్రునిఁ దనకుం**
**బుత్త్రునిఁగా నిచ్చిన యా**
**పుత్త్రుఁడు దనకెందు దత్త పుత్త్రుం డయ్యెన్**

**అన్వయం:** పుత్త్ర + అర్థముగాన్ – అడిగినన్ – పుత్త్రులు – కల – ఆతఁడు – ఆత్మ

— పుత్తునిన్ — తనకున్ — పుత్తునిఁగాన్ — ఇచ్చిన — ఆ పుత్తుఁడు — తనకున్ — ఎందున్ — దత్త పుత్త్రుండు — అయ్యెన్.

**వ్యాఖ్య:** పుత్త్రులు లేని వాడు తమకు పుత్త్రులు కావాలని కోరితే (పుత్రార్థముగాన్ అడిగినన్) — పుత్త్రులు కలవాడు తన పుత్రులలో ఒక పుత్త్రుణ్ణి ఇస్తే — ఆ పుత్త్రుడు స్వీకరించినవాడికి దత్తపుత్త్రుడౌతాడు.

**127. కం. జననియు జనకుఁడు తనకును**
**ధన మొడఁబడి యడిగికొనిన తనయుఁడు కొన్నా**
**తనికిఁ గృతకృత్యుఁ డనియెడు**
**తనయుం డగు నండ్రు ధర్మతత్త్వజ్ఞు లిలన్**

**అన్వయం:** ఇలన్ — ధర్మతత్త్వజ్ఞులు — జననియున్ — జనకుఁడు — తనకును — ధనము — ఒడఁబడి — అడిగికొనిన — తనయుఁడు — కొన్న — ఆతనికిన్ — కృతకృత్యుఁడు — అనియెడు — తనయుండు — అగున్ — అండ్రు.

**వ్యాఖ్య:** ఈ భూమిపై ధర్మశాస్త్రం తెలిసిన వారు (ధర్మతత్త్వజ్ఞులు) కృతకృత్యుడని ఎవరిని అంటారో చెప్తున్నాడు కేతన. తల్లీ (జనని) తండ్రీ (జనకుఁడు) తనను ఇవ్వడానికని అంగీకరించి అందుకు ప్రతిగా కొంత ధనం పుచ్చుకొని ఎవరికైనా తనను అమ్మితే — ఆ పుత్త్రుడు అలా కొనుక్కొన్నవాడికి కృతకృత్యుడనే పేరుగల కుమారుడు (తనయుండు) అగున్.

**128. కం. నా కొరు లేరును లే రే**
**నీ కొడుకై యుండువాఁడ నిజముగ నన్నుం**
**జేకొను మని చనఁ జొచ్చిన**
**యా కొడు కాతనికిఁ దా స్వయం దత్తుఁ డగున్**

**అన్వయం:** నాకున్ — ఒరులు + ఏరును — లేరు. ఏన్ - నీ — కొడుకై — ఉండువాఁడన్. నిజముగన్ — నన్నున్ — చేకొనుము. అని — చనన్ — చొచ్చిన — ఆ — కొడుకు — ఆతనికిన్ — తాన్ — స్వయందత్తుఁడు — అగున్.

**వ్యాఖ్య:** స్వయందత్తుడంటే — ఎవడైనా ఒకడు తనకు ఎవరూ లేరని (ఒరులేరును లేరు) చెప్పి — నేను (ఏన్) నీ కొడుకుగా ఉంటాను. నిజం. నన్ను స్వీకరించు – అని వస్తే ఆ కొడుకు అలా స్వీకరించిన వాడికి స్వయందత్తుడు.

**129. కం. తన పుట్టింపమి యెఱుఁగును**
**జనకునిఁ దెలియండు గూఢసంగతిగఁ గులాం**

**గనకును జన్మించిన యా**
**తనయుఁడు గూఢజుఁడు ధర్మతత్త్వం బరయన్**

**అన్వయం:** ధర్మతత్త్వంబు – అరయన్ – తనన్ – పుట్టింపమి – ఎఱుఁగును. జనకునిన్ – తెలియండు. గూఢసంగతిగన్ – కుల + అంగనకునున్ – జన్మించిన – ఆ – తనయుఁడు – గూఢజుఁడు.

**వ్యాఖ్య:** గూఢజుఁడంటే ఎవరో చెప్తోందీ పద్యం. దంపతులకు కొడుకు పుట్టాడు. అయితే వాణ్ని తాను పుట్టించలేదు అనే సంగతి మగడికి తెలుసు – (పుట్టింపమి యెఱుఁగును). కానీ, పుట్టించిన తండ్రి ఎవడో తెలీదు. రహస్యంగా ఎవడితోనో (ఊరూపేరూ ముక్కూమొహం తెలియనివాడితో, తెలిసినా చెప్పలేనివాడితో) జరిపిన కలయిక (గూఢసంగతిగన్) – కారణంగా తన ధర్మపత్నికి (కులాంగనకునున్) జన్మించిన పుత్త్రుడు (తనయుఁడు) వీడు. ఇతడే గూఢజుఁడని ధర్మశాస్త్రం పరిశీలిస్తే అర్థమవుతుంది.

**130.** కం. **చూలై యుండఁగ నొకరుం**
**డాలింగా నేలుకొనిన యా గర్భమునం**
**దా లలన గన్న పుత్త్రుఁడు**
**పోలంగ సహోఢనామ పుత్త్రుం డయ్యెన్**

**అన్వయం:** (లలన) – చూలు +ఐ+ఉండఁగన్ – ఒకరుండు – ఆలిన్ – కాన్ – ఏలుకొనినన్ – ఆ – గర్భమునన్ – ఆ – లలన – కన్న – పుత్రుఁడు – పోలంగన్ – సహోఢ – నామ – పుత్త్రుండు – అయ్యెన్.

**వ్యాఖ్య:** స్త్రీ (లలన) గర్భవతిగా ఉన్నప్పుడు (చూలై – ఉండగన్) వేరొక పురుషుడు (ఒకరుండు) ఆమెను పెళ్ళాడి భార్యగా (ఆలింగాన్) స్వీకరిస్తే (ఏలుకొనినన్) ఆ గర్భం ద్వారా ఆ స్త్రీకి (లలన) పుట్టిన పుత్రుణ్ణి సహోఢుడు అంటారట. దీనికి మూలం – **సహోఢజస్తు గర్భే స్థితో గర్భిణ్యాం పరిణీతాయాం యః పరిణీతః సహోఢజః పుత్రః** (సంస్కృత విజ్ఞానేశ్వరీయము. ఆ. 129. మితాక్షర వ్యాఖ్య).

**131.** కం. **తల్లియుఁ దండ్రియుఁ బుత్త్రుని**
**నొల్లక పుత్తెంచుటయును నుచితస్థితిమై**
**నుల్లం బలరఁగఁ జొచ్చినఁ**
**దెల్లం బపవిద్ధనామధేయసుతుఁ డగున్**

**అన్వయం:** తల్లియున్ – తండ్రియున్ – పుత్త్రునిన్ – ఒల్లక – పుత్తెంచుటయునున్

– (ఆ పుత్రుడు) ఉచితస్థితిమైన్ – ఉల్లంబు – అలరఁగన్ – చొచ్చినన్ – అపవిద్ధ – నామధేయసుతుఁడు – అగున్ – తెల్లంబు.

**వ్యాఖ్య: అపవిద్ధో మాత్రా పిత్రా వా ఉభాభ్యాం వోత్సృష్టో యో గృహ్యతే సగృహీతః పుత్రః** (సంస్కృత విజ్ఞానేశ్వరము వి.ఆ. 129, మితాక్షర వ్యాఖ్య) అని విజ్ఞానేశ్వరుడు చెప్పిన మితాక్షర వచనాలకు ఇది తెలుగు సేత.

'అపవిద్ధదు' అనే పేరు కల పుత్రుణ్ణి పరిచయం చేస్తున్నాడు కేతన. తల్లిదండ్రులిద్దరూ కన్నకొడుకును భరించలేక (ఒల్లక) తన్ని తగిలేస్తే – పంపివేస్తే (పుత్తెంచుటయును) వాడు తగిన రీతిలో (ఉచితస్థితిమైన్) వేరొకరికి ప్రేమపాత్రుడై – వాళ్ళ మనసులు (ఉల్లంబు) అలరించేటట్లుగా వారింట ప్రవేశిస్తే – ఆ పుత్రుడే అపవిద్ధసుతుడు. స్పష్టము (తెల్లంబు).

**132. కం. క్షేత్రజుఁ డాదిగఁ గలిగిన**
**పుత్త్రులు గ్రహములనుబోలెఁ బొనుపడుదురు స్వ**
**క్షేత్రమున నౌరసుండను**
**పుత్త్రుఁడు గ్రహరాజుఁబోలెఁ బొడసూపుటయున్**

**అన్వయం:** స్వ – క్షేత్రమునన్ – ఔరసుండు – అను – పుత్రుఁడు – గ్రహరాజున్ – పోలెన్ – పొడసూపుటయున్, క్షేత్రజుఁడు – ఆదిగన్ – కలిగిన – పుత్రులు – గ్రహములను – పోలెన్ – పొనుపడుదురు.

**వ్యాఖ్య:** ఈ పద్యంలో క్షేత్రజాదులయిన పుత్రులకీ, ఔరసుడైన పుత్రుడికీ మధ్యకల తేడా చెబుతున్నాడు.

భర్త అనుమతితో పరపురుషుడిద్వారా స్త్రీ పొందిన పుత్రుడు క్షేత్రజుడు. అదీ అలా నియోగించిన పరపురుషుడు తన గోత్రం వాడు కానీ తన వంశానికి చెందినవాడు కానీ అయి ఉండాలి. ఒకే కులానికి చెందిన స్త్రీ పురుషులు వివాహమాడగా వారికి కలిగిన పుత్రుడు ఔరసుడు (చూ. కేతన విజ్ఞానేశ్వరము. ఆచా.ప.118, 119).

క్షేత్రజుడు మొదలైన పుత్రులు గ్రహాలలాగా కాంతిహీనులై పోతారట (పొనుపడుదురు). ఔరసుడనే పుత్రుడు స్వీయక్షేత్రంలో (స్వక్షేత్రమునన్) – సూర్యుడిలాగా (గ్రహరాజుఁబోలెన్) పొడచూపటం వల్ల తక్కిన క్షేత్రజుడు మొదలైన పుత్రులు మిగిలిన గ్రహాలలాగా కన్పిస్తారు.

**133. కం. గోమేధము సేయుటయును**
**రామాజనములకు దేవరన్యాయంబున్**

**భామకు రెండవపెండ్లియు**
**నీ మహిలోఁ గలియుగమున నె గ్గని రార్యుల్**

**అన్వయం:** గోమేధము – చేయుటయును, రామా – జనములకున్ – దేవరన్యాయంబున్, భామకున్ – రెండవ పెండ్లియున్ – ఈ – మహిలోన్ – కలియుగమునన్ – ఆర్యులు – ఎగ్గు – అనిరి.

**వ్యాఖ్య:** కలియుగంలో ఈ భూమి మీద చేయకూడని దోషాలను – తప్పులను (ఎగ్గు = కీడు, తప్పు, చెడ్డశకునం, హాని, అపకీర్తి మొ.) ఆర్యులు చెప్తున్నారు. అవేంటో చూద్దాం.

1) గోవులను వధించటం (గోమేధము చేయుట).
2) స్త్రీ సమూహానికి (రామా = స్త్రీ. రామాజనములకున్) దేవరన్యాయం ద్వారా సంతానోత్పత్తి కలిగించటం (దేవర న్యాయం = ఏదైనా ఒక కారణంవల్ల సంతాన విచ్ఛితి కలిగితే భర్త సోదరుడివల్ల అంటే మరిదిగారితో సంతానం పొందటం).
3) స్త్రీలకు మారు పెళ్ళి చేయటం.

ఇవి లోకంలో హానికారకాలు.

**విశేషాలు:** ఈ పద్యం అమూలకం. వృద్ధపరాశరస్మృతి లోని ఈ శ్లోకం ఈ పద్యానికి ఆధారం కావచ్చు.

**ద్విజానా మసవర్ణాసు కన్యాసూపయమస్తథా,**
**దేవరాచ్చ సుతోత్పత్తి ర్మధుపర్కే పశోర్వధః.** **(1 – 6)**

**134. కం. ఒకతల్లిగన్న సుతులం**
**దొకనికి సుతుఁ డుదయమైన నోలిని మఱి వా**
**రికినెల్ల వాఁడె సుతుఁడని**
**యకుటిలుఁడగు నల మునీంద్రుఁ డానతి యిచ్చెన్**

**అన్వయం:** ఒక – తల్లి – కన్న – సుతులందున్ – ఒకనికిన్ – సుతుఁడు – ఉదయము + ఐనన్ – ఓలినిన్ – మఱి – ఎల్లవారికిన్ – వాఁడె – సుతుఁడు – అని – అల – అకుటిలుఁడు + అగు – మునీంద్రుఁడు – ఆనతి – ఇచ్చెన్.

**వ్యాఖ్య:** నిష్కల్మషుడైన (అకుటిలుఁడు) ఆ యాజ్ఞవల్క్య మహర్షి (మునీంద్రుఁడు) ఈ విధంగా సెలవిచ్చాడు (ఆనతి యిచ్చెన్).

ఒకే తల్లికి పుట్టిన కొడుకులలో (సుతులందున్) ఒకడికి కుమారుడు పుడితే (సుతుఁడు + ఉదయమైనన్) తక్కిన వారందరికీ అంటే ఈ కుమారుడి తండ్రి తాలూకా సోదరులందరికీ (పుత్రులు లేకపోతే) క్రమంగా (ఓలినిన్) అతడే సుతుడు అవుతాడు అని నిష్కల్మషుడైన మునీంద్రుడు చెప్పాడు. ధార్మికకార్యక్రమాల నిర్వహణలో కానీ, ఆస్తి వారసత్వవిషయాలలోగానీ ఇతడికి పూర్తి అధికారమూ, బాధ్యతా ఉంటాయని.

**135. కం. మును విప్రునకును క్షత్రియ**
**వనితకు నుదయించి నతఁడు వైశ్యుఁడు వైశ్యాం**
**గనకును విప్రోత్తమునకు**
**ననుకూలతఁ బుట్టునాతఁ డంబష్ఠుఁ డగున్**

**అన్వయం:** మును – విప్రునకును – క్షత్రియవనితకున్ – ఉదయించిన – అతఁడు – వైశ్యుఁడు. వైశ్య + అంగనకును – విప్ర + ఉత్తమునకున్ – అనుకూలతన్ – పుట్టు – ఆతఁడు – అంబష్ఠుఁడు – అగున్.

**వ్యాఖ్య:** పూర్వం బ్రాహ్మణుడికీ (విప్రునకున్), క్షత్రియస్త్రీకీ పుట్టినవాడి పేరు వైశ్యుడు. వైశ్య స్త్రీకీ (అంగన) విప్రోత్తముడికీ కుదిరిన ఆనుకూల్యం వల్ల (అనుకూలతన్) పుట్టినవాడు అంబష్ఠుడు.

**136. కం. భూదేవుఁడు శూద్ర స్త్రీ**
**నాదరమునఁ బెండ్లియాడి యా సతియం దు**
**త్పాదించిన పుత్త్రుండు ని**
**షాదుండనఁ బరగుచుండు సమ్మదలీలన్**

**అన్వయం:** భూదేవుఁడు – శూద్రస్త్రీన్ – ఆదరమునన్ – పెండ్లియాడి – ఆ – సతియందున్ – ఉత్పాదించిన – పుత్త్రుండు – నిషాదుండు – అనన్ – సమ్మదలీలన్ – పరగుచుండున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణుడు (భూదేవుఁడు) శూద్రస్త్రీని ఆదరంతో పెండ్లిచేసుకొని ఆమెద్వారా పుట్టించిన (ఉత్పాదించిన) పుత్రుడు సొంపుమీరగా (సమ్మదలీలన్) నిషాదుడనే పేరుతో వ్యవహరింప బడుతుంటాడు.

**137. కం. రాజన్యువలన వైశ్య**
**స్త్రీజుఁడు మాహిష్యుఁ డనంగఁ జెల్లును శూద్ర**
**స్త్రీజాతుఁ డుగ్రుఁ డనం జను**
**ధీజననుతకీర్తిపూర! ధీరవిచారా!**

**అన్వయం:** ధీజన – నుత – కీర్తిపూర! ధీరవిచారా! రాజన్యువలనన్ – వైశ్య స్త్రీజుఁడు – మాహిష్యుఁడు – అనంగన్ – చెల్లును. శూద్ర స్త్రీ జాతుఁడు – ఉగ్రుఁడు – అనన్ – చనున్.

**వ్యాఖ్య:** బుద్ధిమంతులతోనుతింపబడేకీర్తివాహినిగలవాడా! (ధీజననుతకీర్తిపూర!) ధీరవిచారుడా! విను. క్షత్రియుడివల్ల (రాజన్యువలనన్) వైశ్యస్త్రీకి పుట్టిన వాడిని (వైశ్యస్త్రీజుఁడు) 'మాహిష్యుడు' అంటారు. అలాగే క్షత్రియుడికీ శూద్రస్త్రీకీ పుట్టినవాడిని (శూద్రస్త్రీ జాతుడు) ఉగ్రుడు అంటారు.

**138. కం. కోమటికి శూద్రభామిని**
**కామినియై కన్నసుతుఁడు కరణుండను నీ**
**నామమునఁ బరఁగు నని ముని**
**ధీమంతులు తేటపడఁగఁ దెలిపిరి జగతిన్**

**అన్వయం:** కామినియై – శూద్రభామిని - కోమటికిన్ – కన్నసుతుఁడు – కరణుండు – అను + ఈ – నామమునన్ – పరఁగున్ – అని – మునిధీమంతులు – జగతిన్ – తేటపడఁగన్ – తెలిపిరి.

**వ్యాఖ్య:** కోమటికీ కామినియైన శూద్రస్త్రీకీ (భామిని) పుట్టినవాడిని కరణుడు అనే పేరుతో వ్యవహరించాలని మునులలో శ్రేష్ఠులు – బుద్ధిమంతులు (ధీమంతులు) స్పష్టంగా చెప్పారీలోకంలో (జగతిన్).

**139. కం. రాజిత విప్రాంగనకును**
**రాజునకుం బుట్టినతఁడు రథసూతుఁడు వి**
**భ్రాజితవిప్రాంగనకును**
**వైజాతికిఁ బుట్టినతఁడు వ్యవహారి యగున్**

**అన్వయం:** రాజిత – విప్ర + అంగనకును – రాజునకున్ – పుట్టిన + అతఁడు – రథ సూతుఁడు. విభ్రాజిత – విప్ర + అంగనకును – వైజాతికిన్ – పుట్టిన – అతఁడు – వ్యవహారి – అగున్.

**వ్యాఖ్య:** ఈ పద్యంలో పుత్ర భేదాలు రెంటిని చెప్తున్నాడు కేతన. 1) రథ సూతుడు: ప్రకాశమానయైన (రాజిత) బ్రాహ్మణస్త్రీకి (విప్ర + అంగనకునున్) క్షత్రియజాతివాడికీ (రాజునకున్) పుట్టినవాడు.

2) వ్యవహారి: ప్రకాశించే సౌందర్యం కల (విభ్రాజిత) బ్రాహ్మణస్త్రీకీ వైశ్యజాతివాడికీ (వైజాతి > వయిజాతి) పుట్టినవాడు.

**140. కం. గొఱకై బ్రాహ్మణకన్యక**
**దొఱసిన శూద్రుండుఁ బ్రీతితో నొక్కటియై**
**వెఱవక పుట్టించిన యా**
**జఱభికిఁ బుట్టిన యతండు చండాలుఁ డగున్**

**అన్వయం:** బ్రాహ్మణకన్యకన్ – గొఱకు + ఐ – దొఱసిన – శూద్రుండు, ప్రీతితోన్ – ఒక్కటి + ఐ – వెఱవక – పుట్టించిన – ఆ – జఱభికిన్ – పుట్టిన – అతండు – చండాలుఁడు – అగున్.

**వ్యాఖ్య:** నీచప్రవృత్తితో (గొఱకై) బ్రాహ్మణ కన్యను పొందిన (దొఱసిన) శూద్రుడూ, ఆ శూద్రుడిపై ప్రీతితో అతడితో కలిసి ఒక్కటై – సంగమించి ఎంతమాత్రమూ జంకక (వెఱవక) అతడితో కాపురం చేసిన ఆ రంకులాడి (జఱభి) బ్రాహ్మణకన్యకూ – వీరిద్దరికీ పుట్టినవాడిని చండాలుడని వ్యవహరిస్తారు.

**141. కం. కోమటికిని శూద్రునకును**
**భూమీశ్వరపుత్త్రియందుఁ బుట్టుదు రోలిం**
**దా మాగధుండు నాద్య**
**గ్రామాధ్యక్షుండునైన క్షత్తయు ననఁగన్**

**అన్వయం:** కోమటికిని – శూద్రునకును – భూమీశ్వరపుత్త్రి + అందున్ – ఓలిన్ – తాన్ – మాగధుండును – ఆద్య – గ్రామ + అధ్యక్షుండును + ఐన – క్షత్తయున్ – అనఁగన్ – పుట్టుదురు.

**వ్యాఖ్య:** వైశ్యునికీ (కోమటికిని) క్షత్రియ కన్యకూ (భూమి + ఈశ్వర – పుత్రియందున్) అలాగే శూద్రుడికీ క్షత్రియకన్యకూ పుట్టినవారిని వరుసగా (ఓలిన్) మాగధుడు, క్షత్త అంటారు. (శూద్రస్త్రీయందు క్షత్రియుడికి పుట్టినవాడని శబ్దరత్నాకరము). ఈ క్షత్తయే మొట్టమొదట గ్రామాధ్యక్షుడట.

**142. కం. ప్రతిలోమజాతుఁ డధముఁడు**
**సతతము ననులోమజుండు సజ్జనుఁ డని వి**
**శ్రుతధర్మవిదులు చెప్పిరి**
**నుతశతవందిత! గుణాఢ్య! నూతనదండీ!**

**అన్వయం:** నుతశతవందిత! గుణాఢ్య! నూతన దండీ! సతతమున్ – ప్రతిలోమజాతుఁడు – అధముఁడు. అనులోమజుండు – సజ్జనుఁడు – అని – విశ్రుత – ధర్మవిదులు – చెప్పిరి.

**వ్యాఖ్య:** స్తుతించదగినవారైన (నుత) వందలాదిమందితో (శత) నమస్కరింపబడుతున్నవాడా (వందిత)! సకలసద్ గుణాలకు నిలయమైనవాడా (గుణాఢ్య)! అభినవదండీ! నుతశత వందిత గుణాఢ్యుడివైన నూతనదండీ – అని ఒకటే సంబుద్ధిగానూ భావించవచ్చు. ఈ పన్నెండు మంది పుత్రులలోనూ అధమవర్ణం పురుషుడివల్ల అగ్రవర్ణం మహిళకు పుట్టినవాడు (ప్రతిలోమజాతుఁడు) –అధముడు. అగ్రవర్ణం పురుషుడివల్ల అధమవర్ణం వనితకు పుట్టినవాడు (అనులోమజుండు) సతతమూ సజ్జనుడు (బీజప్రాధాన్యంతో). ఈ విధంగా సుప్రసిద్ధులైన ధర్మశాస్త్రవేత్తలు (విశ్రుతధర్మవిదులు) చెప్పారు సుమా!

★★★

# ప్రాయశ్చిత్తకాండము

**1. కం. దేవ బ్రాహ్మణ బాధలు**
**గావించిన యతఁడనేకకాలము యమలో**
**కావాసుఁడగుచు నుండును**
**గావున నీ మార్గమిట్లు గా దనిరి మునుల్**

**అన్వయం:** దేవ – బ్రాహ్మణ – బాధలు – కావించిన + అతఁడు – అనేక – కాలము – యమలోక + ఆవాసుఁడు + అగుచున్ – ఉండును. కావునన్ – మునుల్ – ఈ – మార్గము – ఇట్లు – కాదు – అనిరి.

**వ్యాఖ్య:** దేవతలను గానీ బ్రాహ్మణులనుగానీ హింసించడం, అవమానించడం లాంటి బాధలు కలుగజేసే వాడు చిరకాలం (అనేక కాలము) యమలోక నివాసిగా (ఆవాసుఁడు) ఉంటాడు. కాబట్టి మునులు ఈ మార్గం ఇట్లా కాదు. అన్నారు.

**2. కం. ఇది తప్పగు నీ తప్పున**
**కిది దండం బనుచు బుద్ధి నెఱుగఁక కడుఁ బెం**
**పొదవఁగ బ్రతికిన బ్రతుకది**
**తుదిదాఁకం జనదు మీఁద దుర్గతి గలుగున్**

**అన్వయం:** ఇది – తప్పు – అగున్. ఈ – తప్పునకున్ – ఇది – దండంబు – అనుచున్ – బుద్ధిన్ – ఎఱుగఁక – కడున్ – పెంపు – ఒదవఁగన్ – బ్రతికిన – బ్రతుకు + అది – తుదిదాఁకన్ – చనదు. మీఁదన్ – దుర్గతి – కలుగున్.

**వ్యాఖ్య:** ఇది తప్పు. ఈ తప్పుకు ఇదీ శిక్ష (దండంబు) అంటూ బుద్ధితో తెలుసుకోకుండా బాగా అతిశయంగా (పెంపు ఒదవఁగన్) బతికిన బతుకు ఉందే అది తుదిదాకా వెళ్ళదు. అంటే పూర్ణజీవితం కాస్తా మధ్యలోనే అంతరించి పోతుందని. ఆ మీదట, మరణించిన తరువాత కూడా దుర్గతులే కలుగుతాయి.

**3.**   **కం.**   **స్త్రీలును గోవులు విప్రులు**
**బాలురుఁ దక్కంగఁ దక్కు పాపపు వధ్యుల్**
**పోల వధకర్హు లైనను**
**నోలిన పరికించి చేయు టుచితం బరయన్**

**అన్వయం:** స్త్రీలును – గోవులు – విప్రులు – బాలురున్ – తక్కంగన్ – తక్కు – పాపము – వధ్యుల్ – పోలన్ – వధకున్ – అర్హులు – ఐననున్ – ఓలిన – పరికించి – చేయుట – అరయన్ – ఉచితంబు.

**వ్యాఖ్య:** స్త్రీలూ గోవులూ విప్రులూ బాలురూ తప్పించి మిగిలిన వారిలో పాపం చేసినవాళ్ళు పాపం చేసినందువల్ల వధించడానికి అర్హులైనప్పటికీ ఓలిన ఆలోచించి చేయడం తగినది.

**4.**   **కం.**   **ఎనుమునకు బందె పాతిక**
**గొననగు మొదవునకుఁ బరక గొఱియకు వీసం**
**బొనర నొఱు చేను మేపిన**
**నినుమడిగొనవలయు నొడయఁ డెఱిఁగి విడిచినన్**

**అన్వయం:** ఒనరన్ – ఒఱు – చేను – మేపినన్ – ఎనుమునకున్ – పాతిక – బందె – కొనన్ –అగున్. మొదవునకున్ – బందె – పరక – కొనన్ – అగున్. గొఱియకున్ – వీసంబు – కొనన్ – అగున్. ఒడయఁడు – ఎఱిఁగి – విడిచినన్, ఇనుమడి – కొనవలయున్.

**వ్యాఖ్య:** పశువులు వెళ్ళి ఇతరుల చేలలో పడి మేస్తే ఆ పొలం యజమాని (ఒడయఁడు) వాటిని బంధించవచ్చు. దీనిని బందె అంటారు. పశువులను బందుల దొడ్డిలో పెట్టడం అంటే ఇదే. అలా బందుల దొడ్డిలో పెట్టబడిన పశువులను విడిపించాలంటే ఆ పొలం యజమానికి ఆ పశువుల యజమాని కొంత దండుగ శిస్తు చెల్లించాలి. దానినీ బందె అంటారు. అర్థవిపరిణామం. ఏ పశువు మేస్తే ఎంత చెల్లించాలో చెప్తున్నాడు.

గేదెకి (ఎనుమునకున్) పాతిక. ఆవుకు (మొదవునకున్) పరక. గొర్రెకు వీసం. పశువుల యజమాని (ఒడయఁడు) ఎరిగెరిగి కావాలని – తన పశువుల్ని విడిచిపెట్టి ఇతరుల చేనును మేపినట్లయితే ఈ దండుగ రెట్టింపు వసూలు చేయాలి (ఇనుమడి కొనవలయున్).

**విశేషాలు**: పరక = రెండు వీసములు (పొరకరూపాంతరం).

వీసము = రూకలో పదహారో భాగం లేదా ఒకదానిలో పదహారో భాగం.

**5. కం. లొట్టేనుఁగంత పొడవున**
**దట్టముగా వెలుగువెట్ట దగు నూరులకుం**
**జుట్టును దిరుగఁగ జేలకు**
**నట్టిపొలము మేసెనేని నగుబందె గొనన్**

**అన్వయం**: ఊరులకున్ – లొట్టేనుఁగు – అంత –పొడవునన్ – దట్టముగాన్ – చేలకున్ –చుట్టును – తిరుగఁగన్ – వెలుగు – పెట్టన్ – తగున్. అట్టి – పొలము – మేసెనేనిన్ – బందె – గొనన్ – అగున్.

**వ్యాఖ్య**: ఊళ్ళకు చుట్టూ ఒంటె – ఏనుగు (లొట్టేనుఁగు) అంత పరిమాణంలో దట్టంగా పొడవుగా కంచె (వెలుగు) పెట్టడం మంచిది (తగున్). పోలాలకైతే చుట్టూ ఉండేలాగా కంచె పెట్టాలి. అటువంటి పొలం పశువులు మేసినట్లయితే బందె తీసుకోవాలి.

**6. కం. ఊరి మునుమందత్రోవల**
**చేరువలను వెలుగులేని చేలకుఁ బసు లిం**
**పారఁగఁ గనిసిన బందెలు**
**భూరమణులు గొనరు పసికి బుద్ధులులేమిన్**

**అన్వయం**: ఊరి – మును – మంద – త్రోవల – చేరువలను – వెలుగు – లేని – చేలకున్ – పసులు – ఇంపారఁగన్ – కనిసినన్ – పసికిన్ – బుద్ధులు – లేమిన్ – భూరమణులు – బందెలు – కొనరు.

**వ్యాఖ్య**: ఊరికి వెలుపల అంటే ముందూ (మును), పశువులకోష్ఠానికి (మంద) దగ్గరలోనూ, దారికి ఇరువైపులా చేరువలో ఉంటూ కంచె (వెలుగు) లేని చేలకు పశువులు ఆశపడి ఇంపారగా ఆ చేలలో పడి విజృంభించినట్లయితే (కనిసినన్) రాజులు (భూరమణులు) బందెలు స్వీకరించరు. పశువులకు (పసికిన్) బుద్ధులు ఉండవు కాబట్టి (లేమిన్).

**7. కం. తాన తన పసుల నొడ్డుల**
**చేనుచెడ న్మేపి నతనిచేతను బలిమిన్**
**చేనఁగల సేగి యొడయఁడు**
**భూనాథుఁడు తగిన దండమునుఁ గొనవలయున్**

**అన్వయం**: తాను + అ – తన – పసులన్ – ఒడ్డుల – చేనున్ – చెడన్ – మేపిన – అతని – చేతను – ఒడయఁడు – బలిమిన్ – చేనన్ – కల – సేగి – భూనాథుఁడు – తగిన – దండమునున్ –కొనవలయున్.

**వ్యాఖ్య**: తనకు తానుగా కావాలని ఎవడైనా తన పశువుల్ని ఇతరుల (ఒడ్డుల) చేనును చెడ మేపినట్లయితే అలా చేసినవాడిచేత బలవంతంగా చేనుకి కలిగిన నష్టాన్ని (సేగి) ఆ చేను యజమాని (ఒడయఁడు) వసూలు చేయాలి. అలాగే అటువంటివాడికి రాజు (భూనాథుఁడు) తగిన శిక్ష విధించాలి.

**8. తే.గీ. ఎందు మాడలోని యెనిమిదియవ పాలు**
**పణ మనంగ జగతిఁ బరఁగుచుండు**
**నొనరఁ బణములోన నెనిమిదియవ పాలు**
**మాషమంద్రు బుద్ధిమంతు లెల్ల**

**అన్వయం**: ఎందున్ – మాడలోని – ఎనిమిదియవ – పాలు – పణము – అనంగన్ – జగతిన్ – పరఁగుచుండున్, ఒనరన్ – పణములోనన్ – ఎనిమిదియవ – పాలు – మాషము (అని) – బుద్ధిమంతులు – ఎల్లన్ – అంద్రు.

**వ్యాఖ్య**: వెండిమాడలో ఎనిమిదో భాగానికి (పాలు) పణము అని లోకవ్యవహారం. ఆ పణములో ఎనిమిదో భాగాన్ని మాషము అని బుద్ధిమంతులందరూ అంటారు.

**9. తే.గీ. పదియు నరగుంజ మాషంబు పదియునాఱు**
**మాషములుగూడఁ గర్షమ్ము మహిని నాల్గు**
**కర్షములు పలసంజ్ఞయై ఘనత కెక్కుఁ**
**బలశతంబులు తుల మయి పరఁగుచుండు**

**అన్వయం**: మహినిన్ – పదియున్ – అర – గుంజ – మాషము. పదియున్ – ఆఱు – మాషములు – కూడన్ – కర్షమ్ము. నాల్గు – కర్షములు – పల – సంజ్ఞ + ఐ – ఘనతకు – ఎక్కున్. పలశతంబులు – తులము + అయి – పరఁగుచుండున్.

**వ్యాఖ్య**: భూమిపై అయిదు గురిగింజల ఎత్తు (పదియు నర = అయిదు) ఒక మాషం. పదహారు (పదియునాఱు) మాషాల ఎత్తు ఒక కర్షము. నాలుగు కర్షాలు కలిపితే ఒక పల అనే గుర్తుతో ప్రసిద్ధి వహించింది. నూరు పలల ఎత్తు ఒక తులం అంటారు.

**10. ఉ. రేపటిపూఁట నెన్నికొని ప్రేఁడు పసిం గొనిపోయి మేపి తా**
**మాపటిపూఁట నెన్నిన క్రమంబున నీఁదగుఁ జచ్చెనేనియుం**
**గోపరిపాలకుండు చెవిఁ గొమ్ము నిజంబుగఁ జూపి శుద్ధుఁడౌఁ**
**జేపడి ముచ్చుకొన్నయెడఁ జెచ్చెరఁ జెప్పకయున్నఁ దప్పగున్**

**అన్వయం**: వ్రేడు – రేపటిపూఁటన్ – ఎన్నికొని – పసిన్ – కొనిపోయి – మేపి – తాన్ – మాపటిపూఁటన్ – ఎన్నిన – క్రమంబునన్ – ఈన్ – తగున్. చచ్చెనేనియున్ – గోపరిపాలకుండు – చెవిన్ – కొమ్మున్ – నిజంబుగన్ – చూపి – శుద్ధుడు + ఔన్. చేపడి – ముచ్చు – కొన్న – ఎడన్ – చెచ్చెరన్ – చెప్పక – ఉన్నన్ – తప్పు – అగున్.

**వ్యాఖ్య**: గొల్లవాడు (వ్రేఁడు) ఉదయం పూట (రేపటిపూఁట) లెక్కపెట్టుకొని (ఎన్నికొని) పశువులను (పసిన్) తీసుకుపోయి, వాటిని మేపి తాను మళ్ళీ సాయంత్రానికి (మాపటిపూఁటన్) లెక్కపెట్టినట్లుగా (ఎన్నినక్రమంబునన్) ఎన్ని తీసుకువెళ్ళాడో అన్నీ ఇవ్వాలి. ఒకవేళ వాటిలో ఏ ఒక్కటైనా మరణిస్తే ఆ గోపాలకుడు (గోపరిపాలకుండు) అలా మరణించిన పశువు తాలూకూ చెవినిగానీ కొమ్మును గానీ సాక్ష్యంగా (నిజంబుగన్) చూపాలి. అలా చూపితే అతడు నిర్దోషి అవుతాడు (శుద్ధుఁడౌన్). ఏదైనా పశువు చిక్కుకుపోయి (చేపడి), దానిని ఏ దొంగైనా అపహరించుకుపోయినప్పుడు (ముచ్చు కొన్నయెడన్) వెంటనే (చెచ్చెరన్) ఆ విషయం చెప్పకపోతే అది దోషం అవుతుంది.

**11. కం. కావఁ గొనిపోయి యేమఱి**
**గోవులఁ దాఁ జెఱిచెనేని గొల్లఁడు పతికిన్**
**గోవుల వెల యరువం దగు**
**భూవరునకుఁ గొంత దండువును బెట్టఁ దగున్**

**అన్వయం:** గొల్లఁడు – గోవులన్ – కావన్ – కొనిపోయి – ఏమఱి – తాన్ – చెఱిచెనేనిన్ – పతికిన్ – గోవుల – వెల – అరువన్ – తగున్. భూవరునకున్ – కొంత – దండువును – పెట్టన్ –తగున్.

**వ్యాఖ్య:** గొల్లవాడు గోవులను కాయడం కోసం తీసుకుపోయి తాను పరధ్యానంగా ఉండటం మూలంగా వాటిని పోగొట్టినట్లయితే (చెఱిచెనేనిన్) అలా పోగొట్టిన వాడు ఆ పశువుల యజమానికి (పతికిన్) గోవుల వెల ఇచ్చి తీర్చుకోవాలి (అరువన్ తగున్). అలాగే రాజుగారికీ (భూవరునకున్) కొంత శిస్తు (దండువు) చెల్లించుకోవాలి.

**12. కం. తా నేమఱి గొల్లండొక**
**చేను చెడన్మేపెనేని చిక్క నడిచి యా**
**చేనఁ గల సేగి యంతయు**
**వానిన యొప్పించు టొప్పు వసుధేశునకున్**

**అన్వయం:** తాను – ఏమఱి – గొల్లండు – ఒక – చేనున్ – చెడన్ – మేపెనేనిన్ – చిక్కన్ – అడిచి – ఆ – చేనన్ – కల – సేగి – అంతయున్ – వానిన – ఒప్పించుట – వసుధేశునకున్ – ఒప్పు.

**వ్యాఖ్య:** గొల్లవాడు తాను ఏమాఱి, ఒక చేను పూర్తిగా నాశనం అయ్యేలా (చిక్కన్ అడిచి) పశువులతో చెడ మేపినట్లయితే ఆ చేనుకి సంబంధించిన నష్టాన్ని (సేగి) అంతా పరిహారంగా వాడు కట్టేలా ఒప్పించడం రాజుకు (వసుధేశునకున్) ఒప్పు.

**13. కం. పురిటి మొదవు లాఁబోతులు**
**సురతమునకు విడిచి తొఱఁగు చొచ్చిన యవియుం**
**బరిచిచ్చున బెదరిన యవి**
**సరి మేసిన బందె గొనుట చన దధిపతికిన్**

**అన్వయం:** పురిటి – మొదవులు – ఆఁబోతులు – సురతమునకున్ – విడిచి, తొఱఁగు –చొచ్చినన్ – అవియున్ – పరిచిచ్చునన్ – బెదరినన్ – అవి – సరి – మేసినన్ – అధిపతికిన్ – బందె – కొనుట – చనదు.

**వ్యాఖ్య:** పురిటి మొదవులనూ ఆఁబోతులనూ సంగమానికి విడిచిపెట్టిన పశువులనూ, అవి చొరబడినా, పరిచిచ్చుకు బెదరినవీ అయిన పశువులు చేలల్లోపడి సరి మేసినట్లయితే రాజుకు (అధిపతికిన్) బందె వసూలు చేయడం తగదు.

**14. కం. ఎనిమిదవపాలు పాలును**
**మునుకొని నూఱాలకొక్క మొదవును గోపా**
**లునకును జీతమిచ్చుట**
**కనుగొన ధర్మంబు పసులఁగల యాతనికిన్**

**అన్వయం:** కనుగొనన్ – ఎనిమిదవపాలు – పాలును, మునుకొని – నూఱు – ఆలకున్ – ఒక్క –మొదవును – గోపాలునకును – జీతము – ఇచ్చుట – పసులఁగల – ఆతనికిన్ – ధర్మంబు.

**వ్యాఖ్య:** ఆలోచిస్తే (కనుగొనన్) గోవులను కాచేవాడికి ఇవ్వవలసిన జీతభత్యాలు ఎలావుండాలంటే ఆ గోపాలుడు కాచే ఆవుల ద్వారా వచ్చే పాలలో ఎనిమిదవవంతు (పాలు) క్షీరాన్నిగానీ (పాలును), లేదా చక్కగా(మునుకొని) నూరు ఆవులకు ఒక్క ఆవును గానీ (మొదవును) ఇవ్వాలి. ఇలా గోపాలుడికి జీతంగా ఇవ్వడం పశువులు గల యజమానికి ధర్మం.

**15. కం. కొఱనుగ నాఁగినపొలమును**
**నెఱయం గరిసనముగల్గు నేలయు సరి యా**
**కొఱను సొర నడచిమేపుట**
**నఱిముఱిఁ గరిసనము మేపినట్ల తలంపన్**

**అన్వయం**: కొఱనుగన్ – ఆఁగిన – పొలమును, నెఱయన్ – కరిసనము – కల్గు – నేలయున్ – సరి. ఆ – కొఱను – చొరన్ – అడచి – మేపుటన్ – తలంపన్ – అఱిముఱిన్ – కరిసనము –మేపిన – అట్లు + అ.

**వ్యాఖ్య:** దున్నకుండా పశువుల మేతకై విడిచిపెట్టిన నేలను కొఱను అంటారు. అలా కొఱనుగా విడిచిపెట్టిన పొలమూ పూర్తిగా సేద్యం (కరిసనము) గల నేలా రెండూ ఒకటే (సరి). అందువల్ల అలా కొఱనుగా విడిచిపెట్టిన నేలలోనికి చొరబడేలా పశువులను తోలి మేపటం ఎటువంటిదంటే ఆలోచిస్తే నిర్భయంగా (అఱిముఱిన్) సేద్యపునేలను (కరిసనము) మేపినటువంటిదే.

**16. ఉ. వ్రేఁకనిబండివానికిని విప్రునికిం బతికిన్ వివాదికిన్**
**వ్రేఁకనిమోపువానికిని వృద్ధునకుం గడుఁ జిన్నబిడ్డకున్**
**వ్రేఁకటియాఁడుమానిసికి వేఁదుఱువానికిఁ దెవ్లుగొంటుకుం**
**దేఁకువతోఁ దొలంగు నది తెల్లముగా నెదురేగుదెంచినన్**

**అన్వయం, వ్యాఖ్య**: ఎవరు ఎదురు వస్తే ఎదురు వెళ్ళకుండా పక్కకి తప్పుకోవాలో చెప్తున్నాడు. బరువు మోస్తున్న బండివాడికి (వ్రేఁకనిబండివానికిని), వేదం చదివే బ్రాహ్మణుడికీ (విప్రునికిన్), రాజుగారికీ (బతికిన్), వివాదికీ, మోపు బరువు ఎత్తుకున్నవాడికి (వ్రేఁకనిమోపువానికిని), వృద్ధుడికీ, బాగా పసికందుకూ, గర్భిణికీ (వ్రేఁకటియాఁడుమానిసికిన్), పిచ్చివాడికీ (వేఁదుఱువానికిన్), వ్యాధిపీడితుడికీ (తెవ్లుగొంటుకున్) వాళ్ళు స్పష్టంగా (తెల్లముగా) ఎదురుగా వచ్చినట్లయితే వివేకంతో (తేకువతోన్) తొలగి పోవాలి.

**17. కం. వెలుగునఁ బిడికెఁడుకట్టెలు**
**పొలమునఁ బూరియును దేవపూజకుఁ బుష్పం**
**బులుగొనియెనేని విప్రుని**
**వలదన వలదనుచు యాజ్ఞవల్క్యుఁడుచెప్పెన్**

**అన్వయం:** వెలుగునన్ – పిడికెఁడు – కట్టెలు, పొలమునన్ – పూరియును, దేవపూజకున్ – పుష్పంబులు – కొనియెనేనిన్ – విప్రునిన్ – వలదు – అనన్ –

వలదు – అనుచున్ – యాజ్ఞవల్క్యుఁడు – చెప్పెన్.

**వ్యాఖ్య:** కంచెలోని (వెలుగునన్) కొన్ని కట్టెల్నీ (పిడికెఁడు కట్టెలు), పొలంలోని గడ్డినీ (పూరి), దేవపూజకు పుష్పాల్నీ విప్రుడు తీసుకున్నట్లయితే తీసుకోవద్దనకూడదని యాజ్ఞవల్క్యుఁడు చెప్పాడు.

**18. కం. ఊరికిఁ జేనికి నడు మెడ**
**యారయఁగా నూరువిండ్ల యంతవలయు సం**
**చారార్థము ఖర్వటమున**
**కారెట్టియుఁ బట్టణమున కా యినుమడియున్**

**అన్వయం:** ఆరయఁగాన్ – సంచారార్థము – ఊరికిన్ – చేనికిన్ – నడుమ – ఎడ – నూరు – విండ్ల – అంత, ఖర్వటమునకున్ – రెట్టియున్, పట్టణమునకున్ – ఆ – ఇనుమడియున్ – వలయున్.

**వ్యాఖ్య:** పరిశీలిస్తే (ఆరయగాన్) సంచరించడానికి వీలుగా (సంచారార్థము) ఊరికీ చేలకూ మధ్య ఎడం నూరుధనువులంత ఉండాలి. ఈ దూరం అదే ఖర్వటం విషయంలో అయితే దానికి రెట్టింపు. (ఖర్వటం ఖర్పటము, కర్పటము. కొండ దొన నాశ్రయించి యుండెడుపల్లె. కమ్మరి వడ్రంగిలోనగువారుండెడు పల్లె. నన్నూఱు గ్రామములుగల పరగణాకు ముఖ్యగ్రామము శ.ర.), అంటే రెండునూర్లధనువుల ఎడం ఉండాలి. అదే పట్టణానికి వస్తే దానికి రెండు రెట్లు (ఇనుమడి). అంటే నాలుగునూర్లధనువుల దూరం అన్నమాట. దీనికి మూలం

**ధనుశ్శత పరీణాహో గ్రామ క్షేత్రాంతరం భవేత్**
**ద్వేశతే కర్వటస్య స్యాత్ నగరస్య చతుశ్శతమ్ (యా.వ్య. 165)**

**19. కం. తన ధనముగానిదానిం**
**దన ధనమని యమ్మి యతని దండువుగొని యా**
**ధన మొడయని కిప్పించుట**
**జనపతులకు ధర్మమండ్రు శాస్త్రవిధిజ్ఞుల్**

**అన్వయం:** తన – ధనము – కాని – దానిన్ – తన – ధనము – అని – అమ్మి(న) – అతనిన్ – దండువు – కొని – ఆ – ధనము – ఒడయనికిన్ – ఇప్పించుట – జనపతులకు – ధర్మము (అని) – శాస్త్రవిధిజ్ఞుల్ – అండ్రు.

**వ్యాఖ్య**: తన సొత్తుకానిదానిని (ధనము – విత్తము, ఆవులమంద) తన సొత్తేనని చెప్పి అమ్మినవాడి నుంచి నష్టపరిహారం (దండువు) వసూలు చేసి దానిని

సొంతయజమానికి (ఒడయనికిన్) ఇప్పించడం రాజులకు (జనపతులకున్) ధర్మమని శాస్త్రవిధి తెలిసినవాళ్ళు అంటారు.

**20. కం. వీని ధనం బిది గాదని**
**తా నెఱిఁగియు నొరుని ధనము ధనలోభమునన్**
**మానుగ విలుచుట తప్పగు**
**వానిపయిన్ దొంగతన మవశ్యము గలుగున్**

**అన్వయం:** వీని – ధనంబు – ఇది – కాదు + అని – తాన్ – ఎఱిఁగియున్ – ధనలోభమునన్ – ఒరుని – ధనము – మానుగన్ – విలుచుట – తప్పు + అగున్. వాని – పయిన్ – దొంగతనము – అవశ్యము – కలుగున్.

**వ్యాఖ్య:** ఇది వీడి సొత్తు కాదని తనకు తెలిసీ ధనలోభంతో (చౌకగా లభిస్తుందనే) చక్కగా (మానుగన్) వెలయిచ్చి ఇతరుడి సొత్తును కొనుక్కోవడం (విలుచుట) తప్పే అవుతుంది. అలా చేసిన వాడిపైన దొంగతనం చేసిన నేరం తప్పక (అవశ్యము) పడుతుంది.

**21. కం. తన ధనము కానిదానిన్**
**దన ధనమని యమ్మినతఁడు తాఁజచ్చిన నా**
**ధనముగలవాఁడు విలిచిన**
**ధనమునఁదగ సగముఁ బెట్టి తాఁ గొనవలయున్**

**అన్వయం:** తన – ధనము – కాని – దానిన్ – తన – ధనము + అని – అమ్మిన – అతఁడు – తాన్ – చచ్చినన్ – ఆ – ధనము – కలవాఁడు – విలిచిన – ధనమునన్ – తగన్ – సగము – పెట్టి – తాన్ – కొనవలయున్.

**వ్యాఖ్య:** తన సొత్తుకానిదానిని (ధనము – విత్తము, ఆవులమంద) తనసొత్తేనని చెప్పి అమ్మినవాడు మరణిస్తే ఆ సొత్తును కొనుక్కున్నవాడు ఎంతకైతే కొనుక్కున్నాడో అలా కొన్న (విలిచిన) ధనంలో సగం పెట్టి అసలు యజమాని మళ్ళీ దానిని కొనుక్కోవాలి.

**22. కం. తనధన మొక్కనిచేతన్**
**గని వానిం బూని పట్టఁగాఁ దగు వాఁడ**
**మ్మినవానిఁజూప శుద్ధుఁడ**
**తనిఁ జూపఁగనొల్లఁడేని తా దండ్యుఁ డగున్**

**అన్వయం:** తన – ధనము – ఒక్కనిచేతన్ – కని – వానిన్ – పూని – పట్టఁగాన్

— తగున్. వాఁడు — అమ్మినవానిన్ — చూపన్ — శుద్ధుఁడు. అతనిన్ — చూపఁగన్ — ఒల్లఁడేనిన్ — తాన్ — దండ్యుఁడు — అగున్.

**వ్యాఖ్య:** తన ధనం ఇతరుడి చేతిలో పడితే (ఒక్కనిచేతన్) దానిని తెలుసుకొని వాణ్ణి పూనికతో పట్టుకోవాలి. వాడు ఆ సొత్తును తనకు ఎవడైతే అమ్మాడో ఆ అమ్మినవాణ్ణి చూపిస్తే వాడు శుద్ధుడైపోతాడు. వాడి తప్పేమీ లేదని. అలా గనక చూపకపోతే (చూపఁగన్ ఒల్లఁడేని) వాడు తానే దండ్యుడు అవుతాడు.

**23. చం. చెడినధనంబు ముచ్చులకుఁ జేపడిపోయిన సొమ్ము నున్నచో**
**నొడయఁడు నా ధనం బనిన నొండొకఁ డమ్మినవాడు గల్గినన్**
**దడయక పల్కి శుద్ధుఁడగు దాఁచినఁ గూరిచి రాజదండ మా**
**యొడయని సొమ్మునుం గొనుట యుత్తమధర్మము నిక్క మారయన్**

**అన్వయం:** నిక్కము — ఆరయన్ — చెడిన ధనంబు — ముచ్చులకున్ — చేపడిపోయిన — సొమ్మును — ఉన్నచోన్ — ఒడయఁడు — నా — ధనంబు — అనినన్, ఒండొకఁడు — అమ్మినవాడు — కల్గినన్ — తడయక పల్కి — శుద్ధుఁడు — అగున్. దాఁచినన్ — కూరిచి — రాజదండము — ఆ — ఒడయని — సొమ్మునున్ — కొనుట — ఉత్తమ ధర్మము.

**వ్యాఖ్య:** దొంగసొమ్ము (చెడినధనంబు) దొంగలు (ముచ్చులకున్) దోచుకున్న (చేపడిపోయిన) సొమ్ముగానీ ఉంటే దానిని చూసిన యజమాని (ఒడయఁడు) ఇది నా ధనం అంటే అప్పుడు ఆ యజమాని నిజంగా ఎవరిదగ్గర కొన్నాడో దానిని అమ్మినవాడు గనక ఉంటే దాచకుండా సంశయించకుండా (తడయక) చెప్పాలి. అలా చెప్పినట్లయితే అతడు ఆ యజమాని (ఒడయఁడు) శుద్ధుఁడవుతాడు. నిర్దోషి అన్నమాట. అలా చెప్పకుండా దాచిపెడితే దానివల్ల (దాఁచినఁ గూరిచి) అలా దాచిన యజమానికి రాజదండన విధించాలి. దానితోపాటు ఆ యజమాని సొమ్మునూ స్వాధీనం చేసుకోవాలి. నిజంగా ఆలోచిస్తే అదే ఉత్తమధర్మం.

**24. ఆ.వె. పొందుగాని పొందు పొసఁగ దెక్కువ యేల**
**యేకతమున నెవ్వఁడేని యొరుల**
**ధనము కానిదానిఁ దాను విల్చుట యది**
**మెచ్చుగాదు వాఁడు ముచ్చుగాని**

**అన్వయం:** పొందు — కాని — పొందు — పొసఁగదు. ఎక్కువ యేల — ఏకతమున — ఎవ్వఁడు — ఏనిన్ — ఒరుల — ధనము — కాని — దానిన్ — తాను — విల్చుట — అది — మెచ్చుకాదు — వాఁడు — ముచ్చు — గాని.

**వ్యాఖ్య:** పొందు కాని పొందు పొసగదు. ఎక్కువ యేల రహస్యంగా (ఏకతమునన్) ఎవడైనా ఇతరుల సొత్తుకాని దానిని తాను కొనడం (విల్చుట) అనేది మెప్పుదల కాదు. అలా చెయ్యడం వల్ల అలా కొన్నవాడు దొంగ (ముచ్చు) అవుతాడు.

**25. కం. చెడినధనము తనధనముగ**
**బడయుటయును గుడుచుటయును బలునేరం బా**
**పడసినవాఁ డేనవపా**
**ల్పుడమివిభున కరువ వలయు బొంకక సరిగన్**

**అన్వయం:** చెడిన ధనము – తన – ధనముగన్ – పడయుటయును – కుడుచుటయును – పలు – నేరంబు. ఆ – పడసినవాఁడు – ఏనవపాలు – పుడమివిభునకున్ – బొంకక – సరిగన్ – అరువవలయున్.

**వ్యాఖ్య:** దొంగసొమ్ము (చెడినధనము) తనధనమని పొందడం (పడయుటయును), దాన్ని అనుభవించడం (కుడుచుటయును) పెద్ద నేరం (బలునేరంబు). అలా పొందినవాడు (పడసినవాఁడు) అలా పొందిన సొమ్ములో అయిదవభాగం (ఏనవపాలు) రాజుగారికి (పుడమివిభునకున్) అబద్ధం ఆడకుండా కచ్చితంగా చెల్లించాలి (అరువ వలయున్).

**26. కం. వేఱొకని సొమ్ము ముచ్చిలి**
**దూరముపోవుటయుఁ గన్నఁ దుతి నన్యుఁడు తాఁ**
**జూఱగొనునేనిఁ దాఁ బది**
**యాఱు వణము లొసఁగు దండు వవనీపతికిన్**

**అన్వయం:** వేఱొకని – సొమ్ము – ముచ్చిలి – దూరము – పోవుటయున్ – కన్నన్ – అన్యుఁడు – తాన్ – చూఱగొనునేనిన్ – తాన్ – పదియాఱు – పణములు – అవనీపతికిన్ – దండువు – ఒసఁగున్.

**వ్యాఖ్య:** వేరొకడి సొమ్మును దొంగిలించి (ముచ్చిలి) దూరంగా వెళ్ళడాన్ని చూసిన తర్వాత వేరొకడు (అన్యుఁడు) తాను ఆ సొత్తును అపహరిస్తే (చూఱగొనునేనిన్) దానికి మొదట దొంగిలించినవాడు తాను పది పణాలు రాజుకి (అవనీపతికిన్) పరిహారం (దండువు) చెల్లించాలి.

**27. కం. ఆలికిఁ బుత్రుల కీఁదగ**
**దోలిని బరధనముఁ గొంచు నుచితస్థితితో**
**మేలగు కుటుంబరక్షకుఁ**
**జాలిన ధన మిచ్చి యాగి సద్ధర్మమిలన్**

**అన్వయం:** ఇలన్ – పరధనమున్ – కొంచున్ – ఆలికిన్ – పుత్రులకున్ – ఓలినిన్ – ఈన్ – తగదు. ఉచిత స్థితితోన్ – కుటుంబ రక్షకున్ – చాలిన – ధనము + ఇచ్చి – ఈగి – మేలగున్ – సత్ – ధర్మము.

**వ్యాఖ్య:** పరధనాన్ని స్వీకరించి (కొంచున్) భార్యకూ (ఆలికిన్) పుత్రులకు వరసబెట్టి (ఓలినిన్) ఇవ్వ తగదు. తగినరీతిలో (ఉచితస్థితితోన్) కుటుంబరక్షణకు సరిపడా ధనం మాత్రమే భార్యాపుత్రులకు ఇచ్చి తక్కిన ధనాన్ని దానం చేయడం ఇవ్వడం (ఈగి > ఈవి) మేలు. అదే ఇలలో ఉత్తమధర్మం.

**28. కం. వెలగూడి మెచ్చి నెయ్యము**
**దలఁచి వివాహంబుకొఱకు ధర్మార్థము పెం**
**పలవడఁగా నుపకారికిఁ**
**దలకొని యిచ్చినధనంబుఁ దగదు మరల్పన్**

**అన్వయం:** వెలగూడి, మెచ్చి, నెయ్యము తలఁచి, వివాహంబు కొఱకు, ధర్మ + అర్థము, పెంపు + అలవడఁగాన్ – ఉపకారికిన్ – తలకొని – ఇచ్చిన – ధనంబున్ – మరల్పన్ – తగదు.

**వ్యాఖ్య:** కొన్నవస్తువుకు వెలగా ఇచ్చిన ధనం (వెలగూడి), కవి పండిత గాయకులను మెచ్చుకొని (మెచ్చి) ఇచ్చిన ధనం, స్నేహం కోసం (నెయ్యము దలఁచి) ఇచ్చిన ధనం, వివాహ కట్నంగా ఇచ్చిన ధనం, దానం, ధర్మం ఇత్యాదిరూపంగా ఇచ్చిన ధనం, పెంపుమీరగా ఉపకారం చేసినవాడికి తనకు తానుగా కావాలని (తలకొని) యిచ్చినధనం తిరిగి తీసుకోవడం తగదు (మరల్పన్ తగదు).

దీనికి మూల శ్లోకం

**పణ్యమూల్యం భృతిస్తుష్ట్యా స్నేహాత్ ప్రత్యుపకారతః**

స్త్రీ శుల్కానుగ్రహార్థం చ దత్తం దానవిదో విదుః అని నారదస్మృతిలో ఉంది. దీని ప్రకారం ధనం రెండు రకాలు. 1) దత్తం 2) ఆదత్తం. దత్తం అంటే తిరిగి తీసుకోకూడనిది. ఆదత్తం అంటే తిరిగి తీసుకోవలసినది. వీటిలో భృతి కేతన అనువాదంలో లేదు.

**29. సీ. వెఱచినవానిచే వెరవఱువానిచే**
**మత్తుచేతను మదోన్మత్తుచేత**
**బాలునిచే శోకపరవశుచే రోగ**
**విహ్వలుచేఁ గ్రోధవివశుచేతఁ**

**గొన్నధనంబును గుటిలధర్మంబులఁ**
**గుటిలవిద్యలవెంటఁ గొన్నధనము**
**మఱపునఁ గొన్న సొమ్మఱఁ గొన్న లంచంబు**
**తగనివాఁ డిచ్చిన నగవుటీగి**

**గీ. మచ్చరమ్మునకై యొరుఁ డిచ్చుధనము**
**చేయఁ బూనినకార్యంబు చేయకొరుని**
**చేతఁ గొన్నధనంబును బ్రీతితోడి**
**మగుడనీకుంట యింతయుఁ దగవుకాదు**

**అన్వయం:** వెఱచిన వానిచేన్ – వెరవఱు వానిచేన్ – మత్తుచేతను – మదోన్మత్తుచేతన్ – బాలునిచేన్ – శోక పరవశుచేన్ – రోగ విహ్వలుచేన్ – క్రోధ వివశుచేతన్ – కొన్న – ధనంబును; కుటిల ధర్మంబులన్ – కుటిల విద్యలవెంటన్ – కొన్న – ధనము; మఱపునన్ – కొన్న – సొమ్ము; అఱన్ – కొన్న – లంచము; తగనివాఁడు + ఇచ్చిన – నగవుటీగి; మచ్చరమ్మునకై – ఒరుడు – ఇచ్చు – ధనము; చేయన్ – పూనిన – కార్యము – చేయక – ఒరునిచేత – కొన్న – ధనంబును – ప్రీతితోడి – మగుడన్ – ఈక – ఉంట – ఇంతయున్ – తగవు – కాదు.

**వ్యాఖ్య:** భయపడిన వాడి నుండి (వెఱచినవానిచేన్) భయపెట్టే వాడి నుండి (వెరవఱువానిచేన్), మత్తులో ఉన్న వాడినుండి, మదోన్మత్తుడైన వాడి నుండి, బాలుడినుండి, శోకించే వాడినుండి (శోకపరవశుచేన్), రోగం వల్ల విహ్వలుడైన వాడినుండి, క్రోధంచేత వివశుడైనవాడినుండి స్వీకరించిన ధనమూ; కుటిలధర్మం, కుటిలవిద్యల ద్వారా స్వీకరించిన ధనమూ; మఱపువల్ల స్వీకరించిన సొమ్మూ; మోసపూరితంగా (అఱన్) కొన్న లంచమూ; తగనివాడు ఇచ్చిన పరిహాసపు దానమూ (నగవుటీగి); మాత్సర్యంతో అన్యుడు ఇచ్చే ధనమూ; చేయడానికి తలపెట్టిన కార్యం చేయక ఇతరుడి దగ్గర తీసుకున్న ధనమూ ప్రీతితో తిరిగి ఇవ్వకపోవడం (మగుడనీకుంట) న్యాయం కాదు (తగవుకాదు).

**దీనికి మూల శ్లోకాలు:**

**ఆదత్తం తు భయక్రోధ శోకావేశ రుజాన్వితైః**
**తథోత్క చ పరీహ సవ్యత్యాసచ్ఛల యోగతః**

**బాలామూఢా స్వతంత్రార్త మత్తోన్మత్తాపవర్జితమ్**
**కర్తా మమేదం కర్మేతి ప్రతిలాభేచ్ఛ యాచయత్**

**అపాత్రే పాత్ర మిత్యుక్తే కార్యేచాధర్మ మంహితే**
**యద్దత్తం స్యా దవిజ్ఞానా దదత్త మితితత్ స్మృతమ్ (వి.వ్య. 174)**

**30. సీ. అరయక విల్చిన సరకు మెచ్చకయున్న**
**నాఁడ క్రమ్మఱ నీఁగి న్యాయపథము**
**పరదినంబుననైనఁ బలికిన వెలలోన**
**వెలయఁ ద్రింశాంశంబు విడువవలయు**
**సరకు మూఁడవనాఁడు మరల నీఁదలఁచిన**
**వెలఁ బదేడవపాలు విడువవలయుఁ**
**బదినాళ్ల బీజముల్ పదియేను దినముల**
**బట్టల నెలనాళ్ల బానిసయును**

**ఆ.వె. నేను దినములందు నెద్దును దురగంబు**
**మూఁడు దినములందు మొదవు నెనుము**
**నేడు నాళ్ల రత్న మిను మొకనాఁటను**
**మరల నీఁగి ధర్మమార్గ మంద్రు**

**అన్వయం:** అరయక – విల్చిన – సరకు – మెచ్చక + ఉన్న – నాఁడ – క్రమ్మఱన్ – ఈఁగి – న్యాయ – పథము. పర – దినంబునన్ + ఐనన్ – పలికిన – వెలలోనన్ – వెలయన్ – త్రింశ + అంశంబు – విడువవలయున్. మూఁడవనాఁడు – సరకున్ – మరలన్ – ఈన్ – తలఁచినన్ – వెలన్ – పది + ఏడవపాలు – విడువవలయున్. పదినాళ్ళన్ – బీజముల్ – పది + ఏను – దినములన్ – బట్టలన్, నెలనాళ్ళను – బానిసయునున్, ఎద్దును – ఏను – దినములందున్, తురగంబు – మూఁడు – దినములందున్, మొదవున్ – ఎనుమున్ – ఏడు – నాళ్ళన్, రత్నము, ఇనుము – ఒకనాఁటను – మరలన్ – ఈఁగి – ధర్మ – మార్గము – అంద్రు.

**వ్యాఖ్య:** మంచిచెడ్డలు పరిశీలించకుండా (అరయక) కొన్న సరుకు (విల్చిన – సరకు) తరువాత నచ్చకపోతే (మెచ్చకయున్న) కొన్నరోజునే (నాఁడ) అమ్మినవాడికి తిరిగి (క్రమ్మఱన్) ఇచ్చెయ్యాలి. అతడు దాన్ని స్వీకరించాలి. దానికి వెలగా చెల్లించిన సొమ్ము మొత్తం అమ్మినవాడు తిరిగి ఇచ్చెయ్యాలి. ఇది న్యాయపద్ధతి (పథము).

కొన్న మర్నాడు పట్టుకువెళ్ళి తిరిగి ఇస్తే (పరదినంబుననైనన్) అప్పుడు – ఆ సరుకుకు నిన్న చెల్లించిన వెలలో (పలికిన వెలలోనన్) ముప్పయ్యవ వంతును (త్రింశాంశంబు) అందంగా కిమ్మనకుండా (వెలయన్) కొన్నవాడు వదులుకోవాలి

(విడువవలయున్). అదే మూడవనాడు తిరిగి ఇవ్వదలిస్తే (ఈదలచినన్) చెల్లించిన ధరలో పదిహేడవవంతు (పాలు) కొన్నవాడు వదులుకోవాలి.

గింజలూ ధాన్యాలూ వగైరాలకు – పదిరోజులు; వస్త్రాలకు – పదిహేను రోజులు (పది + ఏను – దినములన్); బానిసకు – నెలనాళ్లు, ఎద్దుకు – అయిదునాళ్లు (ఏనుదినములన్); గుర్రానికి (తురగంబు) – మూడు రోజులు; ఆవుగానీ గేదెగానీ (మొదవున్ – ఎనుమున్) అయితే – వారం రోజులు (ఏడునాళ్లన్); రత్నంగానీ ఇనుముగానీ అయితే – ఒక్కరోజు; ఇవీ సరుకు తిరిగి ఇవ్వడానికి తుదిగడువులు. ఇది ధర్మమార్గమని పెద్దలు చెబుతున్నారు (అంద్రు).

**31. కం. పనివాసి నూటనైదును**
**నెనిమిదియును రెండు నేడు నెత్తుతఱుఁగుఁ గం**
**చునఁ దగరమ్మున వెండిని**
**నినుమునఁబనిచేసి పిదప నెత్తెడుచోటన్**

**అన్వయం:** పనిచేసి – పిదపన్ – ఎత్తెడుచోటన్ – కంచునన్ – నూటన్ + ఐదును, తగరమ్మునన్ – నూటన్ – ఎనిమిదియున్, వెండినిన్ – నూటన్ రెండు, ఇనుమునన్ – ఏడును – పనివాసి – ఎత్తు – తఱుఁగున్.

**వ్యాఖ్య:** కంచూ, తగరం, వెండి, ఇనుమూ మొదలైన లోహాలతో వస్తువులు చేయించుకొనేటప్పుడు తరుగు ఎలా ఉండాలో చెబుతున్నాడు. పని చేసేశాక తూకం వేసేటప్పుడు (ఎత్తెడుచోటన్) కంచుకి నూటికి ఐదుశాతం, తగరానికి నూటికి ఎనిమిది శాతం, వెండికి రెండుశాతం, ఇనుముకు ఏడుశాతం తరుగు అవుతుంది.

**32. కం. తూలెడు తనప్రాణమ్ములఁ**
**దాలిమితోఁగాచెనేని దాసుని దాస్యం**
**బేలినపతి విడువకతనిఁ**
**బోలన్ రక్షింపవలయుఁ బుత్రునిసరిగన్**

**అన్వయం:** తూలెడు – తన – ప్రాణమ్ములన్ – తాలిమితోన్ – కాచెనేనిన్ – దాసుని – దాస్యంబు – ఏలినపతి – విడువక – అతనిన్ – పుత్రునిసరిగన్ – పోలన్ – రక్షింపవలయున్.

**వ్యాఖ్య:** పోతున్న తన ప్రాణాలను (తూలెడు తనప్రాణమ్ములన్) ఓర్పుతో (తాలిమితోన్) ఒక సేవకుడు రాజుగారిని కాపాడినట్లయితే ఆ రాజు లేదా

యజమాని (ఏలినపతి) ఆ దాసుడి దాస్యాన్ని – సేవను విడిచిపెట్టకుండా అతణ్ణి పుత్రుడితో సమానంగా (పుత్రునిసరిగన్) చూసుకొంటూ రక్షించాలి.

**33. కం. మునుపు వరించిన భ్రష్టుఁ**
**దన తనయుని యట్ల యున్నతని దాసునిఁ గా**
**జనపతి బలిమిం గైకొని**
**పనిగొనఁదగు వాని ప్రాణపర్యంతంబున్**

**అన్వయం:** మునుపు – వరించిన – భ్రష్టున్ – తన తనయుని + అట్ల – ఉన్న + అతనిన్ – దాసునిన్ – కాన్ – జనపతి – బలిమిన్ – కైకొని – వాని – ప్రాణపర్యంతంబున్ – పనిగొనన్ – తగున్.

**వ్యాఖ్య:** పూర్వం (మునుపు) వరించిన భ్రష్టుణ్ణి తన తనయుడితో సమానంగా ఉన్న వాడిని రాజు (జనపతి) బలిమితో స్వీకరించి వాడి ప్రాణం ఉన్నంతవరకూ (ప్రాణపర్యంతంబున్) తన దాసుడిగా నియమించుకొని వాడి సేవను స్వీకరించాలి (పనిగొనఁదగున్).

**34. కం. పలికినకంటెను వెనుకకు**
**గొలిచినభటుఁ డరుగునేనిఁ గొన్నధనం బీ**
**వలయును బతి దా ననిపినఁ**
**గొలిచిన దినములకుఁ బెట్టికొలు వుడుపఁ దగున్**

**అన్వయం**: కొలిచిన భటుడు – పలికినకంటెను – వెనుకకు – అరుగునేని – కొన్నధనంబు – ఈవలయున్ – పతి – తాన్ – అనిపినన్ – కొలిచిన – దినములకున్ – పెట్టి – కొలువు – ఉడుపన్ – తగున్.

**వ్యాఖ్య**: తనదగ్గర పనిచేసిన సేవకుడు (కొలిచినభటుఁడు) చెప్పిన సమయం అంటే ఒప్పందం కుదుర్చుకున్న సమయం కంటే (పలికినకంటెను) ముందుగానే (వెనుకకున్) వెళ్ళిపోయేట్టయితే ఆ భటుడే తాను స్వీకరించిన ధనం తిరిగి ఇచ్చేయాలి. రాజు తానే అతడిని అనుకున్న సమయం కంటే ముందుగా పంపించేట్టయితే (అనిపినన్) పనిచేసిన రోజులకు (కొలిచిన దినములకున్) జీతం ఇచ్చి (పెట్టి) పనిలోంచి తీసెయ్యాలి (కొలువు ఉడుపఁ దగున్).

**35. కం. గురునకు శిష్యుఁడు నిచ్చలు**
**పరిచర్య యొనర్చి భక్తిపరుఁడై విద్యల్**
**గఱవఁదగుఁ గఱచి దడముగ**
**గురుదక్షిణ యిచ్చి వీడుకొనఁగావలయున్**

**అన్వయం**: గురువునకున్ – శిష్యుఁడు – నిచ్చలున్ – పరిచర్య – ఒనర్చి – భక్తిపరుఁడు + ఐ, విద్యల్ – కఱవన్ – తగున్. కఱచి – గురుదక్షిణ – దడముగన్ – ఇచ్చి – వీడుకొనఁగావలయున్.

**వ్యాఖ్య**: గురువుకు శిష్యుఁడు నిత్యమూ (నిచ్చలు) సేవ చేసి (పరిచర్య యొనర్చి) భక్తిపరుఁడై విద్యలు నేర్చుకోవాలి (కఱవఁదగున్). అలా నేర్చుకొని చివరికి విద్యాభ్యాసం పూర్తి అవ్వగానే దండిగా (దడముగన్) గురుదక్షిణ ఇచ్చి గురువు నుండి వీడ్కోలు తీసుకోవాలి.

**36. కం. దాసుఁడు భృత్యుఁడు నెంతయు**
**వాసిగఁ బనిసేయువారు వారలలోనం**
**దాసుఁడు విలిచిన భటుఁడు**
**ద్భాసిత భృత్యుండు కూలిపనివాఁ డెందున్**

**అన్వయం**: దాసుఁడు – భృత్యుఁడున్ – ఎంతయున్ – వాసిగన్ – పని – చేయువారు. వారలలోనన్ – దాసుఁడు – విలిచిన – భటుఁడు. ఉత్ + భాసిత – భృత్యుండు – ఎందున్ – కూలిపనివాఁడు.

**వ్యాఖ్య**: దాసుడూ, భృత్యుడూ ఇద్దరూ పనివాళ్లే. అయితే వారిలో దాసుఁడు – ధనమో పణమో ఇచ్చి కొనుక్కున్న సేవకుడు (విలిచిన భటుఁడు). ఉద్భాసితుడైన భృత్యుడు అలాకాదు కూలిపనివాడే ఎక్కడైనా.

**37. కం. పసగా జీతము వెట్టక**
**పసచేత నుపాయమునకు బనిగొను బంటున్**
**విసికింపక తగు లబ్ధము**
**పొసఁగఁగ దశమాంశ మిచ్చి పుచ్చఁగవలయున్**

**అన్వయం**: పసగాన్ – జీతము – పెట్టక, పసచేతన్ – ఉపాయమునకున్ – పనిగొను – బంటున్ – విసికింపక – తగు – లబ్ధము – పొసఁగఁగన్ – దశమ + అంశము – ఇచ్చి – పుచ్చఁగవలయున్.

**వ్యాఖ్య**: దండిగా (పసగాన్) జీతం ఇవ్వకుండానే ఒక యజమాని తక్కువ జీతానికి నేర్పుగా (పసచేతన్) ఒక సేవకుణ్ణి ఉద్యోగంలో (ఉపాయమునకున్) నియోగిస్తే – అలా నియోగించిన యజమాని సేవకుణ్ణి (పనిగొను బంటున్) విసిగించకుండా తగిన లాభం (లబ్ధము) పొందినట్లయితే అతడికి – ఆ సేవకుడికి ఆ లాభంలో పదో భాగం ఇచ్చి యజమాని పంపివేయాలి (పుచ్చఁగవలయున్).

**38. కం. పెక్కండ్రు గూడి సమయం**
**బొక్కటి గల్పించి నడుపుచుండుదురేనిన్**
**నిక్కముగా నా సమయము**
**దక్కొని చెల్లించుటయును ధర్మము పతికిన్**

**అన్వయం**: పెక్కండ్రు – కూడి – సమయంబు + ఒక్కటి – కల్పించి – నడుపుచుండుదురేనిన్, నిక్కముగాన్ – ఆ – సమయము – తక్కొని – చెల్లించుటయును – పతికిన్ – ధర్మము.

**వ్యాఖ్య**: అనేకులు కలిసి ఒక నియమం (సమయము) పెట్టుకొని దానిని నిర్వహిస్తున్నట్లయితే నిజంగా ఆ నియమాన్ని తాను అంగీరించి అంటే సాధికారత కల్పించి (తక్కొని), దానికి తగిన ధనాన్ని చెల్లించడం రాజుకు ధర్మం.

**39. కం. జూదపువారల పొందులు**
**కాదని రొగి ధర్మశాస్త్రకర్తలు మఱియున్**
**జూదం బాడెడు పగతుర**
**గాదన రం దర్థసిద్ధి గల దెట్లనినన్**

**అన్వయం:** ధర్మ – శాస్త్రకర్తలు – ఒగిన్ – జూదము + వారల – పొందులు – కాదు + అనిరి. మఱియున్ – జూదంబు + ఆడెడు – పగతురన్ – కాదు – అనరు. అందున్ – అర్థ – సిద్ధి – కలదు. ఎట్లు + అనినన్.

**వ్యాఖ్య**:జూదరులతో సావాసాలు (పొందులు) మంచిది కాదు అని ధర్మశాస్త్రకారులు అన్నారు. ఇంకా జూదం ఆడే శత్రువులను (పగతురన్) వద్దు అనీ అనరు. అందులో ప్రయోజనసిద్ధి ఉండడం వల్ల. అది ఎలాగంటే (మీది పద్యంలోనికి అన్వయం).

**40. కం. ముచ్చులు తెక్కలికాండ్రం**
**జొచ్చిలి యొప్పింతురెపుడు జూదపుసభలం**
**దచ్చోవారల నెఱుగఁగ**
**వచ్చున్ లాభంబెకాదె వసుధేశునకున్**

**అన్వయం**: ముచ్చులు – తెక్కలికాండ్రన్ – చొచ్చిలి – జూదపుసభలందున్ – ఒప్పింతురు. వారలన్ – ఆ + చోన్ – ఎఱుగఁగవచ్చున్. వసుధేశునకున్ – లాభంబు – కాదె?!

**వ్యాఖ్య**: నిత్యమూ దొంగలు (ముచ్చులు) మోసగాళ్ళలో ( తెక్కలికాండ్రన్) కలిసిపోయి – ప్రవేశించి (చొచ్చిలి) జూదపుసభలను అలరింపజేస్తారు

(ఒప్పింతురు). అక్కడ (అచ్చోన్) వారిని కనిపెట్టెయ్యవచ్చు. ఇది రాజుకు (వసుధేశునకున్) లాభం కాదా!

**41. సీ. ఇల్లుగట్టించి యందెల్ల జూదపుజట్టు**
**కరమర్థిం గూరిచి కడఁకఁబెట్టి**
**కితవుల గుణములు కీర్తించి తోడ్తెచ్చి**
**వేడుకతో జూదమాడఁ జొనిపి**
**దొరచేతినమ్మిగఁ దులువచే రోగొని**
**యాడించి గెలిచిన యతనిచేత**
**భాగంబు గెలుపునఁ బదియగుపాలు దాఁ**
**గొని యందు నృపతికిఁ గొంత యిచ్చి**

**గీ. బలియుచేతిధనంబులు బలిమిఁగొనుచు**
**వేగపడకున్కి బొంకమి వెరవు పతియుఁ**
**గల్లజూదరిమెడఁ బాసికలు దగిల్చి**
**కుక్కయచ్చిడి దండుగఁ గొనుటనీతి.**

**అన్వయ:** ఇల్లు – కట్టించి – అందు + ఎల్లన్ – జూదము + జట్టు – కరము + అర్థిన్ – కూరిచి, కడఁకన్ – పెట్టి, కితవుల – గుణములు – కీర్తించి, తోడ్తెచ్చి, వేడుకతోన్ – జూదము + ఆడన్ – జొనిపి, దొర – చేతి – నమ్మిగన్ – తులువచేన్ – రోగొని – ఆడించి, గెలిచిన – అతనిచేతన్ – భాగంబు – గెలుపునన్ – పది + అగు – పాలు – తాన్ – కొని, అందు – నృపతిన్ – కొంత – ఇచ్చి – బలియుచేతి – ధనంబులు – బలిమిన్ – కొనుచున్ – వేగపడక – ఉన్కి – బొంకమి – వెరవు – పతియున్ – కల్ల – జూదరి – మెడన్ – పాసికలు – తగిల్చి – కుక్క + అచ్చు + ఇడి – దండుగన్ – కొనుట – నీతి.

**వ్యాఖ్య:** ఈ పద్యంలో కొంత అన్వయక్లేశం ఉంది. యథాశక్తి ఉన్నది ఉన్నట్లుగా మీముందు ఉంచుతున్నాను. ఇల్లు కట్టించి, అందులో జూదం ఆడే జట్లన్నింటినీ అత్యంత ఆదరంతో (కరమర్థిన్) ఒకచోటికి చేర్చి, వారిని జూదానికి పురికొల్పి (కడఁకఁబెట్టి), జూదరుల (కితవుల) గుణాలను కీర్తించి వారిని తీసుకొనివచ్చి వేడుకతో జూదం ఆడడానికి దూర్చి (జొనిపి), దొర నుండి నమ్మకంతో పందెం డబ్బు తీసుకొని (రోగొని) ఒక తులువచేత జూదం ఆడించి, గెలిస్తే వాడినుండి గెలుపులో పదోవంతు భాగం తాను తీసుకొని, అందులో రాజుకు (నృపతికిన్) కొంత ఇచ్చి, బలవంతుడి ద్వారా ధనాన్ని బలిమితో స్వీకరిస్తూ తొందరపడకుండా

ఉండడం, అబద్ధం ఆడకపోవడం, ఉపాయం (వెరవు) కల దొంగ జూదరి మెడలో పాచికలు తగిల్చి కుక్కచ్చు వేసి శిస్తు వసూలు చేయడం (దండుగఁ గొనుట) రాజుకు నీతి.

**42. ఉ. అంగవిహీనునైన వికలాంగునినైనఁ బ్రసిద్ధరోగదు**
**ష్టాంగునినైనఁ జూచి చెడనాడుట యొప్పనివానిఁ జూచి సౌ**
**మ్యాంగుఁ డితండు వీని కెన యన్యులు లేరని గేలికొంట త**
**ప్పంగట మూఁడు రూకలును నడ్డుగ దండుగు వానిపైఁ బడున్**

**అన్వయం:** అంగ – విహీనునైనన్ – వికల + అంగునినైనన్ – ప్రసిద్ధ – రోగదుష్ట + అంగునినైనన్ – చూచి – చెడనాడుట; ఒప్పనివానిన్ – చూచి – సౌమ్యాంగుఁడు + ఇతండు – వీనికిన్ – ఎన – అన్యులు – లేరు + అని – అంగటన్ – గేలికొంట; తప్పు. మూఁడు – రూకలును + అడ్డుగ – దండుగు – వానిపైన్ – పడున్.

**వ్యాఖ్య:** అంగవిహీనుణ్ని, వికలాంగుణ్ని, కుష్ఠాది ప్రసిద్ధరోగాలతో దుష్టమైన శరీరంగలవాడినీ (రోగ దుష్టాంగునిన్) చూసి అసహ్యించుకోవడం, ఛో ఛో అని తూలనాడటం (చెడనాడుట), అలాగే అంగడిలో (అంగటన్) గిట్టనివాణ్ణి (ఒప్పనివానిన్) పట్టుకుని అందరూ వినేట్టుగా – బాహాటంగా ఆహాహా! ఎంతటి సౌమ్యుడండీ! ఇతడికి సాటివచ్చేవాడు ఈ లోకాన ఎవ్వరూ లేడండి (అన్యులు లేరు)! అంటూ ఎగతాళి చెయ్యడమూ (గేలికొనుట – గేలికొంట) తప్పే. ఈ తప్పులకు ప్రాయశ్చిత్తం – మూడురూకలపైన అర్ధరూపాయి (అడ్డుగ). అంటే మూడున్నరరూపాయలు అపరాధ శుల్కం (దండుగు). ఇది అలా తూలనాడినవాడిమీదా, గేలి చేసినవాడినమీదా పడుతుంది. అంత దండుగు వారు చెల్లించాలని.

**43. కం. గురుఁ దల్లిని దండ్రిని సో**
**దరుని నకారణమ ప్రల్లదముఁ బల్కిన ము**
**ష్కరుచేత నూఱు పణములు**
**ధరణీశుఁడు గొనుట నీతి దండువు పేరన్**

**అన్వయం**: గురున్ – తల్లిని – తండ్రిని – సోదరునిన్ – అకారణము + అ, ప్రల్లదమున్ – పల్కిన – ముష్కరుచేతన్ – నూఱు – పణములు – ధరణీ + ఈశుఁడు – దండువు – పేరన్ – కొనుట – నీతి.

**వ్యాఖ్య**: గురువును గానీ, కన్న తల్లిని గానీ, తండ్రిని గానీ సోదరుణ్ని గానీ –

అకారణంగా నిందించినా అపవాదులు వేసినా తూలనాడినా (ప్రల్లదముఁ బల్కినన్) ఆ దుర్మార్గుడి నుంచి (ముష్కరుచేతన్) అపరాధ శుల్కం పేరున (దండువు పేరన్) నూరు రూపాయలు (పణములు) వసూలు చెయ్యడం రాజుగారికి – పరిపాలకుడికి (ధరణీశుడు) నీతి, విధి.

**44.** తే.గీ. **వాని తల్లి తోఁబుట్టును వాని యాలు**
**వాని లంజెలు వారికిఁ దాను మగఁ డ**
**ననుచు నీ క్రియ బూతాటలాడి తిట్టు**
**నతని గొనఁదగుఁ బంచవింశతి పణములు**

**అన్వయం**: వాని – తల్లి, తోఁబుట్టును – వాని – ఆలు, వాని – లంజెలు, వారికిన్ – తాను – మగఁడన్ – అనుచున్ – ఈ – క్రియన్ – బూతాటలు + ఆడి – తిట్టు + అతనిన్ – పంచవింశతి – పణములు – కొనన్ – తగున్.

**వ్యాఖ్య**: వాడి తల్లి, వాడి సోదరి, వాడి పెళ్ళాం, వాడి ఉంపుడుగత్తెలు (లంజెలు) – అందరికీ నేనే మొగుణ్ని (మగడన్) అంటూ ఈ రకంగా (ఈ క్రియన్) అమ్మా అక్కా ఆలీ బూతులాడి ఎవరినో తిట్టేవాడి సొమ్ములు పాతిక రూపాయలు (పంచవింశతి పణములు) దండువు వేసి పాలకుడు వసూలు చెయ్యవచ్చు (కొనదగున్).

**45.** కం. **తనకంటె నధికుఁ బరసతి**
**నెనిక మిగులఁ దిట్టెనేని నేఁబది పణముల్**
**తనకంటె హీనుఁ దిట్టినఁ**
**దనరగఁ బంద్రెండు నరయు దండుగు గలుగున్**

**అన్వయం:** తనకంటెన్ – అధికున్, పరసతిన్ – ఎనిక – మిగులన్ – తిట్టెనేనిన్ – ఏఁబది – పణముల్; తనకంటెన్ – హీనున్ – తిట్టినన్ – తనరగన్ – పంద్రెండున్ + అరయున్ – దండుగు – కలుగున్.

**వ్యాఖ్య:** తనకన్నా అధికుణ్ని గానీ, పరకాంతను (పరసతిన్) గానీ లెక్కలేనంతగా (ఎనిక = గణన. ఎనిక మిగులన్) తిడితే వాడికి ఏభైరూపాయలు (పణముల్) దండుగు వేసి వసూలు చెయ్యాలి. తనకన్నా హీనుణ్ణి ఎవడైనా తిడితే అతడికి – పన్నెండున్నర రూపాయలు దండుగు వేసి రాబట్టాలి. ఇవన్నీ పాలకుల విధులు.

**46.** కం. **క్రమమఱి శూద్రుఁడు విప్రో**
**త్తము పైనిం దప్పు లేక తా గర్వితుఁడై**
**యుమిసినఁ బెదవులు కోయుట**
**యుమికొలఁ దినిపించు టుచిత మ్మర్వీశులకున్**

**అన్వయం:** శూద్రుఁడు – క్రమము + అఱి – విప్ర + ఉత్తముపైనిన్ – తప్పులేక – తాన్ – గర్వితుఁడై – ఉమిసినన్, పెదవులు – కోయుట, ఉమికొలన్ – తినిపించుట – ఉర్వీశులకున్ – ఉచితము.

**వ్యాఖ్య:** పద్ధతి విడిచిపెట్టి (క్రమమఱి), ఒక శూద్రుడు తాను గర్వితుడై, ఏ తప్పూ చెయ్యనివాడూ అలాగే తనకు ఏ అపకారమూ చెయ్యనివాడూ అయిన ఒక విప్రోత్తముడిమీద – ఉమ్మివేసినట్టయితే, ఆ శూద్రుడి పెదవులు కత్తిరించడమో, అంతే కొలత ఉమ్మిని (ఉమికొలన్) అతడితో తినపించడమో, పాలకులు (ఉర్వీశులకున్) శిక్షగా విధించడం సముచితం.

**47. కం. ఏ యంగముఁ గొని శూద్రుఁడు**
**పాయక విప్రునకుఁ దాను బాధకుఁడగు వాఁ**
**డా యంగము కోఁతపడక**
**పోయెద ననరాదు తనకు భూపతిచేతన్**

**అన్వయం:** ఏ – అంగమున్ – కొని – శూద్రుఁడు – పాయక – విప్రునికున్ – తాను – బాధకుఁడు + అగున్. వాఁడు – తనకు – భూపతిచేతన్ – ఆ + అంగము – కోఁతపడక – పోయెదన్ – అనరాదు.

**వ్యాఖ్య:** శూద్రుడు తన కరచరణాద్యవయవాలలో ఏ అంగంతో ఒక విప్రుణ్ని హింసించాడో బాధపెట్టాడో (బాధకుడగున్) ఆ అవయవాన్ని పరిపాలకుడు (భూపతి) ఖండించాలి. అలా కోతపడకుండా తనకు తాను తప్పించుకుంటాననీ (పోయెదన్) తప్పించుకోగలననీ ఎవడైనా భావించే పరిస్థితీ, అనే పరిస్థితీ దేశంలో ఉండకూడదు. కోతపడక పోయెద ననరాదు.

**48. కం. ప్రీతిఁ గులశ్రేష్ఠునిపై**
**నాతతముగ లేని బ్రహ్మహత్యాదిమహా**
**పాతకము వెట్టి తిట్టిన**
**యాతం డేనూటనాలు గచ్చుఁ బణంబుల్**

**అన్వయం**: ప్రీతిన్ – ఆతతముగన్, కుల – శ్రేష్టునిపైన్ – లేని – బ్రహ్మహత్యా + ఆది – మహాపాతకము + పెట్టి – తిట్టిన + ఆతండు; ఏను + నూట నాలుగు – పణంబుల్ – అచ్చున్.

**వ్యాఖ్య:** ఒక ఉత్తముడిమీద (కులశ్రేష్ఠునిపైన్) లేనిపోని అపనిందలు మోపి, బ్రహ్మహత్యాది మహా పాపాలు అంటగట్టి (పాతకమువెట్టి) నిందించినవాడు

(తిట్టిన యాతండు) – అయిదు వందల నాలుగు (ఏనూట నాలుగు) రూపాయలు అపరాధ రుసుం చెల్లించాలి, దండువు కట్టాలి. కడతాడు. (అచ్చుట = దండువు కట్టుట). ఆతండే – నూట నాలుగు అనీ విడుతుంది. అప్పుడు నూటనాలుగు రూపాయలు అపరాధరుసుం అవుతుంది.

**49.** **కం.** **భూవల్లభు వేదవిదుని**
**దైవతమును దిట్టినతఁడు దండువు పేరన్**
**వే వణముల నెనిమిదిటిని**
**వేవేగమె యఋవవలయు విధిమంతముగన్**

**అన్వయం**: భూవల్లభున్ – వేదవిదునిన్ – దైవతమును – తిట్టిన + అతఁడు – వేయి + పణములన్ – ఎనిమిదిటిని – దండువు – పేరన్ – విధిమంతముగన్ – వేవేగమె – అఋవవలయున్.

**వ్యాఖ్య:** భూమికి భర్త అయిన మహారాజును గానీ (భూవల్లభున్) వేదపండితుణ్ని గానీ(వేదవిదునిన్), దేవుణ్ని గానీ నిందించినవాడు – రుసుముగా (దండువు పేరన్) ఎనిమిది వేల పణాలు (వే + పణములు = వేవణములు) వేవేగంగా, విధిగా (విధిమంతముగన్) చెల్లించాలి, ప్రభుత్వానికి కట్టాలి. దండువు రూపంగా ఆ సొమ్ముకు అతడు బాకీ ఉన్నట్లు (అఋవవలయున్).

**50.** **కం.** **ఎవ్వరులేనెడ నొక్కఁడు**
**నొవ్వంగా నడిచెనేని నొప్పి కొలఁదియున్**
**జివ్వకతము నరయందగు**
**నొవ్విన్ వాఁడెగ్గులాడు నుత్తమునైనన్**

**అన్వయం:** ఎవ్వరున్ – లేని + ఎడన్ – ఒక్కఁడు – నొవ్వంగాన్ – అడిచెనేనిన్ – నొప్పి – కొలఁదియున్ – చివ్వ – కతమున్ – అరయన్ – తగున్. వాఁడు – నొవ్విన్ – ఉత్తమున్ + ఐనన్ – ఎగ్గులాడున్.

**వ్యాఖ్య:** ఎవ్వరూ లేని చోట ఒక్కడు నొప్పి కలిగేలా కొట్టినట్లయితే (అడిచెచేనిన్) ఆ నొప్పి కొద్దీ జరిగిన పోట్లాటను – దాని కారణాన్ని (చివ్వకతము) తెలుసుకోవాలి. నొప్పితో (నొవ్విన్) వాడు ఉత్తముణ్ణైనా నిందిస్తాడు (ఎగ్గులాడున్).

**51.** **కం.** **అడిచెద నని యూఁకించుట**
**యడుచుట మెయి తట్టు గట్ట నడుచుట నెత్తు**
**ర్వెడలఁగ నడుచుట విఋఁగఁగ**
**నడుచుట యొండొంటికంటె నధికపుఁ దప్పుల్**

**అన్వయం:** అడిచెదను + అని – ఊఁకించుట – అడుచుట, మెయి – తట్టు – కట్టన్ – అడుచుట, నెత్తుర్ – వెడలఁగన్ – అడుచుట, విఱుఁగఁగన్ – అడుచుట – ఒండు + ఒంటికంటెన్ – అధికము + తప్పుల్.

**వ్యాఖ్య:** ఎవరినైనా కొడతాను (అడిచెదన్) అని బెదిరించడం (ఊఁకించుట) కొట్టడానికి సిద్ధ పడటం, కొట్టడం, శరీరం తట్టుగట్టేలాగా కొట్టడం, నెత్తురు కారేలాగా (వెడలగన్) కొట్టడం, కాలో చెయ్యో విరిగేలాగా తన్నడం – ఇవన్నీ ఒకదానికన్నా ఒకటి పెద్ద తప్పులు (అధికపు దప్పుల్).

**52. కం. హీనుని నడిచిన నర్థము**
**హీనుఁ డధికు నడిచెనేని నినుమడి సరివాఁ**
**డైనఁ బది పణము లచ్చుట**
**తానుచితము తప్పు కొలఁదిఁ దగు రెట్టింపన్**

**అన్వయం:** హీనున్ – అడిచినన్ – అర్థము, హీనుఁడు – అధికున్ – అడిచెనేనిన్ – ఇనుమడి. సరివాఁడు + ఐనన్ – పది – పణములు – తాను – అచ్చుట – ఉచితము. తప్పు – కొలఁదిన్ – రెట్టింపన్ – తగున్.

**వ్యాఖ్య:** తప్పుకు తగ్గట్టుగా దండువు ఉండాలి. తప్పు పెరిగితే దండువూ రెట్టింపు అవ్వాలి. ఇది ఉచితం అనేది సూత్రం. దీనికి విస్తరణ ఈ పద్యం. ఒక బలవంతుడు బలహీనుణ్ణి తన్నినట్లయితే (అడిచినన్) రెండున్నర (అర్ధము) రూకలు దండు వనుకుంటే, బలహీనుడే తిరగబడి బలాధికుణ్ని తన్నినట్లయితే – దండువు రెట్టింపు అవ్వాలి. (ఇక్కడ ఈ పదాలు కులవర్గ సూచకాలు కూడా). ఇనుమడి అంటే రెట్టింపు. అయిదు రూకలు అచ్చుకట్టాలి. సరిసమానుణ్ని తన్నితే పది రూకలు (పణములు) దండువు కట్టడం (అచ్చుట) అవసరం, ఉచితం. చివరిది పది కాబట్టి, సగం సగం తగ్గించుకుంటూ ముందుకు వెళ్ళాలి కాబోలు!

**53. కం. మెడ చెయ్యి కన్ను పాదము**
**తొడ నాలుక ముక్కు చెవులు తునియలుగాఁ దా**
**నడిచెదనని యొరుఁ బరుసము**
**నొడివినతఁడు దండు గచ్చు నూఱు పణంబుల్**

**అన్వయం:** మెడ – చెయ్యి – కన్ను – పాదము – తొడ – నాలుక – ముక్కు – చెవులు – తునియలు – కాన్ – తాను – అడిచెదను – అని – ఒరున్ – పరుసమున్ – ఒడివిన + అతఁడు – నుఱు పణంబుల్ – దండుగ – అచ్చున్.

**వ్యాఖ్య:** బల గర్వంతో ఎవడైనా ఒకడు – ఎదుటివాడి మెడనో చెయ్యినో కన్నునో కాలునో తొడనో నాలుకనో ముక్కునో చెవునో – తుత్తునియలు చేసేస్తాను (తునియలుగాన్ తాన్ – అడిచెదన్) ఖబడ్దార్ – అని పరుషంగా పలికితే, బెదిరిస్తే – అతగాడు వంద రూపాయలు దండువు కట్టవలసి ఉంటుంది, కట్టాలి (దండుగు + అచ్చున్).

**54. కం. ఒక్కనిఁ బెక్కండ్రడిచినఁ**
**దక్కఁగ వేర్వేఱ రెట్టి దండువు గొని తా**
**నక్కజముగ దండించుట**
**నిక్కపు ధర్మంబు మేదినీనాథునకున్**

**అన్వయం:** ఒక్కనిన్ – పెక్కండ్రు – అడిచినన్ – తక్కఁగన్ – వేర్వేఱ – రెట్టి – దండువు – కొని – తాను – అక్కజముగన్ – దండించుట – మేదినీనాథునకున్ – నిక్కము + ధర్మంబు.

**వ్యాఖ్య:** ఒక్కణ్ణి పట్టుకొని పదిమంది కలిసి తన్నినట్లయితే (పెక్కండ్రు + అడిచినన్), వెనకాడకుండా వేర్వేరుగా ఆశ్చర్యకరంగా వాళ్లల్లో ఒక్కొక్కడి దగ్గరా రెట్టింపు రెట్టింపు దండువు వసూలుచేసి, దండించడమే మహారాజులకు (మేదినీ – నాథులకున్) నిక్కమైన – నిఖార్సయిన – ధర్మం.

**55. కం. రెండును నాలుగుపణములు**
**దండువగున్ క్షుద్రపశువుఁ దగు పశువును ను**
**ద్దండత నడిచిన నతనికి**
**దండువు దానెక్కు నొప్పిదళమున నెపుడున్**

**అన్వయం:** ఉద్దండతన్ – క్షుద్ర – పశువున్ – తగు – పశువునున్ – అడిచిన – అతనికిన్ – రెండును – నాలుగు – పణములు – దండువగున్. నొప్పి – దళమునన్ – దండువు – తాను – ఎక్కున్.

**వ్యాఖ్య**: భయంకరంగా (ఉద్దండతన్) చిన్న (క్షుద్ర) పశువులనూ అలాగే తగుపాటి పెద్ద పశువులనూ కొడితే అలా కొట్టిన వాడికి (అడిచిన అతనికిన్) వరుసగా చిన్న పశువులకైతే రెండు పణాలూ, పెద్దపశువులకైతే నాలుగు పణాలు దండువు పడుతుంది (దండువగున్). ఆ నొప్పి అధిక్యాన్నిబట్టీ (దళమునన్) ఆ దండువు ఎక్కువవుతుంది.

**56. ఆ.వె. ముటికినాటివారు మొఱకులు పెనుపరు**
**లఱవవారు ద్విజుల కాస పెద్ద**

**యనుచు దేశభాషలను గులంబును దిట్టు**
**నతఁడు దండు వచ్చు శతపణములు**

**అన్వయం:** ముఱికినాటివారు – మొఱకులు – పెనుపరులు – అఱవవారు – ద్విజలకున్ – అస – పెద్ద – అనుచున్ – దేశ భషలను – కులంబును – తిట్టు + అతఁడు – సతపణములు – అచ్చున్.

**వ్యాఖ్య:** కులం పేరెత్తి తిట్టడం, శాఖలపేర్లు పెట్టి తిట్టడం – నాడూ నేడూ రెండూ నేరాలే. బ్రాహ్మణులలో మురికినాట్లు మూర్ఖులనీ (మొఱకులు), ద్రావిడులు (అఱవవారు) నేర్పరులనీ (పెనుపరులు), అసలు మొత్తంగా బ్రాహ్మణులకు అత్యాశ (ఆస–పెద్ద) అనీ – ఇలా దేశభాషలలో ఎవరైనా ఎవరినైనా తిడితే అతగాడు వంద రూకలు (శతపణములు) దండువు కట్టాలి (అచ్చున్).

**57. కం. దేవసమూహంబెల్లను**
**గోవుశరీరంబునందుఁ గొనకొనియుండుం**
**గావున గోవుమహత్త్వము**
**భావింపఁగరాదు నిజము బ్రహ్మకునైనన్**

**అన్వయం:** దేవ – సమూహంబు + ఎల్లను – గోవు – శరీరంబునందున్ – కొనకొని – ఉండున్ – కావునన్ – గోవుమహత్త్వము – బ్రహ్మకున్ + ఐనన్ – భావింపఁగరాదు. నిజము.

**వ్యాఖ్య:** దేవసమూహంమొత్తం గోవుశరీరం లోనే ఉంటుంది కాబట్టి ఆవు గొప్పతనం (గోవుమహత్త్వము) ఎంతటిదో నిజంగా బ్రహ్మకైనా ఊహింప నలవి కాదు.

**58. కం. రేపకడ గోవుపంచిత**
**మే పురుషుం డెవ్వఁడైన నెప్పుడు నియమం**
**బోపి తలఁ జల్లుకొనినం**
**బాపముచెడుఁ బుణ్యలోక ఫలము ల్గలుగున్**

**అన్వయం:** ఎవ్వఁడు + ఐనన్ – ఏ – పురుషుఁడు – రేపకడన్ – గోవు – పంచితము – ఎప్పుడున్ – నియమంబు + ఓపి – తలన్ – చల్లుకొనినన్ – పాపము – చెడున్. పుణ్యలోక – ఫలముల్ – కలుగున్.

**వ్యాఖ్య:** ఉదయాన్నే (రేపకడ) గోమూత్రాన్ని (పంచితము) ఏ పురుషుడు వాడు ఎవ్వడైనా సరే నిత్యమూ నియమం పెట్టుకొని (ఓపి) తలపై చల్లుకొన్నట్లయితే వాడికి పాపం పోతుంది (చెడున్) పుణ్యలోక ఫలాలూ కలుగుతాయి.

**59. కం. ఏపార గోవుఁ జంపిన**
**పాపాత్మునిఁ బట్టి తెచ్చి బఱియలఁ గోపో**
**ద్దీపితులయి యడిచి యతనిఁ**
**గాపాలము వ్రేసి చంపఁగా ధర్మమగున్**

**అన్వయం:** ఏపు + ఆరన్ – గోవున్ – చంపిన – పాప + ఆత్మునిన్ – పట్టి – తెచ్చి – పఱియలన్ – కోప + ఉద్దీపితులు + ఐ – అడిచి – అతనిన్ – కాపాలము – వ్రేసి – చంపఁగాన్ – ధర్మము + అగున్.

**వ్యాఖ్య:** రెచ్చిపోయి మరీ (ఏపారన్) గోవును చంపిన పాపాత్ముణ్ణి పట్టి తెచ్చి కర్రబద్దలతో (పఱియలన్) కోపోద్దీపితులై కొట్టి (అడిచి) అతణ్ణి కాపాలము – కపాలం నరికి (వ్రేసి) చంపడం ధర్మం.

**60. సీ. ఖలులతో నెమ్మెయిఁ గలిసిన విప్రుండు**
**మొఱయిడి నచటికిఁ బరవకున్న**
**రిత్తనె యుత్తము మొత్తినఁ జండాలు**
**నంటిన భ్రష్టశూద్రాదులకును**
**బితృదేవభుజ్యముల్ పెట్టినఁ దల్లితోఁ**
**బుట్టువు పేరఁ దానొట్టుగొన్న**
**వేదాదివిద్య శూద్రాదికిఁ జెప్పినఁ**
**బొరిఁ బెద్ద లిచ్చిన పొత్తు ధనముఁ**

**గీ. బొడిచి తానీక కుడిచిన విడిచి తండ్రిఁ**
**గొడుకు నన్నలఁ దమ్ముల, గురునిఁ బత్ని**
**వెలయఁగాఁ దప్పు లేకయె విడిచెనేని**
**నతఁడు తా నచ్చు నృపతికి శతపణములు**

**అన్వయం:** విప్రుండు – ఖలులతోన్ – ఎమ్మెయిన్ – కలిసినన్, మొఱ + ఇడినన్, అచటికిన్ – పరవక + ఉన్నన్, రిత్తనె – ఉత్తము – మొత్తినన్, చండాలున్ – అంటినన్, భ్రష్ట – శూద్ర + ఆదులకును, పితృ – దేవ – భుజ్యముల్ – పెట్టినన్, తల్లి – తోబుట్టువు – పేరన్ – తాన్ – ఒట్టు – కొన్నన్, వేద + ఆది – విద్యన్ – శూద్ర + ఆదికిన్ – చెప్పినన్, పొరిన్ – పెద్దలు + ఇచ్చిన – పొత్తు – ధనమున్ – పొడిచి, తండ్రిన్ – కొడుకున్ – అన్నలన్ – తమ్ములన్ – విడిచి – తాను – ఈక – కుడిచినన్, గురునిన్ – పత్నిన్ – వెలయఁగాన్ – తప్పు – లేక + ఎ – విడిచెనేనిన్ – అతఁడు – తాన్ – నృపతికిన్ – శతపణములు – అచ్చున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణుడికి వందరూకలు (శతపణములు) దండువు వేసే అపరాధాలు చెబుతున్నాడు. ఏ రకంగానైనా (ఎమ్మెయిన్) తాగుబోతులూ జూదరులూ వగైరా దుష్టులతో (ఖలులతోన్) సహవాసం చేసినా; మరొకడు ఏదో ఇబ్బందిలో ఉండి మొరపెడితే అతడికి సహకరించడానికి పరుగుపరుగున వెళ్ళకపోయినా (పరవక + ఉన్నన్), ఉత్తిపుణ్యానికి అకారణంగా ఉత్తముణ్ని మొత్తినా; చండాలుణ్ని తాకినా (అంటినన్); గుణభ్రష్టులైన శూద్రాదులకు తన పితరుల ప్రసాదాన్ని గానీ దేవతాప్రసాదాన్ని గానీ (పితృ–దేవ–భుజ్యముల్) పెట్టినా; ఫలానా పని చెయ్యకపోతే నేను నా తల్లికి పుట్టినవాడినే కాను – అని తల్లిపేరుమీద పుట్టుకకు సంబంధించి ఒట్టు పెట్టినా; వేదాది విద్యలను శూద్రాదులకు నేర్పినా, అందంగా (పొరిన్) తమ పెద్దలు కూడబెట్టి అందించిన ఉమ్మడి సొమ్మును (పొత్తు ధనమున్) తానే వశపరుచుకుని (పొడిచి) తండ్రినీ కొడుకునూ అన్నదమ్ముల్నీ అందరినీ విడిచిపెట్టేసి వారికెవ్వరికీ ఏమీ ఇవ్వకుండా (ఈక = ఇవ్వక) అంతా తానే అనుభవించినా (కుడిచినన్), అలాగే ఏ తప్పూ లేకపోయినా గురువును విడిచిపెట్టినా, ఇల్లాలిని (పత్నిన్) విడిచిపెట్టినా – ఆ విప్రుడికి రాజు వందరూకలు దండువు వెయ్యాలి.

**61. కం. మడివా లొడయని వస్త్రము**
**తడఁ బఱిచిన నమ్మికొనినఁ దా రో యిడినన్**
**బడిదియ వెట్టినఁ గట్టిన**
**నడయఁ బణత్రయము దండు వఱుపఁగవలయున్**

**అన్వయం:** మడివాలు – ఒడయని – వస్త్రము – తడఁబఱిచినన్, అమ్మికొనినన్, రో + ఇడినన్ – తాన్ – బడిదియ + పెట్టినన్; తాన్ – కట్టినన్; పణత్రయము – దండువు – అఱుపఁగవలయున్.

**వ్యాఖ్య:** యజమానుడి (ఒడయడు – ఒడయని) దుస్తుల్ని – ఒక ఇంటివి వేరొక ఇంట్లో ఇవ్వడలాంటి తారుమారు వ్యవహారాలు చేసినా – (తడబఱిచినన్); లేదా తానే వాటిని అమ్మేసుకొన్నా; ఎవడో వచ్చి ఒక రూపాయి సొమ్ము (రో) ఇస్తే వాడికి వీటిని బాడుగకు – అద్దెకు – ఇచ్చినా (బడిదె – బడిదియపెట్టుట = అద్దె కిచ్చుట), తానే కట్టుకున్నా – ఆ మడివాలుకి (మడివాలు = ఇంటి రజకుడు) మూడు రూకలు (పణత్రయము) దండువు విధించి వసూలు చెయ్యాలి (అఱుపగవలయున్).

**62. కం. వెల యెనిమిదియగు పాలును**
**వెల నాలవ పాలును నోలి విడువఁగవలయున్**

**తొలురేవున మలురేవునఁ**
**జెలువేదఁగఁ జాకి చీరచెఱిచినచోటన్**

**అన్వయం:** చాకి – చెలువు + ఏదఁగన్ – చీర – చెఱిచిన – చోటన్, తొలిరేవునన్ – వెలన్ – ఎనిమిది + అగు – పాలును, మలిరేవునన్ – నాలవపాలును – ఓలిన్ – విడువఁగవలయున్.

**వ్యాఖ్య:** రజకుడు (చాకి) బట్టల్ని రేవులో ఉదుకుతున్నప్పుడూ ఉడకబెడుతున్నప్పుడూ – రంగులు పోయి వెలిసి పోవడమో, బండకు బాదడంలో చిరిగిపోవడమో జరుగుతుంటుంది. రజకుడు తగిన జాగ్రత్త తీసుకోలేదని దీని అర్థం. అందుకని దండువు చెబుతున్నాడు. కొత్త ధోవతి – కొత్త కోక (చీర) మొదటి (తొలు–తొలి) ఉదుకులోనే అందం అంతరించేట్టు (చెలువు + ఏదగన్) దాన్ని చెడగొడితే (చెఱిచినచోటన్) దాని వెలలో ఎనిమిదోవంతు (ఎనిమిదియగు పాలు) చెల్లించాలి. రెండవ ఉదుకులో (మలిరేవునన్ – మలురేవునన్) చెలువం అంతరించేట్టు చెడగొడితే దాని ధరలో నాల్గవ వంతు – ఇదే క్రమంలో (ఓలిన్) ఒడయనికి దండువు చెల్లించాలి ఆ రజకుడు.

మొదటి రేవులోనే పోయిందంటే చీర ఏమంత నాణ్యమైనది కాదని. కాబట్టి దండువు తక్కువ. మలిరేవుల్లో పాడయితే రజకుడిదే తప్పు కాబట్టి దండువు ఎక్కువ అని కాబోలు ఆంతర్యం.

**63.** కం. **గరళానల శస్త్రాదులఁ**
**బరహింస యొనర్చెనేనిఁ బంద్రెండును పై**
**నరమాడ యఱువవలయును**
**సరి చావఁగవలయు నెదిరిఁ జంపినచోటన్**

**అన్వయం:** గరళ + అనల – శస్త్ర + ఆదులన్ – పరహింస – ఒనర్చెనేనిన్ – పంద్రెండును – పైన్ – అరమాడ – అఱువన్ – వలయును. ఎదిరిన్ – చంపినచోటన్ – సరి – చావఁగన్ – వలయున్.

**వ్యాఖ్య:** విషప్రయోగం (గరళ) చేసి గానీ, నిప్పులతో (అనల) కాల్చి గానీ, కర్ర – కత్తి మొదలైనవాటితో (శస్త్రాదులన్) కొట్టి గానీ – పరహింస చేసినవాడికి పన్నెండున్నర మాడలు అపరాధపు రుసుం వేసి వసూలు చెయ్యాలి (అరువవలయున్). హింసించడం కాకుండా సరాసరి ఎదుటివారిని (ఎదిరిన్) చంపేస్తే దానికి సరిసమానంగా ఈ హంతకుడు సైతం చావాలి (చావంగవలయున్). అంటే, మరణ దండన విధించాలి.

**64. కం. చంపినవానిని సరిగాఁ**
**జంపుట తగు విప్రుఁడైనఁ జంపక పతి త**
**త్సంపదఁ గొని తలగొఱిగి ప**
**దంపడి కుక్కచ్చు వ్రాసి దండింపఁదగున్**

**అన్వయం:** చంపినవానిన్ – సరిగాన్ – చంపుట – తగున్. విప్రుఁడైనన్ – చంపక, తత్ – సంపదన్ – కొని, తల గొఱిగి, పదంపడి – కుక్క + అచ్చు – వ్రాసి, పతి – దండింపఁదగున్.

**వ్యాఖ్య:** ఒకణ్ని చంపినవాణ్ని మహారాజుగారు (పతి) సరికిసరి అన్నట్టుగా చంపడం తగిన దండనమే (తగున్). కానీ హంతకుడు బ్రాహ్మణుడైతే ఇలా మరణదండన విధించకూడదు. చంపకుండా, అతడి స్థిరచరాస్తుల సంపద మొత్తం స్వాధీనం చేసేసుకుని, అతడికి గుండు కొట్టించి (తల – గొఱిగి), వీలైతే ముఖంమీద లేదా వీపుమీద – శరీరంలో ఎక్కడో ఒకచోట – కుక్క ఆకారాన్ని (కుక్క బొమ్మ) వాతగా పెట్టించి (కుక్కచ్చు – వ్రాసి) విడిచిపెట్టెయ్యాలి. ఇలా దండించడం భూపాలుడికి తగినపని (తగున్).

**65. కం. అచ్చులుఁ ద్రాసులుఁ దూములుఁ**
**బొచ్చెంబుగఁజేసి కపటమున నమ్మెడి యా**
**ముచ్చువణిజు లొక్కొక్కఁడ**
**యచ్చుగఁ బండ్రెండుమాడ లరువఁగవలయున్**

**అన్వయం:** అచ్చులున్ – త్రాసులున్ – తూములున్ – పొచ్చెంబుగన్ – చేసి – కపటమునన్ – అమ్మెడి – ఆ – ముచ్చు – వణిజులు – ఒక్కొక్కఁడన్ – అచ్చుగన్ – పండ్రెండు – మాడలు – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** అచ్చులు, త్రాసులు, తూములు, తక్కువగా అంటే ఉండవలసిన పరిమాణాలూ బరువులూ లేకుండా మోసపుచ్చేలా (పొచ్చెంబుగన్) చేసి కపటంగా అమ్మే ఆ దొంగ వ్యాపారులు (ముచ్చువణిజులు) ఒక్కొక్కచోట అచ్చంగా పన్నెండు మాడలు అంటే ఆరు వరహాలు చెల్లించాలి (అరువఁగవలయున్).

**66. కం. సతియుం బతియును సుతుఁడును**
**బితరుఁడు నొండొరులతోడఁ బెనఁగెడు చో సా**
**క్షిత గైకొని మాన్పకయు**
**న్నతఁడు పణత్రయము దండు వరుగవలయున్**

**అన్వయం:** సతియున్ – పతియును – సుతుఁడును – పితరుఁడున్ – ఒండొరులతోడన్ –పెనఁగెడుచోన్ – సాక్షితన్ – కైకొని – మాన్పక + ఉన్న – అతఁడు – పణత్రయము – దండువు –అరుగవలయున్.

**వ్యాఖ్య:** సతీ, పతీ అంటే భార్యాభర్తలూ, అలాగే తండ్రీ కొడుకులూ ఒకరితో ఒకరు గొడవపడుతున్నట్లయితే (పెనఁగెడునచోన్) సాక్ష్యం (సాక్షితన్) తీసుకొని కూడా అంటే తాను సాక్షిగా ఉండి కూడా ఆ గొడవ మాన్పని అతడు మూడు పణాలు (పణత్రయము) దండువుగా చెల్లించాలి (అరుగవలయున్).

**67. కం. నేరని వెజ్జటికము దా**
**నేరుతునని రాజపురుషునికి నితరునికిన్**
**క్షారాదు లిడిన దుర్జను**
**నారసి కొనవలయు నుత్తమాధమ విధులన్**

**అన్వయం:** నేరని – వెజ్జటికము – తాన్ నేరుతును + అని, రాజపురుషునికిన్ – ఇతరునికిన్ – క్షార + ఆదులు – ఇడిన – దుర్జనున్ – ఉత్తమ + అధమవిధులన్ – ఆరసి – కొనవలయున్.

**వ్యాఖ్య:** తెలియని వైద్యం (నేరని వెజ్జటికము) నాకు తెలుసునని రాజపురుషుడికిగానీ అన్యులకుగానీ తెలిసీ తెలియని మందుల్ని, చూర్ణాల్నీ (క్షారాదులను) ఇచ్చినట్లయితే ఆ దుర్జనుణ్ణి రాజుగారు ఉత్తమ అధమ విధులకు యథేష్టంగా వినియోగించుకోవచ్చు.

**68. కం. కొలుచాదిగఁ గల బండముఁ**
**గొలుచునెడం దూఁచుచోటఁ గుటిలతఁ దఱుఁగన్**
**గొలిచినఁ దూఁచిన బండము**
**దళమున బేహారిమీఁద దండువు దగులున్**

**అన్వయం:** కొలుచు – ఆదిగన్ – కల – బండమున్ – కొలుచునెడన్ – తూఁచుచోటన్ –కుటిలతన్ – తఱుఁగన్ – కొలిచినన్ – తూచినన్ – బండము – దళమునన్ – బేహారిమీఁదన్ – దండువు – తగులున్.

**వ్యాఖ్య:** కొలుచుధాన్యం మొదలైన వస్తువులను (బండమున్) కొలిచేటప్పుడుగానీ తూచేటప్పుడుగానీ మోసపూరితంగా (కుటిలతన్) తక్కువయ్యేటట్టు (తఱుఁగన్) కొలిచినా తూచినా ఆ వస్తువు అంత ఎక్కువ (దళమునన్) పరిమాణంలో ఆ వ్యాపారిపై (బేహారి) జరిమానా (దండువు) పడుతుంది.

**69. కం. మందులఁ గొలుచుల రసముల**
**యందును గంధములయందు నన్యద్రవ్యం**
**బొందఁగలిపి యమ్మినతఁడు**
**దండడి షోడశపణంబు దండువుపెట్టున్**

**అన్వయం:** మందులన్ – కొలుచులన్ – రసముల + అందును – గంధముల + అందును – అన్య – ద్రవ్యంబు – ఒందన్ – కలిపి – అమ్మిన + అతఁడు – దండి – షోడశ – పణంబు – దండువు + పెట్టున్.

**వ్యాఖ్య:** మందులలో కొలుచుధాన్యాలలో రసాలలో గంధాలలో ఇతరపదార్థాలను కలిపి కల్తీ చేసి అమ్మిన అతడు పెద్దమొత్తంగా (దండడి) పదహారుపణాలు దండువు కట్టాలి.

**70. కం. చందనాగరు రత్న వస్త్రముల పేర**
**జాతిగాని ద్రవ్యంబును జాతియనుచు**
**నమ్మెనేనియు నవ్వెల యష్టగుణము**
**లతఁడు దండువు రాజున కరువవలయు**

**అన్వయం:** చందన + అగరు – రత్న – వస్త్రముల – పేరన్ – జాతి – కాని – ద్రవ్యంబును – జాతి – అనుచున్ – అమ్మెనేనియున్, ఆ + వెల – అష్ట – గుణములు – అతఁడు రాజునకున్ – దండువు – అరువవలయున్.

**వ్యాఖ్య:** చందనం, అగురు, రత్నాలు, వస్త్రాల పేరుతో జాతి కాని ద్రవ్యాన్ని జాతి అని చెప్తూ అమ్మినట్లయితే ఆ వెలకు ఎనిమిదిరెట్లు (అష్టగుణములు) అతడు రాజుకు దండువు కట్టాలి.

**71. కం. పెక్కంద్రు సమయమునఁ దా**
**రొక్కటియై తమకు లాభమొదవుకొఱకు వే**
**రొక్కగ్గువు గల్పించినఁ**
**దక్కక యుత్తమవిధంపు దండువు దగులున్**

**అన్వయం:** పెక్కంద్రు – సమయమునన్ – తారు – ఒక్కటి + ఐ, తమకున్ – లాభము + ఒదవుకొఱకున్ – వేరు + ఒక్క + అగ్గువున్ – కల్పించినన్ – తక్కక – ఉత్తమవిధము – దండువు – తగులున్.

**వ్యాఖ్య:** అనేకులు నియమపూర్వకంగా తాము ఒక్కటైపోయి, తమకు లాభం రావడంకోసం వేరొక ధరను (అగ్గువు) కల్పించినట్లయితే వదిలిపెట్టకుండా అందులో ఉత్తమవిధమైన దండువు పడుతుంది.

**72. కం. పరులఁ గొననీక వణిజులు**
**పరఁగంగా సరకు గడిపి పదఁపడి కాలాం**
**తరమునఁ దెక్కువ నమ్మిన**
**ధరణీశుఁడు వారినెల్ల దండింపదగున్**

**అన్వయం:** వణిజులు – పరఁగంగాన్ – పరులన్ – కొననీక – సరకు – గడిపి – పదఁపడి – కాల + అంతరమునన్ – తెక్కువన్ – అమ్మినన్ – ధరణీశుఁడు – వారిన్ – ఎల్లన్ – దండింపన్ – తగున్.

**వ్యాఖ్య:** పరులను కొననివ్వకుండా దాచిపెట్టి వ్యాపారస్థులు సరకును అమ్మకుండా కాలం గడిపి (కడిపి) ఆపై కొంత కాలంతర్వాత (కాలాంతరమునన్) ఎక్కువ ధరకు తెగించి అమ్మినట్లయితే రాజు (ధరణీశుఁడు) వారినందరినీ దండించడం ఉచితం.

**73. కం. నెలనెల రాజొక యగ్గువు**
**నిలిపిన నా యగ్గువునన నిచ్చలు నమ్మ**
**న్వలయుం దారొక యగ్గువు**
**నిలుపుట వణిజులకుఁ దప్పు నిక్కంబరయన్**

**అన్వయం:** రాజు – ఒక – అగ్గువు – నెల నెల – నిలిపినన్ – ఆ + అగ్గువునన్ – నిచ్చలున్ – వణిజులకున్ – అమ్మన్ – వలయున్. తారు – ఒక – అగ్గువు – నిలుపుట – నిక్కంబు – అరయన్ – వణిజులకున్ – తప్పు.

**వ్యాఖ్య:** నెలనెలా రాజు ఒక వెల (అగ్గువు) స్థిరీకరించినట్లయితే (నిలిపినన్) ఆ వెలలోనే నిత్యం (నిచ్చలు) అమ్మాలి కానీ దానిని అతిక్రమించి తాము మరో వెల నిర్ణయించుకొని పెట్టుకొని అమ్ముకోవడం (నిలుపుట) వణిజులకు నిజం చెప్పాలంటే తప్పు.

**74. కం. నెలప్రతి కల్పించునెడన్**
**విలిచి నతని వ్యయము విడిచి వేయిటికిని నూ**
**ఱలవడ లాభ మతనికిం**
**గలయట్లుగ నగ్గు వర్థిఁ గల్పింపఁ దగున్**

**అన్వయం:** నెలప్రతి – కల్పించునెడన్ – విలిచిన – అతని – వ్యయము – విడిచి – వేయిటికిని – నూఱు – అలవడన్ – లాభము – అతనికిన్ – కల + అట్లుగన్ – అగ్గువు – అర్థిన్ – కల్పింపన్ – తగున్.

**వ్యాఖ్య:** నెలప్రతి కల్పించే సందర్భంలో కొన్న (విలిచిన) అతడి వ్యయం విడిచి, వెయ్యికి

నూఱు అలవడేలా లాభం అతడికి ఉండేలా వెల (అగ్గువు) కల్పించడం తగినది.

**విశేషాలు:** ప్రతినెలా రాజు – వర్తకులు అమ్మే సరకులకు నిర్ణయించే ధరల పట్టీని నెలప్రతి అంటారు.

**75. కం. కట్టఁ దగని వృషభాదులఁ**
**గట్టిన మునుగట్టువడిన గజఘోటాదిన్**
**నెట్టన విడిచిన నాతం**
**డిట్టలముగ నచ్చు వేయు నెనిమిదిపణముల్**

**అన్వయం:** కట్టన్ – తగని – వృషభ + ఆదులన్ – కట్టినన్ – ముని – కట్టు – పడిన – గజ – ఘోట + ఆదిన్ – నెట్టనన్ – విడిచిన – ఆతండు – ఇట్టలముగన్ – ఎనిమిది – పణముల్ – అచ్చు – వేయున్.

**వ్యాఖ్య:** కట్ట తగని వృషభము మొదలైన పశువులను కట్టివేసినా ఇంతకుముందు కట్టివేయబడిన ఏనుగులూ గుఱ్ఱాలు మొదలైన జంతువులనూ (గజ ఘోటాదిన్) అనివార్యంగా (నెట్టనన్) విడిచినా వాడు పెద్దమొత్తంలో (ఇట్టలముగన్) ఎనిమిదిపణాలు జరిమానా చెల్లించాలి.

**76. కం. వెలగొని యమ్మినబండము**
**తలకొని వేఱొకని కమ్మఁ దగ దమ్మినఁ దా**
**వెల యినుమడి యొడయనికిని**
**వెల యినుబడి రాజునకును విధి నరువ దగున్**

**అన్వయం:** వెలగొని – అమ్మిన – బండము – తలకొని – వేఱొకనికిన్ – అమ్మన్ – తగదు. అమ్మినన్ – తాన్ – ఇనుమడి – వెల – ఒడయనికిని – యినుబడి – వెల – రాజునకును – విధిన్ – అరువన్ – తగున్.

**వ్యాఖ్య:** ఒక వస్తువుకు ఇంతధర అని చెప్పి కొన్నవారినుంచి దానికి తగిన వెల స్వీకరించి అమ్మిన వస్తువును (బండము) కావాలని (తలకొని) మరో వ్యక్తికి అమ్మకూడదు. అమ్మితే అలా అమ్మినవాడు తాను రెట్టింపు (ఇనుమడి) వెల మొదటి యజమానికి (ఒడయనికిని) అలాగే రెట్టింపు (ఇనుబడి) వెల రాజుకూ విధిగా చెల్లించాలి (అరువన్ తగున్).

**77. కం. వెలగొని యమ్మినబండము**
**విలిచి నతని కీనివాఁడు వేగమె దానం**
**గల లాభము దానీఁదగుఁ**
**గలసేగియు నెఱిఁగి యరువఁగా దగుఁ బిదపన్**

**అన్వయం:** వెలగొని – అమ్మిన – బండము – విలిచిన – అతనికిన్ – ఈనివాఁడు – వేగమె – దానన్ – కల – లాభము – తాన్ – ఈన్ + అగున్. కల – సేగియున్ – ఎఱిఁగి – పిదపన్ –అరువఁగాన్ – తగున్.

**వ్యాఖ్య:** వెల తీసుకొని అమ్మిన వస్తువు (బండము) కొన్నవాడికి (విలిచిన అతనికిన్) ఇవ్వనివాడు వేగమే దానికి కల లాభాన్ని తాను ఇవ్వాలి. అలాగే అందులోని నష్టాన్నీ (సేగియున్) ఎఱిగి – తరువాత చెల్లించాలి(అరువఁగాన్ తగున్).

**78. కం. పదియింటికి నొకటియు నిరు**
**వదియేనిటి కొక్కటియును బర నిజ దేశా**
**స్పదభాండంబులవలనను**
**విదితపు లాభంబు గలుగు వెల యిడవలయున్**

**అన్వయం:** పది + ఇంటికిన్ – ఒకటియున్ – ఇరువది + ఏనిటికిన్ – ఒక్కటియును – పర – నిజ – దేశ + ఆస్పద – భాండంబుల వలనను – విదితము + లాభంబు – కలుగు – వెలన్ – ఇడవలయున్.

**వ్యాఖ్య:** విదేశీ వస్తువులవల్ల (పర దేశాస్పదభాండంబులవలనను) పదింటికి ఒకటీ; స్వదేశీ వస్తువులవల్ల (నిజ దేశా స్పదభాండంబులవలనను) ఇరవైయ్యేదింటికి ఒక్కటీ స్పష్టమైన లాభం (విదితపు లాభంబు) కలిగేలా వెల నిర్ణయించాలి.

**79. కం. అమ్మినధన మొడయఁడు గై**
**కొమ్మనఁగా విలిచి నతఁడు గొనకుండిన దై**
**వమ్మున నదిచెడెనేనియు**
**నమ్మినధనమెల్ల విలుచు నాతనిక చెడున్**

**అన్వయం:** అమ్మిన – ధనము – ఒడయఁడు – కైకొమ్మనఁగాన్ – విలిచిన – అతఁడు – కొనకుండినన్ –దైవమ్మునన్ – అది చెడెనేనియున్ – అమ్మిన – ధనము + ఎల్లన్ – విలుచు + ఆతనిక + అ – చెడున్.

**వ్యాఖ్య:** అమ్మిన సరుకును యజమాని (ఒడయఁడు) తీసుకోమంటే కొన్నవాడు (విలిచిన అతఁడు) తీసుకోకపోతే (కొనకుండినన్) దైవవశాత్తూ అది చెడిపోతే – ఆ అమ్మిన సరుకు మొత్తం కొన్నవాడికే (విలుచు ఆతనిక) చెడుతుంది. అంటే ఆ నష్టం అతడే కొన్నవాడే – తీసుకోమంటే తీసుకోలేదు కాబట్టి భరించాలి.

**80. కం. పెక్కం డ్రొక్కటియై తా**
**రొక్క బెహారంబె యాడుచుండఁగ దానం**

**దక్కువ గలిగిన నందఱు**
**నొక్కటిగా ననుభవించు టుచితం బెందున్**

**అన్వయం:** పెక్కండ్రు – ఒక్కటి + ఐ – తారు – ఒక్క – బెహారంబు + ఎ – ఆయాడుచుండఁగన్ – దానన్ – తక్కువ – కలిగినన్ – అందఱున్ – ఒక్కటిగాన్ – అనుభవించుట – ఎందున్ – ఉచితంబు.

**వ్యాఖ్య:** అనేకులు కలిసి (పెక్కండ్రు ఒక్కటియై) తాము ఒకే వ్యాపారం (ఒక్క బెహారంబె) చేస్తుంటే – ఆ వ్యాపారంలో నష్టం (తక్కువ) గలిగితే దానిని అందరూ కలిసి ఒక్కటిగా అనుభవించడం ఎక్కడైనా సరే ఉచితంబు.

**81. కం. పొత్తులవా రెడపడినం**
**బొత్తులవారొప్పకున్న పొందునఁ జని తా**
**విత్తము చెఱిచినఁ జెఱిచిన**
**పొత్తులధన మపుడె తగులుఁ బోయి నతనికిన్**

**అన్వయం:** పొత్తులవారు – ఎడపడినన్ – పొత్తులవారు – ఒప్పకున్నన్ – పొందునన్ – చని – తాను – విత్తము – చెఱిచినన్ – చెఱిచిన – పొత్తుల – ధనము – పోయిన – అతనికిన్ – అపుడె – తగులున్.

**వ్యాఖ్య:** పొత్తులలో ఉన్నవారు విడిపోయినప్పుడూ (ఎడపడినన్) లేదా పొత్తులో ఉన్నవారు ఒప్పుకోకపోయినా పొత్తునుంచి విడిపోయి ఆ పొత్తులో ఉన్న వ్యక్తి తాను స్వతంత్రంగావిత్తం పాడుచేసినట్లయితే (చెఱిచినన్) అలా పాడుచేసిన ఉమ్మడి విత్తం (పొత్తులధనము) అపుడే పొత్తునుంచి విడిపోయినవాడికి తగులుతుంది.

**82. కం. జనపతిచే ముచ్చులచే**
**ధనమునకును హానిపుట్టుతఱి నెవ్వడు నే**
**ర్పునఁ గాచి తెచ్చు నతనికి**
**ధనమున దశమాంశమీగ దగు బేహారుల్.**

**అన్వయం:** జనపతిచేన్ – ముచ్చులచేన్ – ధనమునకును – హాని – పుట్టు – తఱిన్ – ఎవ్వడు –నేర్పునన్ – కాచి – తెచ్చున్ – అతనికిన్ – ధనమునన్ – దశమ + అంశము – బేహారుల్ –ఈగన్ – తగున్.

**వ్యాఖ్య**: రాజుచేతా (జనపతిచేన్) దొంగలచేతా (ముచ్చులచేన్) సొత్తునకు చేటు కలిగే సమయంలో (హానిపుట్టుతఱిన్) ఎవడైతే నేర్పుతో ఆ సొత్తును కాపాడి

తెస్తాడో అతడికి ఆ సొత్తులో పదోవంతు (దశమాంశము) వ్యాపారస్థులు (బేహారుల్) ఇవ్వడం ఉచితం (ఈగన్ తగున్).

**83. కం. సర కమ్మెడు బేహారులు**
**నరపతి సుంకరుల కెక్క నమ్మికతోడన్**
**సరకమ్మిన సొమ్మున దాఁ**
**రిరువదియగు పాలు సుంక మీఁదగుఁ బ్రీతిన్**

**అన్వయం:** సరకు + అమ్మెడు – బేహారులు – నరపతి – సుంకరులకున్ – ఎక్కన్ – నమ్మికతోడన్ – సరకు + అమ్మిన – సొమ్మునన్ – తారు – ఇరువది + అగు – పాలు – సుంకము – ప్రీతిన్ – ఈన్ – తగున్.

**వ్యాఖ్య:** సరకు అమ్మే వ్యాపారులు(బేహారులు) రాజు నియోగించిన పన్నువసూలు చేసే ఉద్యోగులపట్ల (సుంకరులకున్) మిక్కిలి నమ్మకంతో ఉంటూ సరకును అమ్మిన సొమ్ములో తాము ఇరవయ్యోవంతు (పాలు) సుంకం ప్రీతితో ఇవ్వాలి.

**84. కం. రాజానుభవమగు సరుకు**
**రాజునకును యోగ్యమయిన రత్నావలియున్**
**రాజెఱుఁగకుండ నమ్మిన**
**రాజునకుందక్కు నా సరకు వెల వెలిగాన్**

**అన్వయం:** రాజ + అనుభవము + అగు – సరుకు, రాజునకున్ – యోగ్యము + అయిన – రత్న + ఆవళియున్, రాజు – ఎఱుఁగకుండన్ – అమ్మినన్ – ఆ – సరుకు – వెల – వెలిగాన్ – రాజునకున్ – తక్కున్.

**వ్యాఖ్య:** రాజుగారే అనుభవించదగిన సరుకునుగానీ, రాజు ధరించడానికి యోగ్యమయిన రత్నాదులుగానీ (రత్నావలియున్) రాజుకు తెలియకుండా అమ్మితే ఆ సరకు – వెల ఏమీ లేకుండా (వెలిగాన్) రాజుకే మిగులుతుంది.

**85. కం. సుంకపుటిందుల నాగిన**
**సుంకసరుకుఁ దొంటికొలఁదిఁ జూపకయున్నన్**
**బొంకిన నెనిమిది మడుఁగులు**
**సుంకము గొనవలయు భూభుజుఁడు వణిజులచేన్**

**అన్వయం:** సుంకము + ఇందులన్ – ఆగిన – సుంక – సరుకున్ – తొంటి – కొలఁదిన్ – చూపక + ఉన్నన్ – బొంకినన్ – వణిజులచేన్ – భూభుజుఁడు – ఎనిమిది – మడుఁగులు – సుంకము – కొనవలయున్.

**వ్యాఖ్య:** సుంకపుటిళ్ళలో ఆగిన సుంకపుసరుకును మొదట ఉన్నంత మొత్తంగా (తొంటికొలఁదిన్) చూపకుండా ఉన్నా లేక అబద్ధం ఆడినా (బొంకినన్) ఎనిమిది మడుగుల సుంకాన్ని రాజు (భూభుజుఁడు) వణిజులనుంచి వసూలు చేయాలి.

**86. ఆ.వె. తురగమునకుఁ బణము పురుషున కరపణ**
**మాఁడదాని కైన నందుసగము**
**వ్రేఁగుముట్టునందు వ్రేఁగువిడుపునను**
**నోడకూలిగొనుట యుచితమంద్రు**

**అన్వయం:** వ్రేఁగు – ముట్టునందున్ – వ్రేఁగు – విడుపునను – తురగమునకున్ – పణము, పురుషునకున్ – అరపణము, ఆఁడదానికిన్ – ఐనన్ – అందున్ – సగము – ఓడ – కూలి – కొనుట – ఉచితము – అంద్రు.

**వ్యాఖ్య:** ఓడలో బరువును వెయ్యడానికి (వ్రేఁగుముట్టునందున్) బరువు దింపడానికీ (వ్రేఁగువిడుపునను) కూలి, గుర్రానికైతే (తురగమునకున్) పణం చొప్పునా, పురుషుడికి అర పణం చొప్పునా, స్త్రీకి పావు పణం చొప్పునా, తీసుకోవడం ఉచితం అంటారు. దీనికి మూలం.

**పణం యానాంతరే దాప్యః పౌరుషోర్ధపణాంతరే**
**పాదం పశుశ్చ యోషిచ్చ పాదార్ధం రిక్థకః పుమాన్**

**87. ఆ.వె. వేదవిదునిచేత విన్నాణిచేతను**
**దపసిచేతఁ బిన్నదానిచేత**
**రాయబారిచేత రాజపురుషుచేతఁ**
**గూలిపుచ్చుకొనుట చాలఁదప్పు**

**అన్వయం:** వేదవిదునిచేతన్ – విన్నాణిచేతను – తపసిచేతన్ – పిన్నదానిచేతన్ – రాయబారిచేతన్ – రాజపురుషుచేతన్ – కూలి – పుచ్చుకొనుట – చాలన్ – తప్పు.

**వ్యాఖ్య:** వేదం చదివిన విప్రుని దగ్గరా (వేదవిదునిచేతన్) సన్యాసి దగ్గరా (విన్నాణిచేతను) దపస్వి దగ్గరా చిన్నపిల్లల దగ్గరా రాయబారి దగ్గరా రాజపురుషుడి దగ్గరా కూలి (ఓడలో బరువును వెయ్యడానికీ దింపడానికీ) పుచ్చుకోవడం చాలా తప్పు. దీనికి మూలం.

**నభిన్నకార్షాపణ మస్తిశుల్కం న శిల్పవృత్తౌ నశిశౌ న దూతే**
**న భైక్షలబ్ధే న హుతావశేషే న శ్రోత్రియే ప్రవ్రజితేన యజ్ఞః (వి.వ్య. 260)**

**88. కం. వెలసినవిద్యయు వృత్తముఁ**
**గలవిప్రుఁడు పొరువు టింటఁ గలుగఁగఁ దాన**
**న్యులకుం బెట్టిన యాతం**
**డలవడ దశపణము దండు వరువగ వలయున్**

**అన్వయం:** వెలసిన – విద్యయున్ – వృత్తమున్ – కల – విప్రుఁడు – పొరువు + ఇంటన్ – కలుగఁగన్ – తాను – అన్యులకున్ – పెట్టిన – ఆతండు – అలవడన్ – దశపణము – దండువు – అరువగన్ – వలయున్.

**వ్యాఖ్య:** గొప్ప విద్య (వెలసినవిద్య), మంచి నడవడిక (వృత్తము) కల విప్రుఁడు పొరుగింట్లో ఉండగా అతణ్ణి విస్మరించి తాను ఇతరులకు (అన్యులకున్) పెట్టిన వాడు పదిపణాలు దండువు చెల్లించాలి (అరువగ వలయున్).

**89. కం. ద్విజుఁడవినీతుండై యం**
**త్యజఁ గలిసినఁ బణ సహస్రదండమును భగ**
**ధ్వజలాంఛన ఫాలంబును**
**నిజదేశచ్యుతియుఁ గలుగు నిత్య మతనికిన్**

**అన్వయం:** ద్విజుఁడు – అవినీతుండై – అంత్యజన్ – కలిసినన్ – పణ – సహస్ర – దండమును – భగధ్వజ – లాంఛన – ఫాలంబును – నిజ – దేశ – చ్యుతియున్ – నిత్యము – అతనికిన్ – కలుగున్.

**వ్యాఖ్య:** బ్రాహ్మణుడు (ద్విజుఁడు) అవినీతిపరుడై అంత్యకులంలో పుట్టిన స్త్రీతో (అంత్యజన్) కలిసినట్లయితే అతడికి వెయ్యి పణాల శిక్ష, మర్మాంగపు బొమ్మ (భగధ్వజలాంఛనం) ముద్రించిన నుదురు – అంటే నుదుటిపై మర్మాంగముద్ర (ఫాలంబును), దేశబహిష్కారం (నిజదేశచ్యుతియున్) శిక్షగా కలుగుతాయి.

**90. సీ. చెడినసొమ్మెవ్వనిచేనుండు వాని న**
**య్యడుగు చొప్పునఁ బోలి కైనవాని**
**మున్నెల్ల నెఱుఁగంగ ముచ్చెన వానిని**
**నొడయిచ్చతో డాఁగి యున్నవాని**
**నూరుఁగులంబునుఁ బేరు బొంకెడువాని**
**స్త్రీద్యూతసక్తుఁడై తిరుగువానిఁ**
**బెద్దయు మిక్కిలిప్రియము జెప్పెడువానిఁ**
**బరధనములనెందు నరయువాని**

గీ. **నొరు లెఱుంగక యుండంగ నుండువాని**
**నరయునెడ బెగ్గలం పడునట్టివాని**
**నారెకులు ముచ్చులనిపట్టి యరయవలయు**
**నివ్విధంబున నరయక యెఱుఁగరాదు**

**అన్వయం:** చెడిన – సొమ్ము – ఎవ్వని – చేన్ – ఉండు – వానిన్, ఆ – అడుగు – చొప్పునన్ – పోలిక + ఐన – వానిన్, మున్ను + ఎల్లన్ – ఎఱుఁగంగన్ – ముచ్చు + ఐన – వానినిన్, ఒడ + ఇచ్చతోన్ – డాఁగి – ఉన్న – వానిన్, ఊరు – కులంబును, పేరు – బొంకెడువానిన్, స్త్రీ – ద్యూత – సక్తుఁడు + ఐ, తిరుగువానిన్, పెద్దయున్ – మిక్కిలి – ప్రియము – చెప్పెడువానిన్, పర – ధనములన్ – ఎందున్ – అరయువానిన్, ఒరులు – ఎఱుంగక + ఉండంగన్ – ఉండువానిన్, అరయు + ఎడన్ – బెగ్గలంపడు + అట్టి – వానిన్, ఆరెకులు – ముచ్చులు + అని – పట్టి – అరయవలయున్. ఈ + విధంబునన్ – అరయక – ఎఱుఁగరాదు.

**వ్యాఖ్య:** పోయిన సొమ్ము (చెడినసొమ్ము) ఎవ్వడి చేతిలో ఉంటుందో వాణ్ణీ, ఆ అడిగే పద్ధతిలో (అడుగు చొప్పునన్) పోలిక ఐనవాణ్ణీ, ముందు అంతా చూడగా దొంగైన (ముచ్చైన) వాణ్ణీ, ఇచ్ఛతో దాక్కొనే వాణ్ణీ, ఊరూ కులమూ పేరూ అబద్ధం చెప్పేవాణ్ణీ (బొంకెడువానిన్) స్త్రీలపైనా, జూదంపైనా ఆసక్తితో (స్త్రీద్యూతసక్తుఁడై) తిరిగేవాణ్ణీ, పెద్దగా అధికంగా ప్రియం చెప్పేవాడినీ అన్నిచోట్లా పరధనం కోసమే చూసేవాణ్ణీ, ఇతరులు (ఒరులు) ఎవరూ చూడకుండా ఉండే వాణ్ణీ, చూసినప్పుడుభయపడే (బెగ్గలం పడు) వాణ్ణీ, రక్షకభటులు (ఆరెకులు) దొంగలుగా భావించి పట్టుకొని పరిశీలించాలి. ఈ విధంగా చూడకపోతే గానీ తెలియదు.

**91.** కం. **ముచ్చును బట్టిన మాత్రన**
**చెచ్చెర దండింప కతనిచేఁ దెలిగొనివాఁ**
**డచ్చైన విడుపు నిక్కపు**
**మ్రుచ్చైనం దగినదండమును గొనవలయున్**

**అన్వయం:** ముచ్చును – పట్టినమాత్రన – చెచ్చెరన్ – దండింపక – అతనిచేన్ – తెలిగొని – వాఁడు – అచ్చు + ఐనన్ – విడుపు, నిక్కము + ముచ్చు + ఐనన్ – తగిన – దండమును – కొనవలయున్.

**వ్యాఖ్య:** దొంగను (ముచ్చు) పట్టిన మాత్రాన వెంటనే (చెచ్చెరన్) దండింపక అతనిచే ప్రమాణం చేయించి (తెలిగొని) వాడు నిర్దోషి, స్వచ్ఛమైన వాడు (అచ్చు)

అయితే విడిచిపెట్టాలి (విడుపు). నిజమైన దొంగైతే (నిక్కపు ముచ్చైనన్) దగిన దండన వేయాలి.

**అన్యహస్తాత్పరి భ్రష్ట మా కామాదుత్థితం భువి**
**చోరేణ వా ప్రతిక్షిప్తం లోప్త్రం యత్నా త్పరీక్షయేత్**
**అసత్యాసత్య సంకాశా సత్యాశ్చా సత్య సన్నిభాః**
**దృశ్యంతే వివిధాభావా స్తస్మాద్యుక్తం పరీక్షణమ్** (వి.వ్య. **266**)

**92.** సీ. **సొమ్ముతో బట్టి ముచ్చులఁ జిత్రవధచేసి**
**దండింపఁదగు బ్రాహ్మణుండు దాను**
**ముచ్చైన నుదుటఁ గుక్కచ్చిడి సర్వస్వ**
**హరణంబుచేసి పో నడువవలయు**
**ముచ్చు దాఁచిన గ్రామ ముఖ్యుఁడా ధనమొండెఁ**
**జోరుని నొండెను జూపవలయు**
**నూరఁ జొచ్చినను నా యూరి ముఖ్యులు ముచ్చు**
**చొప్పొండె ధనమొండెఁ జూపవలయు**

ఆ.వె. **నదరఁ బెక్కుటూళ్ళ నడుమఁ దెక్కలిగొన్న**
**నన్నియూళ్ళవారు నడువవలయుఁ**
**దప్పుకొలఁది యెఱిగి దండింపఁ జంపను**
**వలయుఁగాన దానిఁ దెలియవినుఁడు**

**అన్వయం:** సొమ్ముతోన్ – పట్టి, ముచ్చులన్ – చిత్ర – వధ + చేసి – దండింపన్ – తగున్. బ్రాహ్మణుఁడు – తాను – ముచ్చు + ఐనన్ – నుదుటన్ – కుక్క + అచ్చు + ఇడి, సర్వస్వ – హరణంబు – చేసి – పోన్ – అడపవలయున్. ముచ్చున్ – దాఁచిన – గ్రామ – ముఖ్యుఁడు – ఆ – ధనము + ఒండెన్, చోరునన్ + ఒండెను – చూపవలయున్. ఊరన్ – చొచ్చినను – ఆ – ఊరి – ముఖ్యులు – ముచ్చు – చొప్పు + ఒండెన్, ధనము + చూపవలయున్. అదరన్ – పెక్కు + ఊళ్ళ – నడుమన్ – తెక్కలి + కొన్నన్ – అన్ని + ఊళ్ళవారున్ – అడువవలయున్. తప్పుకొలది – ఎఱిగి – దండింపన్ – చంపను – వలయున్. కానన్ – దానిన్ – తెలియన్ – వినుడు.

**వ్యాఖ్య:** సొమ్ముతో బట్టుకొని దొంగల్ని చిత్రవధచేసి దండించాలి. బ్రాహ్మణుడు తాను దొంగైతే అతడి నుదుట కుక్కచ్చు వేసి సర్వస్వమూ స్వాధీనం చేసుకొని (హరణంబుచేసి) ఊర్లోంచి పంపించివేయాలి (పో నడువవలయున్). దొంగ

దొంగిలించిన ధనాన్ని దాచిపెట్టిన ఊరికి పెద్దయైన వ్యక్తి (గ్రామ ముఖ్యుఁడు) ఆ ధనాన్నిగానీ దొంగనిగానీ చూపాలి. దొంగ ఊరిలోనికి ప్రవేశిస్తే ఆ ఊరిపెద్దలు దొంగ ఆచూకీగానీ ధన్నాన్నిగానీ చూపాలి. ఎక్కువగా (అడరన్) పెక్కుటూళ్ళ మధ్య దొంగతనం జరిగితే (తెక్కలిగొన్నన్) అన్ని ఊళ్ళవారూ కలిసి దొంగను దండించాలి (అడువవలయున్). తప్పుకొద్దీ తెలుసుకొని మరీ దండించడమో చంపడమో చెయ్యాలి కాబట్టి అది తెలిసేలా వినండి.

**93. కం. నెఱిమాలి బందెవెట్టిన**
**నఱిముఱిఁ జంపినను గజము నశ్వము ముచ్చై**
**పఱిగొనిన యట్టివారలఁ**
**గొఱుల దిగిచి చంపు టొప్పుఁ గువలయపతికిన్**

**అన్వయం:** నెఱిమాలి – బందె + పెట్టినన్ – అఱిముఱిన్ – చంపినను – గజమున్ – అశ్వము – ముచ్చు + ఐ – పఱి – కొనిన – అట్టి – వారలన్ – కొఱులన్ – తిగిచి – చంపుట – కువలయపతికిన్ – ఒప్పున్.

**వ్యాఖ్య:** అన్యాయంగా (నెఱిమాలి) బందె పెట్టినా, అనాలోచితంగా (అఱిముఱిన్) చంపినా, గజాన్నీ అశ్వాన్నీ దొంగై అపహరించినా (పఱిగొనినన్) అటువంటివారిని – వారి శరీరంలోనికి శూలాలు దించి (కొఱుల దిగిచి) చంపటం రాజుకు (కువలయపతికిన్) తగినది.

**మూలం:**

**బందీగ్రాహాం స్తథా వాజి కుంజరాణాం చ హారిణః**
**ప్రసహ్య ఘాతినశ్చైవ శూలా నారోప యేన్నరాన్ (యా.వ్య. 271)**

**94. కం. ముచ్చిమి పొరపిన వారలఁ**
**గ్రచ్చఱ దండించి ధనముగలవారికి రా**
**జిచ్చుట తగు నీఁడేనిన్**
**వచ్చు నతని పాపమెల్ల వసుధేశునకున్**

**అన్వయం: ముచ్చిమి – పొరపిన – వారలన్ – క్రచ్చఱన్ – దండించి – ధనము – కల – వారికిన్ – రాజు – ఇచ్చుట – తగున్. ఈఁడు + ఏనిన్ – వసుధా + ఈశునకున్ – అతని – పాపము + ఎల్లన్ – వచ్చున్.**

**వ్యాఖ్య:** దొంగతనం చేసినవారిని (ముచ్చిమి పొరపినవారిని) శీఘ్రమే (క్రచ్చఱ) దండించి ఎవరి ధనం వారికి రాజు ఇవ్వాలి. అది తగినది. అలా ఇవ్వకపోతే –

దొంగ తాలూకూ పాపం మొత్తం రాజుకు (వసుధేశునకున్) వస్తుంది.

**95. చ. వెలయఁగ సొమ్ముతోడ ముడివిడ్పులఁ బట్టిన జుట్ట వ్రేలితోఁ**
**గలయఁగఁ బెద్ద వ్రేల్నఱికి క్రమ్మఱ వీడ్చిన గాలుఁ జేయునుం**
**జలమఱఁ దున్మి మూడవగుసారి సహింపక యూరెఱుంగఁగాఁ**
**దలఁ దెగవ్రేసి చంపు టుచితం బగు నాయకులైనవారికిన్**

**అన్వయం:** వెలయఁగన్ – సొమ్ముతోడన్ – ముడివిడ్పులన్ – పట్టిన – చుట్టవ్రేలితోన్ – కలయఁగన్ – పెద్దవ్రేల్ – నఱికి – క్రమ్మఱన్ – వీడ్చిన – కాలున్ – చేయునున్ – చలమఱన్ – తున్మి – మూడవ + అగు – సారి – సహింపక – ఊరు – ఎఱుంగఁగాన్ – తలన్ – తెగన్ – వ్రేసి – చంపుట – నాయకులు + ఐన – వారికిన్ – ఉచితంబు.

**వ్యాఖ్య:** సొమ్ముతో కలిపి దొంగలను (ముడివిడ్పులన్) పట్టుకొన్నట్లయితే ఉంగరపువేలుతో (చుట్ట వ్రేలితోన్) బెద్దవేలు – నడిమి వేలు నఱికాలి. తిరిగి మళ్ళీ దొంగతనం చేస్తే (క్రమ్మఱ వీడ్చినన్) కాళ్ళూ చేతినీ చలమారగా నరకాలి. అలా నరికి (తున్మి), మూడోసారికూడా చేస్తే ఇంక సహించకూడదు. ఊరందరికీ తెలిసేట్టుగా అతడి తలను తెగవేసి చంపడం నాయకులైనవారికి తగినది.

**మూలం:**

**అంగులీగ్రంథి భేదస్య ఛేదయేత్ ప్రథమే గ్రహే**
**ద్వితీయే హస్తచరణౌ తృతీయే వధమర్హతీతి** (వి.వ్య. 272)

**96. ఆ.వె. కాయగూర కట్టె కసవు మంచముపీటఁ**
**యినుము నుప్పు గడవ లివియుమొదలు**
**చవిలెలోనివెలల సరకు ముచ్చిలినవాఁ**
**డాఱుపణము దండు వరువవలయు**

**అన్వయం:** కాయ + కూర – కట్టె – కసవు – మంచము – పీటన్ – ఇనుమున్ – ఉప్పు – కడవలు – ఇవియున్ – మొదలు – చవిలెలోని – వెలల – సరకు – ముచ్చిలినవాఁడు – ఆఱుపణము – దండువు – అరువవలయున్.

**వ్యాఖ్య:** కాయగూరలూ కట్టెలూ గడ్డి (కసవు), మంచం, పీట, ఇనుము, ఉప్పు, కడవ ఇవి మొదలు చవిలె = కానీ కంటే తక్కువ వెల ఉండే సరకును దొంగిలించినవాడు (ముచ్చిలినవాఁడు) ఆఱుపణాలు దండువు చెల్లించాలి (అరువవలయున్).

**విశేషాలు:** చవిలె: 1) Four dubs or coins, of the value of twenty cash each, 2) Four cavilehs equal one టంకము. నాలుగు డబ్బులు.

**97. చ.** **పొడవను జంపనుం జనుట పోలనెఱింగియుఁ దాను వారితో**
**నెడనెడ మాటలాడినను నిల్లడమిచ్చినఁ గూడువెట్టినం**
**బొడువ గఁ గైదు విచ్చినను బుద్ధులుచెప్పిన ద్రోహి గానఁ ద**
**ప్పుడుగక వానిపైఁ దగులు నుత్తమసాహసదండ మెమ్మెయిన్**

**అన్వయం:** పొడవను – చంపనున్ – చనుట – పోలన్ – ఎఱింగియున్ – తాను – వారితోన్ – ఎడనెడన్ – మాటలు + ఆడిననున్ – ఇల్లడము – ఇచ్చినన్ – కూడు + పెట్టినన్ – పొడువగన్ – కైదువు + ఇచ్చినను – బుద్ధులు – చెప్పినన్ – ద్రోహి – కానన్ – తప్పు – ఉడుగక – వానిపైన్ – ఏ + మెయిన్ – ఉత్తమ – సాహస – దండము – తగులున్.

**వ్యాఖ్య:** పొడవడానికీ, చంపడానికీ వెళ్ళడం తెలిసీ (పోలనెఱింగియున్) తాను అటువంటివారితో అప్పుడప్పుడూ అక్కడక్కడా (ఎడనెడన్) మాటలాడినా, ఆశ్రయం ఇచ్చినా (ఇల్లడము), భోజనం పెట్టినా (కూడువెట్టినన్), పొడవడానికి ఆయుధం ఇచ్చినా, వారికి బుద్ధులుచెప్పినా, అలా చెప్పినవాడు ద్రోహి అవుతాడు కాబట్టి ఆ దోషం పోదు. అలా పోకుండా వాడిపై ఉత్తమమైనసాహసదండన ఎలాగైనా పడుతుంది.

**98. కం.** **ఎక్కువవెల ద్రవ్యంబులు**
**స్రుక్కక ప్రుచ్చిలినచోటఁ జూఱగొనినచో**
**నొక్కటికిం బదునొక్కటిఁ**
**దక్కక వెలచేకొనుటయె తగువారలచేన్**

**అన్వయం:** ఎక్కువ – వెల – ద్రవ్యంబుల – స్రుక్కక – ప్రుచ్చిలినచోటన్ – చూఱగొనినచోన్ – ఒక్కటికిన్ – పదునొక్కటిన్ – తక్కక – వెల – చేకొనుటయె – వారలకున్ – తగున్.

**వ్యాఖ్య:** ఎక్కువ వెల ఉన్న ద్రవ్యాలు దొరకకుండా స్రుక్కకుండా దొంగిలించినచోట (ప్రుచ్చిలినచోటన్) కనుగొనబడినట్లయితే – చూరగొన్నట్లయితే ఒకటికి పదకొండు తగ్గకుండా వారినుండి వెల తీసుకోవడం తగినది.

**99. సీ.** **ఉత్తమపురుషుని యుత్తమ రత్నంబుఁ**
**జన ప్రుచ్చిలినవానిఁ జంపవలయు**

**నన్యులెవ్వరి ధనమైనను గొనఁ జేయ**
**నెనిమిది పణములు గొనఁగవలయుఁ**
**బరసతీహారకుఁ బట్టించి సర్వస్వ**
**హరణంబు నృపతి చేయంగవలయుఁ**
**కన్నియనే చెఱగొన్నట్టి దుర్జనుఁ**
**జిత్రవధంబుగాఁ జేయవలయుఁ**

**ఆ.వె. గన్న మిడఁగ రాత్రిఁ గన్నచో ముచ్చులఁ**
**దోడితెచ్చి కేలు త్రుంచివైచి**
**వాడి కొఱ్ఱుల దిగిచి వారిఁ జంపుట రాజ**
**ధర్మ మనుచు నూత్నదండి చెప్పె**

**అన్వయం:** ఉత్తమ – పురుషుని – ఉత్తమ – రత్నంబున్ – చనన్ – ముచ్చిలిన – వానిన్ – చంపవలయున్. అన్యులు – ఎవ్వరి – ధనము + ఐనను – కొనన్ – చేయన్ – ఎనిమిది – పణములు – కొనఁగవలయున్. పర – సతీ – హారకున్ – పట్టించి – సర్వస్వ – హరణంబు – నృపతి – చేయంగవలయున్. కన్నియనే – చెఱ + కొన్న + అట్టి – దుర్జనున్ – చిత్రవధంబు – కాన్ – చేయవలయున్. రాత్రిన్ – కన్నము – ఇడగన్ – కన్నచోన్ – ముచ్చులన్ – తోడతెచ్చి – కేలు – త్రుంచివైచి, వాడి – కొఱ్ఱులన్ – తిగిచి – వారిన్ – చంపుట – రాజ – ధర్మము – అనుచున్ – నూత్నదండి – చెప్పెన్.

**వ్యాఖ్య:** ఒక ఉత్తమపురుషుడినుంచి ఒక ఉత్తమరత్నాన్ని (చనన్ = తొలగిపోయేట్టు) అపహరించినవాడికి (ముచ్చిలినవానిన్) మరణ దండన. అన్యులు ఎవరైనాసరే వారి ధనాన్ని కాజేసినా వాడికి ఎనిమిది పణాలు జరిమానా. ధనాన్ని యజమానుడికి ఇప్పించేసిన తరువాత ఈ శిక్ష. పరసతిని అపహరించినవాణ్ని (పరసతీ హారకున్) పట్టుకుని వాడి సర్వస్వాన్నీ రాజుగారు (నృపతి) స్వాధీనం చేసేసుకోవాలి. కన్యనే చెరపట్టిన దుర్మార్గుణ్ని చిత్రవధ చెయ్యాలి. రాత్రిపూట ఎవడి ఇంటికైనా కన్నం వేస్తుంటే ఆ దొంగలను పట్టుకుని కొలువుకు తీసుకువచ్చి (తోడితెచ్చి) చేయి నరికెయ్యాలి (కేలు త్రుంచివైచి). బహుశ కుడి చెయ్యి కాబోలు! వాడిగా పదునుగా ఉండే కొఱ్ఱులు దిగ్గొట్టి వాళ్ళను చంపెయ్యాలి. కొరత వెయ్యాలనికాబోలు. ఇది రాజధర్మం. అని ఈ అభినవ దండి (మూలఘటిక కేతన) చెబుతున్నాడు.

**100. క. పిడికెడు పిడికెడు ధాన్యము**
**నడిచి కడుం దప్పిపడిన నరుఁ డొక్కొక్క యం**

**గడిఁ జని పుచ్చుకొనం దగు**
**నొడయఁడు వలదనక దాని కొడఁబడవలయున్**

**అన్వయం:** నడిచి – కడున్ – దప్పి – పడిన – నరుఁడు – ఒక్కొక్క – అంగడిన్ – చని – పిడికెడు – పిడికెడు – ధాన్యము – పుచ్చుకొనన్ – తగున్ – ఒడయఁడు – వలదనకన్ – దానికిన్ –ఒడఁబడవలయున్.

**వ్యాఖ్య:** నడిచి బాగా (కడున్) అలసిపోయి దప్పిపడిన నరుఁడు ఒక్కొక్క అంగడికి వెళ్ళి పిడికెడు పిడికెడు ధాన్యం చొప్పున పుచ్చుకోవచ్చు. యజమాని (ఒడయఁడు) వలదనకుండా దానికి ఒప్పుకోవాలి.

**101. కం.** **ఒకనికిని జంపను జెఱుపను**
**బ్రకటితముగఁ బోవ నెఱిఁగి బలవంతుఁడు వా**
**నికి నడ్డపడకయున్నను**
**మొకమోడక పణసహస్రముల గొనవలయున్**

**అన్వయం:** ఒకనికిని – చంపను – చెఱుపను – ప్రకటితముగన్ – పోవన్ – ఎఱిఁగి – బలవంతుఁడు – వానికిన్ – అడ్డపడక + ఉన్నను – మొగము + ఓడక – పణ + సహస్రములన్ – కొనవలయున్.

**వ్యాఖ్య:** ఒకడు మరొకణ్ణి చంపడంకోసంగానీ చెఱచడం కోసంగానీ బాహాటంగా (ప్రకటితముగన్) వెళ్తుంటే అలా వెళ్ళడం తెలిసీ బలవంతుడైనవాడు వాడికి అడ్డుపడకుండా ఉంటే ఆ బలవంతుడి దగ్గరనుంచి మొహమోటం లేకుండా (మొకమోడక) వెయ్యిపణాలు (పణసహస్రములన్) వసూలు చేయాలి.

**102. కం.** **కరణమ ప్రుచ్చిలెనేనియు**
**గురుబలి సుతుఁజంపెనేనిఁ గోరి పెదవులుం**
**గరమును ముక్కును జెవులును**
**సరి దునియఁగ నడిచి సురియఁ జంపఁగవలయున్**

**అన్వయం:** కరణము + అ – ప్రుచ్చిలెనేనియున్ – గురుబలి – సుతున్ – చంపెనేనిన్ – కోరి – పెదవులున్ – కరమును – ముక్కును – చెవులును – సరి – తునియఁగన్ – అడిచి – సురియన్ – చంపఁగవలయున్.

**వ్యాఖ్య:** కరణమే దొంగతనం చేస్తే (ప్రుచ్చిలెనేనియున్) గురుబలి = మహాబలశాలి ఒకడు సుతుణ్ణి చంపినట్లయితే కోరి పెదవులూ చేయ్యీ ముక్కూ చెవులూ తెగకోసి (సరి తునియఁగన్) శిక్షించి చురకత్తితో (సురియన్) జంపాలి.

**103. సీ.** **ఒకని నెవ్వ రెఱుంగకుండంగఁ జంపి తాఁ**
**జంపినవాఁడు ప్రచ్ఛన్నుఁడైనఁ**
**జచ్చిన యాతని నెచ్చెలి భృత్యుని**
**నన్నదమ్ముని బట్టి యరచియైన**
**నతివల వేర్వేర యడిగి చచ్చిన పొంత**
**నెలసెడువారల నెల్లనరసి**
**యే యర్థములవెంట నెవ్వరితోడను**
**బెనఁకువ గలిగెనో యనియు నడిగి**

**గీ.** **చంపుటకుఁ దగినట్టి యా శంక యొరుల**
**మీఁదఁ దగిలిన వారల నూఁదిపట్టి**
**యరసి తెలివిని శుద్ధి లేదయ్యెనేని**
**తగినదండంబు దండింపఁ దగును బతికి**

**అన్వయం:** ఒకనిన్ – ఎవ్వరు – ఎఱుంగక + ఉండంగన్ – చంపి, తాన్ – చంపినవాఁడు – ప్రచ్ఛన్నుఁడు + ఐనన్, చచ్చిన – ఆతని – నెచ్చెలిన్ – భృత్యునిన్, అన్న + తమ్మునిన్, పట్టి – అరచి + ఐనన్, అతివలన్ – వేర్వేర – అడిగి, చచ్చిన – పొంతన్ – ఎలసెడు – వారలన్ + ఎల్లన్ – అరసి, ఏ – అర్థములవెంటన్ – ఎవ్వరితోడను – పెనఁకువ – కలిగెనో – అనియున్ – అడిగి, చంపుటకున్ – తగిన + అట్టి – ఆ – శంక – ఒరులమీఁదన్ – తగిలినవారలన్ – ఊఁదిపట్టి – అరసి, తెలివిని – శుద్ధి – లేదు + అయ్యెనేనిన్ – పతికిన్ – తగిన – దండంబు – దండింపన్ – తగును.

**వ్యాఖ్య:** ఒకణ్ణి ఎవ్వరూ ఎఱుంగకుండా జంపి అలా చంపినవాడు తాను దాక్కొన్నట్లయితే (ప్రచ్ఛన్నుఁడైనన్) చచ్చినవాడి మిత్రుల్నీ (నెచ్చెలి) భృత్యుణ్ణీ, అన్నదమ్ముణ్ణీ భార్యలనూ (అతివలన్) పట్టుకొని గట్టిగా గద్దించియైనా (అరచి + ఐనన్) వారిని వేర్వేరుగా ప్రశ్నించి (అడిగి) చచ్చినవాడి దగ్గరకు (పొంతన్) వచ్చేవారినందరినీ (ఎలసెడువారలన్. ఎలయు = ప్రవేశించు, ఆసక్తికనపరుచు, చేరు) పరిశీలించి (అరసి), ఏ ఏ ధనాలకోసం (అర్థముల వెంటన్) ఎవరితో ఏ జగడం (పెనఁకువ) కలిగిందో అనీ ఆరాతీసి (అడిగి) ఆ చచ్చినవాణ్ణి చంపడానికి తగిన ఆ అనుమానం (శంక) ఇతరుల మీద తగిలినట్లయితే అలా అనుమానాస్పదులైనవారిని అదుపులోనికి తీసుకొని (ఊఁదిపట్టి) విచారించి (అరసి) తెలివితో వారిలో నిర్దోషిత్వం లేకపోతే (శుద్ధి లేదయ్యెనేనిన్)

తగినదండనతో దండించడం రాజుకు తగినది.

**104. క. పొల మిల్లు తోఁట గ్రామము**
**కలను పసులుమేయుకొఱను కాల్చిన నృపకాం**
**తలతో సంగముచేసినఁ**
**గలయం బిరిసుట్టివానిఁ గాల్పఁగవలయున్**

**అన్వయం:** పొలము – ఇల్లు – తోఁట – గ్రామము – కలను – పసులుమేయు – కొఱను – కాల్చినన్ – నృపకాంతలతోన్ – సంగము – చేసినన్ – కలయన్ – పిరిసుట్టి – వానిన్ – కాల్పఁగ – వలయున్.

**వ్యాఖ్య**: పొలం, ఇల్లు, తోఁట, గ్రామం, కళ్ళం (కలను), పసులుమేసే కొఱను (1) A hedge round a place where cattle graze. పసులుమేయుకంచె. 2) A place where birds find their food పక్షులు ఎరతినుచోటు) వీటిని కాల్చినా, అలాగే రాజస్త్రీలతో (నృపకాంతలతోన్) కలిసినా (సంగముచేసినన్) అలా చేసిన వాణ్ణి మొత్తంగా (కలయన్) మెలిపెట్టి చుట్టచుట్టినట్లు చుట్టి (పిరిసుట్టి) కాల్చిపారేయాలి.

**విశేషాలు**: దీనికి మూల శ్లోకం.

**క్షేత్రవేశ్మవనగ్రామ వివీతఖలదాహకాః,**
**రాజపత్న్యభిగామీ చ దగ్ధవ్యా స్తు కటాగ్నినా (విజ్ఞా. వ్య, కాం.)**

**105. సీ. ఇరులున నొంటిబోఁ బరసతి నెట్టుట**
**యది తన్ను నంటుట కాసవడుట**
**నలువుర ముందఱఁ దలచీర పట్టుట**
**చేరి యేకాసనాసీనుఁ డగుట**
**పువ్వులు పూఁత తమ్ముల మర్థిఁ బుచ్చుట**
**ముచ్చట లాడుట మూల యునికి**
**సరసకళాప్రౌఢి సరి గలరే యెల్ల**
**మగని యాలికి నిచ్చమాటలాడు**

**ఆ.వె. టేను దొల్లి యిట్ల యీలువు చెఱిచితి**
**నని యహంకరించి యాలిఁగొనుట**
**సజ్జనుండు గాని జనుఁడు చేసినఁ బర**
**దారగామి యట్ల దండ్యుఁ డతఁడు**

**అన్వయం:** ఇరులునన్ – ఒంటిన్ – పోన్ – పరసతిన్ – నెట్టుట, అది – తన్నున్ – అంటుటకున్ – ఆసవడుట, నలువుర – ముందఱన్ – తలచీరన్ – పట్టుట, చేరి – ఏక + ఆసన + ఆసీనుఁడు – అగుట, పువ్వులు – పూఁత – తమ్ములము – అర్థిన్ – పుచ్చుట, ముచ్చటలు + ఆడుట, మూల + ఉనికి – సరస – కళా – ప్రౌఢిన్ – ఎల్లన్ – సరి – కలరే – (అని) – మగని + ఆలికిన్ – ఇచ్చమాటలు – ఆడుట, ఏను – తొల్లి – ఇట్లు + ఆ – ఈలువు – చెఱిచితిన్ – అని – అహంకరించి – ఆలిన్ – కొనుట – సజ్జనుండు – కాని – జనుఁడు – చేసినన్ – పరదారగామి + అట్ల – అతఁడు – దండ్యుడు.

**వ్యాఖ్య:** పరకాంతల పట్ల అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించిన దుర్జనుడికి (సజ్జనుండు కాని జనుఁడు) శిక్షలు.

చీకటిలో (ఇరులునన్) ఒంటరిగా వెళ్ళే (ఒంటిబోన్) పరకాంతను (పరసతిన్) వెనుకనుంచో పక్కనుంచో హఠాత్తుగా వచ్చి నెట్టడం – రాసుకుంటూ వెళ్ళడం, ఆమె తనను తాకడానికి ఆశించడం (అంటుటకున్ ఆసవడుట) – తాకకుండా ఆమె వెళ్ళలేని పరిస్థితి కల్పించడం – అడ్డంగా నిలవడం వగైరాలు; నలుగురిముందూ ఆమె పైటకొంగు (తలచీర = చీరకు అగ్రభాగం = పైటకొంగు) పట్టుకోవడం – లాగడం (జడగానీ చీరగానీ పట్టుకోడం), ఆమె కూర్చొన్న ఆసనంమీద – వెళ్ళి తానూ కూర్చోవడం (ఏక + ఆసన + ఆసీనుడగుట), పువ్వులూ పరిమళద్రవ్యాల మైపూతలూ తాంబూలాలూ (మధ్యవర్తులతో) కోరి కోరి (అర్థిన్) ఆమెకు పంపడం (పుచ్చుట); కల్పించుకుని ఆమెతో మాట్లాడటం – మాట కల్పడం (ముచ్చట లాడుట); మూలచేరి ఉన్నప్పుడు (తీర్థారణ్యవననదీకూపాదుల చెంత ఒంటరిగా ఉండటం గానీ నెలసరితో పెరటి పాకలో ఉండటం గానీ) చెంతకు చేరి – తన్వీ! శృంగారకళానైపుణ్యంలో (సరసకళా ప్రౌఢిన్) ఎల్లవారిలోనూ ఎల్లలోకంలోనూ (ఎల్లన్) నాకు సరి సమానుడున్నాడా (సరి కలరే) అని ఆ మగనాలితో ఆ పరకాంతతో (మగని + ఆలికిన్) నోటికి ఇష్టంవచ్చినట్టు కుయ్యడం (ఇచ్చమాటలాడుట); నేను ఇలాగే మునుపొకసారి (తొల్లి) ఫలానావాడి ఇల్లాలి శీలం (ఈలువు) చెడగొట్టాను తెలుసా – అని ప్రగల్భాలు వదరడం, కట్టకడపటికి అహంకరించి పరకాంతను చెరపట్టడం – ఇలాంటివి చేసిన అసజ్జనుడికి, పరదారగామితో సరిసమానంగా దండువు (నూరు పణాల సంగ్రహణం) వేసి శిక్షించాలి. అతడిలాగానే ఇతడూ దండ్యుడు.

**విశేషాలు:** ఈ పద్యంలో మొదటి మూడు పాదాలూ మనుస్మృతి శ్లోకాలకు అనువాదాలే.

**ఉపచారక్రియాకేళిః స్పర్శో భూషణ వాససాం**
**సహఖట్వాసనం చైవ సర్వం సంగ్రహణం స్మృతమ్.**
**పరస్త్రియం యోఽభివదేత్ తీర్థేఽరణ్యే వనేఽపి వా**
**నదీనాం వాపి సంభేదే స సంగ్రహణమాప్నుయాత్ (8 – 356, 357)**

నాల్గోపాదానికీ ఆటవెలది పూర్వార్ధానికీ ఆధారమేదో! నాల్గవ పాదానికి అన్వయంకూడా ఇంతకన్నా సుఖంగా కుదరడం లేదు. ముద్రితప్రతిలోనూ ఇలాగే ఉంది మరి!

**106.** సీ. **తల్లితోఁబుట్టువు తండ్రితోఁబుట్టువు**
**తల్లిదండ్రుల సహోదరుల సుతలు**
**తన తోడఁబుట్టువు తన తోడఁబుట్టిన**
**వారల సుతలు భూవరుల సుతలు**
**తనయుని కాంతయుఁ దన కన్న కూఁతును**
**గోడలు నత్తయు గోత్రజలును**
**బతిహితవ్రతయైన బ్రాహ్మణ భార్యయుఁ**
**జెలికాని సతియును శిష్యు సతియు**

గీ. **గురుని సతి దాదియు ననంగఁ బరగువారిఁ**
**గవయు కష్టుండు గురుతల్పగామి వాఁడు**
**ఉత్తమబ్రాహ్మణుఁడు గాక యుండెనేని**
**చంప కాతని కోరును ద్రెంపవలయు**

**అన్వయం:** తల్లి – తోఁబుట్టువు, తండ్రి – తోఁబుట్టువు, తల్లిదండ్రుల – సహోదరుల – సుతలు, తన – తోడఁబుట్టువు, తన – తోడఁబుట్టినవారల – సుతలు, భూవరుల – సుతలు, తనయుని – కాంతయున్, తన – కన్నకూఁతును, కోడలున్, అత్తయున్ – గోత్రజలును, పతిహితవ్రత + ఐన – బ్రాహ్మణ – భార్యయున్, చెలికాని – సతియును, శిష్యు – సతియున్, గురుని – సతి, దాదియున్ – అనంగన్ – పరగువారిన్ – కవయు – కష్టుండు – గురుతల్పగామి. వాఁడు – ఉత్తమ – బ్రాహ్మణుఁడు–కాక+ఉండెనేనిన్–చంపక–ఆతని–కోరును–త్రెంపవలయున్.

**వ్యాఖ్య:** ఏ స్త్రీలను కామించకూడదో, సంగమించకూడదో చెబుతున్నాడు. తల్లి తోబుట్టువుల్ని (పెద తల్లులు పిన తల్లులు), తండ్రి తోబుట్టువుల్ని (మేనత్తలు), తల్లి సహోదరీమణుల కూతుళ్లను (సహోదరి + లు = సహోదరులు = పెదతల్లి, పినతల్లి); అలాగే తండ్రిగారి అన్నదమ్ముల (సహోదర + లు = సహోదరులు =

పెదనాన్న, చిన నాన్న) కూతుళ్లను, సొంత అక్కచెల్లెళ్లను (తోడఁబుట్టువు), తన సోదరసోదరీమణుల (తోడఁబుట్టినవారల) కూతుళ్లను; రాజుగారి (భూవరులు = రాజులు) కూతుళ్లను (సుతలు); రాజుగారి కోడలిని (భూవరుల తనయుని కాంత), తన కన్న కూతుర్ని, తన కోడల్ని, పిల్లనిచ్చిన అత్తను (ఇల్లాలి తల్లి), తన గోత్రంవాళ్ళై (గోత్రజలు) అయిన వనితలను (సగోత్రత = సోదరత); పతివ్రతామతల్లియైన బ్రాహ్మణిని (బ్రాహ్మణభార్యయున్); స్నేహితుడి ఇల్లాలిని, శిష్యుడి పెళ్ళాన్ని, గురువుగారి ధర్మపత్నిని, పెంపుడు తల్లిని (దాది) – ఇలా ఒప్పారే ఈ స్త్రీలను (అనంగన్ – పరగువారిన్) సంగమించకూడదు. సంగమించిన దుష్టుడు (కష్టుండు) గురుతల్పగామి = గురుపత్నిని సంగమించినవాడితో సమానం. వాడు ఆ దుష్టుడు – ఉత్తమబ్రాహ్మణుడు కాకపోతే – వాణ్ని మామూలుగా అయితే సంహరించాలి. మరణదండన విధించాలి. కానీ కొండొకచో చంపకుండా అతగాడి రహస్యాంగాన్ని (కోరును) ఖండించి విడిచి పెట్టవచ్చు (త్రెంపవలయున్). సదరు దుష్టుడు బ్రాహ్మణుడే అయితే అతడికి శిక్ష వేరు.

**విశేషాలు:** తల్లిదండ్రుల సహోదరుల సుతలు – అనే చోట లోకధర్మాని అనుసరించి తల్లిగారి సహోదరీమణుల సుతలు అనీ, తండ్రిగారి సహోదరుల (పురుషవాచకం) కూతుళ్లు అనీ – సమన్వయించడమయ్యింది. సహోదరులు అనే బహువచన రూపం స్త్రీ–పురుష వాచకాలు రెండింటికీ కుదురుతుంది కనుక. మూడవ పాదంలో – తనయుని కాంతయు..... కోడలున్ – అని పునరుక్తమయ్యింది కనుక భూవరుల అనే పూర్వోపాత్త పదాన్ని తెచ్చి భూవరుల తనయుని కాంతయు అని సమన్వయించడమయ్యింది. కోడలు = మేనకోడలు అనుకుంటే అది ఒకప్పటి పాక్షికనియమం అవుతుంది. కోరు అనే పదానికి ఈ అర్థాన్ని చెప్పి సూ.రా. నిఘంటువు ఇదే ప్రయోగాన్ని చూపింది.

**మాతా మాతృష్వసా శ్వశ్రూర్మాతులానీ పితృష్వసా**
**పితృవ్యసఖి శిష్యస్త్రీ భగినీ తత్సఖీ స్నుషా**
**దుహితా చార్య భార్యా చ సగోత్రా శరణాగతా**
**రాజ్ఞీ ప్రవ్రజితా ధాత్రీ సాధ్వీ వర్ణోత్తమా చ యా**
**ఆసామాన్యతమా గచ్ఛన్ గురుతల్పగ ఉచ్యతే**
**శిశ్నస్యోత్కర్తనా త్తత్ర నాన్యోదండో విధీయత** (వి.వ. **284**)

**107.** కం. **ఎక్కువకులం బతనికిని**
**నిక్కపుటాలైనదాని నీచకులుండుం**

**కెక్కక బలిమిం గలిసిన**
**దక్కొని చంపుటయె రాజధర్మంబెందున్**

**అన్వయం:** ఎక్కువకులంబు + అతనికిని – నిక్కము + ఆలు – ఐన – దానిన్ – నీచకులుండు – ఉంకు – ఎక్కక – బలిమిని – కలిసిన – తక్కొని – చంపుటయె + ఎ + ఎందున్ – రాజధర్మంబు.

**వ్యాఖ్య:** ఉన్నతకులంలో పుట్టినవాడికి అచ్చపు ధర్మపత్ని అయిన స్త్రీని (నిక్కపుటాలైనదానిన్) నీచకులంలో పుట్టినవాడు జంకూ గొంకూ లేకుండా (ఉంకు ఎక్కక) బలవంతంగా కలిసినట్లయితే పూనికతో (తక్కొని) వాడిని చంపడమే రాజధర్మం.

**108. కం. కులమున సరియగు పరసతి**
**బలిమిఁ గలయు నతఁడు వేయిపణము లనచ్చుం**
**గులహీను పత్నిఁ గులజుం**
**డెలయించి రమించెనేని నేనూఱచ్చున్**

**అన్వయం:** కులమునన్ – సరి + అగు – పరసతిన్ – బలిమిన్ – కలయు + అతఁడు – వేయి పణములన్ – అచ్చున్. కులహీను – పత్నిన్ – కులజుండు – ఎలయించి – రమించెనేనిన్ – ఏన్ + నూఱు – అచ్చున్.

**వ్యాఖ్య:** కులంలో సరియైన పరసతిని అంటే ఒకే కులానికి చెందిన పరస్త్రీని బలవంతంగా కలిసేవాడికి వేయిపణాలు శిస్తు (అచ్చున్). కులహీనుడి పత్నిని కులజుడు అంటే ఉన్నతకులంలో పుట్టినవాడు తీసుకుపోయి లేదా పురికొల్పి (ఎలయించి) రమించినట్లయితే అయిదునూర్లు (ఏన్ + నూఱు) జరిమానా చెల్లించాలి. (అచ్చున్).

**109. కం. రోయిడి యొల్లని భుజగుఁడు**
**రోయి విడువవలయు లంజె రోఁగొని మరలన్**
**రోయిడఁదలఁచిన నినుమడి**
**పాయక యిచ్చుటయ తగిన పాడి యరయఁగన్**

**అన్వయం:** రోయి + ఇడి – ఒల్లని – భుజగుఁడు – రోయి – విడువవలయున్. లంజె – రోయి + కొని – మరలన్ – రోయిడన్ – తలఁచినన్ – పాయక – ఇనుమడి – ఇచ్చుటయు – అరయఁగన్ – తగిన – పాడి.

**వ్యాఖ్య:** వేశ్యకు బజానా శుల్కం ఇచ్చి (రోయి ఇడి) ఆమెను పొందని విటుడు

(భుజగుఁడు) ఆ శుల్కాన్ని (రోయి) విడిచిపెట్టెయ్యాలి. అలా కాకుండా ఒకసారి ఆ వేశ్యాశుల్కాన్ని (లంజె రోఁగొని) తీసుకొని మళ్ళీ ఇవ్వాలనుకొంటే రెండురెట్లు (ఇనుమడి) కచ్చితంగా (పాయక) ఇవ్వడమే ఆలోచిస్తే తగిన న్యాయం (పాడి).

**110. కం. హీనుం డుత్తమకన్యక**
**జానుగఁ దాఁ గలిసెనేనిఁ జంపుట తగు న**
**న్యూనుఁ డగునేనిఁ గన్నియ**
**వాని వలచునేనిఁ దగు వివాహము సేయన్**

**అన్వయం:** హీనుండు + ఉత్తమ – కన్యకన్ – జానుగన్ – తాన్ – కలిసెనేనిన్ – చంపుట – తగున్. అన్యూనుఁడు + అగునేనిన్; కన్నియ – వానిన్ – వలచునేనిన్, వివాహము + చేయన్ – తగున్.

**వ్యాఖ్య:** హీనకులంవాడు ఉత్తమకులం కన్యకను కలిస్తే సంగమిస్తే – అది పెద్ద నేరం. మరణమే దండనం (చంపుట – తగున్). జానుగన్ = అందంగా. ఇది పాదపూరకం. తక్కువకులంవాడు కాకుండా (అన్యూనుడు) అంటే, సరిసమానుడో ఉత్తమకులంవాడో సంగమిస్తే, అతడిని ఆ కన్యక ఇష్టపడితే (వలచునేనిన్) – అప్పుడు వారిద్దరికీ వివాహం జరిపించాలి (వివాహము సేయన్ దగున్).

**111. కం. కామాంధ్యముతోఁ బరుసము**
**తో మదమునఁ గ్రీడసలుప దోషంబు పర**
**స్త్రీ మిన్నక దూషించుట**
**దా మిక్కిలి దోష మతఁడు దండ్యుం డెందున్**

**అన్వయం:** కామ + అంధ్యముతోన్ – పరుసముతోన్ – మదమునన్ – క్రీడ – సలుపన్ – దోషంబు. పర – స్త్రీన్ – మిన్నక – తాన్ – దూషించుట – మిక్కిలి – దోషము. అతఁడు – ఎందున్ – దండ్యుండు.

**వ్యాఖ్య:** కామాంధతతో కాఠిన్యంతో (పరుసముతోన్) మదంతో క్రీడ సలుపడం దోషం. పరస్త్రీని అకారణంగా ఊరికే (మిన్నక) తాను దూషించడం మిక్కిలి దోషం. అతడు సర్వత్రా దండ్యుడు.

**112. కం. వెలగొనియెడు వేశ్యాదుల**
**బలిమిం గలిసి నాతఁడచ్చుఁ బదిపణము లొగిం**
**బలువురొకర్తుం గలిసిన**
**నెలమిని వేర్వేర యచ్చు నిరువదిపణముల్**

**అన్వయం:** వెల – కొనియెడు – వేశ్యాదులన్ – బలిమిన్ – కలిసిన + ఆతఁడు – ఒగిన్ – పది – పణములు – అచ్చున్. పలువురు – ఒకర్తున్ – కలిసినన్ – ఎలమిన్ – వేర్వేరన్ – ఇరువది – పణముల్ – అచ్చున్.

**వ్యాఖ్య:** రొక్కం పుచ్చుకోనే (వెలగొనియెడు) వేశ్యలూ మొదలైనవారిని బలవంతంగా (బలిమిన్) కలిసినవాడు పదిపణాలు శీఘ్రమే చెల్లించాలి (అచ్చున్). అనేకులు ఒకస్త్రీనే కలిసినట్లయితే వాళ్ళు విడివిడిగా ఒక్కొక్కరూ ఇరవై పణాలు చెల్లించాలి.

**113. కం. ఒడఁబడని పణ్యకాంతల**
**యొడలను నఖదంతఘాత మొనరించినవాఁ**
**డొడఁబడనిచ్చిన రోవెల**
**కదరఁగ నెనిమిదిపణంబు లరువఁగవలయున్**

**అన్వయం:** ఒడఁబడని – పణ్యకాంతల – ఒడలను – నఖ – దంత – ఘాతము – ఒనరించినవాఁడు – ఒడఁబడన్ – ఇచ్చిన – రోయి + వెలకున్ – అదరఁగన్ – ఎనిమిది – పణంబులు – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** అంగీకరించని (ఒడఁబడని) వేశ్యల (పణ్యకాంతల) శరీరంపై గోళ్ళతోనూ పళ్ళతోనూ గిచ్చడం కొరకడం లాంటి హింసలు (నఖదంతఘాతము) పెట్టినవాడు అంతకుముందు ఒప్పందంగా ఇచ్చిన వేశ్యాశుల్కానికి (రోవెలకున్) అధికంగా (అదరఁగన్) ఎనిమిదిపణాలు చెల్లించాలి.

**114. కం. అచ్చుగల కులమువారై**
**విచ్చలవిడిఁ దేలువారు వేశ్యల నోలిన్**
**సచ్చరితలైనఁ గవయుదు**
**రిచ్చమెయిన్ సుఖపరాత్ము లిమ్మహిలోనన్**

**అన్వయం:** అచ్చు + కల – కులమువారు + ఐ – విచ్చలవిడిన్ – తేలువారు – వేశ్యలన్ – ఓలిన్ –సత్ + చరితలు + ఐనన్ – ఇచ్చమెయిన్ – సుఖ – పర + ఆత్ములు – ఈ – మహిలోనన్ – కవయుదురు.

**వ్యాఖ్య:** ఈ భూమిపై పరిశుద్ధమైన కులానికి (అచ్చుగల కులము) సంబంధించిన వాళ్ళైనప్పటికీ విచ్చలవిడిగా సంచరించే పురుషులు (తేలేవారు) కోరికతో సుఖంమీద ఆసక్తి గల హృదయాలు కలవారై (సుఖపరాత్ములు) చక్కగా (ఓలిన్) సచ్చరితలైన వేశ్యల్ని (గవయుదురు), కలుస్తారు.

**115. కం. ఒక్కింతకొలమువారిని**
**నెక్కువయగు కొలమువారి నెనయుదు రోలిం**
**దక్కువకులజునిఁ గవియన్**
**వెక్కుదు రిచ్చలనుగొలఁది వేశ్యలు జగతిన్**

**అన్వయం:** ఒక్కింత – కులము – వారినిన్ – ఎక్కువ + అగు – కొలమువారిన్ – ఓలిన్ – ఎనయుదురు. తక్కువ – కులజునిన్ – కవియన్ – ఇచ్చలను – కొలఁది – జగతిన్ – వేశ్యలు – వెక్కుదురు.

**వ్యాఖ్య:** వేశ్యలు జగతిలో ఒకపాటి కులం వాళ్ళనీ (ఒక్కింతకొలమువారిని), ఉన్నతకులస్థులనూ (ఎక్కువయగు కొలమువారిన్) ఇంపుగా (ఒలిన్) కలుస్తారు (ఎనయుదురు). అయితే తక్కువకులజుల్ని కలవడానికి (కవియన్) కొంచెం తక్కువ కోరికతో (ఇచ్చలనుగొలఁది) విముఖత చూపుతారు (వెక్కుదురు).

**116. సీ. బండలుబూతులు పరిహాసకులు నట్టు**
**వారాదిగాఁ గల వారుదక్కఁ**
**బెఱవారి యాలు తాఁ బ్రియుఁడు వారింపంగఁ**
**బరుతోడఁ బల్కినఁ బణశతంబు**
**వలదనఁగా నొరు వనితతో నొక్కండు**
**దాఁ బల్కెనేని శతద్వయంబు**
**వారించుటెఱిఁగియు వారిద్దఱును మాట**
**లాడిరేనియును అంకాడినట్లు**

**ఆ.వె. కాన అంకునందుఁ గడు దండువచ్చుట**
**విహితమండ్రు ధర్మవేదు లెల్ల**
**వారివర్తనములు వారికులంబులు**
**తెలిసి దండువలు విధింపవలయు**

**అన్వయం:** బండలు – బూతులు, పరిహాసకులు, నటువారు + ఆదిగాన్ – కలవారు – తక్కన్ – పెఱవారి – ఆలు – తాన్ – ప్రియుఁడు – వారింపంగన్ – పరుతోడన్ – పల్కినన్ – పణశతంబు. వలదనఁగాన్ – ఒరు – వనితతోన్ – ఒక్కండు – తాన్ – పల్కెనేనిన్ – శతద్వయంబు. వారించుట – ఎఱిఁగియున్ – వారిద్దఱును – మాటలు + ఆడిరి + ఏనియును – అంకు + ఆడినట్లు + అ. కానన్ – అంకునందున్ – కడు – దండువు – అచ్చుట – విహితము – (అని) –

ధర్మవేదులు – అంద్రు. వారి – వర్తనములు – వారి – కులంబులు – తెలిసి – దండువు – విధింపవలయున్.

**వ్యాఖ్య:** బండలుబూతులు, పరిహాసకులు, నాట్యంచేసేవారు (నట్టువారు) మొదలైనవారు తప్ప తక్కిన ఇతరుల (బెఱవారి) ఆలు తాను – ప్రియుడు వారించినాసరే ఇతరుడితో మాట్లాడితే వాడికి వందపణాలు శిస్తు. వద్దన్నా పరస్త్రీతో ఒకడు తాను మాట్లాడితే రెండువందల పణాలు (శతద్వయంబు) శిస్తు. పెద్దలు వారించటం తెలిసీ వారిద్దరూ (స్త్రీపురుషులు) మాటలాడితే అది అంకు చేసినట్లే. కాబట్టి అంకువిషయంలో అధికంగా దండువు చెల్లించాలని ధర్మవేత్తలు అంటారు. అటువంటివారి ప్రవర్తనలను వారి వారికులంలోని వారే గుర్తించి జరిమానాలు విధించాలి (దండువలు విధింపవలయున్).

**117. కం. మానవు లెదురం బెనఁకువ**
**లైనయెడం బరుష భాషణాదులవెంటం**
**దానొరులచేత నొడఁబడి**
**మానుగ సైరించునఁతఁడు మాన్యుండెందున్**

**అన్వయం:** మానవుల + ఎదురన్ – పెనఁకువలు + ఐన + ఎడన్ – పరుష – భాషణ + ఆదులవెంటన్ – తాను – ఒరులచేతన్ – ఒడఁబడి – మానుగన్ – సైరించు + అతఁడు – ఎందున్ – మాన్యుండు.

**వ్యాఖ్య:** మానవుల ఎదుట, తగాదాలైన సందర్భాలలో (పెనకువ లైనయెడన్) కఠినంగా మాట్లాడేటప్పుడూ (పరుష భాషణాదులవెంటన్) దాను ఇతరులచేత నిందింపబడికూడా (ఒడఁబడి) ఇంపుగా (మానుగన్) భరించేవాడు (సైరించు నతఁడు) ఎక్కడైనా గౌరవింపదగినవాడు (మాన్యుండు).

**118. కం. మును దాఁ దిట్టిన దండ్యుఁ డ**
**తనికిఁ బిదపఁ దిట్టి నతఁడు దండ్యుండైనన్**
**మును దిట్టినతఁడు దండుగు**
**ధన మినుమడి యఱువవలయు ధరణీశునకున్**

**అన్వయం:** మును – తాన్ – తిట్టినన్ – దండ్యుఁడు. అతనికిన్ – పిదపన్ – తిట్టిన + అతఁడున్ – దండ్యుఁడు. ఐనన్; మును – తిట్టినతఁడు – ఇనుమడి – ధనము – దండుగు – ధరణీశునకున్ – అఱువవలయున్.

**వ్యాఖ్య:** ఇద్దరు తిట్టుకున్నారు. వారిలో ఎవడో ఒకడు ముందుగా (మును) తిట్టి

ఉంటాడు. అతడు దండ్యుడే. అతడికి సమాధానంగా రెండోవాడూ తిట్టాడు (అతనికి పిదప దిట్టినతడు). ఇతడూ దండ్యుడే. అయితే (ఐనన్) వీళ్ళకు విధించే అపరాధశుల్కంలో (దండువు) కొంత తేడా ఉంటుందిట. మొదట తిట్టినవాడు (మును దిట్టినతడు) మారు తిట్టినవాడికన్నా రెట్టింపు (ఇనుమడి) ధనాన్ని దండువుగా రాజుగారికి (ధరణీశునకున్) చెల్లించాలి, వదిలించుకోవాలి (అఱువవలయున్).

**119. కం. ఉద్దులవుఁ బెనఁకువలయం**
**దిద్దఱు సరియైనచోట నెవ్వఁడు పైపై**
**గద్దించి యరుగు నాతఁడు**
**పెద్దయు దండ్యుండు చలము పెక్కువ కలిమిన్**

**అన్వయం:** ఉద్దులు (ఉద్ది+లు) + అవు – పెనఁకువలయందున్, ఇద్దఱున్ – సరియైనచోటన్, ఎవ్వఁడు – పైపైన్ – గద్దించి – అరుగున్ – ఆతఁడు – చలము – పెక్కువ – కలిమిన్ – పెద్దయున్ – దండ్యుండు.

**వ్యాఖ్య:** ఇద్దరు సమ ఉజ్జీలైనవాళ్ళు – వస్తాదులు – కలియబడ్డారు. తగువులాడుకుంటున్నారో తన్నులాడుకుంటున్నారో. అందులో (పెనకువలయందున్) ఇద్దరూ సరిసమానంగా ఉన్న సందర్భంలో ఎవడైనా ఒకడు, రెండో యోధుడిమీదకు గద్దిస్తూ మీదమీదకు వెళ్ళినట్టయితే, అలా వెళ్ళినవాడు (అరుగునాతడు) అధిక దండ్యుడు. వాడికి పెద్ద శిక్ష, ఎక్కువ దండువు వెయ్యాలి. ఎందుకంటే వాడికి అహమూ, ఎలాగైనా తానే గెలవాలనే పట్టుదల (చలము) అధికం అని తెలుస్తోంది కాబట్టి (పెక్కువ – కలిమిన్). తనకు తాను నిలువరించుకోలేని దుడుకు మనిషి కనుక ప్రమాదకారి అని కాబోలు.

**120. కం. సరిగా నొండొరువులతోఁ**
**బరుసపుఁ బెనఁకువలు పెనఁగి పాడికి ధరణీ**
**శ్వరు సభకు వచ్చిరేనియు**
**సరి సరి దండంబు గొనుట సద్ధర్మ మగున్**

**అన్వయం:** ఒండొరువులతోన్ – సరిగాన్ – పరుసము + పెనఁకువలు – పెనఁగి – పాడికిన్ – ధరణీశ్వరు – సభకున్ - వచ్చిరేనియున్; దండంబు – సరి సరి – కొనుట – సత్ + ధర్మము + అగున్.

**వ్యాఖ్య:** కోడిపుంజుల్లాగా ఇద్దరు సరిసమానంగా కలబడి తన్నుకున్నారు. పరుషంగా జగడమాడుకున్నారు. ఇద్దరూ గాయాలతో రాజుగారి సభకు

న్యాయంకోసం (పాడికిన్) వచ్చారు. అప్పుడు ఇద్దరికీ సరి సమానంగా దండువు వేసి వసూలు చెయ్యాలి ధరణీశ్వరుడు. ఇలా దండించి దండువు పుచ్చుకోవడమే సద్ధర్మం అనిపించుకుంటుంది (అగున్).

**121. కం. మనసునకు నొప్పిసేయుట**
**తనువునకును నొప్పిసేఁత దండ్యము పరుసం**
**దన మది తిట్టుట యేడ్చుట**
**యనురెంటను బుట్టు జనుల కభినవదండీ!**

**అన్వయం:** అభినవదండీ! మనసునకున్ – నొప్పి + చేయుట – తనువునకును – నొప్పి – చేఁత – దండ్యము. పరుసందనము – అది – తిట్టుట – ఏడ్చుట + అను – రెంటను – జనులకున్ – పుట్టున్.

**వ్యాఖ్య:** అభినవదండీ! మనసుకు నొప్పి కలిగించడం, అలాగే శరీరానికి (తనువునకును) బాధకలిగించడం (నొప్పిసేఁత) అనే ఈ రెండూ దండించదగినవే (దండ్యము). పారుష్యమనేది తిట్టడం ఏడ్వడం అనే రెండింటితోనూ జనులకు పుడుతుంది (పుట్టున్).

**122. కం. తగవరియగు తానొంచినఁ**
**దగుదండము రాజువానిఁ దండింపఁదగున్**
**మొగమోడి విడిచెనేనియు**
**నగుఁబాటగుఁ బాపమొందు నరనాథునకున్**

**అన్వయం:** తగవరి + అగు – తాన్ – నొంచినన్ – తగు – దండము – రాజు – వానిన్ – దండింపన్ – తగున్. మొగమోడి – విడిచెనేనియున్ – నర – నాథునకున్ – నగుఁబాటు + అగున్ – పాపము + ఒందున్.

**వ్యాఖ్య:** న్యాయాధిపతియైన వాడు (తగవరి) తానే హింసించినా, శిక్షను అమలుపరచినా (నొంచినన్) తగినదండనతో రాజువాణ్ని దండించాలి. మొహమాటపడి విడిచిపెడితే నగుబాటు కలుగుతుంది. దానివల్ల పాపమూ రాజుకి (నరనాథునకున్) చుట్టుకుంటుంది.

**123. కం. ఎక్కువకులజుం డడిచిన**
**తక్కువదండంబు కులము తక్కువవాఁడా**
**యెక్కువకులజుని నడిచిన**
**నెక్కువదండంబు వరుస నెల్లకులములన్**

**అన్వయం:** వరసన్ – ఎల్లకులములన్ – ఎక్కువ కులజుండు – అడిచిన – తక్కువ – దండంబు. కులము – తక్కువవాఁడు – ఆ – ఎక్కువ – కులజునిన్ – అడిచినన్ – ఎక్కువ – దండంబు.

**వ్యాఖ్య:** ఎక్కువకులంలో పుట్టినవాడు తక్కువకులంలో పుట్టినవాణ్ణి కొట్టినట్లయితే (అడిచినన్) తక్కువ దండన. తక్కువకులంలో పుట్టినవాడు ఎక్కువకులంలో పుట్టినవాణ్ణి కొట్టినట్లయితే (అడిచినన్) ఎక్కువ దండన. ఇది వరుసగా అన్ని కులాలకూ వర్తిస్తుంది.

**124. కం.** **మొండీఁడు పాపకర్ముఁడు**
**చండాలుం డాది నీచజనుఁ డుత్తమ వం**
**శుండైనవాని నడిచిన**
**దండు వుడిగి చంపు టుచితధర్మము పతికిన్**

**అన్వయం**: మొండీఁడు – పాపకర్ముఁడు – చండాలుండు + ఆది – నీచ – జనుఁడు – ఉత్తమ – వంశుండు + ఐనవానిన్ – అడిచినన్ – దండువు – ఉడిగి – చంపుట – పతికిన్ – ఉచిత – ధర్మము.

**వ్యాఖ్య:** మొండివాడు, పాపకర్ముడు, చండాలుడూ మొదలైన నీచజనులు ఉత్తమ వంశం కలవాడిని కొట్టినట్లయితే శిస్తువేయడం విడిచిపెట్టి (దండు వుడిగి) చంపడమే రాజుకి ఉచితధర్మం.

**125. కం.** **త్రోయక విప్రుఁడు మాలెతఁ**
**గాయజ సుఖకేళిఁ గదిసి కష్టాత్ముఁడగున్**
**ప్రాయశ్చిత్తముఁ జేయక**
**పోయినఁ జండాలజాతిఁ బొందు నిజముగన్**

**అన్వయం:** విప్రుఁడు – త్రోయక – మాలెతన్ – కాయజ – సుఖ – కేళిన్ – కదిసి – కష్ట + ఆత్ముఁడు – అగున్. ప్రాయశ్చిత్తమున్ – చేయకపోయినన్ – నిజముగన్ – చండాలజాతిన్ – పొందున్.

**వ్యాఖ్య:** ఒక విప్రుడు – కాదు పొమ్మనకుండా (త్రోయక) మాలెతను సంగమిస్తే (కాయజుడు = మన్మథుడు, కాయజసుఖకేళి = సంగమం) ఆ విప్రుడు మహా పాపాత్ముడు అవుతాడు (కష్టాత్ముడగున్). దీనికి తగిన ప్రాయశ్చిత్తం అతడికతడే చేసుకోవాలి. చేసుకోకపోతే మరు జన్మలో చండాల జాతిలో జన్మిస్తాడు. అలాగని రాజుగారు ఊరుకోకూడదు. ఏమి చెయ్యాలో తదుపరి చెబుతున్నాడు –

**126. కం. చండాలితో ద్విజుం డొగి**
**గండాడిన వక్షమున భగము వ్రాసి తగన్**
**దండువు గొని దేశంబున**
**నుండకయుండంగ నడచు టుచితము పతికిన్**

**అన్వయం:** ద్విజుండు – చండాలితోన్ – ఒగిన్ – గండాడినన్ – వక్షమునన్ – భగము – వ్రాసి – తగన్ – దండువు – కొని – దేశంబునన్ – ఉండక + ఉండంగన్ – అడచుట – పతికిన్ – ఉచితము.

**వ్యాఖ్య:** మాలెతను సంగమించిన విప్రుడు మహాపాపాత్ముడు అవుతాడు. దీనికి తగిన ప్రాయశ్చిత్తం అతడికతడే చేసుకోకపోతే మరు జన్మలో చండాలజాతిలో జన్మిస్తాడు. అలాగని రాజుగారు ఊరుకోకూడదు. అలాంటి అనుచితకార్యం (గండాడుట = కూడుట, రమించుట) చేసిన విప్రుడి వక్షస్సీమమీద అందరికీ కనపడేట్టు భగాకృతిని అచ్చుకొట్టి, ఆ విప్రుడి స్థిర చరాస్తుల్ని దండువుగా జమచేసుకొని, అతడికి దేశబహిష్కార శిక్ష విధించడమే రాజుగారికి ఉచితక్రియ, కర్తవ్యం.

**127. కం. పరదారగామిఁ జోరుని**
**దొరకొన్నను విడిచి నతఁడు దుర్జనుఁడై భూ**
**వరు నాజ్ఞదప్ప వ్రాసిన**
**కరణము లేన్ మడుఁగు లరువఁ గాఁదగుఁ బతికిన్**

**అన్వయం:** పరదార – గామిన్ – చోరునిన్ – దొరకొన్నను – విడిచిన + అతఁడున్, దుర్జనుఁడు + ఐ – భూవరు + ఆజ్ఞ – తప్పన్ – వ్రాసిన – కరణములు – ఏన్ – మడుఁగులు – పతికిన్ – అరువఁగాన్ – తగున్.

**వ్యాఖ్య:** పరకాంతతో రమించినవాణ్ణీ (పరదారగామిన్) చోరుణ్ణీ పట్టుకొని (దొరకొన్నను) విడిచిన వాడూ దుర్జనుఁడై రాజుగారి (భూవరు) ఆజ్ఞను దప్పేలా రాసిన కరణమూ – ఐదు మడుగులు రాజుకు శిస్తుగా చెల్లించాలి (అరువఁ గాఁదగున్).

**128. ఆ.వె. భక్ష్యభోజ్యలేహ్య పానీయములనెగ్గు**
**లాడి నతఁడు దండువచ్చుఁబణము**
**లెలమి వరుసఁ బతికి నేనూఱు మున్నూఱు**
**నెనుబదియును నూట యిరువదేను**

**అన్వయం:** భక్ష్య – భోజ్య – లేహ్య – పానీయములన్ – ఎగ్గులాడిన – అతఁడు – ఎలమిన్ – వరుసన్ – పతికిన్ – ఏనూఱు – మున్నూఱు – ఎనుబదియును – నూట – ఇరువది + ఏను – పణములు – దండువు + అచ్చున్.

**వ్యాఖ్య:** భక్ష్య, భోజ్య, లేహ్య పానీయాలను కల్తీచేసి దూషించినవాడు (ఎగ్గులాడినతఁడు) వరుసగా రాజుకి భక్ష్యదూషణకి ఐదువందలు (ఏనూఱు), భోజ్యదూషణకి మూడువందలు (మున్నూఱు), లేహ్యదూషణకి ఎనభై, పానీయదూషణకి నూట యిరవయ్యైదు పణాలు దండువుగా చెల్లించాలి.

**129. కం.** **అంకుఁ గని ముచ్చు నచ్చని**
**బొంకి నెపంబునను జోపి పుచ్చినతనిచే**
**అంకున దండువుఁ గొనుక్రియఁ**
**గొంకక యేనూఱు దండుగుం గొనవలయున్**

**అన్వయం:** అంకున్ – కని – ముచ్చును – అచ్చు + అని – బొంకి – నెపంబునను – చోపి – పుచ్చిన – అతనిచేన్ – అంకున – దండువున్ – కొను – క్రియన్ – కొంకక – ఏనూఱు – దండుగున్ – కొనవలయున్.

**వ్యాఖ్య:** అంకుతనంతో దొంగను (ముచ్చు) పట్టుకొని పరిశుద్ధుడంటూ (అచ్చని) అబద్ధం ఆడి (బొంకి) ఏదో మిషతో తోసిపుచ్చినట్లయితే (నెపంబునను చోపి పుచ్చినన్) అటువంటివాడిచేత అంకుతనం చేస్తే ఎటువంటి దండువు వసూలుచేస్తారో అదేవిధంగా (దండువు కొనుక్రియన్) వెనుకాడకుండా అయిదునూర్ల దండువు వసూలు చేయాలి.

**130. తే.గీ.** **కపట వర్ణ రజత రత్న కనకములను**
**గపట మాంసంబు నమ్మెడి కష్టుఁబట్టి**
**పణసహస్రంబు దండువు గొనఁగవలయు**
**నాసిక చెవులుఁ జేతులు నఱకవలయు**

**అన్వయం:** కపట – వర్ణ – రజత – కనకములను – కపట – మాంసంబు – నమ్మెడి – కష్టున్ – పట్టి – పణ – సహస్రంబు – దండువు – కొనవలయున్; నాసిక – చెవులున్ – చేతులు – నఱకవలయున్.

**వ్యాఖ్య**: కల్తీ వ్యాపారస్థులకు శిక్షలు. వెండి కానిదాన్ని వెండిలాగా నిగనిగలాడించి (కపట–వర్ణ–రజత), రత్నం కాని దాన్ని రత్నంలాగా మిలమిలలాడించి, బంగారం కానిదాన్ని బంగారంలాగా మిసమిసలాడించి – ఇలా మోసగించి కపటవస్తువుల్ని

అమ్మినా, కల్తీ – కపట మాంసాన్ని అంటే తినకూడని జంతువుల మాంసాన్ని అమ్మినా సదరు పాపాత్ముణ్ని (కష్టున్) పట్టి బంధించి, వెయ్యి పణాలు దండువు వేసి వసూలు చెయ్యాలి. ఇంకా అదనంగా ముక్కు చెవులూ చేతులూ తీసెయ్యాలి (నఱకవలయున్).

**131. కం.** **తొలఁగుము తొలంగు మనఁగాఁ**
**దొలఁగనివా రెందుఁ బసులు తురగము లేనుం**
**గులు వీనివలన నొచ్చినఁ**
**దొలఁగుమనిన ఱేని తలన ద్రోహము గలదే**

**అన్వయం:** తొలగుము – తొలంగుము – అనఁగాన్ – తొలఁగనివారు – ఎందున్ – పసులు – తురగములు – ఏనుంగులు – వీనివలనన్ – నొచ్చినన్ – తొలఁగుము + అనిన – ఱేని – తలన – ద్రోహము – కలదే?

**వ్యాఖ్య:** దారిలో వెళ్తున్నప్పుడు అడ్డుగా వస్తున్న ప్రజలను ఉద్దేశించి తొలగండి తొలగండి అంటూ చెప్పినప్పటికీ తప్పుకోనివారిని ఆయా జంతువులు తొక్కిగానీ పొడిచిగానీ హింసించినట్లయితే అలా పసువుల, గుర్రాల (తురగము) ఏనుగులవలన వాళ్ళు బాధనొందినట్లయితే (నొచ్చినన్) తొలగుమని చెప్పిన రాజు తలపై (ఱేని తలనన్) దోషం ఉందా (ద్రోహము గలదే)?

**132. ఆ.వె.** **కోఱకొమ్ము గలుగు క్రూరసత్త్వము లొరుఁ**
**గలయ బొడువఁ దివిరి కవియుచోట**
**నొడయఁ డుడపఁ జాలి యుడుపక యున్నచోఁ**
**బాడిగలదు మూడుమాడ లరువ**

**అన్వయం:** కోఱ – కొమ్ము – కలుగు – క్రూరసత్త్వములు – ఒరున్ – కలయన్ – పొడువన్ – తివిరి – కవియుచోటన్ – ఒడయఁడు – ఉడుపన్ – చాలి – ఉడుపక + ఉన్నచోన్ – మూడు – మాడలు – అరువన్ – పాడి – కలదు.

**వ్యాఖ్య:** కోఱలూ కొమ్ములూ ఉన్న క్రూరజంతువులు (సత్త్వములు) ఎవడినైనా ఒకడిపై కలబడి బొడవాలని వాడిపై విజృంభించినట్లయితే అలా ఆ జంతువులు సదరు వ్యక్తిపై కవిసినచోట దాని యజమాని (ఒడయఁడు) దానిని ఆపగలిగికూడా ఆపకుండా ఉన్నట్లయితే మూడుమాడలు దండుగు చెల్లించడం న్యాయం.

**133. కం.** **నెఱిఁ బొడిచెడు చండాలుఁడు**
**కఱచెడిఁ గుక్కలని యొరలఁగా నొడయఁడు దా**

**నెఱిఁగియు మానుపఁడేనియు**
**నఱిముఱి బతికాఱుమాడ లరువఁగవలయున్**

**అన్వయం:** నెఱిన్ – పొడిచెడు – చండాలుఁడు – కఱచెడి – కుక్కలని – ఒరలఁగాన్ – ఒడయఁడు – తాన్ – ఎఱిఁగియున్ – మానుపఁడేనియున్ – అఱిముఱి – పతికిన్ – ఆఱుమాడలు – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** నెఱిని పొడిచే చండాలుఁడు కరిచే కుక్కలను విడవగా (ఒరలఁగాన్), యజమాని (ఒడయఁడు) తాను ఎఱిగీ మాన్పకపోయినట్లయితే అతడు సత్వరమే (అఱిముఱిన్) రాజుకు ఆరుమాడలు చెల్లించాలి (అరువగఁవలయున్).

**134.** కం. **భూపతిఁ దిట్టినవానిన్**
**భూపతి మంత్రంబు బయలుపుచ్చినవానిన్**
**జేపడ జిహ్వాఛేదము**
**నాపోవక చేసి పాఱనడుపఁగవలయున్**

**అన్వయం:** భూపతిన్ – తిట్టినవానిన్ – భూపతి – మంత్రంబున్ – బయలుపుచ్చినవానిన్ – చేపడన్ – జిహ్వా + ఛేదమున్ – ఆపోవక – చేసి – పాఱన్ – నడుపగవలయున్.

**వ్యాఖ్య:** రాజుగారిని నిందించినవాణ్నీ, రాజుగారు చేసే రహస్యమంత్రాంగం నిర్ణయాలనూ వ్యూహాలనూ (మంత్రంబు) బహిరంగపరిచినవాణ్నీ (బయలు పుచ్చినవానిన్ = బయటపెట్టినవానిన్) వెంటనే అదుపులోకి తీసుకుని (చేపడన్) ఏమీ వెనుకాడకుండా లేదా – చాల్లే అని చిన్న దండనతో తృప్తిపడకుండా (ఆపోవక) వాడి నాలుకను రాజు కత్తిరించెయ్యాలి, ఆపై దేశంనుంచి వెళ్లగొట్టాలి (పాఱన్ నడుపగవలయున్).

**135.** తే.గీ. **ఆయుధంబులుగల బంట్ల యాయుధములు**
**వాద్యముల వారి వాద్యయాతోద్యములును**
**గర్మకారుల కర్మోపకరణములను**
**గొనరు రాజులు ధనములు గొనరయేని**

**అన్వయం:** ఆయుధంబులు – కల – బంట్ల – ఆయుధములు, వాద్యములవారి – వాద్య – యాతోద్యములును, కర్మకారుల – కర్మ + ఉపకరణములను – ధనుములు – కొనర + ఏనిన్ –రాజులు – కొనరు.

**వ్యాఖ్య:** ఆయుధాలు కల సైనికుల (బంట్ల) ఆయుధాలను, వాద్యాలవాళ్ళ వాద్య

ఆతోద్యాలూ, పనిచేసేవాళ్ళ (కర్మకారుల) పనిముట్లూ (కర్మోపకరణములను) రాజులు ధనం మొత్తం తీసుకోనే సందర్భంవచ్చినా వాటిని మాత్రం తీసుకోరు. ఎందుకంటే అవి వారికి జీవనాధారాలు కాబట్టి. దీనికి మూలం.

**ఆయుధాన్యాయుధీయానాం వాహ్యాదీ న్వాహ్య జీవినాం**
**వేశ్యస్త్రీణా మలంకారా న్వాద్యాతోత్యాది తద్విదాం**
**యచ్చ యస్యోపకరణం యేన జీవంతి కార్మికాః**
**సర్వస్వ హరణేఽ ప్యేతన్న రాజా హర్తు మర్హతి** (వి.వ్య.300)

**చతుర్విధ ఆతోద్యములు :**

1) తతము (వీణ మొ॥), 2) అవనద్ధము (మద్దెల మొ॥), 3) సుషిరము (వేణువు మొ॥), 4) ఘనము (కంచుతాళములు మొ॥) "తతం చైవావనద్ధం చ ఘనం సుషిరమేవ చ, చతుర్విధం చ విజ్ఞేయమాతోద్యం లక్షణాన్వితమ్" [భ.నా.శా. 6 – 27].

**136. కం. భూనాథుని యందలమును**
**నేనుఁగుఁ దురగంబు నాతఁ డెక్కు మనక య**
**జ్ఞానమున నెక్కినాతఁడు**
**దా నచ్చుం బణ సహస్రదండము పతికిన్**

**అన్వయం:** భూనాథుని – అందలమును – ఏనుఁగున్ – తురగంబున్ – ఆతఁడు – ఎక్కుము + అనక; అజ్ఞానమునన్ – ఎక్కిన + ఆతఁడు, పతికిన్ – పణ సహస్ర – దండము – తాన్ – అచ్చున్.

**వ్యాఖ్య:** రాజుగారు కూర్చొనే సింహాసనాన్ని, ఆయన ఎక్కి ఊరేగే పట్టపుటేనుగును, గుర్రాన్ని (తురగంబున్) ఇతరులెవరూ అధిరోహించకూడదు – ఆయనగారే ఆహ్వానిస్తే తప్ప. అప్పుడు కాదనకూడదు. ఎవడైనా ఈ నియమం తెలియక అజ్ఞానంతో అధిరోహిస్తే, ఎక్కుము అని రాజుగారు ఆహ్వానించకుండానే (ఎక్కుమనక) ఎక్కితే, వాడు వెయ్యి పణాలు దండువుగా (పణ – సహస్ర – దండము) రాజుగారికి చెల్లించాలి (అచ్చున్). అజ్ఞానంతో చేసిన తప్పు కాబట్టి ఈ మాత్రం అల్పదండన.

**137. తే.గీ. రాజునకుఁ గీడు పుట్టెడు రాజ్య మడఁగు**
**ననుచు నెఱుక చెప్పెడు జ్యోతిషాధములను**
**గుడుపుకొఱకు విప్రాకృతిఁ గొన్న శూద్రుఁ**
**బణ సహస్రదండము గొనఁ బాడిగలదు**

**అన్వయం:** రాజునకున్ – కీడు – పుట్టెడున్, రాజ్యము – అడఁగున్ – అనుచున్ – ఎఱుక – చెప్పెడు – జ్యోతిష + అధములను , కుడుపుకొఱకున్ – విప్ర + ఆకృతిన్ – కొన్న – శూద్రున్ – పణ – సహస్రదండము – కొనన్ – పాడి – కలదు.

**వ్యాఖ్య:** జాతకరీత్యా రాజుగారికి ఇది గడ్డు కాలం, గ్రహాలు ప్రతికూలంగా ఉన్నాయి, కీడు జరుగుతుంది (పుట్టెడున్) మన రాజ్యంకూడా అంతరిస్తుంది – అన్యాక్రాంతమవుతుంది (అడగున్) – అంటూ తెలిసీతెలియని సోది (ఎఱుక) చెప్పే జ్యోతిషాధముల్ని వెయ్యిపణాల దండువుతో శిక్షించడం రాజుగారికి ధర్మం (పాడి).

ఏదో ఒక పూట పొట్టపోసుకోవడం కోసం (కుడుపు = తిండి) బ్రాహ్మణ వేషం బనాయించిన శూద్రుడికీ అదే శిక్ష. అంతే దండువు వేసి వసూలుచెయ్యడం (కొనన్) ధర్మువే అవుతుంది (పాడి – కలదు). రాచరికాలనాటి సంగతులు.

**138. కం. నలి శూద్రుఁడు విప్రాకృతి**
**దలకొని పితృభోజనముల తఱిఁ జొచ్చినఁ గెం**
**పలవడఁ గాఁగిన యినుమున**
**సొలవక జన్నిదము నొవ్వఁ జూఁడఁగవలయున్**

**అన్వయం:** నలిన్ – శూద్రుఁడు – విప్ర + ఆకృతిన్ – తలకొని – పితృభోజనముల – తఱిన్ – చొచ్చినన్ – కెంపు + అలవడన్ – కాఁగిన – ఇనుమునన్ – సొలవక – జన్నిదమునన్ – నొవ్వన్ – చూఁడఁగవలయున్.

**వ్యాఖ్య:** శూద్రుడు విప్రాకృతిని పూని (తలకొని) – తద్దినం భోజనాలప్పుడు (పితృభోజనముల తఱిన్) ప్రవేశించినట్లయితే – ఎర్రగా (కెంపు అలవడన్) కాగిన అంటే కాల్చిన యినుముతో ఏమాత్రం వెనుకాడకుండా (సొలవక) జన్నిదంలాగానే ఎడమ భుజంనుంచి కుడిడొక్కలోకి ధారపోసి; వాడు నొవ్వేట్టు చూడాలి – శిక్షించాలి.

దీనికి మూలం మితాక్షరలోని వాక్యం. శ్రాద్ధ భోజనార్థం పున శ్శూద్రస్య విప్రవేష ధారిణ స్తప్తశలాకయా యజ్ఞోపవీతాది వద్విప్రస్యాలిఖేత్ (వి.వ్య.302).

**139. కం. జీవముకొఱకును శూద్రుఁడు**
**తా విప్రుఁ డననుచు వేషధారి తనమునన్**
**జీవించెనేని వానిం**
**గావలమునఁ గన్న యపుడు ఖండింపఁదగున్**

**అన్వయం:** జీవముకొఱకును – శూద్రుఁడు – తాన్ – విప్రుఁడు – అని + అనుచున్ – వేషధారితనమునన్ – జీవించెన్ + ఏనిన్ – వానిన్ – కావలమునన్ – కన్న + అపుడు – ఖండింపన్ – తగున్.

**వ్యాఖ్య:** ఉపాధికోసం (జీవముకొఱకును) శూద్రుడు తాను విప్రుణ్ణి అంటూ వేషధారితనంతో కపటవేషంతో జీవించినట్లయితే వాణ్ణి ఆ పాపంలో (కావలమునన్) చూడగానే అప్పుడే వధించాలి ఖండింపఁదగున్).

దీనికి మూలం ఈ మను వచనం.

**వృత్త్యర్థం బ్రాహ్మణలింగధారిణో వధ ఏవ. ద్విజాతిలింగిన శ్శూద్రా న్ఘాతయే ద్వివిధైర్వధైరితి మనుస్మరణాత్** (వి.వ్య.**302**).

**140. సీ.** **అంగద నర్థించినట్టి యభ్యాగతు**
**వృథపుచ్చ కొకజాఁడ బ్రీతిఁదనిపి**
**యిలుగురులకునెల్ల నిష్టంబుపల్కుచు**
**బంధువర్గంబులఁ బరగఁబ్రోచి**
**వీరు వారన కెల్లవారును దనవారు**
**గాఁ జూచి యర్థిఁ జక్కంగఁ బెట్టి**
**బ్రాహ్మణభక్తుఁడై పరహితార్థముచేసి**
**శుభగుణంబులయందు బ్రభుతగల్గి**

**గీ.** **సత్యమును శౌచమును ధనసంగ్రహముగ**
**మహిఁ జెలంగు గృహస్థధర్మంబుగలిగి**
**యున్న పురుషు లుత్తమగతి నొందువార**
**లనుచుఁ జెప్పుద రిల సౌమ్యులైనవారు**

**అన్వయం:** అంగదన్ – అర్థించిన + అట్టి – అభ్యాగతున్ – వృధపుచ్చక – ఒకజాఁడన్ – ప్రీతిన్ – తనిపి, ఇలుగురులకున్ – ఎల్లన్ – ఇష్టంబు – పల్కుచున్, బంధువర్గంబులన్ – పరగన్ – ప్రోచి, వీరు – వారు – అనక – ఎల్ల – వారును – తనవారు – కాన్ – చూచి – అర్థిన్ – చక్కంగన్ – పెట్టి, బ్రాహ్మణ – భక్తుఁడై – పర – హిత + అర్థము – చేసి, శుభ – గుణంబుల + అందున్ – ప్రభుత – కల్గి, సత్యమును – శౌచమును – ధన – సంగ్రహముగన్, మహిన్ – చెలంగు – గృహస్థ – ధర్మంబు – కలిగి + ఉన్న – పురుషులు – ఉత్తమగతిన్ – ఒందువారలు – అనుచున్ – ఇలన్ – సౌమ్యులు + ఐన – వారు – చెప్పుదురు.

**వ్యాఖ్య:** ఆకలితో (అంగదన్) అర్థించిన అభ్యాగతుణ్ణి వృధాగా పంపకుండా ఒక పద్ధతిలో చేతనైనంతలో (ఒకజాఁడన్) ప్రీతితో సంతృప్తిపరిచి, వంశపారంపర్యంగా వస్తున్న గురువులకు (ఇలుగురులకునెల్లన్) ఇష్టమైన రీతిలో మాట్లాడుతూ, బంధువర్గాన్ని ఇంపుగా ఆదుకొంటూ, వీళ్ళూ వాళ్ళూ అనకుండా అందరూ తనవారేననే భావనతో చూస్తూ, ఎల్లవారినీ చక్కగా ఆదరిస్తూ, బ్రాహ్మణభక్తుడై, పరుల హితంకోసం పాటుపడుతూ, శుభమైన గుణాలలో ప్రభుతనుకలిగి ఉంటూ అంటే మంచిగుణాలు కలవాడై – సత్యమూ, శౌచమూ, ధనసంగ్రహంగా మహిలో చెలగే గృహస్థధర్మం కలిగి ఉన్న పురుషులు ఉత్తమగతులు పొందుతారు అంటూ ఈ భూమిపై సౌమ్యులైనవారు చెప్తారు.

★★★

# వ్యవహారకాండము

**1. మ. ధరణీనాథుడు క్రోధలోభముల పొంతంబోక సద్ధర్మ త**
**త్పరుఁడై విశ్రుత విప్రవంశ్యులగు విద్వద్వర్యులుం దాను సు**
**స్థిర ధర్మవ్యవహారనిర్ణయ మొగిం జేయం దగుం జేయఁగాఁ**
**బరపై దిక్కుల నెక్కుఁ గీర్తి వెలయుం భాగ్యంబు నానాటికిన్**

**అన్వయం:** ధరణీనాథుడు – క్రోధ – లోభముల – పొంతన్ – పోక – సత్ – ధర్మ – తత్పరుఁడై – విశ్రుత – విప్రవంశ్యులు – అగు – విద్వద్వర్యులున్ – తానున్ – సుస్థిర – ధర్మ – వ్యవహార – నిర్ణయము – ఒగిన్ – చేయన్ – తగున్. చేయఁగాన్ – పరపై – దిక్కులన్ – కీర్తి – ఎక్కున్. భాగ్యంబు – నానాటికిన్ – వెలయున్.

**వ్యాఖ్య:** రాజు (ధరణీనాథుడు) క్రోధమూ లోభమూ మొదలైనవాటి జోలికి పోకుండా (పొంతన్ పోక) ఉత్తమమైన ధర్మంపట్ల తత్పరభావంతో ప్రసిద్ధులైన (విశ్రుత) విప్ర వంశానికి చెందిన (వంశ్యులు అగు) పండితోత్తములతో (విద్వద్వర్యులున్) కలిసి తాను శాశ్వతమైన (సుస్థిర) ధర్మ వ్యాజ్యాలలో (వ్యవహార) నిర్ణయాలు తీర్పులు చక్కగా (ఒగిన్) చేయాలి. అలా చేస్తే విశాలంగా (పరపై) దిక్కులకు కీర్తి వ్యాపిస్తుంది (ఎక్కున్). భాగ్యాలు నానాటికీ వెల్లివిరుస్తాయి (వెలయున్).

**2. తే.గీ. వినికిగల్గువారి వేదజ్ఞులగువారి**
**సత్యయుతుల ధర్మశాస్త్రవిదుల**
**ద్వేషరాగరహిత విప్రుల హితుల**
**సభ్యులుగఁ జేయవలయు భూవిభుండు**

**అన్వయం:** వినికి – కల్గువారిన్ – వేదజ్ఞులగువారిన్ – సత్యయుతులన్ – ధర్మశాస్త్రవిదులన్ –ద్వేష – రాగ – రహిత – విప్రులన్ – హితులన్ – భూవిభుండు – సభ్యులుగన్ – చేయవలయున్.

**వ్యాఖ్య:** సుప్రసిద్ధులనూ లేదా శాస్త్రాది శ్రవణం (వినికిగల్గువారిన్) వేదజ్ఞానం కలవారినీ, సత్యనిష్ఠకలవారినీ ధర్మశాస్త్రాలు తెలిసినవారినీ, ద్వేషమూ అనురాగమూ లేని (రహిత) రాగద్వేషాలకు అతీతులైన విప్రులనూ, హితులనూ రాజు (భూవిభుండు) – తన న్యాయసభలో సభ్యులుగా చేయాలి.

**3. కం. ఆవిప్రు లేడ్వురైనను**
**నేవురు ముమ్వురనునైన నిమ్మహిలోనం**
**భావిత సభయగుఁ గావున**
**మూవురవశ్యంబువలయు ముఖ్యులు సభకున్**

**అన్వయం:** ఈ – మహిలోనన్ – ఆ – విప్రులు – ఏడ్వురు – ఐననున్ – ఏవురున్ – ముమ్వురనున్ – ఐనన్ – భావిత – సభయగున్ – కావునన్ – సభకున్ – మూవురు – ముఖ్యులు –అవశ్యంబు – వలయున్.

**వ్యాఖ్య:** ఆ విప్రులు ఏడుగురైనా, ఐదుగురైనా (ఏవురు), ముమ్వురైనా ఈ మహిలో ఎన్నదగిన (భావిత) న్యాయసభ అవుతుంది. కాబట్టి ముగ్గురు ముఖ్యులు తప్పనిసరిగా (అవశ్యంబు) సభకు కావాలి.

**4. కం. తనకుం గార్యము గలిగినఁ**
**దనమాఱుగ ధర్మశాస్త్ర తత్త్వార్థవిధి**
**జ్ఞునిఁ బ్రాడ్వివాకునుత్తము**
**జననాథుఁడు పనుపవలయు సభ్యులకడకున్**

**అన్వయం:** తనకున్ – కార్యము – కలిగినన్ – తన – మాఱుగన్ – ధర్మ శాస్త్ర – తత్త్వ – అర్థ విధిజ్ఞునిన్ – బ్రాడ్వివాకున్ – ఉత్తమున్ – జననాథుఁడు – సభ్యులకడకున్ – పనుపవలయున్.

**వ్యాఖ్య:** తనకు పని ఉంటే (కార్యము గలిగినన్) తనకు మారుగా ధర్మశాస్త్రాలలోని తత్త్వమూ, వాటిలోని అర్థమూ విధులూ తెలిసినవాడిని మంచి న్యాయకోవిదుడైన న్యాయాధిపతి తగవరినీ (బ్రాడ్వివాకున్) ఉత్తముణ్ణీ రాజు (జననాథుఁడు) సభ్యులవద్దకు పంపాలి.

**5. కం. జనపతి యన్యాయంబునఁ**
**జనునెడ వెనుచనుదురేని సభ్యులు పాపం**
**బున మునుఁగుదురదిగావున**
**నెన పతికిం గార్యతత్వ మెఱిఁగింపనగున్**

**అన్వయం:** జనపతి – అన్యాయంబునన్ – చనునెడన్ – వెను చనుదురేనిన్ – సభ్యులు – పాపంబునన్ – మునుఁగుదురు – అది – కావునన్ – ఎన – పతికిన్ – కార్యతత్వము – ఎఱిఁగింపన్ – అగున్.

**వ్యాఖ్య:** రాజు (జనపతి) అన్యాయంగా ప్రవర్తిస్తుంటే అతనివెంట సభ్యులూ అదేదారిలో నడిస్తే దానివల్ల వాళ్ళూ పాపంలో మునుగుతారు (మునుఁగుదురది) కాబట్టి సాటి రాజుకి (ఎన పతికిన్) కార్యతత్వం తెలియచెప్పాలి.

**6. కం. ప్రియమున ధనలోభంబున**
**భయమున ధర్మంబుఁదప్పఁ బలుకుదురేనిన్**
**రయమున నొక్కొకసభ్యుని**
**దయసేయక తప్పఁబెట్టి దండింపఁదగున్**

**అన్వయం:** ప్రియమునన్ – ధనలోభంబునన్ – భయమునన్ – ధర్మంబున్ – తప్పన్ –పలుకుదురు + ఏనిన్ – రయమునన్ – ఒక్కొక – సభ్యునిన్ – దయసేయక – తప్పన్ – పెట్టి –దండింపన్ – తగున్.

**వ్యాఖ్య:** ప్రియాన్నో ధనలోభాన్నో భయాన్నో ధర్మం తప్పేలా పలికినట్లయితే వెంటనే (రయమునన్) ఒక్కోసభ్యుణ్ణీ వారిమీద కనికారం చూపించకుండా (దయసేయక) సభ్యులుగా తప్పించి దండించాలి.

**7. కం. దండింపఁగ దగనివారల**
**దండింపుచు నుండెనేని దండ్యుల నెల్లన్**
**దండింపఁడేని పతి నిం**
**ద్యుండై వగఁగుందుఁ బిదప దుర్గతిఁబొందున్**

**అన్వయం:** దండింపఁగన్ – తగని – వారలన్ – దండింపుచున్ – ఉండెనేని – దండ్యులన్ – ఎల్లన్ – దండింపఁడేని – పతి – నింద్యుండై – వగన్ – కుందున్ – పిదపన్ – దుర్గతిన్ – పొందున్.

**వ్యాఖ్య:** దండింపరానివారిని దండిస్తూ ఉంటే దండించదగిన వారినందరినీ (దండ్యుల నెల్లన్) దండించకుండా ఉన్నట్లయితే అటువంటి రాజు నిందింపబడుతూ (నింద్యుండై) వగన్ = దుఃఖతో కుమిలిపోతాడు (కుందున్). ఆ తరువాత దుర్గతులపాలౌతాడు.

**8. కం. విచ్చలవిడి బలవంతుం**
**డచ్చుగఁ గారించుటయును అబలుఁడు చాలన్**

**నొచ్చి మహీపతి సభకున్**
**వచ్చి యెఱింగింప నదియె వ్యవహారమగున్**

**అన్వయం:** విచ్చలవిడి – బలవంతుండు – అచ్చుగన్ – కారించుటయును – అబలుఁడు – చాలన్ – నొచ్చి – మహీపతి – సభకున్ – వచ్చి – యెఱింగింపన్ – అదియె – వ్యవహారము + అగున్.

**వ్యాఖ్య:** విచ్చలవిడిగా బలవంతుడు బాహాటంగా (అచ్చుగన్) బాధపెట్టడం (కారించుటయును), బలంలేనివాడు (అబలుఁడు) చాలా బాధపడి (నొచ్చి) రాజసభకు (మహీపతి సభకున్) వచ్చి ఫిర్యాదు చేస్తే (ఎఱింగింపన్) అదే వ్యాజ్యం దావా (వ్యవహారం) అవుతుంది.

**స్మృత్యాచార వ్యపేతేన మార్గేణా ధర్షితాపరైః**
**ఆవేదయతి చేద్రాజ్ఞే వ్యవహారం పరం హితత్** (యా.వ్య. 5)

**9.** కం. **అర్థిఁ బిలిచి నీ కెవ్వఁడ**
**నర్థం బొనరించెఁ జెప్పుమని యాతనిచే**
**సార్థముగ నెఱిఁగి మఱి ప్ర**
**త్యర్థిం బిలిపింపవలయు నధిపతి సభకున్**

**అన్వయం:** ఆర్థిన్ – పిలిచి – నీకున్ – ఎవ్వఁడు – అనర్థంబు – ఒనరించెన్ – చెప్పుము – అని – ఆతనిచేన్ – సార్థముగన్ – ఎఱిఁగి – మఱి – ప్రత్యర్థిన్ – అధిపతి – సభకున్ – పిలిపింపవలయున్.

**వ్యాఖ్య:** న్యాయంకోరిన వాడిని – వాదిని (అర్థిన్) పిలిచి నీకు ఎవడు అనర్థం కలిగించాడో చెప్పమని అడిగి, వాడినుండి పూర్తిగా (సార్థముగ) విషయం తెలుసుకొని (ఎఱిఁగి), ఇక ప్రత్యర్థిని ప్రతివాదిని రాజు సభకు పిలిపించాలి.

**విశేషాలు**: వాది plaintiff ప్రతివాది Respondent.

**దీనికి మూలం.**

**కాలే కార్యార్థినం పృచ్ఛే త్ప్రణతం పురతస్థితమ్**
**కిం కార్యం కా చ తే పీడా మాభైషీః బ్రూహి మానవ**
**కేన కస్మిన్ కదాకస్మా త్పృచ్ఛే దేవం సమాగతం** (వి.వ్య. 5)

**10.** ఉ. **జాతర పెండ్లి యుత్సవము జన్నముఁ జేయఁ దొడంగియున్నచో**
**బాతిగరాజమంత్రులు తపస్వులు వశ్యు లవశ్యకార్యముల్**

**ప్రీతి నొనర్చుచోఁ దటిమి పిల్వఁగ నప్పనులెల్లఁ దీఱగా**
**భూతలనాథు ముద్ర గొనిపోయిన భృత్యులు వారిఁదేఁదగున్**

**అన్వయం:** జాతర – పెండ్లి – ఉత్సవము – జన్నమున్ – చేయన్ – తొడంగి – ఉన్నచోన్ – బాతిగన్ – రాజమంత్రులు – తపస్వులు – వశ్యులు – అవశ్యకార్యముల్ – ప్రీతిన్ – ఒనర్చుచోన్ – తటిమి – పిల్వఁగన్ – ఆ పనులు – ఎల్లన్ – తీఱగాన్ – భూతలనాథు – ముద్ర – కొనిపోయినన్ – భృత్యులు – వారిన్ – తేన్ – తగున్.

**వ్యాఖ్య:** జాతర, పెళ్ళి, ఉత్సవం, యజ్ఞం (జన్నమున్) మొదలైనవి జరుగుతున్నప్పుడు (తొడంగి ఉన్నచోన్) ప్రీతిగా ( బాతిగన్) రాజమంత్రులు, తపస్వులు, రాజసేవకులు (వశ్యులు) తప్పనిసరిగా చేయవలసిన విధుల్ని (అవశ్యకార్యముల్) ప్రీతితో చేయడానికి అవసరమైనవారిని సత్వరం (తటిమి) పిలవడానికీ ఆ పనులన్నీ తీరేలా చూడడానికీ రాజముద్ర (భూతలనాథు ముద్ర) ఇచ్చి తగిన సేవకులను (భృత్యులు) పంపించాలి. అలా రాజముద్రికతో – ఆజ్ఞాపత్రంతో వెళ్ళినవారు ఆయావ్యక్తులను తేవాలి.

**విమృశ్య కార్యం న్యాయంచే దాహ్వానార్థ మతఃపరమ్**
**ముద్రాం వా నిక్షిపేత్ తస్మిన్ పురుషం వా సమాదిశేత్ (వి.వ్య. 5)**

**11. తే.గీ. బుద్ధిహీన బాల వృద్ధ కన్యాదుల**
**కర్థిఁబూని పాడి యాడవలయు**
**నన్నదమ్ముఁ డొండె నాత్మసంభవుఁ డొండె**
**జనకుఁ డొండె బ్రేష్యజనుఁడునొండె**

**అన్వయం:** బుద్ధిహీన – బాల – వృద్ధ – కన్య – ఆదులకున్ – అర్థిన్ – పూని – పాడి – ఆడవలయున్ – అన్నదమ్ముఁడు – ఒండెన్ – ఆత్మసంభవుఁడు – ఒండెన్ – జనకుఁడు – ఒండెన్ – ప్రేష్యజనుఁడున్ – ఒండె.

**వ్యాఖ్య:** బుద్ధిహీనులైన బాల, వృద్ధ, కన్యాదుల పక్షాన వాదిని (అర్థిన్) పెట్టుకొని న్యాయం చెప్పాలి (పాడి యాడవలయున్). బుద్ధిహీన బాలుడి పక్షాన అతడి అన్నదమ్ముణ్ణిగానీ బుద్ధిహీనయైన వృద్ధురాలి పక్షాన ఆమె పుత్రుడుగానీ (ఆత్మసంభవుఁడు), బుద్ధిహీనయైన కన్య పక్షాన ఆమె తండ్రినిగానీ (జనకుఁ డొండెన్), తక్కినవారి పక్షాన ప్రతినిధిగా వారిచేత పంపబడిన వ్యక్తిగానీ (ప్రేష్యజనుఁడు) న్యాయం కోరాలి.

**12. కం. జనకుండు తోడఁబుట్టుగు**
**తనయుఁడు శిష్యుండు దక్కఁ దక్కినవారల్**
**జనపతిసభలోఁ దమయం**
**తన పాడిం బూనిరేని దండింపఁదగున్**

**అన్వయం:** జనకుండు – తోడఁబుట్టుగు – తనయుఁడు – శిష్యుండు – తక్కన్ – తక్కినవారల్ –జనపతి – సభలోన్ – తమ – అంతన – పాడిన్ – పూనిరేనిన్ – దండింపన్ – తగున్.

**వ్యాఖ్య:** తండ్రి (జనకుండు), తోబుట్టువు, పుత్రుడు (తనయుఁడు), శిష్యుడు తప్పించి (తక్కన్) తక్కినవాళ్ళు రాజసభలో తమంతట తాముగా ఒకరిపక్షాన న్యాయం కోరితే (పాడిన్ పూనిరేనిన్) వారిని దండించవచ్చు.

**13. కం. పీడం బొందక యాపదఁ**
**గూడకయున్నేని సరకుగొనకున్నేనిం**
**బాడికిరాఁడే నతని**
**నోడక బలహీనుఁ డాఁగుటుచితం బెందున్**

**అన్వయం:** పీడన్ – పొందక – ఆపదన్ – కూడక – ఉన్న – ఏనిన్ – సరుకుగొనక – ఉన్న – ఏనిన్ – పాడికి – రాఁడేన్ – అతనిన్ – ఓడక – బలహీనుఁడు – ఆఁగుట – ఎందున్ – ఉచితంబు.

**వ్యాఖ్య:** ఏ పీడనూ పొందకుండా ఆపదలో వెంట ఉండకుండా లెక్కచేయకుండా (సరకుగొనకున్నేనిన్) ఉన్నా న్యాయానికి రాకపోయినా అటువంటి వాడిని భయపడకుండా (ఓడక) బలహీనుడు రాజాజ్ఞచేత నిలువరించడం (ఆఁగుట) ఎప్పుడూ ఉచితం.

**14. కం. ఆఁగిన నిలువనియాతం**
**డాఁగఁదగనివాని బలిమి నాఁగిన యతఁడున్**
**నాఁగఁబడియుండ నాతఁడు**
**నాఁగినయాతఁడును దండ్యుఁ డవనీశులకున్**

**అన్వయం:** ఆఁగినన్ – నిలువని – ఆతండు, ఆఁగన్ – తగనివానిన్ – బలిమిన్ – ఆఁగిన – అతఁడున్, ఆఁగఁబడి – ఉండన్ – ఆతఁడు – ఆఁగిన, ఆతఁడును – అవనీశులకున్ –దండ్యుఁడు.

**వ్యాఖ్య:** రాజాజ్ఞచేత నిలువరిస్తే (ఆఁగినన్) నిలువనివాడూ,

నిలువరించదగనివాడిని, వాడిని బలిమితో నిలువరించేవాడూ, నిలువరింతకు (ఆఁగన్) నిషేధంలో పడి ఉండని వాడూ, నిషేధం విధించినవాడూ (ఆఁగినయాతఁడును) రాజుకు (అవనీశులకున్) దండనార్హులు.

**విశేషాలు:** ఆఁగు = అంతర్భావిత ప్రేరణార్థకం.

**15. కం. అర్థియుఁ బత్రిక సభఁ బ్ర**
**త్యర్థియెదుట వ్రాయుటయును నందఱు వినఁ బ్ర**
**త్యర్థి లిఖియింపవలయును**
**నర్థికి నుత్తరము సభ్యులగుఁ దగుననఁగన్**

**అన్వయం**: అర్థియున్ – పత్రికన్ – సభన్ – ప్రత్యర్థి – ఎదుటన్ – వ్రాయుటయునున్, అందఱున్ – వినన్, ప్రత్యర్థి – అర్థికిన్ – ఉత్తరము – సభ్యులు – అగున్ – దగున్ – అనఁగన్ –లిఖియింపవలయును.

**వ్యాఖ్య:** వాదికూడా (అర్థియున్) వ్యాజ్యపత్రాన్ని (పత్రిక) సభలో ప్రతివాది (ప్రత్యర్థి) ఎదుట రాయడమూ, దానిని అందరూ విని, సభ్యులు అవును ఉచితం అన్న తర్వాత ప్రతివాది (ప్రత్యర్థి) వాదికి (అర్థికిన్) సమాధానాన్ని (ఉత్తరము) లిఖించాలి.

**16. కం. ఒడఁబాటు బొంకుసేయుట**
**యొడఁబడఁ గారణము సెప్పి యుడుగుట మున్నొ**
**క్కెడఁ బాడిఁ దాను గెలుచుట**
**యుడుగక ప్రత్యర్థిచెప్పు నుత్తరమునకున్**

**అన్వయం:** ఒడఁబాటున్ – బొంకుసేయుట, ఒడఁబడన్ – కారణము – చెప్పి – ఉడుగుట, మున్ను – ఒక్క – ఎడన్ – పాడిన్ – తాను – గెలుచుట, ఉడుగక – ప్రత్యర్థి – చెప్పు – ఉత్తరమునకున్.

**వ్యాఖ్య:** ఒడంబడికను బొంకుచేయడం, ఒప్పందం కుదుర్చుకోవడానికి కారణం చెప్పి తప్పుకోవడం (ఉడుగుట), ముందు ఒకచోట వ్యాజ్యాన్ని తాను గెలవడం, ఇలాంటివాటిని విడిచిపెట్టకుండా (ఉడుగక) ప్రత్యర్థి తనకందిన ఉత్తరానకి సమాధానంగా చెప్తాడు.

**17. సీ. అప్పుడు నిక్షేప మస్వామి యమ్ముట**
**కూడి బేహారమ్ములాడికొనుట**
**యిచ్చిక్రమ్మఱఁగొంట యిలఁగూలిపనిచేఁత**

**తివిరి యొడంబాటు తిరుగఁబడుట**
**కొనియమ్మి పెనుచుట యనుచరస్వాముల**
**వాదంబు పొలిమేర వలనిపోరు**
**బెట్టుదిట్టుట మేను ముట్టి వోనడుచుట**
**చౌర్యంబు అంకాట సాహసంబు**

గీ. **నాలిమగనిపోరు నర్థవిభాగంబు**
**జూదమనెడు నట్టివాదుపుట్టు**
**జనులుకోరివచ్చి సభఁ జెప్పుదురు దీనిఁ**
**దెలియనడిగి విభుఁడు తీర్పవలయు**

**అన్వయం:** ఇలన్ – అప్పుడు – నిక్షేపము – అస్వామి – అమ్ముట, కూడి – బేహారమ్ములు –ఆడికొనుట, కూలిపనిచేఁత – ఇచ్చి – క్రమ్మఱన్ – కొంట, తివిరి – ఒడంబాటు – తిరుగఁబడుట, కొని – అమ్మి – పెనుచుట, అనుచరస్వాముల – వాదంబు, పొలిమేర వలనిపోరు, బెట్టుదిట్టుట, మేను – ముట్టి – పోన్ – అడుచుట, చౌర్యంబు, అంకాట, సాహసంబున్, ఆలిమగనిపోరున్ – అర్థవిభాగంబు, జూదము – అనెడు – అట్టి – వాదుపుట్టు – జనులు – కోరివచ్చి – సభన్ – చెప్పుదురు. దీనిన్ తెలియన్ – అడిగి – విభుఁడు – తీర్పవలయున్.

**వ్యాఖ్య:** ఈ భూమిమీద – అప్పులు చెయ్యడం – ఇవ్వడం (అప్పుడు), నిధి నిక్షేపాలను యజమానికానివాడు, దొంగయజమాని (అస్వామి) అమ్మడం, ఉమ్మడి వ్యాపారం చేయడం (కూడి బేహారమ్ములాడికొనుట) కూలిపని చేసినందుకు ఇచ్చిన సొమ్మును తిరిగి (క్రమ్మఱన్) తీసుకోవడం (కొంట), పూనికతో (తివిరి) ఒప్పందాన్ని తప్పడం (తిరుగఁబడుట), క్రయవిక్రయాలలో తగువులాడడం (కొనియమ్మి పెనుచుట), సహవర్తకులతో (అనుచరస్వాములన్) వాదులాడడం, పొలిమేర తగాదాలు, బాగా దూషించుకోవడం (బెట్టుదిట్టుట), శరీరాన్ని పట్టుకోని నిర్బంధించి కొట్టిచంపడం (పోనడుచుట), చౌర్యం, అంకాడడం, సాహసం, భార్యాభర్తల పోరు, ధనం పంపకాలు (అర్థవిభాగంబు), జూదం అనే వివాదాలు పుట్టిన జనులు కోరి వచ్చి న్యాయసభలో చెప్పుకొంటారు. అప్పుడు దీని వివరం తెలిసేలా అడిగి రాజు వాళ్ళవాళ్ళ వివాదాలు తీర్చాలి.

**తేషామాద్య మృణాదానం నిక్షేపో అస్వామి విక్రయః**
**సంభూయ చ సముత్థానం దత్తస్యానపకర్మ చ**
**వేతనస్యైవ చ అదానం సంవిదశ్చ వ్యతిక్రమః**

**క్రయ విక్రయానుశయో వివిధ స్వామిపాలయోః**
**సీమావివాదధర్మశ్చ పారుష్యే దండవాచికే**
**స్తేయం చ సాహసంచైవ స్త్రీసంగ్రహమేవ చ**
**స్త్రీ పుం ధర్మో విభాగశ్చ ద్యూతమాహ్వాయ మేవ చ**
**పదాన్యష్టాదశైతాని వ్యవహార స్థితావిహేతి (యా.వ్య. 5)**

1) మనుష్యమారణము, 2) చౌర్యము, 3) పరదారాభిమర్షణము, 4) వాక్ పారుష్యము – దండపారుష్యము – అని సాహసం నాలుగు విధాలు.

**మనుష్యమారణం చౌర్యం పరదారాభిమర్షణమ్**
**పారుష్యముభయం చేతి సాహసం స్యాచ్చతుర్విధమ్**

**18. కం. నడవంజాలనివారలఁ**
**దడయక మోపించితెచ్చి ధరణీశుఁడు దాఁ**
**దడవోర్వని కార్యములకు**
**నెడసేయక పాడి నిర్ణయింపఁగవలయున్**

**అన్వయం:** నడవన్ – చాలని – వారలన్ – తడయక – మోపించి – తెచ్చి – ధరణీశుఁడు – తాన్ – తడవు – ఓర్వని – కార్యములకున్ – ఎడ చేయక – పాడి – నిర్ణయింపఁగవలయున్.

**వ్యాఖ్య:** నడవ జాలని వాళ్ళని ఆలస్యం చేయకుండా (తడయక) మోసుకువచ్చేలా చేసి వారిని రప్పించి, అలాగే సమయం ఆట్టేలేని పనులకు (తడవోర్వని కార్యములకున్) ఆలస్యం చేయకుండా (ఎడసేయక) రాజు (ధరణీశుఁడు) తాను వ్యాజ్యం తీర్చాలి (పాడి నిర్ణయింపఁగవలయున్).

**19. కం. ఈయేటినెలను నీ తిథి**
**నీ యూరను నితని కింత యిచ్చితి ననుచున్**
**న్యాయంబు ముట్టఁజెప్పిన**
**వ్రాయింపఁగవలయుఁ దెలియ వసుధేశులకున్**

**అన్వయం:** ఈ – ఏటినెలనున్ – ఈ – తిథిన్ – ఈ – ఊరనున్ – ఇతనికిన్ – ఇంత – ఇచ్చితిన్ – అనుచున్ – న్యాయంబు – ముట్టన్ – చెప్పినన్ – తెలియన్ – వసుధ + ఈశులకున్ – వ్రాయింపఁగవలయున్.

**వ్యాఖ్య:** ఈ సంవత్సరం ఈ నెలలో ఈ తిథినాడు ఈ ఊరిలో ఇతగాడికి ఇంత

ఇచ్చాను అంటూ న్యాయం ముట్టచెప్పినట్టయితే అది రాజులకు (వసుధేశులకున్) తెలిసేలా రాయించుకోవాలి.

**20. కం. వ్యవహారాసక్తునకై**
**వ్యవహారంబునకుఁ జొచ్చి నతఁడు గెలిచినన్**
**వ్యవహారంబున నోడిన**
**వ్యవహారాసక్తునకె జయాపజయంబుల్**

**అన్వయం:** వ్యవహార – ఆసక్తునకై – వ్యవహారంబునకున్ – చొచ్చిన – అతఁడు – గెలిచినన్ – వ్యవహారంబునన్ – ఓడినన్ – జయ + అపజయంబుల్ – వ్యవహార – ఆసక్తునకు + ఎ.

**వ్యాఖ్య:** వ్యాజ్యంపై ఆసక్తి కలవాడి పక్షాన మరొకడు వ్యాజ్యంలోనికి వెళ్ళినప్పుడు అలా వెళ్ళిన వాడు (వ్యవహారంబునకున్ చొచ్చిన అతఁడు) ఆ వ్యాజ్యంలో గెలిచినా ఓడినా పంపినవాడికే (వ్యవహారాసక్తునకె) జయాపజయాలు కానీ వెళ్ళినవాడు దానికి బాధ్యుడు కాడు.

**విశేషాలు:** యో యస్యార్థే వివదతే తయోర్జయ పరాజయా వితి స్మరణాత్ నియుక్త జయ పరాజయౌ మూలస్వామినోరోవ (వి.వ్య. 6).

**21. కం. పెనఁకువ నోడిన యతనికి**
**ధన మరువం బూఁట యొకఁడు దా వలయు నతం**
**డును దొరకకుండేనేనియు**
**జనపతి తనభృత్యునైనఁ జాలింపనగున్**

**అన్వయం**: పెనఁకువన్ – ఓడిన – అతనికిన్ – ధనము – అరువన్ – పూఁట – ఒకఁడు – తాన్ – వలయున్ – అతండును – దొరక + ఉండేనేనియున్ – జనపతి – తన – భృత్యున్ – ఐనన్ – చాలింపన్ – అగున్.

**వ్యాఖ్య**: వ్యాజ్యంలో (పెనఁకువన్) ఓడిన వాడికి ధనం చెల్లించడానికి ఇతడు చెల్లిస్తాడు నాదీ పూచీ అని హామీ ఉండడానికి ఒక వ్యక్తిని జామీనుగా (పూఁట) తాను తెచ్చుకోవాలి. అలా ఎవడూ దొరకకపోతే రాజు (జనపతి) తన సేవకుణ్ణైనా (భృత్యున్) ఏర్పాటుచేయాలి. పెట్టాలి (చాలింపన్ అగున్). మితాక్షరవ్యాఖ్యలో కింది కాత్యాయనోక్తే ఈ పద్యానికి మూలం.

**అథచేత్ ప్రతిభూర్నాస్తి కార్య యోగ్యస్తు వాదినః**
**రక్షితోఽస్మై దినస్యాంతే దద్యాద్భృత్యాయ వేతనమ్ (వి.వ్య.100)**

**22. కం. ఇతఁడింత గొనియె ననవుడు**
**నతనికి నుత్తరము సెప్పి యది మాన్పక ము**
**న్నితఁ డింత గొనియె నని తన**
**ప్రతిపక్షుం దొడరఁ దగదు పార్థివుసభలన్**

**అన్వయం:** ఇతఁడు – ఇంత – గొనియెన్ – అనవుడున్ – అతనికిన్ – ఉత్తరము – చెప్పి – అది – మాన్పక – మున్ను – ఇతఁడు – ఇంత – కొనియెన్ – అని – తన – ప్రతిపక్షున్ – తొడరన్ –పార్థివుసభలన్ – తగదు.

**వ్యాఖ్య:** ఇతడు ఇంత తీసుకున్నాడని అన్న తర్వాత (అనవుడున్) అతడికి దావాపత్రం ఇచ్చి (ఉత్తరము చెప్పి) అది ఆ దావా తీరకముందే ఇతడు ఇంత తీసుకున్నాడని మళ్ళీ తన ప్రతిపక్షంవాడితో రాజసభలలో (పార్థివుసభలన్) కలహించడం (తొడరన్) తగదు.

**23. కం. ఒకఁ డొకనితోడి పాడికిఁ**
**బ్రకటంబుగఁ దొడరుచోటఁ బైపడి మఱివే**
**రొకరుండువానిఁ దొడరుట**
**యకృతం బన్యాయమందు రాదిమునీంద్రుల్**

**అన్వయం:** ఒకఁడు – ఒకనితోడి – పాడికిన్ – ప్రకటంబుగన్ – తొడరుచోటన్ – పైపడి – మఱి – వేరొకరుండు – వానిన్ – తొడరుట – అకృతంబు – అన్యాయము (అని) – ఆది మునీంద్రుల్ – అందురు.

**వ్యాఖ్య:** ఒకడు ఒకడితో వ్యాజ్యానికి బాహాటంగా కలహిస్తుంటే (తొడరుచోటన్) వాడిమీదే మరొకడు కలహించడం (తొడరుట) అకృతం, అన్యాయం (అని) ఆది మునీంద్రులు అంటారు.

**24. కం. ఇది నాప్రతిజ్ఞ యని మును**
**విదితంబుగఁ జెప్పి దాని విపరీతముగాఁ**
**బదఁపడి చెప్పుట దప్పగు**
**నది తగవున నోడె ననుటె యన్యాయమగున్**

**అన్వయం:** ఇది – నా – ప్రతిజ్ఞ – అని – మును – విదితంబుగన్ – చెప్పి – దానిన్ – విపరీతముగాన్ – పదఁపడి – చెప్పుట – తప్పు – అగున్. అది తగవునన్ – ఓడెను – అనుట + ఎ – అన్యాయము – అగున్.

**వ్యాఖ్య:** ఇది నా ప్రతిజ్ఞ అని ముందు స్పష్టంగా (విదితంబుగన్) చెప్పి, దానికి

వ్యతిరేకంగా (విపరీతముగాన్) తర్వాత (పద‹పడి) చెప్పడం తప్పు. అది దావాలో ఓడినట్లే. అన్యాయమే అవుతుంది.

దీనికి మూలం:

**పూర్వ మావేదనకాలే అవేదితం తథా (ఏవ లేఖనీయం) నపున రన్యథా అన్యథా వాదిత్వేన భంగ ప్రసంగాత్ (వి.వ్య.6).**

**25. కం. తిట్టెనిత‹ డడిచె నిత‹డను**
**నిట్టి విచారములతోడ నెడసేయక నం**
**దిట్టె నిత‹ డడిచె నిత‹డని**
**నెట్టన చెప్పుటయె చాలు నేర్పున సభలన్**

**అన్వయం:** ఇత‹డు – తిట్టెన్ – ఇత‹డు – అడిచెన్ – అను – ఇట్టి – విచారములతోడన్ – ఎడ చేయక, నన్ – ఇత‹డు – తిట్టెన్ – ఇత‹డు – అడిచెన్ – అని – నెట్టనన్ – నేర్పునన్ – సభలన్ – చెప్పుట + ఎ – చాలు.

**వ్యాఖ్య:** ఇతడు తిట్టాడు, ఇతడు కొట్టాడు (అడిచెన్) అనే ఆలోచనలతో (విచారములతోడన్) ఆలస్యం చేయకుండా (ఎడ చేయక), నన్ను ఇత‹డు తిట్టాడు, నన్ను ఇతడు కొట్టాడు అని తప్పనిసరిగా (నెట్టనన్) నేర్పుగా న్యాయసభల్లో చెప్పడమే చాలు.

**26. కం. ఓడినత‹ డింత యిచ్చును**
**బాడినయని పల్కిరేని‹ బలికినధనముం**
**బాడిధనంబును దాము**
**న్నోడినతం డరువవలయు నుచితస్థితితోన్**

**అన్వయం:** పాడినన్ – ఓడిన – అత‹డు – ఇంత – ఇచ్చును – అని – పల్కిరేనిన్ – పలికిన – ధనమున్ – పాడిధనంబును – తాన్ – మున్ను – ఓడిన – అతండు – ఉచితస్థితితోన్ –అరువవలయున్.

**వ్యాఖ్య:** న్యాయసభా వ్యాజ్యంలో (పాడినన్) ఓడిన వాడు ఇంత సొమ్ము ఇవ్వాలి అని నిర్ణయించినట్లయితే (పల్కిరేనిన్) అలా చెప్పిన సొమ్మును (పలికిన ధనమున్) గెలిచినవాడికి, అలాగే న్యాయంచెప్పిన రాజుకి తగవుతీర్చినందుకు ఇచ్చే సొమ్మును (పాడిధనంబును) తాను ముందు ఓడిన వాడు తగినట్లుగా (ఉచితస్థితితోన్) చెల్లించాలి (అరువవలయున్).

**27. కం. మాటలునేరక పలికిన**
**నోటమిగాఁగొనక కార్యమున నిజముఁ దాఁ**
**జాటించి నృపతి ధర్మం**
**బేటముగాఁ బాడి నిర్ణయింపఁగవలయున్**

**అన్వయం:** మాటలు – నేరక – పలికినన్ – ఓటమిగాన్ – కొనక – కార్యము – ఉన్నన్ – నిజమున్ – తాన్ – చాటించి – నృపతి – ధర్మంబు – ఏటముగాన్ – పాడి – నిర్ణయింపఁగవలయున్.

**వ్యాఖ్య:** మాటలాడడం తెలియక మాట్లాడితే దాన్ని ఓటమిగా తీసుకోకుండా నిజంగా అందులో కార్యము ఉన్నట్లయితే ఆ నిజాన్ని రాజు తానే ప్రకటించి (చాటించి) ధర్మం ప్రాధాన్యంగా (ఏటముగాన్) న్యాయం నిర్ణయించి తీర్పు వెలువరించాలి.

**28. కం. కలయర్థమెల్ల సభలో**
**పల ముందఱఁ జెప్పమఱచి పదఁపడికార్యం**
**బులు నిర్ణీతములగుచోఁ**
**దెలిపిన లాభంబులేదు ధీమంతులకున్**

**అన్వయం:** కల – అర్థము – ఎల్లన్ – సభలోపలన్ – ముందఱన్ – చెప్పన్ – మఱచి – పదఁపడి – కార్యంబులు – నిర్ణీతములు – అగుచోన్ – తెలిపినన్ – ధీమంతులకున్ – లాభంబులేదు.

**వ్యాఖ్య:** ఉన్న న్యాయం – విషయం అంతా (కల అర్థము ఎల్లన్) న్యాయ సభలలో అందరి ముందరా చెప్పడం మరిచిపోయి ఆ తరువాత (పదఁపడి) కార్యాలు నిర్ణయింపబడిన తరువాత చెప్తే దానివల్ల బుద్ధిమంతులకు (ధీమంతులకున్) లాభం లేదు.

**29. కం. నానార్థములు లిఖించిన**
**నేనేమియు ముట్టననిన నేకంబైనన్**
**వానిపయిఁ గలుగఁదెలిపిన**
**వానికివాఁ డరువవలయు వ్రాసినమేరన్**

**అన్వయం:** నానార్థములు – లిఖించినన్ – నేను – ఏమియున్ – ముట్టను – అనినన్ – ఏకంబు + ఐనన్ – వానిపయిన్ – గలుగన్ – దెలిపిన – వానికిన్ – వాఁడు – వ్రాసినమేరన్ – అరువవలయున్.

**వ్యాఖ్య:** అనేక న్యాయాలు ప్రయోజనాలు (నానార్థములు) లిఖించినా నేనేమీ ముట్టనన్నా ఏకమైనా వాడిపై కలిగేలా తెలిపిన వాడికి వాడు రాసినమేరకు చెల్లించాలి.

**30. కం. ఆగమ పత్రము సాక్షియు**
**భోగంబు ప్రమాణ మెదియుఁ బొసఁగనిచో ను**
**ద్యోగించి దైవమగుక్రియ**
**వేగమె చేయింపవలయు విధివంతముగన్**

**అన్వయం:** ఆగమ పత్రము, సాక్షియున్, భోగంబు – ప్రమాణము – ఎదియున్ – బొసఁగనిచోన్ – ఉద్యోగించి – దైవము – అగు – క్రియ – విధివంతముగన్ – వేగమె – చేయింపవలయున్.

**వ్యాఖ్య:** ఆస్తి పత్రం (sale deed) (ఆగమ పత్రము), సాక్షీ, భోగం ఈ మూడూ మానుష ప్రమాణాలు. ఇవి ఏవీ పొసగకపోతే ఉద్యోగించి దైవమైనక్రియను అంటే దైవప్రమాణాలను విధివంతంగా వేగమే చేయించాలి.

**31. కం. ఒక్కఁడు మానుష మూఁదఁగ**
**నొక్కఁడు దైవంబు నూఁది యొడఁబడకున్నన్**
**నిక్కపు మానుషముం గొని**
**తక్కక పెనఁకువలు దీర్పఁదగు సభ్యులకున్**

**అన్వయం:** ఒక్కఁడు – మానుషము – ఊఁదఁగన్ – ఒక్కఁడు – దైవంబున్ – ఊఁది – ఒడఁబడకున్నన్ – నిక్కపు – మానుషమున్ – కొని – తక్కక – పెనఁకువలు – సభ్యులకున్ – దీర్పన్ – తగున్.

**వ్యాఖ్య:** ఒక్కఁడు మానుషాన్ని ప్రమాణంగా తీసుకొంటే (ఊఁదఁగన్) మరొకడు దైవికాన్ని ప్రమాణంగా తీసుకుంటే ఇలా వాళ్ళిద్దరికీ సంధిలేకపోతే (ఒడఁబడకున్నన్) నిజమైన మానుష ప్రమాణాన్నే తీసుకొని వెనుకాడకుండా సభ్యులు తగవులు (పెనఁకువలు) దీర్చడం తగినది. తుల, అగ్ని, జల, కోశాది దివ్యప్రమాణాలు దైవికాలు.

**32. కం. కుడుపుం బత్రము సాక్షియుఁ**
**గడుమేల్రెండైన మే లొకటియైనను మే**
**లొడఁబడ్డ నివి లేకున్నను**
**జెడవిడువక సత్యమర్థిఁ జేయింపఁదగున్**

**అన్వయం:** కుడుపున్ – పత్రము – సాక్షియున్ – కడుమేలు. రెండు – ఐనన్ –

మేలు. ఒకటి —ఐనను — మేలు. ఒడఁబడ్డన్ — ఇవి లేకున్నను — చెడవిడువక — సత్యము — అర్థిన్ — చేయింపన్ —తగున్.

**వ్యాఖ్య:** కుడుపు, పత్రం, సాక్షీ ఈ మూడూ ఉంటే కడుమేలు. పోనీ రెండుగానీ లేకపోతే కనీసం ఒకటి ఉన్నా మేలే. అంగీకరించినట్లయితే (ఒడఁబడ్డన్) ఇవి లేకపోతే అలాగే విడిచిపెట్టెయ్యకుండా సత్యప్రమాణం వాదితో (అర్థిన్) లేదా అడిగి (అర్థిన్) చేయించాలి.

**33. కం. ఒకపనిఁ బ్రతికెడువారికి**
**నొకకులమునవారి కొక్క యూథమునకుఁ బ**
**త్రికచాలు సాక్షి సత్యము**
**లొకనాఁడును వలదు వారి యొడఁబాటునకున్**

**అన్వయం:** ఒకపనిన్ — బ్రతికెడు — వారికిన్ — ఒకకులమున — వారికిన్ — ఒక్క — యూథమునకున్ — వారి — ఒడఁబాటునకున్ — పత్రికచాలున్. సాక్షిసత్యములు — ఒకనాఁడును —వలదు.

**వ్యాఖ్య:** ఒకే పనిచేస్తూ బ్రతికేవారికీ ఒకే కులంలోనివారికీ ఒకే సమూహంలోని వారికీ (యూథమునకున్) వారి వారి ఒప్పందాల విషయంలో (ఒడఁబాటునకున్) పత్రికచాలు. సాక్షి, సత్యం ఏనాడూ అక్కర్లేదు.

**34. కం. పెలుచనొకం డడుచుటకును**
**జలముమెయిం దిట్టుటకును సాహసమునకుం**
**బలవత్కృతికిం బత్రము**
**వలవదు దైవంబు సాక్షి వర్గముఁజాలున్**

**అన్వయం:** పెలుచన్ — ఒకండు — అడుచుటకును — చలము — మెయిన్ — తిట్టుటకును — సాహసమునకున్ — బలవత్కృతికిన్ — పత్రము — వలవదు. దైవంబు — సాక్షి — వర్గమున్ —చాలున్.

**వ్యాఖ్య:** అధికమైన కోపంతో (పెలుచన్) ఒకడు కొట్టడానికీ (అడుచుటకును) మాత్సర్యంతో (చలముమెయిన్) తిట్టడానికీ సాహసానికీ బలాత్కారానికి పత్రం కుదరదు. దైవం, సాక్షులు (సాక్షి వర్గమున్) చాలున్.

**35. కం. ధన మప్పుగొనుట యెఱుఁగుదు**
**ధన సంఖ్యయు నిచ్చువడ్డిఁ దలఁపంగా లే**
**దని సాక్షిచెప్పునేనియు**
**ధనవృద్ధులఁ దెలుపు నపుడు దైవమువలయున్**

**అన్వయం:** ధనము – అప్పుగొనుట – ఎఱుఁగుదు(ను). ధన సంఖ్యయున్ – ఇచ్చువడ్డిన్ – దలఁపంగా – లేదు – అని – సాక్షి – చెప్పునేనియున్ – ధనవృద్ధులన్ – తెలుపు – ఆపుడు – దైవము – వలయున్.

**వ్యాఖ్య:** ధనము అప్పుతీసుకోవడం నేను ఎరుగుదును. ధన సంఖ్యా ఇచ్చేవడ్డీ మాత్రం నాకు గుర్తులేవు అని సాక్షి చెప్తే ధనవృద్ధుల్ని తెలిపే సందర్భంలో దైవప్రమాణాలు కావాలి.

**36. కం. వాకొను తెరువుఁ జలంబునఁ**
**బోక తెరువువినక వాదుపుట్టినచోఁ దా**
**నాకును సాక్షియు నేలా**
**యేకం బనుభవమె చాలు నేర్పడఁదెలుపన్**

**అన్వయం:** వాకొను – తెరువున్ – చలంబునన్ – పోక – తెరువు – వినక – వాదుపుట్టినచోన్ – తాన్ – ఆకును – సాక్షియున్ – ఏలా – ఏకంబు – అనుభవమె – చాలున్ – ఏర్పడన్ – తెలుపన్ – చాలున్.

**వ్యాఖ్య:** చెప్పిన దారిని (వాకొను తెరువున్) మొండితనంతో (చలంబునన్) పోక తెరువు వినక వాదుపుట్టినట్లయితే తాను, పత్రం (ఆకు), సాక్షీ ఎందుకు? అనుభవమొక్కటే స్పష్టంగా తెలపడానికి చాలు.

**37. కం. మొదలిటి పత్రములెల్లను**
**ముదమున విలుచుటకు దానమున పాడికి నిం**
**పొదవఁ బ్రమాణములైనను**
**బిదపటి పత్రంబె చెల్లుఁ బెనఁకువలందున్**

**అన్వయం:** మొదలిటి – పత్రములు – ఎల్లను – ముదమునన్ – విలుచుటకున్ – దానమున – పాడికిన్ – ఇంపు + ఒదవన్ – ప్రమాణములు + ఐనను – పెనఁకువలందున్ – పిదపటి – పత్రంబు + ఎ – చెల్లున్.

**వ్యాఖ్య:** మొదటి పత్రాలన్నీ కొనుగోళ్ళ (విలుచుటకున్) దానంలోనూ వ్యాజ్యానికి (పాడికిన్) ఇంపారగా (ముదమునన్) ప్రమాణాలైతే వివాదాలలోనూ తగాదాలలోనూ (పెనఁకువలందున్) పిదపటి పత్రమే చెల్లుతుంది.

**38. కం. అప్పిచ్చి నతని యాకును**
**నప్పు మగుడఁ బెట్టి నతని యాకును గలచో**
**నప్పిచ్చి నాకుబొంకగు**
**నప్పుమగుడఁబెట్టి నతనియాకు నిజమగున్**

**అన్వయం:** అప్పిచ్చిన – అతని – ఆకునున్ – అప్పు – మగుడన్ – పెట్టిన – అతని – ఆకును –కలచోన్ – అప్పిచ్చిన – ఆకు – బొంకు – అగున్ – అప్పు – మగుడన్ – పెట్టిన – అతని – ఆకు – నిజము – అగున్.

**వ్యాఖ్య:** అప్పిచ్చిన అతని దగ్గర ఆమేరకు ఒక పత్రం (ఆకు) అప్పును తిరిగి చెల్లించేవాడి దగ్గర చెల్లించినట్టు చెప్పే మరో పత్రమూ (మగుడన్ పెట్టిన అతని ఆకును) ఉంటే, అప్పిచ్చినవాడి ఆకు అసత్యం (బొంకు అగున్). అప్పుతిరిగి చెల్లించే వాడి ఆకు నిజమవుతుంది.

**39.** **తే.గీ.** **ఆధికులమేర నిక్షేప మప్పు లిచ్చి**
**యడుగఁ దలఁపనివారల యర్థములను**
**దీర్పు కాలంబు గడచినదినము మొదలు**
**ధనముగాఁగొన్నతఁడు రెండు దండువచ్చు**

**అన్వయం:** ఆధికులమేరన్ – నిక్షేపము – అప్పులు – ఇచ్చి – అడుగన్ – తలఁపని – వారల – అర్థములను – తీర్పు – కాలంబు – గడచిన – దినము – మొదలు – ధనముగాన్ – కొన్న – అతఁడు – రెండు – దండువు – అచ్చున్.

**వ్యాఖ్య:** తాకట్టుపెట్టుకునేవారి వద్ద (ఆధికులమేరన్) సొత్తును (నిక్షేపము) అప్పుగా పెట్టి అంటే తాకట్టు పెట్టి తిరిగి తీసుకోవాలనే ఆలోచన చేయకపోతే అటువంటివారి సొత్తును (అర్థములను) గడువుకాలం ముగిసిన రోజు మొదలుకొని (దినము మొదలు) ఆ సొత్తుపై ధనం తీసుకొన్న వాడు రెండు దండువులు చెల్లించాలి.

**40.** **తే.గీ.** **మొదలఁ బాడిదీర్చి మోసపోయితి మని**
**దానిఁ ద్రిప్పి చెప్పఁ బూనిరేని**
**జయముగొన్నవాఁడు సభ్యులు వేర్వేర**
**దండు వరువవలయుఁ దప్పుకొలఁది**

**అన్వయం:** మొదలన్ – పాడి – తీర్చి – మోసపోయితిమి – అని – దానిన్ – త్రిప్పి – చెప్పన్ –పూనిరేని – జయము – కొన్నవాఁడు – సభ్యులు – వేర్వేరన్ – తప్పు – కొలఁది – దండువు –అరువవలయున్.

**వ్యాఖ్య:** మొదట తీర్పు న్యాయం చెప్పి (పాడి తీర్చి) తరువాత పొరపాటుపడ్డామని (మోసపోయితిమి) న్యాయసభసభ్యులు దానిని ఆ చెప్పిన తీర్పును మళ్ళీ తిప్పి చెప్పాలనుకున్నట్లయితే మొదటచెప్పిన తీర్పులో గెలిచినవాడు ఆ తీర్పు చెప్పిన

సభ్యులూ వేర్వేరుగా జరిగిన తప్పునుబట్టీ జరిమానా (దండువు) చెల్లించాలి (అరువవలయున్).

**41. తే.గీ. దండు వన్యాయముగఁగొన్న ధరణివిభుఁడు**
**దానిఁ గోల్పడ్డ యతనికిఁ దగిలియిచ్చి**
**దాని ముప్పదియంతలు తనధనంబు**
**వరుణుఁగూర్చి యీవలె విప్రవరులకర్థి**

**అన్వయం:** దండువు – అన్యాయముగన్ – కొన్న – ధరణివిభుఁడు – దానిన్ – కోల్పడ్డ – అతనికిన్ – తగిలి – ఇచ్చి – దాని – ముప్పదియంతలు – తన – ధనంబు – వరుణుఁగూర్చి – విప్రవరులకున్ – అర్థిన్ – ఈవలెన్.

**వ్యాఖ్య:** జరిమానా (దండువు) అన్యాయంగా తీసుకున్న రాజు (ధరణివిభుఁడు) దానిని కోల్పోయిన అతడికి ఆ సొమ్మును చెల్లించి (తగిలి ఇచ్చి), దానికంటే ముప్పయిరెట్లు తనధనాన్ని వరుణదేవుడి గురించి జపాలూ తపాలూ జరపమని విప్రవరులకు అర్థితో ఇవ్వాలి.

**42. చం. తలగొఱిగించి కుక్కడుగు తప్పక ఫాలమునందు వ్రాసి ముం**
**గల ధనమెల్లఁ బుచ్చుకొని గాడిద నెక్కఁగఁ జేసి గ్రామమున్**
**వెలువడఁ ద్రోచిపుచ్చుటయ విప్రునిజంపుట క్షుద్రజాతులం**
**జొలవకచంపు తప్పుగలచోఁ దగి చంపుట ధర్మమెమ్మెయిన్**

**అన్వయం:** తలగొఱిగించి – కుక్కడుగు – తప్పక – ఫాలమునందున్ – వ్రాసి – ముంగల – ధనము – ఎల్లన్ – పుచ్చుకొని – గాడిదన్ – ఎక్కఁగన్ – చేసి – గ్రామమున్ – వెలువడన్ –త్రోచిపుచ్చుట + అ – విప్రునిన్ చంపుట. క్షుద్రజాతులన్ – చంపు – తప్పు – కలచోన్ – చొలవక తగి – చంపుట – ఎమ్మెయిన్ – ధర్మము.

**వ్యాఖ్య:** తల గొఱిగించి కుక్కముద్రను (కుక్కడుగు) తప్పకుండా నుదుటిపై (ఫాలమునందున్) వేసి , ముందు (ముంగల) ధనమంతా తీసుకొని తరువాత గాడిదపై ఎక్కించి ఊరేగించి, గ్రామాన్ని విడిచివెళ్ళేలా పంపించివేసి అంటే గ్రామబహిష్కరణశిక్ష విధించడమే తప్పుచేసిన ఆ విప్రుణ్ణి చంపడం. ఇదే మరణశిక్షతో సమానం. తక్కిన చిన్నజాతులలో (క్షుద్రజాతులన్) మరణశిక్షవిధించేంతటి తప్పే గనక ఉన్నట్లయితే (చంపు తప్పు కలచోన్) వెనుకాడకుండా (చొలవక) తగినట్లుగా చంపడం ఏవిధంగా చూసినా ధర్మమే.

**43. కం. ధనమింత గొనియె ననవుడుఁ**
**గొనలేదని త్రోఁచెనేని గొనుట నిజముగా**
**ధనకుఁడు దెలిపిన ఋణి యా**
**ధనమును రాజునకు నంతదండువునచ్చున్**

**అన్వయం:** ధనము – ఇంత – కొనియెన్ – అనవుడున్ – కొనలేదని – త్రోఁచెనేని – కొనుట – నిజము – కాన్ – ధనకుఁడు – దెలిపిన – ఋణి – ఆ – ధనమును – రాజునకున్ – అంత – దండువున్ – అచ్చున్.

**వ్యాఖ్య:** ఇంత ధనం తీసుకున్నాడని అప్పుఇచ్చినవ్యక్తి చెప్పినతర్వాత (అనవుడున్) అలా తీసుకోలేదని తీసుకున్నవాడు తోసిపుచ్చినట్లయితే, తీసుకోవడం నిజమే అయితే (నిజము కాన్) అప్పు ఇచ్చినవాడు (ధనకుఁడు) తెలిపిన అప్పుపుచ్చుకున్నవాడు (ఋణి) ఆ ధనాన్ని ధనకుడికి చెల్లించాలి. అలాగే అంతే మొత్తం రాజుకు దండువుగా చెల్లించాలి.

**44. కం. ఇంతగొనియె నీతండని**
**పంతముగాఁ దెలిపి వానిపై వెఱువక తా**
**గ్రంతలుదూఱెడి పెనపరి**
**యంతకు నినుమడిధనంబు నరువఁగవలయున్**

**అన్వయం:** ఈతండు – ఇంత – కొనియెన్ – అని – పంతముగాన్ – తెలిపి – వానిపైన్ – వెఱువక – తాన్ – క్రంతలు – తూఱెడి – పెనపరి – అంతకున్ – ఇనుమడి – ధనంబున్ – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** ఇతడు ఇంత తీసుకున్నాడని పంతంతో చెప్పి వాడిమీద వెఱువక తాను రచ్చ రచ్చ చేసే (క్రంతలు తూఱెడి) తగాదాకోరు (పెనపరి) అంతకు రెండురెట్లు (ఇనుమడి ధనంబున్) చెల్లించాలి (అరువఁగవలయున్).

**45. సీ. నెలకొని యొకచోట నిలువక పెదవులు**
**నాలుక యందంద నాకుచుండు**
**నుదురు చెమర్పంగ వదనంబు వెల్లనై**
**పలుకులు తడఁబడ బలుకుచుండు**
**వాతెఱ తడిలేక వఱువట్లు నట్టంగఁ**
**బెదవులు దడుపుచు బెదరిచూచుఁ**
**బలుకులుఁ జెయ్వులుఁ దలఁపులుఁ దగ**
**నిజప్రకృతిఁ బొందక కడువికృతిఁబొందు**

**గీ. సాక్షిచెప్పుచోట సభ బాడి యాడుచో**
**నెవ్వఁ డతఁడు దుష్టుఁ డిరవుగాఁగ**
**నిట్టి లక్షణముల నెఱిఁగి సభ్యులుపాడి**
**నిర్ణయించిచెప్ప నేరవలయు**

**అన్వయం:** నెలకొని – ఒకచోటన్ – నిలువక – పెదవులు – నాలుక – అందందన్ – నాకుచుండున్, నుదురు – చెమర్పంగన్ – వదనంబు – వెల్లనై – పలుకులు – తడఁబడన్ –పలుకుచుండున్, వాతెఱ – తడిలేక – వఱువట్లు – నట్టంగన్ – పెదవులు – తడుపుచున్ –బెదరిచూచున్, పలుకులున్ – చెయ్వులున్ – దలఁపులున్ – తగన్ – నిజప్రకృతిన్ – పొందక – కడువికృతిన్ – పొందున్. సాక్షిచెప్పుచోటన్ – సభన్ – పాడి – ఆడుచోన్ – ఎవ్వఁడు – అతఁడు – దుష్టుఁడు – ఇరవుకాఁగన్ – ఇట్టి – లక్షణములన్ – ఎఱిఁగి – సభ్యులు – పాడి – నిర్ణయించి – చెప్పనేరవలయున్.

**వ్యాఖ్య:** నెలకొని ఒకచోట నిలువకుండా పెదవులు నాలుకతో యందంద నాకుతూ ఉంటారు. నుదుటిపై చెమటలు పడుతుంటే (చెమర్పంగన్) ముఖం తెల్లగా (వదనం వెల్లనై) పాలిపోయి - తెల్లముఖంవేసి మాటలు తడబడేలా మాట్లాడుతుంటారు. పెదవి (వాతెఱ) తడిలేక బొత్తిగా ఎండిపోయి అడ్డుపడుతుంటే (వఱువట్లు నట్టంగన్) పెదవులు తడుపుతూ బెదురుగా చూస్తూ ఉంటారు. మాటలూ చేష్టలూ (చెయ్వులు) ఆలోచనలూ (తలపులు) తగినవిధంగా సహజంగా కాక (నిజప్రకృతిన్ పొందక) కడు వికృతంగా కృతకంగా ఉంటాయి. ఎవడు ఇలా ఈ లక్షణాలతో ఉంటాడో వాడు దుష్టుడు. కూటసాక్షి. సాక్ష్యం చెప్పే చోట, సభలో న్యాయం తీర్చేచోట (పాడి ఆడుచోన్) దుష్టుడికి నెలవైన (ఇరవు కాగన్) ఈ లక్షణాలను తెలుసుకొని న్యాయసభలోని సభ్యులు న్యాయం (పాడిన్ నిర్ణయించి) చెప్పడం నేర్చుకోవాలి (నేరవలయున్).

**దీనికి మూలం:**

**దేశ ద్దేశాంతరం యాతి సృక్విణీ పరిలేఢిచ**
**లలాటం స్విద్యతే చాస్య ముఖం వైవర్ణమేతి చ**
**పరిశుష్య త్స్కల ద్వాక్యో విరుద్ధం బహుభాషతే**
**వాక్చక్షుః పూజయతి నోతథోష్ఠౌ నిర్భుజ త్యపి**
**స్వభావా ద్వికృతం యాతి మనోవాక్కాయ కర్మభిః**
**అభియోగే అథస్సాక్ష్యే వా స దుష్టః పరికీర్తితః (యా.వ్య. 13 – 15)**

**46. కం. ఇరువది యేఁడులు దనపొల**
**మొరుఁడు గుడుచు చునికి నెఱిఁగియున్నేనియుఁ దా**
**దొరలక యున్నేనియుఁ ద**
**త్పరిభోగము కుడిచినతనిపాలైపోవున్**

**అన్వయం:** ఇరువది – ఏఁడులు – తన పొలమున్ – ఒరుఁడు – కుడుచుచున్ + ఉనికిన్ – ఎఱిఁగి + ఉన్నేనియున్ – తాన్ – దొరలక + ఉన్నేనియున్ – తత్ – పరిభోగము – కుడిచిన + అతని – పాలు – ఐపోవున్.

**వ్యాఖ్య:** సొంత పొలం పరులపాలయ్యే దెప్పుడో ఎలాగో చెప్తున్నాడు కేతన. ఇరవై సంవత్సరాలు తన పొలాన్ని ఇతరుడు (ఒరుఁడు) అనుభవిస్తూ ఉంటే (కుడుచుచునికిన్) అది తెలిసినా, కదలక మెదలక ఊరుకున్నా (దొరలకయున్నేనియున్) తనదే తాను అనుభవించవలసినదే అయిన ఆ పొలం (పరిభోగము) – అంతకు ముందు ఇరవై ఏళ్ళ నుంచీ అనుభవిస్తున్నవాడి పరం (కుడిచినతనిపాలు) అయిపోతుందిట.

**47. కం. పదియేఁడులు తన ధన మొరుఁ**
**డెదురం గుడువంగఁ జూచి యెన్నం డైనన్**
**ఇది నా ధనమనఁడేనియుఁ**
**బదఁపడి తాఁ దొడరునేని ఫలహాని యగున్**

**అన్వయం:** ఒరుఁడు – తన – ధనమున్ – పదియేఁడులు – ఎదురన్ – కుడువంగన్ – చూచి – ఎన్నండు + ఐనన్ – ఇది – నా – ధనము. అనఁడేనియున్ – పదఁపడి – తాన్ – తొడరునేనిన్ – ఫలహాని – అగున్.

**వ్యాఖ్య:** ఇతరులకు ఇచ్చిన ధనం ఎప్పుడు తనది కాకుండా పోతుందో చెప్తున్నాడు. ఇతరుడు తన ధనాన్ని తీసుకొని పది సంవత్సరాలుగా కళ్ళముందే (ఎదురన్) అనుభవిస్తూ ఉంటే – అది చూస్తూ కూడా ఏ ఒక్కరోజైనా ఇది నా సొమ్ము అని అనకుండా మిన్నకుండిపోయి – ఆ తర్వాత తాను వాడితో గొడవకు దిగితే ఇది నాది అని పోరాడితే (తొడరునేనిన్) దానివల్ల ఫలహానే తప్ప ప్రయోజనం ఉండదు.

**48. కం. కుడిచినకంటెను క్షేత్రము**
**పడసిన తెరు వధికమండ్రు పాడికిఁ జనుచోఁ**
**గుడుపొకనాఁడును లేదేఁ**
**బడయుటను నిష్ఫలంబు పరికింపఁగన్**

**అన్వయం:** కుడిచిన – కంటెను – క్షేత్రము – పడసినన్ – తెరువు – అధికము – అండ్రు. పాడికిన్ – చనుచోన్ – కుడుపు – ఒకనాఁడును – లేదేన్ – పడయుటను – నిష్ఫలంబు పరికింపఁగన్.

**వ్యాఖ్య:** అనుభవించినదానికంటే (కుడిచినకంటెను) భూమిని (క్షేత్రము) పొందిన మార్గమే పద్ధతే (తెరువు) అధికం అంటారు. తీర్పుకి వెళ్ళినట్లయితే (పాడికిన్ చనుచోన్) పరికిస్తే అనుభవం ఒకనాడూ లేకపోతే పొందడమూ నిష్ఫలం.

**49. కం. ఎడవడకుండం గుడిచిన**
**కుడుపు ప్రమాణంబు గాదు కొన్న తెఅంగున్**
**బడసిన తెఱుఁగును దెలుపని**
**యడికుడుపునఁ బాడి గెలువ దభినవదండీ**

**అన్వయం:** ఎడవడకుండన్ – కుడిచిన – కుడుపు – ప్రమాణంబు – కాదు. కొన్న – తెఅంగున్ – పడసిన – తెఱుఁగును – తెలుపని – అడికుడుపునన్ – పాడి – గెలువదు – అభినవదండీ.

**వ్యాఖ్య:** అభినవదండీ! ఎడవడకుండా వేరుచేయకుండా అనుభవించిన అనుభవం (కుడిచిన కుడుపు) ప్రమాణం కాదు. కొన్న పద్ధతినిగానీ (తెఅంగున్) పొందిన (పడసిన) పద్ధతినిగానీ (తెఱుఁగును) తెలపకుండా ఆస్తిమీద పత్రప్రమాణాదులు లేకుండా వట్టి అనుభవము వట్టిభుక్తంమాత్రమే ఉంటే దానివల్ల (అడికుడుపునన్) వ్యాజ్యం (పాడి) గెలవదు.

**50. కం. తాతల తండ్రుల తరమున**
**నేతెంచిన వృత్తిదక్క నితరక్షేత్రం**
**బేతెంచిన గతి దెలుపక**
**ప్రీతిఁ గుడిచి నతఁడు ముచ్చు పెక్కేండ్లయినన్**

**అన్వయం:** తాతల – తండ్రుల – తరమునన్ – ఏతెంచిన – వృత్తిదక్కన్ – ఇతరక్షేత్రంబు – ఏతెంచిన – గతిన్ – తెలుపక – ప్రీతిన్ – కుడిచిన – అతఁడు – పెక్కేండ్లు + అయినన్ – ముచ్చు.

**వ్యాఖ్య:** తాతల తండ్రుల తరంనుంచీ వచ్చిన సంక్రమించిన వృత్తికాకుండా ఇతరక్షేత్రం సంక్రమించిన విధానాన్ని (ఏతెంచినగతిన్) చెప్పకుండా (తెలుపక) ప్రీతితో అనుభవించినట్లయితే (కుడిచినన్) అతడు ఎన్నిసంవత్సరాలయినా (పెక్కేండ్లయినన్) దొంగే (ముచ్చు).

**51. ఆ.వె. బంధుజనులు నొక్కపనివెంటవర్తించు**
**వారు నొక్కయూరివారు రాజ**
**పురుషులైనవారు వరుసఁ బాడికిఁ గర్త**
**లంతకంత కధికు లాదిదొడఁగి**

**అన్వయం:** ఆదిదొడఁగి – బంధుజనులున్ – ఒక్క – పనివెంటన్ – వర్తించు – వారున్ – ఒక్క – ఊరివారున్ – రాజపురుషులైనవారు – వరుసన్ – పాడికిన్ – కర్తలు – అంతకంతకున్ – అధికులు.

**వ్యాఖ్య:** మొదట్నుంచీ (ఆదిదొడఁగి) బంధుజనులు, ఒకపనిమీద వర్తించేవారు, ఒక ఊరివారు, రాజపురుషులు వరుసగా న్యాయానికి (పాడికిన్) కర్తలు. వీరిలో ఉత్తరోత్తరం – అంతకంతకూ అధికులు.

**52. ఆ.వె. బలిమి భయముఁజూపి పగవాఁడు చుట్టంబు**
**వృద్ధుబాలకునిని బుద్ధిహీను**
**నడవిరాత్రిఁ గొట్టి యన్యాయమునఁ దీర్చు**
**పాడి ధర్మమైన పాడిగాదు**

**అన్వయం:** బలిమిన్ – భయము – చూపి – పగవాఁడు – చుట్టము – వృద్ధున్ – బాలకునిని – బుద్ధిహీనున్ – అడవిరాత్రిన్ – కొట్టి – అన్యాయమునన్ – తీర్చు – పాడి – ధర్మమైనన్ – పాడి గాదు.

**వ్యాఖ్య:** బలంతో భయపెట్టి పగవాణ్ణీ చుట్టాన్నీ వృద్ధుణ్ణీ బాలకుణ్ణీ బుద్ధిహీనుణ్ణీ అడవిరాత్రిలో కొట్టి అన్యాయంగా తీర్చే పాడి ధర్మమైనా అది న్యాయం (పాడి) కాదు.

**53. ఆ.వె. తండ్రితోడఁ గొడుకు ధరణీశుతో బంటు**
**పురుషుతోడ భార్య గురునితోడ**
**శిష్యుఁ డోటలేక చెనసి పైఁబడి సభఁ**
**బాడియాడఁజనుట పాడిగాదు**

**అన్వయం:** తండ్రితోడన్ – కొడుకు, ధరణీ + ఈశుతోన్ – బంటు, పురుషుతోడన్ – భార్య, గురునితోడన్ – శిష్యుఁడు, ఓట – లేక – చెనసి – పైఁబడి – సభన్ – పాడి + ఆడన్ – చనుట – పాడి – కాదు.

**వ్యాఖ్య:** ఇంట్లోవాళ్లు ఎవరు ఎవరితో గొడవపడకూడదో గొడవపడి పంచాయితీలకు ఎక్కకూడదో చెప్తున్నాడు. తండ్రిపట్ల కొడుక్కీ, రాజుపట్ల (ధరణీశుతోన్) సేవకుడికీ, భర్త పట్ల భార్యకూ, గురువు పట్ల శిష్యుడికీ వినయవిధేయత లుండాలి. అవి లేక –

కొడుకు తండ్రితో, సేవకుడు రాజుతో, భార్య పురుషుడితో, శిష్యుడు గురువుతో జంకూ గొంకూ లేకుండా (ఓటలేక) దెబ్బలాడి – గొడవపడి (చెనసి) అంతటితో ఆగక పైగా (పైబడి) పంచాయితీ పెట్టి అందులో (సభన్) న్యాయం కోసం (పాడియాడన్) వెళ్ళటం అస్సలు న్యాయం కాదు. దీనికి మితాక్షరిలో ఉదాహరించిన మనుస్మృతిలోని ఈ శ్లోకం మూలం.

**గురోః శిష్యే పితుః పుత్రే దంపత్యోః స్వామి భృత్యయోః**
**విరోధే తు మిథస్తేషాం వ్యవహారో న సిద్ధ్యతి**

**(వి.వ్య. 31, సం. 35)**

**54.** సీ. **తల దండమున వ్రేయఁ దగదని యెఱిఁగియు**
**నన్యాయమున గురుఁ డడిచెనేనిఁ**
**దన తాతవృత్తులు తన తండ్రి యన్యాయ**
**మున నాక్రమింపఁగఁ బూనెనేని**
**నాలి యాభరణంబు లన్యాయమునఁ గొని**
**తులువయై మగఁడీక త్రోచెనేనిఁ**
**దన్నుఁ గొల్చిన దాసు దైన్యం బెఱుంగక**
**యొడయండు కారించు చుండెనేనిఁ**

ఆ.వె. **బాడి కరిగి గురునితోడ శిష్యుఁడు తండ్రి**
**తోడఁ గొడుకు మగనితోడ నాలు**
**స్వామితోడ బంటు సభఁ జెప్పఁ జనునైన**
**నందు నిహపరముల నిందవచ్చు**

**అన్వయం:** తలన్ – దండమునన్ – వ్రేయన్ – తగదని – ఎఱిఁగియున్ – గురుఁడు – అన్యాయమునన్ – అడిచెనేనిన్, తన – తాత – వృత్తులు – తన – తండ్రి – అన్యాయమునన్ – ఆక్రమింపఁగన్ – పూనెనేనిన్, ఆలి + ఆభరణంబులు – అన్యాయమునన్ – కొని – తులువయై – మగఁడు + ఈక – త్రోచెనేనిన్, తన్నున్ – కొల్చిన – దాసు – దైన్యంబు – ఎఱుంగక – ఒడయండు – కారించుచున్ + ఉండెనేనిన్, గురునితోడన్ – శిష్యుఁడు, తండ్రితోడన్ – కొడుకు – మగనితోడన్ – ఆలు, స్వామితోడన్ – బంటు – పాడికిన్ – అరిగి – సభన్ – చెప్పన్ + చనున్ + ఐనన్ – అందున్ – ఇహపరములన్ – నిందవచ్చున్.

**వ్యాఖ్య:** ఇహంలోనూ పరంలోనూ నింద కలిగించే పనులివే – తలమీద దండంతో వేయడం తప్పని తెలిసీ గురువు శిష్యుణ్ణి అన్యాయంగా బాధిస్తే (అడిచెనేని), తనకు

వంశపారంపర్యంగా తాతనుండి సంక్రమించవలసిన మాన్యాలు (వృత్తులు) తనకు ఇవ్వకుండా కన్న తండ్రే వాటిని అన్యాయంగా ఆక్రమించడానికి సిద్ధపడితే, భార్య నగల్ని భర్త అన్యాయంగా తీసుకొని దుర్మార్గుడై (తులువయై) ఇవ్వక వెళ్ళగొట్టినట్లయితే (ఈక త్రోచెనేని), తనను సేవించే బంటు (దాసు) దీనత్వాన్ని తెలుసుకోకుండా యజమానుడు (ఒడయండు) వాణ్ణి వేధించుకు తింటుంటే (కారించుచుండెనేని) ఈ బాధితులు శిష్యుడూ, పుత్రుడూ, భార్య, సేవకుడు – బాధకులపై – గురువు, తండ్రి, భర్త, యజమానులపై న్యాయంకోరుతూ (పాడికరిగి) సభలో చెప్పడానికి – పంచాయితీ పెట్టవచ్చు. కానీ, పెట్టారంటే దానివల్ల ఈ లోకంలోనూ పైలోకంలోనూ వీళ్ళకే నింద కలుగుతుంది.

**55. కం. చేరినధనంబు భూపతి**
**యూరెఱుఁగక డాఁచియుంచి యొడయఁడు రాఁగా**
**నారసి యీఁదగు నొకయేఁ**
**డారంగ గడచెనేని యదిగొనుట దగున్**

**అన్వయం:** చేరి – నధనంబున్ – భూపతి – ఊరు – ఎఱుఁగక – డాఁచి – ఉంచి – ఒడయఁడు – రాఁగాన్ – ఆరసి – ఈన్ – తగున్ – ఒక – ఏఁడు – ఆరంగన్ – గడచెనేని – అది – కొనుట తగున్.

**వ్యాఖ్య:** తన దగ్గరకు చేరిన ధనాన్ని రాజు (భూపతి) ఎవరికీ తెలియకుండా (ఊరు ఎఱుఁగక) దాచి ఉంచి దాని యజమాని (ఒడయఁడు) రాగానే చూసి ఆ ధనాన్ని అతడికి ఇవ్వాలి. ఒక సంవత్సరం గడిచినా యజమాని రాకపోతే అది తానే తీసుకోవడం తగినది.

**56. కం. చెడినధనము చేరినఁ బతి**
**యొడయఁడు రా దడవ యిచ్చు టుచితము వాఁడా**
**యొడమికలరూపు దెలుపక**
**యడిగినఁ బతికంత దండు వరువఁగవలయున్**

**అన్వయం:** చెడిన – ధనము – చేరినన్ – పతి – ఒడయఁడు – రాన్ – తడవన్ – ఇచ్చుట – ఉచితము. వాఁడు – ఆ – ఒడమి – కల – రూపున్ – తెలుపక – అడిగినన్ – పతికిన్ – అంత – దండువు – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** పోయిన ధనం (చెడిన ధనము) రాజువద్దకు చేరితే రాజు ఆ ధనం తాలూకూ యజమాని (ఒడయఁడు) తన దగ్గరకు వస్తే ఒకసారి (తడవన్) ఇవ్వడం ఉచితం. ఆ యజమాని ఆ ధనం (ఒడమి) వివరాలను (కలరూపున్) చెప్పకుండా

అడిగినట్లయితే ఆ యజమాని (పతికిన్) అంత జరిమానా (దండువు) చెల్లించాలి (అరువఁగవలయున్).

**57. కం. జగతీశుఁడు పడిన ధనం**
**బగపడినను బ్రాహ్మణునకు నర్థము వెట్టం**
**దగు నట విప్రోత్తముచే**
**నగపడిన నతండ కుడువ నర్హుం డెందున్**

**అన్వయం:** జగతీశుఁడు – పడిన – ధనంబు – అగపడినను – బ్రాహ్మణునకున్ – అర్థము – పెట్టన్ – తగున్. అటన్ – విప్రోత్తముచేన్ – అగపడినన్ – అతండు + అ – కుడువన్ – ఎందున్ – అర్హుండు.

**వ్యాఖ్య:** రాజు (జగతీశుఁడు) పడిపోయిన ధనము కనిపించినట్లయితే (అగపడినను) దానిని బ్రాహ్మణుడికి ప్రయోజనం చేకూరేలా దానంగా ఇవ్వడం (అర్థము పెట్టన్) తగినది. అలా పడిపోయిన ధనం విప్రోత్తముడికే కన్పిస్తే (అగపడినన్) దానిని ఎక్కడైనా అతడే అనుభవించడానికి అర్హుడు.

**58. కం. పడినధనము కనిన యతం**
**డడవకయున్నేని దక్కు నాఱవపాల్దా**
**నడఁచిననంతయుఁ జేకొని**
**పుడమివిభుఁడు తగినదండమును జేయఁదగున్**

**అన్వయం:** పడిన – ధనము – కనిన – అతండు – అడవక – ఉన్నేనిన్ – దక్కున్ – ఆఱవపాలు – తాన్ – అడఁచినన్ – అంతయున్ – చేకొని – పుడమివిభుఁడు – తగిన – దండమును – చేయన్ – తగున్.

**వ్యాఖ్య:** పడిన ధనము చూసిన వాడు దానిని తీసుకొని దాచిపెట్టకుండా రాజుకు సమర్పిస్తే ఆ ధనంలో ఆరోవంతు అతనికి దక్కుతుంది. తాను దాచిపెట్టినట్లయితే (అడఁచినన్) అంతా తీసుకొని రాజు (పుడమివిభుఁడు) అతడికి తగిన దండన విధించవచ్చు.

**59. కం. ముచ్చిలిన ధనము చేరిన**
**నచ్చుగఁ గోల్పడ్డవాని కది యీఁదగుఁ దాఁ**
**బుచ్చుకొనఁ దలంచిన మఱి**
**వచ్చు నతనిపాపమెల్ల వసుధేశునకున్**

**వ్యాఖ్య:** ముచ్చిలిన – ధనము – చేరినన్ – అచ్చుగన్ – కోల్పడ్డ – వానికిన్ – అది

— ఈన్ —తగున్. తాన్ — పుచ్చుకొనన్ — తలంచినన్ — మఱి — అతని — పాపము — ఎల్లన్ — వసుధ + ఈశునకున్ — వచ్చున్ .

**వ్యాఖ్య:** దొంగిలింపబడిన (ముచ్చిలిన) ధనం తనవద్దకు చేరితే యథాతథంగా (అచ్చుగన్) కోల్పోయినవాడికి దానిని రాజు ఇచ్చివేయాలి. అలాకాకుండా తానే తీసుకోవాలని తలిస్తే ఇక అ ధనం తాలూకూ యజమాని పాపం మొత్తం రాజుకే (వసుధేశునకున్) వస్తుంది.

**60. కం. పెక్కుదెఱుంగులఁ బాడికి**
**బెక్కండ్రురతోడ నొకఁడు పెనఁగఁగఁ గార్యం**
**బొక్కంటియగునేనియుఁ దాఁ**
**బెక్కండ్రురతోడనైనఁ బెనఁగఁగఁజెల్లున్**

**అన్వయం:** పెక్కుదెఱుంగులన్ — పాడికిన్ — పెక్కండ్రురతోడన్ — ఒకఁడు — పెనఁగఁగన్ — కార్యంబు — ఒక్కటి — అగునేనియున్ — తాన్ — పెక్కండ్రుర తోడను + ఐనన్ — పెనఁగఁగన్ — చెల్లున్.

**వ్యాఖ్య:** అనేక విధాలుగా (పెక్కుదెఱుంగులన్) న్యాయంకోసం అనేకులతో ఒకడు తగువులాడితే (పెనఁగఁగన్) ఒక కార్యం సిద్ధించేటట్లయితే తాను ఒక్కడే అనేకులతోనైనా తగువులాడవచ్చు (పెనఁగఁగన్ చెల్లున్).

**61. కం. మగవారితోడిపాడికిఁ**
**దగదరుగఁగ నిల్లునడప దక్షలయిన య**
**మ్మగువలఁకైనను నేరమి**
**మగఁడింతిని బనిచెనేని మఱిపోవఁదగున్**

**అన్వయం:** అరుగఁగన్ — ఇల్లు — నడపన్ — దక్షలయిన — ఆమగువలఁకున్ + ఐనను నేరమిన్ —మగవారితోడి — పాడికిన్ — తగదు. మగఁడు — ఇంతిని — పనిచెనేనిన్ — మఱి — పోవన్ — తగున్.

**వ్యాఖ్య:** ఇల్లునడిపే దక్షత కలిగినప్పటికీ స్త్రీ మగవారితో న్యాయంకోసం (పాడికిన్) వెళ్ళడం తగదు. ఎందుకంటే గొడవలు పడడంలో అనుభవం ఆమెకు ఉండదు కాబట్టి (నేరమిన్). ఒకవేళ మగడే ఇంతిని పంపితే వెళ్ళవచ్చు.

**62. కం. అనుచరుఁడు పరాధీనుం**
**డనుచరుతోఁ బాడి పొసఁగదైనను వాఁడే**
**లినపతి యనుమతితోడన్**

**ధనకార్యంబునకుఁ బాడి తగునాడికొనన్**

**అన్వయం:** అనుచరుఁడు – పరాధీనుండు. అనుచరుతోన్ – పాడి – పొసఁగదు. ఐనను – వాఁడు – ఏలినపతి – అనుమతి – తోడన్ – ధన – కార్యంబునకున్ – పాడి – ఆడికొనన్ – తగున్.

**వ్యాఖ్య:** అనుచరుడు పరాధీనుడు. ఆ అనుచరుడితో పాడి పొసగదు. ఐనా వాడు రాజు లేదా తన యజమాని అనుమతితో (ఏలినపతి అనుమతితోడన్) డబ్బువ్యవహారంకోసం (ధనకార్యంబునకున్) న్యాయం అడగడం (పాడి ఆడికొనన్) తగినది.

**63.** కం. **ధనముగని యిచ్చి నతనికి**
**జనపతి షష్ఠాంశ మిచ్చిన నాలవపా**
**ల్ధనముగొని యొడయనికిఁ ద**
**క్కిన ధనమిచ్చుటను ధర్మకీర్తులుగలుగున్**

**అన్వయం:** ధనమున్ – కని – ఇచ్చిన – అతనికిన్ – జనపతి – షష్ఠ + అంశము – ఇచ్చినన్ – నాలవపాల్ – ధనము – కొని – ఒడయనికిన్ – తక్కిన – ధనము – ఇచ్చుటను – ధర్మకీర్తులు –గలుగున్.

**వ్యాఖ్య:** ధనం కనిపెట్టి తెచ్చి ఇచ్చిన వాడికి రాజు (జనపతి) అందులో ఆరో వంతు (షష్ఠాంశము) చ్చినట్లయితే నాలుగోభాగం ధనం తాను తీసుకొని తక్కిన ధనం తన యజమానికి (ఒడయనికిన్) ఇవ్వాలి. అలా ఇవ్వడంవల్ల ధర్మకీర్తులు కలుగుతాయి. ధర్మానికి ధర్మం, కీర్తికి కీర్తీ. దీనికి విజ్ఞానేశ్వరుడు ఉదాహరించిన గౌతమీస్మృతి వచనమే మూలం.

**విశేషాలు**: దీనికి మూలం:

**ప్రణష్ట స్వామిక మధిగమ్య రాజ్ఞే ప్రబ్రూయు ర్విఖ్యాప్య సంవత్సరం రాజ్ఞారక్ష మూర్ధ్వ మధిగంతు శ్చతురాంశో రాజ్ఞశ్శేష ఇతి. అత్ర సంవత్సర మిత్యేక వచన మవివక్షితం రాజాత్రబ్దం నిధాపయే దితి స్మరణాత్. హరేతపరతో నృప ఇత్యేత దపి స్వామిన్య నాగదేత్ర్యబ్దా దూర్ధ్వం వ్యయీ కరణాభ్య మజ్ఞాపరం ఆగతేతు స్వామిని వ్యయీ భూతేతు ద్రవ్యే రాజా స్వాంశ మవతార్య త్సమందద్యాత్ (వి.వ్య. 32)**

సొమ్ము కలవాడు అనేక సంవత్సరాలు రాకపోతే ఆ సొమ్ము పట్టి తెచ్చిన వాడికి నాలుగో వంతు ఇప్పించి తక్కినదాన్ని రాజు తీసుకోవచ్చు. మూడేళ్ళకు పైగా సొమ్ము కలవాడు రాకపోతే రాజు ఆ ద్రవ్యాన్ని ఖర్చుచేయవచ్చు. ఖర్చుచేసిన

తరువాత వస్తే రాజు తన భాగం కాకుండా తక్కిన ద్రవ్యాన్ని తన ఖజానానుండి ఇప్పించాలి. మూలంలో చెప్పిన కాలపరిమితిగానీ రాజు తన ఖజానానుంచి ఇవ్వాలనిగానీ కేతన అనువాదంలో లేదు.

**64. కం. రోయిగొని వడ్డికిచ్చినఁ**
**బాయక నెలనెల నశీతి భాగము గొనినన్**
**న్యాయమగు మిగులఁ గొనుట**
**న్యాయం బొడఁబడని చోట నభినపదండీ**

**అన్వయం:** అభినవదండీ! రోయి – కొని – వడ్డికిన్ – ఇచ్చినన్ – పాయకన్ – నెలనెలన్ – అశీతి – భాగము – కొనినన్ – న్యాయము + అగున్. న్యాయంబు – ఒడఁబడని – చోటన్ – మిగులన్ – కొనుట – అన్యాయంబు.

**వ్యాఖ్య:** అభినవదండీ! కుదువబెట్టిన సొమ్ము (రోయి) తీసుకొని వడ్డీకి ఇస్తే తప్పనిసరిగా (పాయకన్) నెలనెలా ఎనభయ్యోవంతు (అశీతి భాగము) తీసుకొంటే న్యాయం. అంగీకరించకుండా (ఒడఁబడని చోటన్) అంతకంటే ఎక్కువ తీసుకోవడం (మిగులఁ గొనుట) అన్యాయం.

**65. కం. ఓలినివడ్డిని గొలములు**
**నాలుగిటను రెండు మూడు నాలుగు నైదున్**
**మేలుగ నూటికిఁగొన జనుఁ**
**బోలఁగ రోయిడక యప్పుపుచ్చు నతనిచేన్**

**అన్వయం:** రోయి – ఇడక – అప్పు – పుచ్చున్ – అతనిచేన్ – ఓలినిన్ – కొలములు – నాలుగిటను – నూటికిన్ – రెండు – మూడు – నాలుగున్ – ఐదు – వడ్డిని – మేలుగన్ – పోలఁగన్ – కొనన్ – చనున్.

**వ్యాఖ్య:** ఏదీ కుదువబెట్టకుండా (రోయి – ఇడక) అప్పుచేసే వాడినుండి క్రమంగా (ఓలినిన్) నాలుగు వర్ణాలవారినుంచీ (కొలములు నాలుగిటను) నూటికి రెండు, మూడు, నాలుగు, ఐదు చొప్పున వడ్డీ తీసుకోవాలి. బ్రాహ్మణులు నూటికి రెండు, క్షత్రియులు నూటికి మూడు, వైశ్యులు నూటికి నాలుగు, శూద్రులు నూటికి ఐదు చొప్పున వడ్డీ చెల్లించాలి అని.

**66. ఆ.వె. నిచ్చ నిచ్చ వడ్డి నెలనెల వ డ్డొడఁ**
**బాటువడ్డి వడ్డి పైన వడ్డి**
**యనఁగ నాల్గుదెఱఁగులయ్యె నా వడ్డి దాఁ**

**దగవుతోడ నెక్కుఁ దరతరంబ**

**అన్వయం:** నిచ్చ నిచ్చ – వడ్డి, నెల నెల – వడ్డి, ఒడఁబాటు – వడ్డి, వడ్డిపైనన్ – వడ్డి – అనఁగన్ – ఆ – వడ్డి – తాన్ – నాల్గు – తెఱఁగులు + అయ్యేన్ – తరతరంబ – తగవుతోడన్ – ఎక్కున్.

**వ్యాఖ్య:** వడ్డీ నాలుగు రకాలుగా ఉంటుందట.

1) రోజువారీ వడ్డి (నిచ్చనిచ్చవడ్డి – Daily Interest). దీనికే కాయికా వడ్డీ అని పేరు.
2) నెలనెలా వడ్డీ. కాలికా అని దీనికి వ్యవహారం (Monthly Interest).
3) ఒడబాటు వడ్డి. దీనికే కారితా అని సంస్కృతం, Agreed Interest అని ఆంగ్లం.
4) వడ్డి పైన వడ్డి. ఇది చక్రవడ్డీ. చక్రవృద్ధి (Compound Interest).

ఇలా నాలుగు విధాలుగా (తెఱఁగులు) ఉన్న ఈ వడ్డీ న్యాయంగానే (తగవుతోడన్) తరతరాలుగా వృద్ధి చెందుతూ ఉంటుంది.

**మూలం**:

**కాయికా కాలికా చైవ కారితా చ తథాపరా**
**చక్రవృద్ధిశ్చ శాస్త్రేషు తస్య వృద్ధి శ్చతుర్విధా**
**కాయావిరోధినీ శశ్వత్పణపాదాది కాయికా**
**ప్రతిమాసం స్రవంతీ యా వృద్ధి స్సా కాలికా మతా**
**వృద్ధి స్సా కారితా నామ యర్ణ కేన స్వయం కృతా**
**వృద్ధి రపి పునర్వృద్ధి శ్చక్రవృద్ధి రుదాహృతా (వి.వ్యా. 36, స. 39)**

**విశేషాలు**: కేతన పారిభాషిక పదాలను తెలుగులో అనువదించాడు.

1) కాయికా = నిచ్చనిచ్చ.
2) కాలికా = నెలనెల.
3) కారితా = ఒడబాటు – ఋణం చేసినవాడు (ఋణకుడు) ఇచ్చినవాడితో స్వయంగా కుదుర్చుకొన్నది (యా + ఋణకేన).
4) చక్రవడ్డి = వడ్డిపైనవడ్డి.

**67.** కం. **పదిపదునొకంట వడ్డి**
**న్వదలక యా నడిమివడ్డి వలయు నిజముగన్**

**గుదిగొన బేహారులకును**
**బది పంద్రెం డుచిత మధికపథగాములకున్**

**అన్వయం:** పది – పదునొకంట – వడ్డిన్, వదలక – ఆ – నడిమి – వడ్డి – నిజముగన్ – వలయున్, గుదిగొనన్ – అధిక – పథగాములకున్ – బేహారులకును – పది – పంద్రెండు – ఉచితము.

**వ్యాఖ్య:** నిజంగా చెప్పాలంటే మామూలు వడ్డీ తప్పకుండా పది పదకొండుకు తక్కువే ఉండాలి. ఇది ధర్మవడ్డీ అన్నమాట. అధిక పథగాములకున్ – అంటే, ఎప్పుడూ సంపన్నులు శ్రేణిలో పైపైకి పోవాలనుకునే వ్యాపారస్థులకు (బేహారులకున్) పదిగానీ పన్నెండు గానీ వడ్డీతో కలిపి వసూలు చెయ్యడం (గుదిగొనన్) ఉచితం.

**68. కం. ధనధాన్యము లెక్కాలము**
**నినుమడి ముమ్మడికి మిగుల నెక్కెడుఁ దోడ్తో**
**మునివడ్డిఁగొన్న యతనికి**
**ధనమిచ్చి మొదలిధనము దఱువక నిలుచున్**

**అన్వయం:** ధనధాన్యములు – ఏ + కాలమున్ – ఇనుమడి – ముమ్మడికిన్ – మిగులన్ – ఎక్కెడున్ – దోడ్తోన్ – మునివడ్డిన్ – కొన్న – అతనికిన్ – ధనము + ఇచ్చి – మొదలి – ధనము – తఱువక – నిలుచున్.

**వ్యాఖ్య:** ఏ కాలంలో ధనధాన్యాలు రెండింతలు (ఇనుమడి) మూడింతలు (ముమ్మడి) కంటే అధికమవుతాయో (మిగుల నెక్కెడున్) అప్పుడు వెంటనే ముందు వడ్డీ తీసుకొన్న వాడికి (మునివడ్డిఁగొన్న యతనికిన్) ధనమిచ్చినట్లయితే మొదటిధనం తరిగిపోకుండా నిలుస్తుంది.

**69. కం. రోయిగొని పెట్టజాలక**
**ప్రాయిడియై యరుగునతఁడుఁ బరదేశము దాఁ**
**బోయినతఁడు మూడునెలల్**
**పోయినతుది వడ్డిసహితముగఁబెట్టఁదగున్**

**అన్వయం:** రోయి – కొని – పెట్టన్ + చాలక – ప్రాయిడియై – అరుగున్ – అతఁడున్ – పరదేశము – తాన్ – పోయిన – అతఁడు – మూడు – నెలల్ – పోయిన – తుది –వడ్డి సహితముగన్ – పెట్టన్ – తగున్.

**వ్యాఖ్య:** అప్పు (రోయి) చేబదులు తీసుకొని తిరిగి ఇవ్వకుండా దీనుడై (ప్రాయిడియై)

వెళ్ళిపోయినవాడూ (అరుగునతఁడు), అలాగే ఇతరదేశానికి వెళ్ళినవాడూ మూడునెలలు పోయిన తర్వాత వడ్డీతో సహా చెల్లించాలి.

దీనికి విజ్ఞానేశ్వరుడు ఉదాహరించిన కాత్యాయనుడి మాటలే మూలం.

**కృతాద్ధార మదత్వా యో యాచితస్తు దిశం వ్రజేత్**
**ఊర్ధ్వం మాసత్రయా త్తస్య తద్ధనం వృద్ధి మాప్నుయాత్ (వి.వ్య. 37)**

**70. కం. ఒడఁబడిక రోయిగొని**
**ధన మడుగఁగ నీకున్న నతని కదిమొదలుగ నా**
**యొడమియు వడ్డియు నిమ్మని**
**తడయక యిప్పించు టొప్పు ధరణీశునకున్**

**అన్వయం:** ఒడఁబడికన్ – రోయి – కొని – ధనము – అడుగఁగన్ – ఈకున్నన్ – అతనికిన్ – అది – మొదలుగన్ – ఆ + ఒడమియున్ – వడ్డియున్ – ఇమ్మని – తడయక – ఇప్పించుట –ధరణీ + ఈశునకున్ – ఒప్పున్.

**వ్యాఖ్య:** ఒప్పందంతో లేదా ఒప్పందపత్రం – ప్రామిసరీనోటు రాసిమరీ (ఒడఁబడికన్) అప్పు తీసుకొని (రోయిగొని) ధనం అడిగితే ఇవ్వని వాడికి అదిమొదలు ఆ అసలూ (ఒడమి) వడ్డీ రెండూ ఇవ్వమని వెనుకాడకుండా (తడయక) ఇప్పించడం రాజుకు (ధరణీశునకున్) తగినది.

**71. కం. ఆఁకనుండి పాడియాడి సత్యముచేసి**
**వెద్దుపెట్టి బలియు వెనుకఁజొచ్చి**
**యప్పువారిచేత నర్థంబుగొనఁజాలఁ**
**దగవకాన దానఁ దప్పులేదు**

**అన్వయం:** ఆఁకన్ – ఉండి, పాడి – ఆడి, సత్యము – చేసి, వెద్దు – పెట్టి, బలియున్ – వెనుకన్ –చొచ్చి – అప్పువారిచేతన్ – అర్థంబు – కొనన్ – చాలన్ – తగవు – అ. కానన్ – దానన్ – తప్పు లేదు.

**వ్యాఖ్య:** తీసుకొన్న సొమ్ము చెల్లించమని నిలువరించిగానీ (ఆఁకన్ ఉండి) న్యాయంకోసం పంచాయితీ పెట్టిగానీ (పాడియాడి) ప్రమాణం చేసిగానీ (సత్యముచేసి) వంచించిగానీ (వెద్దుపెట్టి) బలవంతంగా వెంటపడి (వెనుకఁజొచ్చి) గానీ ఋణగ్రస్తులనుండి (అప్పువారిచేతన్) ధనం (అర్థంబు) వసూలు చేయడం న్యాయమే (దగవు అ). కాబట్టి తప్పు లేదు.

**72. కం. ద్యూతధనంబు సరకువెల**
**జీతం బిల్లూరు దండశేషము వీనిం**
**బ్రీతి నొడఁబాటు వెలిగా**
**నేతెఱఁగుననైన వడ్డియెక్కదు దీనన్**

**అన్వయం:** ద్యూతధనంబు, సరకువెల, జీతంబు, ఇల్లూరు, దండశేషము, వీనిన్ – ప్రీతిన్ – ఒడఁబాటు – వెలిగాన్ – ఏ – తెఱఁగున్ + ఐనన్ – దీనన్ – వడ్డి – ఎక్కదు.

**వ్యాఖ్య:** జూదంసొమ్మూ (ద్యూతధనంబు), సరకువెల, జీతం, ఇతరుల సొమ్మూ (ఇల్లూరున్) దండనగా విధించిన సొమ్ములో కొంతచెల్లించగా మిగిలినదీ (దండశేషము) ఇలాంటి వాటిపై ఏ రకంగా చూసినా వడ్డీ పడదు (వడ్డియెక్కదు). ఎందుకంటే ఇవి అసళ్ళు కావు కాబట్టి.

**73. కం. అప్పుగొని పెట్టనొల్లక**
**త్రిప్పి యకారణము వసుమతీపతిసభకున్**
**జెప్పఁగవచ్చిన పెనవరి**
**నప్పుడ దండించి ధనము నరువఁగవలయున్**

**అన్వయం:** అప్పు – కొని – పెట్టన్ – ఒల్లక – త్రిప్పి – అకారణము – వసుమతీపతి – సభకున్ చెప్పఁగన్ – వచ్చిన – పెనవరిన్ – అప్పుడు + అ, దండించి – ధనమున్ – అరువఁగవలయున్.

**వ్యాఖ్య:** అప్పుతీసుకొని చెల్లించకుండా (పెట్టనొల్లక) తిప్పి తిప్పి అకారణంగా రాజసభకు (వసుమతీపతిసభకున్) ఫిర్యాదు చేసిన తగాదాకోరును (పెనవరిన్) అప్పడే దండించి వాడినుండి ధనం వసూలు చేయాలి (అరువఁగవలయున్).

**74. కం. అప్పిచ్చినవారలు తమ**
**యప్పిచ్చిన వరుసతోడ నర్థము ఋణిచేఁ**
**దప్పక కొనఁదగు ద్విజునకు**
**నప్పిచ్చిన మొదలు కొనుట యర్థము జగతిన్**

**అన్వయం:** జగతిన్ – అప్పు – ఇచ్చిన – వారలు – తమ – అప్పిచ్చిన – వరుసతోడన్ – అర్థమున్ – ఋణిచేన్ – తప్పక – కొనన్ – తగున్. ద్విజునకున్ – అప్పిచ్చినన్ – మొదలు – కొనుట అర్థము.

**వ్యాఖ్య:** అప్పిచ్చినవారు అప్పిచ్చిన పద్ధతిలోనే (వరుసతోడన్) అంటే ఒప్పందం

ప్రకారం వడ్డీతో సహా అప్పుతీసుకున్నవాడినుండి (ఋణిచేన్) తప్పకుండా వసూలుచేయడం తగినది. అదే బ్రాహ్మణుడికి (ద్విజునకున్) అప్పిచ్చినట్లయితే అసలు (మొదలు) తీసుకోవటం ఉచితం.

**75. తే.గీ. పాడినోడినయాతండు పదిఁటనొకటి**
**పాడిగెలిచినవాఁ డిరువదిఁట నొకటి**
**పాడిదీర్చినయట్టి భూపతికి దండు**
**వచ్చుటది ధర్మమనిచెప్పి రాదిమునులు**

**అన్వయం:** పాడిన్ – ఓడిన – ఆతండు – పదిఁటన్ – ఒకటి – పాడి – గెలిచిన – వాఁడు –ఇరువదిఁటన్ – ఒకటి – పాడి – తీర్చిన – అట్టి – భూపతికిన్ – దండువు – అచ్చుట + అది – ధర్మము – అని – ఆదిమునులు – చెప్పిరి.

**వ్యాఖ్య:** ఆర్థికలావాదేవీలలో న్యాయంకోసం ఇద్దరు వ్యక్తులు రాజును ఆశ్రయించినప్పుడు అందులో ఓడినవాడు (పాడినోడినయాతండు) పదింట ఒకటోవంతు, గెల్చినవాడు (పాడిగెలిచినవాఁడు) ఇరువదింట ఒకటో వంతు తగవుతీర్చిన (పాడిదీర్చిన) భూపతికి శిస్తు (దండువు) చెల్లించడం (అచ్చుట) ధర్మమని ఆదిమునులు చెప్పారు.

**76. కం. ధనమరువలేని పేదలఁ**
**బనిగొనఁజను ఋణముదీఱ బ్రాహ్మణుచేతన్**
**ధనమేగొనఁదగు విప్రునిఁ**
**బనిగొనఁగాఁజనదు ధర్మపరులకు నెందున్**

**అన్వయం:** ధనము – అరువలేని – పేదలన్ – ఋణము – తీఱ – ధర్మపరులకున్ – ఎందున్ –పనిగొనన్ – చనున్. బ్రాహ్మణుచేతన్ – ధనము + ఏ – కొనన్ – తగున్. విప్రునిన్ – పనిగొనఁగాన్ – చనదు.

**వ్యాఖ్య:** అప్పుతీర్చేందుకు (ఋణముదీఱన్), ధనం చెల్లించలేని (అరువలేని) పేదలతో – దానికి సరిపడా సేవలు చేయించుకోవచ్చు (పనిగొనఁజనున్). బ్రాహ్మణుణ్ణయితే, అతడినించి ఎప్పటికైనా ధనమే తీసుకోవాలి తప్ప సేవలు చేయించుకో కూడదు (పనిగొనుట = సేవలందుకోవడం).

**77. కం. తనచే నర్థము వడ్డికిఁ**
**గొని నతఁడీ వచ్చునపుడు గొననొల్లక త్రో**

**చిన మధ్యస్థులచేతను**
**నునిచిన నటమీఁద వడ్డియుడుగు ధరిత్రిన్**

**అన్వయం:** ధరిత్రిన్ – తనచేన్ – అర్థమున్ – వడ్డికిన్ – కొనిన + అతఁడు – ఈన్ – వచ్చునపుడు – కొనన్ – ఒల్లక – త్రోచినన్, మధ్యస్థులచేతనున్ – ఉనిచినన్ – అటమీఁదన్ – వడ్డి – ఉడుగున్.

**వ్యాఖ్య:** తన దగ్గర ధనాన్ని (అర్థమున్) వడ్డీకి తీసుకున్న అతడు ఆ సొమ్మును తిరిగి ఇవ్వడానికి వస్తే – అలా వచ్చినప్పుడు ఇచ్చినవాడు తీసుకోకుండా తిరస్కరించితే (కొనన్ + ఒల్లక – త్రోచినన్) ఆ వచ్చినవాడు తెచ్చిన సొమ్మును ఎవరైనా మధ్యవర్తుల చేతిలో ఉంచితే (ఉనిచినన్) ఇక అక్కడనుండీ అతగాడు – ఇతగాడికి వడ్డీ కట్టవలసిన అవసరంలేదు. వడ్డీ ఉండదు. పోతుంది (ఉడుగున్).

**విశేషాలు:** ఈ పద్యం కొంత అస్పష్టంగా ఉంది. అప్పుగా తీసుకున్న అసలు సొమ్మును చెల్లించడానికి వచ్చాడా, వడ్డీతో సహా చెల్లించడానికి వచ్చాడా? రెండవదే అయితే వడ్డీ వ్యాపారి సాధారణంగా తిరస్కరించడు. ఒకవేళ – వడ్డీ పెరుగుతుందనే దురాశతో తిరస్కరించినప్పటి మాట కావచ్చు నిది. మొదటిదే అయితే, ఆ పద్ధతి ఇప్పుడు అమలులో లేదు.

**78. కం. పానస్త్రీద్యూ తాదుల**
**నైన ఋణము తల్లిదండ్రు లరువరు సుతుఁడుం**
**దా నరువఁడు వారి ఋణము**
**మానుగ నా లరువ దెందు మగని ఋణంబున్**

**అన్వయం:** పాన – స్త్రీ – ద్యూత + ఆదులన్ – ఐన – ఋణము – తల్లిదండ్రులు – అరువరు. వారి – ఋణము – సుతుఁడున్ – తాను – అరువఁడు. మగని – ఋణంబున్ – ఆలు – ఎందున్ – మానుగన్ – అరువదు.

**వ్యాఖ్య:** మద్యపానం (పాన), స్త్రీ వ్యసనం, జూదం (ద్యూత) ఇత్యాదుల కోసం చేసిన అప్పుకు – అలా ఆ అప్పు చేసినవాడి తల్లిదండ్రులు అప్పుపడరు (అరువరు). తల్లిదండ్రులకు ఏ సంబంధమూ ఉండదని. వాళ్ళు తీర్చనక్కర్లేదు. తల్లిదండ్రులే అలాంటి అప్పు చేస్తే వారి ఆ ఋణానికి కొడుకూ అప్పుపడడు, బాధ్యత వహించడు. అచ్చుకోడు (అరువఁడు). కొడుకు బాధ్యత వహించి తీర్చవలసిన అవసరం లేదు. మగడు చేసిన అప్పును – అతడి భార్య (ఆలు) ఎక్కడైనా సరే తీర్చనవసరం లేదు (అరువదు).

**79. కం. పొత్తునఁ గుటుంబరక్షకుఁ**
**బొత్తులవారంద అప్పువుచ్చినచోటన్**
**బొత్తులవారందఱు ఋణ**
**విత్తం బరువంగవలయు విధివంతముగన్**

**అన్వయం:** పొత్తునన్ – కుటుంబ – రక్షకున్ – పొత్తులవారు + అందఱున్ – అప్పు – పుచ్చిన – చోటన్ – పొత్తులవారు + అందఱున్ – ఋణ – విత్తంబు – విధివంతముగన్ – అరువంగవలయున్.

**వ్యాఖ్య:** ఉమ్మడిగా ఉన్నప్పుడు (పొత్తునన్) కుటుంబరక్షణకోసం పొత్తులవారందరూ అప్పుచేస్తే ఆ అప్పును (ఋణవిత్తంబు) పొత్తులవారందరూ విధిగా చెల్లించాలి (అరువంగవలయున్).

**80. కం. గొల్లఁడు వ్యాధుఁడు రజకుఁడు**
**కల్లమ్మెడువాఁడు లోనుగాఁ గొందఱు దా**
**రిల్లాలప్పరువందగు**
**నిల్లునడుపు చనవు దాని కిచ్చినకతనన్**

**అన్వయం:** గొల్లఁడు – వ్యాధుఁడు – రజకుఁడు – కల్లు + అమ్మెడువాఁడు – లోనుగాన్ – కొందఱు – తారు – ఇల్లునడుపు – చనవు – దానికిన్ – ఇచ్చిన కతనన్ – ఇల్లాలు – అప్పున్ – అరువన్ – తగున్.

**వ్యాఖ్య:** గొల్లవాఁడు, వేటగాడు (వ్యాధుడు), రజకుడు, కల్లు అమ్మేవాడూ ఇంకా ఇలాంటివాళ్ళు కొందరు తాము (తారు) – భార్యకే (దానికిన్) ఇల్లునడిపే చనువు ఇస్తారు. అలా ఇచ్చినందు వల్ల (ఇచ్చినకతనన్) ఆమె – ఆ ఇల్లాలు తన భర్త చేసిన అప్పు తీర్చాలి. తీర్చడం ఉచితం (అరువందగున్).

**81. కం. సతి తన కొన్న ఋణంబును**
**బతి యిమ్మని నిశ్చితముగఁ బనిచిన ఋణమున్**
**బతి యియ్యకొలుపు ఋణమును**
**విततంబుగ నచ్చుఁగాని పెఱయరువ దిలన్**

**అన్వయం:** ఇలన్ – సతి – తన – కొన్న – ఋణంబును, పతి – ఇమ్మని – నిశ్చితముగన్ – పనిచిన – ఋణమున్, పతి – ఇయ్యకొలుపు – ఋణమును – విततంబుగన్ – అచ్చు – కాని – పెఱ – అరువదు.

**వ్యాఖ్య:** భార్య (సతి) తను తీసుకొన్న అప్పు (ఋణంబును), భర్త (పతి) తనను

ఇమ్మని నిశ్చితంగా ఆజ్ఞాపించిన (పనిచిన) అప్పు, పతి – తనను ఇమ్మని అంగీకరింపజేసిన అప్పు (ఇయ్యకొలుపు ఋణమును) మాత్రమే భార్య ఇస్తుంది (అచ్చు = ఇచ్చు. శబ్దరత్నాకరము). అంతే కానీ ఈ భూమిపై తదితరాలైన మగడి బాకీలను ఆమె తీర్చనవసరం లేదు (పెఱ = అరువదు).

**82. కం. జనకుఁడు పరదేశమునకు**
**జనినను జచ్చినను రోగజడుఁడై యున్నన్**
**దనయులు ఋణ మరువందగుఁ**
**దనయులు లేరేని నరువఁదగు మనుమలకున్**

**అన్వయం:** జనకుఁడు – పరదేశమునకున్ – చనినను – చచ్చినను – రోగ – జడుఁడై – ఉన్నన్ తనయులు – ఋణము – అరువన్ – తగున్. తనయులు – లేరేనిన్ – మనుమలకున్ – అరువన్– తగున్.

**వ్యాఖ్య:** తండ్రి (జనకుఁడు) పరదేశానికి వెళ్ళిపోయినా, పైలోకాలకే వెళ్ళిపోయినా (చచ్చినను) లేదా రోగంతో పడి ఉన్నా (రోగజడుఁడై యున్నన్) అతడు చేసిన అప్పును అతడి కొడుకులు (తనయులు) తీర్చాలి (అరువందగున్). అతడి కొడుకులూ బతికిలేకపోతే మనుమలు తీర్చాలి.

**83. కం. ఎనిమిదియేఁడులు శిశు వట**
**నెనిమిది యేండ్లకును బాలుఁడెడ యెఱుఁగఁడు గా**
**వున బాలుఁ డెన్నిభంగుల**
**జనకుని ఋణమరువఁ జనదు చనునట మీఁదన్**

**అన్వయం:** ఎనిమిది – ఏఁడులు – శిశువు. అటన్ – ఎనిమిది – ఏండ్లకును – బాలుఁడు. ఎడ – ఎఱుఁగఁడు – కావునన్ – ఎన్నిభంగులన్ – బాలుఁడు – జనకుని – ఋణము – అరువన్ – చనదు. అట – మీఁదన్ – చనును.

**వ్యాఖ్య:** బిడ్డ పుట్టిననాటి దగ్గరనుంచి ఎనిమిది సంవత్సరాల దాకా శిశువు అంటారు. అక్కణ్ణుంచి మరో ఎనిమిది సంవత్సరాలకు అంటే పదహారేళ్ళ దాకా బాలుడు అంటారు. ఈ బాలుడు ఇంకా లోకవ్యవహారం (ఎడ) తెలియనివాడు కాబట్టి ఎన్ని విధాలుగానైనాసరే తండ్రిచేసిన అప్పును (ఋణము) ఈ బాలుడు తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు. అలా చెల్లించమనడం తగదు. ఆపై అంటే పదహారు సంవత్సరాలు దాటిన తర్వాత అతడికి ఊహ వస్తుంది కాబట్టి అప్పుడు తండ్రి చేసిన అప్పులనైతే మాత్రం తీర్చవలసిన బాధ్యత ఈ బాలుడిపై ఉంది. దీనికి మూలం నారదస్మృతిలో ఉందని విజ్ఞానేశ్వరుడి మితాక్షరిలో ఇలా ఉంది.

**గర్భస్థ సదృశో జ్ఞేయ అష్టమాద్వత్సరాచ్ఛిశుః**
**బాల ఆషోడశా ద్వర్షాత్పౌగండశ్చేతి శబ్ద్యతే**
**పరతో వ్యవహారజ్ఞ స్స్వతంత్రః పితరావృతే** (వి.వ్య. **49,** స. **46**)

**84.** కం. **జనకుఁడు గొన్న ఋణము ద**
**త్తనయుఁడు వడ్డియును మొదలుఁ దా నరువఁదగున్**
**మనుమఁడు మొద లరువం దగు**
**మనుమల పుత్రులకు నరువు మహి లే దెందున్**

**అన్వయం:** జనకుఁడు – కొన్న – ఋణమున్ – తత్ + తనయుఁడు – వడ్డియునున్ – మొదలున్ – తాన్ – అరువన్ – తగున్. మనుమఁడు – మొదలు – అరువన్ – తగున్. మనుమల –పుత్రులకున్ – మహిన్ – ఎందున్ – అరువు – లేదు.

**వ్యాఖ్య:** తండ్రి (జనకుఁడు) చేసిన అప్పును కొడుకు వడ్డీతో సహా అసలును చెల్లించాలి.మనుమఁడు అసలును (మొదలు)మాత్రం చెల్లిస్తే చాలు (అరువన్దగున్) (కొడుకూ తీర్చకుండా మరణిస్తే). మనుమల పుత్రులకు – మునిమనుమలకు ఈ భూమిపై ఎక్కడా అసలుగానీ వడ్డీగానీ చెల్లించవలసిన అవసరం లేదు.

**85.** ఆ.వె. **అన్నదమ్ముఁడైన నాలుమగండైనఁ**
**గొడుకుఁ దండ్రియైనఁ గూడియుండి**
**పొత్తుధనమునందుఁ బూఁటవాటును నప్పు**
**సాక్ష్యమును వహింపఁ జనదు జగతి**

**అన్వయం:** జగతిన్ – పొత్తు – ధనమునందున్ – కూడియుండి – అన్నదమ్ముఁడు – ఐనన్ – ఆలు – మగండు – ఐనన్,కొడుకు – తండ్రి – ఐనన్ – పూఁటవాటునున్ – అప్పు + సాక్ష్యమును – వహింపన్ – చనదు.

**వ్యాఖ్య:** అన్నదమ్ములుగానీ, భార్యాభర్తలుగానీ, తండ్రీకొడుకులు గానీ పొత్తుధనంలో కలసి ఉన్నప్పుడూ – అంటే ఆస్తిగానీ ధనంగానీ ఇద్దరికీ జాయింటుగా ఉన్నప్పుడు – వీళ్ళల్లో ఒకరు ఎవరికైనా ఆర్థిక లావాదేవీలలో పూచీకత్తుగా ఉండటంగానీ (పూటవాటు), అప్పులకు సాక్ష్యాలుగా వర్తిల్లడం కానీ చేయకూడదు. అలా చేయటంవల్ల చెల్లించవలసినవాళ్ళు చెల్లించకపోతే హామీగా ఉన్నవాడి ఆస్తికి ఎసరుపెడతారు. ఆ ఆస్తి తన ఒక్కడిదే అయితే ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. కానీ అది ఉమ్మడిదైతే ఇటువంటి హామీలు సాక్ష్యాలు పెట్టడం వల్ల ఆస్తి భాగస్వామి నష్టపోయే అవకాశం ఉంది. అందుకే ఈ నియమం.

**86. కం. చూపుదుపూఁట యతఁడు ఋణిఁ**
**జూపవలయుఁ జూపఁడేని సొమ్మరువఁదగుం**
**జూపకముందఱ చచ్చినఁ**
**జూపం బనిలేదు వాని సుతసంతతికిన్**

**అన్వయం:** చూపుదుపూఁట – అతఁడు – ఋణిన్ – చూపవలయున్. చూపడు + ఏనిన్ – సొమ్ము – అరువన్ – తగున్. చూపక – ముందఱ – చచ్చినన్ – వాని – సుత – సంతతికిన్ – చూపన్ –పనిలేదు.

**వ్యాఖ్య:** హామీ లేదా జామీను ఇచ్చిన వ్యక్తి (చూపుదు పూఁట యతఁడు) ఋణం తీసుకున్న వ్యక్తిని చూపాలి. అలా చూపకపోతే తను హామీ ఉన్న సొమ్మును తానే చెల్లించాలి (అరువఁదగున్). అలా చూపించక ముందే హామీ ఇచ్చిన వ్యక్తి మరణించినట్లయితే వాడి సుతసంతతికి చూపించవలసిన పనిలేదు.

**విశేషాలు:** చూపుదు పూట: వ్యాజ్యంలో ఓడిపోయిన వాడు గెలిచినవాడికీ న్యాయం చెప్పినందుకు రాజుకూ కట్టవలసిన సొమ్ముకు జామీనును చూపడాన్ని చూపుదుపూట అంటారు.

**87. కం. అరువంగఁ బూఁటపడినతఁ**
**డరువక తాఁ జచ్చెనేని నాతని పుత్రుం**
**డరువఁదగు మొదలు తత్సుతుఁ**
**డరువం బనిలేదు ధర్మమారసి చూడన్**

**అన్వయం:** ధర్మమున్ – ఆరసి – చూడన్ – అరువంగన్ – పూఁటపడిన + అతఁడు – అరువకన్ – తాన్ – చచ్చెనేనిన్ – ఆతని – పుత్రుండు – మొదలు – అరువన్ – తగున్. తత్ + సుతుఁడు – అరువన్ – పని లేదు.

**వ్యాఖ్య:** ధర్మాన్ని పరిశీలిస్తే – చెల్లిస్తానని హామీ ఉన్న వ్యక్తి (అరువంగన్ పూఁట పడినతఁడు) చెల్లించకుండా (అరువక) తను మరణిస్తే – అలా మరణించిన వ్యక్తి తాలూకు పుత్రుడు ఆ బాకీ సొమ్ములో అసలు (మొదలు) చెల్లించాలి. మరణించిన వాడి కొడుకు కొడుకు – అంటే మనుమడు ఆ బాకీ చెల్లించవలసిన అవసరం లేదు (అరువం బనిలేదు).

ఈ పద్యానికి మితాక్షరిలో ఉన్న శ్లోకం.

**ఋణం పైతామహం పౌత్రః ప్రాతిభావ్యాగతం సుతః**
**సమం దద్యాత్తత్సుతే తు న దాప్యావితి నిశ్చయః (వి.వ్య. 53, స. 51)**

**88. కం. కుడిచినతఁ డరువకుండిన**
**నెడవడిన యతండ యచ్చు టెఱిఁగి నృపతి యా**
**కుడిచి నతనిఁ గని నప్పుడ**
**యెడవడి నాతనికి రెట్టి యిప్పింపఁదగున్**

**అన్వయం:** కుడిచిన – అతఁడు – అరువక + ఉండినన్ – ఎడవడిన – అతండు + అ – అచ్చుట – ఎఱిఁగి – నృపతి – ఆ – కుడిచిన – అతనిన్ – కనిన – అప్పుడు + అ – ఎడవడిన – ఆతనికిన్ – రెట్టి – ఇప్పింపన్ – తగున్.

**వ్యాఖ్య:** ఒకడిదగ్గర సొమ్ము తీసుకోని అనుభవించినవాడు, తిన్నవాడు (కుడిచినతఁడు) చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతూ ఉంటే (అరువకుండినన్) అందుకు హామీగా అడ్డుపడ్డ వాడు
(ఎడవడిన యతండు) చెల్లిస్తే ఆ విషయం తెలుసుకొన్న రాజుకు (నృపతి) ఆ తిన్నవాడు కనిపిస్తే అలా కనిపించినప్పుడే హామీగా అడ్డుపడి చెల్లించినవాడికి రెట్టింపుగా (రెట్టి) అనుభవించినవాడిచేత ఇప్పించాలి.

**89. కం. పెక్కండ్రు పూఁటవారలు**
**తక్కొని మెయిపాళ్ళ నరువఁదగు నొకచాయం**
**బెక్కండ్రు పూఁటయగుచో**
**నొక్కనిచేతనైన నర్థమొడయండు గొనున్**

**అన్వయం:** పెక్కండ్రు – పూఁటవారలు – తక్కొని – మెయిపాళ్ళన్ – అరువన్ – తగున్. ఒక –చాయన్ – పెక్కండ్రు – పూఁట – అగుచోన్ – ఒక్కనిచేతన్ + ఐనన్ – అర్థము – ఒడయండు –కొనున్.

**వ్యాఖ్య:** హామీగా ఉన్నవాళ్ళు (పూఁటవారలు) అనేకులు (పెక్కండ్రు) గనక ఉన్నట్లయితే వాళ్ళందరూ పూనుకొని (తక్కొని) సమానభాగాలతో (మెయిపాళ్ళన్) ఒకేలా (ఒకచాయన్) ఆ సొమ్ము చెల్లించాలి (అరువఁదగున్). యజమాని (ఒడయండు) తనకు ఎక్కువమంది హామీదారులు ఉన్నట్లయితే (పూఁటఁఅగుచోన్) వారిలో ఒక్కడిచేతనైనా సొమ్ము (అర్థంబు) వసూలుచేసుకోవచ్చు.

**90. తే.గీ. ఒక్కచాయపూఁట యొకరుఁడు పరదేశ**
**మరుగఁ గొడుకుతండ్రియట్లయచ్చుఁ**
**దండ్రిచచ్చెనేని దనయుఁడాయొకచాయ**
**పూఁటతండ్రిపాలు పూనియచ్చు**

**అన్వయం:** ఒక్కచాయ – పూఁట – ఒకరుఁడు – పరదేశము – అరుగన్ – కొడుకు – తండ్రి – అట్ల – అచ్చున్. తండ్రి – చచ్చెనేనిన్ – తనయుఁడు – ఆ – ఒకచాయ – పూఁట – తండ్రి పాలు – పూని అచ్చున్.

**వ్యాఖ్య:** సమభాగాలుగా (ఒక్క చాయ) పూటుపడ్డ వారిలో ఒకడు అంటే సొమ్ముకు హామీగా ఉన్నవారిలో ఒకడు పరదేశానికి వెళ్తే అలా వెళ్ళిన హామీదారుడి కొడుకు తండ్రిలాగే చెల్లించాలి (అచ్చున్). ఒకవేళ తండ్రి మరణిస్తే ఆ ఒక సమానభాగపు హామీగా ఉన్న తండ్రిపాలును పూని చెల్లించాలి (అచ్చున్).

దీనికి మూలం:

**ఏకచ్ఛాయా ప్రవిష్టానాం దాప్యో యస్తత్ర దృశ్యతే**
**ప్రోషితే తత్సుత స్సర్వం పిత్రంశం తు మృతే సమమితి(వి.వ్య. 54)**

**91. కం. రెట్టించిన యర్థము ఋణి**
**పెట్టక యున్నేని రోయిపెట్టినధనమా**
**పట్టిన యతఁడమ్మికొనిన**
**బట్టినరోయైన నెఱయఁ బాడిం బడయున్**

**అన్వయం:** రెట్టించిన – అర్థము – ఋణి – పెట్టక – ఉన్నేనిన్ – రోయి – పెట్టిన – ధనము – ఆ – పట్టిన – అతఁడు – అమ్మికొనినన్ – పట్టినరోయి + ఐనన్ – నెఱయన్ – పాడిన్ – పడయున్.

**వ్యాఖ్య:** ఒక వస్తువును ఇచ్చి తాకట్టు పెట్టినప్పుడు దానిని విడిపించుకోవడానికి అప్పుతీసుకున్నవాడు (ఋణి) రెట్టించిన సొమ్ము (అర్థము) చెల్లించాలి. అలా చెల్లించకపోతే(పెట్టకయున్నేనిన్),ఎరువు ఇచ్చినవస్తువును(రోయిపెట్టినధనము) తాకట్టుపెట్టుకున్నవాడు (పట్టిన యతఁడు) అమ్ముకున్నా –పుచ్చుకున్నా అప్పుగా ఇచ్చిన సొమ్మునైనా (పట్టినరోయైనన్) పూర్తిగా (నెఱయన్) అప్పు ఇచ్చినవాడు వ్యాజ్యం ద్వారా (పాడిన్) పొందుతాడు.

**92. కం. ఇన్నాళ్ళ కింతపెట్టక**
**యున్నను రోదక్కననుచు నొడఁబడునేఁదా**
**నన్నాళ్ళదక్కు నతనికి**
**నెన్నఁడు భోగ్యంబుదక్క దేధర్మములన్**

**అన్వయం:** ఇన్నాళ్ళకున్ – ఇంత – పెట్టక – ఉన్నను – రోయి – దక్కును – అనుచున్ – ఒడఁబడునేన్ – తాన్ – అన్నాళ్ళ – దక్కున్. అతనికిన్ – ఏ ధర్మములన్ – ఎన్నఁడు – భోగ్యంబు – దక్కదు.

**వ్యాఖ్య:** ఇన్నాళ్ళకు ఇంత చెల్లించకపోతే (పెట్టక ఉన్నను) అప్పు సొమ్ము (రోయి) దక్కుతుందని తాను ఒడబడతాడో అన్నాళ్ళకు అతడికి దక్కుతుంది. ఎన్నడూ ఏ ధర్మంప్రకారమూ శాశ్వత భోగ్యంగా దక్కదు.

**93. కం. తనరోవెట్టిన ధనమును**
**వినియోగము పలుకలేక వేడుకతోడన్**
**గొనునేనివడ్డిమాఱా**
**వినియోగమె చాలునంద్రు విద్వజ్జనముల్**

**అన్వయం:** తన – రోయి – పెట్టిన – ధనమును – వినియోగము – పలుకలేక – వేడుకతోడన్ –కొనునేని – వడ్డి – మాఱు + ఆ – వినియోగము + ఎ – చాలున్ (అని) – విద్వత్ + జనముల్ –అంద్రు.

**వ్యాఖ్య:** తన దగ్గర కుదువబెట్టిన వస్తువును (ధనమును) చెప్పాపెట్టకుండా అతడు (పలుకలేక) వేడుకతో ఉపయోగించుకున్నట్లయితే వడ్డీకి మారుగా వినియోగమే చాలు అంటారు పండితులు (విద్వజ్జనముల్).

**94. కం. తన రోపట్టిన యర్థము**
**తననేరమిఁ జెడియెనేనిఁ దానరువఁదగున్**
**మునుదైవరాజికంబులఁ**
**జనులెఱుఁగఁగఁ జెడియెనేని జనదరువంగన్**

**అన్వయం:** తన – రోయి – పట్టిన – అర్థము – తన – నేరమిన్ – చెడియెనేనిన్ – తాన్ – అరువన్ – తగున్. మును – దైవ రాజికంబులన్ – జనులు – ఎఱుఁగఁగన్ – చెడియెనేనిన్ –అరువంగన్ – చనదు.

**వ్యాఖ్య:** తనచేత తాకట్టుగా తీసుకోబడిన (రోపట్టిన) సొమ్ము తన అనుభవరాహిత్యంవల్ల తన పొరపాటువల్ల (నేరమిన్) పాడైపోయినట్లయితే తాను చెల్లించాలి (అరువన్ తగున్). దైవవశంవల్లగానీ రాజుగారి ధాష్టీకంవల్లగానీ (రాజికంబులన్) జనులకు తెలిసేలా చెడిపోతే చెల్లించనవసరం లేదు (జనదరువంగన్).

**95. కం. తనరోయిడుధన మితనికి**
**ననుభవయోగ్యంబు కాని యప్పుడు ఋణి యా**
**తని కొండు రోయిడం దగు**
**ధనమొండెనుబెట్టి యప్పుఁదలఁగఁగవలయున్**

**అన్వయం:** తన – రోయి – ఇదు – ధనము – ఇతనికిన్ – అనుభవ – యోగ్యంబు – కాని –అప్పుడు – ఋణి – ఆతనికిన్ – ఒండు – రోయి – ఇడన్ – తగున్. ధనము + ఒండెను – పెట్టి – అప్పున్ – తలఁగఁగవలయున్.

**వ్యాఖ్య:** తాను తాకట్టుపెట్టిన వస్తువును విడిపించుకోలేక, అది తాకట్టు పెట్టుకున్నవాడికికూడా అనుభవయోగ్యం కానప్పుడు, ఋణం తీసుకున్నవాడు (ఋణి) అతడికి వేరే తాకట్టు (రోయి) ఇవ్వడం తగినది. లేదా సరిపడా ధనమైనా ఇచ్చి ఋణవిముక్తుడవ్వాలి (అప్పున్ తలఁగఁగవలయున్).

**96. కం. ఇనుమడియైన ధనముతో**
**నినుమడిగా వడ్డి సహితమెక్కినఁ దానా**
**ధనమును వడ్డియునిమ్మని**
**జనపతి యొప్పింపవలయు సద్ధర్మగతిన్**

**అన్వయం:** ఇనుమడి + ఐన – ధనముతోన్ – ఇనుమడిగాన్ – వడ్డి – సహితము + ఎక్కినన్ – తాన్ – ఆ – ధనమును – వడ్డియున్ – ఇమ్మని – జనపతి – సత్ + ధర్మగతిన్ –ఒప్పింపవలయున్.

**వ్యాఖ్య:** రెండింతలు అయిన (ఇనుమడియైన) ధనముతో ఇనుమడిగా వడ్డీకూడా (వడ్డి సహితము) ఎక్కితే తాను ఆ ధనాన్నీ వడ్డీనీ ఇమ్మని రాజు(జనపతి) మంచి ధర్మపద్ధతిలో (సద్ధర్మగతిన్) ఒప్పించాలి.

**97. తే.గీ. దైవమానుషములఁ దనసొమ్ముతోడ ని**
**క్షేపమంద ఱెఱుఁగఁ జెడియెనేని**
**నరువఁదగ దుపేక్ష నాలస్యమున మోసఁ**
**జెడియెనేని యప్పు సిద్ధమంౘ్రు**

**అన్వయం:** దైవ – మానుషములన్ – తన – సొమ్ముతోడన్ – నిక్షేపము – అందఱు – ఎఱుఁగన్ –చెడియెనేనిన్ – అరువన్ – తగదు. ఉపేక్షన్ – ఆలస్యమునన్ – మోసన్ – చెడియెనేనిన్ – అప్పు – సిద్ధము + అంౘ్రు.

**వ్యాఖ్య:** దైవకృతంగాగానీ మానవకృతంగాగానీ (మానుషములన్) తన సొమ్ముకు కుదువబెట్టిన నిక్షేపం అందరికీ తెలిసేలా పోతే చెల్లించనవసరంలేదు (అరువఁదగదు). ఉపేక్షచేతనో అలసత్వంవల్లనో మోసం వల్లనో పోయినట్లయితే అలా పోయిన నిక్షేపం అప్పు అవుతుంది అంటారు (సిద్ధమంౘ్రు).

**98. కం. ఒడయని యనుమతి వెలిగా**
**వెడగై నిక్షేప మనుభవించి నతనిచే**
**నొడయఁడు వడ్డియు దండువు**
**తడయక నృపతియును గొనుట ధర్మం బెందున్**

**అన్వయం:** ఒడయని – అనుమతి – వెలిగాన్ – వెడగై – నిక్షేపము – అనుభవించిన – అతనిచేన్ – ఒడయఁడు – వడ్డియున్ – దండువు – తడయక – నృపతియును – కొనుట – ఎందున్ – ధర్మంబు.

**వ్యాఖ్య:** యజమాని లేదా రాజు (ఒడయని) అనుమతి లేకుండా (వెలిగాన్) అవివేకంతో వ్యర్థంగా (వెడగై) నిక్షేపాన్ని అనుభవించినవాడితో ఒడయడు వడ్డీనీ దానితోపాటు జరిమానాను (దండువు) వెనుకాడకుండా (తడయక) రాజు (నృపతి) వసూలుచేయడం ఎక్కడైనా ధర్మమే.

**99. కం. ఒడయఁడు నిక్షేపపు ధన**
**మడిగిన నీకున్నపిదప నది చెడెనేనిం**
**జెడినధనం బొడయనికిని**
**బుడమివిభున కంత దండువునుఁ బెట్టఁదగున్**

**అన్వయం:** ఒడయఁడు – నిక్షేపము – ధనము – అడిగినన్ – ఈక + ఉన్న – పిదపన్ – అది –చెడెనేనిన్ – చెడిన – ధనంబు – ఒడయనికిని – పుడమి – విభునకున్ – అంత – దండువునున్ –పెట్టన్ – తగున్.

**వ్యాఖ్య:** యజమాని (ఒడయఁడు) నిక్షేపపు వస్తువును తిరిగి ఇమ్మని అడిగితే ఇవ్వకపోతే ఆ తరువాత అది పోతే అలా పోయిన వస్తువును తాకట్టు పెట్టుకున్నవాడు యజమానికి ఇవ్వాలి. అంతే కిమ్మత్తు రాజుకూ (పుడమివిభునకున్) శిస్తుగా చెల్లించాలి.

**100. సీ. అర్థిఁదోడ్తెచ్చిన నాకులనేర్పడ**
**లిఖియింపఁదగువాఁడు లిఖితసాక్షి**
**మఱవక యీ యర్థమెఱుఁగు మీవనియప్డు**
**తలఁపింపబడువాఁడు తలఁపుసాక్షి**
**యెందేనిఁబోవచ్చి యెల్లకార్యములు నే**
**ర్పడ విన్నవాఁడు దబ్బాటుసాక్షి**
**యర్థితనంత రహస్యంబుసాక్షిగాఁ**
**గొన్నాతఁడగు మఱి గూఢసాక్షి**

గీ. యితఁడు నీతఁడు సాక్షి యీ యిద్దఱకును
సాక్షియన నాతఁ డుత్తర సాక్షి యయ్యెఁ
వీర లేవురు కృతసాక్షులైరి మీఁద
నకృతసాక్షు లార్వురు గల రవనిమీఁద

**అన్వయం:** అర్థిన్ – తోడు + తెచ్చిన – ఆకులన్ – ఏర్పడన్ – లిఖియింపన్ + తగువాఁడు – లిఖితసాక్షి, మఱవక – ఈ + అర్థము + ఎఱుఁగుము – ఈవు – అని – అప్డు – తలఁపింపబడువాఁడు – తలఁపుసాక్షి, ఎందేనిన్ – పోవచ్చి – ఎల్లకార్యములున్ – ఏర్పడన్ –విన్నవాఁడు – దబ్బాటుసాక్షి, అర్థి – తనంత – రహస్యంబు – సాక్షిగాన్ – కొన్న – ఆతఁడు – మఱి – గూఢసాక్షి – అగున్. ఇతఁడున్ – ఈతఁడు – సాక్షి – ఈ – ఇద్దఱకును – సాక్షి – అనన్ ఆతఁడు – ఉత్తర – సాక్షి – అయ్యెన్. వీరలు – ఏవురు – కృతసాక్షులు + ఐరి. మీఁదన్ – అవనిమీఁదన్ – అకృతసాక్షులు – ఆర్వురు – కలరు.

**వ్యాఖ్య:** కోరి (అర్థిన్) వెంటతెచ్చిన లేఖకుడు = ఆకులపై వివరం ఏర్పడేలా రాయించుకోదగినవాడు (లిఖియింపఁదగువాఁడు) లిఖితసాక్షి. మరువకుండా ఈ ప్రయోజనం(అర్థము) నువ్వు తెలుసుకో అని అప్పుడు తలపింపబడే వాడు తలపుసాక్షి. ఎక్కడికో వెళ్ళడానికి వచ్చి అన్నికార్యాలూ నెరవేరేలా (ఏర్పడన్) విన్నవాఁడు యదృచ్ఛా (దబ్బాటు) సాక్షి. అర్థి తానుగా రహస్యంగా సాక్షిగా తీసుకువచ్చినవాడు (కొన్నాతఁడు) గూఢసాక్షి. ఈ గూఢసాక్షీ ఇతడికి సాక్ష్యంగా వచ్చిన సాక్షీ ఈ ఇద్దరికీ సాక్షియైనవాడు ఉత్తర సాక్షి. వీళ్ళు అయిదుగురూ కృతసాక్షులు. అకృతసాక్షులు ఆరుగురు ఈ అవనిపై ఉన్నారు.

దీనికి మూలం:

**అర్థినా స్వయమానీతో యో లేఖ్యో సన్నివేశ్యతే**
**స సాక్షీ లిఖితో నామ స్మారితః పత్రకాదృత ఇతి**
**యస్తు కార్య ప్రసిద్ధ్యర్థం దృష్ట్వా కార్యం పునః పునః**
**స్మార్యతే చార్థినా సాక్షి సస్మారిత ఇహోచ్యత ఇతి**
**యస్తు యదృచ్ఛయాగత స్సాక్షీ విధీయతే స యదృచ్ఛాభిజ్ఞః**
**యశ్శ్రావ్యతే స్థితో గూఢో గూఢ సాక్షీ స ఉచ్యతే ఇతి తథా**
**సాక్షిణా మపి యస్సాక్ష్య ముపర్యుపరి భాషితే**
**శ్రవణాచ్ఛ్రావణా ద్వాపి ససాక్ష్యుత్తర సంజ్ఞిక ఇతి**
**(వి.వ్య. 67 – అవతారికా)**

కేతన అకృతసాక్ష్యులను చెప్పలేదు. నారద స్మృతిలోని అకృతసాక్ష్యులు వీరే.

**గ్రామ్యశ్చ ప్రాడ్వివాకచ్చ రాజా చ వ్యవహారిణాం**
**కార్యేష్వధికృతో యస్స్యా దర్థినా ప్రహితశ్చ యః**
**కుల్యాః కులవివాదేషు విజ్ఞేయాస్తేపి సాక్షిణా ఇతి**

**101. చం. తపమును దానముం గులము ధర్మము సత్యము నార్జవంబు ని**
**క్కపుధనమున్ సుసంతతియుఁ గల్గి శ్రుతిస్మృతిమార్గవర్తులై**
**చపలులుగానివారిఁ దగుసాక్షులుగాఁ గొన వారులేనిచో**
**నపగతదోషులైన జను లయ్యయిజాతులవార లందఱున్**

**అన్వయం:** తపమును – దానమున్ – కులము – ధర్మము – సత్యమున్ – ఆర్జవంబు – నిక్కపు –ధనమున్ – సుసంతతియున్ – కల్గి – శ్రుతి – స్మృతి – మార్గవర్తులై – చపలులుగాని – వారిన్ –సాక్షులుగాన్ – కొనన్ – తగున్. వారు – లేనిచోన్ – అపగత – దోషులైన – జనులు – ఆ – అయి – జాతులవారలు – అందఱున్ – (సాక్షులుగాన్ – కొనన్ – తగున్).

**వ్యాఖ్య:** తపస్సూ దానమూ కులమూ ధర్మమూ సత్యమూ ఋజువర్తనమూ (ఆర్జవంబు) నిక్కమైన – ధనమూ – తెల్లధనమూ మంచి సంతానమూ (సంతతియున్) కల్గి, శ్రుతిస్మృతిమార్గాలలో వర్తించేవారై, చపలబుద్ధులు కానివారిని సాక్షులుగా తీసుకోవడం తగినది. వారు లేకపోతే దోషాలు లేని (అపగతదోషులైన) జనులు ఆయా జాతులవారందరూ అర్హులే. దీనికి మూలం.

**తపస్వినో దానశీలాః కులీనాం సత్యవాదినః**
**ధర్మప్రధానా ఋజవః పుత్రవంతో ధనాన్వితాః**
**త్ర్యవరాసాక్షిణో జ్ఞేయా శ్రౌతస్మార్తక్రియాపరాః**
**యతాజాతి యథావర్ణం సర్వే సర్వేషు వా స్మృతాః**

**102. కం. శుభగుణములు నాచారముఁ**
**బ్రభుతనములు లేనివారు పలువురు వలద**
**య్యుభయానుమతము గల్గిన**
**సభ నుత్తముఁడొక్కడైన సాక్షిగఁజాలున్**

**అన్వయం:** శుభగుణములున్ – ఆచారమున్ – ప్రభుతనములు – లేనివారు – పలువురు – వలదు. ఆ – ఉభయ – అనుమతము – కల్గినన్ – సభన్ – ఉత్తముఁడు – ఒక్కడు + ఐనన్ – సాక్షిగన్ –చాలున్.

**వ్యాఖ్య:** శుభగుణాలూ ఆచారమూ ప్రభుతనములు లేనివారు = అనధికారులు – అనేకులు (పలువురు) అక్కర్లేదు. వ్యాజ్యానికి వచ్చిన ఆ ఉభయుల అనుమతము కల్గిన సభలో ఉత్తముఁడు ఒక్కడైనా సాక్షిగా చాలు.

**103. కం. తిట్టాట అంకు ముచ్చిమి**
**యిట్టి వివాదముల చోట నెవ్వరినైన**
**న్నెట్టన సాక్షిఁగఁ గొనఁ జను**
**నట్టియెడ సాక్షిగుణము లరయరు పెద్దల్**

**అన్వయం:** తిట్టాట – అంకు – ముచ్చిమి – ఇట్టి – వివాదముల – చోటన్ – ఎవ్వరిన్ + ఐననున్ – నెట్టనన్ – సాక్షిఁగన్ – కొనన్ – చనున్. అట్టి – ఎడన్ – సాక్షి – గుణములు – పెద్దల్ – అరయరు.

**వ్యాఖ్య:** దూషణం (తిట్టాట), అంకు, దొంగతనం (ముచ్చిమి) ఇటువంటి వివాదాలలో ఎవరినైనా శీఘ్రంగా (నెట్టనన్) సాక్షిగా తీసుకోవచ్చు. అటువంటిచోట సాక్షి గుణాలను పెద్దలు చూడరు.

**104. ఆ.వె. బాలకుండు వృద్ధు పగవాఁడు చుట్టంబు**
**బూతు సూనగాఁడు పాతకుండు**
**బొంకులాఁడు ముచ్చు ముండరి కొండీఁడు**
**కల్లుద్రాగువాఁడు గాఁడు సాక్షి**

**అన్వయం:** బాలకుండు – వృద్ధున్ – పగవాఁడు – చుట్టంబు – బూతు – సూనగాఁడు – పాతకుండు – బొంకులాఁడు – ముచ్చు – ముండరి – కొండీఁడు – కల్లుత్రాఁగువాఁడు – సాక్షి –కాఁడు.

**వ్యాఖ్య:** బాలకుడు, వృద్ధుడు, పగవాడు, చుట్టం, కుచ్చితపుతిట్టు తిట్టువాఁడు (బూతు), కటికవాడు లేదా హంతకుడు (సూనగాఁడు), పాపాత్ముడు (పాతకుండు), అసత్యవాది (బొంకులాఁడు) దొంగ (ముచ్చు) ముండాకోరు (ముండరి), చాడీలు చెప్పేవాడు (కొండీఁడు), కల్లుతాగేవాడు సాక్షి కాడు. వీళ్ళు సాక్షిగా ఉండడానికి అర్హులు కారు.

**105. ఆ.వె. తానెసాక్షిఁజెప్పఁ బూనివచ్చినవాఁడు**
**పాడిధనములోని పాలివాఁడు**
**కోపి మరులు పుణ్య పాపంబు లెఱుఁగని**
**వాఁడు జూదగాఁడు గాఁడు సాక్షి**

**అన్వయం:** తానె – సాక్షిన్ – చెప్పన్ – పూని – వచ్చినవాఁడు, పాడి – ధనములోని – పాలివాఁడు, కోపి, మరులు, పుణ్యపాపంబులు – ఎఱుఁగనివాఁడు, జూదగాఁడు – సాక్షి – కాఁడు.

**వ్యాఖ్య:** తనంతతానుగా సాక్ష్యం చెప్పడానికి వచ్చిన వాడు, తీర్పు ఇచ్చినందుకు ఇచ్చేధనంలో భాగం కలవాడు పాలివాఁడు, కోపిష్ఠి, మోహితుడు (మరులుగొన్నవాడు), పాపపుణ్యాలు తెలియని వాడు, జూదగాడు సాక్షి కాడు. వీళ్ళు సాక్షిగా ఉండడానికి అర్హులు కారు.

**106. సీ.** **సత్యమంతయుఁ జెడు సాక్షి బొంకిన నని**
**విప్రవంశజులకు వెలయఁ జెప్పి**
**వాహనాయుధములు వ్యర్థంబులగు బొంకు**
**పలికిన నని క్షత్రియులకుఁజెప్పి**
**గోధనధాన్యముల్ గూడక చెడునని**
**సభనువైశ్యులకును జాటిచెప్పి**
**పాపంబు లన్నియుఁ బ్రాపించు బొంకిన**
**నని శూద్రజాతి కందందఁ జెప్పి**

**గీ.** **యివ్విధంబున సాక్షులకెల్లఁ దెలిపి**
**ప్రాఙ్ముఖంబుగ నిల్పి యేర్పడఁగనడిగి**
**మంచివారలు చెప్పినమాటయూని**
**పాడిచెప్పుట నీతి సభాసదులకు**

**అన్వయం:** సాక్షి – బొంకినన్ – సత్యము – అంతయున్ – చెడున్ – అని – విప్రవంశజులకున్ –వెలయన్ – చెప్పి, బొంకు – పలికినన్ – వాహన – ఆయుధములు – వ్యర్థంబులు – అగున్ – అని – క్షత్రియులకున్ – చెప్పి, గో – ధన – ధాన్యముల్ – కూడకన్ – చెడున్ – అని – సభను –వైశ్యులకును – చాటి – చెప్పి, బొంకినన్ – పాపంబులు – అన్నియున్ – ప్రాపించున్ – అని – శూద్రజాతికిన్ – అందందన్ – చెప్పి, ఈ + విధంబునన్ – సాక్షులకున్ + ఎల్లన్ – తెలిపి, ప్రాక్ + ముఖంబుగన్ – నిల్పి, ఏర్పడఁగన్ – అడిగి, మంచివారలు – చెప్పిన – మాట – ఊని – సభాసదులకు – పాడి – చెప్పుట – నీతి.

**వ్యాఖ్య:** సాక్షి అబద్ధపు సాక్ష్యం చెప్తే (సాక్షి బొంకినన్) – సత్యమంతా చెడిపోతుందని బ్రాహ్మణులకు (విప్రవంశజులకున్) తెలిసేలా (వెలయన్) చెప్పి,

వాహనాయుధాలు వ్యర్థమైపోతాయని క్షత్రియులకు చెప్పి, గోధనధాన్యాలు నాశనం అయిపోతాయని (చెడునని) సభలో వైశ్యులకు చాటి చెప్పి, పాపాలన్నీ చుట్టుకుంటాయని (ప్రాపించున్) అని శూద్రజాతికి మరీమరీ (అందందన్) చెప్పి, ఈ విధంగా సాక్షులందరికీ తెలిపి తూర్పుముఖంగా (ప్రాఙ్ముఖంబుగన్) నిలబెట్టి వివరంగా (ఏర్పడఁగన్) ప్రశ్నించి, మంచివాళ్ళు చెప్పినమాటను ధరిస్తూ వారి మాటలను అవలంబిస్తూ (ఊని) న్యాయసభలోని సభ్యులు తీర్పుచెప్పడం (పాడిచెప్పుట) నీతి.

**సభాం తస్సాక్షిణస్సర్వా నర్థి ప్రత్యర్థి సన్నిధౌ**
**ప్రాడ్వివాకో నియుంజేత విధినానేన సాంత్వయన్**
**దేవ బ్రాహ్మణ సాన్నిధ్యే సాక్ష్యం పృఛ్ఛే దృతం ద్విడాన్**
**ఉదఙ్ముఖాన్ ప్రాఙ్ముఖాన్వా పూర్వాహ్ణే వై శుచిశ్శుచీన్**
**సమస్తా న్విదితాచారా న్విజ్ఞాతాథాన్ పృథక్ పృథ గితి**
**తథా బ్రాహ్మణాదిషు శ్రావణే మనునా నియమోదర్శితః**
**ఆహూయ సాక్షిణః పృచ్ఛే న్నియమ్య శపథైర్భృశమ్**
**సత్యేన శాపయే ద్విప్రం క్షత్రియం వాహ్యాటుధైః**
**గోబీజ కాంచనై ర్వైశ్యం శూద్రం సర్వైస్తు పాతకైరితి (వి.వ్య. 71)**

**107. కం.** **సాక్షులు దుష్టాత్మకులై**
**పక్షాపక్షములు దప్పఁ బలికిన వారిన్**
**శిక్షించి దండువులుగొని**
**యా క్షుద్రుల వేరువేర యడుగఁగవలయున్**

**అన్వయం:** సాక్షులు – దుష్ట – ఆత్మకులు + ఐ – పక్ష – అపక్షములు – తప్పన్ – పలికిన – వారిన్ – శిక్షించి – దండువులు – కొని – ఆ – క్షుద్రులన్ – వేరువేరన్ – అడుగఁగవలయున్.

**వ్యాఖ్య:** సాక్షులు దుష్టబుద్ధితో పక్షమూ అపక్షమూ ఏమీ చూడకుండా తప్ప పలికినట్లయితే వారిని శిక్షించి జరిమానాలు స్వీకరించి (దండువులు కొని) ఆ నీచుల్ని (క్షుద్రులన్) వేరువేరుగా ప్రశ్నించాలి.

**108. సీ.** **సభలోనఁ జయ్యన సాక్షులు చెప్పుచోఁ**
**బొసఁగమి రెంటలై పోరిరేని**
**పెక్కండ్రపలుకుల నిక్కంబు గొనునది**

**పొసఁగఁగ సరిసరిఁ బుట్టెనేని**
**గుణులైన వారిపల్కులు నమ్మికొనునది**
**యందఱు గుణవంతు లగుదురేని**
**నధికగుణాఢ్యుల నారసి వారల**
**పల్కుల నిజముగాఁ బట్టునది సు**

గీ. **గుణసమగ్రులు కొందఱై గుణవిహీను**
**లరయఁ బెక్కండ్రు సాక్ష్యంబు లాడుచోట**
**గుణసమగ్రుల పలుకులఁ గొనుట ధర్మ**
**మనిరి ధర్మజ్ఞు లయిన మహాతులెల్ల**

**అన్వయం:** సభలోనన్ – చయ్యనన్ – సాక్షులు – చెప్పుచోన్ – పొసఁగమి – రెంటలై – పోరిరేని,పెక్కండ్ర – పలుకులన్ – నిక్కంబు – కొనునది. పొసఁగఁగన్ – సరిసరిన్ – పుట్టెనేనిన్, గుణులైన – వారి – పల్కులు – నమ్మికొనునది. అందఱు – గుణవంతులు – అగుదురేనిన్ – అధిక –గుణాఢ్యులన్ – ఆరసి – వారల – పల్కులన్ –నిజముగాన్–బట్టునది. అరయన్–సుగుణసమగ్రులు–కొందఱై–గుణహీనులు – పెక్కండ్రు – సాక్ష్యంబులు – ఆడుచోటన్ – గుణసమగ్రుల – పలుకులన్ – కొనుట – ధర్మము (అని) – ధర్మజ్ఞులు – అయిన – ఎల్లన్ – మహాత్ములు – అనిరి.

**వ్యాఖ్య:** సభలో శీఘ్రంగా (చయ్యనన్) సాక్షులు చెప్పేటప్పుడు పొసగకపోవడంతో రెండువర్గాలుగా విడిపోయి (రెంటలై) యుద్ధం చేసినట్లయితే అధికులు చెప్పిన మాటలనే (పెక్కండ్రపలుకులన్) నిజంగా స్వీకరించాలి. వారి అభిప్రాయంతో పొసగేలా ఆ భిన్నాభిప్రాయం కలవారు సరిసమానంగా ఉంటే వారిలో గుణవంతులైన వారి పల్కులనే నమ్మికోవాలి. అందరూ గుణవంతులే అయితే అందులో అధికగుణాఢ్యుల్ని చూసి వారి మాటలనే నిజంగా స్వీకరించాలి. సుగుణసమగ్రులు కొందరే ఉండి గుణహీనులు ఎక్కువమంది (పెక్కండ్రు) సాక్ష్యాలు ఆడేచోట గుణసమగ్రుల మాటల్లనే లెక్కలోనికి తీసుకోవడం ధర్మం అని ధర్మజ్ఞులయిన మహాత్ములందరూ అంటున్నారు.

**109.** సీ. **సంవత్సరంబు మాసముఁ బక్షమును దిథి**
**వారంబు దేశంబు వ్రాసి మఱియు**
**జనకపూర్వంబుగా ధనికునామము వ్రాసి**
**పిమ్మట ఋణికుని పేరువ్రాసి**
**యాతనిచే నితఁడింతర్థమీ వడ్డి**

**నప్పుగాఁగొనెనని యరసి వ్రాసి**
**యీ యర్థ మెఱుఁగుదు మిట్టివారలమని**
**వరుసతో సాక్షులవ్రాయఁజెప్పి**
**కోరి యిబ్భంగి నొడఁబడఁగొంటిననియుఁ**
**బ్రీతిఁ గొన్నాతనిని వ్రాలుపెట్టఁ బనిచి**
**వ్రాసి నాతండు తుదిఁ దన వ్రాలుపెట్ట**
**నమ్మఁ గలపత్ర మిది యండ్రు నాగరికులు**

**అన్వయం:** సంవత్సరంబు – మాసమున్ – పక్షమును – తిథి – వారంబు – దేశంబు – వ్రాసి – మఱియున్ – జనక – పూర్వంబుగాన్ – ధనికున్ – నామము – వ్రాసి – పిమ్మట – ఋణికుని –పేరు – వ్రాసి – ఈతనిచేన్ – ఇతఁడు – ఇంత – అర్థము – ఈ – వడ్డిన్ – అప్పుగాన్ – కొనెన్ – అని – అరసి – వ్రాసి – ఈ – అర్థము – ఎఱుఁగుదుము – ఇట్టి – వారలము – అని –వరుసతోన్ – సాక్షులన్ – వ్రాయన్ – చెప్పి – కోరి – ఈ – భంగిన్ – ఒడఁబడన్ – కొంటిన్ – అనియున్ – ప్రీతిన్ – కొన్న – ఆతనిని – వ్రాలు – పెట్టన్ – పనిచి – వ్రాసిన – ఆతండు – తుదిన్ – తన – వ్రాలు – పెట్టన్ – అమ్మఁ గల – పత్రము – ఇది (అని) – నాగరికులు – అండ్రు.

**వ్యాఖ్య:** సంవత్సరం, మాసం, పక్షం, తిథి, వారం, దేశం రాసిపెట్టి, తండ్రిపేరుతో సహా (జనకపూర్వంబుగాన్) ధనికుడిపేరు (నామము) రాసి, తరువాత ఋణికుడి పేరు రాసి, ఇతడిచేత ఇతడు ఇంత ధనం వడ్డిగా ఇవ్వడానికి అంగీకరించి అప్పుగా తీసుకున్నాడని చూసి రాసి, ఈ ధనం మేము ఎరుగుదుమని మేమిటువంటివారం అంటూ వరుసగా సాక్షులను రాయమని చెప్పి, కోరి, ఈ విధంగా ఒప్పందం కుదుర్చుకున్నానని ఇష్టపూర్వకంగా (ప్రీతిన్) తీసుకున్నవాడిని సంతకం చేయమని (వ్రాలుపెట్టఁ బనిచి) రాసిన వాడూ చివరిలో తన సంతకం పెట్టినట్లయితే (వ్రాలుపెట్టన్) అమ్మ గల పత్ర మిదే అంటారు నాగరకులు.

**110.** కం. **ధనమప్పుగొనిన యాతఁడు**
**పనుపడఁ దనచేత వ్రాసి పత్రిక దా ని**
**చ్చిన నది నిక్కపుఁ బత్రం**
**బనుమానములేదు పాడియాడెడు చోటన్**

**అన్వయం:** ధనము – అప్పు– కొనిన – ఆతఁడు – పనుపడన్ – తన – చేతన్ – వ్రాసి – పత్రిక –తాన్ – ఇచ్చినన్ – అది – నిక్కము – పత్రంబు – పాడి – ఆడెడు

— చోటన్ — అనుమానము —లేదు.

**వ్యాఖ్య:** ధనం అప్పుతీసుకున్న వాడు తగినవిధంగా (పనుపడన్) తన చేత్తో రాసి ఇచ్చిన పత్రికను తానే ఇచ్చినట్లయితే అది నిజమైన పత్రమే. తీర్పు (పాడియాడెదు) చెప్పే చోట అనుమానము లేదు.

**111.** కం. **చిరిఁగినఁ దునిసినఁ బత్రా**
**క్షరములు సందియములైనఁ గడుదూరముగాఁ**
**బరదేశమందు నున్నను**
**వరుసం బత్రాంతరంబు వ్రాయింపవలెన్**

**అన్వయం:** చిరిఁగినన్ — తునిసినన్ — పత్ర — అక్షరములు — సందియములు + ఐనన్ — కడు — దూరముగాన్ — పరదేశమందున్ — ఉన్ననున్ — వరుసన్ — పత్ర + అంతరంబున్ — వ్రాయింపవలెన్.

**వ్యాఖ్య:** చిరిగినా ముక్కలైనా (తునిసినన్) పత్రంలో ఉన్న అక్షరాలు సందేహాస్పదంగా ఉన్నా (సందియములు ఐనన్) పత్రం బాగాదూరంగా పరదేశంలో ఉన్నా వరుసగా వేరొకపత్రం (పత్రాంతరంబు) రాయించుకోవాలి.

**112.** కం. **తప్పకసాక్షులముందట**
**నప్పుగొనిన యతఁడు తనకు నాయతి గలచో**
**నెప్పటివారలు నెఱుఁగఁగ**
**నప్పుమగుడఁ బెట్టుమనిరి యాదిమునీంద్రుల్**

**అన్వయం:** తప్పక — సాక్షుల — ముందటన్ — అప్పు — కొనిన — అతఁడు — తనకున్ — ఆయతి — కలచోన్ — ఎప్పటి — వారలున్ — ఎఱుఁగఁగన్ — అప్పున్ — మగుడన్ — పెట్టుము (అని) — ఆది — ముని — ఇంద్రుల్ — అనిరి.

**వ్యాఖ్య:** సాక్షుల ముందు అప్పుతీసుకున్నవాడు తనకు రాబడి ఉంటే (ఆయతి కలచోన్) తప్పకుండా అదే సాక్షులముందు తెలిసేలా (ఎఱుఁగఁగన్) అప్పు చెల్లించమన్నారు (మగుడన్ పెట్టుము) ఆదిమునీంద్రులు.

**113.** కం. **తులయును నగ్నియు విషమును**
**జలమును గోశంబు ననెడి సత్యములెల్లన్**
**వలయును సాక్షియుఁ బత్రముఁ**
**దెలుపఁగ లేకున్నఁ బాడి దీర్చెడుచోటన్**

**అన్వయం:** సాక్షియున్ – పత్రమున్ – తెలుపఁగన్ – లేకున్నన్ – పాడి – తీర్చెడుచోటన్ – తులయునున్ – అగ్నియున్ – విషమునున్ – జలమును – కోశంబున్ – అనెడి – సత్యములు – ఎల్లన్ – వలయును.

**వ్యాఖ్య:** సాక్షీ పత్రమూ చూపించడానికి లేకపోతే తీర్పుచెప్పేచోట, తుల, అగ్ని, విషం, జలం, కోశం అనే సత్యప్రమాణాలన్నీ కావాలి.

**114. కం.** **తులవిప్రులకును క్షత్రియ**
**కులజుల కనలంబు జలము కోమట్లకు శూ**
**ద్రులకును విషమిడి తెలిగొౝన**
**వలయుం గోశమదియొండు వర్ణులకెల్ల**

**అన్వయం:** విప్రులకును – తుల, క్షత్రియ – కులజులకున్ – అనలంబున్, కోమట్లకున్ – జలము, శూద్రులకును – విషము – ఇడి – తెలిగొౝనవలయున్. ఒండు – ఎల్ల – వర్ణులకున్ – అది –కోశము.

**వ్యాఖ్య:** విప్రులకు తుల, క్షత్రియవంశంలో పుట్టినవారికి (కులజులకున్) అగ్ని (అనలంబున్), కోమట్లకు నీరు (జలము), శూద్రులకు విషం ఇచ్చి తెలుసుకోవాలి. తెలిగొౝనవలయున్. తక్కిన వర్ణాలవారందరికీ (ఒండు వర్ణులకెల్లన్) కోశమే.

**115. కం.** **అభియోగించిన సత్యం**
**బభియుక్తుఁడు సేయవలయు నటుగాకయుఁ దా**
**నుభయానుమతము గల్గిన**
**నభియోగికి నైన సత్య మర్థము చేయున్**

**అన్వయం:** అభియోగించిన – సత్యంబు – అభియుక్తుఁడు – చేయవలయున్ – అటుకాకయున్ – తాను – ఉభయ – అనుమతము – కల్గినన్ – అభియోగికిన్ + ఐనన్ – సత్యము – అర్థము –చేయున్.

**వ్యాఖ్య:** అభియోగించిన సత్యాన్ని అభియోగింపబడినవాడు (అభియుక్తుఁడు) చేయాలి. అలాకాక తాను ఉభయపక్షాల అనుమతినీ పొందినట్లయితే ఆ అభియోగియైనా సత్యం చేయవచ్చు. చేయడం తగినదే.

**116. కం.** **విను నూఱుమాడలకు విష**
**మెనుబదిటికి నగ్ని యఱువదింటికిని జలం**
**బును నలువదింటికిని దుల**
**యును నిడితెలిగొౝనుట ధర్మ మూర్వీశులకున్**

**అన్వయం:** విను(ము) – నూఱు – మాడలకున్ – విషము, ఎనుబదిటికిన్ – అగ్ని, అఱువదింటికిని, జలంబును, నలువదింటికిని, తులయును, ఇడి – తెలిగొనుట – ఉర్వీశులకున్ –ధర్మము.

**వ్యాఖ్య:** విను. నూఱుమాడలకు విషమూ, ఎనభైమాడలకు అగ్ని, అరవైమాడలకు జలమూ, నలభైమాడలకు తుల వేసి తెలుసుకోవడం రాజులకు (ఉర్వీశులకున్) ధర్మం.

**117.** సీ. **తొలునాఁడు శోధ్యునిఁ దులఁ దూఁచు నాతని**
**యెత్తైన యిట్టికలెల్ల డాఁచి**
**సత్యదినంబున సరిత్రాసుపూజించి**
**యందు దిక్పాలుర నావహించి**
**తూర్పుముఖంబుగఁ దుల శోధ్యు**
**నెక్కించి యెప్పటి యిట్టికలెల్లఁబెట్టి**
**దైవంబులార యీతఁడు శుద్ధుఁడవునేని**
**నెత్తుఁడు దింపుడు హీనుఁడైన**

గీ. **ననుచుఁ బ్రాడ్వివాకుఁడుచెప్పు నవసరమున**
**శోధ్యుఁ డున్నతిఁ బొందిన శుద్ధుఁడయ్యె**
**నొక్కరూపుగ దిగఁ బడ్డ నోడె నంద్రు**
**సత్యనిర్ణయ మెఱిఁగెడు సాధుజనులు**

**అన్వయం:** తొలునాఁడు – శోధ్యునిన్ – తులన్ – తూఁచు – ఆతని – ఎత్తు + ఐన – ఇట్టికలు –ఎల్లన్ – డాఁచి, సత్యదినంబునన్ – సరి త్రాసు – పూజించి – అందున్ – దిక్పాలురన్ – ఆవహించి – తూర్పుముఖంబుగన్ – తులన్ – శోధ్యున్ – ఎక్కించి – ఎప్పటి – ఇట్టికలు – ఎల్లన్ – పెట్టి – దైవంబులార! ఈతఁడు – శుద్ధుఁడు – అవునేనిన్ – ఎత్తుఁడు. హీనుఁడు + ఐనన్ –దింపుడు. అనుచున్ – ప్రాడ్వివాకుఁడు – చెప్పు – అవసరమునన్ – శోధ్యుఁడు – ఉన్నతిన్ – పొందినన్ – శుద్ధుఁడు + అయ్యెన్. ఒక్కరూపుగన్ – దిగఁ బడ్డన్ – ఓడెన్ (అని) – సత్యనిర్ణయము – ఎఱిఁగెడు – సాధుజనులు – అంద్రు.

**వ్యాఖ్య:** మొదటిరోజు (తొలునాఁడు) నిందితుణ్ణి (శోధ్యునిన్) తులలో తూచి వాడి ఎత్తు ఇటుకలు దాచిపెట్టి, సత్యప్రమాణం చేసే రోజు సరిత్రాసును పూజించి అందులో దిక్పాలుల్ని ఆవహింపజేసి, తూర్పుముఖంగా తులలో నిందితుణ్ణి

ఎక్కించి ఎప్పటిలాగే నిన్నటి ఇటుకల్ని పెట్టి, దేవతలారా! ఇతడు శుద్ధుడైతే ఎత్తండి. హీనుడైతే దింపండి అంటూ న్యాయాధిపతి (ప్రాడ్వివాకుఁడు) చెప్పే సమయంలో నిందితుడు కూర్చున్న త్రాసు పళ్ళెం మీదకి వస్తే (ఉన్నతిన్ పొందినన్) అతడు నిర్దోషి. ఒకేలా సమానంగా ఉన్నా కిందికి తూగినా ఓడినట్లే. నిందితుడి కింద లెక్క అని అంటారు సత్యనిర్ణయం తెలిసిన సాధుజనులు.

**118. కం. ఇనుమున నేఁబదిపలముల**
**నెనిమిదిౖవేళ్ళాయతముగ నేర్పడగుండై**
**నునుపై యుండఁగఁజేసిన**
**మనమున నిది మద్దునకుఁ బ్రమాణం బయ్యెన్**

**అన్వయం:** ఇనుమునన్ – ఏఁబది – పలములన్ – ఎనిమిది – వ్రేళ్ళు – ఆయతముగన్ – ఏర్పడన్ – గుండు + ఐ – నునుపు + ఐ – ఉండఁగన్ – చేసినన్ – మనమునన్ – ఇది – మద్దునకున్ –ప్రమాణంబు – అయ్యెన్.

**వ్యాఖ్య:** ఇనుముతో యాభైపలాల్నీ, ఎనిమిది వేళ్ళ పొడవూ (ఆయతముగన్) ఏర్పడేలా గుండై గుండ్రంగా నునుపుగా ఉండేలా చేసిన ఇనపగుండు ఇది మద్దునకు ప్రమాణం అవుతుంది.

**విశేషాలు:** పలము – 1) నాలుగుకర్షముల యెత్తు; (వెండిపలము = ఇందువు. బంగారుపలము = కురుబిస్తము.) నిష్కము, మూడు తులములు.

**119. సీ. పదియాఱువ్రేళుల పరపు మండలము**
**నై యంతి వెడలుపు నైనదాని**
**భక్తితో నర్చించి ప్రాచీముఖంబుగాఁ**
**బడమట శోధ్యునిఁ బరఁగ నిలిపి**
**యాతనిదోయిట నశ్వత్థపర్ణంబు**
**లేడిడిప్రోఁగు లేడింటఁజుట్టి**
**పరఁగనక్షతలు పై నెరపి కాఁగిన మద్దు**
**కాఱున నిటికించి కడఁగితెచ్చి**

**గీ. ప్రాడ్వివాకుండుమంత్రపూర్వకముగాఁగఁ**
**బెట్టుటయు మండలము లేడు మెట్టికడచి**
**పోవవైచినఁజేతులు పొక్కవేని**
**శోధ్యుఁ డెల్లరు నెఱుగంగ శుద్ధుఁడయ్యె**

**అన్వయం:** పదియాఱు వ్రేళుల – పరపు, మండలమున్ + ఐ – అంతి – వెడలుపున్ – ఐనదానిన్ –భక్తితోన్ – అర్చించి, ప్రాచీముఖంబుగాన్ – పడమట – శోధ్యునిన్ – పరఁగన్ – నిలిపి, ఆతని –దోయిటన్ – అశ్వత్థ – పర్ణంబులు – ఏడు + ఇడి, ప్రోఁగులు – ఏడింటన్ – చుట్టి, పరఁగన్ – అక్షతలు – పైన్ – నెరపి, కాఁగిన – మడ్డు – కాఱునన్ – ఇఱికించి – కడఁగి – తెచ్చి – ప్రాడ్వివాకుండు – మంత్రపూర్వకముగాఁగన్ – పెట్టుటయున్ – ఏడు – మండలములు – మెట్టి – కడచి – పోవన్ – వైచినన్ – చేతులు – పొక్కవేనిన్ – శోధ్యుఁడు – ఎల్లరున్ – ఎఱుగంగన్ –శుద్ధుఁడు – అయ్యెన్.

**వ్యాఖ్య:** పదహారు వేళ్ళ వైశాల్యం (పరపు మండలము), అంతే వెడల్పు ఉన్న దాన్ని భక్తితో అర్చించి తూర్పుముఖంగా (ప్రాచీముఖంబుగాన్) బడమట నిందితుణ్ణి (శోధ్యునిన్) నిలిపి అతడి దోసిట అశ్వత్థవృక్షపు ఆకులు (పర్ణంబు) ఎదురుగా ఏడు మండలాలు (పోగులు) చుట్టి, అక్షతలు పైన చల్లి (నెరపి), కాగిన మడ్డు – పట్టుకాఱులో దాన్ని ఇఱికించి పూనికతో తెచ్చి (కడఁగితెచ్చి), న్యాయమూర్తి (ప్రాడ్వివాకుండు) మంత్రపూర్వకంగా పెట్టటమూ ఏడు మండలాలు దాటి (మెట్టి) వెళ్ళేలా (కడచిపోవన్) వేసినట్లయితే చేతులు పొక్కకుండా ఉంటే నిందితుడు అందరికీ తెలిసేలా అనిందితుడు – నిర్దోషి అవుతాడు.

**120. సీ.** **పరికింపఁగా బొడ్డుబంటి నీళులలోన**
**నొకమాను చేతికి నూఁత గాఁగ**
**మూడవశరశబ్దమున శోధ్యుఁడగువాఁడు**
**మునిఁగిన దరినున్న జనుఁడు నడుద**
**లమ్మేసినంత దవ్వతివేగమునఁబాఱి**
**నందుండి వేఱొక్కఁ డతిరయమునఁ**
**బఱతెంచి దరి మున్ను పాతిన తోరణ**
**స్తంభంబు ముట్టు నంతటికి మున్ను**

**ఆ.వె.** **మునిఁగి నతని ఫాలమును గ్రింది యంగముల్**
**గానబడకయున్నఁ గలుగుగెలుపు**
**కాననయ్యెనేని వానికి నోటంబు**
**దప్పదండ్రు ధర్మతత్త్వవిదులు**

**అన్వయం:** పరికింపఁగాన్ – బొడ్డుబంటి – నీళులలోనన్ – ఒకమానున్ – చేతికిన్ – ఊఁత – కాఁగన్ – మూడవ – శర – శబ్దమునన్ – శోధ్యుఁడు +

అగువాఁడు – మునిఁగినన్ – దరిన్ – ఉన్న – జనుఁడు – నడుదల – అమ్ము – ఏసినంత – దవ్వు – అతివేగమునన్ – పాఱన్ – అందుండి – వేఱొక్కఁడు – అతిరయమునన్ – పఱతెంచి – దరిన్ – మున్ను – పాతిన – తోరణ – స్తంభంబున్ – ముట్టు – అంతటికిన్ – మున్ను – మునిఁగిన – అతని – ఫాలమును – క్రింది – అంగముల్ – కానబడక – ఉన్నన్ – గెలుపు – కలుగున్. కానన్ – అయ్యేనేని – వానికిన్ – ఓటంబు తప్పదు (అని) ధర్మతత్త్వవిదులు అంద్రు.

**వ్యాఖ్య:** ఆలోచిస్తే బొడ్డుబంటినీళ్ళలో ఒకమాను చేతికి ఊతంగా ఇచ్చి మూడవనీటిశబ్దంలో (శరము నీరు) నిందితుడైనవాడు (శోధ్యుఁడగువాఁడు) మునిగి ఉండగా ఒడ్డున ఉన్న వ్యక్తి నడినెత్తి మధ్యభాగంలో (నడుదల) అమ్ము వేసినంత దూరం అతివేగంతో వెళ్తే (పాఱన్) అక్కడనుండి వేరొకడు అతివేగంతో వెళ్ళి (పఱతెంచి) ఒడ్డున (దరిన్) ముందు (మున్ను) పాతిన తోరణ స్తంభం తాకడానికి (ముట్టునంతటికిన్) ముందే మునిగినవాడి ఫాలమూ కింది అంగాలు కనబడకుండా ఉంటే నిందితుడు గెలిచినట్లు (కలుగు గెలుపు). అలాకాక ఫాలమూ కింది అంగాలు కనిపిస్తే వాడికి ఓటమి తప్పదు అని ధర్మతత్త్వవిదులు అంటారు. అప్పుడు వాడు ఓడినట్లు లెక్క.

**121. తే.గీ.** **క్రొత్తకుండలోనఁ గ్రూరసర్పమునిడి**
**యర్చితముగఁజేసి యందులోన**
**నిమ్మపండువేసి నెమ్మితోఁ దివియంగ**
**శోధ్యుఁడైనవాఁడు శుద్ధుఁడయ్యె**

**అన్వయం:** క్రొత్తకుండలోనన్ – క్రూరసర్పమున్ – ఇడి – అర్చితముగన్ – చేసి – అందులోనన్ –నిమ్మపండు – వేసి – నెమ్మితోన్ – తివియంగన్ – శోధ్యుఁడు + ఐనవాఁడు – శుద్ధుఁడు – అయ్యెన్.

**వ్యాఖ్య:** క్రొత్తకుండలో క్రూరసర్పాన్ని ఉంచి పూజించి (అర్చితముగన్ చేసి) అందులో నిమ్మపండు వేసి క్షేమంగా (నెమ్మితోన్) తీసినట్లయితే (తివియంగన్) అలా వెలికి తీసిన నిందితుడు శోధ్యుఁడైనవాఁడు) శుద్ధుఁడు – నిర్దోషి అవుతాడు.

**122. కం.** **తనపడసిన సొమ్మయినను**
**దన వలసినయట్లు పంపఁదగుఁ బుత్రులకున్**
**దనతండ్రి పడపు సుతులకు**
**జనకుఁడు పంచంగవలయు సరిపాళులుగన్**

**అన్వయం:** జనకుఁడు – తన – పడసిన – సొమ్ము – అయినను, తన – వలసిన + అట్లు – పుత్రులకున్ – పంపన్ – తగున్. తన – తండ్రి – పడపున్ – సుతులకున్ – సరిపాళులుగన్ – పంచంగవలయున్.

**వ్యాఖ్య:** తండ్రి (జనకుఁడు) తాను సంపాదించిన సొమ్మునయితే తనకు కావలసినట్లుగా కొడుకులకు పంచుకోవచ్చు (పంపన్ తగున్), తన తండ్రినుంచి సంక్రమించిన ఆస్తి నయితే (పడపున్) గనక ఆ తండ్రి – కొడుకులందరికీ సమపాళ్ళలో పంచాలి.

**123. కం. జనకునితో రెండైనను**
**జననికి ఋతుసంభవంబు సమసినఁ బుత్రుల్**
**మునుకొని తమతమ పాళ్ళను**
**జనకునితోఁ బంచుకొంట సద్ధర్మమగున్**

**అన్వయం:** జనకునితోన్ – రెండు + ఐనను, జననికిన్ – ఋతుసంభవంబు – సమసినన్, పుత్రుల్ – మునుకొని – జనకునితోన్ – తమ – తమ – పాళ్ళను – పంచుకొంట – సత్ + ధర్మము – అగున్.

**వ్యాఖ్య:** తండ్రితో భేదాభిప్రాయాలు వచ్చినా (రెండు = భేదము), అలాగే తల్లికి నెలసరి ఆగిపోయినా (ఋతుసంభవంబు సమసినన్) ఈ రెండు సందర్భాలలో కొడుకులు తండ్రి ఆస్తినుంచి తమతమ వాటాలను పంచుకోవచ్చు. అలా పంచుకోవడం మంచి ధర్మమే (సత్ + ధర్మము) అవుతుంది.

**124. కం. పలువురు యువతులుఁ బుత్రులు**
**పలువురుఁ గల యతఁడు వేఱువాయఁ దలఁచినన్**
**లలనలుఁ బుత్రులుఁదానును**
**తలకొని మెయిఁ బాలుగొనుట ధర్మంబెందున్**

**అన్వయం:** పలువురు – యువతులున్, పలువురున్ – పుత్రులు – కల – అతఁడు – వేఱు – పాయన్ – తలఁచినన్, లలనలున్ – పుత్రులున్ – తానును – తలకొనిమెయిన్ – పాలున్ – కొనుట – ఎందున్ – ధర్మంబు.

**వ్యాఖ్య**: అనేక యువతులు, కుమారులు కల వ్యక్తి – వారి నుంచి విడిపోయి (వేఱు + పాయన్) బతకాలని అనుకొంటే – ఆ స్త్రీలు (లలనలున్) – కొడుకులు – తానూ అందరూ కూర్చొని పూనికతో (తలకొని మెయిన్) వాటాలు వేసుకొని ఎవరి వాటా వారు తీసుకోవాలి. ఇది ఎక్కడైనా ధర్మమే.

**125. కం. నాయంత బ్రతుకనేర్తుం**
**బోయెద నను సుతుని రిత్తఁ బుచ్చ కతనికిన్**
**వేయింటికిఁ బదియైనను**
**దాయముగా నిచ్చి పుచ్చఁదగు జనకునకున్**

**అన్వయం:** నా + అంతన్ – బ్రతుకనేర్తున్ – పోయెదను – అను – సుతునిన్ – రిత్తన్ – పుచ్చక – అతనికిన్ – వేయింటికిన్ – పది + ఐనను – దాయముగాన్ – ఇచ్చి – జనకునకున్ – పుచ్చన్ – తగున్.

**వ్యాఖ్య:** నా అంతట నేనే బతుకుతాను. ఇంట్లోంచి వెళ్ళిపోతాను అనే కొడుకుని ఉట్టి చేతులతో (రిత్తన్) పంపకుండా – అతడికి కనీసం వెయ్యిలో పది వంతయినా దాయంగా (దాయము = పంచుకొనదగిన తండ్రి సొత్తు) ఇచ్చి మరీ పంపడం తండ్రికి (జనకునకున్) న్యాయం.

**126. కం. ఉత్తమమగు ద్రవ్యంబును**
**విత్తంబును నగ్రజునికి వింశాంశంబున్**
**బొత్తున నిచ్చి సహోదరు**
**లత్తి సమాంశంబు గొనుట యర్హంబెందున్**

**అన్వయం:** పొత్తునన్ – ద్రవ్యంబును – విత్తంబును – అగ్రజునికిన్ – వింశ + అంశంబున్ – ఇచ్చి, సహోదరులు – అత్తి – సమాంశంబున్ – కొనుట – ఎందున్ – అర్హంబు. ఉత్తమము + అగున్.

**వ్యాఖ్య:** ఉమ్మడిగా ఉన్న వస్తువులుగానీ ధనంగానీ పెద్ద అన్నయ్యకి ఇరవయ్యో వంతు (వింశాంశంబున్) ఇచ్చి మిగిలిన ఆస్తిని అతనితో సహా సోదరులు అందరూ కలిసి (అత్తి) సమానంగా పంచుకోవడం సర్వత్రా తగినది. మంచిది. ఉమ్మడి ఆస్తిలో అగ్రజుడికి ఇరవయ్యవవంతు అదనంగా దక్కుతుంది.

**127. తే.గీ. పెండ్లి చేసిన నిలుచెడి పేదలైన**
**కూఁతులకుఁ దల్లిధనమైనఁ గొనుట యుచిత**
**మందఱును నొక్కభంగివా రగుదురేనిఁ**
**దారుమెయి పాలుగొనుటయు ధర్మమెందు**

**అన్వయం:** పెండ్లి – చేసినన్ – ఇలుచెడి – పేదలు + ఐన – కూఁతులకున్ – తల్లి – ధనము + ఐనన్ – కొనుట – ఉచితము. అందఱునున్ – ఒక్క – భంగివారు – అగుదురేనిన్ – తారు – మెయిన్ – పాలు – గొనుటయున్ – ఎందున్ – ధర్మము.

**వ్యాఖ్య:** కూతుళ్లకు పెళ్ళి చేస్తే – వాళ్ళు ఇల్లు చెడి – దురదృష్టం కొద్దీ పేదరాళ్ళయితే ఆ కూతుళ్లకు తండ్రి ధనం సంగతి అటుంచి కనీసం తల్లి ధనమైనా రావడం ఉచితం. ఆ కూతుళ్లందరూ ఒకేలాంటి వాళ్ళు – అంటే, ఇల్లుచెడ్డ పేదరాళ్లే అయినట్లయితే వాళ్ళు (తారు) ఒకే తీరుగా (మెయిన్) వాటాలు వేసుకొని తల్లి ఆస్తిని పంచుకోవడం ఎక్కడైనా ధర్మమే.

**128. కం. జనకుని ధనమును బొరయక**
**కనిన ధనముఁ జెలిమి వేరె గనిన ధనంబుం**
**దన యత్తవారు వెట్టిన**
**ధనముం దన ధనమ యండ్రు తత్త్వవిధిజ్ఞుల్**

**అన్వయం:** తత్త్వ – విధిజ్ఞుల్ – జనకుని – ధనమును, పొరయక, కనిన – ధనమున్ – చెలిమిన్ –వేరె – కనిన – ధనంబున్ – తన – అత్తవారు – పెట్టిన – ధనమున్ – తన – ధనమ + అండ్రు.

**వ్యాఖ్య:** తండ్రి ధనాన్ని (జనకుని ధనమును), ముట్టుకోకుండా (పొరయక) తానై సంపాదించుకున్న ధనమూ (కనిన ధనమున్), తనకు ఎవరితోనో స్నేహం ద్వారా లభించిన ధనమూ, తన అత్తవారు పెట్టిన ధనమూ ఇదంతా సొంత ధనమే అవుతుందంటారు తత్త్వవేత్తలు. సోదరులకు ఇందులో వాటా పెట్టనవసరం లేదని.

**129. కం. జనకుఁడు తనుఁ జదివింపక**
**జనకుని ధనమైనఁ గుడిచి చదువక తనయం**
**తన గుడిచి చదివి పడసిన**
**ధనముఁ బాలడుగ లేదు దాయాదులకున్**

**అన్వయం:** జనకుఁడు – తనున్ – చదివింపక, జనకుని – ధనము + ఐనన్ – కుడిచి, చదువక, తన + అంతన – కుడిచి – చదివి – పడసిన – ధనమున్ – దాయాదులకున్ – పాలు – అడుగన్ – లేదు.

**వ్యాఖ్య:** తండ్రి తనను చదివించనప్పుడుగానీ – తండ్రిధనాన్ని ఒక్కపైసా కూడా తిని చదువుకోకుండా తనంత తానుగా సంపాదించుకొని ఆ డబ్బుతోనే తిని, చదువుకొంటే అలా చదువుకొన్నవారు తర్వాత ధనం సంపాదిస్తే అలా పొందిన ధనంలో దాయాదులకు భాగం ఉండదు. దీనికి మూలం:

**అనుపఘ్నం పితృద్రవ్యం శ్రమేణ యదుపార్జయేత్**
**దాయాదేభ్యో న తద్దద్యా ద్విద్యయా లబ్ధమేవ చ** (వి.వ్య., 177)

దీనికి విజ్ఞానేశ్వరుడి వచనం కూడా ఉంది.

**తథా విద్యాయాం వేదాధ్యయనే నాధ్యాపనేన వేదార్థ వ్యాఖ్యానేన వా**
**యల్లబ్ధం తదపి దాయాదేభ్యో న దద్యా దార్జక ఏవ గృహ్ణీయాత్**

**130. కం. పితృధన మితరులచే నప**
**హృతమై చెడియుండి పిదప నెవ్వనిచే సు**
**స్థితమగు నది సాధించిన**
**యతనిధనము సోదరులకు నతఁడీఁ గలుగున్**

**అన్వయం:** పితృధనము – ఇతరులచేన్ – అపహృతమై – చెడియుండి, పిదపన్ – ఎవ్వనిచేన్ – సుస్థితము – అగున్ – అది – సాధించిన అతనిధనము. సోదరులకున్ – అతఁడు – ఈన్ – కలుగున్.

**వ్యాఖ్య:** తండ్రి సంపాదించిన ధనం ఇతరులచేత అపహరింపబడి అది చెడిపోయి ఉండి (ధనంగానీ ద్రవ్యంగానీ) ఉంటే ఆ తరువాత ఆ సొత్తు ఎవడిచేతనైతే మళ్ళీ సాధించబడి సుస్థితం అవుతుందో అలా సాధించిన ధనం సాధించినవాడిదే. తన సోదరులకు అతడు ఇస్తేనే (ఈన్) కలుగుతుంది. లేకపోతే లేదు. దానిపై మిగిలిన సోదరులకు ఏ హక్కులూ ఉండవని.

**131. కం. నాలుగు వర్ణములందును**
**నోలిని విప్రునకుఁ బుట్టియున్న తనూజుల్**
**నాలుగు మూఁడును రెండును**
**బోలఁగ నొక్కటియు నంశములు గొనవలయున్**

**అన్వయం:** నాలుగు – వర్ణములందును – ఓలిని – విప్రునకున్ – పుట్టియున్న – తనూజుల్ –పోలఁగన్ – నాలుగు – మూఁడును – రెండును – ఒక్కటియున్ – అంశములు – కొనవలయున్.

**వ్యాఖ్య:** నాలుగు వర్ణాలలో – అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతి స్త్రీలతో బ్రాహ్మణుడికి (విప్రునకున్) పుట్టిన కుమారులు (తనూజుల్) వరుసగా (ఓలిని) ఆస్తిలో నాలుగూ మూడూ రెండూ ఒకటీ అయిన భాగాలను (అంశములు) పంచుకొని – స్వీకరించాలి (కొనవలయున్).

బ్రాహ్మణుడిద్వారా బ్రాహ్మణస్త్రీకి పుట్టినవాడు నాలుగూ, క్షత్రియస్త్రీకి పుట్టినవాడు మూడూ, వైశ్యస్త్రీకి పుట్టినవాడు రెండు, శూద్రస్త్రీకి పుట్టినవాడు ఒక భాగం చొప్పున ఆస్తిని పంచుకోవాలి. దీనికి యాజ్ఞవల్క్య స్మృతిలోని మూల శ్లోకం.

**చతుస్త్రిద్వ్యేక భాగాస్స్యుర్వర్ణశో బ్రాహ్మణాత్మజాః**
**క్షత్రజాస్త్రి ద్వ్యేక భాగా విడ్జాస్తు ద్వ్యేక భాగినః**
**(యా. వ్య. 123, స. 121)**

**132. సీ.** **పొత్తున జనకుండు పుత్రుండు నున్ననాఁ**
**డేర్పడఁ దమలోన నెవ్వఁడేనిఁ**
**గట్టిన చీరలుఁ బెట్టిన తొడవులు**
**నెక్కెడి వాహనంబు లింటిలోనఁ**
**బాయని కొలుచును బానిసలోనుగా**
**నవరుద్ధలై యున్న యంగనలును**
**మంచంబు పీఠంబు కంచంబు చాపయు**
**చెప్పులు గొడుగులు చేట తెడ్డు**

**గీ.** **పాయకెప్పుడుఁ జెల్లు సంపదలు వరుసఁ**
**దొల్లి చెల్లిన భంగినిఁ జెల్ల నిచ్చి**
**పెఱధనంబులు తమలోన వేరువేరు**
**నొక్క భంగినఁ బాల్గొను టుత్తమంబు**

**అన్వయం:** జనకుండు – పుత్రుండు – పొత్తునన్ – ఉన్ననాఁడు – ఏర్పడన్ – దమలోనన్ – ఎవ్వఁడేనిన్ – కట్టిన – చీరలున్, పెట్టిన – తొడవులున్, ఎక్కెడి – వాహనంబులు, ఇంటిలోనన్ – పాయని – కొలుచును, బానిసలోనుగాన్ – అవరుద్ధలై – ఉన్న – అంగనలును, మంచంబున్ – పీఠంబున్ – కంచంబున్ – చాపయున్ – చెప్పులున్, గొడుగులున్, చేటన్, తెడ్డున్, పాయకన్ – ఎప్పుడున్ – చెల్లు – సంపదలున్ – వరుసన్ – తొల్లి – చెల్లిన – భంగిని – చెల్లనిచ్చి, పెఱ – ధనంబులు – తమలోనన్ – వేరు – వేరన్ – ఒక్క – భంగిగన్ – పాల్ + కొనుట – ఉత్తమంబు.

**వ్యాఖ్య**: తండ్రీ కొడుకులూ కలిసి ఉమ్మడికుటుంబంలో ఉన్నప్పుడు తమలో ఎవరెవరు ఏఏ వస్తువులు వాడుకున్నారో – అంటే కట్టుకున్న చీరలు, పెట్టుకున్న ఆభరణాలూ, అధిరోహించిన (ఎక్కెడి) వాహనాలూ, ఇంటిలో ఎల్లప్పుడూ విడిచిపెట్టకుండా ఉండే (కొలుచు) ధాన్యాలూ, బానిసలూ అలాగే ఇంట బందీలై (అవరుద్ధలై) సేవచేసే స్త్రీలు (అంగనలు), మంచమూ, పీఠమూ, కంచమూ, చాప, చెప్పులు, గొడుగు, చేట, తెడ్డు ఇంకా నిత్యమూ ఇంటిలో ఉండే (పాయకన్ – ఎప్పుడున్ – చెల్లు) సంపదలూ వగైరాలన్నీ విడిపోయేనాటికి ఎవరెవరు ఏవి

వాడుకుంటూ ఉంటే అవి వారివే. వాటిని అలాగే ఇంతకు ముందులాగే ఉంచి (తొల్లి చెల్లినభంగిని చెల్లనిచ్చి) ఇవి కాక తక్కిన ధనాన్ని (పెఱ ధనంబులు) తమలోతాము వేరువేరుగా ఒకేలా (ఒక్క భంగిగన్) = సమానంగా పంచుకోవటం మంచిది.

**133. కం. జనకుని వస్త్రంబులు వా**
**హనములు శయ్యలునుఁ దొడవు లతఁడీల్గిన నా**
**తని శ్రాద్ధంబునఁ గుడిచిన**
**తనికిం దగుఁ బుచ్చుకొనఁగఁ దగదు సుతులకున్**

**అన్వయం**: జనకుని – వస్త్రంబులు – వాహనములు – శయ్యలునున్ – తొడవులు – అతఁడు – ఈల్గినన్ – ఆతని – శ్రాద్ధంబునన్ – కుడిచిన + అతనికిన్ – పుచ్చుకొనఁగన్ – తగున్. సుతులకున్ – పుచ్చుకొనఁగన్ – తగదు.

**వ్యాఖ్య**: తండ్రి బతికి ఉన్నప్పుడు అతడు కట్టుకున్న బట్టలు (వస్త్రాలు) వాడుకున్న వాహనాలు, మంచాలు (శయ్యలునున్) ఆభరణాలు (తొడవులున్) మొదలైనవాటిని – ఆ తండ్రి మరణించిన తర్వాత (ఈల్గినన్) ఆ తండ్రికి చేసే శ్రాద్ధకర్మలలో బ్రాహ్మణార్థంగా కూర్చొని భోజనం చేసినవాడు – భోక్త (కుడిచినతడు) తీసుకోవడం తగినది. అతడికి దానం చేసెయ్యాలి. అంతేకానీ వాటిని కొడుకులు (సుతులకున్) పుచ్చుకోవడం తగదు.

**మూలం:**

**వస్త్రాలంకార శయ్యాది పితుర్యద్వాహనాదికం**
**గంధమాల్యై స్సమభ్యర్చ్య శ్రాద్ధే భోక్త్రే తదర్పయేత్**
**(వి.వ్య.117, స. 114)**

**134. కం. మనుమలు తాత ధనము పా**
**ల్గొన యోగ్యత గల్గి పంచుకొనుచోఁ దమకున్**
**జనకులు పెక్కండ్రైనను**
**జనకుల యంశములు గొనుట సద్ధర్మ మిలన్**

**అన్వయం**: మనుమలు – తాత – ధనము – పాలున్ – కొనన్ – యోగ్యతన్ – కల్గి – పంచుకొనుచోన్ – తమకున్ – జనకులు – పెక్కండ్రు + ఐనను – జనకుల – అంశములు – కొనుట – ఇలన్ – సత్ + ధర్మము.

**వ్యాఖ్య**: మనుమలు తాతగారి ధనాన్ని – ఆస్తిని పంచుకోవడానికి అర్హతకలవారైతే అలా పంచుకొనేటప్పుడు ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అదేమిటంటే –

తమకు తండ్రులు వేరువేరుగా ఉంటే – ఆయా తండ్రులకు (తాతగారి కొడుకులు) ఏఏ వాటాలు వస్తాయో ఆయా వాటాలను (అంశములు) స్వీకరించడమే ఇలలో మంచి ధర్మం.

**135. కం.** **కొడుకులు వేఱైన తుదిం**
**కొడు కుదయంబైనఁ దండ్రి కొని నంశం బా**
**కొడుకు ధనము మునుపాసిన**
**కొడుకులకుం దండ్రిధనము గొన లే దెందున్**

**అన్వయం**: కొడుకులు – వేరు + ఐన – తుదిన్ – కొడుకు – ఉదయంబు – ఐనన్ – తండ్రి – కొనిన – అంశంబు – ఆ – కొడుకు – ధనము. ఎందున్ – మును – పాసిన – కొడుకులకున్ – తండ్రి ధనము – కొనన్ – లేదు.

**వ్యాఖ్య**: తండ్రినుంచి కొడుకులు ఆస్తిని పంచుకొని వేరుపడిన తర్వాత ఆ తండ్రికి మళ్ళీ ఇంకొక కొడుకు పుట్టినట్లయితే (ఉదయంబు + ఐనన్), ముందు ఆస్తిని పంచుకున్నప్పుడు తండ్రికి వచ్చిన వాటా ఏదైతే ఉందో అది తర్వాత పుట్టిన కొడుకుకే చెందుతుంది. అది ఆ కొడుకు ధనం. అంతకు ముందు తండ్రిని విడిచివెళ్ళిన (మునుపాసిన) కొడుకులకు ఈ తండ్రి వాటా ఎక్కడైనాసరే ఎట్టి పరిస్థితుల్లోనూ రాదు. ఆ వాటాలో మళ్ళీ వాటాలు కోరకూడదని.

**136. కం.** **వనిత పతిచేతఁ బడసిన**
**ధనము తగినవారి కియ్యఁదగు క్షేత్రము దా**
**ననుభవము కొనక యొరులకుఁ**
**దన చనవున నీఁగి యనుచితం బండ్రు బుధుల్**

**అన్వయం:** వనిత – పతిచేతన్ – పడసిన – ధనము – తగినవారికిన్ – ఇయ్యన్ – తగున్. క్షేత్రమున్ – తాను – అనుభవము – కొనక – ఒరులకున్ – తన – చనవునన్ – ఈఁగి – అనుచితము (అని) బుధుల్ – అండ్రు.

**వ్యాఖ్య:** స్త్రీ (వనిత) భర్త ద్వారా పొందిన ధనాన్ని తాను స్వయంగా తగినవారికి ఇవ్వవచ్చు. కానీ భూమిని మాత్రం (క్షేత్రము) తాను అనుభవించాలి. అలా అనుభవించక (అనుభవముకొనక) ఇతరులకు తన చనువు కొద్దీ ఇవ్వడం తగదంటారు పండితులు (బుధులు).

**137.** **స్త్రీ ధనంబు పేరఁ జెల్లిన ధనమెల్లఁ**
**గూఁతుఁ జేరుఁ గూఁతు కూఁతుఁజేరుఁ**

**గూఁతుఁ గానకున్నఁ గొడుకు పాలగుఁ గాని**
**వేరు పాలివారు వెదకలేరు**

**అన్వయం:** స్త్రీ – ధనంబు – పేరన్ – చెల్లిన – ఎల్లన్ – ధనము – కూఁతున్ – చేరున్, కూఁతు – కూఁతున్ – చేరున్. కూఁతున్ – కానక + ఉన్నన్ – కొడుకు – పాలు – అగున్ – కాని – వేరుపాలివారు – వెదకన్ – లేరు.

**వ్యాఖ్య:** స్త్రీధనం పేరుతో చెలామణిలో ఉన్న ధనమంతా ఆమె కూతురికే సంక్రమిస్తుంది. ఆ తర్వాత కూతురికూతురికి – అంటే మనుమరాలికి (దౌహిత్రి) చెందుతుంది. కూతురికి కూతురు పుట్టకపోతే – ఆ కూతురికి పుట్టిన కొడుకుకి సంక్రమిస్తుందే కానీ ఈ స్త్రీధనానికి వారసులయ్యే వాటాదారులు (పాలివారు) ఇతరులు ఎక్కడ వెదికినా లేరు. అంటే స్త్రీ ధనం అన్యాక్రాంతం కారాదని.

**138. కం. కొడుకులు గల శూద్రునకుం**
**బొడమిన దాసీసుతుండు పుత్రులలోఁ దా**
**నొడఁబడి యాపాల్గొనఁదగుఁ**
**గొడుగులు లేకున్నఁ దానె కొను ధన మెల్లన్**

**అన్వయం:** కొడుకులు – కల – శూద్రునకున్ – పొడమిన – దాసీసుతుండు – పుత్రులలోన్ – తాన్ – ఒడఁబడి – ఆ – పాల్ – కొనన్ – తగున్. కొడుకులు – లేకున్నన్ – తానె – ధనము + ఎల్లన్ – కొనున్.

**వ్యాఖ్య:** కొడుకులు ఉన్న శూద్రునకు పుట్టిన (పొడమిన) దాసీసుతుడు ఆ కొడుకులలో తానూ ఒకడై కలిసి ఆ భాగాన్ని తానూ స్వీకరించడానికి తగినవాడు. అతడికీ ఒక వాటా వస్తుంది. ఆ శూద్రునకు కొడుకులే లేకపోతే మొత్తం ధనాన్ని తానే స్వీకరించవచ్చు. దాసీపుత్రుడే వారసుడు అవుతాడు.

**139. కం. ముందరవేరై పిదపం**
**బొందిన సోదరుఁ డొకండు పుత్రుండై పో**
**వం దడవ వాని యర్థముఁ**
**బొందినవారక పోవుఁ బో దితరులకున్**

**అన్వయం:** ముందర – వేరు + ఐ, పిదపన్ – పొందిన – సోదరుఁడు – ఒకండు – పుత్రుండై – పోవన్, తడవ – వాని – అర్థమున్ – పొందినవారలకున్ + అ – పోవున్. ఇతరులకున్ – పోదు.

**వ్యాఖ్య:** సోదరులలో ఒకడు ముందు (ముందర) వేరుపడి వెళ్ళిపోయి,

తర్వాతెప్పుడో మళ్ళీ (పిదపన్) వచ్చి కలిస్తే, అలా పొందిన సోదరుడూ మళ్ళీ ఇంకొకరికి పుత్రుడై వెళ్తే ఈసారి అలా వెళ్ళినవాడి ధనం – వాడు ఎవరి దగ్గరికి వెళ్ళాడో వాళ్ళకు – అంటే ఇతణ్ణి పుత్రుడిగా పొందినవాళ్ళకే వెళ్తుంది కానీ ఇతరులకు వెళ్ళదు.

**140. తే.గీ. జనులెఱుంగఁ బాడి సవతుల కొడుకులు**
**కలిసిరేని నొకఁడు పొలిసెనేని**
**వాని పాలిధనము వానిసోదరుఁడును**
**వానిఁ గలసినతఁడు వరుసఁ గొంద్రు**

**అన్వయం:** జనులు – ఎఱుంగగన్ – పాడి, సవతుల – కొడుకులు – కలిసిరి + ఏనిన్ – ఒకఁడు – పొలసెనేనిన్, వాని – పాలి – ధనము – వాని – సోదరుఁడును, వానిన్ – కలసిన + అతఁడున్ – వరుసన్ – కొంద్రు.

**వ్యాఖ్య:** అందరికీ తెలిసే విధంగా న్యాయంగా సవతుల కొడుకులు కలిసినట్లయితే – వారిలో ఒకడు దేశసంచారానికి పోతే (పొలసెనేని) ఆ వ్యక్తి తాలూకూ వాటా సొమ్ము (పాలి ధనము) వరుసగా వాడి సోదరుడికి గానీ లేకపోతే వాడిని కలిసిన వ్యక్తికిగానీ చెందుతుంది. వాళ్ళు తీసుకుంటారు (కొంద్రు).

**141. ఆదట మును వాసిన భి**
**న్నోదరులును సోదరులును నొక్కటియైనన్**
**సోదరులకు వచ్చును భి**
**న్నోదరులకు రాదు పుత్రునొడమి ధరిత్రిన్**

**అన్వయం:** పుత్రుని – ఒడమి – ధరిత్రిన్ – ఆదటన్ – మును – పాసిన – భిన్న + ఉదరులును, స + ఉదరులును, ఒక్కటి – ఐనన్, స + ఉదరులకున్ – వచ్చును. భిన్న + ఉదరులకున్ – రాదు.

**వ్యాఖ్య:** ఈ భూమిపై పుత్రుడి ఆస్తి – సంపద – ధనం (ఒడమి) ఎవరికి వస్తుందో ఎవరికి రాదో చెప్తున్నాడు. ఆ పుత్రుడికి ఒకే కడుపున పుట్టిన సోదరులు, ఒకే కడుపున పుట్టని (భిన్నోదరులు) సోదరులు – సవతి సోదరులు ఉంటే – వాళ్ళు ముందు తనను విడిచి వెళ్ళిపోతే – అలా తనను విడిచి వెళ్ళిన (పాసిన) భిన్నోదరులూ, సోదరులూ మళ్ళీ వచ్చి తనను కలిస్తే – వీడి సంపద సోదరులకు వస్తుంది కానీ భిన్నోదరులకు రాదు.

**మూలం:**

**విభక్తో యః పునః పిత్రాభ్రాతా నైకత్ర సంస్థితః**
**పిత్రువ్యే ణాథవా ప్రీత్యా సతు సంసృష్ట ఉచ్యతే**

**142. ఉ. ఆలును దండ్రియున్ సుతసుతాలియు సోదరులుం గృహస్థులుం**
**బోలఁగ సద్గురుండు తనుఁ బొందిన శిష్యుఁడు పుత్రహీను సొ**
**మ్మోలిన గైకొనం జను మఱొక్కనికీఁ బనిలేదు భూవిభుం**
**డేలిన వాఁడు గానఁగొను నెవ్వఁడులేనిధనంబు లిమ్మగన్**

**అన్వయం:** పుత్రహీను – సొమ్మున్ – ఓలిన – ఆలును – తండ్రియున్, సుతసుతా + ఆళియున్, సోదరులున్ – గృహస్థులున్, పోలఁగన్ – సుద్గురుండున్, తనున్ – పొందిన – శిష్యుఁడున్ – కైకొనన్ – చనున్, మఱి + ఒక్కనికిన్ – ఈన్ – పని – లేదు. ఏలినవాఁడు – కానన్ – భూవిభుండు – ఎవ్వఁడు – లేని – ధనంబున్ – ఇమ్మగన్ – కొనున్.

**వ్యాఖ్య:** పుత్రుడు లేనివాడి సొమ్ము (పుత్రహీను సొమ్మున్) క్రమంగా భార్య, భార్యలేకపోతే అతడి తండ్రి, తర్వాత అతడి కూతురి సంతతిగా మనుమళ్ళుగానీ మనుమరాళ్ళుగానీ (సుతసుతా + ఆళి) ఆ తర్వాత సోదరులూ ఇంకా వీళ్ళెవరూ లేకపోతే ఇంట్లో ఉండేవాళ్లు (గృహస్థులూ) ఆ తరువాత తన గురువూ, తనను గురువుగా భావించిన శిష్యుడూ క్రమంగా (ఓలినన్) స్వీకరించవచ్చు. అతడి ఆస్తికి వారసులని. వీళ్ళకు తప్ప ఇంకొకడికి ఇవ్వవలసిన పని లేదు. వీళ్ళెవరూ లేకపోతే ఎవరూలేని వాడి సొమ్మును – ఏలినవాడు కాబట్టి చక్కగా రాజుగారే స్వాధీనపరుచుకొంటారు.

**143. కం. గాలిని దెవులున నాప**
**త్కాలంబున మేటి రాజకార్యంబున ని**
**ల్లాలి ధనము పతి గొనఁదగుఁ**
**బోలదు పెఱపట్లయందుఁ బుచ్చుకొనంగన్**

**అన్వయం:** పతి – ఇల్లాలి – ధనమున్ – గాలిని – తెవులునన్ – ఆపత్కాలంబునన్ – మేటి – రాజ – కార్యంబునన్ – కొనన్ – తగున్. పెఱపట్లయందున్ – పుచ్చుకొనంగన్ – తగదు.

**వ్యాఖ్య:** పెద్ద తుఫాను వచ్చినప్పుడో, రోగం వచ్చినప్పుడో (తెవులునన్), ఆపద వచ్చిన సమయంలోనో, ఏదో పెద్ద రాచకార్యంకోసమో అయితే భర్త (పతి) ఇల్లాలి ధనాన్ని తీసుకోవచ్చు. అంతకు మించి ఇటువంటివి తప్ప మిగిలిన ఇతర సందర్భాలలో

(పెఱపట్లయందున్) స్త్రీ ధనం తీసుకోకూడదు. (పుచ్చుకొనంగన్ పోలదు).

**144. కం. చీఁకుం బిచ్చుక గుంటును**
**మూకు శిఖండియును నిక్కముగఁ దమపాళ్ళం**
**జేకొనఁ జాలరు వారిం**
**జే కొనఁ గావలయు ధనముఁ జేకొన్నజనుల్**

**అన్వయం:** నిక్కముగన్– చీఁకున్ – పిచ్చుకగుంటును – మూకున్ – శిఖండియును – తమపాళ్ళన్ – చేకొనన్ – చాలరు. ధనమున్ – చేకొన్న – జనుల్ – వారిన్ – చేకొనఁగావలయున్.

**వ్యాఖ్య:** గుడ్డివాడు (చీకున్) కుంటివాడు (పిచ్చుకగుంటును) మూగవాడు (మూకు) నపుంసకుడు (శిఖండి) నిజంగా తమతమ వాటాలను (పాళ్ళన్) స్వీకరించలేరు. వాళ్ళు వైకల్యం వల్ల ధనాన్ని కాపాడుకోలేరు కాబట్టి. వారి వాటాను స్వీకరించినవాళ్ళే (చేకొన్న జనుల్) ఆ వికలాంగుల బాధ్యతనుకూడా స్వీకరించాలి.

**145. కం. తనయ విహీనుఁడు చచ్చిన**
**ధనముం గొని ఋణము నరువఁ దగు దాయాదుల్**
**ధనపుత్ర హీను పిమ్మటఁ**
**బనిలేదు ఋణంబుదీర్పఁ బత్న్యాదులకున్**

**అన్వయం**: తనయ – విహీనుఁడు – చచ్చినన్ – దాయాదుల్ – ధనమున్ – కొని – ఋణమున్ – అరువఁదగున్. ధన – పుత్ర – హీను – పిమ్మటన్ – పత్నీ + ఆదులకున్ – ఋణంబున్ – తీర్పన్ – పని లేదు.

**వ్యాఖ్య:** కొడుకులు లేనివాడు (తనయవిహీనుఁడు) చనిపోతే అతడి దాయాదులు అతడి ధనాన్ని తీసుకొని అతడికి ఉన్న అప్పుల్ని తీర్చివేయాలి (అరువఁదగున్). ధనంగానీ పుత్రుడుగానీ లేనివాడు చనిపోతే – చనిపోయిన తర్వాత అతడి భార్య మొదలైనవారికి అతడి అప్పుల్ని తీర్చవలసిన పని లేదు.

**146. ఉ. పాసియు వేరువాయనని పైఁబడి యొక్కఁడు పల్కెనేనియుం**
**బాసిననాఁటిపత్రములుఁ బాయుటెఱింగిన జ్ఞాతివర్గముల్**
**డాసినబంధుమిత్రులు నొడంబడ నిచ్చిన కొన్నయప్పులుం**
**బాసినయిల్లు వేఱ తెలుపం దగువానికి నూరెఱుంగఁగన్.**

**అన్వయం:** పాసియున్ – వేరు – పాయను – అని – పైఁబడి – ఒక్కఁడు – పల్కెనేనియున్ – పాసిన – నాఁటిపత్రములున్ – పాయుట – ఎఱింగిన – జ్ఞాతి –

వర్గముల్ – డాసిన – బంధుమిత్రులున్ – ఒడంబడన్ – ఇచ్చిన – కొన్న – అప్పులున్ – పాసిన – ఇల్లు – ఊరు –ఎఱుంగఁగన్ – వానికిన్ – వేఱ – తెలుపన్ – తగున్.

**వ్యాఖ్య:** వేరుపడికూడా (పాసియున్) వేరుపడలేదని తరువాత (పైఁబడి) ఒకడు చెప్పినట్లయితే అప్పుడు విడివడ్డనాటి విడిపోయినప్పుడు రాసుకున్న (పాసిననాఁటి) పత్రాలూ విడిపోవడం తెలిసిన జ్ఞాతిసమూహాలూ దగ్గరచుట్టాలూ మిత్రులూ ఒప్పందంతో ఇచ్చిన పుచ్చుకొన్న అప్పులూ విడిచిన ఇల్లూ ఊరుకి తెలిసేలా వాడికి వేరుగా మళ్ళీ తెలపడం తగినది.

**147. సీ.** **గ్రామంబు పొలిమేర కలను చే నిలుపట్టు**
**కాలాంతరంబునఁ గలసెనేని**
**వృద్ధుల గొల్లల వేఁటకాండ్రను బొంతఁ**
**జేల గర్శనమెప్డుఁ జేయువారిఁ**
**బనిచిసీమకు మున్ను పాతినబొగ్గుల**
**నిటుకల రాలను నెమ్ముకలను**
**గట్టినకట్టలఁ బెట్టినమ్రాఁకులఁ**
**గ్రొచ్చినబావులఁ గూపములను**

**ఆ.వె.** **సీమఁదెలుపవలయు నేమియులేకున్న**
**నోలిఁ జుట్టుపట్ల యూళ్ళఁగలుగు**
**ప్రజలుసాక్షిగాను ప్రతిపక్షుఁ బట్టిన**
**నరుఁడు సీమదెలియ నడువవలయు**

**అన్వయం:** గ్రామంబు, పొలిమేర, కలను, చేను, ఇలుపట్టు – కాల – అంతరంబునన్ – కలసెనేనిన్ – వృద్ధులన్ – గొల్లలన్ – వేఁటకాండ్రను – పొంతన్ – చేలన్ – కర్శనము – ఎప్డున్ – చేయువారిన్ – పనిచి – సీమకున్ – మున్ను – పాతిన – బొగ్గులన్ – ఇటుకలన్ – రాలను –ఎమ్ముకలను – కట్టిన – కట్టలన్ – పెట్టిన – మ్రాఁకులన్ – గ్రొచ్చిన – బావులన్ – కూపములను – సీమన్ – తెలుపవలయున్ – ఏమియున్ – లేకున్నన్ – ఓలిన్ – చుట్టుపట్ల – ఊళ్ళన్ – కలుగు ప్రజలు – సాక్షిగా – ప్రతిపక్షున్ – పట్టిన – నరుఁడు – సీమ – తెలియన్ – నడువవలయున్.

**వ్యాఖ్య:** గ్రామంగానీ పొలిమేరగానీ కళ్ళంగానీ (కలను) చేనుగానీ ఇంటిస్థలంగానీ (ఇలుపట్టు) కాలాంతరంలో కొంతకాలానికి హద్దులు చెరిగిపోయి కలిసిపోతే

అప్పుడు వృద్ధుల్నీ, గొల్లల్నీ, వేఁటగాళ్ళను సమీపంలోని (పొంతన్) చేలలో ఎప్పుడూ సేద్యం (కర్శనము) చేసేవారినీ పంపి సీమకు ముందు పాతినబొగ్గులనూ ఇటుకరాళ్ళనూ ఎముకలనూ కట్టినకట్టలనూ పెట్టినచెట్లనూ (మ్రాఁకులన్) తవ్విన (గ్రొచ్చిన) బావులనూ దిగుడు బావులనూ(కూపములను) బట్టీ సీమను నిర్ణయించి తెలపాలి. అవేమీ లేకపోతే క్రమంగా చక్కగా (ఓలిన్) చుట్టుపక్కల ఊళ్ళలో ఉన్న ప్రజలను సాక్షుల్నిచేసి ప్రతిపక్షుడిని పట్టిన నరుఁడు సీమతెలుసుకొనేలా ప్రయత్నం సాగించాలి.

**148. కం.** **మునులేని సీమసంధికిఁ**
**బెనఁకువయై యున్నచోటఁ బెనఁకువపొలముం**
**జననెఱిఁగి యూరిధనమునఁ**
**బెనుపారఁగ రాజు పంచిపెట్టఁగవలయున్**

**అన్వయం:** మును – లేని – సీమసంధికిన్ – పెనఁకువ + ఐ – ఉన్నచోటన్ – పెనఁకువ – పొలమున్ – చన – ఎఱిఁగి – ఊరిధనమునన్ – పెనుపారఁగన్ – రాజు – పంచి –పెట్టఁగవలయున్.

**వ్యాఖ్య:** అంతకుముందు లేని సరిహద్దులకు సంబంధించి అవి కలిసే చోట (సంధికిన్) ఆ సంధిస్థలంకోసం వివాదమై (పెనఁకువ) ఉంటే అలా ఉన్నచోట ఆ తగాదాలో ఉన్న పొలాన్ని (పెనఁకువపొలమున్) తెలుసుకొని ఊరిధనంతో పెంపారగా రాజు పంచిపెట్టాలి.

**149. ఆ.వె.** **ఒకని పొలములోన నొకఁడు ధర్మార్థంబు**
**కొలను బావి నుయ్యి గ్రొచ్చుచోట**
**నడిగి చేయవలయు నొడయఁడు చేనికి**
**హాని కల్గునేని నాఁగఁదగును**

**అన్వయం:** ఒకఁడు – ధర్మ + అర్థంబు – ఒకని – పొలములోనన్ – కొలను – బావి – నుయ్యి – క్రొచ్చు – చోటన్ – అడిగి – చేయవలయున్. ఒడయఁడు – చేనికిన్ – హాని – కల్గునేనిన్ – ఆఁగన్ – తగును.

**వ్యాఖ్య:** ధర్మకార్యార్థంగా ఒకడు ఇంకొకడి పొలంలో చెరువుగానీ, బావిగానీ నుయ్యిగానీ తవ్వించాలనుకుంటే దానికి ముందుగా ఆ పొలం యజమానిని అడిగి అతడు ఒప్పుకుంటేనే ఆ పని చెయ్యాలి. ఆ పని చేయడం వల్ల చేనికి (చేనికిన్) హాని కలుగుతున్నట్లయితే దాని యజమానుడు (ఒడయఁడు) ఆ పని ఆపించేయవచ్చు (ఆగ దగును. ఆగు = ఆపించు. ఇది అంతర్భావిత ప్రేరణార్థక ధాతువు).

**150. చం. చెఱువొకరుండు కట్టిన విశేషపులాభము లేకయున్నచో**
**నెఱయఁగ వేఱొకండు తననేర్పునఁ గట్టఁ దలంచెనేనియుం**
**జెఱువొగిఁ గట్టి నాతనికిఁ జెప్పి యొడంబడ గట్టు టొప్పుఁ దా**
**నఱిముఱిఁగట్టెనేని ఫలమంతయు ముందటివానిపాలగున్**

**అన్వయం:** చెఱువు – ఒకరుండు – కట్టినన్ – విశేషము – లాభము – లేకన్ – ఉన్నచోన్ – నెఱయఁగన్ – వేఱొకండు – తన – నేర్పునన్ – కట్టన్ – తలంచెనేనియున్ – చెఱువు – ఒగిన్ – కట్టిన – ఆతనికిన్ – చెప్పి – ఒడంబడన్ – కట్టుట – ఒప్పున్ – తాన్ – అఱిముఱిన్ – కట్టెనేనిన్ – ఫలము – అంతయున్ – ముందటివాని – పాలు – అగున్.

**వ్యాఖ్య:** ఒకడు చెఱువు తవ్విస్తే దానివల్ల విశేషలాభం లేకపోతే వేరే ఇంకొకడు దానిని విస్తరించేలా (నెఱయఁగన్) తననేర్పుతో కట్టాలనుకొంటే, ఆ చెఱువును ముందు నిర్మించినవాడికి చెప్పి ఒప్పందం కుదుర్చుకొని నిర్మించడం ఒప్పు. అలాకాక తొందరపడి (అఱిముఱిగాన్) కడితే ఆ ఫలమంతా ముందు చెరువు తవ్వించిన వాడి పాలవుతుంది.

**151. కం. దున నియ్యకొన్న కృషికుఁడు**
**దునకయ యున్నేని నొకనిఁ దున్నింపఁదగున్**
**దునక దుననీక యాఁగినఁ**
**గొననగుఁ జేనియరియుఁ గోఱునతనిచేన్**

**అన్వయం:** దునన్ – ఇయ్యకొన్న – కృషికుఁడు – దునకయ – ఉన్నేనిన్ – ఒకనిన్ – దున్నింపన్ – తగున్. దునక – దుననీక – ఆఁగినన్ – చేని – కోఱున్ + అరియున్ – అతనిచేన్ – కొనన్ – అగున్.

**వ్యాఖ్య:** పొలం యజమాని రైతుకు పొలాన్ని కౌలుకు ఇస్తే – దున్నడానికి – దున్నుకోవడానికి అంగీకరించిన (ఇయ్యకొన్న) రైతు – కృషికుడు తాను దున్నకుండా పొలాన్ని అలాగే ఉంచితే ఆ యజమాని ఆ పొలాన్ని వేరొకడితో దున్నించుకోవచ్చు. అయితే మొదట కౌలుకు పుచ్చుకున్న రైతు వేరేవాడిని రానివ్వకుండా – పొలాన్ని తాను దున్నక ఇతరుడిని దున్ననివ్వకుండా ఉంటే తద్వారా పొలం దున్నడం ఆగినట్లయితే – ఫలసాయంలో భాగంగా (కోఱు) ఇవ్వవలసిన కౌలునూ ఆ పొలానికి సంబంధించిన శిస్తునూ (అరి) అతడినుంచే – అడ్డుకున్నవాడినుంచే వసూలు చేయాలి.

**152. కం.** **తజ్ఞులకుఁ దెలియునట్లుగఁ**
**బ్రాజ్ఞులు మదిమెచ్చఁ దెలుఁగుపద్యములను ద**
**త్త్వజ్ఞుఁడు మ్రానయకేతన**
**విజ్ఞానేశ్వరము జగతివెలఁగం జెప్పెన్**

**అన్వయం:** తజ్ఞులకున్ – తెలియునట్లుగన్, ప్రాజ్ఞులు – మదిమెచ్చన్, తెలుఁగు పద్యములను, తత్త్వజ్ఞుఁడు – మ్రానయ కేతన – విజ్ఞానేశ్వరము – జగతి – వెలఁగన్ – చెప్పెన్.

**వ్యాఖ్య:** తత్వజ్ఞుడైన మ్రానయకేతన విజ్ఞులకు (తజ్ఞులకున్) తెలిసేవిధంగా ప్రజ్ఞాధురీణులయిన పండితులు విశేషజ్ఞులు (ప్రాజ్ఞులు) మనస్ఫూర్తిగా మెచ్చుకొనేవిధంగా తెలుఁగుపద్యాలతో విజ్ఞానేశ్వరము అనే గ్రంథాన్ని లోకంలో ప్రకాశించేరీతిలో (జగతిన్ వెలఁగఁన్) చెప్పాడు (తద్జ్ఞులు – ప్రాజ్ఞులు ఇత్యాది ప్రాసమైత్రి!).

★★★

# పద్య గద్యానుక్రమణిక


| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | అంగద నర్థించినట్టి | ప్రాయ.140 | 23 | అర్థిఁ బిలిచి నీ | వ్యవ.9 |
| 2 | అంగన సంగతి | ఆచా.65 | 24 | అర్థిఁదోడ్తెచ్చిన నాకుల | వ్యవ.100 |
| 3 | అంగవిహీనునైన | ప్రాయ.42 | 25 | అర్థియుఁ బత్రిక | వ్యవ.15 |
| 4 | అంటరానివారి | ఆచా.56 | 26 | అశ్వముల గోర్పడంబుల | ఆచా.32 |
| 5 | అచ్చుగల కులమువారై | ప్రాయ.114 | 27 | ఆఁకనుండి పాడియాడి | వ్యవ.71 |
| 6 | అచ్చులుఁ ద్రాసులుఁ | ప్రాయ.65 | 28 | ఆఁగిన నిలువనియాతం | వ్యవ.14 |
| 7 | అడిచెద నని | ప్రాయ.51 | 29 | ఆగమ పత్రము సాక్షియు | వ్యవ.30 |
| 8 | అతిథుల కభ్యాగతులకు | ఆచా.70 | 30 | ఆచారపరుఁడె | ఆచా. 8 |
| 9 | అనుచరుఁడు పరా | వ్యవ.62 | 31 | ఆదట గర్భాధానం | ఆచా. 12 |
| 10 | అనుపనీత ద్విజుండును | ఆచా.54 | 32 | ఆదట ముసు వాసిన | వ్యవ.141 |
| 11 | అనుపనీతుతోడ నాలితోఁ | ఆచా.31 | 33 | ఆధికులమేర నిక్షే | వ్యవ.39 |
| 12 | అన్నదమ్ముఁడైన | వ్యవ.85 | 34 | ఆయుధంబులుగల | ప్రాయ.135 |
| 13 | అప్పిచ్చి నతని యాకును | వ్యవ.38 | 35 | ఆలికిఁ బుత్రుల కీఁదగ | ప్రాయ.27 |
| 14 | అప్పిచ్చినవారలు తమ | వ్యవ.74 | 36 | ఆలును దండ్రియున్ | వ్యవ.142 |
| 15 | అప్పుగొని పెట్టనొల్లక | వ్యవ.73 | 37 | ఆవిప్రు లేద్విరైనను | వ్యవ.3 |
| 16 | అప్పుడు నిక్షేప | వ్యవ.17 | 38 | ఇంతగొనియె నీతండని | వ్యవ.44 |
| 17 | అభియోగించిన సత్యం | వ్యవ.115 | 39 | ఇచ్చిన కన్యక మగుడం | ఆచా.105 |
| 18 | అమ్మినధన మొడయఁడు | ప్రాయ.79 | 40 | ఇతఁడింత గొనియె | వ్యవ.22 |
| 19 | అరయక విల్చిన | ప్రాయ.30 | 41 | ఇది తప్పగు నీ తప్పున | ప్రాయ.2 |
| 20 | అరుణోదయమున | ఆచా.63 | 42 | ఇది నాప్రతిజ్ఞ యని | వ్యవ.24 |
| 21 | అరువంగఁ బూఁట | వ్యవ.87 | 43 | ఇనుప తెలె న్మంటితెలెన్ | ఆచా.72 |
| 22 | అర్థంబుఁ గొనక | ఆచా.98 | 44 | ఇనుమడియైన | వ్యవ.96 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 45 | ఇనుమున నేఁబది | వ్యవ.118 | 78 | ఒక్క కన్నియకును | ఆచా.107 |
| 46 | ఇనుమును బొదిగిన | ఆచా.71 | 79 | ఒక్కచాయపూఁట | వ్యవ.90 |
| 47 | ఇన్నాళ్ళ కింతపెట్టక | వ్యవ.92 | 80 | ఒక్కనిఁ బెక్కం | ప్రాయ.54 |
| 48 | ఇరులున నొంటిబోఁ | ప్రాయ.105 | 81 | ఒక్కింతకొలమువారిని | ప్రాయ.115 |
| 49 | ఇరువది యేఁడులు | వ్యవ.46 | 82 | ఒడఁబడని పణ్యకాంతల | ప్రాయ.113 |
| 50 | ఇల్లుగట్టించి యందెల్ల | ప్రాయ.41 | 83 | ఒడఁబడిక రోయిగొని | వ్యవ.70 |
| 51 | ఈయేటినెలను నీ తిథి | వ్యవ.19 | 84 | ఒడఁబాటు బొంకుసే | వ్యవ.16 |
| 52 | ఉత్తమపురుషుని | ప్రాయ.99 | 85 | ఒడయఁడు నిక్షేపపు ధన | వ్యవ.99 |
| 53 | ఉత్తమమగు ద్రవ్యంబును | వ్యవ.126 | 86 | ఒడయని యనుమతి | వ్యవ.98 |
| 54 | ఉత్తమసతి శూద్రులతోఁ | ఆచా.113 | 87 | ఓంకారమగ్ని శశి పితృ | ఆచా.29 |
| 55 | ఉద్దులవుఁ బెనఁకు | ప్రాయ.119 | 88 | ఓడినతఁ డింత | వ్యవ.26 |
| 56 | ఊరి మునుమందత్రోవల | ప్రాయ.6 | 89 | ఓలినివడ్డిని గొలములు | వ్యవ.65 |
| 57 | ఊరికిఁ జేనికి నడు మెడ | ప్రాయ.18 | 90 | కట్టఁ దగని వృష | ప్రాయ.75 |
| 58 | ఎందుమాడలోని | ప్రాయ.8 | 91 | కన్నియఁ దగు | ఆచా.103 |
| 59 | ఎక్కువకులం బతనికిని | ప్రాయ.107 | 92 | కపట వర్ణ రజత | ప్రాయ.130 |
| 60 | ఎక్కువకులజుం | ప్రాయ.123 | 93 | కరణమ ముచ్చి | ప్రాయ.102 |
| 61 | ఎక్కువవెల ద్రవ్యంబులు | ప్రాయ.98 | 94 | కలయర్థమెల్ల సభలో | వ్యవ.28 |
| 62 | ఎడవడకుండం గుడిచిన | వ్యవ.49 | 95 | కానీనుం డగుఁ గన్యా | ఆచా.124 |
| 63 | ఎనిమిదవపాలు | ప్రాయ.14 | 96 | కామాంధ్యముతోఁ | ప్రాయ.111 |
| 64 | ఎనిమిదియేఁడులు | వ్యవ.83 | 97 | కాయగూర కట్టె | ప్రాయ.96 |
| 65 | ఎనుమునకు బందె | ప్రాయ.4 | 98 | కాలములు మూఁడుఁ | ఆచా.41 |
| 66 | ఎవ్వరులేనెడ నొక్కఁడు | ప్రాయ.50 | 99 | కావఁ గొనిపోయి | ప్రాయ.11 |
| 67 | ఏ యంగముఁ గొని | ప్రాయ.47 | 100 | కుక్క నక్కఁ బందిఁగోడి | ఆచా.57 |
| 68 | ఏపార గోవుఁ జంపిన | ప్రాయ.59 | 101 | కుడిచిన తుది | ఆచా.80 |
| 69 | ఒకఁ డుదకంబులు | ఆచా.75 | 102 | కుడిచిన నెంగిలి | ఆచా.81 |
| 70 | ఒకఁ డొకనితోడి | వ్యవ.23 | 103 | కుడిచినకంటెను క్షేత్రము | వ్యవ.48 |
| 71 | ఒకతల్లిగన్న సుతులం | ఆచా.134 | 104 | కుడిచినతఁ డరువ | వ్యవ.88 |
| 72 | ఒకని నెవ్వ రెఱుంగ | ప్రాయ.103 | 105 | కుదుపుం బత్రము | వ్యవ.32 |
| 73 | ఒకని పొలములోన | వ్యవ.149 | 106 | కుల మొక్కటియై | ఆచా.92 |
| 74 | ఒకనికిఁ గూఁతు నిచ్చి | ఆచా.106 | 107 | కులదేశాచారంబులు | ఆచా. 9 |
| 75 | ఒకనికిని జంపను | ప్రాయ.101 | 108 | కులమున నధికుం | ఆచా.91 |
| 76 | ఒకపనిఁ బ్రతికెదువారికి | వ్యవ.33 | 109 | కులమున సరియగు | ప్రాయ.108 |
| 77 | ఒక్కఁడు మానుష | వ్యవ.31 | 110 | కూటిముడి మోచు | ఆచా.79 |

| | | |
|---|---|---|
| 111 | కొడుకులు గల | వ్యవ.138 |
| 112 | కొడుకులు వేరైన | వ్యవ.135 |
| 113 | కొఱనుగ నాఁగిన | ప్రాయ.15 |
| 114 | కొలుచాదిగఁ గల | ప్రాయ.68 |
| 115 | కోమటికి శూద్రభామిని | ఆచా.138 |
| 116 | కోమటికిని శూద్రునకును | ఆచా.141 |
| 117 | కోఱకొమ్ముగలుగు | ప్రాయ.132 |
| 118 | క్రతువునకు ఋత్విజుండై | ఆచా.96 |
| 119 | క్రమమఱి శూద్రుఁడు | ప్రాయ.46 |
| 120 | క్రొత్తకుండలోనఁ | వ్యవ.121 |
| 121 | క్షేత్రజుఁ డాదిగఁ | ఆచా.132 |
| 122 | ఖలులతో నెమ్మెయిఁ | ప్రాయ.60 |
| 123 | ఖ్యాత శుభచరితుఁడను | ఆచా. 4 |
| 124 | గనులలోపలఁ దటాకము | ఆచా.36 |
| 125 | గరళానల శస్త్రాదులఁ | ప్రాయ.63 |
| 126 | గర్భాది సంస్కారకర్తయై | ఆచా.84 |
| 127 | గర్భాధానంబాదిగాఁ | ఆచా. 11 |
| 128 | గర్భాష్టమాదిగాఁగను | ఆచా. 18 |
| 129 | గాలిని దెవులున | వ్యవ.143 |
| 130 | గుదమునం దేను | ఆచా.39 |
| 131 | గురుఁ దల్లిని దండ్రిని | ప్రాయ.43 |
| 132 | గురుజను లెఱుఁగక | ఆచా.101 |
| 133 | గురునకు శిష్యుఁడు | ప్రాయ.35 |
| 134 | గురుపూజచేసి | ఆచా.90 |
| 135 | గొఱకై బ్రాహ్మణకన్యక | ఆచా.140 |
| 136 | గొల్లఁడు వ్యాధుఁడు | వ్యవ.80 |
| 137 | గోమేధము సేయుట | ఆచా.133 |
| 138 | గోష్ఠంబు నదియును | ఆచా. 25 |
| 139 | గ్రామంబు పొలిమేర | వ్యవ.147 |
| 140 | చండాలితో ద్విజుం | ప్రాయ.126 |
| 141 | చందనాగరు రత్న | ప్రాయ.70 |
| 142 | చంపినవానిని సరిగాఁ | ప్రాయ.64 |
| 143 | చరణములు కేలు | ఆచా.67 |

| | | |
|---|---|---|
| 144 | చాకి బోయవాఁడు | ఆచా.58 |
| 145 | చారుతరలీలమై | ఆచా. 13 |
| 146 | చాలం బుత్త్రులు గల్గిన | ఆచా.118 |
| 147 | చిక్కని చక్కని నున్నని | ఆచా. 22 |
| 148 | చిరిఁగినఁ దునిసినఁ | వ్యవ.111 |
| 149 | చివికిన యజినము | ఆచా.26 |
| 150 | చీఁకుం బిచ్చుక | వ్యవ.144 |
| 151 | చూపుదుపూఁట యతఁడు | వ్యవ.86 |
| 152 | చూలై యుండఁగ | ఆచా.130 |
| 153 | చెడినధనంబు మ్రుచ్చు | ప్రాయ.23 |
| 154 | చెడినధనము చేరినఁ | వ్యవ.56 |
| 155 | చెడినధనము తనధన | ప్రాయ.25 |
| 156 | చెడినసొమ్మెవ్వనిచేనుండు | ప్రాయ.90 |
| 157 | చెప్పక చూపక కలిగిన | ఆచా.108 |
| 158 | చెఱువొకరుండు కట్టిన | వ్యవ.150 |
| 159 | చేరినధనంబు భూపతి | వ్యవ.55 |
| 160 | చౌటనేల మన్ను | ఆచా.38 |
| 161 | జగతీశుఁడు పడిన | వ్యవ.57 |
| 162 | జనకుఁడు గొన్న | వ్యవ.84 |
| 163 | జనకుఁడు తనుఁ | వ్యవ.129 |
| 164 | జనకుఁడు తాతయు | ఆచా.102 |
| 165 | జనకుండు తోడఁబుట్టుగు | వ్యవ.12 |
| 166 | జనకుఁడు పరదేశ | వ్యవ.82 |
| 167 | జనకుఁడు మొదలుగ | ఆచా.104 |
| 168 | జనకుని ధనమును | వ్యవ.128 |
| 169 | జనకుని వస్త్రంబులు | వ్యవ.133 |
| 170 | జనకునితో రెండైనను | వ్యవ.123 |
| 171 | జననియు జనకుఁడు | ఆచా.127 |
| 172 | జనపతి యన్యాయంబు | వ్యవ.5 |
| 173 | జనపతిచే మ్రుచ్చులచే | ప్రాయ.82 |
| 174 | జనులెఱుంగఁ బాడి | వ్యవ.140 |

| | | |
|---|---|---|
| 175 | జన్నిదము శిఖయు | ఆచా. 24 |
| 176 | జాతర పెండ్లి యుత్స | వ్యవ.10 |
| 177 | జీవముకొఱకును | ప్రాయ.139 |
| 178 | జూదపువారల పొందులు | ప్రాయ.39 |
| 179 | డాచే లింగము గైకొని | ఆచా.37 |
| 180 | తండ్రితోడఁ గొడుకు | వ్యవ.53 |
| 181 | తగవరియగు తానొంచి | ప్రాయ.122 |
| 182 | తగువరునిఁ బిలిచి | ఆచా.95 |
| 183 | తజ్ఞులకుఁ దెలియు | వ్యవ.152 |
| 184 | తత విజ్ఞానేశమతము | ఆచా. 10 |
| 185 | తన గోత్రము నతఁ | ఆచా.122 |
| 186 | తన ధనము కానిదానిన్ | ప్రాయ.21 |
| 187 | తన ధనముగానిదానిం | ప్రాయ.19 |
| 188 | తన పుట్టింపమి | ఆచా.129 |
| 189 | తన మనములోన | ఆచా.40 |
| 190 | తన యాగమునకు | ఆచా.86 |
| 191 | తన రోపట్టిన యర్థము | వ్యవ.94 |
| 192 | తనకంటె నధికుఁ | ప్రాయ.45 |
| 193 | తనకుం గార్యము | వ్యవ.4 |
| 194 | తనచే నర్థము వడ్డికిఁ | వ్యవ.77 |
| 195 | తనధన మొక్కనిచేతన్ | ప్రాయ.22 |
| 196 | తనపడసిన సొమ్మయిన | వ్యవ.122 |
| 197 | తనయ విహీనుఁడు | వ్యవ.145 |
| 198 | తనరోయిడుధన | వ్యవ.95 |
| 199 | తనరోవెట్టిన ధనమును | వ్యవ.93 |
| 200 | తపమును దానముం | వ్యవ.101 |
| 201 | తప్పకసాక్షులముందట | వ్యవ.112 |
| 202 | తల దండమున వ్రేయఁ | వ్యవ.54 |
| 203 | తల నుదురు ముక్కు | ఆచా. 23 |
| 204 | తలగొఱిగించి కుక్కడుగు | వ్యవ.42 |
| 205 | తల్లితోఁబుట్టువు | ప్రాయ.106 |
| 206 | తల్లియుఁ దండ్రియుఁ | ఆచా.131 |

| | | |
|---|---|---|
| 207 | తా నేమఱి గొల్లండొక | ప్రాయ.12 |
| 208 | తా సోమరియై సంధ్యో | ఆచా.46 |
| 209 | తాతల తండ్రుల | వ్యవ.50 |
| 210 | తాన తన పసుల నొద్దుల | ప్రాయ.7 |
| 211 | తానెసాక్షిఁజెప్పఁ | వ్యవ.105 |
| 212 | తిట్టాట ఱంకు మ్రుచ్చిమి | వ్యవ.103 |
| 213 | తిట్టెనితఁ డడిచె | వ్యవ.25 |
| 214 | తురగమునకుఁ బణము | ప్రాయ.86 |
| 215 | తులయును నగ్నియు | వ్యవ.113 |
| 216 | తులవిప్రులకును క్షత్రియ | వ్యవ.114 |
| 217 | తూలెడు తనప్రాణ | ప్రాయ.32 |
| 218 | తెలియఁ బ్రజాపతి | ఆచా.51 |
| 219 | తొమ్మిదిచిల్లుల | ఆచా.49 |
| 220 | తొలఁగుము తొలంగు | ప్రాయ.131 |
| 221 | తొలునాఁడు శోధ్యునిఁ | వ్యవ.117 |
| 222 | త్రోయక విప్రుఁడు | ప్రాయ.125 |
| 223 | దండాజిన కౌపీన | ఆచా. 20 |
| 224 | దండింపఁగ దగనివారల | వ్యవ.7 |
| 225 | దండు వన్యాయముగఁ | వ్యవ.41 |
| 226 | దర్భ యవశ్యము | ఆచా.48 |
| 227 | దాసుఁడు భృత్యుఁడు | ప్రాయ.36 |
| 228 | దున నియ్యకొన్న | వ్యవ.151 |
| 229 | దేవ బ్రాహ్మణ బాధలు | ప్రాయ.1 |
| 230 | దేవసమూహంబెల్లను | ప్రాయ.57 |
| 231 | దేశాంతర మరిగియు | ఆచా.33 |
| 232 | దైవమానుషములఁ | వ్యవ.97 |
| 233 | దోషరహితకన్యకపై | ఆచా.109 |
| 234 | ద్యూతధనంబు | వ్యవ.72 |
| 235 | ద్విజుఁడవినీతుండై | ప్రాయ.89 |
| 236 | ద్విజులు భిక్షాచర్య | ఆచా. 19 |
| 237 | ధన మప్పుగొనుట | వ్యవ.35 |
| 238 | ధనధాన్యము లెక్కాలము | వ్యవ.68 |
| 239 | ధనమప్పుగొనిన | వ్యవ.110 |

| | | |
|---|---|---|
| 240 | ధనమరువలేని పేదలఁ | వ్యవ.76 |
| 241 | ధనమింత గొనియె | వ్యవ.43 |
| 242 | ధనము గలదు పుత్త్రులు | ఆచా.123 |
| 243 | ధనముగని యిచ్చి | వ్యవ.63 |
| 244 | ధనముగలిగి | ఆచా.88 |
| 245 | ధరణీనాథుడు క్రోధలో | వ్యవ.1 |
| 246 | నడవంజాలనివారలఁ | వ్యవ.18 |
| 247 | నలి శూద్రుఁడు విప్రా | ప్రాయ.138 |
| 248 | నలుమూలయు | ఆచా.66 |
| 249 | నా కొరు లేరును | ఆచా.128 |
| 250 | నానార్థములు లిఖించిన | వ్యవ.29 |
| 251 | నాయంత బ్రతుకనేర్తుం | వ్యవ.125 |
| 252 | నాలుగు వర్ణములందును | వ్యవ.131 |
| 253 | నిచ్చ నిచ్చ వడ్డి | వ్యవ.66 |
| 254 | నెనడు మెదడు మలము | ఆచా.42 |
| 255 | నెయ్యమున నడిగిపు | ఆచా.100 |
| 256 | నెఱిఁ బొడిచెడు | ప్రాయ.133 |
| 257 | నెఱిగల విప్రుండయినను | ఆచా.30 |
| 258 | నెఱిమాలి బందెవెట్టిన | ప్రాయ.93 |
| 259 | నెలకొని యొకచోట | వ్యవ.45 |
| 260 | నెలనాళ్లు సునియతుండై | ఆచా.74 |
| 261 | నెలనెల రాజొక | ప్రాయ.73 |
| 262 | నెలప్రతి కల్పించునెడన్ | ప్రాయ.74 |
| 263 | నెలలు నాలుగింట | ఆచా. 17 |
| 264 | నేరని వెజ్జఱికము దా | ప్రాయ.67 |
| 265 | పంచపర్వంబులందును | ఆచా.45 |
| 266 | పంచినపని వెరవునఁ | ఆచా.115 |
| 267 | పండిన చేనిలోపల | ఆచా.35 |
| 268 | పడినధనము కనిన | వ్యవ.58 |
| 269 | పతి పంచినంత | ఆచా.117 |
| 270 | పతి యున్నను పతి | ఆచా.116 |
| 271 | పదిపదునొకంట వడ్డి | వ్యవ.67 |
| 272 | పదియాఱువ్రేళుల | వ్యవ.119 |
| 273 | పదియింటికి నొకటియు | ప్రాయ.78 |
| 274 | పదియు నరగుంజ | ప్రాయ.9 |
| 275 | పదియేఁడులు తన ధన | వ్యవ.47 |
| 276 | పనివాసి నూటనైదును | ప్రాయ.31 |
| 277 | పరదారగామిఁ జోరుని | ప్రాయ.127 |
| 278 | పరపూర్వ లయిన | ఆచా.110 |
| 279 | పరికింపఁగా బొద్దుబంటి | వ్యవ.120 |
| 280 | పరులఁ గొననీక | ప్రాయ.72 |
| 281 | పలికినకంటెను | ప్రాయ.34 |
| 282 | పలువురు యువతులుఁ | వ్యవ.124 |
| 283 | పసగా జీతము వెట్టక | ప్రాయ.37 |
| 284 | పాడినోడినయాతండు | వ్యవ.75 |
| 285 | పానస్త్రీద్యూ తాదుల | వ్యవ.78 |
| 286 | పాలొండె ముండు | ఆచా.44 |
| 287 | పాసియు వేరువాయనని | వ్యవ.146 |
| 288 | పిడికెడు పిడికెడు | ప్రాయ.100 |
| 289 | పితృధన మితరులచే | వ్యవ.130 |
| 290 | పీడం బొందక | వ్యవ.13 |
| 291 | పీనుఁగు మాలని | ఆచా.59 |
| 292 | పుత్త్రార్థముగా నడిగినఁ | ఆచా.126 |
| 293 | పుత్త్రులు లేరు నాకు | ఆచా.121 |
| 294 | పురిటి మొదవు | ప్రాయ.13 |
| 295 | పూని తన పాత్ర | ఆచా.76 |
| 296 | పూర్వాభిముఖమొండెఁ | ఆచా.52 |
| 297 | పెండ్లి చేసిన నిలుచెడి | వ్యవ.127 |
| 298 | పెక్కం డ్రొక్కటియై | ప్రాయ.80 |
| 299 | పెక్కండ్రు గూడి | ప్రాయ.38 |
| 300 | పెక్కండ్రు చూచు | ఆచా.73 |
| 301 | పెక్కండ్రు పూఁటవారలు | వ్యవ.89 |
| 302 | పెక్కండ్రు సమయమునఁ | ప్రాయ.71 |
| 303 | పెక్కిండ్ల భిక్షఁ | ఆచా.64 |
| 304 | పెక్కుదెఱుంగులఁ | వ్యవ.60 |
| 305 | పెనఁకువ నోడిన | వ్యవ.21 |

| | | |
|---|---|---|
| 306 | పెలుచనొకం డడుచు | వ్యవ.34 |
| 307 | పొందుగాని పొందు | ప్రాయ.24 |
| 308 | పొడవను జంపనుం | ప్రాయ.97 |
| 309 | పొత్తునఁ గుటుంబ | వ్యవ.79 |
| 310 | పొత్తున జనకుండు | వ్యవ.132 |
| 311 | పొత్తులవా రెడపడినం | ప్రాయ.81 |
| 312 | పొలఁతికిని గర్భ | ఆచా. 14 |
| 313 | పొల మిల్లు తోఁట | ప్రాయ.104 |
| 314 | పోఁతనీళులకంటె | ఆచా.50 |
| 315 | ప్రతిలోమజాతుఁ | ఆచా.142 |
| 316 | ప్రాణాపానవ్యానో | ఆచా.83 |
| 317 | ప్రాణాహుతులు | ఆచా.69 |
| 318 | ప్రియమున ధనలోభ | వ్యవ.6 |
| 319 | ప్రీతిఁ గులశ్రేష్ఠునిపై | ప్రాయ.48 |
| 320 | ప్రీతి మంచముపైనుండి | ఆచా.53 |
| 321 | బండలుబూతులు | ప్రాయ.116 |
| 322 | బంధుజనులు నొక్కపని | వ్యవ.51 |
| 323 | బడబాగ్న్యనలాగస్త్యులు | ఆచా.82 |
| 324 | బలిమి భయముఁజూపి | వ్యవ.52 |
| 325 | బాలకుండు వృద్ధు | వ్యవ.104 |
| 326 | బుద్ధిహీన బాల | వ్యవ.11 |
| 327 | భక్ష్యభోజ్యలేహ్య | ప్రాయ.128 |
| 328 | భూదేవుఁడు శూద్ర స్త్రీ | ఆచా.136 |
| 329 | భూనాథుని యందల | ప్రాయ.136 |
| 330 | భూపతిఁ దిట్టినవానిన్ | ప్రాయ.134 |
| 331 | భూమ్యాది సత్యాంత | ఆచా.62 |
| 332 | భూవల్లభు వేదవిదుని | ప్రాయ.49 |
| 333 | మందులఁ గొలుచుల | ప్రాయ.69 |
| 334 | మగఁ డీల్గఁ గన్య | ఆచా.111 |
| 335 | మగని దిగవిడిచి | ఆచా.125 |
| 336 | మగవారితోడిపాడికిఁ | వ్యవ.61 |
| 337 | మడివా లొడయని | ప్రాయ.61 |
| 338 | మనసునకు నొప్పి | ప్రాయ.121 |
| 339 | మనుమలు తాత ధనము | వ్యవ.134 |
| 340 | మాటలునేరక పలికిన | వ్యవ.27 |
| 341 | మానవు లెదురం | ప్రాయ.117 |
| 342 | మానిత విద్యాతపములు | ఆచా.89 |
| 343 | మారెడు మోదుగ | ఆచా. 21 |
| 344 | మీఁదియన్నంబులో | ఆచా.68 |
| 345 | ముందరవేఱై పిదపం | వ్యవ.139 |
| 346 | మునివరుఁడు యాజ్ఞవ | ఆచా. 6 |
| 347 | ముసు దాఁ దిట్టిన | ప్రాయ.118 |
| 348 | మును విప్రునకును | ఆచా.135 |
| 349 | మును సకలశాస్త్రధర్మము | ఆచా. 5 |
| 350 | మునుపు వరించిన | ప్రాయ.33 |
| 351 | మునులేని సీమసంధికిఁ | వ్యవ.148 |
| 352 | మున్ను వివాహము | ఆచా.119 |
| 353 | ముఱికినాటివారు | ప్రాయ.56 |
| 354 | మెండియపు వ్రేల | ఆచా.77 |
| 355 | మెడ చెయ్యి కన్ను | ప్రాయ.53 |
| 356 | మేలగు విప్రుఁడు | ఆచా.94 |
| 357 | మొండిఁడు పాపకర్ముఁడు | ప్రాయ.124 |
| 358 | మొదలఁ బాడిదీర్చి | వ్యవ.40 |
| 359 | మొదలిటి ఆఱును | ఆచా.43 |
| 360 | మొదలిటి పత్రములెల్లను | వ్యవ.37 |
| 361 | మొదవులు రెం | ఆచా.97 |
| 362 | మ్రానయకును గంగమ | ఆచా. 3 |
| 363 | మ్రుచ్చిమి పొరపిన | ప్రాయ.94 |
| 364 | మ్రుచ్చిలిన ధనము | వ్యవ.59 |
| 365 | మ్రుచ్చును బట్టిన | ప్రాయ.91 |
| 366 | మ్రుచ్చులు తెక్కలి | ప్రాయ.40 |
| 367 | యాగార్థ మడిగి | ఆచా.87 |
| 368 | రమణియు రమణుఁడు | ఆచా.99 |
| 369 | రాజన్యువలన వైశ్య | ఆచా.137 |
| 370 | రాజానుభవమగు | ప్రాయ.84 |
| 371 | రాజిత విప్రాంగనకును | ఆచా.139 |

| | | |
|---|---|---|
| 372 | రాజునకుఁ గీడు పుట్టెడు | ప్రాయ.137 |
| 373 | రెండును నాలుగు | ప్రాయ.55 |
| 374 | రెట్టించిన యర్థము | వ్యవ.91 |
| 375 | రేపకడ గోవుపంచిత | ప్రాయ.58 |
| 376 | రేపటిపూఁట నెన్నికొని | ప్రాయ.10 |
| 377 | రోయిగొని పెట్టజాలక | వ్యవ.69 |
| 378 | రోయిగొని వడ్డికిచ్చినఁ | వ్యవ.64 |
| 379 | రోయిడి యొల్లని | ప్రాయ.109 |
| 380 | ఱంకుఁ గని మ్రుచ్చు | ప్రాయ.129 |
| 381 | లొట్టేనుఁగంత పొడవున | ప్రాయ.5 |
| 382 | వజ్ర చక్రత్రిశూలముల్ | ఆచా.47 |
| 383 | వడుగున నుద్వాహక్రియ | ఆచా.28 |
| 384 | వడుగునకు శ్రాద్ధ | ఆచా.27 |
| 385 | వడ్డింపఁగ నెంగిలి | ఆచా.78 |
| 386 | వనిత పతిచేతఁ బడసిన | వ్యవ.136 |
| 387 | వర్ణములు బ్రాహ్మణ | ఆచా.85 |
| 388 | వల చెవి జన్నిద మిడి | ఆచా.34 |
| 389 | వాకొను తెరువుఁ | వ్యవ.36 |
| 390 | వాని తల్లి తోఁ బుట్టును | ప్రాయ.44 |
| 391 | విచ్చలవిడి బలవంతుం | వ్యవ.8 |
| 392 | వినికిగల్గువారి | వ్యవ.2 |
| 393 | విను నూఱుమాడలకు | వ్యవ.116 |
| 394 | వివిధకళా నిపుణుఁడ | ఆచా. 2 |
| 395 | వీని ధనం బిది గాదని | ప్రాయ.20 |
| 396 | వెడలఁగనీక గొంది | ఆచా.112 |
| 397 | వెఱచినవానిచే | ప్రాయ.29 |
| 398 | వెల యెనిమిదియగు | ప్రాయ.62 |
| 399 | వెలగూడి మెచ్చి | ప్రాయ.28 |
| 400 | వెలగొని యమ్మిన | ప్రాయ.76 |
| 401 | వెలగొని యమ్మినబండ | ప్రాయ.77 |
| 402 | వెలగొనియెడు వేశ్యాదుల | ప్రాయ.112 |
| 403 | వెలయఁగ సొమ్ముతోడ | ప్రాయ.95 |
| 404 | వెలసినవిద్యయు | ప్రాయ.88 |
| 405 | వెలుగునఁ బిడికెఁడు | ప్రాయ.17 |
| 406 | వేదవిదునిచేత విన్నాణి | ప్రాయ.87 |
| 407 | వేఱొకని సొమ్ము | ప్రాయ.26 |
| 408 | వ్యవహారాసక్తునకై | వ్యవ.20 |
| 409 | వ్రేఁకనిబండివానికిని | ప్రాయ.16 |
| 410 | శాఖ దిగవిడిచి తాఁ బర | ఆచా. 7 |
| 411 | శుభగుణములు | వ్యవ.102 |
| 412 | శూద్రియ శూద్రభార్య | ఆచా.93 |
| 413 | శ్రాద్ధయాగగ్రహణ | ఆచా.55 |
| 414 | శ్రీవాణీ గిరిజేశ దంతి | ఆచా. 1 |
| 415 | సంవత్సరంబు మాసముఁ | వ్యవ.109 |
| 416 | సతి తన కొన్న | వ్యవ.81 |
| 417 | సతియుం బతియును | ప్రాయ.66 |
| 418 | సత్యమంతయుఁ జెడు | వ్యవ.106 |
| 419 | సభలోనఁ జయ్యన | వ్యవ.108 |
| 420 | సర కమ్మెడు బేహారులు | ప్రాయ.83 |
| 421 | సరిగా నొండొరువులతోఁ | ప్రాయ.120 |
| 422 | సాక్షులు దుష్టాత్మకులై | వ్యవ.107 |
| 423 | సారపు నిజవంశంబునఁ | ఆచా.120 |
| 424 | సుంకపుటిండుల నాగిన | ప్రాయ.85 |
| 425 | సుతుఁ దుదయించు నప్డు | ఆచా. 15 |
| 426 | సురసేవించిన వాతి | ఆచా.114 |
| 427 | సూతకము బొడ్డు | ఆచా. 16 |
| 428 | సూతకిఁ బీనుఁగు | ఆచా.60 |
| 429 | సొమ్ముతో బట్టి | ప్రాయ.92 |
| 430 | స్త్రీ ధనంబు పేరఁ | వ్యవ.137 |
| 431 | స్త్రీలును గోవులు విప్రులు | ప్రాయ.3 |
| 432 | స్నానమున భోజనంబున | ఆచా.61 |
| 433 | హీనుం దుత్తమకన్యక | ప్రాయ.110 |
| 434 | హీనుని నడిచిన | ప్రాయ.52 |

అప్పనమంత్రి

# చారుచర్య

(Health and Hygiene)

వ్యాఖ్యాత

**డా. అద్దంకి శ్రీనివాస్**

# అంకితం



**శ్రీమాన్ డా. ద్వా.నా. శాస్త్రి**గారికి

చారుతరమూర్తి సాహితీ సవ్యసాచి
అజుని రాణికి ఈతడే అమ్మకూచి
స్నేహశీలి ద్వానాశాస్త్రి నిండుమదికి
చారుచర్య నిడుదును కైచాపు లిడుచు

ఆత్మీయంగా...
**– అద్దంకి శ్రీనివాస్**

# విషయసూచిక

(i) స్వాగతం
(ii) పీఠిక

| | | పద్య సంఖ్య | పుట |
|---|---|---|---|
| 1. | అవతారిక | 1–2 | 1 |
| 2. | దంతధావన పద్ధతి | 3–7 | 2–5 |
| 3. | స్నాన పద్ధతి | 8–10 | 6–8 |
| 4. | పుష్పధారణ పద్ధతి | 11–21 | 8–14 |
| 5. | లేపన పద్ధతి (చందన చర్చాపద్ధతి) | 22–23 | 14–15 |
| 6. | వస్త్రధారణ పద్ధతి | 24–27 | 15–18 |
| 7. | భూషణధారణ పద్ధతి | 28 | 18–19 |
| 8. | అర్చా పద్ధతి | 29–31 | 19–20 |
| 9. | భోజన పద్ధతి | 32–45 | 20–27 |
| 10. | తాంబూల పద్ధతి | 46–47 | 27–30 |
| 11. | తాంబూల ప్రయోజనాలు | 48–54 | 31–36 |
| 12. | స్త్రీ సంభోగ పద్ధతి | 55–60 | 36–39 |
| 13. | ఆరోగ్య పద్ధతి | 61–62 | 40–41 |
| 14. | వ్యవహార పద్ధతి | 63–74 | 41–47 |
| 15. | కావ్యాంత పద్యాలు | 75–76 | 47–48 |
| 16. | శ్రీ భోజరాజకృత సంస్కృత చారుచర్య | | 49–61 |
| 17. | పద్య సంఖ్యానుక్రమణిక | | 62–63 |
| 18. | శ్రీ భోజరాజకృత చారుచర్య–శ్లోకానుక్రమణిక | | 63–65 |
| 19. | అప్పనమంత్రి చెప్పిన ఆరోగ్యనియమాలు (సంక్షిప్తంగా) | | 66–74 |

# స్వాగతం

'ఆరోగ్యమే మహాభాగ్యం' – మానవుడు ఆరోగ్యంగా పదికాలాలపాటూ సుఖంగా జీవించాలంటే చక్కటి ఆరోగ్యనియమాలను పాటించాలి. అటువంటి నియమాలద్వారా ఆరోగ్యాన్ని ఎలా సాధించాలో తెలిపే విలువైన గ్రంథం చారుచర్య.

నూత్నసత్కళాభోజుడిగా ప్రసిద్ధిగాంచిన అప్పనమంత్రి ఈ గ్రంథానికి కర్త (క్రీ.శ. 1400 కి పూర్వం). సంస్కృతంలో భోజరాజు రచించిన చారుచర్య అనే లఘుకృతికి ఇది స్వేచ్ఛానువాదం. నాగమయప్పడికి అంకితం.

ఈ గ్రంథాన్ని వావిళ్ళవారు భోజవిరచిత మూలగ్రంథసహితంగా 1949లో చెన్నపురిలోని వావిళ్ళ ముద్రాక్షరశాలద్వారా ప్రకటించారు. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు దీనిని పరిష్కరించారు. అందులో కేవలం కొన్ని కఠిన పదాలకు అర్థాలు మాత్రమే ఇచ్చారు. అందుకని ఇప్పుడు పాఠకుల సౌకర్యార్థం పాఠకమిత్రవ్యాఖ్యతో మూలంతో సహా అందిస్తున్నారు డా. అద్దంకి శ్రీనివాస్ గారు.

కేతన విజ్ఞానేశ్వరానికీ వీరు ఇదే పనిచేశారు. అందుకూ ధన్యవాదాలు. సహృదయులు ఆహ్వానింతురు గాక!

మూలం అందుబాటులో ఉంది కనక కవి ఉద్దిష్టభావం పట్టుకోవడంలో శ్రీనివాస్గారు మూలాన్ని సంప్రతించారు. అవసరమైనచోట ఆయా మూలశ్లోకాలను కూడా పొందుపరిచారు. దానికి తోడు అనువాదం తీరుతెన్నులూ, అందచందాలూ వాచవిగా అందించారు. వీరి కృషి అభినంద్యం. అద్దంకివారిని మరోమారు మనసారా అభినందిస్తూ సహృదయులకు స్వాగతం పలుకుతున్నాను.

దీన్ని ఇంత అందంగా ముద్రించినందుకు శ్రీ పావని సేవాసమితి వారికీ ముఖ్యంగా సమితి అధ్యక్షులు శ్రీ చల్లాసాంబిరెడ్డిగారికీ తరతరాలకు సరిపడా ధన్యవాదాలు.

హైదరాబాదు **బేతవోలు రామబ్రహ్మం**

11-11-2017

# పీఠిక

## అప్పనమంత్రి చారుచర్య

పూర్వం శాస్త్ర విజ్ఞానమన్నది సంస్కృతిలో భాగం. నేడొక డిసిప్లిన్. సంస్కృతి పట్ల పెరిగే విముఖతే సహజసిద్ధంగా అందే శాస్త్రవిజ్ఞానాన్ని దూరం చేస్తోంది. ప్రత్యేకించి చదువుకోవలసిన అగత్యమూ ఏర్పడేలా చేస్తుంది.

అగస్త్యుడు కుంభసంభవుడు. కౌరవులూ అలాగే పుట్టారు. వీరందరినీ టెస్ట్ ట్యూబ్ బేబీలనవచ్చు. శరీరం నుండి తలను వేరుచేసి కొన్ని సంవత్సరాలు రసాయనాలలో ఉంచి మళ్ళీ అతికించవచ్చని అశ్వినీదేవతలు నిరూపించారు.

పుష్పక విమానం, లింగపరివర్తనం, మృతసంజీవని విద్య, నిత్యయౌవనం ఇలా చెప్పుకొంటూ పోతే ... ఎన్నెన్నో శాస్త్రవిషయాలు – నేటికీ మనం సాధించలేనివి పురాణేతిహాసాలలో కన్పిస్తాయి.

మనవాళ్ళు చెప్పిన దశావతారక్రమంలోనే మానవ పరిణామక్రమం ఉందని నృశాస్త్రవేత్తలూ అంగీకరించారు. ఎలా కట్టారో తెలీదుగానీ అద్భుత నిర్మాణకౌశలాలతో ఎన్నో కట్టడాలు కళ్ళముందు సాక్ష్యంగా ఉన్నాయి.

ఇవన్నీ పుక్కిటపురాణాలేనని తీసిపారేయవచ్చుగాక. వాటిని చూసైనా మన పూర్వుల శాస్త్రవిజ్ఞానాన్ని ఒప్పుకొని తీరాలి కదా.

వేదపురాణేతిహాసాలలోనే కాదు తెలుగు సాహిత్యంలోనూ శాస్త్రవిషయాలు కోకొల్లలుగా కనిపించడం విశేషమే. మన పాతతరం కవులు కవిత్వంలో అలవోకగా శాస్త్రవిషయాలు గుప్పిస్తుండటం చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.

'**మాతలుంగ లవంగలుంగ చూతకేతకీ**'... అంటూ పోతన ఒక్కపెట్టున వందమొక్కల పేర్లు చెప్పాడు. అంతేకాదు చెట్లు ఎంత గొప్పవో వాటిలోని

మానవీయ గుణాలేమిటో (అపకారంబులు చేయవెవ్వరికి 10-848) వాటి అవసరం ఎంతో దశమస్కంధంలో ఒకే ఒక్క పద్యంలో అద్భుతంగా చెప్పాడు.

'**అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ**' అన్నాడు పెద్దన. ఇక్కడ 'చిగురు' పెద్దన వృక్షవిశేషంగా ప్రయోగించాడు. ఎంత నడిచినా నొప్పి తెలీని 'పాదలేపనం' పరిచయం చేశాడు. వెంద్రుకల పొడవూ లావూ చూసి వయసు లెక్కించే శాస్త్రమేదో పెద్దనకు తెలుసు. ప్రవరుడికీ, అతడి భార్యకీ 'కూకటుల్ కొలిచి' తగిన వయస్సని పెళ్ళిచేశా రన్నాడు.

ప్రాచీనసాహిత్యంలో శాస్త్రవిషయాలంటే ఏముంటాయి? తత్త్వశాస్త్రం, నీతిశాస్త్రం, మానవవిలువల్ని తెలియజేసే సూక్తిముక్తావళి, ధర్మప్రతిపాదనలు ఇవేగా...!? అనుకొంటారు చాలామంది. కానీ ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది.

కవి – ప్రాథమికంగా సంఘజీవి కదా! సమాజంలో తాను విన్నవీ కన్నవీ కవిత్వంలో పెట్టకుండా ఉంటాడా? ఉండలేడు. సమయం, సందర్భం ఉంటే సరే అవి లేకపోయినా సమకాలీన అంశాలు కవిత్వంలో తొంగిచూడక మానవు. అక్కడే ఉంది కవిప్రతిభ. ఇక వర్ణనలలోనైతే కవి కథను పూర్తిగా విడిచిపెట్టి తమ లౌకికదృష్టిని వాటిల్లో ప్రదర్శించాడు. వర్ణనల్లోనే ఆ అవకాశం పుష్కలంగా ఉంటుంది కాబట్టి అక్కడే సద్వినియోగం చేసుకొన్నారు మన తెలుగు కవులు.

ఆధునికంగా కొన్ని కొత్త కొత్త రంగాలూ, శాస్త్రాలూ ఇప్పుడిప్పుడే వెలుగుచూస్తున్నాయి అని మనం అనుకుంటున్నాం. అటువంటి వాటికి సంబంధించిన విషయాలనుసైతం ఆనాడే కవులు చెప్పారంటే ఆశ్చర్యం కాక మరేమిటి?

భూగోళ, ఖగోళ, అశ్వ, గజ, వృక్ష, జంతు, రాజనీతి, నృ, వాణిజ్య, ఆర్థిక, సామాజిక, గణిత సాంకేతికాది శాస్త్ర విషయాలు స్పష్టంగా ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తున్నాయి.

తెలుగు కావ్యాలలో అవతారిక తర్వాత పురవర్ణన ఉంటుంది. ఇదే కావ్యారంభం. పుర, సౌధ, కోట, వప్ర వర్ణనల మిషగా నిర్మాణ, భద్రతా, సైనిక వ్యవస్థలకు సంబంధించిన గూఢమైన అంశాలను కవులు స్పృశించారు. వీటిలో నగరనిర్మాణం, వీథులు, భవనాలు, వాటి వాటి అలంకరణలు ఉన్నాయి. సివిల్ ఇంజనీరింగ్ కు సంబంధించిన విషయాలన్నమాట. సభాపర్వంలో నన్నయగారు కోట నిర్మాణ వ్యూహాలను ఇలా వివరిస్తున్నారు.

రాజుగారి కోట ఆ ఊళ్ళో ఉండే భవనాలన్నింటికన్నా ఎత్తుగా ఉండాలట. వీధుల్లో భవనాలు సూత్రపట్టినట్లుండాలి. అడ్డదిడ్డంగా ఉండకూడదు. అంగళ్ళన్నీ ఒకేచోట ఉండాలట. నేటి షాపింగ్ మాల్స్ లాగానన్నమాట.

రాజధానిలో అన్నిరకాల యంత్రాలూ ఉండాలట. రథకారులూ, శకటకారులూ, శరకారులూ, స్వర్ణకారులూ, దారుకారులూ, వస్త్రకారులూ, చర్మకారులూ... ఇలా అన్నివృత్తులవాళ్ళూ వారివారి యంత్రాలూ... అందుబాటులో ఉండాలి.

రాళ్ళు ఎగజిమ్మే యంత్రాలే కాదు, నీటిని ఎగజిమ్మే యంత్రాలూ ఉన్నాయి (వర్ణన రత్నాకరం1–68) (water fountain). ఒకే రంగానికి చెందిన వారంతా ఒకచోట ఉండటం (gated communities) మంచిదన్నారు. భూకంపాలు తట్టుకోవడానికి పునాదుల్లో ఇసుక నింపాలనీ చెప్పారు.

విలాసాల కోసం కృత్రిమ పర్వతాలు నిర్మించటమూ ఉంది. తెనాలి రామకృష్ణుడు రాజుగారి కోటలోని భద్రతా వ్యవస్థ ఎలా ఉండాలో పద్మంతో పోల్చి చెప్తున్నాడు. కోట, దాని చుట్టూ పరిఖ ఉండాలి. కోటలోపల అంతఃపురం పద్మదళాల మధ్య ఉండే కర్ణికలా ఉండాలి. దానికి చుట్టూ కాపలా ఏనుగులుండాలి. కోటకొమ్మలే పద్మదళాలు. ఒక పద్మవ్యూహాన్ని తలపించేలా శత్రుదుర్భేద్యంగా ఉండాలని.

పరిఖను వర్ణిస్తూ – కాలువ గట్లు కుంగిపోకుండా ఏటవాలుగా చప్టాచేయటాన్ని ప్రస్తావించాడు ముకుంద విలాస కర్త కాణాదం పెద్దన సోమయాజి. దీనికి నేటి ఇంజనీరింగ్ పరిభాషలో stone pitching (4) అంటున్నారు. ఇంటి నిర్మాణం ఎలా ఉండాలో (వాస్తు) ఇంటిని ఎలా అలంకరించుకోవాలో (Interial decoration) మన కవులకు చాలా బాగా తెలుసు. సౌధవర్ణనల నిండా అవే.

చంద్రకాంత మణులు తాపడం చేసిన మేడలు, నిలువుటద్దాలు అమర్చిన గోడలు, మధ్యలో స్ఫటిక శిలాఫలకాలు పొదిగిన గుండ్రటి స్తంభాలు, బయట పక్షులకోసం ఏర్పాటు చేసేగూళ్ళు, పద్మరాగమణులు పొదిగిన చూరుమొగ్గలు, మరకతమణుల్ని గుజ్జు పరపుగా అమర్చిన నేల (flooring), ద్వారబంధాలూ, పగడపు తలుపులు, మేల్కట్టు, దానిపై చెక్కిన నగిషీ పనితనం ఇదంతా గృహశోభ కిందకే వస్తుంది.

జ్యోతిషం సాముద్రికం లాంటి సంప్రదాయ శాస్త్రాలు సరేసరి. రాజుల రాజయోగం వల్ల సౌధాలకూ రాజయోగం పట్టిందట ( దంతుర్తి దత్తాత్రేయకవి –సావిత్రీ పరిణయం 1–105). రాశుల్నీ, గ్రహాలనీ దృష్టిలో పెట్టుకొని అమూల్యమైన విజ్ఞాన సంపదను కవులు కవిత్వంలో నిక్షిప్తం చేశారు. మరకతమణికి 'బుధమణి' అనే పేరు రసనిఘంటువులో ఉంది. దీనినీ మనకవులు వదల్లేదు.

నిత్యావసర వస్తువుల ధరలెప్పుడూ అందుబాటులో ఉండాలి. సంక్షేమపథక రూపకల్పనలోనే పాలకుల భావిదృష్టి (vision) ద్యోతకమవుతుంది. పాలనలో ఉండవలసిన మెలకువనీ మెళకువనీ ధనార్జన–ధర్మపాలనల మధ్యకల పరిధి విస్తృతులను విశదం చేసే రాజనీతి పరమైన సంగతులున్నాయి.

గణితశాస్త్ర పరిజ్ఞానాన్ని మనసులో ఉంచుకొని మనకవులు కావ్యాలలో పొందుపరిచారు. అక్షరాలను తీసివేయటం కూడటం వంటి పదకేళుల్ని సృష్టించి కవిత్వం పండించారు.

మానవ మనస్తత్వ శాస్త్రాన్ని (psychology) ఆపోశన పట్టిన దిట్టలు మన కవులు. ఎంతవారికైనా పిల్లచేష్టలు పోవు. ముదిమి మీద పడ్డాక బ్రహ్మకైనా చాపల్యం తప్పదు. సూర్యగమనానికి వప్రం అడ్డు తగలటంతో సూర్యుడికి ఏం చేయాలో తోచలేదు. పక్కనే ఉన్న దిడ్డులలో దూరి రాకపోకలు సాగిస్తూ బాలభానుడనిపించుకున్నాడట (మాడయకవి – మైరావణ చరిత్రము 1–41). ఇది పిల్లచేష్ట (వ.ర.134).

అలాగే వయస్సు మీదపడ్డ బ్రహ్మగారు చీటికీమాటికీ విసుక్కోవడం, ఎదుటివారి బలాబలాలు తెలుసుకోకుండా రెచ్చిపోవటం చేస్తున్నాడట (సిరిప్రగడ ధర్మయ్య – నలచరిత్ర 1–200). ఇది ముదిమదికాక మరేమిటి?

రథం ఎలా ఉండాలో, దాని నిర్మాణం (structure) చెప్పాడు తెనాలి రామకృష్ణుడు పాండురంగమాహాత్మ్యంలో (1–115). అలాగే రథగమనదైర్ఘ్యాన్ని ప్రస్తావించే ఈ పద్యం చూడండి.

**'సూత కంఖాణ ఘంటికా కేతు చక్ర,**
**రక్ష చక్ర ప్రకాశోగ్ర విస్ఫుటంబు**
**లొక ముద్దఁజేసిన తవర లనఁగఁ**
**దిరుగు రథములు విరివిసప్పురమునందు' (1–43)**

జిఋమట్టి నరసింహకవి సత్యభామాపరిణయంలోనిదీ పద్యం. వేగంగా తిరిగే రథాలు ఒక ముద్దలా కన్పిస్తున్నాయట.

అద్దంముందు నిలబడినప్పుడు బింబప్రతిబింబ వ్యతిరేక చర్యలు, ఆకాశంలో చంద్రుడూ, సూర్యుడూ ఒకేసారి కన్పించే వింతలూ, రెండోజామున మొదట్లోనే అణిగిపోయే నీడలూ ఇలా... ఖగోళశాస్త్రానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయి.

మల్లయోధుల వ్యాయామ విన్యాసాలు, వాటివాటి రహస్యాలు తారాశశాంకంలో ఉన్నాయి. సాధనలో భాగంగా వీరులు వేడుకకయ్యాలాడుతూ ఉంటారు, సైనికులు తమతమ విద్యలను ప్రదర్శిస్తూ విన్యాసాలు చేస్తూంటారు. వీటిని మనం నేటికీ స్వాతంత్ర్య దినోత్సవాలలో చూస్తుంటాం. వీటిని అప్పుడే కళాపూర్ణోదయం, చెన్నపురీ విలాసం వంటి కావ్యాలు ప్రస్తావించాయి.

Commerce, Business Management రంగాలు ఇటీవలే శరవేగంతో దూసుకుపోతున్న రంగాలు. వీటిలో H.R. ప్రముఖమైనది. Human Resource అన్నమాట. ఈ రంగాలవాళ్ళకి, వ్యాపారశాస్త్రానికి పనికి వచ్చే విషయాలు ప్రాచీన కవులు ఆయా వర్ణనలలో ప్రస్తావించారు.

ఎంతగా వాణిజ్యం వృద్ధిచెందినా నైతికతను కోల్పోకూడదు. సహజసిద్ధంగా లభించే వాటితో వ్యాపారం చేసే స్థితి ఏ దేశంలోనూ కలగకూడదు. ఇప్పుడు మనం నీటిని కూడా కొనుక్కొనే స్థితికి వచ్చాం. కానీ ఇది మంచిది కాదన్నాడు మట్ల అనంతభూపాలుడు కకుత్థ్స విజయంలో. ఎంత సామర్థ్యం ఐశ్వర్యం ఉన్నా కొన్ని నియమ నిబంధ నలకు కట్టుబడి వాణిజ్యం సాగాలన్నది కవి సూచన.

అప్పు చెల్లించకపోతే జప్తుచేయడం, నేడు స్విస్ బాంక్ లో డబ్బు దాచుకున్నట్లుగా రహస్యంగా నిధుల్ని దాచుకోవటం, వస్తువుల్ని మార్చిచేసే వ్యాపారాలు, వైట్ మనీ విధానం (దాపరికం లేని సంపదలు), వ్యాపారాభివృద్ధి కోసం చేసే చెలిమి, వివాహసంబంధాలు, ద్వీపాంతర వాణిజ్యం, మౌలిక వ్యాపార సూత్రాలు వంటి అనేక వ్యాపారశాస్త్ర విషయాలున్న పద్యాలు ప్రాచీనసాహిత్యంలో వైశ్యుల విభాగంలో చూడవచ్చు.

చంద్రదేవోపాఖ్యానంలో ఒకమాట చెప్పాడు. ఆ నగరంలో వైశ్యులు – కొనుగోలుదారులు వచ్చి ఏది అడిగినా తమ అంగడిలో లేదు అనరట. ఒకవేళ లేకపోయినా సరే. తియ్యగా మాట్లాడతారు. వీరి వినయవిధేయతల్ని చూసి వేరే ఇంకేమైనా వస్తువులు కొనుక్కొని వెళ్తారన్నమాట. ఇది H.R. కు ఒక మౌలిక సూత్రం.

కవి ప్రకృతి ఆరాధకుడు. వృక్షసంపద గురించి అతడికి బాగా తెలుసు. బాగా కన్పించేవే కాదు, అరుదైన మొక్కల్నీ ఎరిగినవాడు. పారిజాతాలు,

పుష్పమంజరులు, బంగారు తీగెలు, ముత్తెసరులు, ప్రయాగంబులు, గంగాజలాలు, సంపెంగలు, రాజనాలు, బలుగుత్తులు, కాటుకలు, మహారాజభోగాలు, అక్కుళ్ళు, గౌరికుంకుమలు, రత్నసరులు, బలరామభోగాలు ఇవన్నీ కవులు చెప్పిన వరి ధాన్యవిశేషాలు(8).

The flower of Barleria Cristate అనే సాంకేతిక నామం ఉన్న సైరేయక పుష్పాల్ని గెంటనులన్నాడు ఆంధ్రకిరాతార్జునీయకర్త గోపాలుని సింగయ్య (2-18). దీనికే వ్యవహారంలో డిసెంబరు పూలు అని పేరు. నీలగోరింటలన్నా ఇవే (9).

నదులకు ఆనకట్టలు కట్టి వ్యవసాయం చేయటమూ, వ్యవసాయం చేసే పద్ధతులూ నేటి Agricultural Sciences పరిశోధనలకు స్ఫూర్తినిస్తాయి. నాటి సంపన్నుల ఇళ్ళలో రోబోలు ఉండేవని (యంత్ర పాంచాలికలు) వసుచరిత్రకారుడు చెప్పాడు (6-73).

జంతుశాస్త్రానికి సంబంధించిన ఎన్నో వింతలూ, విశేషాలూ ప్రాచీన సాహిత్యంలో కన్పిస్తాయి. ముఖ్యంగా గజ, అశ్వశాస్త్రాలు. ఏనుగుధ్వనికి బృంహితమనీ, గుఱ్ఱం సకిలింపుకు 'హేష' అనీ పేరు.

ఏనుగులు ఎప్పుడూ గుంపులుగా వస్తాయి. వీటిని 'ఘటా' అంటారు. ఏనుగుల స్వరూపస్వభావాలను ధూర్జటికవి కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు.

పంచకల్యాణి గుఱ్ఱాలు, వాటి స్వభావాలూ, గుఱ్ఱాల గతిభేదాలు (పులాయితం, అర్ధపులాయితం, ఆస్కందితం, రేచితం, వల్గనం), మేలుజాతి గుఱ్ఱాల స్వరూపాలు, గుఱ్ఱాలదౌడు, అశ్వసంబంధిత పదజాలం 'ధారా' అనే పేరుగల గుఱ్ఱపు దౌడు, గుఱ్ఱానికి ఉండే దేవమణి అనే పుట్టుమచ్చ (వ.ర. 126) ఇత్యాది విషయాలు అశ్వశాస్త్రం ఆధారంగా కవులు కావ్యాలలో ప్రయోగించారు (10).

సముద్రమట్టం పెరిగినప్పుడు ద్వీపాలు మునిగిపోవడం, తగ్గినప్పుడు కొండలు ఏర్పడటం (వ.ర. 111) మన కవుల దృష్టిలో ఉంది (Oceanography).

ఇలా ఎన్నెన్నో విద్యలు... శాస్త్రాలు... కవిత్వం అడుగున భాసిస్తున్నాయి. శాస్త్ర విషయాన్వేషణలో కవిత్వం గురించి చెప్పే అవకాశం చిక్కలేదు కానీ.. ఆ కవిత్వాన్ని ఆస్వాదించాలి. అది ఆలోచనామృతం.

సాహిత్యంలోనే ఇన్నిన్ని శాస్త్రవిషయాలుంటే ఇక పూర్తిగా శాస్త్రాల సారాన్ని తెలుగువాళ్ళకి అందజేయాలన్న లక్ష్యంతో వెలిసిన శాస్త్రగ్రంథాల గురించి చెప్పాలంటే చాలా ఉంటుంది. తెనుగులో క్రీ.శ. 1450 కి ముందే అనేక శాస్త్ర గ్రంథాలు వెలిశాయి.

**I. గణితము (Mathematics)**

1. సారసంగ్రహ గణితము — పావులూరి మల్లన

**II. రాజనీతి (Political Science)**

2. నీతిభూషణము – ఆంధ్రభోజుడు
3. నీతిసారము – రుద్ర దేవుడు
4. కామందకము – అజ్ఞాతకవి
5. పంచతంత్రము
6. పురుషార్థసారము – శివదేవయ్య
7. ముద్రామాత్యము – అజ్ఞాతకవి
8. బద్దినీతులు లేక నీతిసారముక్తావళి – బద్దెన

**III. ధర్మశాస్త్రము (Law)**

9. విజ్ఞానేశ్వరము – మూలఘటిక కేతన

**IV. వ్యాకరణము (Grammar)**

10. ఆంధ్రభాషాభూషణము – మూలఘటిక కేతన

**V. ఛందశ్శాస్త్రము (Prosody)**

11. కవిజనాశ్రయము – మల్లియ రేచన
12. గోకర్ణ ఛ్ఛందస్సు – గోకర్ణుడు
13. అధర్వణచ్ఛందస్సు – అధర్వణుడు
14. అనంతచ్ఛందస్సు – అనంతుడు

**VI. అలంకారము (Poetics)**

15. కావ్యాలంకారచూడామణి – విన్నకోట పెద్దన
16. రసాభరణము – అనంతుడు

**VII. వైద్యము (Medicine)**

17. చారుచర్య (Health and Hygiene) – అప్పనమంత్రి
18. పశువైద్యము (Cattle Medicine) – నారనమంత్రి
19. అశ్వవైద్యము – మనుమంచిభట్టు
20. ఆయుర్వేదార్థ సారసంగ్రహము – వేదయ (అనంతామాత్యుడి పుత్రుడు) – అముద్రితం.

**VIII. వాతావరణము, వ్యవసాయము (Meteorology & Agriculture)**

21. సస్యానందము – దోనయామాత్యుడు

**IX ధాతుశాస్త్రము (Precious Metals)**

22. రత్నశాస్త్రము (Metallurgy) – భైరవకవి

**X సాముద్రికశాస్త్రము (Palmistry)**

23. సాముద్రికశాస్త్రము – అన్నయమంత్రి

**XI. వేదాంతశాస్త్రము (Philosophy)**

24. జ్ఞానవాసిష్ఠము – మడికి సింగన

**గ్రంథపరిచయం:**

పైన పేర్గొన్నవాటిలో 'చారుచర్య' అనే శాస్త్రగ్రంథం ఆరోగ్యశాస్త్రానికి సంబంధించినది. రోగం వచ్చిన తర్వాత ఔషధం పుచ్చుకోవడం ఆధునిక చికిత్సావిధానమైతే అసలు రోగమే రాకుండా చూసే చికిత్స ప్రాచీనమైనది. ఇది భారతీయం. ఈ పద్ధతిని అనుసరిస్తూ ఏ ఏ నియమాలు ఎలా పాటించాలో తద్వారా ఆరోగ్యాన్ని ఎలా సాధించాలో తెలిపే విలువైన గ్రంథం ఈ చారుచర్య.

నిత్యజీవనంలో దంతధావనం దగ్గరనుంచి మనం చేపట్టే ప్రధానచర్యలను చారుతరంగా అందిస్తుంది ఈ గ్రంథం. ఇది పద్యరూపంలో ఉంది. అందుకు కారణం తొలినాళ్ళలో తెనుగులో వచ్చిన శాస్త్రీయ గ్రంథాలన్నీ పద్యరూపంలో ఉండడమే. ఇదీ ఆ సంప్రదాయాన్నే అనుసరించింది.

**కవి:**

ఈ గ్రంథకర్త అప్పనమంత్రి. దీనికి మూలం సంస్కృతంలో భోజరాజు రచించిన చారుచర్య అనే లఘుకృతి. రాకుమారులకూ మంత్రిపుత్రులకూ సదాచార నీతి బోధ చేసేరూపంలో భోజరాజు దీనిని రచించాడని ప్రసిద్ధి. దీనిని అప్పనమంత్రి తెలుగులోకి స్వేచ్ఛగా అనువదించాడు.

**కం. ప్రత్యూష బహుళతిమిరా**
**దిత్యుఁడు శ్రీకీర్తి భారతీసంతత సం**
**పత్త్యున్నతిప్రదుఁ డగు హరి**
**నిత్యుఁడు నాగాఖ్య యప్పనికిఁ బ్రియ మొదవన్**

ఉ. రాజహితంబుపొంటె సుకరం బగు వైద్యసునీతి ధర్మ ని
ర్వ్యాజపథానుసార మగునట్లుగ నిర్జరభాషఁ దొల్లి యా
భోజునిచేతఁ జెప్పఁబడి పొల్పగు నీకృతి నూత్నసత్కళా
భోజుఁడు మంత్రి యప్పన ప్రబుద్ధుఁడు చేసెఁ దెనుంగు బాసగన్
(చారుచర్య – 1, 2)

పై పద్యాలను బట్టి అప్పమంత్రి తన చారుచర్యను నాగమయప్పడికి అంకితం ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పమంత్రి బిరుదు నూత్న సత్కళాభోజుడు. ఆరోగ్య జీవన సూత్రాలతో బాటు అక్కడక్కడ సూక్తులు కూడ ఇందులో ఉండడం మరో విశేషం.

కవి కాలం

చం. గొనకొని కొండ ముచ్చులుఁ జకోరములున్ శుకశారికావళిన్
బెనుతురు భూపతుల్ విషము వెట్టిన యన్నముఁ జూచి యోలిఁ జ
య్యన నవి వెంద్రుకల్ విడువ నక్షులు మూయఁగఁ గూయుచుండఁగాఁ
గని కుటిలప్రయోగములు గాంచుటకై నృపమంత్రి శేఖరా !
(చారుచర్య – 35)

ఈ పద్యాన్ని మడికి సింగన సకలనీతిసమ్మతములో ఉదాహరించాడు. కాబట్టి అప్పమంత్రి కాలం సింగన కాలం అంటే క్రీ.శ. 1400 ప్రాంతానికి ముందు కావచ్చు.

సీ. విద్వన్నుతుండు భారద్వాజగోత్రుఁ డా
పస్తంబసూత్రుఁడు పరమపుణ్య
విమలోజ్జ్వలాంగి గోవిందార్యునకుఁ గుల
ద్వయశిరోభూషణ ధర్మ చరిత
నాగమాంబకుఁ గూర్మినందనుఁ డప్పయ
మణి మౌళి సింగనామాత్యు మేన
యల్లుఁడు ధార్మికుఁ డనఘుండు శ్రీవల్ల
భాచార్యుతమ్ముండు హరిపదాంబు

గీ. జాత షట్పదుఁ డుభయభాషాకవిత్వ
మాపవైదగ్ధ్యుఁ డప్పనమంత్రివరుఁడు
సంస్కృతంబున నొప్పారు చారుచర్యఁ
దెనుఁగు చేసెఁ దా నెంతయు తేటపడఁగ (చారుచర్య – 75)

కావ్యం చివర ఉన్న ఈ పద్యం ఆధారంగా అప్పనమంత్రి విద్వన్నుతుడనీ, భారద్వాజగోత్రుడనీ, ఆపస్తంబసూత్రుడనీ, నాగమాంబా గోవిందార్యుల కూర్మినందనుడనీ, సింగనామాత్యుడికి మేనల్లుడనీ, ధార్మికుడనీ, పుణ్యాత్ముడనీ, శ్రీవల్లభాచార్యుడి తమ్ముడనీ, హరిభక్తుడనీ, ఉభయభాషాకవిత్వాలలో నైపుణ్యం కలవాడనీ తెలుస్తోంది.

**అనువాదరీతి**

అప్పనమంత్రి అనువాదవిధానం ఎలా ఉందో తెలుసుకోవడానికి మచ్చుకు కొన్ని పద్యాలు మూలంతోసహా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

**మూలం**

**శ్లో. ప్రాత రుత్థాయ విధినా కుర్యా ద్దంతప్రధావనం**
**వాగ్యతః పుణ్యకాష్ఠేన అత ఊర్ధ్వం క్రమేణ తు** **(3)**

**అనువాదం**

**కం. రేపకడ మేలుకొని యఘ**
**నాపకమతి దంతధావన విధిజ్ఞుండై**
**తా పుణ్యకాష్ఠమున మౌ**
**నోపేతుం డగుచు వలయు నొనరింపంగన్** **(3)**

**మూలం**

**శ్లో. పిత్తశ్లేష్మహరం రుచ్యం నైర్మల్యం చక్షుషోర్హితం**
**శ్రోత్రనాడ్యో విశుద్ధ్యంతే నరాణాం దంతధావనాత్** **(25)**

**అనువాదం**

**కం. ప్రియరుచ్యము కఫపైత్య**
**క్షయకారి మనఃప్రసన్నకారణము శ్రుతి**
**ద్వయనాడిశుద్ధికరమును**
**నయనహితము దంతధావనము మనుజులకున్** **(6)**

మూలశ్లోకాలను కొన్నిటిని వేర్వేరుగా చిన్న పద్యాలుగా, 4, 5 శ్లోకాలను సీసంగా రాశాడు. మొత్తం మీద అనువాదం సరళసుందరం.

**మూలం**

**శ్లో. మలినం పరవస్త్రంతు స్త్రీ వస్త్రం తు తథైవ చ,**
**ఖండం చ మూషికై ర్విద్ధ మగ్నిదగ్ధం చ వర్జయేత్** **(64)**

అనువాదం

ఆ.వె. మలినమైన యదియు మగువ గట్టిన యదియు
నితరజనుల యదియు నెలుకపోటు
ఖండమైన యదియుఁ గాలిన యదియు వ
ర్జింపవలయుఁ జుమ్ము చీరలందు (చారుచర్య – 25)

మూలం

శ్లో. లోకేఽస్మిన్ మంగ ళాన్యష్టౌ బ్రాహ్మణో గౌ ర్హుతాశనః
హిరణ్యం సర్పిరాదిత్యం ఆపో రాజా తథాష్టమః (75)

అనువాదం

కం. గోవుం గనకము విప్రుఁడు
పావకుఁడు ఘృతంబు జలము భానుండు ధరి
త్రీ విభుఁ డీయెనిమిదియు శు
భావహములు మంగళాష్టకాఖ్యం బరయన్ (చారుచర్య – 30)

ఈ గ్రంథాన్ని వావిళ్ళవారు భోజవిరచిత మూలగ్రంథసహితంగా 1949లో చెన్నపురిలోని వావిళ్ళ ముద్రాక్షరశాలద్వారా ప్రకటించారు. అందుకు వారు సంప్రతించిన ప్రతులు ఇవి.

1. తాళపత్రప్రతి (తెనుగు) ఆంధ్రసాహిత్యపరిషత్ పుస్తక భాండాగారము, సంఖ్య 3875.
2. సంస్కృత ద్రవ్యగుణరత్నాకరము.
3. ముద్రితప్రతి శ్రీమాహిష్మతీ ముద్రాక్షరశాల, ముక్త్యాల, 1922.

పైవాటిలోని ద్రవ్యరత్నాకరమే చారుచర్య గ్రంథమట. ఇది 33 వర్గాలు గల సంస్కృత గ్రంథం. దీనితో తెనుగు చారుచర్య సరిచూసి, శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి పరిష్కరణతో ముద్రించి, సంస్కృతాంధ్రాలలో చారుచర్యలను ప్రకటిస్తున్నామని వావిళ్ళ రామస్వామిశాస్త్రులు ప్రకటించారు.

అందులో కేవలం కొన్ని కఠిన పదాలకు అర్థాలు మాత్రమే ఇచ్చారు. అందుకని ఇప్పుడు పాఠకమిత్రవ్యాఖ్యతో మూలంతో సహా పాఠకుల సౌకర్యార్థం అందిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని సాహితీలోకానికి అందిస్తున్న మాన్యమహోదయులు, రామకార్య ధురంధరులు, శ్రీపావని సేవాసమితి అధ్యక్షులు – శ్రీమాన్ చల్లా సాంబిరెడ్డి గారికి, అలాగే స్వాగతం పలికిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. సహృదయులు ఆహ్వానింతురు గాక!

మీ

హైదరాబాదు

**అద్దంకి శ్రీనివాస్**

01.01.2018

చరవాణి: 9848881838

email: draddanki@gmail.com

# అవతారిక

**1.　　కం.　　ప్రత్యూష బహుళతిమిరా**
**దిత్యుఁడు శ్రీకీర్తి భారతీసంతత సం**
**పత్త్యున్నతిప్రదుఁ డగు హరి**
**నిత్యుఁడు నాగాఖ్య యప్పనికిఁ బ్రియ మొదవన్**

**అన్వయం:** ప్రత్యూష – బహుళ – తిమిర – ఆదిత్యుఁడు, శ్రీ – కీర్తి – భారతీ – సంతత – సంపత్తి – ఉన్నతిప్రదుఁడు – నిత్యుఁడు – అగు హరి – నాగ + ఆఖ్య – అప్పనికిన్ – బ్రియము – ఒదవన్ (మీది పద్యంలోనికి అన్వయం).

**వ్యాఖ్య:** వేకువన (ప్రత్యూష) పొడసూపుతూ దట్టమైన చీకట్ల పాలిటి ( బహుళ తిమిర) – సూర్యుడు (ఆదిత్యుఁడు), లక్ష్మి లేదా ఐశ్వర్యం (శ్రీ) కీర్తి, విద్యల (భారతీ) యెడల ఎడతెగని సంపదలను ప్రసాదించేవాడూ, నిత్యుడూ అయిన శ్రీమహావిష్ణువు నాగ అనే పేరుగల అప్పనికి (నాగాఖ్య) ప్రియం కల్గిస్తూ ఉండగా – ఒదవన్ (మీది పద్యంలోనికి అన్వయం).

**విశేషాలు**: సంపత్యున్నతుండు శ్రీహరి, నాగాంఁబ యప్పనికిఁ అన్నవి పాఠాంతరాలు.

**2.　　ఉ.　　రాజహితంబుపొంటె సుకరం బగు వైద్యసునీతి ధర్మ ని**
**ర్వ్యాజపథానుసార మగునట్లుగ నిర్జరభాషఁ దొల్లి యా**
**భోజునిచేతఁ జెప్పఁబడి పొల్పగు నీకృతి నూత్నసత్కళా**
**భోజుఁడు మంత్రి యప్పన ప్రబుద్ధుఁడు చేసెఁ దెనుంగు బాసగన్**

**అన్వయం:** సుకరంబు – అగు – వైద్యసునీతి – ధర్మ – నిర్వ్యాజ – పథ – అనుసారము – అగు – అట్లుగన్ – నిర్జరభాషన్ – తొల్లి – ఆ – భోజునిచేతన్ – చెప్పఁబడి – పొల్పు – అగు – ఈ – కృతి – నూత్న – సత్కళాభోజుఁడు – మంత్రి – అప్పన – ప్రబుద్ధుఁడు – దెనుంగు బాసగన్ – రాజహితంబుపొంటెన్ – చేసెన్.

**వ్యాఖ్య:** సులభమైన (సుకరంబు) వైద్యనీతిని – ధర్మపరంగా ఏ వివాదాలూలేని మార్గాన్ని అనుసరించే (నిర్వ్యాజ – పథ – అనుసారము) విధంగా సంస్కృతభాషలో (నిర్జరభాషన్) పూర్వం భోజుడు రచించాడు. అలా భోజుడిచేత చెప్పఁబడి – ఒప్పయిన (పొల్పు – అగు) ఈ కృతిని నూత్న సత్కళా భోజుఁడైన మంత్రి యప్పన అనే గొప్ప మేధావి (ప్రబుద్ధుఁడు) తెలుగు బాసగా – రాజహితంకోసం చేశాడు. అంటే ఆంధ్రీకరించాడని.

## దంతధావన పద్ధతి

**3. కం. రేపకడ మేలుకొని యఘ**
**నాపకమతి దంతధావన విధిజ్ఞుండై**
**తా పుణ్యకాష్ఠమున మౌ**
**నోపేతుం డగుచు వలయు నొనరింపంగన్**

**అన్వయం:** రేపకడన్ – మేలుకొని – అఘనాపకమతిన్ – దంతధావన విధిజ్ఞుండై – తాన్ – మౌన + ఉపేతుండు + అగుచున్ – పుణ్యకాష్ఠమునన్ – ఒనరింపంగన్ – వలయున్.

**వ్యాఖ్య:** పెందలకడనే అంటే ప్రాతఃకాలంలోనే (రేపకడన్) నిద్రనుండి మేల్కోవాలి. మేల్కోకపోతే పాపం. అలా మేల్కొని పాపాన్ని పోగొట్టుకోవాలనే బుద్ధితో (అఘ–వాపకమతిన్) పండ్లు తోముకొనే పద్ధతి తెలిసినవాడై (దంతధావన విధిజ్ఞుండై) ఒక శ్రేష్ఠమైన పుల్లను (పుణ్య కాష్ఠమునన్) – తీసుకొని మౌనంతో కూడినవాడై (మౌనోపేతుండు) పండ్లు తోముకోవాలి.

పొద్దెక్కేదాకా నిద్రపోవడం, నిద్రలేచినా వెంటనే పండ్లుతోముకోకుండా ఉండటం – ఇవి అఘకారకాలు. వీటిని పోగొట్టుకొనేలా వేకువనే దంతధావన చర్య చేపట్టాలి. అదికూడా నిశ్శబ్దంగా ఎవరితోనూ మాట్లాడకుండా కానివ్వాలి. ఇవీ దంతధావన పద్ధతులు. దీనికి భోజరాజు చారుచర్యలోని మూలశ్లోకం ఇది.

**ప్రాత రుత్థాయ విధినా కుర్యా ద్దంతప్రధావనం**
**వాగ్యతః పుణ్యకాష్ఠేన అత ఊర్ధ్వం క్రమేణ తు** (3)

**విశేషాలు:** తాన్ అనేది ద్రుత ప్రకృతికం. తాఁబుణ్య – అనాలి. అంటే ప్రాసమైత్రి చెడుతుంది. అందుకని స్వతంత్రించి ద్రుతకార్యాలు వదిలేశాడు.

**4. ఆ.వె. ఖదిరమును వటమును కానుఁగ జిల్లేడు**
**వేము మద్ది జువ్వి వీనియందు**
**నొగరు చేఁదు కార మొనరిన చెక్కలఁ**
**దడిపి తోమ వలయు దంతములకు**

**అన్వయం:** ఖదిరమును – వటమును – కానుఁగ – జిల్లేడు – వేము – మద్ది – జువ్వి – వీనియందున్ – ఒగరు – చేఁదు – కారము – ఒనరిన – చెక్కలన్ – తడిపి – దంతములకున్ – తోమవలయున్.

**వ్యాఖ్య:** దంతధావనానికి పుణ్యకాష్ఠం ఉపయోగించాలన్నాడు ముందు పద్యంలో. అందుకు తగిన చెట్లేవేవో ఈ పద్యంలో చెప్తున్నాడు. చంద్ర (ఖదిరము), వటం, కానుఁగ, జిల్లేడు, వేప, మద్ది అలాగే జువ్వి. ఇవి దంతధావనానికి ఉపయోగపడే వృక్షజాతులు. ఈ చెట్లకు సంబంధించిన పుల్లలను దంతధావనానికి ఎంచుకోవాలి. అవికూడా ఒగరుగా, చేదుగా, కారంకారంగా ఉండాలి. వాటిని నీళ్ళలో తడిపి దంతాలకేసి బాగా తోమి తోమి పండ్లు శుభ్రపరుచుకోవాలి.

**5. సీ. ఆయురారోగ్యంబులగు మద్ది మామిడి**
**కణమున శ్రీలక్ష్మి గలుగు మిగులఁ**
**బీడ లెల్లను బాయు బీజపూరంబున**
**రణజయం బొదవుఁ గరంజకమున**
**విత్తలాభము సంభవించును మారేడు**
**నొదవు ఘనప్రజ్ఞ యుత్తరేణి**
**నరుచిహరము జాడ్యహరము జేయును జంద్ర**
**సిద్ధించు నతుల వాక్సిద్ధి జువ్వి**

**గీ. జాజి దాడింబమున దిరిసమున గొడిసె**
**మొదల నంకోలమునఁ గల్గు మోక్షలక్ష్మి**
**సింధువారంబునను రావు చెడ్డ కలలు**
**దంతధావన కర్థంబు లింతవట్టు**

**అన్వయం:** మద్దిన్ – ఆయురారోగ్యంబులు + అగున్, మామిడి – కణమునన్ – శ్రీలక్ష్మి – మిగులన్ – కలుగున్, బీజపూరంబునన్ – పీడలు + ఎల్లను – పాయున్, కరంజకమునన్ – రణజయంబు – ఒదవున్, మారేడునన్ – విత్తలాభము – సంభవించున్ – ఉత్తరేణిన్ – ఘనప్రజ – ఒదవున్, చంద్ర – అరుచిహరము – జాడ్యహరము – అగును, జువ్విన్ – అతుల – వాక్ + సిద్ధి – సిద్ధించున్, జాజి – దాడింబమునన్ – దిరిసమునన్ – గొడిసెన్ – మొదలన్ – అంకోలమునన్ – మోక్షలక్ష్మి గల్గున్, సింధువారంబునను – చెడ్డకలలు – రావు. ఇంత + పట్టున్ – దంతధావనకున్ – అర్థాంబులు.

**వ్యాఖ్య:** ఏ ఏ వృక్షజాతులను దంతధావనానికి ఉపయోగిస్తే ఎటువంటి మేళ్ళు కలుగుతాయో చెప్తున్నాడు.

మద్ది చెట్టుపుల్లవల్ల ఆయురారోగ్యంబులు ఒనగూరుతాయి. మామిడిపుల్ల

(మామిడికణమునన్) వల్ల అపారమైన శోభ అనే ఐశ్వర్యం (శ్రీలక్ష్మి) కలుగుతుంది (ఆమ్రే కీర్తిశ్చసౌభాగ్యం – మూలం. శ్లో. 14). మాదీఫలం (బీజపూరము) పీడలన్నింటినీ నాశనం చేస్తే – కానుగచెట్టు (కరంజకము, కరంజము, కరజము, క్షుద్రరసము, తిక్తగుంజము, నక్తమాలము – పర్యాయపదాలు) యుద్ధంలో విజయాన్నందిస్తుంది. మారేడు వల్ల ధనలాభం, ఉత్తరేణి వల్ల ఉత్తమసంతానం. చంద్రచెట్టువల్ల ఆహారం రుచించకపోవడం, మందబుద్ధి అనే రుగ్మతలు నశించిపోతాయి. జువ్విచెట్టు వల్ల సాటిలేని వాక్ సిద్ధి సిద్ధిస్తుంది. ఇంకా జాజి, దాడింబం, దరిసం, గొడిసె, మొదల, అంకోలము (ఊడుగచెట్టు కొండచెరియలలో మొలిచే ముండ్ల చెట్టు. మరాఠీలో దీనికే పిస్తా, అక్రోడ్ అని వ్యవహారం. అంకోటము, అంకోరము, అంకోడము రూపాంతరాలు) మొదలైన చెట్లను దంతధావనంలో ఉపయోగిస్తే మోక్షమనే సంపద (మోక్షలక్ష్మి) ప్రాప్తిస్తుంది. సింధువారం వాడితే చెడ్డకలలు రానేరావు. ఇవన్నీ ఇంతవరకూ (ఇంతవట్టు) దంతధావనానికి అర్హమైన వృక్షజాతులు.

**విశేషాలు:** సర్జే ధైర్యం వటే దీప్తిః ఇత్యాదిగాగల 10 – 24 శ్లోకాలలో భోజుడు విశేషంగా వీటిని వివరించాడు.

**6. కం. ప్రియరుచ్యము కఫపైత్య**
**క్షయకారి మనఃప్రసన్నకారణము శ్రుతి**
**ద్వయనాడిశుద్ధికరమును**
**నయనహితము దంతధావనము మనుజులకున్**

**అన్వయం:** దంతధావనము – మనుజులకున్ – ప్రియరుచ్యము, కఫ – పైత్య – క్షయకారి, మనస్ + ప్రసన్న – కారణము, శ్రుతి – ద్వయ – నాడీ – శుద్ధికరము, నయన – హితము.

**వ్యాఖ్య:** దంతధావనం వల్ల కఫమూ, పైత్యమూ హరించుకుపోతాయి. వాటిని తగ్గించేది (క్షయకారి) దంతధావనం. మనసు ప్రసన్నంగా ఉండడానికీ మూలకారణం (మనఃప్రసన్నకారణము) ఇదే. కర్ణపుటాలనూ, (శ్రుతిద్వయ) నాడీమండలాన్ని కూడా ఇది శుద్ధిచేస్తుంది. నేత్రాలకూ మేలుచేస్తుంది (నయనహితము). అందుకే మానవులకు అది తగినది (ప్రియరుచ్యము). ప్రియమూ రుచ్యమూ కనుక విధిగా దంతధావనం చేసుకోవాలని. దీనికి మూలశ్లోకం.

**పిత్తశ్లేష్మహరం రుచ్యం నైర్మల్యం చక్షుషోర్హితం**
**శ్రోత్రనాడ్యో విశుద్ధ్యంతే నరాణాం దంతధావనాత్ (25)**

**7. చం. తెలియుచు నిద్ర శౌచవిధిఁ దీర్చి యనుష్ఠితదంతకాష్ఠుఁడై**
**జలశుచిగాత్రుఁడై నియమసద్విధిఁ గైకొని తా హుతాగ్నియై**
**పొలుపగుభక్తి నిష్ఠసురపూజకుఁడై గృహకృత్యకారిగా**
**వలయుఁ బ్రభాతకాలమున వారిజగర్భకుల ప్రసూతకిన్**

**అన్వయం:** తెలియుచున్ – నిద్ర – శౌచ – విధి – దీర్చి, అనుష్ఠిత – దంతకాష్ఠుఁడై, జలశుచిగాత్రుఁడై, నియమ – సద్విధిన్ – గైకొని – తా – హుత + అగ్నియై – పొలుపగు – భక్తి నిష్ఠ – సురపూజకుఁడై –వారిజగర్భకుల ప్రసూతికిన్ – ప్రభాతకాలమునన్ – గృహకృత్యకారి – గావలయున్.

**వ్యాఖ్య:** నిద్ర లేచి, కాలకృత్యాలు (శౌచవిధి) తీర్చుకొని, దంతధావనం చేసినవాడై (అనుష్ఠిత – దంతకాష్ఠుఁడై), నీటిచేత శుచియైన శరీరం కలవాడై (జలశుచిగాత్రుఁడై), అంటే స్నానం చేసినవాడై, నియమపూర్వకాలైన సద్విధిని చేపట్టి అంటే సంధ్యావందనాది కృత్యాలను నిర్వర్తించి, తాను నిత్యాగ్నిహోత్రం చేసినవాడై (హుతాగ్నియై) – ఒప్పైన (పొలుపగు) భక్తితో నిష్ఠగా దేవతారాధన చేసేవాడై (సురపూజకుఁడై) ఈ విధంగా బ్రాహ్మణుడు (వారిజగర్భుడు = బ్రహ్మ, వారిజగర్భకులప్రసూతి = బ్రహ్మవంశంలో పుట్టినవాడు – బ్రాహ్మణుడు) ప్రభాతకాలంలో ఇవన్నీ నిర్వర్తించి ఆ తరువాతే ఇంటిపనులు నిర్వర్తించేవాడు (గృహకృత్యకారి) కావాలి.

## విశేషాలు

**పంచ–శౌచములు**:

(అ) 1) సత్యశౌచము 2) మనఃశౌచము 3) ఇంద్రియనిగ్రహశౌచమ
4) సర్వభూతదయాశౌచము 5) జలశౌచము

(ఆ) 1) మనఃశౌచము 2) కర్మశౌచము 3) కులశౌచము
4) శరీరశౌచము 5) వాక్శౌచము

**అష్ట–శౌచములు**:

1) కాలశౌచము 2) అగ్నిశౌచము 3) భస్మశౌచము
4) మృత్తికాశౌచము 5) గోమయశౌచము 6) జలశౌచము
7) పవనశౌచము 8) జ్ఞానశౌచము.

# స్నాన పద్ధతి

**8. ఉ. అంగసుఖమ్ము దుర్గుణము లారయఁ బొందని మందు మేనికిన్**
**రంగు సుపోషణంబు సుకరంబునఁ బ్రాయము మళ్ళి వచ్చు న**
**భ్యంగన మాచరించుటకు నర్హవిధంబగు నుష్ణవారిఁ జే**
**యం గడు నొప్పు నాల్గు గడియల్ జలకంబు యథావిధిజ్ఞుఁడై**

**అన్వయం:** ఆరయన్ – అభ్యంగనము – మేనికిన్ – అంగసుఖమ్ము. దుర్గుణములు – పొందని – మందు. రంగు. సుపోషణంబు. సుకరంబుగన్ – ప్రాయము – మళ్ళి – వచ్చున్. అభ్యంగనము– ఆచరించుటకున్ – అర్హవిధంబు – అగున్. యథావిధిజ్ఞుఁడై – ఉష్ణవారిన్ – నాల్గు – గడియల్ – జలకంబున్ – చేయన్ – కడున్ – ఒప్పు.

**వ్యాఖ్య:** తలంటు స్నానమనేది – మనిషి శరీరానికి సుఖం కలిగిస్తుంది. మాలిన్యాలూ దురదలూ అనారోగ్యాలూ ఇత్యాది దుర్గుణాలు ఏవీ దరిజేరనివ్వని మంచి మందు. శరీరానికి ఒక కాంతినిస్తుంది. పోషణ ఇస్తుంది. గడిచిపోయిన యౌవనం (ప్రాయము) తేలికగా – సుకరంబుగన్ – తిరిగి వచ్చినట్టు అనిపిస్తుంది. ఈ అభ్యంగ స్నానాన్ని చెయ్యాలంటే వేడినీళ్లే తగిన పద్ధతి. ఉష్ణవారితో చెయ్యడమే చాలా ఒప్పయినది. యథావిధిగా నాల్గు గడియల సేపు జలకమాడాలి, అంతేగానీ హడావిడిగా నాల్గు చెంబులు దిమ్మరించుకోడం కాదు – అంటున్నాడు.

**9. సీ. పుణ్య నిర్మల తోయముల నొండె నుష్ణోద**
**కముల నొండెను బ్రయత్నమునఁ జేయుఁ**
**దానంబు వలయుఁ బ్రాత స్నానమునఁ జేసి**
**తొమ్మిది చిల్లుల దొరఁగు చున్న**
**యేహ్యంబు పట్టగు నిమ్మేను శుచియగు,**
**నంతియ కాదు నాప్యాయనంబు**
**శౌచంబు బలము దుస్స్వప్ననాశంబును**
**తేజంబు రూపు కాంతియు సుకృతము**

**గీ. నాయు రభివృద్ధియును గల్గు నంతమీఁద**
**సంధ్య నారాధనము చేసి సవితఁ గొల్చి**
**యగ్నిదేవు నుపాసించు టర్హవిధము**
**నిజకులాచార మార్గైక నిరతులకును**

**అన్వయం:** పుణ్య – నిర్మల – తోయములన్ – నొండెన్, ఉష్ణ + ఉదకములన్ – ఒండెను, బ్రయత్నమునన్ – తానంబు – చేయన్ – వలయున్. ప్రాత స్నానమునన్ – జేసి – తొమ్మిది – చిల్లులన్ – దొరఁగుచున్న – ఏహ్యంబుపట్టు – అగు + ఈ – మేను – శుచి అగున్. అంతియ కాదు. ఆప్యాయనంబు, శౌచంబు, బలము, దుస్స్వప్ననాశంబును, తేజంబు, రూపు, కాంతియున్, సుకృతమున్, ఆయుర్ + అభివృద్ధియును – గల్గున్. అంతమీఁదన్ – సంధ్యన్ – ఆరాధనము – చేసి – సవితన్ – కొల్చి, అగ్నిదేవున్ – ఉపాసించుట – నిజ – కుల – ఆచార – మార్గ – ఏక – నిరతులకును – అర్హవిధము.

**వ్యాఖ్య:** పుణ్యప్రదాలైననదీతీర్థాలలోనినిర్మలమైననీళ్ళలోగానీ(తోయములనొండెన్), వేడినీళ్లతో గానీ ప్రయత్న పూర్వకంగా స్నానం చెయ్యాలి (తానంబు చేయన్ వలయున్). మనిషి శరీరానికి నవరంధ్రాలు (తొమ్మిది చిల్లులు) ఉంటాయి. ఈ తొమ్మిదింటినుంచీ ఏదో ఒక మాలిన్యం స్రవిస్తూనే ఉంటుంది. రాత్రి అంతా స్రవించిన అసహ్యకరమైన మాలిన్యాలకు నిలయమైన (ఏహ్యంబు పట్టు + అగు) ఈ శరీరం ప్రాతఃకాలస్నానంతో శుచి అవుతుంది (**అత్యంత మలినః కాయో నవచ్ఛిద్ర సమన్వితః స్రవత్యేవ దివారాత్రౌ ప్రాతఃస్నానేన శుధ్యతి**). అంతేకాదు, ప్రాతఃస్నానం చాలా తృప్తిని కల్గిస్తుంది (ఆప్యాయనంబు). శుచిప్రదం. బలవర్ధకం. దుస్స్వప్నాల దుష్ఫలితాలు నశిస్తాయి. తేజస్సూ రూపమూ కాంతీ పుణ్యమూ (సుకృతము) ఆయుష్షు అన్నీ అభివృద్ధి చెందుతాయి. ఇలాంటి ప్రాతఃస్నానం చేసిన మీదట – సంధ్యావందనం చెయ్యాలి (సంధ్యనారాధనము చేసి). సూర్యుణ్ణి (సవితన్) ఉపాసించాలి. తమ తమ వంశాచారాల మార్గంలోనే నడవాలి అనే తపన గలవాళ్ళు (మార్గైక నిరతులు) సంధ్యోపాసన తరవాత అగ్నిదేవుణ్ణి ఉపాసించాలి. ప్రాతఃకాలంలో చెయ్యాల్సిన హోమాలు విధిగా చెయ్యాలి – ఇది అర్హమైన పని.

**స్రవత్యేవ దివారాత్రౌ ప్రాతః స్నానేన శుధ్యతి,**
**కులాచారం తతః కుర్యాత్సం ధ్యోపాసనమాదితః** **(33, 34)**

**10.** కం. **ఆచారానన్తరమునఁ**
**బ్రాచి ముడువవలయుఁ గేశపాశంబులఁ గా**
**లోచిత జలముల గరగర**
**రాచిన కస్తూరి పూయ రమణీయమగున్**

**అన్వయం:** ఆచార – అనన్తరమునన్ – ప్రాచిన్ – కేశపాశంబులన్ – ముడువవలయున్ – కాలోచిత – జలములన్ – గరగరరాచిన – కస్తూరి –

పూయన్ – రమణీయము – అగున్.

**వ్యాఖ్య:** నిజకులాచారాలను ఆచరించిన పిమ్మట తూర్పున అంటే తూర్పుదిక్కు వైపు తిరిగి (ప్రాచిన్) కేశపాశాన్ని ముడుచుకోవాలి. తలదువ్వుకొని జడవేసుకోవడమో ముడిపెట్టుకోవడమో చేయాలని. అంతేకాదు ఏకాలంలో ఏ ఏ సుగంధపానీయాలను కలపాలో తెలుసుకొని ఆవిధంగా ఆ యా కాలోచితపానీయాలను కలిపి గరగర మెదిపిన కస్తూరిని రాసుకొంటే రమణీయంగా ఉంటుంది.

**విశేషాలు:** మూల శ్లోకం

**సూర్యోపాస్తిం తతః కుర్యాత్ సర్వరోగాపమత్తయే**
**కేశానాం నిచయం కుర్యాత్ కస్తూరీ మనులేపయేత్ (34, 35)**

శీతాకాలంలో అగరును, కుంకుమ పువ్వునూ కలిపి చందనాన్ని ఒంటికి అలందుకోవాలి. వేసంగిలో గొజ్జగినీటిలో కర్పూరాన్ని బాగా కలిసేలా కలిపి (మేదించి) దానిలో మళ్ళీ చందనాన్ని కలిపి ఒంటికి పట్టించాలి. వర్షకాలంలో కస్తూరి, కుంకుమపువ్వుల మేళనంతో చందనాన్ని పులుముకోవాలి.

## పుష్పధారణ పద్ధతి

**11. కం. పరిమళము గల్గు పువ్వులు**
**ధరియింపఁగ దానఁ జుంద్రు తలఁ బట్టదు చె**
**చ్చెరఁ జెమటకంపు దొలఁగును**
**నరులకు మతి దెలియు ననువు నయనముల కగున్**

**అన్వయం:** పరిమళము – కలుగు – పువ్వులు – ధరియింపఁగన్ – దానన్ – చుంద్రు – తలన్ – పట్టదు, చెచ్చెరన్ – చెమటకంపు – తొలఁగును. నరులకున్ – మతి – తెలియున్, నయనములకున్ – అనువు – అగున్.

**వ్యాఖ్య:** మంచి సువాసనగల పువ్వులు తలలో ధరిస్తే దానివల్ల తలకు చుంద్రు పట్టదు. చెమట వాసన ఉంటే సత్వరమే అదీ పోతుంది. పరిమళ భరిత పుష్పధారణ వల్ల మానవులకు బుద్ధి వికసిస్తుంది. కళ్ళకు (నయనములకున్) ఎంతో మంచిది. దీనికి మూలం ఇలా ఉంది.

**సుగంధీని సుపుష్పాణి నిత్యం శిరసి ధారయేత్**
**కేశక్లేశ సముద్భూత స్వేద దుర్గంధ నాశనమ్**
**చాక్షుష్యం దాహశమనం సౌమనస్యస్య ధారణాత్ (35)**

**12. ఉ. గేదఁగిపువ్వుఁ దాలిచి సుఖింతురు మేలుజవాది పూసి హృ**
**న్మోదము గాఁగఁ గన్నెరులు మొల్లలతో వకుళ ప్రసూనముల్**
**జాదులు పాటలంబులును సంపెఁగలున్ శతపత్త్రకంబులున్**
**శ్రీ దనరారు భోగులు ధరింతురు కస్తురిఁ గూర్చి వేడుకన్**

**అన్వయం:** శ్రీ – తనరారు – భోగులు – మేలు – జవాదిన్ – పూసి – గేదఁగి పువ్వున్ – తాలిచి – సుఖింతురు. హృత్ + మోదము – కాఁగన్ – గన్నెరులు – మొల్లలతోన్ – వకుళ – ప్రసూనముల్, జాదులు, పాటలంబులును, సంపెఁగలున్, శతపత్రకంబులున్, కస్తురిన్ – కూర్చి – వేడుకన్ – ధరింతురు.

**వ్యాఖ్య:** ఐశ్వర్యవంతులైన భోగపురుషులు మేలుజాతి జవ్వాదిని పూసి (జవ్వాజి, జవాది) గేదగిపూలు ధరించి సుఖిస్తారు. గన్నేరుపువ్వులూ మొల్లలతో కలిపి పొగడపువ్వులూ (వకుళప్రసూనముల్), జాజి పువ్వులూ, కలిగొట్టు పువ్వులూ (పాటలంబులును), సంపెంగలూ, తామరపువ్వులూ (శరపత్రకంబులున్) వీటికి కస్తూరిని కలిపి, వేడుకమీరగా ధరిస్తారు. ఇలా ఇంకా ఏ ఏ పువ్వులకు ఏ ఏ సుగంధద్రవ్యాలను కలపాలో మరో పద్యంలో చెప్తున్నాడు. తెలిసీ తెలియకుండా ఒకదానికొకటి పడనివాటిని కలిపితే మంచి కలుగకపోగా కీడు కూడా జరుగుతుందట.

**13. కం. గోరంటపువ్వు మరువముఁ**
**జేరిచి విరజాజివిరులు చెంగలువలుఁ గ**
**ర్పూరమునఁ గూర్చి ముడుతురు**
**నారీ జనపంచబాణ! నాగమయప్పా!**

**అన్వయం:** నారీజన – పంచబాణ! నాగమయప్పా! గోరంట – పువ్వు – మరువమున్ – చేరిచి; విరజాజి – విరులు – చెంగలువలున్ – కర్పూరమునన్ – కూర్చి – ముడుతురు.

**వ్యాఖ్య:** స్త్రీలకు మన్మథుడి వంటివాడా! (నారీజనపంచబాణ) నాగమయప్పా! విను. గోరింటపువ్వుకు మరువాన్ని చేర్చి ధరించాలి. దానివల్ల సుగంధం ఇబ్బడి అవుతుంది. అలాగే విరజాజి పువ్వులనూ, చెంగలువలనూ కర్పూరంతో జతచేసి ధరించాలి. దీనివల్ల సువాసన ముబ్బడి అవుతుంది. అందుకే స్త్రీలు ఈ విధంగా కొప్పులో తురుముకుంటారయ్యా!

**14. ఉ. మొల్లలు జాజి క్రొవ్విరులు మొత్తములుం గరవీరరాజియున్**
**వెల్ల దొలంకుపువ్వు కురువేరు త్రిదోషహరంబు లారయన్**
**చల్లఁదనంబు దీన సహజంబగు గొజ్జఁగినీరు గొంత పైఁ**
**జల్లి ధరింతు రర్థిమెయి జాణలు వేసవిరాత్రు లెప్పుడున్**

**అన్వయం:** మొల్లలు, జాజి, క్రొత్త + విరులు – మొత్తములున్, కరవీర – రాజియున్, వెల్ల – తొలంకు – పువ్వు – కురువేరు – త్రిదోషహరంబులు – ఆరయన్ – దీనన్ – చల్లఁదనంబు. సహజంబు + అగు – గొజ్జఁగి – నీరు – కొంత – పైన్ – చల్లి – అర్థిమెయిన్ – జాణలు – ఎప్పుడున్ – వేసవి రాత్రులు – ధరింతురు.

**వ్యాఖ్య:** అప్పుడే వికసించిన తాజాతాజా మొల్లపువ్వులూ, జాజిపువ్వులూ వాటి సమూహాలూ (మొత్తములున్), అలాగే గన్నేరు పువ్వులూ (కరవీర రాజియున్), తెల్లందనం ఉట్టిపడే కురువేరుపువ్వులూ (A Plant. Andro. Pogon muricatum Roxb. i. 265, బ్రౌణ్యం), వాతపిత్తశ్లేష్మాది త్రిదోషాలనూ హరించివేస్తాయి. పరిశీలించి చూస్తే – పైగా చలవచేస్తాయి (చల్లఁదనంబు). వీటిపై సహజమైన గొజ్జగి నీరు కొంత పైపైని జల్లి ప్రీతిపూర్వకంగా (అర్థిమెయిన్) వేసవిరాత్రులలో ప్రతిరోజూ జాణలు ధరిస్తారట.

**15. కం. గురువిందలు గన్నేరులు**
**పరువపు నవమాలికలును బాటలములు ని**
**ర్భరశీతోష్ణంబులు గా**
**వరయఁగ నవి మేలు ముడువ నంబుదవేళన్**

**అన్వయం:** గురువిందలు – గన్నేరులు – పరువము + నవ మాలికలును – పాటలములు – నిర్భర – శీత + ఉష్ణంబులు – కావు. అరయఁగన్ – అంబుదవేళన్ – అవి – ముడువన్ – మేలు.

**వ్యాఖ్య:** పువ్వుల స్వభావాలను బట్టి ఆయా కాలాలలో వాటిని ధరించాలి. ఆ విషయాన్నే చెప్తున్నాడు అప్పనమంత్రి.

గురువిందపూలు, గన్నేరు పూలు, అప్పుడే వికసించిన విరజాజులూ (పరువపు నవమాలికలు), కలిగొట్టుపువ్వులూ (పాటలములు) అంతగా వేడిచెయ్యవు అలాగే చలవా చెయ్యవు (నిర్భర శీతోష్ణంబులు కావు). భరించలేనంత వేడీ, అలాగే భరించలేనంత చలువా చేయవని. కాబట్టే వాటిని మేఘకాలంలో (అంబుదవేళన్) అంటే – వర్షకాలంలో ధరిస్తే మంచిది.

**16. కం. పొన్నలు చేమంతులు సుర**
**పొన్నలు సంపెఁగలు మొగలి పువ్వులు పొగడల్**
**పన్నుగ హిమమున ముడిచెద**
**రిన్నియు నుష్ణంబు లగుట యెఱిఁగిన భోగుల్**

**అన్వయం:** పొన్నలు – చేమంతులు – సురపొన్నలు – సంపెఁగలు – మొగలిపువ్వులు – పొగడల్ – ఇన్నియున్ – ఉష్ణంబులు – అగుటన్ – ఎఱిఁగిన – భోగుల్ – హిమమునన్ – పన్నుగన్ – ముడిచెదరు.

**వ్యాఖ్య:** పొన్నలు, చేమంతులు, సురపొన్నలు, సంపెంగలు, మొగలిపువ్వులు, పొగడపువ్వులు. ఇవన్నీ వేడిచేసే స్వభావం (ఉష్ణంబులగుట) కలిగి ఉంటాయి. ఈ విషయం తెలిసిన భోగులు వీటిని ఎంచక్కా శీతాకాలంలో (హిమమునన్) ధరిస్తారు.

**17. సీ. ఘటికాద్వయము దాఁకఁ గంపు జాదులనుండు**
**విరజాజి మొల్లలు వీన రెట్టి**
**పొన్నలయందుండుఁ బొలుపాఱ నొకజాము**
**మల్లెలనా యినుమాఱు దడవు**
**కరవీరములయందు గురువిందపువ్వులఁ**
**బొగడల నంతియ ప్రొద్దు నిలుచు**
**నొకపగల్ రేయును నుండ సంపెంగల**
**వెలయుఁ జేమంతి తద్ద్విగుణ ముందు**

**గీ. దాని యోవర్తు చెంగల్వ దావి యునికి**
**యయిదు రాత్రులు గేదంగియందు వలపు**
**పుడమి గలుగొట్టు సురపొన్న పువ్వులందు**
**మాన దెప్పుడు గంధంబు మంత్రియప్ప!**

**అన్వయం:** మంత్రియప్ప! పుడమిన్ – కంపు – జాదులన్ – ఘటికాద్వయముదాఁకన్ – ఉండున్, విరజాజి – మొల్లలన్ – వీనన్ – రెట్టి. పొన్నలయందున్ – పొలుపాఱన్ – ఒకజాము – ఉండున్, మల్లెలన్ – ఆ – ఇనుమాఱు తడవు. కరవీరములయందున్ – గురువిందపువ్వులన్ – పొగడలన్ – అంతియ ప్రొద్దు – నిలుచున్, సంపెంగలన్ – ఒక పగల్ – రేయునున్ – ఉండన్ – వెలయున్. చేమంతిన్ – తత్ – ద్విగుణము – ఉండున్, దాని – ఓవర్తు – ఉనికి – చెంగల్వ – తావి, గేదంగియందున్ – వలపు – అయిదు రాత్రులు (ఉండున్).

కలుగొట్టు – సురపొన్న పువ్వులందున్ – గంధంబు – ఎప్పుడున్ – మానదు.

**వ్యాఖ్య:** ఘటిక అంటే 24 నిముషాలు. జాజిపూలలో సువాసన (కంపు) రెండు ఘటికలదాకా ఉంటుంది. అదే విరజాజుల్లోనూ మొల్లల్లోనూ (వీనియందున్ = వీనన్) అయితే దీనికి రెట్టింపు (రెట్టి). నాలుగు ఘడియలు (4 × 24 నిముషాలు). పొన్నలలో సువాసన ఒక జాము కాలందాకా. మల్లెలలో రెండురెట్లు (ఇనుమాఱు) అంటే రెండు జాములతడవుదాకా. కరవీర, గురువింద, పొగడ పువ్వులలోనూ అంతేసేపు (అంతియప్రొద్దు) – అంటే రెండు జాములదాకా. పరిమళం ఉంటుంది. సంపెంగల సువాసన ఒక పగలూ రాత్రీ ఉంటుంది (ఉండన్ వెలయున్) ఒక రోజన్నమాట. చేమంతి వాసన దానికి రెట్టింపు. రెండు రోజులు. దానికి ఒక పర్యాయం (వర్తు = వర్తులం; చుట్టు) అంటే నాలుగురోజుల దాకా చెంగల్వ పువ్వు సువాసన నిలిచి ఉంటుంది (ఉనికి). గేదగిపూవాసన అయిదురాత్రుల వరకూ ఉంటే – కలుగొట్టు, సురపొన్న పువ్వుల సువాసన ఎప్పటికీ ఉంటుందయ్యా అప్పనమంత్రీ! దీనికి మూలశ్లోకాలు:

**ముహూర్తం జాతి కుసుమం నేపాళం చోత్పలం తథా**
**త్రిరాత్ర ముత్పలం చైవ పంచరాత్రం తు కేతకీ**

**ద్విరాత్రం శతపత్రం చ అర్ధరాత్రం తు మల్లికా**
**అహోరాత్రం చంపకం తు యూథి పుష్పం తథైవ చ**

**శ్రీకంఠ మేకరాత్రం చ వకుళం మాధవీ తథా**
**అహరేకం తు శ్రీపర్ణం పుష్పవాసం నిధారయేత్**

**మందారం మరువం చైవ కరవీరం తథైవ చ**
**యావత్కాలం వహేద్గంధం తావత్కాలం చ పాటలీ (44 – 47)**

**18.** కం. **విరవాదులు మొల్లలు క్రొ**
**వ్విరిజాజులు ముడువ మేలు వెంద్రుకలు గడున్**
**గరగర నై యుండు తఱిన్**
**శిరమున నెపుడైన ముడువఁ జెంగలువ దగున్**

**అన్వయం:** శిరమునన్ – వెంద్రుకలు – కడున్ – గరగరనై – ఉండు – తఱిన్, విరవాదులు – మొల్లలు – క్రొవ్విరిజాజులు – ముడువన్ – మేలు. ఎపుడైనన్ – ముడువన్ – చెన్ను + కలువ – తగున్.

**వ్యాఖ్య:** తలలో ఎప్పుడు ఏ పువ్వులు పెట్టుకొంటే మంచిదో చెప్తున్నాడు అప్పనమంత్రి. వెంట్రుకలు బిరుసెక్కిపోయి బాగా గరగరలాడుతూ ఉంటే నవమాలికపూలు (విరవాది), మొల్లలు, కొత్తగా విరిసిన జాజిపూలు ముడుచుకోవటం మేలు. ఇక చెంగలువ పువ్వులున్నాయే వాటినైతే ఎప్పుడైనా – అంటే కేశాల పరిస్థితి ఏ విధంగా ఉన్నా హాయిగా ధరించవచ్చు.

**19. కం. ధర నుష్ణ వస్తువులలో**
**నిరతంబును నుష్ణకరము నేత్రములకు దు**
**స్తరబాధకమగు మతిహిత**
**కరములు గాదనిరి మల్లికాకుసుమంబుల్**

**అన్వయం:** ధరన్ – ఉష్ణవస్తువులలోన్ – నిరతంబునున్ – ఉష్ణకరము. నేత్రములకున్ – దుస్తర – బాధకము – అగున్. మల్లికాకుసుమంబుల్ – మతిహితకరమును – కాదు – అనిరి.

**వ్యాఖ్య:** ఈ భూమిమీద (ధరన్) వేడిచేసే వాటిలో మల్లెపువ్వూ ఒకటి. ఇది నిత్యమూ వేడిచేసేదే. దీనివల్ల కళ్ళకు విపరీతమైన (దుస్తర) బాధ కలుగుతుంది. బుద్ధి వికాసానికి (మతిహితకరము) కూడా ఇది మంచిది కాదని అంటారు. దీనికి మూలశ్లోకం '**అధార్యం మల్లికాపుష్పం దృష్టి హానిస్తు జాయతే**' అని (శ్లో. 52).

**20. ఆ.వె. మైదపువ్వుకంటె మల్లియ కంటెను**
**బుడమిలోనఁ గీడు పువ్వులేదు**
**మొగలిపువ్వుకంటె మొగిఁ జెంగలువ కంటె**
**మేలిపువ్వు పుడమి మీఁద లేదు**

**అన్వయం:** పుడమిలోనన్ – మైదపువ్వుకంటెన్ – మల్లియకంటెను – కీడుపువ్వు – లేదు. పుడమి మీఁదన్ – మొగిన్ – మొగలిపువ్వు కంటెన్ – చెంగలువకంటెన్ – మేలిపువ్వు – లేదు.

**వ్యాఖ్య:** ఈ భూమిమీద గోరింటపువ్వు (మైదపువ్వు), మల్లెపువ్వుల కంటే కీడు చేసే పువ్వులు వేరే లేనే లేవు. అలాగే మొగలిపువ్వు, చెంగలువ పువ్వు చాలా శ్రేష్ఠమైనవి. మేలిపువ్వులలో వాటిని మించినవీ లేవు.

**21. కం. తల మాసినపుడు మల్లెలు**
**వలయున్ ముడువంగఁ దొంటివారలు కేశం**
**బుల నూనియ విడువని తఱిఁ**
**గలుగు హితం బండ్రు కేతకంబులు ముడువన్**

**అన్వయం:** తల – మాసిన + అపుడు – మల్లెలు – ముడువంగన్ – వలయున్. కేశంబుల – నూనియ – విడువని – తఱిన్ – కేతకంబులు – ముడువన్ – తొంటివారలు – హితంబు – కలుగున్ – అంద్రు.

**వ్యాఖ్య:** పువ్వుల్ని ధరించే విషయంలో మన పెద్దలు – పూర్వులు (తొంటి వారలు) ఏం చెప్పారంటే – తల మాసినప్పుడు మల్లెపూలు పెట్టుకొమ్మన్నారు. జుట్టుకు నూనె పెట్టుకొన్నప్పుడు మాత్రం కేతకపుష్పాలను (మొగలి) పెట్టుకొంటే (ముడువన్) మంచిదట.

## లేపన పద్ధతి (చందన చర్చా పద్ధతి)

**22. మ. అగరుం గుంకుమపువ్వుఁ గూర్చి శిశిరవ్యాసంగికాలంబునన్**
**మిగులం గొజ్జఁగినీరు కప్పురమునన్ మేదించి ఘర్మంబునన్**
**మృగనాభిన్ ఘుసృణంబునుం గలిపి యమ్మేఘావలీవేళలన్**
**దగు నుద్వర్తనపూర్వకంబుగ నలందన్ జందనం బిమ్ములన్**

**అన్వయం:** శిశిర – వ్యాసంగి – కాలంబునన్ – అగరున్ – కుంకుమ పువ్వున్ – కూర్చి, ఘర్మంబునన్ – మిగులన్ – గొజ్జఁగి నీరు – కప్పురమునన్ – మేదించి, ఆ + మేఘావలీవేళలన్ – మృగనాభిన్ – ఘుసృణంబునున్ – కలిపి, ఉత్ + వర్తన – పూర్వకంబుగన్ – ఇమ్ములన్ – చందనంబు – అలందన్ – తగును.

**వ్యాఖ్య:** చందనాన్ని ఎలా పూసుకోవాలో తెలుస్తుందీ పద్యం వల్ల. చందనాన్నిట శీతాకాలంలో (శిశిరవ్యాసంగికాలంబునన్) అగరును, కుంకుమ పువ్వునూ కలిపి ఒంటికి పూసుకొని, నలుగు పెట్టుకున్నట్లుగా (ఉద్వర్తన పూర్వకంబుగన్) అలందుకోవాలి. వేసంగిలోనైతే (ఘర్మంబునన్) చక్కగా గొజ్జగినీటిలో కర్పూరాన్ని బాగా కలిసేలా కలిపి (మేదించి) దానిలో మళ్ళీ చందనాన్ని కలిపి ఒంటికి పట్టించాలి. వర్షకాలంలో కస్తూరి, కుంకుమపువ్వుల మేళనంతో చందనాన్ని పులుముకోవటం మంచిది. ఈ విధంగా ముందు చందనం తోనే నలుగు పెట్టుకొని స్నానంచేసి తర్వాత చందనం పూసుకోవచ్చు. దీనికి సంబంధించిన మూలశ్లోకాలు.

**కుసుమం చందనం చైవ తథాగరు విమిశ్రితం**

**ఉష్ణభావమిదం శ్రేష్ఠం శీతకాలే తు లేపయేత్**
**చందనం చేందునా యుక్తం కస్తూర్యా సహమిశ్రితం**

**సుగంధం చ సుశీతం చ ఘర్మకాలే ప్రధారయేత్**
**చందనం ఘుసృణోపేతం ఈషత్కస్తూరికాయుతం**

**న చోష్ణం న చ వా శీతం వర్షాకాలే ప్రధారయేత్**
**ఆదౌ చోద్వర్తయేద్గంధం పశ్చాద్గంధం ప్రలేపయేత్ (56 – 59)**

**23. కం. జలకంబు దీర్చినప్పుడె**
**వలయున్ దడియొత్తఁ గాంతివచ్చును బిటికా**
**దులు వొందకుండుఁ గండువు**
**గలుగదు మఱి దాన నునుపు గాత్రమున కగున్**

**అన్వయం:** జలకంబు – దీర్చిన – అప్పుడె – తడి – ఒత్తన్ వలయున్. కాంతివచ్చును. పిటిక + ఆదులు + పొందకుండున్, కండువు – గలుగదు. మఱి – దానన్, గాత్రమునకున్ – నునుపు – అగున్

**వ్యాఖ్య :** స్నానం చేసెయ్యగానే వెంటనే (జలకంబు దీర్చిన అప్పుడె) తడి లేకుండా ఒత్తుకోవాలి తుడుచుకోవాలి. దానివల్ల శరీరానికి మంచి కాంతివస్తుంది. శరీరంపై చిన్న చిన్న గుల్లలు, చెమటపొక్కులు, పుండ్లు లాంటివి రాకుండా ఉంటుంది (పిటిక + ఆదులు పొందకుండున్). దురదల్లాంటివీ (కండువు) – కలుగవు. మరి – దానివల్ల శరీరానికి (గాత్రమునకున్)– నునుపు వస్తుంది. చర్మం నునుపుగా తయారవుతుందని.

## వస్త్రధారణ పద్ధతి

**24. శా. సీతుంగందువఁ బట్టుచీరలును మాంజిష్ఠంబులున్ దోఁపులున్**
**వాతశ్లేష్మనివృత్తి హేతువులు దుర్వారోష్ణకాలంబునన్**
**జేతఃప్రీతియుఁ బైత్యహానియుఁ గడుం జేకూరుఁ జెంగావులన్**
**శ్వేతచ్ఛాయపటంబు లభ్రపటలీవేళన్ ద్రిదోషఘ్నముల్**

**అన్వయం:** సీతు + కందువన్ – పట్టుచీరలును – మాంజిష్ఠంబులున్ – తోఁపులున్ – వాత – శ్లేష్మ – నివృత్తి – హేతువులు ; దుర్వార – ఉష్ణ – కాలంబునన్ – చేతస్ – ప్రీతియున్ – పైత్యహానియున్ – చెంగావులన్ – కడున్ – చేకూరున్; అభ్రపటలీవేళన్ – శ్వేత + ఛాయ – పటంబులు – త్రిదోషఘ్నముల్.

**వ్యాఖ్య:** ఏ ఏ కాలాలలో ఏ ఏ వస్త్రాలు సుఖాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయో చెప్తున్నాడు. శీతాకాలంలో (సీతుంగందువన్, కందువ = ఋతువు) పట్టుచీరలు, తామ్రవర్ణంలో

ఉన్న వస్త్రాలు (మాంజిష్ఠంబులు = ఎఱుపుమించిన పసుపువన్నె కలవస్త్రం, Yellowish red), ఎరుపురంగు వస్త్రాలు (తోఁపులున్) ధరించాలి. ఇవి శరీరంలోని వాతాన్నీ, శ్లేష్మాన్నీ నివృత్తి చేయడానికి హేతువులు. ఇక భరింపశక్యంగాని వేసవిలో (దుర్వార + ఉష్ణకాలంబునన్) లేలేత ఎఱుపు చాయకల చెంగావి వస్త్రాలు ధరించాలి. ఇవి మనసుకు ప్రీతినీ, పైత్యానికి హానినీ చేకూరుస్తాయి. ఇక వర్షకాలంలో మేఘాలు గుంపులుగా కమ్ముకొనే వేళ (అభ్రపటలీవేళన్) తెల్లనిచాయకల వస్త్రాలను (పటంబు) ధరించాలి. ఇవి వాతపిత్తశ్లేష్మాలనే మూడు దోషాలను (త్రిదోషఘ్నముల్) హరించివేస్తాయి.

**విశేషాలు:** మూలంలో వస్త్రధారణ పద్ధతికి సంబంధించి కాస్తంత విపులంగానే చెప్పాడు భోజుడు. సంగ్రహంగా ఉన్న ఈ పద్యానికి మూలశ్లోకాలివి.

**శీతకాలే తు కౌశేయం కషాయం ఘర్మవాసరే**
**వర్షాసు శుక్లవస్త్రం స్యాత్ త్రిధా వస్త్రస్య ధారణమ్**

**కౌశేయం చిత్రవస్త్రం చ రక్తవస్త్రం తథైవ చ**
**వాతశ్లేష్మహరం నృణాం శీతకాలే తు ధారయేత్**

**మధ్యం సుశీత పిత్తఘ్నం కాషాయం వస్త్రముచ్యతే**
**తద్ధారయే ద్ఘర్మకాలే కాషాయం వస్త్రముత్తమమ్**

**శుక్లం సుశీతలం చైవ శీతతాపనివారణం**
**న చోష్ణం న చ వా శీతం శుక్లం వర్షాసు ధారయేత్ (60 – 63)**

**25. ఆ.వె. మలినమైన యదియు మగువ గట్టిన యదియు**
**నితరజనుల యదియు నెలుకపోట్ల**
**ఖండమైన యదియుఁ గాలిన యదియు వ**
**ర్జింప వలయుఁ జుమ్ము చీరలందు**

**అన్వయం:** చీరలందున్ – మలినము + ఐన + అదియున్, మగువ – కట్టిన + అదియున్, ఇతర – జనుల + అదియున్, ఎలుక – పోట్లన్ – ఖండము + ఐన – అదియున్, కాలిన + అదియున్ – వర్జింపవలయున్ – చుమ్ము.

**వ్యాఖ్య:** **మలినం పరవస్త్రం తు స్త్రీ వస్త్రం తు తథైవ చ**
**ఖండం చ మూషికైర్విద్ధం అగ్నిదగ్ధం చ వర్జయేత్ (65)**

అనే మూలశ్లోకానికి ఈ పద్యం అనువాదం. వస్త్రాలలో మలినమై పోయినవీ, స్త్రీలు ధరించినవీ, ఇతరులు ధరించినవీ, ఎలుకలు కొరికినవీ – చిరిగినవీ (ఎలుక పోట్లన్ – ఖండమైన), కాలిపోయినవీ ధరించకూడదు. వాటిని విడిచి పెట్టేయాలి సుమా! ఎందుకు వీటిని ధరించకూడదో ధరిస్తే కలిగే నష్టాలూ బాధలూ ఏమిటో తరువాతి పద్యంలో చెప్తున్నాడు.

**26. ఉ. మాసినదానఁ దీఁటయు నమంగళభావము నొందు నంగనా**
**వాసముఁ గట్ట భాగ్యము నవారితశౌర్యముఁ దప్పుఁ బుణ్యముల్**
**చేసినఁ గోలుపోవు నొరుచీర ధరించిన నెల్కపోటు సం**
**త్రాసముఁ జేయు ఖండపరిధానము జ్యేష్ఠకుఁబట్టు మేదినిన్**

**అన్వయం:** మేదినిన్ – మాసినదానన్ – తీఁటయున్ – అమంగళభావమున్ – ఒందున్, అంగనా – వాసమున్ – కట్టన్ – భాగ్యమున్ – అవారిత – శౌర్యమున్ – తప్పున్, ఒరుచీరన్ – ధరించినన్ – పుణ్యముల్ – చేసినన్ – కోలుపోవున్, ఎల్కపోటు – సంత్రాసమున్ – చేయున్, ఖండ – పరిధానము – జ్యేష్ఠకున్ (జెష్టకున్) పట్టు.

**వ్యాఖ్య:** మాసినవస్త్రాన్ని ధరిస్తే దురద (తీఁట) పుడుతుంది. అశుభం కూడా. స్త్రీ (అంగనా) ధరించిన వస్త్రాన్ని (వాసమున్) ధరిస్తే – కలిగే భాగ్యమూ, అడ్డులేని శౌర్యమూ తప్పిపోతాయి. ఇతరులు ధరించి విడిచిన వస్త్రాన్ని ధరిస్తే – చేసిన పుణ్యం కాస్తా కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఎలుకలు కొట్టిన వస్త్రాలను ధరిస్తే చూపరులు దడుసుకుంటారు. భయం కలుగుతుంది (సంత్రాసము). చిరిగిన వస్త్రాన్ని ధరించకూడదు. అది దరిద్రదేవతకు (జ్యేష్ఠకున్) ఆటపట్టు. మూలశ్లోకాలు:

**మలినం న శివం తత్తు కండూ త్వగ్దోషకారణం**
**సుకృతస్య ఫలం నాస్తి పరవస్త్రస్య ధారణాత్**

**కార్యహాని ర్దుర్బలత్వం స్త్రీవస్త్రేణ ప్రజాయతే**
**ఖండవస్త్రే వసేజ్జ్యేష్ఠా తస్మాత్తత్పరివర్జయేత్** **(65, 66)**

**27. కం. కాలినచీర ధరించిన**
**మేలు దొలంగుటయె కాదు మిక్కిలి కీడై**
**కాలుని వశమగుఁ గావున**
**వాలాయము దానిఁ బాఱవైవఁగ వలయున్**

**అన్వయం:** కాలిన – చీర – ధరించిన – మేలు – తొలంగుటయె – కాదు – మిక్కిలి – కీడై – కాలుని – వశము – అగున్ – కావునన్ – దానిన్ – వాలాయము – పాఱవైవఁగవలయున్.

**వ్యాఖ్య:** కొద్దిగా కాలి, కన్నాలు పడిన వస్త్రాన్ని ధరిస్తే – దానివల్ల, ఉన్న మంచి పోవడమే కాదు. ఇంకా ఎక్కువ కీడు జరుగుతుంది. జీవితం యమధర్మరాజుకు (కాలుడు) వశం అవుతుంది. అంటే మృత్యువు సమీపిస్తుంది. కాబట్టి అవశ్యంగా, అనివార్యంగా, నిర్బంధంగా (వాలాయము) కాలిన వస్త్రాన్ని పారవెయ్యాలి. దీనికి మూలశ్లోకం ఇది.

**భయదం మూషికైర్విద్ధం దగ్ధేన చ మృతిర్భవేత్**
**తస్మాత్ సర్వప్రయత్నేన శోధ్య వస్త్రం ప్రధారయేత్ ( 67)**

# భూషణధారణ పద్ధతి

**28. చం. తెవులులు సెందనోదు నధిదేవత లిత్తురు మెచ్చి సంతతో**
**త్సవములు రత్నభూషణవితానముఁ దాల్పఁగ నట్లు లేనినాఁ**
**డవయవశుద్ధిహేతు రుచిరాభరణంబులు దాల్పఁగాఁ దగున్**
**రవణముపొంటె లక్కయును రాగియు నిడ్డవిగావు దాల్పఁగన్**

**అన్వయం:** రత్న – భూషణ – వితానమున్ – తాల్పఁగన్ – తెవులులు – చెందన్ + ఓడున్, సంతత + ఉత్సవములు – అధిదేవతలు – మెచ్చి – ఇత్తురు, అట్లు – లేనినాఁడు – అవయవ – శుద్ధి – హేతు – రుచిర – ఆభరణంబులు – రవణముపొంటెన్ – దాల్పఁగాన్ – తగున్. లక్కయును – రాగియును – ఇడ్డవి తాల్పఁగన్ – కావు.

**వ్యాఖ్య:** నవరత్నాలను పొదిగి తయారుచేసిన ఆభరణాలను ఎలా ధరించాలో చెప్పటం సందర్భం. ఒక్కొక్క రత్నానికి ఒక్కొక్క అధిదేవత. ఆయా దేవతల అనుగ్రహాన్ని పొందడానికి ఆయా వారాలలో ఆయా రత్నఖచిత ఆభరణాల సమూహాన్ని (వితానము) ధరించాలి.

**ఆదిత్యే పద్మరాగం చ సోమే ముక్తాఫలం తథా**
**మంగళే విద్రుమం చైవ బుధే మరకతం తథా (69)**

అలా ధరిస్తే రోగాలు (తెవులులు) దరిచేరవు (చెందన్ + ఓడున్). నిత్యవైభవాలను

ఆయా అధిదేవతలు సంతోషంగా ప్రసాదిస్తారు. ఒకవేళ ఏ వారానికి ఆ ఆభరణం ధరించలేకపోతే – అవయవాలను శుద్ధిచేయడానికి కారణభూతాలైనవీ (అవయవశుద్ధిహేతు) ప్రకాశవంతాలైనవీ అయిన ఆభరణాలను (రుచిరాభరణంబులు) సొంపారగా అలంకారం కోసం (రవణము పొంటెన్) ధరించాలి. కానీ లక్కతో రాగితో – వీటినిపెట్టి చేసిన (ఇడ్డవి) ఆభరణాలు ధరించకూడదు. వీటిని ధరించవద్దని పెద్దలు చెప్పడానికి కారణం ఆరోగ్యమే.

## అర్చాపద్ధతి

**29. కం. దానములు చేసి యట స**
**న్మానంబున దేవపితృ సమభ్యర్చనముల్**
**పూని యొనరించి పిమ్మటఁ**
**గాని చనఁగ వలదు భుక్తికార్యంబునకున్**

**అన్వయం:** దానములు – చేసి, అటన్ – సత్ – మానంబునన్ – దేవ – పితృ – సమ్ – అభ్యర్చనముల్ పూని, ఒనరించి, పిమ్మటన్ – కాని – భుక్తికార్యంబునకున్ – చనఁగవలదు.

**వ్యాఖ్య:** దశదానాలు చేసి, అటుపైని (అటన్) భక్తి శ్రద్ధలతో (సన్మానంబునన్) దేవ–పితృ యజ్ఞాలు నిర్వహించాలి. ఇవి చేసిన తరవాతనే భోజనానికి కూర్చోవాలి. ఇవి చెయ్యకుండా భుక్తికార్యంబునకున్ చనగవలదు.

**30. కం. గోవుం గనకము విప్రుఁడు**
**పావకుఁడు ఘృతంబు జలము భానుండు ధరి**
**త్రీవిభుఁ డీ యెనిమిదియు శు**
**భావహములు మంగళాష్టకాఖ్యం బరయన్**

**అన్వయం**: అరయన్ – గోవున్, కనకము, విప్రుఁడు, పావకుఁడు, ఘృతంబు, జలము, భానుండు, ధరిత్రీవిభుఁడు, ఈ – ఎనిమిదియున్ – మంగళాష్టకాఖ్యంబు – శుభావహములు.

**వ్యాఖ్య**: గోవు, బంగారం (కనకము), బ్రాహ్మణుడు (విప్రుఁడు), అగ్ని (పావకుఁడు), నెయ్యి (ఘృతంబు), నీరు (జలము), సూర్యుడు (భానుండు), రాజు (ధరిత్రీవిభుఁడు), శుభావహములు. మంగళాష్టకమని పేరు (ఆఖ్యన్).

**31. కం. అవలోకన మభివందన**
**మవధానముతోడఁ జేసి యర్చించుట భ**
**క్తివిధిన్ బ్రదక్షిణించుట**
**యవిరళనియమమున వీనియం దర్థాంబుల్**

**అన్వయం:** అవిరళ – నియమమునన్ – అవలోకనము – అభివందనము – అవధానముతోడన్ + చేసి అర్చించుట – భక్తివిధిన్ – బ్రదక్షిణించుట – వీనియందున్ – అర్థాంబుల్.

**వ్యాఖ్య:** నిరంతర(అవిరళ) నియమంతో దర్శించడం (అవలోకనము), నమస్కరించడం (అభివందనము), ఏకాగ్రచిత్తంతో (అవధానముతోడన్ చేసి) అర్చించటం, భక్తివిధితో బ్రదక్షిణ చేయడం మొదలైన విధులు గోవు, బంగారం, బ్రాహ్మణుడు, అగ్ని, నెయ్యి, నీరు, సూర్యుడు, రాజు అనే మంగళాష్టకం విషయంలో (వీనియందున్) అర్థాంబులు.

## భోజన పద్ధతి

**32. కం. కులకాంతచేతఁ దగు క్రియ**
**నలంకృతం బైన భోజనాగారములో**
**నెలమిఁ దమ బంతిఁ జుట్టలుఁ**
**జెలులుం దగ భోజనంబు సేయఁగవలయున్**

**అన్వయం:** కులకాంతచేతన్ – తగు క్రియన్ – అలంకృతంబు – ఐన – భోజనాగారములోన్ – ఎలమిన్ – తమ – బంతిన్ – చుట్టలున్ – జెలులున్ – తగన్ – భోజనంబు – చేయఁగవలయున్.

**వ్యాఖ్య:** ధర్మపత్ని స్వయంగానూ, తగు విధంగానూ, అలంకరించిన భోజనశాలలో (భోజన + అగారములోన్) గృహస్థు తన బంధువులు (చుట్టములు – చుట్టలు) స్నేహితులు (చెలులు) వీరంతా అందంగా (ఎలమిన్) తన సహపంక్తిని కూర్చోగా అందరితో కలిసి హాయిగా భోజనం చెయ్యాలి.

**33. కం. పెక్కండ్రు లేకయున్నను**
**నొక్కఁ డిరువురైనఁ బంక్తి నొగిఁ గుడువక తా**
**నొక్కండ భుక్తిఁ గొనుటది**
**యెక్కుడు నింద్యమని చెప్పి రిద్ధ చరిత్రుల్**

**అన్వయం:** పెక్కండ్రు – లేకయున్నను – నొక్కఁడు ఇరువురు ఐనన్ – బంక్తిన్ – ఒగిన్ – కుడువక – తాన్ ఒక్కండ – భుక్తిన్ – కొనుట – అది – ఎక్కుడు – నింద్యము – అని – ఇద్ధ చరిత్రుల్ – చెప్పిరి.

**వ్యాఖ్య:** సహపంక్తిని భుజించేందుకు పూటపూటా ఎక్కువ మంది దొరక్కపోవచ్చు. పెక్కుమంది లేకపోయినా ఒక్కడుగానీ ఇద్దరుగానీ బంతిలో కూచుని భుజిస్తే చాలు. ఇది కూడా లేకుండా తాను ఒక్కడే భుజించడమనేది చాలా నింద్యమూ గర్హ్యమూ అని పావన చరిత్రులైన పెద్దలు చెబుతున్నారు.

**34. కం. ఇష్ట ఫలసిద్ధి చేకుఱుఁ**
**దుష్టి గలుగుఁ గలిమి పేర్మి దొరయును సుజనో**
**త్కృష్టుఁడగు భోజనము వి**
**స్పష్టముగాఁ జేయు నేని బహుజనములతోన్**

**అన్వయం:** భోజనము – విస్పష్టముగాన్ – బహు – జనములతోన్ – జేయునేని, ఇష్ట – ఫల – సిద్ధి – చేకుఱున్, తుష్టి – గలుగున్ – కలిమి – పేర్మి – దొరయును. సుజన ఉత్కృష్టుఁడు అగున్.

**వ్యాఖ్య:** నిత్యమూ చాలా మందితో కలిసి (బహుజనములతోన్) భుజించేవాడికి ఇష్టఫలాలు సిద్ధిస్తాయి. తుష్టి కలుగుతుంది. సంపద – కీర్తి (పేర్మి) అభివృద్ధి చెందుతాయి. సజ్జనులలో గొప్పవాడు (ఉత్కృష్టుడు) అవుతాడు.

**35. చం. గొనకొని కొండ ముచ్చులుఁ జకోరములున్ శుకశారికావళిన్**
**బెనుతురు భూపతుల్ విషము వెట్టిన యన్నముఁ జూచి యోలిఁ జ**
**య్యన నవి వెంద్రుకల్ విడువ నక్షులు మూయఁగఁ గూయుచుండఁగాఁ**
**గని కుటిలప్రయోగములు గాంచుటకై నృపమంత్రి శేఖరా!**

**అన్వయం:** నృపమంత్రి శేఖరా! భూపతుల్ – గొనకొని – కొండముచ్చులున్ – చకోరములున్ – శుక – శారికా + ఆవళిన్ – పెనుతురు. విషము + పెట్టిన – అన్నమున్ – చూచి – ఓలిన్ – చయ్యనన్ – అవి – వెంద్రుకల్ – విడువన్ – అక్షులు – మూయఁగన్ – కూయుచుండఁగాన్ – కని, కుటిల – ప్రయోగములు – కాంచుటకై – పెనుతురు.

**వ్యాఖ్య:** ఓయీ రాజమంత్రివర్యా! సాధారణంగా భూపాలకులు కొండముచ్చులనూ (కోతులలో ఒక జాతి) చకోర పక్షులనూ చిలుకలూ గోరింకలూ మొదలైన వాటినీ

విషం కలపడంలాంటి కుత్సితాలు (కుటిల – ప్రయోగములు) చేశారేమో తెలుసుకోడానికి. తాము తినబోయేది ముందుగా ఈ పెంపుడు జంతువులకూ పక్షులకూ తినిపిస్తారు. అది ఒకవేళ విషం కలిపిన అన్నమే అయితే, తిన్న వెంటనే (చయ్యనన్) వాటికి ఒంటిమీది వెంట్రుకలు రాలిపోవడం (విడువన్), కన్నులు (అక్షులు) మూతలు పడిపోవడం, పెద్దగా కూతలూ – ఇవన్నీ జరుగుతాయి. ఇవన్నీ వరసగా (ఓలిన్) జరుగుతాయి. అంటే – కొండముచ్చులకు వెంట్రుకలు రాలుతాయి. చకోరాలకు కన్నులు మూతపడతాయి. శుకాదులు భయంతో అరుస్తాయి. వీటిని గమనించి జాగ్రత్త పడటం కోసం భూపతులు కావాలనే (గొనకొని) వీటిని పెంచుతారు (పెనుతురు). అప్పనమంత్రి అనువాద విధానం తెలుసుకోడానికి దీనికి భోజరాజుగారి శ్లోకాలు –

**చకోరం మర్కటం కృష్ణం శారికాం చ శుకం తదా**
**అమాత్యరాజ పుత్రాణాం గృహేష్వేతాని రక్షయేత్**

**చకోరం చక్షుషోన్మీలం విష్ఠాం ముంచతి మర్కటః**
**మృష్టాన్నం విషసంయుక్తం కూజంతి శుకశారికాః (81 – 83)**

**36. తే.గీ. మునుపుఁ దియ్యఁగూరలు రుచిగొనుట లెస్స**
**నడుమ నొగరులు చేఁదులు నం మేలు**
**పులుసు లాస్వాదనము సేయవలయుఁ బిదప**
**భోజనము సేయు నప్పుడు భూమి పతులు**

**అన్వయం:** భూమిపతులు – భోజనమున్ – చేయునప్పుడు – మునుపున్ – దియ్యఁగూరలు – రుచిగొనుట లెస్స. నడుమన్ – ఒగరులు – చేఁదులున్ – నంజన్ – మేలు. పిదపన్ – పులుసులు – ఆస్వాదనము చేయవలయున్.

**వ్యాఖ్య:** భూమివల్లభులు భోజనం చేసేటప్పుడు – ముందుగా తియ్యటి శాకపాకాలు (తియ్యఁగూరలు) స్వీకరించడం మంచిది. మధ్యలో వగరు పదార్థాలు చేదు పదార్థాలు నంజుకోవడం (అనుపానాలు) మేలు. చివరికి పులుసులూ చారులూ ఆస్వాదించడం (ఆస్వాదనము + చేయవలయున్) ఉత్తమం. త్వరగా జీర్ణమవ్వడానికీ సుఖావహంగా ఉండటానికీ ఈ క్రమం పాటించమన్నారు.

**ఆదౌ మధురమశ్నీయాన్ మధ్యే చ కటుతిక్తకం**
**అంతే తిక్తకషాయం చ సమ్యక్ జీర్ణం సుఖావహమ్ (85)**

**37. కం. అతిమధుర మదీపనకర**
**మతిలవణము నయనకాంతిహర మాహారం**
**బతి తిక్తామ్లము ముదిమికి**
**నతిశయ హేతు వని చెప్పి రాయుర్వేదుల్**

**అన్వయం:** ఆహారంబు – అతిమధురము + అదీపనకరము; అతిలవణము – నయనకాంతి – హరము; అతి తిక్త + ఆమ్లము – ముదిమికిన్ – అతిశయ హేతువు + అని – ఆయుర్వేదుల్ – చెప్పిరి.

**వ్యాఖ్య:** అతిమధురమైన ఆహారం – అంటే తీపి అతిగా తినడం – (జఠరాన్ని) దీప్తిని తగ్గిస్తుంది. ఆకలిని చంపేస్తుందని (అదీపనకరము) – అత్యధికంగా ఉప్పు (లవణము) తింటే చూపు మందగిస్తుంది (నయన – కాంతి – హరము). కటికచేదూ రంకు పులుపూ (అతి తిక్తామ్లము) ముసలితనాన్ని (ముదిమి) శీఘ్రంగా తెచ్చిపెడతాయి – అని ఆయుర్వేదవేత్తలు చెబుతున్నారు.

**38. తే.గీ. దప్పి కుదకంబు మాఱు కూడొప్పదు గొన**
**క్షుధకుఁ గూటి మాఱుగ నీరు గ్రోలఁ జనదు**
**గుల్మమగు భగందరమునాఁ గురుపు వుట్టుఁ**
**జెలఁగి యీ రెండు నేరక చేసిరేని**

**అన్వయం:** దప్పికిన్ – ఉదకంబు – మాఱు – కూడు – కొనన్ – ఒప్పదు. క్షుధకున్ – కూటి మాఱుగన్ – నీరు – క్రోలన్ చనదు. చెలఁగి, ఈ – రెండు – నేరక – చేసిరేని – గుల్మము – అగున్. భగందరము – నాన్ – కురుపు – పుట్టున్.

**వ్యాఖ్య:** దప్పిక వేస్తే ఉదకం పుచ్చుకోవాలి అంతే గానీ దానికి మారుగ ఆహారం (కూడు) తినకూడదు (కొనన్ ఒప్పదు). అలాగే ఆకలి వేస్తే ఆహారం తినాలి. కూటికి బదులుగా (మాఱుగన్) నీరు త్రాగెయ్యకూడదు (క్రోలఁజనదు). తెలియక (నేరక) ఈ రెండూ అదేపనిగా (చెలఁగి) చేస్తే – అంటే – చాలాకాలం చేస్తే మొదటిదానికి ఫలంగా గుల్ల లేస్తుంది (గుల్మము – అగున్ = ప్లీహం ఉబ్బడం), రెండోదానికి ఫలితంగా భగందరము అనే పుండు (అల్సర్) లేస్తుంది (కురుపు పుట్టున్). మూలశ్లోకం:

**తృష్ణార్తస్తు నభుంజీత, క్షుధార్తో న పిబేజ్జలం**
**తృష్ణార్తో జాయతే గుల్మీ, క్షుధార్తస్తు భగందరీ** **(91)**

**39. తే.గీ. కుడువఁ దొణఁగుచు నీళ్ళను గ్రోలె నేని**
**దీపనము చెడుఁ దద్దయు దేహ మఱుగు**
**భుక్తి మధ్యోదకము గొంత పుష్టిఁ జేయుఁ**
**బిదప పానీయ మానుట పెద్ద మేలు**

**అన్వయం:** కుడువన్ – తొడఁగుచున్ (తొణఁగుచున్) నీళ్ళను – క్రోలెన్ + ఏనిన్ – దీపనము – చెడున్, తద్దయున్ – దేహము + అఱుగున్. భుక్తిమధ్య + ఉదకము – కొంత – పుష్టిన్ – చేయున్. పిదపన్ – పానీయము – ఆనుట – పెద్ద – మేలు.

**వ్యాఖ్య:** అన్నం తినబోతూ (కుడువఁ దొడఁగుచున్) ముందుగా నీళ్ళు తాగితే జఠరాగ్ని దీప్తి (దీపనము). మందగిస్తుంది – ఆకలి చెడుతుంది. క్రమంగా శరీరం కృశిస్తుంది (అఱుగున్). అన్నం తింటూ మధ్యే మధ్యే పానీయం అన్నట్టు మంచినీళ్ళు తాగితే అది కొంత మేలు. కొంతలో కొంత పుష్టికరం. అన్నింటికన్నా చాలా మంచిది – పెద్దమేలు – ఏదంటే – భోజనం ముగించిన తరవాత (పిదపన్) నీళ్ళు తాగడం (**అంతే శ్రేష్ఠం రసాయనమ్**).

**40. తే.గీ. కడుపు నాలుగు పాళ్ళనుగా నెఱింగి**
**రెండు పాళ్ళన్నమునను బూరింప వలయుఁ**
**బానమున నింపఁగా నొక పాలు వలయు**
**వాయు చలనకు నొకపాలు వలయు నెడము**

**అన్వయం:** కడుపు – నాలుగు – పాళ్ళనుగాన్ – ఎఱింగి – రెండు పాళ్ళు – అన్నమునను – పూరింప వలయున్ – పానమునన్ – నింపఁగాన్ – ఒకపాలు వలయున్ – వాయు చలనకున్ – ఒకపాలు – ఎడము – వలయున్

**వ్యాఖ్య:** ముప్పొద్దులా చెక్కపూటుగా అన్నం కుక్కెయ్యకూడదట బొజ్జలోకి. కడుపును నాలుగు భాగాలుగా గుర్తించమంటున్నాడు. అందులో సగమే (రెండు పాళ్ళు) అన్నంతో నింపాలి (పూరింపవలయున్). ఒక్క భాగం (1/4) నీటితో నింపాలి. మరొక భాగం (1/4) వాయుచలనానికి – ఊపిరాడటానికి – ఖాళీ వదిలిపెట్టాలి (ఎడము వలయున్). మూలశ్లోకం.

**అన్నేన కుక్షౌ ద్వావంశౌ పానేనైకం ప్రపూరయేత్**
**ఆశ్రయం పవనాదీనాం చతుర్థమవశేషయేత్** **(89)**

**41. తే.గీ. కుడిచినప్పుడ శయనింపఁ గడుపు పెరుగుఁ**
**గదల కెచ్చోటఁ గూర్చున్నఁ గలుగు సుఖము**

**అల్ల నడయాడ నాయువు నగ్గలించు**
**దూరమరిగిన మృత్యువునుఁ దోన యరుగు**

**అన్వయం:** కుడిచిన + అప్పుడ – శయనింపన్ – కడుపు – పెరుగున్ – కదలక + ఎచ్చోటన్ – కూర్చున్నన్ – సుఖము – కలుగున్. అల్ల – నడయాడన్ – ఆయువున్ + అగ్గలించున్. దూరము + అరిగినన్ – తోన – మృత్యువునున్ + అరుగున్.

**వ్యాఖ్య:** భోజనం ముగించిన తత్ క్షణమే (అప్పుడ) నడుం వాల్చేస్తే కచ్చితంగా బొజ్జ పెరుగుతుంది. కదలకుండా ఒక చోట కూర్చుండిపోతే – అది సుఖంగానే ఉంటుంది (సుఖము కలుగున్). అలాకాక కొంచెంసేపు కాసింత దూరం మెల్లమెల్లగానైనా నడిస్తే – ఆయుష్షు అతిశయిస్తుంది, పెరుగుతుంది (అగ్గలించున్). కాస్త ఎక్కువ దూరమే నడవగలిగితే (దూరము + అరిగినన్) నీ నడకతోపాటే మృత్యువు కూడా దూరం వెళ్ళిపోతుంది – దీర్ఘాయుష్యం లభిస్తుందని.

**విశేషాలు:** తిన్నవెంటనే పడుకోవడం, కూర్చోవడం, నడవడం, పరుగు పెట్టడంగా ఈ నాల్గింటినీ చెప్పాడు భోజరాజు. **భుక్త్వాతు శయనం స్థూలం, భుక్త్వా సంవిశతస్సుఖం, ఆయుష్యం చరమాణస్య, మృత్యుర్ధావతి ధావతి**. పరిగెత్తే వాణ్ణి (ధావతి విషయే) చూసి మృత్యువు పారిపోతుంది అన్నదాన్ని అప్పనమంత్రిగారు కొంచెం మార్చారు.

**42. కం. కడుపు కడుఁ బిక్కటిల్లినఁ**
**బొడమును మఱి దప్పి హీనభోజనుఁ డైనన్**
**బడుగగుఁ గావున సమ మగు**
**కుడుపున నే తెవులు లేక కొలఁది యొడ లగున్**

**అన్వయం:** కడుపు – కడున్ – పిక్కటిల్లినన్ – మఱి – దప్పి – పొడమును. హీనభోజనుఁడు + ఐనన్ –బడుగు + అగున్. కావునన్ – సమము + అగు – కుడుపునన్ – ఏ – తెవులున్ – లేక, కొలఁది + ఒడలు + అగున్.

**వ్యాఖ్య:** పొట్ట పగిలేలాగా నిండా (పిక్కటిల్లినన్) భుజిస్తే ఇక దప్పికే దప్పిక, భుక్తాయాసమూను. ఆపసోపాలు పడుతూ కూచోడమే (దప్పి అంటే అలసట – ఆయాసం అనే వాడుక కూడా ఉంది). అలాగని మరీ పిట్ట భోజనం చేస్తే (హీనభోజనుఁడు = అల్పభోజి) క్రమంగా మనిషి బక్కచిక్కి పోతాడు (బడుగగున్). కాబట్టి మరీ ఎక్కువా కాకుండా మరీ తక్కువా కాకుండా సమంగా భుజించాలి. సమంగా తినడం వల్ల (కుడుపునన్) మనిషి ఏ రోగమూ (తెవులు) లేకుండా తగినంత ఒళ్ళు చేసి (కొలది – ఒడలు) హాయిగా జీవిస్తాడు.

**43. కం. కుడుచు నతండైనను బె**
**ట్టెడు నా తండైన నపుడు డెందము రెండై**
**కడుఁ గోపముతో నుండినఁ**
**గుడిచిన యన్నంబు కాలకూటముఁ బోలున్**

**అన్వయం:** కుడుచునతండైనను – బెట్టెడునాతండు – ఐనన్ – అపుడు – డెందము – రెండై – కడున్ కోపముతోన్ – ఉండినన్ – కుడిచిన – అన్నంబు – కాలకూటమున్ – పోలున్.

**వ్యాఖ్య:** భోక్త కానీ (కుడుచునతండైనను) దాత కానీ (పెట్టెడు నాతండైనన్) ఏదో కారణంగా ఆ సమయంలో (అపుడు) మనస్సు వికలమై (రెండై) తీవ్రకోపావేశానికి లోనయితే ఆ తిన్న భోజనం కాలకూటవిషంతో సమానం – జీర్ణం కాదు, ప్రాణం తీస్తుంది అని.

భోక్త – దాతలిద్దరూ ప్రసన్న హృదయులై ఉండాలి అనడం.

**భోక్తుకామశ్చ దాతా చ క్రోధవాన్యది గర్హితః**
**అన్నం విషసమం ప్రాహు రజీర్ణం ప్రాప్నుయాన్నరః (79, 80)**

**భోక్తుకామశ్చ దాతా చ సాపరోధో విగర్హితః**
**అన్నం విషసమం ప్రాహురజీర్ణం ప్రాప్నుయాన్నరః (92)**

అని రెండు సందర్భాలలో రెండు శ్లోకాలలో చెప్పాడు భోజరాజు ఈ విషయాన్ని. భోజన సమయంలో – అసలు ఏ సమయంలోనైనా – మనస్సును నిర్మలంగా ఉంచుకోవడం మనిషి ఆరోగ్యానికి చాలా కీలకమని చెప్పడం వీటి పరమార్థం.

**44. కం. కుడిచిన పిమ్మటఁ జేతులు**
**తుడిచి నియతి వార్చి మధనతోయము నియతిన్**
**బిడిచికొనవలయుఁ గన్నులఁ**
**బొడమఁగరా వక్షిరోగములునట్లైనన్**

**అన్వయం:** కుడిచిన – పిమ్మటన్ – చేతులు – తుడిచి, నియతిన్ – వార్చి, మధన – తోయమున్ – నియతిన్ – కన్నులన్ – పిడిచికొనవలయున్; అట్లు + ఐనన్, అక్షిరోగములు – పొడమఁగరావు.

**వ్యాఖ్య:** దీనికి మూల శ్లోకం ఇలా ఉంది – **భుక్త్వా తు మధితం సమ్యక్ కరాభ్యాం చ విశేషతః తత్తోయం నేత్రయోః క్షిప్త్వా నేత్రరోగం జయేన్నరః** (94). ఈ నేపథ్యంలో

దీని వ్యాఖ్య. భోజనం ముగించిన వెంటనే చేతులు కడుక్కోవాలి (తుడిచి). నియమబద్ధంగా (నియతిన్) ముమ్మారు ఆచమించాలి (వార్చి) – పుక్కిలించాలి. అప్పుడు ఆ తడిచేతుల్ని ఒండొంటితో గట్టిగా రుద్దాలి. అవసరమైతే రెండు చుక్కలు నీళ్ళు వేసుకుని మరీ రుద్దాలి. అలా మథించిన నీటిని (మథనతోయమున్) ఒక నియమంగా (నియతిన్) అంటే నిత్యమూ కన్నులకు పులుముకోవాలి (పిడిచికొనవలయున్). రాపిడికి కాసింత వేడెక్కిన రెండు చేతుల తడినీ కన్నులకు అద్దాలనడం. ఇలా చేస్తే (అట్లైనన్) కంటిరోగాలు అనేవి మన దరిదాపులకు రావు (పొడమఁగరావు).

**45. కం. దళముగఁ గ్రోలుచు నుండిన**
**జల మేమియు నానకున్న జఠరము శిఖి దు**
**ర్బలమగు నన్నం బఱుఁగదు**
**పలుమఱు నగు నల్పవారిఁ బానముసేయన్**

**అన్వయం:** దళముగన్ – జలము – క్రోలుచునుండినన్ – ఏమియున్ – ఆనకున్నన్ – జఠరము – శిఖి – దుర్బలము – అగున్. అన్నంబు + అఱుఁగదు. పలుమఱున్ – అల్పవారిన్ – పానము + చేయన్ – అగున్.

**వ్యాఖ్య:** ఎక్కువగా (దళముగన్) నీళ్ళు తాగేస్తూ ఏమీ తినకుండా ఉన్నట్టయితే (ఆనకున్నన్) పొట్టలోని జఠరాగ్ని బలహీనపడుతుంది. తిన్నదాన్ని అరిగించడానికి కడుపులో ఊరే ఆమ్లాదులు పల్చబడిపోతాయనడం. అటుపైని తిన్నది ఏదీ జీర్ణం కాదు (అఱుఁగదు). అజీర్తి రోగం పట్టుకుంటుంది.

అందుకని కొంచెం కొంచెంగా నీటిని (అల్పవారిన్) పలు పర్యాయాలుగా పుచ్చుకోవడం (పానము + చేయన్) చెయ్యాలి. ఇలా ఎక్కువ నీరు తాగాలట. దీన్నే భోజుడు శబ్దాలంకారసుందరంగా చెప్పాడు.

**తస్మాన్నరో వహ్ని వివర్ధనాయ ముహుర్ముహుర్వారి పిబేత భూరి**
**పిబేద్ఘటసహస్రాణి యావద స్తం గతే రవౌ (87, 88)**

## తాంబూల పద్ధతి

**46. సీ. కఠినమై దొడ్డచిక్కణమునై వత్సరా**
**ర్ధప్రమాణము ప్రాఁతఁదనము గలిగి**

**యుజ్జ్వలచ్ఛాయమై యొత్తిన తరువాయి**
**శశమాంసఖండంబు చంద మగుచు**
**నొగ రించుకయు లేక మిగులంగఁ దీపైన**
**క్రముకంబు, నొఱ్ఱనై కమ్మవలచి**
**దళ మెక్కి పండిన తాంబూల దళములు**
**క్షారోపలంబులు గాల్చి వడియఁ**

**గీ. గట్టినటువంటి చూర్ణంబుఁ గా నొనర్చి**
**భుక్తి ముందర నాలుగు భోజనోత్త**
**రమున రెండును నట మీఁద రాత్రి నాఱు**
**మార్లుఁ దాంబూల మొప్పారు మంత్రియప్ప**

**అన్వయం:** మంత్రియప్ప! – కఠినమై – దొడ్డ – చిక్కణమునై – వత్సరార్ధ ప్రమాణము – ప్రాఁతఁదనము – కలిగి, ఉజ్జ్వలచ్ఛాయమై, ఒత్తిన – తరువాయి – శశమాంసఖండంబు చందము – అగుచున్ – ఒగరు – ఇంచుకయున్ – లేక – మిగులంగన్ – తీపైన – క్రముకంబున్; ఒఱ్ఱనై – కమ్మవలచి – దళము – ఎక్కి – పండిన – తాంబూలదళములున్; క్షార + ఉపలంబులు – కాల్చి – వడియన్ – కట్టినటువంటి – చూర్ణంబున్ - కాన్ – ఒనర్చి; భుక్తిముందరన్ – నాలుగు, భోజనోత్తరమునన్ – రెండునున్; అఁటమీఁదన్ – రాత్రి – ఆఱుమార్లున్ – తాంబూలము – ఒప్పారున్.

**వ్యాఖ్య:** మంత్రివర్యా! తాంబూలంలో ఉపయోగించే పోక ఎలా ఉండాలంటే గట్టిగా, బాగా నున్నగా ఉన్నదీ (చిక్కణమునై) ముదిరినదీ కావాలి. ఒకటిన్నర సంవత్సరాలు గానీ లేదా కనీసం ఆరునెలల (వత్సరార్ధ) క్రిందటిది అంటే ప్రాతది (మూలంలో కాలప్రస్తావన లేదు) కావాలి. బాగా ప్రకాశిస్తూ ఉండాలి. అడకత్తెరలో పెట్టి రెండు ముక్కలుగా కత్తిరించాక (ఒత్తిన తరువాయి) చెవులపిల్లి మాంసం ముక్కలాగా కనబడాలి (శశమాంసఖండంబు చందమగుచున్), ఒగరు ఏమాత్రం ఉండకూడదు. బాగా తీపిగా ఉండాలి. అటువంటి పోక /వక్క ఉపయోగించాలి.

ఇక తమలపాకు ఎలా ఉండాలంటే మంత్రివర్యా విను – కారంగా (ఒఱ్ఱనై), పరిమళిస్తూ (కమ్మవలచి) దళసరిగా (దళమెక్కి) ఉండాలి. వేసుకోగానే పండాలి. అలాంటి తమలపాకుల్ని (తాంబూలదళములు – పండుటాకులు) ఉపయోగించాలి.

ఇక సున్నం ఎలా ఉండాలంటే బట్టీలో బాగా కాల్చి, సున్నపు రాళ్ళను

(క్షారోపలంబులు) మెత్తగా నూరి వస్త్రకాళితం పట్టాలి (వడియగట్టి). ఆ చూర్ణాన్ని (సున్నం) మాత్రమే ఉపయోగించాలి.

ఈ మూడింటితో అయ్యేట్టు (కాన్) చేసుకొన్న తాంబూలాలను – భోజనానికి ముందు నాలుగు సార్లు, భోజనానంతరం (భోజనోత్తరమునన్) రెండు సార్లు, ఆపైని రాత్రి పడుకునేలోగా ఆరుసార్లు (మార్లు) వేసుకోవాలి. ఇది ఒప్పారే విధమూ ఒప్పారే సంఖ్యాను.

**విశేషాలు:** మూడవపాదంలో – కారోపలంబులు గాల్చి – అనే పాఠమే ముద్రితకావ్యంలో ఉంది. కానీ మూలంలో

**సుధాపాషాణజం వాపి శంఖేనాపి వినిర్మితం**
**శుక్తి శంబూక సంభూతం చూర్ణం ముక్తా ఫలోద్భవమ్** (104)

అని ఉంది. సుధకు (సున్నం) క్షారం పర్యాయపదం. కాబట్టి క్షారోపలంబులు గాల్చి అని పాఠం పరిష్కరణ.

**47.** సీ. **పోఁకకు మూఁటి చొప్పునఁ బర్ణములు గూర్చి**
**తగుఁ జేయ రేపటి తమ్ములములు**
**నాలుగు నైదును నోలిన కొలఁది మ**
**ధ్యాహ్న నిశీథినీ సమయములను (?)**
**కాఁచు పథ్యము రేపకడ తమ్ములములతోఁ**
**దొలిఁ దొలి నొక రెంటఁ గలయ వలయు**
**నంతంత నెక్కించి యఁటమీఁదఁ జేయు త**
**మ్ములములయందుఁ గప్పురము మేలు**

గీ. **తొడిమెయును దుదయును బుచ్చి నడిమి యీనె**
**లేక తడియొత్తి మడఁచిన యాఁకు లెస్స**
**ప్రథమ రసమును రెండవ రసము నుమిసి**
**యంత మీఁదట రస మాను టమృతసేవ**

**అన్వయం:** రేపటి తమ్ములములు – పోఁకకున్ – మూఁటిచొప్పునన్ – పర్ణములు – కూర్చి – చేయన్ – తగున్. నాలుగును – ఐదునున్ – ఓలినకొలఁదిన్ – మధ్యాహ్న – నిశీథినీ సమయములను – తగున్. కాఁచు – పథ్యము – రేప కడ – తమ్ములములతోన్. తొలిఁదొలిన్ – ఒకరెంటన్ – కలయవలయున్. అంతంతన్ – ఎక్కించి – అఁటమీఁదన్ – చేయు – తమ్ములములయందున్ – కప్పురము –

మేలు. తొడిమెయును – తుదయును – పుచ్చి, నడిమి – ఈనె – లేక – తడి – ఒత్తి – మడఁచిన – ఆఁకు – లెస్స. ప్రథమరసమును – రెండవ – రసమును – ఉమిసి – అంతన్ – మీఁదట – రసము – ఆనుట – అమృతసేవ.

**వ్యాఖ్య:** ప్రాతఃకాలంలో (రేపటి) ఒక పోకకు మూడు ఆకులు చొప్పున కూర్చిన తాంబూలం, మధ్యాహ్న – రాత్రి (నిశీథినీ) సమయాలలో నాలుగు లేదా ఐదు లేదా కోరుకున్నన్ని (ఓలినకొలది) ఆకులతో వేసుకోవడం తగినది. ప్రాతఃకాల తాంబూలంలో (రేపకడ తమ్ములములతోన్) కాచు అంటే కవిరి వాడటం ఆరోగ్యానికి మంచిది (పథ్యము). తొలితొలిగా ఒకటి రెండింటితోనైనా కాచు కలవాలి (కలియవలయున్). అటుపై సంఖ్య పెంచుతూ ఆకులు పెంచుతూ చేసే తాంబూలాలలో కవిరి (కాచు) బదులు కప్పూరం చేర్చడం మంచిది.

ఇక తమలపాకుకు చెయ్యవలసిన శుద్ధి ఏమిటంటే – తొడిమెనూ, తోకనూ (తుదయును) తుంపి, నడిమి ఈనె తొలగించి, తడి – పోయేలాగా పొడిగుడ్డతో ఒత్తాలి (తడిఒత్తి). ఆపై దాన్ని సున్నితంగా మడిచి – చిలకలు చుట్టి వేసుకోవాలి. ఇది లెస్స. అలా తాంబూలం వేసుకున్నాక వెంటనే నోటిలో ఊరే ప్రథమ రసాన్నీ రెండవ రసాన్నీ మింగకుండా ఉమ్మేసెయ్యాలి. ఆ మీదట ఊరే రసాన్ని ఆస్వాదించడం అమృతాస్వాదనమే (అమృతసేవ) అవుతుంది.

**విశేషాలు:** మూలశ్లోకాలు

**ప్రాతః పూగీఫలాధిక్యం మధ్యాహ్నేఽధికచూర్ణతా**
**రాత్రౌతు పర్ణబాహుళ్యమ్ ఏతత్తాంబూల లక్షణమ్** **(117)**

**ఆదౌ విషోపమం పీతం ద్వితీయం భేది దుర్జరం**
**పశ్చాత్సుధాసమం పీతం సమ్యగ్జీర్ణం సుఖావహమ్** **(110)**

పొద్దుటి తాంబూలంలో పోకలూ, మధ్యాహ్నతాంబూలంలో సున్నమూ, రాత్రివేసే తాంబూలంలో ఆకులూ – ఎక్కువ ఉండాలి. నోట ఊరిన రసం – ప్రథమరసం – విషతుల్యం. రెండవది మలబద్ధకాన్ని కలిగిస్తుంది (భేదిదుర్జరమ్). అటుపైది అమృతప్రాయమే (సుధా సమమ్). జీర్ణకారి. సుఖావహం. ఇదీ భోజుడి అంతరంగం. అప్పనమంత్రి కొంచెం మూలవిస్తరణ చేశాడు.

రెండవ సీసపాద ఉత్తరార్ధంలో యతిభంగం. అఖండయతిగానీ వైరి సమాసంగానీ కాకుండా దీన్ని పరిష్కరించాలంటే సమయములను అనే దానికి తుల్యార్థకంగా హరిమములను అనడం మేలు (హరిమన్ = సమయం, కాలం, వేళ).

## తాంబూల ప్రయోజనాలు

**48. కం. తాంబూల దళములకు నై**
**జం బయ్యెను గుణము భేదశక్తియుఁ గఫపై**
**త్త్యంబులఁ జెఱుచుటయును గం**
**దంబు మొగంబునకు నొసఁగఁ దాఁజాఁలుటయున్**

**అన్వయం:** భేద – శక్తియున్, కఫపైత్త్యంబులన్ – చెఱుచుటయును, మొగంబునకున్ – గందంబు + ఒసఁగన్ – తాన్ – చాఁలుటయున్; తాంబూల దళములకున్ – నైజంబు – గుణము – అయ్యెను.

**వ్యాఖ్య:** మలవిసర్జన సుఖంగా అయ్యేట్టు చెయ్యగలిగిన శక్తి (భేదకశక్తి కలది = భేది = విరేచనకారి) తమలపాకులకు (తాంబూలదళములకున్) సహజగుణం. అలాగే గొంతులో పేరుకున్న శ్లేష్మాన్నీ (కఫ) పెచ్చుపెరిగిన పైత్త్యాన్నీ (పిత్తరస విజృంభణతో వచ్చే బాధ) హరించగల్గిన శక్తి తమలపాకులకున్న మరో సుగుణం. నోటి దుర్వాసన తొలగించి మంచి పరిమళాన్ని (గందంబు) తానై ఇవ్వగలగడం (వక్త్రే దుర్గంధనాశనమ్) దానికున్న ఇంకో సుగుణం. ఇవి తాంబూల దళాల (నాగపత్రాలు) నైజగుణాలు – ప్రకృతిసిద్ధ గుణాలు.

**కఫవాతహరం బేది నాగపత్రం ప్రకీర్తితం**
**దీపనం క్రిమిదోషఘ్నం విశదం నిర్మలం లఘు** **(103)**

**49. కం. పూగమునకు గుణములు పై**
**త్త్యాగమముం జెఱుచుటయును నాఁకలి మృదులీ**
**లాగతిఁ బుట్టించుటయును**
**వేగమె దాహంబు నణఁచు విన్నాణంబున్**

**అన్వయం:** పైత్త్యాగమమున్ – చెఱుచుటయునున్, ఆఁకలిన్ – మృదులీలాగతిన్ – పుట్టించుటయును, వేగమె – దాహంబున్ – అణఁచు + విన్నాణంబున్, పూగమునకున్ – గుణములు.

**వ్యాఖ్య:** తాంబూలంలో వాడే మేలిమి పోకలకు (పూగమునకున్) - పైత్త్యం రాకుండా ఆపడం (పైత్త్యాగమమున్ చెఱుచుటయును), మెల్లమెల్లగా (మృదులీలాగతిన్) ఆకలి పుట్టించడం, వేగంగా దప్పికను (దాహంబున్) అణచే నేర్పు (విన్నాణంబున్) – ఇవి స్వభావసిద్ధమైన గుణాలు (ఇది అమూలకం).

**50. సీ. లఘుకారి క్రిమిదోష విఘటనసంధాయి**
**దీపననిర్దోష దీప్తికరము**
**పాషాణచూర్ణంబు పైత్త్యవాతఘ్నంబు**
**శంఖచూర్ణము పైత్త్య శైత్యహరము**
**చిప్పల సున్నంబు శ్లేష్మంబు హరియించు**
**గుల్లసున్నము వాత గుణముఁజెఱుచుఁ**
**దెలివిచ్చుఁ జాల ముత్తియపు సున్నము చూర్ణ**
**పర్ణ మాయువునకు బాధకంబు**

**గీ. పత్త్రమూలంబునను రోగపటల ముండు**
**నగ్ర మది పాపముల కెల్ల నాలయంబు**
**నడిమి యీనియ బుద్ధివినాశకరము**
**వీని వర్జించి తగఁ జేయు వీడియంబు**

**అన్వయం:** వీడియంబు – లఘుకారి – క్రిమిదోష – విఘటన – సంధాయి – దీపన నిర్దోష దీప్తికరము; పాషాణ – చూర్ణంబు – పైత్త్యవాతఘ్నంబు; శంఖచూర్ణము – పైత్త్య – శైత్య – హరము; చిప్పల – సున్నంబు – శ్లేష్మంబు – హరియించున్; గుల్లసున్నము – వాతగుణమున్ – చెఱచున్; తెలివి – ఇచ్చున్ – చాలన్ – ముత్తియపు సున్నము; చూర్ణపర్ణము – ఆయువునకున్ – బాధకంబు; పత్త్ర –మూలంబునను – రోగ – పటలము – ఉండున్; అగ్రము – అది – పాపములకున్ – ఎల్లన్ – ఆలయంబు; నడిమి – ఈనియ – బుద్ధి – వినాశకరము; వీనిన్ – వర్జించి – తగన్ – చేయు(ము).

**వ్యాఖ్య:** తాంబూలం (వీడియంబు) తేలికతనం కలిగిస్తుంది (లఘుకారి = భేది). నోటిలోనూ కడుపులోనూ క్రిమిదోషాలను పోగొడుతుంది (క్రిమిదోష విఘటన సంధాయి).

జఠరాగ్నికి దోషం తొలగించి దీప్తిని కలిగిస్తుంది (దీపన నిర్దోష దీప్తికరము).

రాతిసున్నపు పొడి (పాషాణ చూర్ణము). పైత్త్యాన్ని, వాతాన్ని పోగొడుతుంది (పైత్త్యవాతఘ్నంబు).

శంఖపు పొడి (శంఖచూర్ణము) పైత్త్యశైత్యాలను (జలుబులు) హరిస్తుంది. చిప్పల సున్నము (శుక్తిజం) శ్లేష్మాన్ని హరిస్తుంది. గుల్లసున్నం (శంబూకజం) వాతాన్ని పోగొడుతుంది. ముత్యాల సున్నము (ముక్తాచూర్ణం) మిక్కిలి తెలివిని ఇస్తుంది.

వడిలిపోయిన లేదా నలిగి చిరిగిపోయిన తమలపాకు (చూర్ణ పర్ణము) ఆయువు హరిస్తుంది. ఆకు అడుగు భాగంలో (తోక – మూలము) రోగాలుంటాయి. ఆకు అగ్రభాగం (తొడిమె) అది పాపాలకు నిలయం (ఆలయంబు). మధ్య ఉన్న ఈనె (దీనినే నరం అంటారు) బుద్ధిని నశింపజేస్తుంది. అందుకని తలా తోకా తుంపి, ఈనె తీసేసి తగిన విధంగా తాంబూలం చేసుకో, వేసుకో (చేయుము. హల్లుపరంగా ఉంది కనుక మధ్యమపురుష మువర్ణకానికి లోపం వచ్చింది).

**విశేషాలు: మూలశ్లోకాలు –**

**దీపనం క్రిమి దోషఘ్నం విశదం నిర్మలం లఘు** **(103)**

**చూర్ణం పాషాణ సంభూతం త్రిదోషశమనం లఘు**
**వాతపిత్తహరం శంఖం శుక్తిజం శీతలం భవేత్** **(105)**

**జంబూకం శ్లేష్మదోషఘ్నం ముక్తాచూర్ణం తు వాతనుత్**
**మనసో హర్షణం శ్రేష్ఠం రతిదం మదకారణమ్** **(106)**

**ఇక తమలపాకుల సంగతి –**

**పర్ణమూలం భవేద్వ్యాధిః పర్ణాగ్రం పాపసంభవం**
**చూర్ణం పర్ణం హరత్యాయుః సిరాబుద్ధివినాశినీ** **(119)**
**తస్మాదగ్రం చ మూలం చ నరాం చైవ వివర్జయేత్**
**చూర్ణపర్ణం వర్జయిత్వా తాంబూలం ఖాదయేత్సుధీః** **(120)**

**51.** చం. **వదన వికాస సౌరభ వివర్ధనకారి లసన్మదాపహం**
**బుదర విశేష సౌఖ్యకర ముద్ధతదోషబలప్రహారి స**
**మ్మదజనకంబు తమ్ములము మానవతీపరిభోగవేళలన్**
**మదనపునర్భవీకరణమంత్రము తుల్యమె దాని కెద్దియున్**

**అన్వయం:** తమ్ములము – వదన – వికాస – సౌరభ – వివర్ధనకారి, లసత్ + మద + అపహంబు, ఉదర – విశేష – సౌఖ్యకరము, ఉద్ధత – దోష – బల – ప్రహారి, సమ్మద – జనకంబు, మానవతీ – పరిభోగ – వేళలన్ – మదన – పునర్భవీకరణ – మంత్రము; దానికిన్ – ఎద్దియున్ – తుల్యమె!

**వ్యాఖ్య:** తాంబూలము (తమ్ములము) ముఖవికాసాన్ని, సౌరభాన్ని ఇనుమడింపజేస్తుంది (వివర్ధనకారి). పెరిగిన కొవ్వును (లసన్మద) హరిస్తుంది. ఉదరానికి విశేషసౌఖ్యాన్ని కలిగిస్తుంది. ఉద్ధతాలైన (వాతపిత్తాది) దోషాల బలాన్ని హరిస్తుంది. ఆనందాన్ని (సమ్మద) కలిగిస్తుంది. స్త్రీ సంగమ సమయాలలో (మానవతీ పరిభోగవేళలన్) మన్మథుణ్ని మళ్ళీ మళ్ళీ ఉత్తేజపరిచే (మదన పునర్భవీకరణ) దివ్య మంత్రం – తాంబూలం. ఇటువంటి తాంబూలానికి సాటిరాగలది ఏదీలేదు.

**52. తే.గీ. క్షీరభోజియై యపుడు వేగిరముతోడఁ**
**తమ్ములముఁ గొన్నఁ గుష్ఠ మాతని నశించు**
**గడియలోఁ గొన్న మేహంబు గదురు నౌల**
**గడియలోఁ గొన్న మూత్రరోగంబు నొందు**

**అన్వయం:** క్షీరభోజియై – అపుడు – వేగిరముతోడన్ – తమ్ములమున్ – కొన్నన్ – ఆతనిన్ – కుష్ఠము – అశించున్. గడియలోన్ – కొన్నన్ – మేహంబు – గదురున్, ఔలగడియలోన్ – కొన్నన్ – మూత్రరోగంబున్ – ఒందున్.

**వ్యాఖ్య:** పాలు త్రాగినవాడు (క్షీరభోజి) తాగిన వెంటనే తాంబూలం సేవించినట్లయితే వాడిని కుష్ఠువ్యాధి తినేస్తుంది (అశించున్. అశ భక్షణే). పాలుతాగి గడియ కాలం గడిచాక తాంబులం సేవించినట్లయితే వాడికి మధుమేహం సోకుతుంది (గదురున్). అటుపైని (ఔలన్) మరో గడియ గడిచాక తాంబూలం వేసుకున్నవాడికి అతిమూత్రరోగం వస్తుంది. అందుకని పాలుతాగిన వెంటనే తాంబూలం వేసుకోకూడదు. కనీసం రెండు గడియలు ఆగి వేసుకోవచ్చు.

**మూలశ్లోకం –**

**క్షీరం పీత్వా ముహూర్తేన తాంబూలం యది చర్వితం**
**కుష్ఠీ భవతి మేహీ చ మూత్రదోషీ చ వా భవేత్** (111)

**53. సీ. ఒప్పని గంధంబు నొందకున్కియ కాదు**
**మొగమునఁగల రోగములనుఁ జెఱుచుఁ**
**జెదరని కెంజాయఁ జెంది దంతములు ము**
**ప్పోర్చునట్లుగఁ జేయు నుదరశుద్ధిఁ**
**గలిగించుఁ గర్పూర కలిత తాంబూలంబు**
**కఫవాత పైత్త్యంబు క్రాఁచు భేది**

**రక్త పైత్త్యహరంబు రతిసౌఖ్యదము నాసి**
**కాగదసంక్షయకారణంబు**

**గీ. కన్నులకు శైత్య మొనరించుఁ గంఠమునకు**
**మధురరుచిఁ జేయుఁ బొందించు మంగళములు**
**ద గ్గఱుఁగు జిహ్వ చెడ దెట్టి దప్పియైన**
**తిమ్మఁబడుఁ గప్పురముతోడి తమ్మలమున**

**అన్వయం:** కర్పూర – కలిత – తాంబూలంబు – ఒప్పని – గంధంబున్ – ఒందక – ఉన్కియ కాదు – మొగమునఁగల – రోగములనున్ – చెఱుచున్, చెదరని – కెంజాయన్ – చెంది – దంతములు – ముప్పు – ఓర్చునట్లుగన్ – చేయున్, ఉదరశుద్ధిన్ – కలిగించున్; కఫవాతపైత్త్యంబు – క్రాఁచున్ – బేది, రక్తపైత్త్యహరంబున్, రతిసౌఖ్యదము, నాసికా – గద – సంక్షయ – కారణంబు. కన్నులకున్ – శైత్యము – ఒనరించున్, కంఠమునకున్ – మధురరుచిన్ – చేయున్, మంగళములు – పొందించున్, కప్పురముతోడి తమ్ములమునన్ – దగ్గు – అఱుఁగున్, జిహ్వ – చెడదు, ఎట్టి – దప్పియైనన్ – తిమ్మఁబడున్.

**వ్యాఖ్య:** కర్పూరతాంబూలం నోటిదుర్వాసన రానివ్వదు. అంతేకాదు నోటిరోగాలనూ పోగొడుతుంది. చక్కని చెదరిపోని ఎర్రనిచాయను (కెంజాయన్) పొందేలా చేస్తూ దంతసౌష్ఠవాన్ని ఇస్తుంది. నొప్పినీ ముప్పునూ తట్టుకోగలిగేలా (ఓర్చునట్టుగన్) గట్టిపరుస్తుందని. ఉదరశుద్ధిని కలిగిస్తుంది. కఫ, పైత్త్య, వాతాలను హరిస్తుంది (క్రాఁచున్). రక్తపైత్త్యాన్ని హరిస్తుంది. మదనోద్దీపకమై రతిసౌఖ్యాన్ని ఇనుమడింపజేస్తుంది. ముక్కుకు సంబంధించిన రోగాలను (గద) పోగొడుతుంది. కన్నులకు చల్లదనాన్ని (శైత్యం). కంఠానికి మంచి స్వరాన్ని (మధుర రుచిన్) కలగజేస్తుంది. శుభాలను కలగజేస్తుంది. పచ్చకప్పురం పలుకులతో జతగూడిన తమ్ములంతో దగ్గు తగ్గుతుంది (అఱుఁగున్). నాలుక చెడదు. ఎటువంటి దప్పిక అయినా నెమ్మదిస్తుంది (తిమ్మబడును).

మూల శ్లోకాలు –

**ముఖరోగ క్రిమిహరం తాంబూలం చంద్రసంయుతం**
**దంతానాం స్థైర్యదం చైవ వక్త్రే దుర్గంధనాశనమ్** **(107)**

**శ్లేష్మరోగహరం రుచ్యం నేత్రరోగహరం శుభమ్**
**పిత్తదోష ప్రశమనం రక్త పిత్త ప్రవర్ధనం** **(108)**

**ముఖరోగక్రిమిహరం ఖాదిరేణ విమిశ్రితం**
**నాసారోగహరం కంఠ్యం తాంబూలం చంద్రసంయుతమ్ (109)**

**54. ఆ.వె. క్షయము రక్తపైత్త్యగతి వెట్టి భ్రమ పాండు**
**రోగ మక్షిగదము రొమ్ము నొప్పి**
**కడుపు నొప్పి గ్రహణి క్షయ కాస గలిగిన**
**వారు తమ్ములమ్ము వలదు చేయ**

**అన్వయం:** క్షయము – రక్తపైత్త్యగతి – వెట్టి – భ్రమ - పాండురోగము – అక్షిగదము – రొమ్మునొప్పి – కడుపునొప్పి – గ్రహణి – క్షయ – కాస – కలిగినవారు – తమ్ములమ్ము – చేయన్ వలదు.

**వ్యాఖ్య:** క్షయరోగము, రక్తపైత్త్యగతి, వెట్టి, భ్రమ (తల తిరుగుడు), పాండురోగము, అక్షిరోగము (గదము), రొమ్మునొప్పి, (అతిసారతో) కడుపునొప్పి, గ్రహణి, క్షయ, దగ్గు (కాస) ఉన్నవారు తాంబూలము సేవించరాదు.

**అక్షిరోగీ క్షయీ పాండురోగీ భ్రమమదాత్యయా**
**అపస్మారీ శ్వాసరోగీ హృద్రోగీ రక్తపైత్త్యకీ (112)**

**గ్రహణీవా నతీసారీ తాంబూలం పరివర్జయేత్ (113)**

## స్త్రీ సంభోగ పద్ధతి

**55. కం. పగలును సంధ్యలుఁ బర్వము**
**లగు దినముల నిశలు నుడిగి యర్థపు రాత్రుల్**
**మిగులఁగఁ దమకము సేయక**
**తగు నయ్యైదినము లెఱిఁగి తరుణులఁ గవయన్**

**అన్వయం:** పగలును – సంధ్యలున్ – బర్వములు – అగు – దినములన్ – నిశలున్ – ఉడిగి, అర్థపురాత్రుల్ – మిగులఁగన్ – దమకము చేయక – ఆ – ఆ – దినములు – ఎఱిఁగి – తరుణులన్ – గవయన్ – తగున్.

**వ్యాఖ్య :** పగళ్ళూ సంధ్యాసమయాలూ, పర్వదినాల రాత్రిళ్ళూ (పర్వము. పంచపర్వములు. అష్టమి, చతుర్దశి, కుహువు, పూర్ణిమ, రవిసంక్రాంతి) విడిచిపెట్టగా (మిగులఁగన్) మిగిలిన అర్థమైనరాత్రులలో మాత్రమే ఏవి అర్థమైనరోజులో ఏవి కావో తెలుసుకొని తొందరపడకుండా (తమకము చేయక) స్త్రీలతో సమాగమించాలి.

**56. కం. సురతంబు పగలు చేసినఁ**
**బురుషుని యాయువు నశించుఁ బుట్టును బాపో**
**త్కరమగు సంతతి సంధ్యల**
**సిరి దొలఁగును బర్వతిథుల సిద్ధము రాత్రిన్**

**అన్వయం :** పగలు – సురతంబు – చేసినన్ – పురుషుని – ఆయువు – నశించున్. సంధ్యలన్ –సురతంబు – చేసినన్ – పాప – ఉత్కరము – అగు – సంతతి – పుట్టును. పర్వతిథులన్ – సురతంబు – చేసినన్, సిరి – తొలఁగును. రాత్రిన్ – సిద్ధము.

**అన్వయం :** పగలు సురతం చేసినట్లయితే పురుషుడి ఆయుష్షు నశిస్తుంది. సంధ్యవేళల్లో కలిస్తే అధికపాపయుతమైన (పాప ఉత్కరము) సంతానం కలుగుతుంది. పర్వతిథులలో చేసే సురతం వల్ల సిరి తొలగిపోతుంది. రాత్రిపూట మంచిది (సిద్ధము).

**57. సీ. (పరికింప ధరలోను బురుషులకును) వర్జనీయలు**
**తగఁ దన్ను నేలి నాతని పురంధ్రి**
**బంధువు నిల్లాలు బ్రాహ్మణోత్తముభార్య**
**చెలికాని పడఁతి వీరల దలంప**
**మాతృసమానలు మనువు దప్పిన యింతి**
**కన్నియ ముదిసిన కాంత రూప**
**శీలగుణమ్ముల చేత జిక్కి నిందిత యైన**
**మగువయుఁ దనజాతిమాత్రకంటె**

**గీ. నతిశయం బగు వర్ణంబు నతివ, బొగ్గు**
**చాయమేనిది కడుఁ బల్లచాయ పడఁతి**
**పెద్దవళులది కడురోగి తద్ద బడుగు**
**గేడి గుజ్జనఁ బడు వీరి గూడఁజనదు**

**అన్వయం, వ్యాఖ్య:** ఎటువంటి స్త్రీలతో పురుషుడు రమించకూడదో చెప్తున్నాడు. మొదటి సీసపాదంలో పూర్వార్ధంలోని అర్ధభాగం క్రిమిదష్టం. పూరించి కుండలీకరించాను.

రాజుగారి భార్య (తగఁ దన్ను నేలి నాతని పురంధ్రి), బంధువు ఇల్లాలు, బ్రాహ్మణోత్తముడి భార్య, మిత్రుడి భార్య(చెలికాని పడఁతి), వీరితో సమాగమింపకూడదు. వీరు విడిచిపెట్టవలసినవారు(వర్జనీయలు). ఆలోచిస్తే వీరు

తల్లితో సమానమైనవారు కూడా. విధవ (మనువు దప్పిన యింతి), కన్నియ, వృద్ధస్త్రీ (ముదిసిన కాంత), రూపమూ శీలమూ గుణమూ వీటి చేత చిక్కి నిందితురాలైన స్త్రీ(మగువ), తనజాతిమాత్రం కంటే నతిశయమైన అంటే ఉన్నతకులానికి (వర్ణంబు) చెందిన స్త్రీ (నతివ), బొగ్గులా నల్లని శరీరఛాయకలదీ (బొగ్గు చాయ మేనిది), ముదురు రాగిరంగులో ఉండే స్త్రీ (కడుఁ బల్లచాయ పడఁతి), పెద్దవళులు కలది, కడురోగి, బాగా బక్కపల్చటిదీ (తద్ద బడుగు), బాగా పొడుగుదీ (గేడి) పొట్టిదీ (గుజ్జు) అనబడే స్త్రీలను కలవకూడదు(వీరి గూడఁ జనదు).

**విశేషాలు:** మూలంలో భోజుడు త్యజించమన్న స్త్రీలు వీరే. కురూపిణీ, సుశీలా, విధవ, పరస్త్రీ, అతికృష్ణ = నల్లనిది, హీన = బక్కది, పుత్రుడి భార్య, మిత్రుడి భార్య, రాజు భార్య, అంత్యకులోద్భూత, వృద్ధస్త్రీ, కన్యక.

**రాత్రౌ వ్యవాయం కుర్వీత యోషితం యౌవనే స్థితాం**
**కురూపిణీం సుశీలాం తు విధవాం చ పరస్త్రియం** **(121)**

**అతికృష్ణాం చ హీనాం చ పుత్రమిత్రనృపస్త్రియం**
**త్యజేదంత్యకులోద్భూతాం వృద్ధస్త్రీకన్యకాం తథా** **(122)**

అయితే అప్పనమంత్రి అనువాదంలో వీరిలో కొందరు ఉన్నారు. అదనంగా మరికొందరు వచ్చి చేరారు. వారు బంధువు ఇల్లాలు, బ్రాహ్మణోత్తముడి భార్య, రూపమూ శీలమూ గుణమూ వీటి చేత చిక్కి నిందితురాలైన స్త్రీ, పల్లచాయ పడఁతి, పెద్దవళులు కలది, కడురోగి, బాగా పోడుగరీ పొట్టిదీను. మూలానికి స్వతంత్రంగా తన కాలం నాటి నియమాలను జోడించి చెప్తున్నాడు కాబట్టి మొదటిపాదంలో కవి ఉద్దేశించిన స్త్రీలు ఇంకా ఎవరైనా ఉన్నారో..

**58. చం.** **నలికపుఁగౌను చారు జఘనంబును వ్రతువ వల్దచన్నులున్**
**బలుచని దీర్ఘనీల కచభారముఁ జెన్ను మొగంబు వాలుఁ గ**
**న్నులు మెఱుఁగారి సన్నమయి నున్నగు చామనచాయ గాత్రమున్**
**బలితపు సిగ్గు గల్గు నెలప్రాయపుసుందరిఁ బొందమేలగున్**

**అన్వయం**: నలికము + గౌను, చారు – జఘనంబును, వ్రతువ – వల్ద – చన్నులున్, బలుచని – దీర్ఘ – నీల – కచ – భారమున్, చెన్ను – మొగంబు, వాలుఁ గన్నులు, మెఱుఁగారి – సన్నము – అయి – నున్ను – అగు – చామనచాయ – గాత్రమున్, బలితము + సిగ్గు – గల్గు – ఎలప్రాయము + సుందరిన్ – బొందన్ – మేలగున్.

**వ్యాఖ్య**: సన్నని నడుము (నలికము గౌను) అందమైన (చారు) జఘనం, గుండ్రటి

(వట్రువ) బలమైన – స్థూలమైన (వల్ల) చన్నులు, బలుచనిదీ పొడవైనదీ (దీర్ఘ) నల్లనిదీ (నీల) అయిన కేశభారమూ (కచభారమున్) అందమైన ముఖం ( చెన్ను మొగంబు), వాలు కన్నులు, సొంపారుతూ (మెఱుఁగారి) సన్నంగా నున్నగా ఉండే చామనచాయ శరీరం (గాత్రమున్), పెను సిగ్గూ (బలితపు సిగ్గు), పదుచుదనమూ కల అందమైన స్త్రీని (ఎలప్రాయపు సుందరిన్) బొందితే మేలు.

**59. తే.గీ. మెలఁగు నప్పుడ క్రొక్కారు మెఱుఁగువోలెఁ**
**బ్రాంతమున నిల్చినప్పుడు ప్రతిమఁ బోలి**
**యురమునను జేర్చినప్పుడు విరులదండఁ**
**బోలు తిన్ననికామినిఁ బొందమేలు**

**అన్వయం:** మెలఁగు + అప్పుడు + అ – క్రొక్కారు – మెఱుఁగు + పోలెన్, ప్రాంతమునన్ – నిల్చినప్పుడు – ప్రతిమన్ – పోలి, ఉరమునను – చేర్చినప్పుడు – విరులదండన్ – పోలు, తిన్నని – కామినిన్ – పొందన్ మేలు.

**వ్యాఖ్య:** మెలగేటప్పుడు క్రొక్కారు మెఱుపు లాగా, చెంత (ప్రాంతమునన్) నిల్చినప్పుడు బొమ్మ (ప్రతిమన్) పోలి, ఎదపై చేర్చినప్పుడు పూల దండలాగా (విరులదండన్) ఉండే తీరైన స్త్రీని (తిన్నని కామినిన్) పొందటం మేలు.

**60. చం. ఒదవఁగఁ గూర్చిరేనియును నొప్పదు మన్మథకేళి పిమ్మటన్**
**సుదతులగాత్రముల్ గదిసి సుప్తి యొనర్చిన రాజకోటికిన్**
**నిదురలఁ జెందియున్న రమణీతిలకంబుల యూర్పుగాడ్పులన్**
**జెదిరి తొలంగు నంద్రు కడుఁ జేసిన నాథుల మేలి పుణ్యముల్**

**అన్వయం:** ఒదవఁగన్ – కూర్చిరేనియునున్ – మన్మథకేళి – పిమ్మటన్ – సుదతుల – గాత్రముల్ – కదిసి, సుప్తి – ఒనర్చినన్ – రాజకోటికిన్ – ఒప్పదు. నిదురలన్ – చెంది – ఉన్న – రమణీతిలకంబుల – ఊర్పు గాడ్పులన్ – నాథుల – చే సిన – మేలి పుణ్యముల్ – కదున్ – చెదిరి, తొలంగున్ – అంద్రు.

**వ్యాఖ్య:** ఒదవగా (ఒదవఁగన్) పడక ఏర్పాటుచేసినప్పటికీ (కూర్చిరేనియునున్) మన్మథకేళి తర్వాత పురుషుడు స్త్రీలకు దూరంగా పడుకోవాలి. వారి శరీరాలు తాకేలాగా దగ్గరగా ఉంటూ (సుదతుల గాత్రముల్ గదిసి), నిద్రపోవడం (సుప్తి ఒనర్చినన్) రాజసమూహానికి (రాజ కోటికిన్) ఒప్పదు. నిదుర పోతున్న నారీమణుల (రమణీతిలకంబుల) శ్వాసకు సంబంధించిన గాలుల (ఊర్పు గాడ్పులన్) వల్ల రాజులు (నాథుల) చేసుకున్న మంచి పుణ్యాలన్నీ చెదిరిపోయి, మిక్కిలిగా (కదున్) తొలగి పోతాయి అని అంటారు.

# ఆరోగ్య పద్ధతి

**61. మ. ఇరుప్రొద్దు న్నరుఁ డల్పభోజి యయి తానే ప్రొద్దు శుద్ధాత్ముఁడై**
**చరణత్రాణములందు నేమరక యోజం బర్వవర్జ్యంబుగా**
**వరనారీరత మౌషధంపు క్రియ నిర్వాంఛామతిం పొంది యొ**
**క్కరుఁడున్ నిద్ర భజించు వీతభయుఁ డాఖ్యం గాంచు శ్రీయుక్తుఁడై**

**అన్వయం:** నరుఁడు – ఇరుప్రొద్దున్ – అల్పభోజి – అయి, తాన్ – ఏ ప్రొద్దున్ – శుద్ధ – ఆత్ముఁడై చరణత్రాణములందున్ – ఏమరక – ఓజన్ – పర్వవర్జ్యంబుగాన్ – వరనారీరతము – ఔషధము – క్రియన్ – నిర్వాంఛామతిన్ – పొంది, ఒక్కరుఁడున్ – నిద్ర భజించు – వీతభయుఁడు – శ్రీయుక్తుఁడై – ఆఖ్యన్ – కాంచున్.

**వ్యాఖ్య:** నరుఁడు రెండుపూటలా (ఇరుప్రొద్దున్) మితాహారియై (అల్పభోజి), తాను ఎల్లవేళలా(ఏ ప్రొద్దు) స్వచ్ఛమైన మనస్సు కలవాడై (శుద్ధ ఆత్ముఁడై) నడవడిక రక్షణల విషయంలో (చరణత్రాణములందున్) ఏమరకుండా పద్ధతిగా (ఓజన్) పర్వతిథులలో మినహాయిస్తూ (పర్వవర్జ్యంబుగాన్) శ్రేష్ఠయైన స్త్రీతో సంభోగం (వరనారీరతము) ఒక ఔషధంలాగా మితంగా తృష్ణారహితంగా (నిర్వాంఛామతిన్), ఒంటరిగా నిద్రించే (ఒక్కరుఁడున్ నిద్ర భజించు) వీతభయుఁడు లక్ష్మీయుతుడై (శ్రీయుక్తుఁడై) పేరు (ఆఖ్యన్) పొందుతాడు.

**రతికాలైకశయన మన్యత్కాలే పృథక్శయీ**
**స్త్రీణాం శ్వాసానిలైః పుంసాం దౌర్భాగత్వం ప్రజాయతే (124)**
**ఏకశాయీ ద్విభోజీ చ షణ్మాత్రీ ద్విపురీషకః**
**స్వల్పసంగమకారీ చ శతవర్షాణి జీవతి (125)**

**62. ఆ.వె. ఆవులింత నోర నాఁచి ముక్కునఁ బుచ్చి**
**వెలయఁ దుమ్ము నట్ల వీడుకొలిపి**
**చరమధాతురక్ష సమ్మతి నొనరించు**
**సజ్జనుండు వర్షశతము బ్రతుకు**

**అన్వయం:** ఆవులింతన్ – నోరన్ – ఆఁచి, ముక్కునన్ – పుచ్చి, వెలయన్ – తుమ్మున్ – అట్ల – వీడుకొలిపి, చరమ – ధాతు – రక్షన్ – సమ్మతిన్ – ఒనరించు – సజ్జనుండు – వర్ష + శతము – బ్రతుకున్.

**వ్యాఖ్య:** ఆవులింతను నోటిలోనే ఆపి (నోరన్ ఆఁచి), ఆ గాలిని ముక్కుద్వారా

బయటకు పంపాలి (పుచ్చి). తుమ్ముని కూడా అలాగే చేయాలి (అట్ల వీడుకొలిపి). ఆపుకుని ముక్కుద్వారానే ఆ గాలినీ బయటకు పంపాలి. ఇలా చెయ్యడంవల్ల చరమధాతురక్ష కలుగుతుంది. ధాతురక్షను సమ్మతితో చేసుకునే (ఒనరించు) సజ్జనుడికి నిండు నూరేళ్ళ (వర్షశతము) ఆయుష్షు.

**విశేషాలు:** ఇందులో ఒక ఆయుర్వేద రహస్యం ఉంది. శరీరంలో పదిరకాల వాయువులూ (ప్రాణ – అపాన – వ్యాన – ఉదాన – సమాన – నాగ – కూర్మ – కృకర – దేవదత్త – ధనంజయ) ఏడురకాల మౌలిక శక్తులూ (ధాతువులు) ఉన్నాయట. ఆవులింతలూ తుమ్ములూ దగ్గులుగా కనిపించే ధనంజయవాయువు శుక్లధాతువుని రక్షిస్తుందట. శుక్లాన్నే చరమ (ఏడవ) ధాతువు అంటారు. ఈ శుక్లధాతువే ఆయుష్షను పెంచుతుందిట. ఆవులింతల్నీ తుమ్ముల్నీ నియంత్రించడం ద్వారా ధనంజయాన్ని నియంత్రించుకొని, శుక్లధాతురక్షచేసుకున్నవాడికి నూరేళ్ళాయుష్షు.

## వ్యవహార పద్ధతి

**63. కం. పురుషున కెంతయు సత్యమె**
**పరమం బగుధర్మ మైనఁ బ్రాజ్ఞుండై తా**
**నొరుఁ బొలిగొనియెడు కిల్బిష**
**కరులయెడన్ బొంకవచ్చు గణకలలామా!**

**అన్వయం:** గణకలలామా! పురుషునకున్ – ఎంతయున్ – సత్యమె – పరమంబు – అగు – ధర్మము. ఐనన్ – ప్రాజ్ఞుండు – ఐ – తాన్ – ఒరున్ – పొలిగొనియెడు – కిల్బిషకరులయెడన్ – బొంకవచ్చున్.

**వ్యాఖ్య:** కరణాలలో శ్రేష్ఠుడా (గణకలలామా)! పురుషుడికి ఎంతైనా సత్యమే శ్రేష్ఠమైన (పరమంబు అగు) ధర్మం. అయినప్పటికీ తెలివిగలవాడై (ప్రాజ్ఞుండు) తాను ఇతరుడిని నష్టపరిచే (పొలిగొనియెడు) పాపకారుల పట్ల (కిల్బిషకరులయెడన్) బొంకవచ్చు.

**64. ఉ. తాలిమిఁ గల్గి తాఁ బరుల దైన్యము వాపుచు శాంతిఁ గల్గి సం**
**క్షాళితచిత్తుఁడయ్యుఁ దగ సాహసకార్యము సేయ మైకొనం**
**జాలి పరోపకారియయి సంపద కుబ్బనియాతఁ డెప్పుడున్**
**శ్రీలలనాకటాక్షసరసీరుహధాముఁడు మంత్రిశేఖరా**

**అన్వయం:** మంత్రి శేఖరా! తాన్ – తాలిమిన్ – కల్గి, పరుల – దైన్యము + పాపుచున్,

శాంతిన్ – కల్గి, సంక్షాళిత – చిత్తుఁడు + అయ్యున్ – తగన్ – సాహస – కార్యము + చేయన్ – మైకొనన్ + చాలి, పర + ఉపకారి – అయి, సంపదకున్ + ఉబ్బని – ఆతఁడు – ఎప్పుడున్ – శ్రీ – లలనా – కట + అక్ష – సరసీ – రుహ + ధాముఁడు.

**వ్యాఖ్య:** ఓ మంత్రిశేఖరా! తాను ఓర్పు (తాలిమి) కలిగి ఇతరుల (పరుల) నిస్సహాయ స్థితిని (దైన్యము) తొలగిస్తూ (పాపుచున్), ప్రశాంతంగా ఉంటూ (శాంతి కల్గి) మనస్సును కలవరపరచే ఆలోచనలను పూర్తిగా తుడిచిపెట్టి (సంక్షాళిత చిత్తుడయ్యున్), యోగ్యమైన మరియు ధైర్యంతో కూడిన (సాహస) సాహసకార్యాన్ని చేసేందుకు సంసిద్ధుడయి (మై కొనంజాలి), ఇతరులకు మేలు చేసేవాడయి (పరోపకారియయి), సంపదలు సమకూరినప్పుడు పొంగిపోయే (ఉబ్బు) స్వభావంలేనివాతడు ఎప్పుడూ లక్ష్మీదేవి (శ్రీలలనా) దయ (కటాక్ష) అనే పద్మమే (సరసీరుహ) నివాసంగా కలవాడు (ధాముడు) అవుతాడు. లక్ష్మీదేవికి నివాసం సరసీరుహమే. అతడి ఇల్లు లక్ష్మీనివాసమవుతుందని.

**65. కం. కారణము దైవ మనుచును**
**బ్రారంభం బుడుగఁ జనదు ప్రభువుల కెందున్**
**ఊరక తిలలను దైలం**
**బే రీతిని బడయవచ్చు నిద్ధచరిత్రా!**

**అన్వయం:** ఇద్ధచరిత్రా! కారణము – దైవము – అనుచును – ప్రభువులకున్ – ప్రారంభంబు – ఉడుగన్ –చనదు. ఎందున్ – తిలలను – దైలంబు – ఊరక – ఏ రీతిని – పడయవచ్చున్?

**వ్యాఖ్య:** స్వచ్ఛమైన చరిత్ర గలవాడా (ఇద్ధచరిత్రా)! అన్నింటికీ కారణం దైవమే అంటూ ప్రభువులకు పనిని ప్రారంభించడాన్నే విడిచిపెట్టడం తగదు (ప్రారంభంబు ఉడుగన్ చనదు). ఎక్కడైనా ఊరికే కష్టపడకుండా తిలలనుండి తైలం వస్తుందా ఏ రీతిని పడయవచ్చు?

**66. కం. వ్యవసాయ రహితు సాహస**
**వివర్జితుని, నుచిత యత్న విముఖుని, నలసున్**
**దివిరి సిరి గవయ నొల్లదు**
**యువతీరత్నంబు వృద్ధు నొల్లనిభంగిన్**

**అన్వయం:** యువతీ – రత్నంబు – వృద్ధున్ – ఒల్లని – భంగిన్ – వ్యవసాయ – రహితున్ – సాహస – వివర్జితునిన్ – ఉచిత – యత్న – విముఖునిన్ – అలసున్ – తివిరి – సిరి – కవయన్ – ఒల్లదు.

**వ్యాఖ్య:** యువతీ రత్నం ఒక వృద్ధుణ్ణి ఇష్టపడని (ఒల్లని) విధంగానే కార్యసాధనకు ప్రయత్నం (వ్యవసాయం) ప్రారంభించనివాడినీ, ఆరంభించినా కడదాకా కొనసాగించే సాహసమూ ధైర్యమూ లేనివాడినీ (సాహస వివర్జితునిన్), సాహసంతో ఆరంభించిన కార్యాన్ని సాధించేందుకు తగిన ప్రయత్నం చేయనివాడినీ (ఉచితయత్న–విముఖునిన్), సోమరిపోతునూ (అలసున్) లక్ష్మీదేవి ఇష్టపడి (తివిరి) చేరడానికి అంగీకరించదు (ఒల్లదు).

**67. కం. సముచితయత్నశక్తియుతసాహసుఁడై తగు నుత్తముండు మ**
**ధ్యము బలహీనసాధనము లారయఁ జెప్పఁగ నేల రెండు పా**
**దములనె కల్గి యా హనుమ దాఁటె సముద్రము కాటిఁడేని య**
**శ్వమునకు నూఱుగాళ్ళొదవి సన్నపుఁ గాల్వయు దాఁటఁ గల్గునే!**

**అన్వయం:** సముచిత – యత్న – శక్తియుత – సాహసుఁడై – ఉత్తముండు – తగున్. మధ్యము – బలహీన – సాధనములు – ఆరయన్ – చెప్పఁగన్ – ఏల? రెండు – పాదములనె – కల్గి – ఆ – హనుమ – సముద్రమున్ – దాఁటెన్. కాటిఁడేని – అశ్వమునకున్ – నూఱుగాళ్ళు – ఒదవి – సన్నము – కాల్వయున్ – దాఁటన్ – కల్గునే?

**వ్యాఖ్య:** తగిన ప్రయత్నమూ శక్తీ వీటితో కూడిన సాహసి (సముచితయత్న శక్తియుత సాహసుఁడై) అయినవాడు ఉత్తముడు అనిపించుకుంటాడు (తగును). మధ్యము బలహీన సాధనములు గురించి ఆలోచిస్తే (ఆరయన్) ఇంక చెప్పడం దేనికి? రెండు పాదాలు మాత్రమే కల్గిన ఆ హనుమంతుడు ఏకంగా సముద్రాన్నే దాటాడు. కానీ యముడి వాహనమైన దున్నపోతుకు (కాటిఁడేని అశ్వమునకున్) ఒకవేళ నూరుకాళ్ళు ఉన్నా కూడా (ఒదవి) సన్న కాలువ నైనా దాట కలుగుతుందా?

**68. మ. గిరు లెవ్వారలు ప్రోచి పెంచి రిటు నింగిన్ ముట్టఁగా నేరు లె**
**వ్వరు వాటంబులుగాఁగఁ ద్రవ్విరి మృగవ్రాతంబు సేవింపఁ గే**
**సరికిం బట్టముగట్టి రెవ్వరు మహైశ్వర్యంబు లుత్సాహులై**
**తిరు (గన్ గల్గును) మంత్రి యప్ప నుతకీర్తీ! నాగమాంబాసుతా!**

**అన్వయం:** నుతకీర్తీ! నాగమాంబా సుతా! మంత్రి యప్ప! ఇటు – నింగిన్ – ముట్టఁగాన్ – గిరులు ఎవ్వారలు – ప్రోచి – పెంచిరి? ఏరులు – ఎవ్వరు – వాటంబులుగాఁగన్ – ద్రవ్విరి? మృగ – వ్రాతంబు – సేవింపన్ – కేసరికిన్ – పట్టము – ఎవ్వరు – గట్టిరి? మహైశ్వర్యంబులు – ఉత్సాహులు – ఐ తిరుగన్ – గల్గును.

**వ్యాఖ్య:** పొగడబడిన కీర్తి కలవాడా (నుతకీర్తీ)! నాగమాంబకు పుత్రుడా! అప్పనమంత్రీ! ఇటు ఆకాశాన్ని తాకేలా (నింగిన్ ముట్టఁగాన్) పర్వతాలను ఎవరు పెంచి పోషించారు (ప్రోచి పెంచిరి)? ఏరులు ఎవరు వాటంగా తవ్వారు? మృగసమూహం (వ్రాతం) సేవింపగా కేసరికి పట్టం ఎవరు కట్టారు? గొప్ప గొప్ప సంపదలు (మహైశ్వర్యంబులు) ఉత్సాహులై సంచరించేవారికి తమంత తామే ఒనగూడుతాయి.

**69. ఆ.వె. వర్ధమాను లైనవారికి నాపద**
**హీనజనులకంటె నెక్కు డండ్రు**
**కచవితానమునకుఁగాక ఖండన మొందు**
**ఱెప్పవెండ్రుకలకుఁ జెప్పఁబడెనె**

**అన్వయం:** హీనజనులకంటెన్ – వర్ధమానులు – ఐనవారికిన్ – ఆపద – ఎక్కుడు – అండ్రు. ఖండనము – కచవితానమునకున్ – కాక – ఒందు – ఱెప్పవెండ్రుకలకున్ – జెప్పఁబడెనె?

**వ్యాఖ్య:** తక్కువవారికంటే (హీనజనులకంటెన్) గొప్పవారికే (వర్ధమాను లైనవారికిన్) ఆపదలు ఎక్కువని అంటారు (ఎక్కుడు అండ్రు). కేశఖండనం తలవెంట్రుకలకు (కచవితానమునకున్) కాక వేరేగా (ఒందు) ఱెప్పవెంట్రుకలకు జెప్పబడిందా? తలవెంట్రుకలనే ఖండిస్తారుగానీ రెప్పవెంట్రుకలను కాదు కదా. అందువల్ల ఆపదలు గొప్పవారికే (దృష్టాంతం).

**70. కం. వలనై కార్యము సామో**
**క్తులఁ దీఱఁగ దండమునకుఁ దొడరఁగ నేలా?**
**పులఖండమునన పైత్యము**
**పొలియంగా నేల చేఁతి పొట్లరసంబుల్?**

**అన్వయం:** వలనై – కార్యము – సామ – ఉక్తులన్ – తీఱఁగన్ – దండమునకున్ – తొడరఁగన్ – ఏలా?

పులఖండమునన – పైత్యము – పొలియంగాన్ – చేఁతి పొట్లరసంబుల్ – ఏల?

**వ్యాఖ్య:** ఏదైనా ఒక కార్యము చక్కగా (వలనై) మంచిమాటలతో (సామ ఉక్తులన్) నెరవేరుతూ ఉంటే (తీఱఁగన్) దండించడం దాకా వెళ్ళడం దేనికి (దండమునకున్ – తొడరఁగన్ ఏలా) పులఖండంతోనే పైత్యం పోతూ ఉంటే (పొలియంగాన్) చేఁతి పొట్లరసంతో పనేమిటి?

**విశేషాలు:** చేఁతిపొట్ల. ఒకానొక తీఁగ, పటోలిక. (దీని భేదములు – గుజ్జుపొట్ల, చేఁతిపొట్ల), పులఖండం = పులకండం, కలకండ, మిస్రీ.

**71.** **దీనత దోఁపకుండఁ గడుఁ దీపెసఁగం బ్రియమాడ నేర్పగున్**
**దానము గల్గియున్ బొగడఁ దద్ద సహింపమి చాల మేలు వా**
**ణీనిధి వక్తనాఁ బరగి నిష్ఠురభాషుఁడు గామి లెస్స పెం**
**పూన సమర్థుడయ్యు నిలుపోవుట యొప్పును నప్పధీమణీ**

**అన్వయం:** అప్పధీమణీ! దీనతన్ – దోఁపకుండన్ – గడున్ – తీపు – ఎసఁగన్ – ప్రియము – ఆడ నేర్పగున్. దానము – కల్గియున్ – పొగడన్ – దద్ద – సహింపమి – చాల మేలు. వాణీనిధి – వక్త – నాన్ – బరగి – నిష్ఠురభాషుఁడు – గామి – లెస్స. పెంపు – ఊనన్ – సమర్థుడు అయ్యున్ – నిలుపోవుట యొప్పును.

**వ్యాఖ్య:** అప్పధీమణీ! దీనత కనిపించకుండా (దోఁపకుండన్) బాగా తియ్యగా (గడున్ తీపు ఎసఁగన్) ప్రియంగా మాట్లాడడం (ప్రియము ఆడన్) నేర్పు. దానం కలిగి ఉండీ పొగడ్తలను సహించకపోవడం (తద్ద సహింపమి) చాలా మేలు. విద్యానిధిలాంటి వక్త అన్న పేరు తెచ్చుకొని కూడా అంటే నిష్ఠురవాక్కులను పల్కక (నిష్ఠురభాషుఁడు) పోవడం లెస్స. ఆధిక్యం పొందే – గెలిచే – తనదే పై చెయ్యి కాగల (పెంపు ఊనన్) సమర్థుడై ఉండి కూడా నిగ్రహాన్ని ఓర్పును కలిగి ఉండడం (నిలుపోవుట) ఒప్పు.

**72.** **తే.గీ.** **ఆత్మకునివలెం బాతకుం డయినవాని**
**నన్యుఁ గొనియైన వెసఁ దెగటార్పవలయు**
**ఇంటఁ బుట్టియుఁ గీడైన యెలుకఁ జంపఁ**
**బిల్లికిని దుగ్ధములుపోసి పెంచుకరణి**

**అన్వయం:** ఇంటన్ – పుట్టియున్ – కీడు – ఐన – ఎలుకన్ – చంపన్ – పిల్లికిని – దుగ్ధములు – పోసి – పెంచు – కరణి – ఆత్మకునివలెన్ – పాతకుండు – అయినవానిన్ – అన్యున్ – కొని – ఐనన్ – వెసన్ – దెగటార్పవలయున్.

**వ్యాఖ్య:** ఇంటిలో పుట్టినప్పటికీ హానికలిగించే ఎలుకను చంపడానికి పిల్లికి పాలు (దుగ్ధములు) పోసి పెంచినట్లు (కరణి) తనవాడిగా ఉంటూ (ఆత్మకునివలెన్) బాతకుడు అయినవాణ్ణి శత్రుసాహాయ్యం తీసుకొని అయినా సరే (అన్యున్ కొని ఐనన్) శీఘ్రంగా సంహరించాలి (తెగటార్పవలయున్).

**73. కం. కారణమున మిత్రు లగుట**
**కారణమున శత్రు లగుట గల ది ట్లగుటన్**
**ధారుణి నెవ్వరు నెవ్వరి**
**వారునుగా రెల్లవారు వసుపరతంత్రుల్**

**అన్వయం:** ధారుణిన్ – కారణమునన్ – మిత్రులు – అగుట, కారణమునన్ – శత్రులు – అగుట – గలదు. ఇట్లగుటన్ ఎవ్వరును – ఎవ్వరివారునుగారు. ఎల్లవారు – వసుపరతంత్రుల్.

**వ్యాఖ్య:** ఈ భూమిపై (ధారుణిన్) ఒకరికి ఒకరు మిత్రులు కావడానికిగానీ, శత్రువులు కావడానికీ ఏదో ఒక కారణం ఉంటుంది. ఆ కారణంవల్లనే మిత్రులు కావడం, ఆ కారణమువల్లనే శత్రులు కావడం ఉంటుంది. దీనినిబట్టీ తెలిసేదేమిటంటే ఎవ్వరూ ఎవ్వరివారూ కారు. ఎల్లవారూ వసుపరతంత్రులే. సంపదలకు దాసులే.

**74. సీ. పగలు నిద్రింపక పరకాంతఁ గోరక**
**పరదూషణములేక పరుల కెపుడుఁ**
**గీడు చింతింపక కినుకయుఁ గపటంబు**
**గలుగక చవి యెంత గలిగెనేని**
**పథ్యంబు శుచియును భక్ష్యంబుగాని ప**
**దార్థంబుమీఁదఁ దత్పరత లేక**
**బుడుబుడులాడుచుఁ బడఁతుల మొగముల**
**వెడమాయమాటలు వినఁగఁ బోక**

**గీ. పలుకు తటి జడివెట్టక పరుసగాక**
**బొంకులాడక తన్నుఁ దా బొగడుకొనక**
**కెలనివారికి మేలైన నెలమిఁ బొందు**
**మనుజునకు నభ్యుదయ మొందు మంత్రియప్ప!**

**అన్వయం :** మంత్రి అప్ప! పగలు – నిద్రింపక, పరకాంతన్ – గోరక, పరదూషణము – లేక, పరులకున్ –ఎపుఁడున్ – కీడున్ – చింతింపక, కినుకయున్ – కపటంబు – కలుగక, చవి – ఎంత – కలిగెనేని – పథ్యంబు, శుచియును, భక్ష్యంబుగాని – పదార్థంబుమీఁదన్ – తత్పరత లేక, బుడుబుడులాడుచున్ – బడఁతుల – మొగముల – వెడ + మాయమాటలు – వినఁగన్ – పోక, పలుకు – తటిన్, జడివెట్టక, పరుసగాక,

బొంకులాడక, తన్నున్ – దాన్ – పొగడుకొనక, కెలనివారికిన్ – మేలైనన్ – ఎలమిన్ – పొందు – మనుజునకున్ – అభ్యుదయము – ఒందున్.

**వ్యాఖ్య:** ఓ అప్పయమంత్రీ! పగలు నిద్రపోకుండా, పరకాంతపై వ్యామోహపడకుండా, పరదూషణ చేయకుండా, పరులకు ఎప్పుడూ కీడు తలపెట్టకుండా, కినుక – కోపంగానీ కపటంగానీ లేకుండా, ఎంతో రుచిగా ఉండి, తినాలనిపించినా పథ్యం, శుచీ, భక్ష్యయోగ్యంకాని పదార్థంపై తాత్పర్యం భావం అంటే ఇష్టం (తత్పరత) లేకుండా, బుడుబుడులాడుతూ తొందరపడి స్త్రీల ముఖాలనుండి (బడఁతుల మొగములన్) వచ్చే వ్యర్థమైన (వెడ) మాయమాటలు వినకుండా, మాట్లాడేటప్పుడు లొడలొడా వాగేయకుండా, జడిపెట్టక (జడిపెట్టు = బాధపెట్టు, కాలక్షేపము చేయు, వర్షించు), మాట కరుకుగా కాక (పరుసగాక), అబద్ధం ఆడకుండా (బొంకులాడక), తన్ను తాను పొగడుకోక, పక్కవారికి (కెలనివారికిన్) మేలు కలిగితే ఆనందాన్ని (ఎలమిన్) పొందే మనుజుడికి అభివృద్ధి కలుగుతుంది (అభ్యుదయము ఒందున్) .

## కావ్యాంత పద్యాలు

**75.** **సీ.** **విద్వన్నుతుండు భారద్వాజగోత్రుఁ డా**
**పస్తంబసూత్రుఁడు పరమపుణ్య**
**విమలోజ్జ్వలాంగి గోవిందార్యునకుఁ గుల**
**ద్వయశిరోభూషణ ధర్మ చరిత**
**నాగమాంబకుఁ గూర్మినందనుఁ డప్పయ**
**మఖి మౌళి సింగనామాత్య మేన**
**యల్లుఁడు ధార్మికుఁ డనఘుండు శ్రీవల్ల**
**భాచార్యతమ్ముండు హరిపదాంబు**

**గీ.** **జాత షట్పదుఁ డుభయభాషాకవిత్వ**
**మాపవైదగ్ధ్యుఁ డప్పనమంత్రివరుఁడు**
**సంస్కృతంబున నొప్పారు చారుచర్యఁ**
**దెనుఁగు చేసెఁ దా నెంతయు తేటపడఁగ**

**అన్వయం:** విద్వత్ + నుతుండు, భారద్వాజగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, పరమపుణ్య, విమల + ఉజ్జ్వలాంగి, గోవింద + ఆర్యునకున్, కుల – ద్వయ – శిరోభూషణ – ధర్మచరిత – నాగమాంబకున్ – కూర్మి – నందనుఁడు, అప్పయ

– మఖిమౌళి – సింగన + అమాత్య – మేన + అల్లుఁడు, ధార్మికుఁడు, అనఘుండు, శ్రీవల్లభాచార్యు – తమ్ముండు, హరి – పద – అంబుజాత – షట్పదుఁడు, ఉభయ – భాషా – కవిత్వ – మాప – వైదగ్ధ్యుఁడు – అప్పన – మంత్రివరుఁడు – తాన్ – సంస్కృతంబునన్ – ఒప్పారు – చారుచర్యన్ – ఎంతయున్ – తేటపడఁగన్ – తెనుఁగు చేసెన్.

**వ్యాఖ్య:** ఇది ఒక రకంగా ఆశ్వాసాంత గద్యలో ఉండే విషయమే. కాకపోతే సీసంలో చెప్తున్నాడు అప్పనమంత్రి. పండితులచేత ప్రశంసలు అందుకొనేవాడూ (విద్వన్నుతుండు), భారద్వాజగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, పరమపుణ్య, విమల ఉజ్జ్వలాంగుడైన గోవిందార్యుడికీ, పుట్టినింటికీ మెట్టినింటికీ – ఉభయవంశాలకూ తలమానికమైన (కులద్వయ శిరోభూషణ), ధర్మ చరిత్ర కలిగిన నాగమాంబకూ పుట్టిన ముద్దుల తనయుడు, (కూర్మినందనుఁడు), అప్పయ గారి పుత్రుడూ సోమయాజులలో శ్రేష్ఠుడూ (మఖి మౌళి) అయిన సింగన అనే పేరు గల అమాత్యుడికి మేనల్లుఁడు, ధార్మికుఁడు, పుణ్యాత్ముడు (అనఘుండు), శ్రీవల్లభాచార్యుడి తమ్ముడు, హరి పాదాలు అనే పద్మానికి (అంబుజాత) తుమ్మెద (షట్పదుఁడు), సంస్కృత, ఆంధ్ర కవిత్వాలను తూకం వెయ్యగల (మాప) నైపుణ్యం కలవాడు (ఉభయభాషాకవిత్వమాపవైదగ్ధ్యుఁడు), అయిన అప్పనమంత్రిశ్రేష్ఠుడు (వరుఁడు) సంస్కృతంలో ఒప్పారే చారుచర్యను ఎంతో సరళంగా (తేటపడగన్) తెనుఁగు చేశాడు.

**76. కం. గోవిందార్యుని యప్పన**
**గావించిన చారుచర్య కర్ణాభరణ**
**శ్రీ విబుధు లందుఁ బడయుచు**
**భూవలయములోఁ బ్రసిద్ధిఁ బొందెడు గాతన్**

**అన్వయం:** గోవిందార్యుని యప్పన – కావించిన – చారుచర్య – విబుధులందున్ – కర్ణ + ఆభరణ – శ్రీ – పడయుచున్ – భూవలయములోన్ – బ్రసిద్ధిన్ – పొందెడుగాతన్.

**వ్యాఖ్య:** గోవిందార్యుడి పుత్రుడైన అప్పన రచించిన చారుచర్య, పండితలోకంలో (విబుధులందున్) చెవులకు ఆభరణమయ్యే సుభగత్వాన్ని (కర్ణ + ఆభరణ శ్రీ) పొందుతూ అంటే పండితుల ఆమోదాన్ని పొందుతూ భూవలయంలో బ్రసిద్ధి పొందుగాక.

★★★

# శ్రీ భోజరాజకృత సంస్కృత చారుచర్య

సునీతిశాస్త్ర సద్వైద్యధర్మ శాస్త్రానుసారతః
విరచ్యతే చారుచర్యా భోజభూపేన ధీమతా 1

బ్రాహ్మే ముహూర్తే ఉత్తిష్ఠే త్స్వస్థో రక్షార్థ మాయుషః
శరీరచింతాం నిర్వర్త్యకృతశౌచవిధి స్తతః 2

## అథ దంత ధావనవిధిః

ప్రాత రుత్థాయ విధినా కుర్యా ద్దంత ప్రధావనమ్
వాగ్యతః పుణ్యకాష్ఠేన అత ఊర్ధ్వం క్రమేణతు 3

ఆయుర్బలం యశో వర్చః ప్రజాః పశు వసూని చ
బ్రహ్మప్రజ్ఞాం చ మేధాం చ త్వం నో దేహి వనస్పతే 4

సర్వే కంటకినః పుణ్యాః క్షీరిణ్యశ్చ యశస్వినః
ఆమ్ల పున్నాగ బిల్వానా మపామార్గశిరీషయోః 5

కటుతిక్తకషాయాశ్చ ధనారోగ్యసుఖప్రదాః
దశాంగుళం తు విప్రాణాం క్షత్రియాణాం నవాంగుళమ్ 6

అష్టాంగుళం తు వైశ్యానాం శూద్రాణాం సప్తసమ్మితమ్
చతురంగుళమానం తు నారీణాం తు న సంశయః 7

ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా దంతధావన మాచరేత్
దక్షిణేన తథా క్రౌర్యం పశ్చిమేన పరాజయమ్ 8

పూర్వస్యాముత్తరస్యాం చ సర్వాన్కామా నవాప్నుయాత్
చతుర్థశ్యష్టమీ దర్శపూర్ణిమాసం క్రమారవేః 9

విషు స్త్రీ తైల మాంసాని దంతకాష్ఠం చ వర్జయేత్
సర్జే ధైర్యం వటే దీప్తిః కరంజే విజయో రణే 10

జాతా చైవార్థ సంపత్తిః బదర్యాం మధురస్వరః
ఖదిరే చైవ సౌగంధ్యం బిల్వేతు విపులం ధనమ్ 11

శాల్మల్యశ్వత్థ భవ్యానాం ధవకింశుక యోరపి
కోవిదారశమీ పీలు శ్లేష్మాతక విభీతకాన్ 12

వర్జయే ద్దంతకాష్ఠం తు గుగ్గులిం క్రముకం తథా
ఔదుంబరే వాక్యసిద్ధిః బంధూకే చ దృఢాశ్రుతిః 13

ఆమ్లే కీర్తిశ్చ సౌభాగ్యం కదంబే సిద్ధిరుత్తమా
గుహాగరాగరీతాల కేతకీసుమహద్వటాః 14

ఖర్జూరీనారికేళశ్చ సప్తైతే తృణరాజకాః
తృణరాజశిరాపత్రై ర్యః కుర్యాద్దంతధావనమ్ 15

తావద్భవతి చాండాలో యావద్గంగాంన పశ్యతి
భల్లాతకీ దేవదారు మదయం తీక్షు వాలుకైః 16

తృణాంగుల్యశ్మలోహాద్యై శ్చర్మతుభ్య స్సాధ్వసం జగుః
హరీతకీ విఘ్ను నాగ కత కోద్దాల తాపసైః 17

కార్పాసాధక వాకూచీ బలాశ్లేష్మాత కైర్గతః
పలా శాశ్వత్థ జంబీర మాతులుంగ కపిత్థకైః 18

అగస్త్య తాల హింతాల కుశకాశై స్త థానిశా
తింత్రిణీక శమీ వేణు శుద్ధామళక వంజుళైః 19

వికంకత వ్యాఘ్ర పాద సంజ్ఞ వృ క్షై ర్యశః క్షయః
యో హి గండూషసమయే తర్జన్యా వక్ర చాలనమ్ 20

యది కుర్వీత మూఢాత్మా నరకే పతతి ధ్రువమ్
నాద్యా దర్జీర్ణవ మధుశ్వాస బాస జ్వరార్థితః 21

తృష్ణాస్య పాక హృన్నేత్రశిరః కర్ణామయే చ తత్
మధ్యాహ్నస్నానవేళాయాం యః కుర్యాద్దంతధావనమ్ 22

నిరాశాస్తస్య గచ్ఛంతి దేవతాః పితృభిస్సహ
అలాభే దంతకాష్ఠానాం నిషిద్ధాయాం తథా తిథౌ 23

అపాం ద్వాదశ గండూషైః ముఖశుద్ధిర్భవిష్యతి
జిహ్వానిర్లేఖనం కార్యం సౌవర్ణం తామ్రమేవవా 24

తన్మలాపహరం శస్తం మృదుశ్లక్ష్ణం షడంగులం
పిత్తశ్లేష్మహరం రుచ్యం నైర్మల్యం చక్షుషోర్హితం
శోత్రనాడ్యో విశుద్ధ్యంతే నరాణాం దంతధావనాత్ 25

## స్నానవిధిః

పుణ్యనిర్మలతోయేన పాదౌ ప్రక్షాళ్య వాగ్యతః
మలాపకర్షణార్థాయ స్నానం కుర్యాత్ప్రయత్నతః 26

ఉష్ణాంబునాధః కాయస్య పరిషేకోనబలావహః
తేనైవ చోత్తమాంగస్య బలాద్ధృత్కేశచక్షుషోః 27

స్నానమర్థిత నేత్రాస్య కర్ణరోగాతిసారిషు
ఆద్మాన పీన సాజీర్ణ భుక్తవత్సు చ గర్హితమ్ 28

స్నానానంతరకం సమ్యగ్వస్త్రేణోద్వర్తయేత్తనుమ్
కాంతిదం చ శరీరస్య కండూ త్వగ్దోషనాశనమ్ 29

పిటకవ్యంగదోషఘ్ను ముద్వర్తన ముదాహృతమ్
భూమే స్సముద్ధృతం పుణ్యం తతః ప్రస్రవణోదకమ్ 30

తత్రాపి సారసం పుణ్యం తస్మాన్నా దేయ ముత్తమమ్
తీర్థతోయం తతః పుణ్యం గంగాపుణ్యం చ సర్వతః 31

రూపం తేజో బలం కాంతి శ్శౌచ మాప్యాయనం తనోః
దుస్స్వప్ననాశనం పుణ్యం స్నాన మాయుష్యవర్ధనమ్ 32

అత్యంతమలినః కాయో నవచ్ఛిద్రసమన్వితః
స్రవత్యేవ దివారాత్రౌ ప్రాతఃస్నానేన శుద్ధ్యతి 33

కులాచారం తతః కుర్యా త్సంధ్యోపాసనమాదితః
సూర్యోపాస్తిం తతః కుర్యా త్సర్వరోగాపనుత్తయే 34

## పుష్పధారణవిధిః

కేశానాం నిచయం కుర్యాత్ కస్తూరీ మనులేపయేత్
సుగంధీని సుపుష్పాణి నిత్యం శిరసి ధారయేత్ 35

కేశక్లేశ సముద్భూత స్వేదదుర్గంధ నాశనమ్
చక్షుష్యం దాహశమనం సౌమనస్యస్య ధారణాత్ 36

జీవా ద్వ్యాలిప్త కేతక్యాః కోమలం ధారయే ద్దళమ్
జాతీకుందం చ నేపాళం శ్రీకంఠ గిరిమల్లికా 37

మకరందేన సంయుక్తం శిరసా ధారయే న్నరః
మలినే మల్లి కాధార్యా నిర్మలే జాతిపాటలే 38

అభ్యంగే కేతకీధార్యా చోత్పలం సతతం వహేత్
సర్వాణ్యేతాని శీతాని రసతోవీర్యత స్తథా 39

త్రిదోష శమనం శ్రీమాన్ ఘర్మకాలే ప్రధారయేత్
కేతకీ వకుళం పుష్పం శ్రీఖండం శతపత్రకమ్ 40

శ్రీపర్ణం చంపకం పుష్పం వాతశ్లేష్మహరం పరమ్
ఉష్ణవీర్యం వాతనాశం శీతకాలే ప్రధారయేత్ 41

హ్రీ బేరం మరువం చైవ నీలోత్పల సుచంపకౌ
కురువం పాటలమ్ చైవ కరవీరం తథైవ చ 42

నాత్యుష్ణ మభవాసీతం సర్వ దోషనిబర్హణమ్
నిర్మలం నేత్రదోషఘ్నువర్షాకాలే ప్రధారయేత్ 43

ముహూర్తం జాతికుసుమం నేపాళం చోత్పలం తథా
త్రిరాత్ర ముత్పలం చైవ పంచరాత్రం తు కేతకీ 44

ద్విరాత్రం శతపత్రం చ అర్ధరాత్రం తు మల్లికా
అహోరాత్రం చంపకం తు యూధిపుష్పం తథైవ చ 45

శ్రీకంఠ మేక రాత్రం చ వకుళం మాధవీ తథా
అహరేకం తు శ్రీపర్ణం పుష్పవాసం నిధారయేత్ 46

మందారం మరువంచైవ కరవీరం తథై వ చ
యావత్కాలం వహేద్గంధం తావ త్కాలం చ పాటలీ 47

త్రిదోషశమనా జాజీ మహాదాహ వినాశినీ
సుగంధం దోషశమనం కోటరం పుష్పముచ్యతే 48

పిత్తహృద్విశదం శైత్యం చక్షుష్యం చోత్పలం తథా
శ్లేష్మవాతప్రశమన ముష్ణభావం చ నిర్మలమ్ 49

పుష్పాణాం ప్రవరం శ్రేష్ఠం కేతకీపుష్ప ముచ్యతే
ఈషదుష్ణం సుశీతం చ సుగంధం పుష్టిదాఽయకమ్ 50

శిరోభ్రమవినాశం చ శతపత్రం సుశోభనమ్
అధార్యం మల్లికా పుష్పం దృష్టిహాని స్తుజాయతే 51

చంపకం వాతశమనం చక్షుష్యం విశదం శుభమ్
పాటలం చ మహాశీతం శ్లేష్మవాతప్రవర్ధనమ్ 52

మందారం పిత్తదోషఘ్నం కర్ణ బాధిర్యనాశనమ్
పాటలం ధారయేద్వస్తు మరువేణ సమన్వితమ్ 53

జ్వరమూర్ఛా మవాతఘ్నం చక్షుష్యం దాహనాశనమ్
హేమంతే శిశిరే చైవ శతపత్రం తు శోభనమ్ 54

వసంతే కేతకీ ధార్యా ఘర్మే నేపాళమాలతీ
వర్షే శ్రీకంఠపాటల్యౌ శారదే చంపకం వహేత్ 55

## లేపనవిధిః

రక్తోత్పలం సర్వకాలం ధరే ల్లక్ష్మివివృద్ధయే
కుసుమం చందనం చైవ తథాగరు విమిశ్రితమ్ 56

ఉష్ణభావమిదం శ్రేష్ఠం శీతకాలే తు లేపయేత్
చందనం చేందునా యుక్తం కస్తూర్యా సహ మిశ్రితమ్ 57

సుగంధం చ సుశీతం చ ఘర్మకాలే ప్రధారయేత్
చందనం ఘుసృణోపేతం ఈష త్కస్తూరికాయుతమ్ 58

నచోష్ణం న చ వా శీతం వర్షాకాలే ప్రధారయేత్
ఆదౌ చోద్వర్తయేద్గంధం పశ్చాద్గంధం ప్రలేపయేత్ 59

## వస్త్రధారణవిధిః

శీతకాలే తు కౌశేయం కషాయం ఘర్మవాసరే
వర్షాసు శుక్లవస్త్రం స్యా త్రిధా వస్త్రస్య ధారణమ్ 60

కౌశేయం చిత్రవస్త్రం చ రక్తవస్త్రం తథై వ చ
వాతశ్లేష్మహరం నృణాం శీతకాలే తు ధారయేత్ 61

శుధ్యం సుశీతపిత్తఘ్నం కాషాయం వస్త్ర ముత్తమం
తద్ధారయేద్ఘర్మకాలే కాషాయం వస్త్రముచ్యతే 62

శుక్లం సుశీతలం చైవ శీతతాపనివారణమ్
న చోష్ణం స చ వాశీతం శుక్లం వర్షాసు ధారయేత్ 63

మలినం పరవస్త్రం తు స్త్రీవస్త్రం తు తథైవ చ
ఖండం చ మూషికైర్విద్ధం అగ్నిదగ్ధం చ వర్జయేత్ 64

మలినం నశివం తత్తు కండూ త్వగ్దోషకారణమ్
సుకృతస్య ఫలం నాస్తి పరవస్త్రస్య ధారణాత్ 65

కార్యహాని ర్దుర్బలత్వం స్త్రీవస్త్రేణ ప్రజాయతే
ఖండవస్త్రే వసే జ్జ్యేష్ఠా తస్మాత్త త్పరివర్జయేత్ 66

భయదం మూషికైర్విద్ధం దగ్ధేన చ మృతిర్భవేత్
తస్మాత్సర్వప్రయత్నేన శోధ్యవస్త్రం ప్రధారయేత్ 67

సుహృత్సు శుభదం చైవ దర్శనేన ప్రజాయతే
రత్నాని దేవతాతుష్ట్యై భూషణాన్యపి ధారయేత్ 68

## నవరత్న ధారణవిధిః

ఆదిత్యే పద్మరాగం చ సోమే ముక్తాఫలం తథా
మంగళే విద్రుమం చైవ బుధే మరకతం తథా 69

గురౌ తు పుష్యరాగం చ భార్గవే వజ్రముత్తమమ్
మందే తు నీలమిత్యుక్తం రాహోర్గోమేధికం తథా 70

కేతుర్వైదూర్య మిత్యుక్తం క్రమాద్రత్నస్య లక్షణమ్
మోహోరజిత హేమనితామ్రం కాంస్యం చ పంచకమ్ 71

## పంచలోహ ప్రశస్తి

స్త్రీ బాలావృద్ధఘాతీ చ తథాగోబ్రహ్మఘాతకమ్
సర్వపాపవినిర్ముక్ త్యై పంచలోహసంప్రధారయేత్ 72

## తర్పణవిధిః

ధర్మసంగ్రహణం కుర్యా ద్దాన తీర్థోపవాసకైః
స్వబంధు పితృదేవానాం బ్రాహ్మణానాం చ తర్పణమ్ 73

స్వర్గ్యం యశస్య మాయుష్యం సర్వపాపహరం శుభమ్
దేవబ్రాహ్మణబంధూనాం తర్పణేన ప్రజాయతే 74

## భోజనవిధిః

తతో భోజనవేళాయాం కృతాచారస్సదాత్మవాన్
దేవాన్ పితౄన్ సమభ్యర్చ్య కుర్యాన్మంగళవీక్షణమ్ 75

లోకేఽస్మి న్మంగళా న్యష్టౌ బ్రాహ్మణో గౌర్హుతాశనః
సువర్ణం సర్పిరాదిత్యం ఆపో రాజా తథాష్టమః 76

ఏతాని సతతం పశ్యే న్నపశ్యే దర్చయే ద్యథా
ప్రదక్షిణం చ కుర్వీత ఆయుర్వర్ధన ముత్తమమ్ 77

పత్నీ విహితశృంగారం ప్రాప్య భోజనమందిరమ్
యదాచాగ్నిబలం వీక్ష్య భోజనం కారయే ద్బుధః 78

ఏకఏవ న భుంజీత యదేచ్ఛేత్ప్రియమాత్మనః
భోక్తుకామశ్చ దాతుశ్చ క్రోధవా న విగర్హితః 79

అన్నం విషసమం ప్రాహు రజీర్ణం ప్రాప్నుయా న్నరః
స్వత్రిభి ర్బహుభి స్సార్ధం భోజనేన ప్రజాయతే
అభీష్టఫలసంసిద్ధిః తుష్టికామ్యసుసంపదః 80

చకోరం మర్కటం కృష్ణం శారికాం చ శుకం తదా
అమాత్యరాజ పుత్రాణాం గృహేష్వేతాని రక్షయేత్ 81

చకోరం చక్షుషోన్మీలం విష్ఠాం ముంచతి మర్కటః
మృష్టాన్నం విషసంయుక్తం కూజంతి శుకశారికాః 82

తేషాం దృష్టినిపాతేన అన్నాద్యం నిర్విషం భవేత్
పరవిద్యావినాశార్థం తేషాం దర్శన ముచ్యతే 83

కార్తిక్యా మపరః పక్షో మార్గశీర్షస్య చాదిమః
క్వావేతా యమదంష్ట్రాభ్యా మితాహారస్సజీవతి 84

ఆదౌ మధుర మశ్నీయాన్ మధ్యే చ కటుతిక్తకమ్
అంతే తిక్తకషాయం చ సమ్య గ్జీర్ణం సుఖావహమ్ 85

భోజనాదౌ పిబేత్తో యమగ్నిసాదం కృశాం గతా
మధ్యే కార్యవివృద్ధేత అంతే శ్రేష్ఠం రసాయనమ్ 86

అత్యంబుపానా దవిపచ్యతేన్న మనంబుపానాచ్చ స ఏవదోషః
తస్మాన్నరో వహ్ని వివర్ధనాయ ముహుర్ముహుర్వారి పిబేదభూరి 87

పిబే ద్ఘటసహస్రాణి యావద స్తం గతే రవౌ
నిశి భోజనవేళాయాం స్వల్ప మప్యుదకం విషమ్ 88

అన్నేన కుక్షౌద్వావంశౌ పానే నైకం ప్రపూరయేత్
ఆశ్రయం పవనాదీనాం చతుర్థ మవశేషయేత్ 89

అత్యాహారా ద్భవేద్వ్యాధి రనాహారా ద్బలక్షయః
సమాహారా ద్బలం సమ్యగాయుర్వర్ధన ముత్తమమ్ 90

తృష్ణార్తస్తువ న భుంజీత క్షుధార్తో న పిబేజ్జలమ్
తృష్ణార్తో జాయతే గుల్మీ క్షుధార్త స్తు భగందరీ 91

భోక్తుకామశ్చ ధాతుశ్చ తోపరాధో విగర్హితః
అన్నం విషసమం ప్రాహు రజీర్ణం ప్రాప్నుయా న్నరః 92

అన్నం విదగ్ధం విష్టంభి రసశేషం తథైవ చ
చతుర్విధమజీర్ణం తు తక్రం తత్ర పరిక్రియా 93

భుక్త్వా తు మథితం సమ్య క్కరాభ్యాం చ విశేషతః
తత్తోయం నేత్రయోః క్షిప్త్వా నేత్రరోగం జయేన్నరః 94

భుక్త్వాతు శయన స్తూక్తం భుక్త్వా సంవిశత స్సుఖమ్
ఆయుష్యం చరమాణస్య మృత్యు ర్ధావతి ధావతి 95

భుక్త్వా చాగ్ని మపశృస్యో గత్వాశతపథం శనైః
వామపార్శ్వే శయానస్య భిషగ్భిః కిం ప్రయోజనమ్ 96

దివాస్వాపం న కుర్వీత మిథ్యావాదం న కారయేత్
దివాస్త్రీసంగమో నృణాం ఆయుః క్షయకరో భవేత్ 97

ధర్మశాస్త్రాణి సతతం పురాణశ్రవణం తథా
కారయేద్విధినా సమ్య గాత్మాభ్యాసాంశ్చ నిత్యశః 98

## తాంబూలవిధిః

తాంబూలం చర్వయే ద్భుక్త్వా ప్రాగేవ త్రిచతు స్తథా
ఏకపూగం చతుఃపత్రం సుధావ్రీహిద్వితీయకమ్ 99

పూగం సుదేశ సంభూతం కఠినం గురుచిక్కణమ్
శశమాంససమం భిన్నం క్రముకం తు సుశోభనమ్ 100

పూగః కషాయో మధురోరూక్షో దోషహరః పరమ్
సుపక్వః సర్వదోషఘ్నః అపక్వా ద్దోషదో భవేత్ 101

కటుకీరససంయుక్తం నాగపత్త్రం సుశోభనమ్
సుపక్వదళసంయుక్తం సర్వదోషవివర్జితమ్ 102

కఫవాతహరం భేదినాగపత్రం ప్రకీర్తితమ్దీ
పనం క్రిమిదోషఘ్నం విశదం నిర్మలం లఘు 103

సుధాపాషాణజా వాపి శంఖేనాపి వినిర్మితమ్
శుక్తిశంబూకసంభూతం చూర్ణం ముక్తాఫలోద్భవమ్ 104

చూర్ణం పాషాణసంభూతం త్రిదోషశమనం లఘు
వాతపిత్తహరం శంఖం శుక్తిజం శీతలం భవేత్ 105

జంబూకం శ్లేష్మదోషఘ్నం ముక్తాచూర్ణం తు వాతనుత్
మనసో హర్షణం శ్రేష్ఠం రతిదం మదకారణమ్ 106

ముఖరోగక్రిమిహరం తాంబూలం చంద్రసంయుతమ్
దంతానాం స్థైర్యదం చైవ వక్త్రే దుర్గంధనాశనమ్ 107

ముఖరోగక్రిమిహరం ఖాదిరేణ విమిశ్రితమ్
పిత్తదోషప్రశమనం రక్తపిత్తప్రవర్ధనమ్ 108

శ్లేష్మరోగ హరం రుచ్యం నేత్రరోగహరం శుభమ్
నాసారోగ హరం కంఠ్యం తాంబూలం చంద్రసంయుతమ్ 109

ఆదౌ విషోపమం పీతం ద్వితీయం భేదిదుర్జరమ్
పశ్చా త్సుధాసమం పీతం సమ్య గ్జీర్ణం సుఖావహమ్ 110

క్షీరం పీత్వా ముహూర్తేన తాంబూలం యది చర్వితమ్
కుష్ఠీ భవతి మేహీ చ మూత్రదోషీ చ వా భవేత్ 111

అక్షిరోగీ క్షయీ పాండురోగీ భ్రమమదాత్యయీ
అపస్మారీ శ్వాసరోగీ హృద్రోగీ రక్తపైత్యకీ 112

గ్రహణీవానతీసారీ తాంబూలం పరివర్జయేత్
తాంబూలం క్షతపిత్తాసృగ్రూక్షో త్కుపితచక్షుషామ్ 113

విషమూర్ఛా మవాతానా మపథ్యం శోషిణామపి
దివాసంధ్యాం వర్జయిత్వా తాంబూలం ఖాదయే న్నరః 114

అనిధాయ ముఖే పర్ణం ఖాదేత్పూగీఫలం నరః
దరిద్రత్వ మవాప్నోతి శక్రతుల్యోపి మానవః 115

ఏక ద్వి త్రి చతుః పంచ షడ్భిః పూగీఫలైః క్రమాత్
లాభాలాభౌ సుఖం దుఃఖం ఆయుర్మరణ మేవ చ 116

ప్రాతః పూగీ ఫలాధిక్యం మధ్యాహ్నేధిక చూర్ణతా
రాత్రౌతు పర్ణబాహుళ్య మేత త్తాంబూలలక్షణమ్ 117

ప్రత్యూషే భుక్తసమయే వరయువతీనాం చ సంగమే ప్రథమే
విద్వన్ రాజ్ఞాం మధ్యే తాంబూలం యో న ఖాదయే త్స పశుః
118

పర్ణమూలం భవే ద్వ్యాధిః పర్ణాగ్రం పాపసంభవమ్
చూర్ణం పర్ణం హర త్యాయు స్సిరా బుద్ధివినాశినీ 119

తస్మాదగ్రం చ మూలం చ నరాం చైవ వివర్జయేత్
చూర్ణపర్ణం వర్జయిత్వా తాంబూలం ఖాదయే త్స ధీః 120

## స్త్రీసంభోగవిధిః

దివాసంధ్యాం వర్జయిత్వా తథా పర్వదినేషు చ
రాత్రౌ వ్యవాయం కుర్వీత యోషితం యౌవనే స్థితామ్ 121

కురూపిణీం సుశీలాం తు విధవాం చ పరస్త్రియమ్
అతికృష్ణాం చ హీనాం చ పుత్రమిత్రనృపస్త్రియమ్
త్యజే దంత్యకులోద్భూతాం వృద్ధస్త్రీకన్యకాం తథా 122

వయోధికాం స్త్రియం గత్వా తరుణః స్థవిరో భవేత్
తారుణ్యం తరుణీం గత్వా వృద్ధోపి సమవాప్నుయాత్ 123

రతికాలైకశయన మన్య త్కాలే పృథక్శయీ
స్త్రీణాం శ్వాసానిలైః పుంసాం దౌర్భాగ్యత్వం ప్రజాయతే 124

ఏకశాయీ ద్విభోజీ చ షణ్మూత్రీ ద్విపురీషకః
స్వల్పసంగమకారీ చ శతవర్షాణి జీవతి 125

అత్యంబుపానా దతిసంగమా చ్చ స్వప్నా ద్దివా జాగరణా చ్చ రాత్రౌ
నిరోధనా న్మూత్ర పురీషయో శ్చషడ్భిః ప్రకారైః ప్రభవంతి రోగాః
126

గోశతా దపి గోక్షీరం ప్రస్థం ధాన్య శతాదపి
ప్రాసాదాదపి శయ్యార్థం శేషాః పరవిభూతయః 127

## సత్ప్రవర్తనవిధిః

క్షతం వస్త్రేణ సంహృత్య జృంభణం నాసికేన తు
బిందు సంరక్షణే చైవ శతవర్షాణి జీవతి 128

విచార్య దేశ కాలౌ చ వయస్సత్వం తథాబలమ్
జలపానముషః కాలే పీత్వా శతసమం వసేత్ 129

అంభసః ప్రసృతాన్యష్టౌ పిబే దనుదితే రవౌ
వాతపిత్తకఫాన్ జిత్వా జీవే ద్వర్ష శతం సుఖీ
పరద్రవ్యం పరస్త్రీం చ పరనిందాం చ బుద్ధిమాన్ 130

అమిత్రభాషణం శార్యం స్త్రీష్వాలాపంచవర్జయేత్
వర్జనం చాప్యగమ్యాయా అభ్యక్షాయాశ్చీ భక్షణమ్ 131

అసూయావర్జనం శార్యం పతితై సహ సంగమః
క్రౌర్యస్య వర్జనం చైవ మాత్మస్తుతి వివర్జనమ్ 132

దానం మనోరమం కార్యం ఇష్టాపూర్తస్యవర్ధనమ్
అశేష దేవతా భక్తి ర్గోషు విప్రేషుతర్పణమ్ 133

శుశ్రూషణం గురుస్త్రీణాం తప స్తీర్థేషు మజ్జనమ్
విద్యాయా స్సేవనం చైవ సతతం సాధుసంగమః 134

దీనాంధకృపణానాం చ భ్రాతృణాం చైవ పోషణమ్
కారయే త్సతతం భక్త్యా కీర్తిలక్ష్మీ వివృద్ధయే 135

హితాయ రాజపుత్రాణాం సజ్జనానాం విశేషతః
చారుచర్యాప్రియా శ్రేష్ఠా రచితాభోజభూభుజా 136

# పద్య సంఖ్యానుక్రమణిక


| | | |
|---|---|---|
| 1 | అంగసుఖమ్ము | 8 |
| 2 | అతిమధుర | 37 |
| 3 | అవలోకన | 31 |
| 4 | ఆగరుం గుంకుమ | 22 |
| 5 | ఆచారానన్తర | 10 |
| 6 | ఆత్మకునివలెం | 72 |
| 7 | ఆయురారోగ్యంబులగు | 5 |
| 8 | ఆవులింత నోర | 62 |
| 9 | ఇరుప్రొద్దు | 61 |
| 10 | ఇష్ట ఫలసిద్ధి | 34 |
| 11 | ఒదవఁగఁ గూర్చి | 60 |
| 12 | ఒప్పని గంధంబు | 53 |
| 13 | కఠినమై దొడ్డ | 46 |
| 14 | కడుపు కడు | 42 |
| 15 | కడుపు నాలుగు | 40 |
| 16 | కారణము దైవ | 65 |
| 17 | కారణమున | 73 |
| 18 | కాలినచీర | 27 |
| 19 | కుడిచిన పిమ్మట | 44 |
| 20 | కుడిచినప్పుడ | 41 |
| 21 | కుడుచు నతండైనను | 43 |
| 22 | కుడువఁ దొణఁగుచు | 39 |
| 23 | కులకాంతచేత | 32 |
| 24 | క్షయము రక్త | 54 |
| 25 | క్షీరభోజియై | 52 |
| 26 | ఖదిరమును | 4 |
| 27 | గిరు లెవ్వారలు | 68 |
| 28 | గురువిందలు | 15 |
| 29 | గేదఁగిపువ్వుఁ | 12 |
| 30 | గొనకొని కొండ | 35 |
| 31 | గోరంటపువ్వు | 13 |
| 32 | గోవిందార్యుని | 76 |
| 33 | గోవుం గనకము | 30 |
| 34 | ఘటికాద్వయము | 17 |
| 35 | జలకంబు దీర్చి | 23 |
| 36 | తల మాసినపుడు | 21 |
| 37 | తాంబూల దళ | 48 |
| 38 | తాలిమిఁ గల్గి | 64 |
| 39 | తెలియుచు నిద్ర | 7 |
| 40 | తెవులులు సెంద | 28 |
| 41 | దప్పి కుదకంబు | 38 |
| 42 | దళముగఁ గ్రోలుచు | 45 |
| 43 | దానములు చేసి | 29 |
| 44 | దీనత దోఁపకుండ | 71 |
| 45 | ధర నుష్ణ వస్తు | 19 |
| 46 | నలికపుఁగౌను | 58 |
| 47 | పగలు నిద్రింపక | 74 |
| 48 | పగలును సంధ్య | 55 |
| 49 | పరికింప ధరలోను | 57 |
| 50 | పరిమళము | 11 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 51 | పుణ్య నిర్మల | 9 | 64 | మొల్లలు జాజి | 14 |
| 52 | పురుషున కెంత | 63 | 65 | రాజహితంబు | 2 |
| 53 | పూగమునకు | 49 | 66 | రేపకడ మేలుకొని | 3 |
| 54 | పెక్కండ్రు లేక | 33 | 67 | లఘుకారి క్రిమి | 50 |
| 55 | పొన్నలు చేమంతులు | 16 | 68 | వదన వికాస | 51 |
| 56 | పోఁకకు మూఁటి | 47 | 69 | వర్ధమాను లైన | 69 |
| 57 | ప్రత్యూష బహుళ | 1 | 70 | వలనై కార్యము | 70 |
| 58 | ప్రియరుచ్యము | 6 | 71 | విద్వన్నుతుండు | 75 |
| 59 | మలినమైన | 25 | 72 | విరవాదులు | 18 |
| 60 | మాసినదాన | 26 | 73 | వ్యవసాయ రహితు | 66 |
| 61 | మునుపుఁ దెయ్య | 36 | 74 | సముచితయత్న | 67 |
| 62 | మెలఁగు నప్పుడ | 59 | 75 | సీతుంగందువఁ | 24 |
| 63 | మైదపువ్వుకంటె | 20 | 76 | సురతంబు | 56 |


# శ్రీ భోజరాజకృత చారుచర్య–శ్లోకానుక్రమణిక


| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | అంభసః ప్రసృ | 130 | 13 | అభ్యంగే కేతకీ | 39 |
| 2 | అక్షిరోగీ | 112 | 14 | అమిత్రభాష | 131 |
| 3 | అగస్త్య తాల | 19 | 15 | అష్టాంగుళం | 7 |
| 4 | అత్యంతమలినః | 33 | 16 | అసూయావర్జ | 132 |
| 5 | అత్యంబుపానా | 87 | 17 | ఆదిత్యే పద్మ | 69 |
| 6 | అత్యంబుపానా | 126 | 18 | ఆద్యై మధుర | 85 |
| 7 | అత్యాహారా ద్భవే | 90 | 19 | ఆదౌ విశోపమం | 110 |
| 8 | అనిధాయ ముఖే | 115 | 20 | ఆమ్లే కీర్తిశ్య | 14 |
| 9 | అన్నం విదగ్ధం | 93 | 21 | ఆయుర్బలం | 4 |
| 10 | అన్నం విషసమం | 80 | 22 | ఉదఙ్ముఖః | 8 |
| 11 | అన్నేన కుక్షౌ | 89 | 23 | ఉష్ణభావమిదం | 57 |
| 12 | అపాం ద్వాదశ | 24 | 24 | ఉష్ణాంబునాధః | 27 |

| | | |
|---|---|---|
| 25 | ఏక ద్వి త్రి | 116 |
| 26 | ఏకఏవ న | 79 |
| 27 | ఏకశాయీ | 125 |
| 28 | ఏతాని సతతం | 77 |
| 29 | కటుకీరస | 102 |
| 30 | కటుతిక్తకషా | 6 |
| 31 | కఫవాత | 103 |
| 32 | కార్తిక్యా మప | 84 |
| 33 | కార్పాసాఢక | 18 |
| 34 | కార్యహాని | 66 |
| 35 | కురూపిణీం | 122 |
| 36 | కులాచారం | 34 |
| 37 | కేతుర్వైదూర్య | 71 |
| 38 | కేశక్లేశ సముద్భూత | 36 |
| 39 | కేశానాం నిచయం | 35 |
| 40 | కౌశేయం చిత్ర | 61 |
| 41 | క్షతం వస్త్రేణ | 128 |
| 42 | క్షీరం పీత్వా | 111 |
| 43 | ఖర్జూరీనారి | 15 |
| 44 | గుర్రై తు పుష్య | 70 |
| 45 | గోశతా దపి | 127 |
| 46 | గ్రహణీవాన | 113 |
| 47 | చంపకం వాత | 52 |
| 48 | చకోరం చక్షు | 82 |
| 49 | చకోరం మర్కటం | 81 |
| 50 | చూర్ణం పాషా | 105 |
| 51 | జంబూకం శ్లేష్మ | 106 |
| 52 | జాతా చైవార్ధ | 11 |

| | | |
|---|---|---|
| 53 | జీవా ద్యాలిప్త | 37 |
| 54 | జ్వరమూర్ఛా | 54 |
| 55 | తతో భోజన | 75 |
| 56 | తత్రాపి సారసం | 31 |
| 57 | తన్మలాపహరం | 25 |
| 58 | తస్మాదగ్రం చ | 120 |
| 59 | తాంబూలం | 99 |
| 60 | తావద్భవతి | 16 |
| 61 | తృణాంగుల్య | 17 |
| 62 | తృష్ణార్తస్తువ | 91 |
| 63 | తృష్ణాస్య పాక | 22 |
| 64 | తేషాం దృష్టి | 83 |
| 65 | త్రిదోష శమ | 40 |
| 66 | త్రిదోషశమనా | 48 |
| 67 | దానం మనో | 133 |
| 68 | దివాసంధ్యాం | 121 |
| 69 | దివాస్వాపం న | 97 |
| 70 | దీనాంధకృప | 135 |
| 71 | ద్విరాత్రం శతపత్రం | 45 |
| 72 | ధర్మశాస్త్రాణి | 98 |
| 73 | ధర్మసంగ్రహా | 73 |
| 74 | నచోష్ణం | 59 |
| 75 | నాత్యుష్ణ మభ | 43 |
| 76 | నిరాశాస్తస్య | 23 |
| 77 | పత్నీ విహిత | 78 |
| 78 | పర్ణమూలం | 119 |
| 79 | పిటకవ్యంగ | 30 |
| 80 | పిత్తహృద్విశదం | 49 |

| | | |
|---|---|---|
| 81 | పిబే ద్ఘట | 88 |
| 82 | పుణ్యనిర్మల | 26 |
| 83 | పుష్పాణాం ప్రవరం | 50 |
| 84 | పూగః కషాయో | 101 |
| 85 | పూగం సుదేశ | 100 |
| 86 | పూర్వస్యాముత్త | 9 |
| 87 | ప్రత్యూషే భుక్త | 118 |
| 88 | ప్రాతః పూగీ | 117 |
| 89 | ప్రాత రుత్థాయ | 3 |
| 90 | బ్రాహ్మే ముహూర్తే | 2 |
| 91 | భయదం మూషి | 67 |
| 92 | భుక్త్వా చాగ్ని | 96 |
| 93 | భుక్త్వా తు మధి | 94 |
| 94 | భుక్త్వాతు శయ | 95 |
| 95 | భోక్తుకామశ్చ | 92 |
| 96 | భోజనాదౌ | 86 |
| 97 | మందారం పిత్త | 53 |
| 98 | మందారం మరువం | 47 |
| 99 | మకరందేన | 38 |
| 100 | మలినం నశివం | 65 |
| 101 | మలినం పర | 64 |
| 102 | ముఖరోగక్రిమి | 107 |
| 103 | ముఖరోగక్రిమిహ | 108 |
| 104 | ముహూర్తం జాతి | 44 |
| 105 | యది కుర్వీత | 21 |
| 106 | రక్తోత్పలం | 56 |
| 107 | రతికాలైక | 124 |
| 108 | రూపం తేజూ | 32 |
| 109 | లోకేఽస్మి న్మంగ | 76 |
| 110 | వయోధికాం | 123 |
| 111 | వర్జయే ద్దంత | 13 |
| 112 | వసంతే కేతకీ | 55 |
| 113 | వికంకత | 20 |
| 114 | విచార్య దేశ | 129 |
| 115 | విషమూర్చా | 114 |
| 116 | విషు స్త్రీతైల | 10 |
| 117 | శాల్మల్యశ్వత్థ | 12 |
| 118 | శిరోభ్రమ | 51 |
| 119 | శీతకాలే తు | 60 |
| 120 | శుక్లం సుశీతలం | 63 |
| 121 | శుద్ధ్యం సుశీత | 62 |
| 122 | శుశ్రూషణం | 134 |
| 123 | శ్రీకంఠ మేక | 46 |
| 124 | శ్రీపర్ణం చంప | 41 |
| 125 | శ్లేష్మరోగ | 109 |
| 126 | సర్వే కంటకినః | 5 |
| 127 | సుగంధం చ | 58 |
| 128 | సుధాపాషాణ | 104 |
| 129 | సునీతిశాస్త్ర | 1 |
| 130 | సుహృత్సు శుభ | 68 |
| 131 | స్త్రీ బాలావృద్ధ | 72 |
| 132 | స్నానమర్థిత | 28 |
| 133 | స్నానానంత | 29 |
| 134 | స్వర్ణం యశస్య | 74 |
| 135 | హితాయ రాజ | 136 |
| 136 | హ్రీ బేరం మరువం | 42 |

# అప్పన మంత్రి చెప్పిన ఆరోగ్యనియమాలు
## (సంక్షిప్తంగా)

**దంతధావన పద్ధతి**

- ప్రాతఃకాలంలోనే నిద్రనుండి మేల్కోవాలి.
- దంతధావన పద్ధతి తెలుసుకొని శ్రేష్ఠమైన ఒక పుల్లను తీసుకొని పండ్లు తోముకోవాలి.
- పొద్దెక్కేదాకా నిద్రపోవడం, నిద్రలేచినా వెంటనే పండ్లుతోముకోకుండా ఉండటం – ఇవి పాపకారకాలు. వీటిని పోగొట్టుకొనేలా వేకువనే దంతధావన చర్య చేపట్టాలి.
- నిశ్శబ్దంగా ఎవరితోనూ మాట్లాడకుండాదంతధావనంచెయ్యాలి.
- దంతధావనానికి పుణ్యకాష్ఠం ఉపయోగించాలి.చంద్ర, వటం, కానుఁగ, జిల్లేడు, వేప, మద్ది జువ్వి దంతధావనానికి ఉపయోగపడే వృక్షజాతులు.
- ఒగరుగా, చేదుగా, కారంకారంగా ఉన్న ఆ పుల్లలను నీళ్ళలో తడిపి దంతాలకేసి బాగా తోమి తోమి పండ్లు శుభ్రపరుచుకోవాలి.
- మద్ది చెట్టుపుల్లవల్ల ఆయురారోగ్యాలు.
- మామిడిపుల్ల వల్ల అపారమైన ఐశ్వర్యం .
- మాదీఫలం పీడలన్నింటినీ నాశనం చేస్తే – కానుగచెట్టు యుద్ధంలో విజయా న్నందిస్తుంది.
- మారేడు వల్ల ధనలాభం, ఉత్తరేణి వల్ల ఉత్తమసంతానం.
- చంద్రచెట్టువల్ల ఆహారం రుచించకపోవడం, మందబుద్ధి అనే రుగ్మతలు నశించిపోతాయి.
- జువ్విచెట్టు వల్ల సాటిలేని వాక్ సిద్ధి .
- జాజి, దాడింబం, దరిసం, గొడిసె, మొదల, అంకోలము మొదలైన చెట్లవల్ల మోక్ష సంపద.
- సింధువారం వాడితే చెడ్డకలలు దరిచేరవు.
- దంతధావనం వల్ల కఫమూ, పైత్యము హరించుకుపోతాయి. మనసు

ప్రసన్నంగా ఉంటుంది. కర్ణపూటాలనూ, నాడీమండలాన్ని కూడా ఇది శుద్ధిచేస్తుంది. నేత్రాలకూ మేలుచేస్తుంది.

- నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, దంతధావనం చేసి, స్నానం చేసి, సంధ్యావందనాది కృత్యాలను నిర్వర్తించి, నిత్యాగ్నిహోత్రం చేసి భక్తితో నిష్ఠగా దేవతారాధన చేయాలి. ఆ తరువాతే ఇంటిపనులు .

## స్నాన పద్ధతి

- తలంటు స్నానం – మనిషి శరీరానికి సుఖం కలిగిస్తుంది. మాలిన్యాలు దురదలూ అనారోగ్యాలూ ఇత్యాది దుర్గుణాలు ఏవీ దరిజేరనివ్వని మంచి మందు. శరీరానికి కాంతి. పోషణ.
- ఈ అభ్యంగ స్నానానికి వేడినీళ్లే మంచివి. కనీసం నాల్గు గడియల సేపు జలకమాడాలి.
- పుణ్యప్రదాలైన నదీతీర్థాలలోని నిర్మలమైన నీళ్ళలో గానీ వేడినీళ్లతో గానీ ప్రయత్న పూర్వకంగా స్నానం చెయ్యాలి.
- నవరంధ్రాలద్వారా స్రవించే అసహ్యకరమైన మాలిన్యాలు ప్రాతఃకాలస్నానంతో తొలగిపోతాయి.
- ప్రాతఃస్నానం చాలా తృప్తికరం, శుచిప్రదం. బలవర్థకం. దుస్స్వప్నాల దుష్ఫలితాలు నశిస్తాయి.
- తేజస్సూ రూపమూ కాంతీ పుణ్యమూ ఆయుష్షు అన్నీ వృద్ధి చెందుతాయి.
- ప్రాతఃస్నానం చేసిన మీదట – సంధ్యావందనం. సూర్యారాధన, అగ్నిదేవారాధన చేసి ప్రాతఃకాలంలో చెయ్యాల్సిన హోమాలు విధిగా చెయ్యాలి .
- నిజకులాచారాలను ఆచరించిన పిమ్మట తూర్పుదిక్కు వైపు తిరిగి కేశపాశాన్ని ముడుచుకోవాలి.

## పుష్పధారణ పద్ధతి

- మంచి సువాసనగల పువ్వులు తలలో ధరిస్తే దానివల్ల తలకు చుండ్రు పట్టదు.

- చెమట వాసన ఉంటే సత్వరమే అదీ పోతుంది.
- పరిమళ భరిత పుష్పధారణ వల్ల మానవులకు బుద్ధి వికసిస్తుంది. కళ్ళకు ఎంతో మంచిది.
- మేలుజాతి జవ్వాదిని పూసిన గేదగిపూలు సుఖికారకాలు.
- పొగడ, కలిగొట్టు, సంపెంగ, తామర మొదలైన పువ్వులకు కస్తూరిని కలిపి ధరిస్తే మంచిది.
- తెలిసీ తెలియకుండా ఒకదానికొకటి పడనివాటిని కలిపితే మంచి కలుగకపోగా కీడు.
- గోరింటపువ్వుకు మరువాన్ని చేర్చి ధరించాలి. దానివల్ల సుగంధం ఇబ్బడి అవుతుంది.
- విరజాజి పువ్వులనూ, చెంగలువలనూ కర్పూరంతో జతచేసి ధరించాలి. దీనివల్ల సువాసన.
- తాజా మొల్లపువ్వులూ, జాజిపువ్వులూ గన్నేరు పువ్వులూ, తెల్లందనం ఉట్టిపడే కురువేరుపువ్వులూ వాత పిత్తశ్లేష్మాది త్రిదోషాలనూ హరించివేస్తాయి. పైగా చలవచేస్తాయి. సహజమైన గొజ్జగి నీరు కొంత పైపైని జల్లి వేసవిరాత్రులలో ధరిస్తే మంచిది.
- పువ్వుల స్వభావాలను బట్టీ ఆయా కాలాలలో వాటిని ధరించాలి.
- గురువిందపూలు, గన్నేరు పూలు, అప్పుడే వికసించిన విరజాజులూ, కలిగొట్టుపువ్వులూ అంతగా వేడిచెయ్యవు అలాగే చలవా చెయ్యవు. కాబట్టి వాటిని వర్షకాలంలో ధరిస్తే మంచిది.
- పొన్నలు, చేమంతులు, సురపొన్నలు, సంపెంగలు, మొగలిపువ్వులు, పొగడపువ్వులు. ఇవన్నీ వేడిచేసే స్వభావం కలిగి ఉంటాయి. కాబట్టీ వీటిని శీతాకాలంలో ధరించాలి.
- జాజిపూల సువాసన రెండు ఘటికలదాకా ఉంటుంది. అదే విరజాజుల, మొల్లల వాసన నాలుగు ఘటికలు.
- పొన్నల సువాసన ఒక జాము కాలం దాకా ఉంటే మల్లె, కరవీర, గురువింద, పొగడ పువ్వుల సువాసన రెండు జాముల దాకా ఉంటుంది.
- సంపెంగల సువాసన ఒక పగలూ రాత్రీ . చేమంతి వాసన రెండు రోజులు.
- నాలుగురోజుల దాకా చెంగల్వ పువ్వు సువాసన నిలిచి ఉంటుంది.

- గేదగిపూవాసన అయిదురాత్రుల వరకూ ఉంటే – కలుగొట్టు, సురపొన్న పువ్వుల సువాసన ఎప్పటికీ ఉంటుంది.
- వెంట్రుకలు బిరుసెక్కిపోయి బాగా గరగరలాడుతూ ఉంటే నవమాలికపూలు, మొల్లలు, కొత్తగా విరిసిన జాజిపూలు ముడుచుకోవటం మేలు.
- చెంగలువ పువ్వులు ఎటువంటి కేశాలకైనా మంచివే.
- మల్లెపువ్వులు వేడి. దీనివల్ల కళ్ళకు విపరీతమైన బాధ. బుద్ధి మందగిస్తుంది.
- గోరింటపువ్వు, మల్లెపువ్వుల కంటే కీడు చేసే పువ్వులు వేరే లేనే లేవు.
- మొగలిపువ్వు, చెంగలువ పువ్వు చాలా శ్రేష్ఠమైనవి.
- తల మాసినప్పుడు మల్లెపూలు, జుట్టుకు నూనె పెట్టుకొన్నప్పుడు కేతకపుష్పాలను ధరించాలి.

**లేపన పద్ధతి (చందనచర్చాపద్ధతి)**

- చందనాన్ని ఎలా పూసుకోవాలో తెలుస్తుందీ పద్యం వల్ల. చందనాన్ని శీతాకాలంలో అగరును, కుంకుమ పువ్వునూ కలిపి ఒంటికి పూసుకొని, నలుగు పెట్టుకున్నట్లుగా అలందుకోవాలి.
- వేసంగిలో గొజ్జగినీటిలో కర్పూరాన్ని బాగా కలిపి దానిలో మళ్ళీ చందనాన్ని కలిపి ఒంటికి పట్టించాలి. వర్షాకాలంలో కస్తూరి, కుంకుమపువ్వుల మేళనంతో చందనాన్ని పులుముకోవటం మంచిది.
- స్నానం చేసేయ్యగానే వెంటనే దడి లేకుండా ఒత్తుకోవాలి తుడుచుకోవాలి.

**వస్త్రధారణ పద్ధతి**

- శీతాకాలంలో పట్టుచీరలు, తామ్రవర్ణంలో ఉన్న వస్త్రాలు, ఎరుపురంగు వస్త్రాలు ధరించాలి. ఇవి శరీరంలోని వాతాన్నీ, శ్లేష్మాన్నీ హరించివేస్తాయి
- వేసవిలో లేత ఎఋపు చాయకల చెంగావి వస్త్రాలు, వర్షాకాలంలో తెల్లని వస్త్రాలను ధరించాలి.
- మలినమై పోయినవీ, స్త్రీలు ధరించినవీ, ఇతరులు ధరించినవీ, ఎలుకలు కొరికినవీ – చిరిగినవీ, కాలిపోయినవీ అయిన వస్త్రాలు ధరించకూడదు.

- మాసినవస్త్రాన్ని ధరిస్తే దురద పుడుతుంది. అశుభం కూడా.
- స్త్రీ ధరించిన వస్త్రాన్ని ధరిస్తే – కలిగే భాగ్యమూ, అడ్డులేని శౌర్యమూ తప్పిపోతాయి.
- ఇతరులు ధరించి విడిచిన వస్త్రాన్ని ధరిస్తే — చేసిన పుణ్యం కాస్తా కోల్పోయే పరిస్థితి వస్తుంది.
- ఎలుకలు కొట్టిన వస్త్రాలను ధరిస్తే చూపరులు దడుసుకుంటారు. భయం కలుగుతుంది.
- చిరిగిన వస్త్రాన్ని ధరించకూడదు. అది దరిద్రదేవతకు ఆటపట్టు.
- కొద్దిగా కాలి, కన్నాలు పడిన వస్త్రాన్ని ధరిస్తే — దానివల్ల, ఉన్న మంచి పోవడమే కాదు. ఇంకా ఎక్కువ కీడు జరుగుతుంది. జీవితం యమధర్మరాజుకు వశం అవుతుంది.

**భూషణధారణ పద్ధతి**

- ఒక్కొక్క రత్నానికి ఒక్కొక్క అధిదేవత. ఆయా దేవతల అనుగ్రహాన్ని పొందడానికి ఆయా వారాలలో ఆయా రత్నఖచిత ఆభరణాల సమూహాన్ని ధరించాలి.
- ఒకవేళ ఏ వారానికి ఆ ఆభరణం ధరించలేకపోతే — అవయవాలను శుద్ధిచేయడానికి కారణభూతాలైనవీ ప్రకాశవంతాలైనవీ అయిన ఆభరణాలను ధరించాలి.
- లక్కతో రాగితో – చేసిన ఆభరణాలు ధరించకూడదు.

**అర్చాపద్ధతి**

- దశదానాలు చేసి,అటుపైని భక్తి శ్రద్ధలతో దేవ-పితృ యజ్ఞాలు నిర్వహించాలి. ఇవి చేసిన తరవాతనే భోజనానికి కూర్చోవాలి.
- గోవు, బంగారం,బ్రాహ్మణుడు, అగ్ని, నెయ్యి, నీరు, సూర్యుడు, రాజు అనే మంగళాష్టకాన్ని నియమంతో దర్శించాలి. భక్తితో నమస్కరించాలి. ఏకాగ్రచిత్తంతో అర్చించాలి. ప్రదక్షిణ చేయాలి.

**భోజనపద్ధతి**

- ధర్మపత్ని స్వయంగానూ, తగు విధంగానూ, అలంకరించిన భోజనశాలలో గృహస్థు తన బంధుమిత్రులతో కలిసి, సహపంక్తి భోజనం చెయ్యాలి.
- కనీసం ఒకరిద్దరితోనైనా కలిసి భుజించేవాడికి ఇష్టఫలాలు సిద్ధిస్తాయి. తుష్టి కలుగుతుంది. సంపద – కీర్తి అభివృద్ధి చెందుతాయి. సజ్జనులలో గొప్పవాడు అవుతాడు.
- భోజనం చేసేటప్పుడు – ముందుగా తియ్యటి శాకపాకాలు, మధ్యలో వగరూ, చేదూ పదార్థాలు, చివరికి పులుసులూ చారులూ లాంటివి ఆస్వాదించడం ఉత్తమం. చక్కగా జీర్ణమవ్వడానికే ఈ క్రమం.
- తీపి అతిగా తింటే ఆకలి చచ్చిపోతుంది. ఎక్కువగా ఉప్పు తింటే చూపు మందగిస్తుంది. కటిక చేదూ ఎక్కువ పులుపూ ముసలితనాన్ని శీఘ్రంగా తెచ్చిపెడతాయి.
- దప్పిక వేస్తే నీళ్ళు తాగాలి గానీ దానికి మారుగా ఆహారం తినకూడదు. ఆకలి వేస్తే ఆహారం తినాలి గానీ బదులుగా నీరు త్రాగ కూడదు.
- అన్నం తినే ముందు నీళ్ళు తాగడం అధమం. అన్నం తింటూ మధ్యే మధ్యే పానీయం అన్నట్టు మధ్యలో మంచినీళ్ళు తాగడం మధ్యమం. భోజనం ముగించిన తరవాత నీళ్ళు తాగడం ఉత్తమం.
- ముప్పొద్దులా చెక్కపూటుగా అన్నం తినకూడదు.
- కడుపుకి సగమే అన్నం తినాలి. ఒక భాగం నీటితో నింపాలి. మరొక భాగం ఖాళీగా వదిలిపెట్టాలి.
- భోజనం తర్వాత నిద్రపోకూడదు. కొంచెంసేపు కాసింత దూరం మెల్లమెల్లగానైనా నడిస్తే – ఆయుష్షు. కాస్త ఎక్కువ దూరమే నడవగలిగితే మరీ మంచిది.
- అతిగా తినడమూ, అస్సలు తినకపోవడమూ రెండూ మంచివి కావు. కాబట్టి సమంగా భుజించాలి. అదే ఆరోగ్యం.
- భోక్త కానీ దాత కానీ భోజనసమయంలో కోపావేశానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలి

- భోజనానంతరం చేతులు కడుక్కొని, ముమ్మారు ఆచమించాలి – పుక్కిలించాలి. ఆ తడిచేతుల్ని ఒకదానితో ఒకటి గట్టిగా రుద్దాలి. అలా మధించిన నీటిని కన్నులకు పులుముకోవాలి.
- ఎక్కువగా ఒకేసారి నీళ్ళు తాగకూడదు. కొంచెం కొంచెంగా పలు పర్యాయాలు తాగాలి

**తాంబూల పద్ధతి**

- తాంబూలంలో ఉపయోగించే పోక ముదిరినదై, నున్నగా ఉండాలి. ఒగరు ఏమాత్రం ఉండకూడదు. బాగా తీపిగా ఉండాలి.
- తమలపాకు కారంగా ఉండాలి. పరిమళిస్తూ దళసరిగా ఉండాలి. వేసుకోగానే పండాలి.
- బట్టీలో బాగా కాల్చి, సున్నపు రాళ్ళను మెత్తగా నూరిన చూర్ణాన్ని మాత్రమే ఉపయోగించాలి.
- తాంబూలం భోజనానికి ముందు నాలుగు సార్లు, భోజనానంతరం రెండు సార్లు వేసుకోవాలి.
- ప్రాతఃకాలంలో ఒక పోకకు మూడు ఆకులు చొప్పున కూర్చిన తాంబూలం, మధ్యాహ్న – రాత్రి సమయాలలో నాలుగు లేదా ఐదు లేదా కోరుకున్నన్ని ఆకులతో వేసుకోవచ్చు.
- ప్రాతఃకాల తాంబూలంలో కాచు వాడటం ఆరోగ్యానికి మంచిది.
- తమలపాకుకు శుద్ధి చేయాలి. తొడిమెనూ, తోకనూ తుంపి, నడిమి ఈనె తొలగించి, తడి పోయేలాగా పొడిగుడ్డతో ఒత్తాలి. ఆపై దాన్ని సున్నితంగా మడిచి-చిలకలు చుట్టి వేసుకోవాలి.
- పొద్దుటి తాంబూలంలో పోకలూ, మధ్యాహ్నతాంబూలంలో సున్నమూ రాత్రివేసే తాంబూలంలో ఆకులూ — ఎక్కువ ఉండాలి.
- తాంబూలం వేసుకున్నాక వెంటనే నోటిలో ఊరే ప్రథమ రసాన్నీ రెండవ రసాన్నీ మింగకుండా ఉమ్మివేయాలి.
- తమలపాకు వల్ల సుఖవిరేచనం అవుతుంది. శ్లేష్మం, పైత్త్యం, నోటి దుర్వాసన తొలగిపోతాయి.

- పోకల వల్ల పైత్త్యం కలుగదు. ఆకలి వేస్తుంది. వేగంగా దప్పిక తీరిపోతుంది.
- తాంబూలం నోటిలోనూ కడుపులోనూ కలిగే క్రిమిదోషాలను పోగొట్టి, జఠరాగ్నికి దోషం తొలగించి దీప్తిని కలిగిస్తుంది.
- రాతిసున్నపు పొడి. పైత్త్యాన్ని, వాతాన్ని పోగొడుతుంది.
- శంఖపు పొడి పైత్త్యశైత్యాలను హరిస్తుంది.
- చిప్పల సున్నము శ్లేష్మాన్ని హరిస్తుంది.
- గుల్లసున్నం వాతాన్ని పోగొడుతుంది.
- ముత్యాల సున్నంవల్ల తెలివితేటలు పెరుగుతాయి.
- వడిలిపోయిన లేదా నలిగి, చిరిగిపోయిన తమలపాకు ఆయువు హరిస్తుంది.
- తలా తోకా తుంపి, ఈనె తీసేసిన ఆకునే తాంబూలంలో వాడాలి.
- తాంబూలము ముఖవికాసాన్నీ, సౌరభాన్నీ ఇనుమడింపజేస్తుంది. పెరిగిన కొవ్వును హరిస్తుంది.
- పాలు తాగిన వెంటనే తాంబూలం సేవించినట్లయితే కుష్ఠవ్యాధి సోకుతుంది. పాలుతాగి గడియ కాలం గడిచాక తాంబులం సేవించినట్లయితే మధుమేహం సోకుతుంది. ఆపై మరో గడియ గడిచాక తాంబూలం వేసుకుంటే అతిమూత్రరోగం వస్తుంది.
- కర్పూరతాంబూలం ఆరోగ్యానికి ఎంతో మంచిది.
- క్షయ, వెట్టి, పాండురోగం, నేత్రరోగం, రొమ్మునొప్పి, కడుపునొప్పి మొదలైన రోగాలు ఉన్నవారు తాంబూలం సేవించరాదు.
- స్త్రీసంగమవిధి
- పగళ్ళూ సంధ్యాసమయాలూ, పర్వదినాల రాత్రిళ్ళూ విడిచిపెట్టగా మిగిలిన అర్హమైనరాత్రులలో మాత్రమే స్త్రీలతో సమాగమించాలి.
- మన్మథకేళి తర్వాత పురుషుడు స్త్రీలకు దూరంగా పడుకోవాలి.

**వ్యవహార పద్ధతి**

- ఆవులింతను నోటిలోనే ఆపి ఆ గాలిని ముక్కుద్వారా బయటకు పంపాలి. తుమ్మునికూడా అలాగే చేయాలి. ఇలా చెయ్యడంవల్ల చరమధాతురక్ష, ఆయుష్షు కూడా.

- సత్యమే శ్రేష్ఠమైన ధర్మం. పాపాత్ముల విషయంలో అసత్యం దోషం కాదు.
- ఓర్పుతో ప్రశాంతంగా, ధైర్యంగా, ఉంటూ పరోపకారగుణంతో స్థిరచిత్తంతో ఉండేవాడి ఇల్లు లక్ష్మీనివాసమే.
- దైవంపైనే భారం వేసి అసలు పనిని ప్రారంభించకపోవడం తప్పు.
- కార్యసాధనకు ప్రయత్నించనివాడినీ, ఆరంభించినా కడదాకా కొనసాగించే సాహసమూ ధైర్యమూ లేనివాడినీ, ఆరంభించిన కార్యాన్ని సాధించేందుకు తగిన ప్రయత్నం చేయనివాడినీ, సోమరిపోతునూ లక్ష్మీదేవి చేరదు.
- తగిన ప్రయత్నమూ శక్తీ కల సాహసి ఉత్తముడు. బలహీన సాధనాలు కలవాడు మధ్యముడు.
- గొప్ప సంపదలు ఉత్సాహవంతులకు తమంత తామే కలుగుతాయి.
- గొప్పవారికే ఆపదలు ఎక్కువ.
- కార్యాన్ని మంచిమాటలతోనే చక్కపెట్టుకోవాలి.
- దీనంగా కాకుండా ప్రియంగా మాట్లాడడం నేర్పు.
- దానం కలిగి ఉండీ ఎక్కువగా సహించకపోవడం చాలా మేలు.
- మంచి వక్త అయి ఉండీ నిష్ఠురంగా మాట్లాడకపోవడం లెస్స.
- సత్తా ఉండి కూడా ఓర్పుగా ఉండడం ఒప్పు.
- తనవాడిగా నటించే దుష్టుణ్ణి శత్రుసాహాయ్యం తీసుకొని అయినా సరే శీఘ్రంగా సంహరించాలి.
- అకారణంగా మిత్రత్వమూ శత్రుత్వమూ కలుగదు.
- ఎవ్వరూ ఎవ్వరివారూ కారు. అందరూ సంపదలకు దాసులే.
- పగలు నిద్రిపోకూడదు. పరకాంతపై వ్యామోహం కూడదు. పరదూషణ, పరులకు కీడు తలపెట్టాలనే అలోచన, కోపం, కపటం లేకుండా చూసుకోవాలి. ఆహారనియంత్రణ ఉండాలి. అతిగానూ, కఠినంగానూ మాట్లాడకూడదు. అబద్ధం ఆడకూడదు. ఆత్మస్తుతి పనికి రాదు.
- పరుల మేలు కోరే వాడికే ఉత్తరోత్తరాభివృద్ధి .

★★★

**విజ్ఞానేశ్వరము**

(తెలుగులో తొలి ధర్మశాస్త్ర గ్రంథం)

&

**చారుచర్య**

**(Health and Hygiene)**

వ్యాఖ్యాత

డా. అద్దంకి శ్రీనివాస్

ISBN 978-93-5291-674-0

9 789352 916740

## ముద్రిత గ్రంథాలు

1. బాలనీతిచంద్రిక 2000
2. వినరో భాగ్యము విష్ణుకథ (వ్యాసాలు) 2003
3. సాహితీ సుమ సుగంధం (వ్యాసాలు) 2005
4. జీవని (వ్యాసాలు) 2006
5. తెలుగింటి సంబరాలు 2007, 2015
6. పారిజాతాపహరణము (పదప్రయోగసూచిక) 2008
7. శేముషి (వ్యాసాలు) 2009
8. తెలుగు వ్యాకరణాలు - పునస్సమీక్ష (సం.) 2009
9. తెలుగు భాష - వ్యాకరణం 2010
10. కావ్యకళ (వ్యాసాలు) 2010
11. వ్యాసచంద్రిక (వ్యాసాలు) 2010
12. వేణుగోపబాల శతకం (వ్యాఖ్య) 2011
13. పింగళి సూరన కవితావైభవం 2012
14. తెలుగు లక్షణగ్రంథాలు 2012
15. 9 సంస్కృత నాటకాలు- కథాపరిచయం 2012
16. వర్ణనరత్నాకరము (వ్యాఖ్య 10 సంపుటాలు) 2012 -16
17. వైష్ణవ భక్తి సాహిత్యం (వ్యాసాలు) 2012
18. పారిజాతాపహరణము (లఘువ్యాఖ్య) 2012
19. అంతర్జాలంలో తెలుగు (సం.) 2012
20. రాతిజల (వచనకవిత్వం) 2013
21. బాలల వాల్మీకి రామాయణము 2015
22. వాల్మీకి రామాయణము 2015
23. శ్రీపతి శతకము 2016
24. బాలల భాగవతము 2017
25. పోతన భాగవతము (సంగ్రహం) 2017
26. పోతన భాగవతము 2017
27. గీతార్థసంగ్రహం 2017

## త్వరలో...

1. తెలుగు సాహిత్యంలో భగవద్రామానుజ వైభవం - 10 సంపుటాలు (డా. సముద్రాల రంగరామానుజాచార్యులుగారి సంపాదకత్వంలో)
2. సమతామూర్తి - సాకేత రామానుజుడు (పద్య కావ్యం)
3. ఆచార్య వింశతి (సంస్కృత శ్లోకాలు)
4. ఉత్తరరామాయణ వ్యాఖ్య (ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారితో)
5. వేదం వేంకటరాయశాస్త్రి (జూనియర్) సాహితీ వైవిధ్యం
6. పూర్వగాథాలహరి
7. తెలుగు రాష్ట్రాలలో భాషావిధానం
8. శ్రీకాళహస్తి మాహాత్మ్యము (లఘు వ్యాఖ్య)
9. అనువాదం: విధానాలు - సిద్ధాంతాలు
10. ఆంధ్ర మహాభారతము (సంగ్రహం)

SRI PAVANI SEVA SAMITHI